ఆంధ్రకవుల చరిత్రము

పదునొకండవ సంపుటము

(మధ్యకాలపు ఆధునిక కవుల జీవితములు)



894.827 VEE

ప్రకాశకులు:
తెలుగు తకారిఖీ సమాజము
రాజమహేంద్రవరము

Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO: 894.82702 VEE ACC. NO: N 10475
AUTHOR: Veeresalingam, K.
TITLE:

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

ఆంధ్రకవుల చరిత్రము.

1

ద్వితీయ భాగము

మధ్యకాలపు కవులు

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10475

By

K. VEERESALINGAM

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY

N10475

వెల : 2—8—0

894.827092
VEE

రాజమహేంద్రవరము

అవంతీ ప్రెస్ నందు ముద్రింపబడినది.

అక్టోబరు, 1949

AOUA10SB163

విషయ సూచిక


		పుట
1.	కృష్ణదేవరాయలు	1
2.	అల్లసాని పెద్దన్న	37
3.	నంది తిమ్మన్న	50
4.	ధూర్జటి కవి	59
5.	మాదయ్యగారి మల్లన్న	64
6.	తాళ్ళపాక చిన్నన్న	69
7.	సంకుసాల నృసింహకవి	70
8.	కాసె సర్వప్ప	74
9.	భాస్కర పంతులు	76
10.	భైచరాజు వెంకటనాధకవి	77
11.	అయ్యలరాజు రామభద్రుడు	80
12.	వెల్లంకి తాతంభట్టు	87
13.	కుమ్మరి మొల్ల	88
14.	పిడుపర్తి సోమనాధుడు	91
15.	పిడుపర్తి బసవకవి	94
16.	కోట శివరామయ్య	95
17.	కుమార ధూర్జటి	96
18.	దోనూరి కోనేరుకవి	100
19.	పింగళి సూరనార్యుడు	105
20.	అద్దంకి గంగాధరకవి	117
21.	పొన్నికంటి తెలగన్న	122
22.	రామరాజ భూషణుడు	125
23.	మల్లారెడ్డి	144
24.	రామరాజు రంగప్పరాజు	147
25.	మట్ల అనంతభూపాలుడు	150
26.	ఎర్రన	154
27.	శంకర కవి	159
28.	కంచి వీరశరభకవి	162

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10475

	పుట
29. తెనాలి రామకృష్ణుడు	164
30. తిమ్మరాజు	185
31. తాళ్ళపాక తిరువెంగళనాధుడు	187
32. రాయసము వేంకటపతి	189
33. తరిగొప్పుల నృసింహ	191
34. చరిగొండ ధర్మన్న	192
35. సారంగు తమ్మయ్య	196
36. తురగా రామకవి	204
37. చెన్నమరాజు చెన్నమరాజు	209
38. తెనాలి అన్నయ్య	210
39. సవరము చిననారాయణ నాయకుడు	215
40. దామెర వేంకటపతి	217
41. చిత్రకవి పెద్దన్న	219
42. యాదవామాత్య కవి	220
43. కంసాలి రుద్రయ్య	223
44. ఎలకూచి బాలసరస్వతి	230
45. ముద్దరాజు రామన్న	233
46. చిత్రకవి అనంతకవి	233
47. లింగమ్మగుంట రామకవి	234
48. లింగమగుంట తిమ్మన్న	236
49. వెలగపూడి వెంగనార్యుడు	239
50. రెంటూరి రంగరాజు	240
51. సింహాద్రి వేంకటాచార్యుడు	242
52. చేమకూర వేంకటకవి	243
53. రాజలింగకవి	252
54. చిత్రకవి రమణకవి	254
55. అందుగుల వెంకయ్య	258
56 కాకునూరి అప్పకవి	261
పేర్లుతెలియని ఇతరకవుల గ్రంధాలు	265

8

AOU#105B163



కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారు

٥٧

ఆంధ్రకవుల చరిత్రము.

మధ్యకవులు

కృష్ణదేవరాయలు

ఇతఁడాముక్తమాల్యద యను నామాంతరముగల విష్ణుచిత్తీయ మనుప్రబంధమును రచించిన మహాకవి. ఇతఁడు కవీశ్వరుఁడయి విద్వన్మహాకవుల నాదరించుట వలననేకాక మహారాజయి యనేకదేశములను జయించుటవలనఁగూడ సుప్రసిద్ధుఁడయినవాఁడు. దక్షిణహిందూదేశమును పాలించినరాజులలో నింతదేశమును జయించి యేలినవాఁడును, నింత ప్రసిద్ధి కెక్కినవాఁడును, మఱియెవ్వఁడును లేఁడు. కాఁబట్టి యీతని చరిత్రమును వ్రాయుటకుముం దీతని పూర్వచరిత్రమునుగూడ సంక్షేపముగాఁ గొంతవ్రాయుట యుచితమని తోఁచుచున్నది. ఈతని రాజధాని బళ్ళారిమండలములోని యూనెగొందికి సమీపమున తుంగభద్రాతీరమునం దున్న విజయనగరము. ఈవిజయనగరమునకు విద్యానగరమనియు నామాంతరము గలదు. ఈపట్టణము విద్యారణ్యస్వామి యని మహాప్రసిద్ధిగన్న మాధవాచార్యులవారి యాజ్ఞచేతఁ గట్టఁబడినది. ఈమాధవాచార్య లాకాలమునందు బుక్కరాజువద్ద మంత్రిగానుండెను. కంపభూపతి కుమారుఁడైన బుక్కరాజు క్రీస్తుశకము ౧౩౫౦ సంవత్సరము మొదలుకొని ౧౩౭౯ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈరాజు హూణశకము ౧౩౩౬ వ సంవత్సరము మొదలుకొని ౧౩౫౦ వ సంవత్సరము వఱకునుగూడ తనయన్నయైన హరిహరరాజుతోఁ గలిసి రాజ్యము చేసెననియు, ఆకాలమునందుఁగూడ మాధవాచార్యుఁడే వారికి మంత్రియనియు, వారికిరాజ్యము మాధవాచార్యుని

వలననే వచ్చెననియు, కొందఅందురుగాని యది యెంతవఅకు సత్యమో తెలియదు. బుక్కభూపాలుని తండ్రియైన సంగ (కంప) రాజొకచిన్న సంస్థానాధిపతియైయుండి, మహమ్మదీయులు దండెత్తివచ్చి హిందూ రాజ్యమును నాశనముచేసి యొరుగంటి ప్రతాపరుద్రుని చెఅగొనిపో యిన కాలములో తనరాజ్యమును పోగొట్టుకొని యుండును. కొంద అతఁడు గొల్లవాఁడని చెప్పుకురు. కాని యీతని పూర్వస్థితిని నిర్ధారణము చేయుటకుఁ దగినయాధారము లేవియు నిప్పుడు కానరావు. ఈ హరిహర బుక్కరాజులు సహితము ప్రతాపరుద్రుని యవసానదశయం దాతని సేనలో దండనాథులుగా నుండిరని యొకానొకరు వ్రాసి యున్నారు. వీడియెట్లున్నను వీ రారంభదశలో రాజ్యహీనులయియుండి తమ ధైర్యసాహసముల వలనను తమ కులగురువైన మాధవాచార్యుని బుద్ధిబలమువలనను రాజ్యము సంపాదించి, స్వతంత్రులై మాధవాచార్యుని మంత్రిగాఁ జేసికొని యీతని యాలోచన ననుసరించి వర్తించుచుండినట్టుమాత్రము నిశ్చయముగా తెలియవచ్చుచున్నది. మాధవాచార్యులు తానొక దేవత నుపాసించి యా దేవతను బ్రత్యక్షము చేసికొని యా మెవరముచేత బుక్కభూపాలునకు రాజ్యమిప్పించెనని కొందఅును, లక్ష్మీకటాక్షమునుబొంది సన్నిహితురాలయిన లక్ష్మీదేవిని తనైశ్వర్యవంతునిగాఁ జేయుమని కోరినప్పుడామె యీతనికి కాజన్మమునందు లక్ష్మీ లభింపదని చెప్పఁగా జన్మాంతరతుల్యమైన సన్యాసమును స్వీకరించి వైభవములను బొందెనని కొందఅును వ్రాసియున్నారు. ఇవి యిటీనలివారి బుద్ధికల్పితములు. ఇటువంటి కథలను కల్పించుటలో హిందువులకుఁ గల సామర్థ్యము మఱియెవ్వరికిని గానఁబడదు. మాధవాచార్యులకుఁ బూర్వమునందు శంకరాచార్య పీఠమునకు వచ్చిన యతీశ్వరు లాదిశంకరుని వలెను, ఇతర సన్యాసులవలెను పాదచారులయి భిక్షాటనము చేయుచు, శిష్యపరంపరకు తత్త్వబోధను జేయుచువచ్చిరి. ఈ మాధవాచార్యుఁడు

బుక్కరాజువద్ద మంత్రిగానుండి సమస్తవైభవములననుభవింపుచు సన్య సించినవాఁడగుటచేతఁ దాను సన్యాసియయ్యును తొంటివిభవములను విడువఁజాలనివాఁడయి జనులకుఁ దనయందుఁగల గౌరవాధిక్యము వల నను, రాజానుగ్రహము వలనను, గజాశ్వాందోళనాది సమస్తరాజ చిహ్నా ములను ధరించి, పీఠాధిపతుల కిట్టి యైశ్వర్యచిహ్నాము లుండవచ్చునని నిబంధనముచేసి సమర్థించుకొనెను. ఏనుఁగులతోను, గుఱ్ఱములతోను, వాద్యములతోను పల్లకులలోనెక్కి సర్వసంగపరిత్యాగు లయిన సన్యా సులు మహారాజవైభవముతో సంచరించుట దేవతావరాయత్తమని సాధించుటకై మనవారీ లక్ష్మీకథను తరువాతఁ గల్పించియుందురు. సన్యాసాశ్రమమును స్వీకరించినప్పుడు మాధవాచార్యులవారు విద్యా రణ్య లన్న నామమును స్వీకరించిరి. వీరికాలమునుండియే జగద్గురుపీఠ మనుకొనెడు స్మార్తాచార్యపీఠస్థు లయినయతుల కందఱికిను గజాశ్వా దులును వాద్యములును పెండ్లిపల్లకులును పరంపరగా వచ్చుచున్నవి. ఈ మాధవాచార్యులవారు గొప్ప విద్వాంసులు. ఆదిశంకరుల తరువాత శంకరాచార్య పీఠమునకు వచ్చినవారిలో మాధవాచార్యులకుఁ బూర్వ మునందుఁగాని పరమునందుఁగాని యింతటిపండితులు మఱియెవ్వరును లేరు. ఈయన పరాశరమాధవీయ మనుపేర పరాశరస్మృతి కొక గొప్ప వ్యాఖ్యానమును, కాలమాధవీయ మనునొక కాలనిర్ణయగ్రంథ మును, శంకరవిజయమును, విద్యారణ్యమని ప్రసిద్ధిగన్న వేదభాష్యమును, నూటయెనిమిది యుపనిషత్తుల కొకవ్యాఖ్యానమును, సర్వదర్శన సంగ్ర హమును, మాధవసిద్ధాంతమును రచియించెను. రాఁబోయెడు విజయనగర రాజుల చరిత్రమును దివ్యజ్ఞానముచేత ముందుగానే తెలుపుచు నీ మహా విద్వాంసునిచే రచియింపఁబడిన దన్న కాలజ్ఞానమను పుస్తక మొకటి కలదు గాని యది విజయనగర సంస్థానము క్షీణించినతరువాత రచింప బడిన యాధునికగ్రంథ మయియుండును. మాధవాచార్యులవారు తుంగ

భద్రాతీరమునందున్న పంపానగరమునందు జన్మించిరి; వీరు బుక్కభూపాలునికి కులగురువులు; భారద్వాజసగోత్రులయిన తెలుఁగు బ్రాహ్మణులు; ఈయన తండ్రి మాయణుఁడు; అన్న సాయణుఁడు. అన్నయందును తండ్రియందునుగల గౌరవముచేత మాధవాచార్యుల వేదభాష్యములలోఁ గొన్నిటికి వారిపేరులు పెట్టెను. మాధవాచార్యులు తొంబదిసంవత్సరముల ప్రాయమున సిద్ధిపొందిరఁట; ఈయన ౧౩౯౨ వ సంవత్సరమునందు బుక్కరాజుమంత్రి యైయుండిన ట్లొకతామ్రశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. మాధవీయాదిగ్రంథములలో మాధవాచార్యులవారు తమవంశమును దెలుపుచు వ్రాసిన రెండు శ్లోకముల నిందుఁ జూపుచున్నాను—

శ్లో॥ యస్య బోధాయనంసూత్రం శాఖాయస్యచయాజుషీ
భారద్వాజకులంయస్య సర్వజ్ఞ స్సహిమాధవః
శ్రీమతీయస్యజననీ సుంకి ర్మాయణః పితా
సాయణోభోగ వాథశ్చ మనోబుద్ధిసహోదరౌ.

బుక్కరాజుతరువాత నాతనికి కామాక్షీదేవివలనఁ బుట్టినహరిహరనాథుఁడు ౧౩౭౯ వ సంవత్సరము మొదలుకొని ౧౪౦౧ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈ హరిహరరాజునకు మల్లాదేవివలనఁ గలిగిన పుత్రుఁడైన వీరప్రౌఢదేవరాయలు ౧౪౦౨ వ సంవత్సరమువఱకును, ఆతనిపుత్రుఁడైన విజయభూపతి ౧౪౧౮ వ సంవత్సరమువఱకును, ఆతనికుమారుఁడైన దేవరాయలు ౧౪౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౬ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్లు శిలాతామ్రశాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కాని వీ రేయేసంవత్సరములయందు సింహాసన మెక్కిరో యేయేసంవత్సరములయందు పరమపదమును పొందిరో నిశ్చయముగాఁ దెలియదు. బుక్కరాజు

కాలమునుండియు వీరికి మహమ్మదీయులతో యుద్ధములు జరుగుచు వచ్చెను. ౧౩౬౮ వ సంవత్సరమునందు మొట్టమొదట బుక్కరాజు మహమ్మదీయులను యుద్ధములో జయించెను. ఆతని పుత్రుడైన హరిహరరాజును మహమ్మదీయులతో యుద్ధము చేసి ౧౩౮౦ న సంవత్సరమునందు తురుష్కులను గోవానగరమునుండి వెడలగొట్టెను. ఈ హరిహరరాజు హిందూదేవాలయముల కనేకములకు భూదానములు చేసెను. హరిహరరాజుయొక్క కడపటిదినములలో సాళువగుండరాజు మంత్రిగానుండెను. గుండరాజు జైమినిభారతము కృతినందిన సాళువనృసింహరాజుతండ్రి. గుండరాజు మంత్రిగాను దండనాథుడుగాను ఉండి కొంత రాజ్యమును సంపాదించెను. తదనంతర మాతనిపుత్రుడు సాళువనృసింహరాజు దేవరాయలు సంతానములేక మృతుడగుటవలననో మతియేలాగననో కర్ణాటకరాజ్యము నాక్రమించుకొనెను. నరసింహరాజునకు తిమ్మరాజనుపేరుగల జ్యేష్ఠభ్రాత యొకడు గలడు. అతడే యీశ్వరరాజు తండ్రియైన సాళువతిమ్మరాజని తోచుచున్నది. సాళువనృసింహరాజు భూదానములు మొదలయిన దానము లనేకములు చేసెను. ఇతడు చిత్తూరిమండలములోని వందవాసినగరమునకు పడమటి నామడదూరములో నున్నవెల్లము గ్రామములోని దేవాలయమునకు శాలివాహనశకము ౧౩౯౧ వ సంవత్సరమునం దనగా హూణశకము ౧౫౬౯ వ సంవత్సరమునందు గొంతభూమి యిచ్చెను; ఈతని రాజ్యకాలములోనే చిత్తూరిమండలములోని యావూరుగ్రామములోని శివాలయమున కొకరిచేత శాలివాహనశకము ౧౩౯౩ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౫౭౧ వ సంవత్సరమునందు గొంతభూమి యియ్యఁబడినది. ఈ నృసింహరాజు కాలమున తిమ్మరాజు పుత్రుడైన యీశ్వరరాజు దండనాథుఁడుగా నున్నట్లు నరాహపురాణ పీఠికవలనఁ దెలియవచ్చుచున్నది. ఈ నృసింహరాజు మరణానంతర మీశ్వరరాజుపుత్రుఁ

డయిన నరసింహరాజు రాజ్యమునకు వచ్చెను. ఇతఁడు ౧౪౮౭ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినట్లు శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. కొందఱితఁడు ౧౫౦౫ వ సంవత్సరమువఱకు మాత్రమే రాజ్యపరిపాలనము చేసె ననియు, ఆసంవత్సరము మొదలుకొని యాతని జ్యేష్ఠపుత్రుఁడయిన వీరనృసింహరాయలు పరిపాలనము చేసెననియు చెప్పుచున్నారు. ఇదియే నిజమై యుండవచ్చును. పే రొక్కటియే యైయుండుటచేత శాసనములను పరీక్షించినవారు కొడుకునుగూడ తండ్రినిగా భ్రమించియుందురు. ౧౫౧౯ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయల ప్రభుత్వ మారంభమైనది. కృష్ణదేవరాయలు రాజ్యమునకు రాకముం దాతని యన్నయైన వీరనృసింహరాయలు కొంతకాలము రాజ్యము చేసినట్లు కృష్ణదేవరాయల కంకితము చేయఁబడిన గ్రంథముల యం దెల్లను జెప్పఁబడియున్నది:—

క. వీరనృసింహుఁడు నిజభుజ
దారుణకరవాలపరుషధారాహతవీ
రారియగుచు నేకాతప
వారణముగ నేలె ధర నవారణమహిమన్.

క. ఆవిభు ననంతరంబ ధ
రావలయముఁ గాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల
దేవియునుం దనకుఁ గూర్చుదేవేరులుగన్—నుచరిత్రము.

క. వారలలోఁ దిప్పాంబకు
మారుఁడు పరిపంథికంధిమంథాచలమై
వీరనరసింహరాయఁడు
వారాశిపరీతభూమివలయం బేలెన్.

శా. వీరశ్రీనరసింహశౌరి పిదప విశ్వస్తమామండలీ
ధౌరంధర్యమున న్జనంబు ముద మంద న్నాగమాంబాసుతుం
డారూఢోన్నతిఁ గృష్ణరాయఁడు విభుండై రాజ్యసింహాసనం
బారోహించె విరోధులు న్దనానశై లారోహముం జేయఁగన్.—

పారిజాతాపహరణము

శిలాతామ్రశాసనాదులవలనఁ దెలియవచ్చెడు పయివిధమునఁగాక యీ వంశవిషయ ములు పలువురు పలువిధములు పరస్పరవిరుద్ధముగా వ్రాసియున్నారు. అందొక విధము నిందుక్రిందఁ గనఁబఱిచెదను.—

	మొదలు — వఱకు
హరిహరరాయలు	1336—1350
బుక్కరాయలు	1350—1379
హరిహరరాయలు	1379—1401
విజయబుక్కరాయలు	1401—1418
పల్లబుక్కరాయలు	1418—1434
గొడదేవరాయలు	1434—1454
రాజశేఖరరాయలు	1454—1455
విజయభూపతి	1455—1456
ప్రౌఢదేవరాజు	1456—1477
వీరప్రతాపరాయలు	1477—1481
మల్లికార్జునరాయలు	1481—1487
రామచంద్రరాయలు	1487—1488
విరూపాక్షరాయలు	1488—1490
నరసింహరాయలు	1490—1495
నరసరాయలు	1495—1504
వీరనరసింహరాయలు	1504—1509
కృష్ణదేవరాయలు	1509—1530

ఈ పట్టిక యొక్కటియే చాలవఱకు శిలాశాసనముల లోని కాలము ననుసరించి యున్నది.

కృష్ణదేవరాయలు జన్మించినదినముగాని సంవత్సరముగాని సరిగాఁ దెలియదు. కృష్ణరాయలజనన మొకరు ౧౪౮౬ వ సంవత్సరమునం దనియు, ఇంకొకరు ౧౪౮౭ వ సంవత్సరమునందనియు వ్రాసియున్నారు గాని యందేది సత్యమయినదియు నిశ్చయించుట కాధారము లేవియు దొరకలేదు. ఇతఁడు శాలివాహనశకము ౧౩౮౭ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౪౬౫ విక్రృతిసంవత్సర పుష్యబహుళ ద్వాదశీ శుక్రవారమునాఁడు పుట్టినట్లు తెలిపెడి యీక్రిందిపద్య మొకటి వాడుకలో నున్నది:—

ఉ. అందలి శాలివాహనశకాబ్దము లద్రివసుత్రిసోములఁ
వందిత మైనయవ్విక్రృతివత్సరమందలి పుష్యమా సమం
దుం దగుకృష్ణషష్ఠిమున నుండెడిద్వాదశి శుక్రవాసరం
బం దుదయించెఁ గృష్ణుఁడు శుభాన్వితుఁ డానరసింహమూ ర్తికిన్.

ఇది యెంతవరఱకు విశ్వసింపఁదగినదో బుద్ధిమంతులగువా రాలో చించుకొందురుగాక! అయినను, ఇది మొదటివారు చెప్పినకాలముతో సరిపోవుచున్నందున దీని నధికవిశ్వాసార్హముగా నెంచవచ్చును. ౧౮౯౮ వ సంవత్సరములో కావలి వెంకటరామస్వామిగారు కలకత్తానగరమునందుఁ బ్రచురించిన దక్షిణహిందూదేశకవుల చరిత్రములో కృష్ణరాయలు తన నలువదవయేట శాలివాహనశకాబ్దములు ౧౪౫౬ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౫౩౪ వ సంవత్సరమునందు మృతినొందినట్లు వ్రాసియున్నారు. దీనినిబట్టిచూడఁగా నీ రాయలవారు హరిహరశకము ౧౪౫౭ వ సంవత్సరమునఁ బుట్టిన ట్లేర్పడుచున్నది. అల్లసాని పెద్దన్న చెప్పినట్లు చాటుధారగా వచ్చుచున్న యీక్రింది పద్యములనుబట్టికూడ కృష్ణదేవరాయల మృతికాల మించుమించుగా దీనితో సరిపోవుచున్నది.

ఉ. బోరన యాచకప్రతతి భూరివిపద్దశ నొందుచుండఁగా
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధ ష
ష్ఠీరవివాసరంబున నృసింహుని కృష్ణుఁడు చేరె స్వర్గముక్
ద్వారక నున్నకృష్ణుఁ డవతారసమాప్తము నొందు కైవడిన్.

ఈపద్యమునుబట్టి శకాబ్దములు ౧౪౪౭ టికి సరియయినహూణ శకము ౧౫౮౪ వ సంవత్సరమునఁ గృష్ణరాయ లంతరించినట్లు కానఁ బడుచున్నను, ౧౫౩౦ వ సంవత్సరమువఱకు నాతని దానశాసనములు విస్తారముగా నున్నందున శాసనములను బరీక్షించిన యిప్పటి వారతఁడు ౧౫౩౦ వ సంవత్సరమునందే మృతినొందెనని నిశ్చయించియున్నారు. ౧౫౩౬, ౧౫౩౮, ౧౫౩౯ వ సంవత్సరములయం దచ్యుతదేవరాయల దానశాసనములు సహితము రెండుమూడు కానవచ్చుచున్నను, అవి కృష్ణరాయల జీవితకాలములోనే చేయఁబడినవి కావచ్చును. కృష్ణదేవ రాయలతండ్రియైన నరసింహరాయనికి తిప్పాంబ యనియు, నాగమాంబ యనియు, ఇద్దఱు భార్యలు గలరు. ఆ యిరువురలో తిప్పాంబ పట్టపురాణియనియు, నాగమాంబ భోగకాంతయనియు, చెప్పుదురు. కొన్ని శాసనములయందుఁగూడ నిట్లే కానఁబడుచున్నది. ఆయిద్దఱు భార్యలలో తిప్పాంబకు వీరనృసింహరాయలును, నాగమాంబకు కృష్ణ దేవరాయలును పుట్టిరి. నరసింహదేవరాయల కోబమాంబ యని యింకొక భార్య యున్నట్టును, ఆమె కచ్యుతదేవరాయలు పుత్రుఁ డయినట్టును, శాలివాహనశకము ౧౫౫౯ వ సంవత్సరమునకు సరియైన హూణాబ్దము ౧౫౩౮ హేవిళంబి సంవత్సరమున చిత్తూరిమండలము లోని నారాయణపురము నొక బ్రాహ్మణునికి దానమిచ్చుచు నచ్యుత దేవరాయలు వ్రాసియిచ్చిన తామ్రశాసనములోని యీక్రింది వాక్య ములవలనఁ దెలియవచ్చుచున్నది:-

తిప్పాజీ నాగలాదేవ్యో కౌసల్యా శ్రీసుమిత్రయోఃజాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ నుహీపతిఃఅస్మాదోబాంబికాదేవ్యా మచ్యుతేంద్రోపి భూపతిఃకృష్ణదేవరాయలతండ్రి నరసింహరాజే మధుర శ్రీరంగపట్టణము మొదలయినవానిని జయించి తద్దేశముల నాక్రమించినట్లు పారిజాతాపహరణములోని యీక్రిందిపద్యమువలనఁ దేటపడుచున్నది—

సీ. కుంతలేశ్వరుఁడు చిక్కుపడంగవిద్యాపురంబుఁ గైకొని నిజప్రౌఢినెఱపెఁబారసీకునకు దుర్భరమానవత్వంబుఁ దొలఁగించె మానవదుర్గసీమఁజోళవల్లభునకుసురవధూమధురాధరములిచ్చిమధురాపురంబుగొనియెశ్రీరంగ పట్టణసీమ ఖడ్గనటీవినోదంబు హూనసేంద్రునకుఁ జూపెనతఁడు నుతికెక్కె రామసేత్వంతరాళకలితషోడశ దానవిఖ్యాతయశుఁడుమండలీకర మేఘమార్తాండబిరుదుఁడీశ్వరాధిపు నరసభూపృథ్వీశ్వరుండు.

౧౫౦౮ వ సంవత్సరమునకు సరియైన శాలివాహనశకము ౧౪౩౦ శుక్లసంవత్సర వైశాఖమాసమునందు సింహాసనమునకు వచ్చువఱకును గల కృష్ణరాయనిచరిత్రము విశ్వాసార్హమైన దేదియు తెలియదు. వీర నృసింహరాయని పైని నిజాపు ప్రేమముకంటెఁ దండ్రి కృష్ణరాయనియెడ నధికప్రేమమును జూపుచు వచ్చెననియు, అదిచూచి సహింపలేక వీర నృసింహరాయని తల్లి తన సపత్నీపుత్రుని జంపింపఁ బ్రయత్నింపఁగా మంత్రియైన తిమ్మరు సాజాడఁ గనిపెట్టి యాతనిని దాఁచి ప్రాణమును రక్షించి కాపాడె ననియు, తరువాతఁ గొంతకాలమునకు నృసింహదేవరాయ లుబ్బుబబ్బుచేత బాధపడుచుఁ బ్రాణావసానకాలమునందుఁ గొడుకులను బిలిచి తనప్రేలియుంగరమును దీసికొన్నవాఁడు రాజ్యార్హుఁడని

చెప్పినప్పుడు తక్కినవారు తీయుట కుపాయముతోఁచక యూరకుండఁగాఁ గృష్ణరాయలు తనచేతిఖడ్గముక్రో జనకుసవ్రేలు నటికి యుంగరమును గైకొనెననియు, అతని సాహసమునకు మెచ్చి తండ్రి యాతనినే పట్టాభిషిక్తుని జేయ నియమించి దేహావియోగమును బొందెననియు కథలు చెప్పుదురు. నరసింహరాయని యనంతరమున జ్యేష్ఠుఁడయిన వీరనృసింహరాయఁడే రాజ్యమునకు వచ్చినట్లు కృష్ణరాయని కంకితము చేయఁబడిన మనుచరిత్రాది గ్రంథములే చెప్పుచున్నందున, ఈ కడపటిసంగతి సత్యమయి యుండదు. కృష్ణదేవరాయఁడు సింహాసనమునకు వచ్చిన శీఘ్రకాలములోనే యుద్ధయాత్రచేసి తన రాజ్యమును నానాముఖముల వ్యాపింపఁజేసెను. దాసీభ్రాతృఁడగుటచేత నాతనికి సత్కులీనులగు రాజులెవ్వరును గన్య నియ్యనంచున సింహాసన మెక్కినప్పటికి వివాహము కాలేదు. కృష్ణరాయలు గజగిరి వనవత్సరమునందు దక్షిణ దిగ్విజయ యాత్రకు బయలువెడలి మహిసూరుదేశములోని యుమ్మటూరు, శివసముద్రము, శ్రీరంగపట్టణము లోఁబఱుచుకొని గంగవంశరాజులను జయింపఁగా, తరువాత మహిసూరుదేశమంతయు స్వాధీనమయినది. ఈ దేశమును జయించినసంగతి పారిజాతాపహరణములోని ద్వితీయాశ్వాసాంతమందలి యీ క్రిందిపద్యమునందు సూచింపఁబడినది:—

శా. సమ్మర్దత్కుధినీబంధనవిధాసంక్రందనాచార్య శూ
రమ్మన్యాచలవజ్రపాత జగతీరక్షాంబుజాక్ష శర
ధ్యమ్మార్గస్థనశాస్య రాజ్యపము సహ్యప్రోద్భవాతీరభా
గుమ్మత్తూరి శివంసముద్రపుర వజ్రోన్మూలనాడంబరా.

ఆ సంవత్సరమునందే కృష్ణదేవరాయలు నెల్లూరిమండలముఁబోని యుదయగిరివీఁడికి దండెత్తి, దాని కధికారిగానున్న వీరభద్రపాత్రుని పినతండ్రియైన ప్రహరేశ్వరపాత్రుని జయించి యూరుర్వమును సాధించెను. అటుతరువాతఁ గృష్ణరాయల మంత్రియైన యప్పాజీ యను నామాంత

రము గల తిమ్మరుసు (సాళువతిమ్మరాజు) నెల్లూరిమండలములోని కని
గిరి (కనకగిరి) కి రాజయినట్టియు, ఓరుగంటి ప్రతాపరుద్రుని సంతతి
వారిలోఁ గడపటివాఁ డయినట్టియు వీరరుద్రగజపతి కాతనికొమార్తెను
కృష్ణరాయల కిచ్చి వివాహము చేయుమని సందేశము పంపెను. ఆతఁడు
హీనకులుఁడైన కృష్ణరాయనికిఁ దనపుత్రిక నియ్యనని స్పష్టముగాఁ జెప్పి
యటువంటి బలవంతునితో విరోధము పెట్టుకొనుటకు సాహసింపఁజాలక,
కొమార్తె నిచ్చెద నని చెప్పి రాయలను మంత్రిసహితముగా రప్పించి,
అంతఃపురము చొచ్చినప్పుడు రాజుప్రాణములు గొనఁ బ్రయత్నించెను.
కోటలోఁ బ్రవేశించిన తరువాత మంత్రియైన తిమ్మరు సీమోసమును
గనిపెట్టి రాజుప్రాణములు కాపాడుటకై తాను రాజువేషమును వేసికొని
కృష్ణరాయనికి సేవకవేషమువేసి తన వెంటఁగొనిపోయెను. కాని కృష్ణ
రాయనిచేతిక్రిందినున్న ముద్రయుంగరమునుబట్టి యతఁడేరాజని యతని
పురములోనివా రానవాలు పట్టిరి. ప్రాణోపద్రవము సంభవింపనున్న
యా సమయమునందు ధీమంతుఁడైన మంత్రియుపాయమువలన రాజు
తానును మంత్రియు నెట్లో ప్రాణములు దక్కించుకొని పాటిపోయి
స్వదేశమును జేరినతోడనే సేనలనుగూర్చి కనిగిరిమీఁద దండెత్తివచ్చి
వీరరుద్రునిరాజ్యమును, అతనిపుత్రికయైన చిన్నాదేవినిగైకొని, ద్రోహి
యైన యాతనిఁ జంపక కుటుంబసహితముగా వింధ్యపర్వత ప్రాంతము
లకుఁ బొమ్మఁద్రోలెను. వీరరుద్రునిశుద్ధాంతస్త్రీలు వింధ్యపర్వతము
పాలైన సంగతిని మనుచరిత్రమునం దల్లసాని పెద్దన యీరీతిగా వర్ణిం
చియున్నాఁడు:—

మ. ధరకెంధూళులు కృష్ణరాయలచమూధాటీగతి న్వింధ్యగ
హ్వారము ల్దూఱఁగఁ జూచి తారచటఁగాపై యుంకుటం జాల న
చ్చెరువై యెట్టనివింతచీఁకటులు వచ్చెం జూడఁ జేయంచు వే
సారిదింజూతురు వీరరుద్రగజరాట్సిద్ధాంతముగ్ధాంగనల్.

కృష్ణరాయలు ౧౫౧౫ వ సంవత్సరమునందు పూర్వదిగ్విజయ యాత్ర వెడలి, ఆ సంవత్సరమునందె కొండపీమ, బెల్లముకొండ, బెజవాడ, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలయిన ప్రదేశములను జయించి, ౧౫౧౬ వ సంవత్సరమునందు విశాఖపట్టణమండలములోని భీమునిపట్టణమున కయిదుక్రోసులదూరములో నున్న పొట్నూరివద్ద రాతిజయస్తంభమును వేయించి, ఆమండలములోని వీరనల్లి తాలూకాలోని వడ్డాది జయించి, ఉత్కలదేశములోని కటకపురమువఱకును బోయి కటకపురమును గాల్పఁగా, కళింగదేశాధిపతియై యాంధ్రదేశమును బాలించుచుండిన ప్రతాపరుద్రదేవుఁడు తనకుమార్తెయైన తిరుమలదేవిని రాజున కిచ్చి వివాహముచేసి సంధి చేసికొనెను. అందుచేతఁ గృష్ణదేవరాయలు రాజమహేంద్రవరమువఱకును గల కళింగదేశమును మరలఁ బ్రతాపరుద్రదేవుని కిచ్చివేసి, ౧౫౧౬ వ సంవత్సరాంతమున కాంచీపురము ప్రవేశించెను. ఈతని ప్రథమభార్యయైన చిన్నాజేవికి అన్నపూర్ణాదేవియనియు నామాంతరముగలదు. ఈతనికిఁ దిరుమలదేవియు నన్నపూర్ణాదేవియు నిద్దఱుభార్యలగుటను గృష్ణదేవరాయలు తాను విష్ణుచిత్తీయమునం దిట్లు తెలిపియున్నాఁడు.—

క.—ఆవిభు ననంతరంబ ధ
రావలయముఁ బూని తీవు రహిమైఁ దిరుమ
ల్దేవియుఁ ను నన్నపూర్ణా
దేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులుగన్.

ఈతఁడు పూర్వదిగ్విజయయాత్రలో సింహాచలమును దర్శించి నప్పుడు భార్యాసహితముగాఁ జేసినదానమునుగూర్చి సింహాచలదేవాలయములో నేడవ స్తంభముమీఁదఁ జెక్కించిన యీ క్రిందియంశమును విశాఖపట్టణమండలచరిత్రమునుండి తీసికొనుచున్నాను.—

"శుభమస్తు శ్రీమత్ మహారాజాధిరాజ పరమేశ్వర మూరు రాయరగండ ఆదిరాయ విజయభాషాగీత ప్రవర రాయరగండ యవన రాజ్యసంస్థాపనాచార్య శ్రీవీరప్రతాపకృష్ణదేవమహారాజులువిజయనగరాన సింహాసనస్థుడై పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరము మొదలయిన దుర్గాలు సాధించి సింహాద్రికి విచ్చేసి స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు ౧౪౩౮ అగు నేటి ధాత సం॥ చైత్ర బ ౧౨ స్థిరవారాన సింహాద్రినాథు దర్శించి తమతల్లి నాగాదేవమ్మగారికిన్ని తమతండ్రి నరసరాయునిగారికిన్ని పుణ్యముగాను దేవునికి సమర్పించిన కంఠమాల ౧-కి ముత్యాలు ౯౯౧ వజ్రమాణిక్యాల కడియాలజోడు ౧-టి శంఖచక్రాల పతకం ౧-న్ని పయిడిపళ్ళెం ౧-న్ని తూకాలు గ ౮౮-౯-౨ కానిమాడలు గ ౨౦౦౦ తమదేవి చిన్నాదేవమ్మగారిచేతను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౦ తిరుమలదేవమ్మగారిచేతను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౦ యింత మట్టుకు సమర్పించిన ధర్మశాసనము."

కృష్ణరాయలవిజయములనుగూర్చి పారిజాతాపహరణమునందును, మను చరిత్రమునందును జెప్పఁబడిన కొన్ని పద్యముల నిం దుదహరించుచున్నాను.—

చ. మునుకొని కొండవీటికడ మూఢత రుద్రుఁడు కృష్ణనందను
స్మనసిజునిన్ జయించె నది మానుషమే నరసేంద్రు కృష్ణరా
యనృపతి కొండవీటికడ నాహవభూమిఁ బ్రతాపరుద్రనం
దనుఁ డగువీరభద్రుఁ గిరుణాపుతిఁ గాంచె జగత్ప్రసిద్ధిగన్.

చ. నెలకొని కృష్ణరాయధరణీవిభుఁ డుత్కలభూమిపాలుతోఁ
గలన నెదిర్చి హస్తికరకాండతతు ల్మసకంపుఁబాములై
మలసినచోటఁ గూడిన సమగ్రయశోవసనంబు గప్పి తా
వలవఁగఁ జేసె భూసతిని వశ్యవిధిజ్ఞుఁడుగాన నేర్పునన్.

సీ. ఉదయాద్రి వేగనత్యుద్ధతి సాధించెవినుకొండ మాటమాత్రన హరించెఁ
గూటము లెన్నదరంగఁగొండవీడగలించె బెల్లముకొండ యచ్చెల్ల జెఱిచె
వేలుపుకొండ నుద్వృత్తి భంగము సేసె జల్లిపల్లె సమగ్రశక్తిఁగూల్చె
గినుకమీఱి నసంతగిరి క్రింపుపడఁజేసె గంబంబుమెట్లు గ్రక్కనఁగదల్చె
బలనికాయము కాలుముట్టల నడంచుఁ
గటకమును నిఁక ననుచు సుత్కలమహీశుఁ
డనుదినమ్మును వెఱచు నెవ్వనికి నతఁడు
రాజమాత్రుండె శ్రీకృష్ణరాయవిభుఁడు :—పారిజాతాపహరణము.

సీ. తొలుదొల్త నుదయాద్రిశిలఁదాఁ కితీంద్రించు నసిలోహమున
వెచ్చనయిజనించె
మఱికొండవీ డెక్కి మాగొఱ్ఱి నలియైనయలకసవాపాత్రు నంటిరాఁజె
నటసాగి జమ్మిలోయఁబడి వేగదహించె ఁగోనబిట్టెర్చెఁగొట్టానఁదగిలెఁ
గనకగిరిసూర్తిఁ గరఁచె గౌతమిఁ గ్రాఁచె నవులనాపొట్టూరు రవులు
గొనియె
మాడెములు వ్రేల్చె నొడ్డాది మసియొనర్చెఁ
గటకపురిఁ గాల్చె గజరాజు గలఁగిపఱవఁ
దోఁకచిచ్చున నార యుద్ధురతఁ గృష్ణ
రాయబాహుప్రతాపజాగ్రన్మహాగ్ని.

చ. అభిరతిఁ గృష్ణరాయఁడు జయాంకములన్ లిఖియించి తాళస
న్నిభముగఁ బొట్టునూరికడ నిల్పినకంబము సింహభూధర
ప్రభు తిరునాళ్ళకుం దిగునురప్రకంబు కళింగమేదినీ
విభు నపకీర్తికజ్జలము వేమఱుఁ బెట్టిపఠించు నిచ్చలున్ :-మనుచరిత్రము.

పూర్వదిగ్విజయయాత్ర చేసి వచ్చినతరువాత మూడుసంవత్సర
ములవఱకును కృష్ణదేవరాయలు యుద్ధము లేమియుఁ జేసినట్లు కానఁ
బడదు. అతఁడాకాలమునందంతటను విద్యావ్యాసంగమునందు ప్రొద్దు

పుచ్చుచుండెను. అల్లసానిపెద్దన తనస్వారోచిషమను చరిత్రమును, నంది తిమ్మన తనపారిజాతాపహరణమును, ౧౫౧౯ వ సంవత్సరమునకు తరు వాతను ౧౫౨౦వ సంవత్సరమునకు లోపలను కృష్ణదేవరాయనికంకితము చేసెరి. ౧౫౧౮ వ సంవత్సరాంతమునందు బీజపుర మహమ్మదీయులత్రో యుద్ధము చేసి, ౧౫౨౦ వ సంత్సరమునందు సుల్తానయినయేడిల్ ఖానుని జయించెను. ఈయుద్ధవార్త పూర్వోక్తములైన రెండుగ్రంథములయందు నుదహరింపఁబడకపోవుటచేత నవి యీ యుద్ధమునకుఁ బూర్వమునందే రచియింపఁబడినట్లు నిశ్చయింపవలసియున్నది. అయినను గృష్ణదేవ రాయలే తన యాముక్తమాల్యదయం దీయుద్ధవృత్తాంతము నీక్రింది పద్యముచేఁ జెప్పియున్నాఁడు:—

మ. అలుక న్మోటకధట్టికాఖురపుటీహాల్య న్నురాసానిపు
చ్చలువోఁదున్ని చలచ్చమూగజమచాసారప్లుతి న్గీర్తిపు
ష్కలసస్యం బిడి యేకధాటి బళిరా కట్టించితౌ దృష్టి కే
దులఖానోగ్రకపాల మర్థపహరిదూభ్భాజాంగలక్ష్మీకళ.

పయిపద్యమునుబట్టి యాముక్తమాల్యద ౧౫౧౯ వ సంవత్సర మునకుఁ దరువాత రచియింపఁబడిన ట్లెర్పడుచున్నది. ఓరుగల్లు; గోల కొండ మొదలయిన సంస్థానమ్ములనుగూడ జయించి యితఁడు తనరాజ్య మును దక్షిణహిందూస్థానమునం దంతటను వ్యాపింపఁజేసెను. ఈదక్షిణ దేశమును పాలించినరాజులలో నింతగొప్పరాజ్యమేలినరాజు మఱియెవ్వఁ డును లేఁడు. ఒడ్డిరాజు లయిన గజపతులను, తురుష్కరాజు లయిన యశ్వపతులను, తెలుఁగురాజు లయిననరపతులను, జయించుటచేత నీత నికి మూరురాయరగండఁడని బిరుదు కలిగినది. ఇటువంటి బిరుదము లనేకము లీయనకుఁ గలవుగాని యవి యన్నియు నిందు వివరించుట యనావశ్యకము. ఈతఁడు శ్రీరంగపట్టణము, మధుర, తిరుచనాపల్లి, మళయాళము మొదలయిన దేశములను పాలించుటకు తెలుఁగునాయకు

లను పాలకులనుగా నేర్పఱిచెను. ఈతఁడే తుంగభద్రానదికి విజయనగర ముపద్ద వంతెన కట్టను. ఈతనికి తిమ్మరుసు మంత్రిగా నుండెనుగాని యతఁడు రాజునకంటె మూఁడు సంవత్సరములు ముందుగా మృతి నొందెను.

ఈకృష్ణదేవరాయలది తుళువవంశము. ఇంటిపేరు సాళువవారు; పూర్వు లావఱకు వసియించిన గ్రామనామములనుబట్టి సంపెటవా రనియు, సెలగోలవా రనియు కూడ గృహనామము గలదు. ఈకడపటి రెండుపేరులును కరణములు వ్రాసియుంచిన కొండవీటికవిలె చరిత్ర మునం దుదాహరింపఁబడి యున్నవి. ఇంతవఱకును రాజుయొక్క విజ యములనుగూర్చి సంక్షేపముగా వ్రాసియున్నాను. ఇఁక నీతని పాండిత్య ప్రభావాదులనుగూర్చి కొంత వ్రాయవలసి యున్నది. పూర్వకాలము నందు భోజరాజు సంస్కృతభాష నాదరించినట్లే యితఁ డాంధ్రభాష నాదరించి కవులను సమ్మానించి గ్రంథరచన చేయించుటచేత నీతని కాంధ్రభోజుఁడని బిరుదనామము గలిగినది. ఇతఁడు కవుల నాదరించి కావ్యములు చేయించుటయేకాక తానుగూడ విద్వాంసుఁడై సంస్కృ తాంధ్రములయందు గ్రంథములను రచియించుటకు సమర్థుఁడయియుం డెను. ఈతఁడు సంస్కృతమునందుఁ బెక్కుగ్రంథములు రచించినట్లు విష్ణుచిత్తీయమునందలి యీపద్యమునందుఁ జెప్పఁబడియున్నది.—

సీ. పలికి తుత్పేక్షోపమల జాతిపెం పెక్క రసికులౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘుచ్ఛటలు విచ్చుగరపించితినూకి నై పుణిజ్ఞానచింతామణికృతి
మతియు రసమంజరీముఖ్యమధురకావ్య
రచనమెప్పించుకొంటి గీర్వాణభాష

నంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క-
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ.

అయినను కృష్ణదేవరాయలు రచియించిన యీసంస్కృత గ్రంథము లేవియు నిష్పాదు గానరాకున్నవి. సంస్కృతముమాట యెట్లు న్నను కవులను బ్రోత్సాహపఱిచి కావ్యములను చేయించియు తాను జేసియు తెలుఁగుభాష కీయన మహోపకారము చేసి యున్నాఁడు. ప్రబంధరచనము క్రొత్తగా నీ కృష్ణదేవరాయల కాలమునందే యారంభ మైనది. అంతకుఁ బూర్వమునందున్న కవులు సంస్కృతమునుంచి యితి హాసములను బురాణములనుమాత్రము తెనిఁగించుచు వచ్చిరి. వారిలోఁ గేతన యనుకవి యాజ్ఞవల్క్యధర్మశాస్త్రమును, దండివిరచితమైన దశకు మారచరిత్రమును, శ్రీనాథుఁడనుకవి శ్రీహర్షవిరచితమైన నైషధకావ్య మును పద్యకావ్యములనుగాఁ దెలిఁగించిరి. బాణవిరచితమైన కాదంబరి యాంధ్రీకరింపఁబడినట్లు కానఁబడుచున్నదిగాని కొన్ని లక్షణగ్రంథముల యందుహరింపఁబడిన పద్యములుతక్క గ్రంథ మెక్కడను పూర్ణముగా దొరకకున్నది.

ఏది యెట్లున్నను గృష్ణదేవరాయలకిఁ బూర్వకాలమునందలికవులు రచించిన యాంధ్రగ్రంథములన్నియు సంస్కృతమునుండి చేసిన భాషాం తరములేకాని స్వబుద్ధికల్పితముగా రచించిన నూతనగ్రంథమం దొక్క టియుఁ గానరాదు. తెలుఁగునందు నూతనముగా ప్రబంధరచనచేసి తరు వాతివారికి దారిచూపినవాఁడు కృష్ణదేవరాయఁ డాస్థానకవియైన యల్లసాని పెద్దనామాత్యుఁడు. ఆతఁడు రచియించిన మొదటిప్రబంధము స్వారోచిషమనుసంభవమను మనుచరిత్రము. ఈ గ్రంథమునందలి కథ మార్కండేయ పురాణమునుండి గ్రహింపఁబడినది. మొట్టమొదట నీమనుచరిత్రమును ప్రబంధరూపమున రచింపఁబట్టియే పెద్దనార్యున కాంధ్రకవితాపితామహుఁ డను బిరుదనామము కలిగినది.

కృష్ణదేవరాయలకు సంస్కృతాంధ్రములయం దసాధారణపాండి
త్యము గలిగియుండుట నాతఁడు రచియించిన యాముక్తమాల్యదయే
సహస్రముఖముల ఘోషించుచున్నది. ఆముక్తమాల్యద కృష్ణరాయ
కృతము కాదనియు దానిని తదాస్థానకవియైన పెద్దనార్యుఁడు రచించి
పుస్తకమునఁ దనప్రభువునకుఁ గర్తృత్వమును నారోపించెననియు వాడుక
కలదుగాని యదియంతగా విశ్వసనీయముగాదు. కృష్ణదేవరాయ లల్లసాని
పెద్దనను, రామరాజభూషణుని, ప్రబంధములను రచించి తెమ్మని
యాజ్ఞాపించెననియు, తదాజ్ఞానుసారముగా వారిరువురును గ్రంథరచనచేసి
తమప్రబంధములను దీసికొనిరాఁగాఁ జూచి రాజు వసుచరిత్రమునకంటె
మనుచరిత్రము లేతపాకమునఁ బడినదని యభిప్రాయము తెలిపెననియు,
అంచుమీఁద పెద్దన "యాముక్త మాల్యద" యనుపేర విష్ణుచిత్తుని చరి
త్రమును రచియించి తీసికొనిరాఁగా విష్ణుచిత్తీయము ముదురసాకముగా
నున్నదనియె ననియు, చెప్పుదురుగాని యిదియంతయు నిట్టివలివారి
స్వకపోలకల్పితము. వసుచరిత్రమును రచియించిన రాజరాజభూషణుఁడు
కృష్ణదేవరాయని కాలమునం దుండెనో లేఁడోయని సందేహింపవలసి
యున్నది. ఉండినచోమున నతఁ డాకాలమునఁ బిన్నవయసువాఁడయి
యుండవచ్చును. ఆముక్తమాల్యదయు మనుచరిత్రమును రచియింపఁ
బడినతరువాత నేఁబదియేండ్లకుఁగాని రామరాజభూషణుఁడు వసుచరిత్ర
మును రచియింపలేదు. కాఁబట్టి పయికథ యెంతమాత్రమును నమ్మఁదగి
నదికాదు. ఆముక్తమాల్యదకును, మనుచరిత్రమునకును శైలియందు
విశేషభేద ముండుటచేతను, ఆముక్తమాల్యద వ్యాకరణదోషయుక్త
మయినదిగా నుండుటచేతను, ఆరెండుపుస్తకములు నేకకవిచే రచి
యింపఁబడినవి కావని నిశ్చయముగాఁ జెప్పనచ్చును. పెద్దనకవిత్వములో
లేనియికారసంధులును, తత్సమశబ్దములం దకారసంధులును, క్త్వార్థక
సంధులును, ఆముక్తమాల్యదయందుఁ గానఁబడుచున్నవి అందుఁ

గొన్నటి నింపు క్రిందఁ జూపుచున్నాను :—

ఇ కా ర సం ధు లు.

౧-గీ. నిం గిటు త్రిశంకుకతన మాతంగవాటి
యయ్యె నిఁక నుండఁదగదని యవనికరిగి
నట్టి నక్షత్రతారాగ్రహాళియనఁగఁ
గాంతనవరత్నరాసు లంగళ్ళఁ బొలుచు. ఆ ౨.

ఇందు మొదటిపాదమునందు "నింగి + ఇటు = నింగిటు" అని ప్రయోగింపఁబడినది.

౨-చ. హాతల నొనర్చె మోహాతల నల్ల యయోముఖి నాపుల స్త్య భూ
సుతను విరూపలౌట ననుచో ముసలిక బెదనిట్టతాడువం
టతివ రమించెఁ దా ముసలి యయ్యు రహస్సమయుగుజ్జ్రపేష్యకై
ధృతిచెడి యుగ్రసేనునకుఁ బ్రేష్యత నొందియు దిద్ది యేలఁడే. ఆ-గి

ఇందు మూడవపాదమునందు "నిట్టతాడువంటి + అతివ = నిట్టతాడువంటతివ" అని ప్రయోగింపఁబడినది.

తత్సమములం దకారసంధులు.

౧-చ. అడుగునను౦డియుం బదిలమై చద లంచెడుకోటనొప్పు ప్రో
ల్చెడనికడంక దంచెనపుచేతులఁ గం గనుకాసె దూఱఁగా
నడుమనె యున్కిఁజేసి యల నాకపురి న్నరికై పెనంగి లా
వెడలఁగఁ బట్టివేయుటకు నెత్తె ననం జను మల్లసోరునన్. ఆ-౨

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౧౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౨౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౩౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౪౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౩-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౪-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౫-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౬-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౭-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౮-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౫౯-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౬౦-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౬౧-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గంగ + అను = గంగను" అని ప్రయోగింపఁబడినది.

౬౨-చ. తడితల డిగ్గిముంప జడతం దుదతెప్పలఁ గన్నువిప్పి పు
ల్పొడుచుచు నీరు ముంగరలపోలిక ముక్కులఁగూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టి సగ మొత్తుచు తెక్కవిదిర్పు మున్నగా
వడఁకుచెకాక చేష్టుడిగెవక్షము పక్షులుజానువుల్ చొరన్. ఆ-౪

ఇచ్చట రెండవచరణమున "గ

ఇచట నాలవచరణమందు "చేట్ట + ఉడిగె = చేట్టుడిగె" అని ప్రయోగింపఁబడినది.

3-శా. అబ్రహ్మణ్యము లోనవై చుకొనె నన్యాయంబున న్మత్సుతం
దాబ్రహ్మదులమేర నిల్పియుఁ బ్రభుత్వం బూఁదియుం ద్రోతుచే
యీబ్రకఁందిజుఁ జూడరయ్య సభవా రీరంగభ ర్తంచు దుఃఖాబ్రాశింబడి బొప్పకంయఁడు సముద్యద్దోఃపలాలుండు నై. ఆ-ఉ

ఇచట మూడవచరణమున "రంగభ ర్త + అంచు = రంగభ ర్తంచు" అని ప్రయోగింపఁబడినది.

గసీ. కొంగవాల్గుకులంగుళులఁబట్టుకజబ్బలంటఁగుట్టిడవెజ్జునరయువారు
తలఁబడ్డ గుదియదెబ్బలఁబాఁతమసియిడియంబలిగంజిండ్లనడుగువారు
తమసేగఁజెప్ప లో దయమీఱ వినిచీరఁజిం చిచ్చువారి దీవించువారు
నొలఁబడ్డ నెపమునఁ గలలేసిసిరిఁజెప్పి చుట్టలపై దాడి వెట్టువారు
నై నపాంథులచేతఁ గ్రందై నయూళ్ల
జాడగా నిటఁ దెచ్చి యిస్నీడఁడించి
వారు నీ రానఁబోవనొ వ్వారిమగిడి
వచ్చునాలోన నీరూపువచ్చెనాకు. ఆ-ఉ

ఇచ్చట మూడవపాదమునందు "చించి + ఇచ్చు = చించిచ్చు" అని ప్రయోగింపఁబడినది. మఱియు నీపద్యమునందే మొదటిచరణమున "పట్టుకొని" యనుటకు "పట్టుక" యనియు, రెండవచరణమందు "గంజి + ఇండ్ల = గంజిండ్ల" నియు వ్యాకరణదుష్టములయిన ప్రయోగము లున్నవి. ఈవిధముగానే,

శా. ఎట్లా యిట్లగునయ్యపల్క- దయలే కిన్నాళ్లు నీకూడె యీ
పొట్టంబెట్టి మహాఘులబ్ధిఁ దనుపుం బోషించి యెన్నాళ్లకే
నెట్టే నొక్కతపస్వి యొక్కవ్రతి రాఁడే చూఁడఁడే తత్కృపా
బుట్టు స్నిగ్ధద దీని నా నొదవి యో పుణ్యాత్మ యెట్లుంటివే — ఆ ఉ.

"పుట్టున్నీ గెద" (పుట్టుక + ఈగెద) మొదలయిన వ్యాకరణ విరుద్ధము లైన ప్రయోగములు మఱి కొన్నియందంఁ గానవచ్చు చున్నవి. కాఁబట్టి యీ యాముక్తమాల్యద సర్వలక్షణవేత్త యయిన యల్లసాని పెద్దన విరచితము కాదనుట స్పష్టము. అంతేకాక యీపుస్త కము పెద్దనకవసమువలె మృదుపైనదియు, నల్లికగలదియుఁగాక కటుపద భూయిష్టముగా నున్నందునను పెద్దనార్యకృతము కాదని నిశ్చయింప వలసి యున్నది. అయినను కృత్యాద్యవస్థయందు వంశావళిలో పెద్దన ప్రణీత మయిన మనుచరిత్రములోని పద్యములే యిందుఁ గానఁబడు చున్నందున రెంటికిని గృతికర్త లొక్కరేయని యూహింపవలసి యుండు సని కొంద ఱందురుగాని యీయూహ సరియైనదికాదు. వంశావళిలో కృష్ణదేవరాయని జయములును గుణవర్ణనలు మాత్రమే యధికముగా నున్నందున, ఆత్మస్తుతిని దన పద్యములత్రోఁ జేసికొనుట కిష్టములేనివా డయి కృష్ణదేవరాయలు ప్రథమపురుషములను మధ్యమపురుషములనుగా మార్చి వేంకటేశ్వరుఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా మనుచరిత్రములోని పద్యములనే తన యాముక్తమాల్యదయందు వేసికొనియుండును. అయి నను విష్ణుచిత్తీయమునందు ముఖ్యముగా నయిదవ యాశ్వాస ములయందు పెద్దనపద్యములవంటి "యల్లిక జిగిబిగి" గల పద్యములును బెక్కులు కానఁబడుచున్నందునఁ గృష్ణదేవరాయలు తన యాస్థాన కవీ శ్వరులైనవారి సాహాయ్యమును స్వగ్రంథరచనమునందుఁ బొందియుం డును. ఒక్కసాహాయ్యమే యనేల? ఆ యిరువురుకవులును ముఖ్య ముగా నాంధ్రకవితాపితామహుఁ డని పేరొందిన యల్లసాని పెద్దనయు రచించిన పద్యములే పెక్కులాముక్తమాల్యదయం దున్నట్లు కానఁబడు చున్నవి. అంతమాత్రముచేత గ్రంథకర్తృత్వమును వారి కారోపించుట వలనుపడదు. గ్రంథమును రాజేచేయఁగా తదాస్థానకవులు కొన్నిపద్యము లను మార్చియు, కొన్నిపద్యములను తమవిచేర్చియు నుందురు. కృతి

కర్త కృష్ణదేవరాయలనుట కాశ్వాసాంతమునందును కృత్యాదియందును జెప్పబమటమాత్రమే కాక "పలికితు త్పేక్షోపమల" నిత్యాది పద్యములో నుదాహరింపబడిన తద్రచిత గ్రంథనామములును తత్కర్తృత్వమును స్థాపించుచున్నవి.

ఈ కృష్ణరాయలు కవిత్వమునందు సమర్థుడని యాతనికాలమునం దాముక్తమాల్యదను రచించుటకుముందే యాతని యాస్థాన కవులు చెప్పియుండుటకూడ విష్ణుచిత్తీయము కృష్ణరాయకృత మగుటను స్థిరీకరించుచున్నది. ఈరాజు కవిత్వమునందు నిపుణుడనుటను సూచించుచు రాజునుగూర్చి "కవితాప్రౌఢిణ్యఫణీశ" యను విశేషణమును పయోగించిన పారిజాతాపహరణములోని నంది తిమ్మనార్యనిపద్యము నొకదాని నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను:—

క. శ్రీ వేంకటగిరివల్లభ
సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయక కవితా
ప్రౌఢిణ్యఫణీశ కృష్ణరాయమహీశా. ఆ ర.

అక్కడక్కడ వ్యాకరణ స్ఖాలిత్యము లున్నను కటువుగానున్నను మొత్తముమీఁద విష్ణుచిత్తీయముయొక్క కవిత్వము మిక్కిలి ప్రౌఢముగాను, అర్థగాంభీర్యము కలదిగాను, అలంకార బహుళమయి స్వభావవర్ణనలు కలదిగాను ఉన్నది. అంచుచేతనే రేఫ శకటరేఫములనివిత్తమయి పెనఁగులాడిన యప్పకవివంటివాఁడు సహోత్రము యతిప్రాసముల యందు ద్విరేఫమైత్రి నంగీకరించిన యీ కవిగ్రంథమును గుణబాహుళ్యమును బట్టి లాక్షణికమైనదానినిగా నంగీకరించి తన లక్షణగ్రంథమునం చాముక్తమాల్యదనుండి పద్యములను లక్ష్యములనుగాఁ దీసికొనియున్నాఁడు.

తాసు బూర్వము దిగ్విజయయాత్రకు వెడలి బెజవాడయందుఁ గొన్నిదినములుండి కృష్ణామండలములోని శ్రీకాకుళమునందలి యాంధ్ర విష్ణుదేవుని సేవింపఁబోయిన హరివాసరమునాఁటి యాదేవుఁడు స్వప్న ములోతోఁచి వేంకటేశ్వరుని కంకితముగాఁ దెనుఁగుగ్రంథమును జేయు మనఁగా విష్ణుచిత్తీయమును రచియించినట్లు కవి తనగ్రంథమునం దీక్రింది వచనములతోఁ జెప్పియున్నాఁడు.

"...కళింగదేశవిజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్నివాసరంబులుండి శ్రీకాకుళ నికేతునుండగు నాంధ్రమధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్ర చతుర్థయామంబున.

* * * * *

కీ. తెలుఁగదేలయన్న దేశంబు తెలుఁగేను
దెలుఁగువల్లభుండఁ దెలుఁగొకొండ
యెల్లనృపులుఁ గొలువ నెలుఁగనే బా పాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

క. అంకితమో యన నీ కల
వేంకటపతి యిష్ట మైనవే ల్పగుటఁ దదీ
యాంకితము చేయు మొక్కొక
సంకేతము కా కతఁడె రస న్నేఁ గానే.

కళింగదేశ విజయయాత్ర కయి వెడలి విజయవాటి (బెజవాడ) కి వచ్చినది హూణశకము ౧౪౧౫ వ సంవత్సరమగుటచేత రాజీగ్రంథము నాసంవత్సరమునందుఁ జేయనుద్దేశించి ప్రారంభించియుండును. అయినను నుదహరించిన యుపోద్ఘాతములోని "అలుకక్ష్మోటక" ఇత్యాది పద్య మునందు వర్ణింపఁబడిన (౧౪౨౦ వ సంవత్సరమునందు జరిగిన) యేడిల్లా

నుని జయించినవర్ణన మిందుండుటనుబట్టి యీ గ్రంథము ౧౫౨౦ వ సంవత్సరమువఅకును ముగింపఁబడలేదు. ఈ పుస్తకమునందలి పద్యములు మొత్తముమీఁద శ్రుతికటువులుగా నున్నను, పెక్కు పద్యము లర్థగాంభీర్యము కలవిగా నుండుటయే కాక మృదుమధురపదగుంభిత ములైకూడ నున్నవి. కవియొక్క ప్రౌఢిమయు కవనపుణ్యమును దెలియుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను :—

మ. శయపూజాంబుజము ల్ఘటిం దడఁబడం జన్దోయి లేఁగొనుపై
దయఁదప్ప న్బసుపాడి పాగడపుఁబౌదం బొప్పఁ జెంగల్వడి
గ్గియనీ రచ్యుతమజ్జనార్థము కటిం గీలించి దివ్యప్రబం
ధయుగాస్య ల్ద)విడాంగన ల్నడుతు రుద్యానంబులోత్రోవలన్. ఆ-౧

చ. బలసిన హాల్లకచ్ఛటలపైఁ దమజుంజురుమ్రుంగ్లు రాయఁగాఁ
గలమములుండుఁ బండియెఱుగంబడి నీ రెక్కలింపఁ దృష్ణ లోఁ
దలకొన వంగి మున్ జలముఁద్రావెడు క్రిందటివేళ్ళు మీఁదట
న్నిలిపి మరందమానుకరణి స్నికటోపవనాసిలాహర్తి. ఆ-౧

మ. తరుణు ల్లల్లియొఅ న్గుచంబు లునుపం దచ్ఛత్యను ల్దీముల
పెరరేపం జనుధెంచెఁగాక రవిదీప్తిం గ్రుంకి పాతాళగ
హ్వారముం దూఱినవాని నీయదుకుత్రాళ్ళ తెచ్చునా దీర్ఘత
చ్చిరకృష్టిం గనునట్టిశైత్య మలరించె న్నూతులం దత్తఱిన్. ఆ-౨

మ. గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదము లేల లేరె యితరు ల్నీలీలకుం బాత్రముల్. ఆ-౩

ఉ. నావుడు వార లమ్మనుజనాథున కిట్లని రుబ్బి నేఁడుగా
దైవము గల్గె వేగ గురుదక్షిణగాఁ జతురర్ణవీవృతో

ర్వీవలయం బశేషమును వేఁడుము భూవర మమ్మునంఁడఁం
బ్రోవుము బాంధవా ప్తజనపోషణకంఁకెను ధర్మ మున్నదే. ఆ-3

ఉ. హెచ్చినమైత్రిఁ బద్మినుల కెల్ల ఘనాత్యయకారకుండు సొ
మ్మచ్చుపడంగఁ జేయుటకునై యలక్రొంచనగంబుపేరిక
మ్మచ్చున నీఁబ్ప శర్వగిరియందలివెండిశలాకపిండు నా
వచ్చి మరాళమాలికలు వ్రాలెఁ గొలంకులఁ జక్రఝుంకృతిన్. ఆ-ర

సే. వాతెఱ తొంటికై వడి మాట లాడదు
కుటిలవృత్తి వహించెఁ గుంతలంబు
లజ్ఞులు సిరులురా నరచూడ్కిఁ గనుఁగొనె
నాడించె బొమగొని యాననంబు
సనుగొమ ల్నెగయ నఱు ముపేక్షఁ గడకొత్తెఁ
బాణిపాదము లెఱ్ఱవాఱఁదొడఁగె

సారెకు మధ్యంబు దారిద్ర్యములె చెప్పె
నొచ్చోర్వ కిటు లోఁగఁజొచ్చె మేను

వట్టిగాంభీర్య మొక్కఁడు వెట్టుకొనియె
నాభి నానాఁటి కీగతి నాఁటిపొందు

చవుకయెనట్టి యిచ్చటఁ జనదు నిలువ
ననుచు జాఱినకరణి బాల్యంబు జాఱె. ఆ ౫

శా. సైరంధ్రు ల్వయి కెత్తి కజ్జలముఁ బక్ష్మశ్రేణికం దీర్వ వా
లారుంగన్నుల మీఁదుఁ జూచుతఱి ఘాచాంచచ్చతుర్థిసిఁ
స్పారేందుం గనె వక్త్రి మక్కనుటఁగా పర్వేందుఁ డాత్మప్రభా
చోరుండుండఁగఁదన్నుఁదద్గతవిభాచోరంబనుఁ లోకముల్ : ఆ. ౫.

చ. విను మొకమాట రాత్రిచర వేగిర మేటికి నిన్నయింతుఁ జే
యనిమిషులైన భాజనగతాన్నము నేనిఁక నెందుఁబోయెద

నెబనఁగక ప్రాణరక్షణ ముపేక్షయొనర్పుట పాప మిందు కై
కనలకు నాకు మేనియెడఁ కాంక్షయు లేదిదినోపుఁబేయురుగ్రహ: -అ. ౬.

ఉ. బాసలు బండికండ్లు మఱి ప్రాణభయంబున లక్షచేసినం
గ్రాసము కృచ్ఛ్రలబ్ధ ముడుగ న్వ్యాళమే యిది నీకచెల్లె నో
భూసురవంశ్య పుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే
పో పమకూరెడిం గులముపొత్తున దైత్యుల కెల్ల నంకత: -ఆ. ౬.

ఆముక్తమాల్యదనుబట్టియే కృష్ణదేవరాయలు విష్ణుభక్తుఁడనియు వైష్ణవ శిష్యుఁడనియు వేఱుగఁ జెప్ప నక్కఱలేకయే తెలిసికొనవచ్చును. అతఁడు విష్ణుభక్తుఁడై నను వైష్ణవశిష్యుఁగేసరుఁ డై నను, ఇతరదేవతల యంబుఁగాని యితరమతములవారియందుఁ గాని వైషమ్యము లేనివాఁడయి యుండెను. ఈ రాయలవారు విష్ణుదేవాలయములకు మాత్రమేకాక శివాలయములు మొదలైన వానికిఁగూడ భూదానములు చేసియున్నాడు. వైష్ణవమతాభిమానులను మాత్రమేకాక యితరమతావలంబులైన విద్వాంసులనుగూడ నాదరించియున్నాఁడు. ఆతని యాస్థానములో నల్ల సానిపెద్దన మొదలైన వైష్ణవమత పక్షపాతులైన కవులుమాత్రమేకాక, స్మార్తుఁడై శివభక్తుఁడైన నందితిమ్మనార్యుఁడును, కేవల శైవులైన ధూర్జటియు, మాదనగారి మల్లన్నయు మొదలైన కవులునుకూడసమ్మానమును బొందియున్నారు. అష్టదిగ్గజములని పేరొందిన యెనమండ్రు తెలుఁగుకవు లీరాజుయొక్క యాస్థానమునందుండి ప్రసిద్ధినొందిరని చెప్పుదురు. అల్లసానిపెద్దన్న, నందితిమ్మన్న, అయ్యలరాజు రామభద్రుఁడు, ధూర్జటి, మాదయ్యగారిమల్లన్న, పింగళిసూరన్న, రామరాజుభూషణుఁడు, తెనాలిరామకృష్ణుఁడు, అనెడి యెనమండ్రును అష్టదిగ్గజము లని వాడుక గలదు. కాని యిందుఁ జెప్పఁబడినవారిలోఁ గడపటి ముగ్గురును కృష్ణదేవరాయని కాలమునందున్నారో లేరో యని సందేహింపవలసి

యున్నది. మొదటి యైదుగురునుమాత్ర మాకాలమునం దున్నట్లు కొన్ని గ్రంథనిదర్శనములు కనఁబడుచున్నవి. వారిలో నల్లసాని పెద్దనార్యుఁడు తాను రచియించిన మనుచరిత్రమును, నందితిమ్మన్న తాను రచియించిన పారిజాతాపహరణమును, కృష్ణదేవరాయని కంకితములు చేసిరి. అయ్యల రాజు రామభద్రుఁడు కృష్ణదేవరాయల కాలమునందు మిక్కిలి చిన్న వాఁడై క్రొత్తఁగా గవిత్వముచెప్పుట కారంభించినవాఁడు. ఇతఁడు కృష్ణరాయలు జీవించియుండఁగాఁ నాతని యాజ్ఞాప్రకారముగా సకల కథాసారసంగ్రహము నారంభించి తరువాత ముగించెనుగాని యది రామాభ్యుదయమువలె నంత ప్రౌఢముగా నుండక వ్యాకరణదోషములు కలదిగా నున్నది. రామభద్రకవి తన్నుఁ గృష్ణరాయలు కోరుటచేత సకలకథాసారసంగ్రహమును జేసితినని వ్రాసియున్న భాగము నా గ్రంథ మునుండి యిందుదాహరించుచున్నాను :—

సీ. చినుకుపూసల నొనర్చినబి త్తరపుదండ. దండాలుగల వేల్పుతపసికొండ
కొండాటములను జిక్కు లుపన్ను జడదారి దారిగట్టులరాయు చీరుటలుగు
అలుగుడింతికి వెన్నుఁ డిలకుఁ దెచ్చినచెట్టు చెట్టుగట్టుఁగఁజేయు
చెలువతోడు
తోడుచేడెలనేలుదొరకునుదోఁబుట్టు పుట్టులిబ్బుల జేని పొందుగాఁదు
గాదుపూరిని గాంచిన కన్నతల్లి । తల్లిబిడ్డలఁ బెండ్లాడు గొల్లమనికి
మనికితముదీర్చువిలుకానిఁజెనకువిందు।విందునీకి ర్తినరసింహావిభునికృష్ణ

వ. ఇట్లు కీ ర్తివిస్తారధురంధరుండగు కృష్ణరాయ నరపాలాఖండలుండు
నన్నుఁ బిలిచి శ్రీమచ్ఛితారమణ చరణకమల పరిచరణాయమాన
మానసుండవు బహువిధ కవితా చమత్కారధుర్యుండవు సకల
పురాణేతిహాస ప్రబంధరచనాదక్షుండవు మన్మనోరథకార్య నిర్వా
హకుండవు నగుటంజేసి పురాతనమహాకవి విరచిత ప్రబంధంబు లన్వే

షించి భగవద్భక్తినిష్ఠాగరిష్ఠులగు రాజశ్రేష్ఠుల వృత్తంబులు ప్రసిద్ధంబు లగునట్లుగాఁ బ్రబంధకథలు విన్యస్తంబులుగా సమకూర్చి సాహిత్యలక్షణచిత్ర కవిత్వప్రభావంబు లొక్కొక్కచోటఁ గనంబడ రచియింపవలయునని ప్రార్థించి మతీయు నిట్లనియె.

చ. అఱవెతగుబ్బచన్వాలె బయల్వడనీకయు ఘూర్జనారంగనా
గురుకుచయుగ్మమున్వాలె నిగూఢముగాకయు నాంధ్రదేశపుం
గరితచనుంగవన్వాలె నొకానొకయించుక గానఁబించినన్
సరసులు మెత్తు రక్కవిత జాణలకుం గడురంజకం బగున్.

వ. కావున నతిమధుర రసాయన ద్రాక్షాపాకంబుగా శృంగారరసయుక్తం బగునట్లు సకలకథాసార సంగ్రహంబు గ్రంథవిస్తారంబు కాకుండ నట్లుగా రచియింపుమని యుపన్యసించిన సంతోషామృతతరంగితాంతరంగుండ నగుచున్న సమయంబున."

రాజశేఖర చరిత్రమును రచియించిన మాదయగారిమల్లన్న కృష్ణదేవరాయల కాలములో నుండి యా రాజు గోలకొండ బిజాపురపు తురక సంస్థానములను జయించినవ్వ డాతని కీర్తి వర్ణించినట్లు కుమారధూర్జటి కృష్ణరాయవిజయమునం దీక్రింది పద్యములత్రోఁ జెప్పియున్నాఁడు :—

గీ. అటులు జయలక్ష్మిఁ గైకొని యురులకరుల
హరుల ధనపంక్తులను దనపరముచేసి
వెలయు శ్రీకృష్ణరాయుల విభవగరిమ
కాంచి కన్నులపండువుగాఁగ నపుడు.

గీ. సరససాహిత్యరచనవిస్ఫురణ మెఱయ
సారమధురోక్తి మాదయగారి మల్ల
నార్యుఁ డలయల్లసాని పెద్దార్యవరుఁడు
ముక్కుతిమ్మన మొదలైన ముఖ్యకవులు.

క. వినిపించిరపుడు వారికిఁ
గనకాంబరభూషణములు ఘనత నొసఁగి యా
జనవరుఁ డప్పాజిఁ గనుం.

గొని యిట్టని పలికె నపుడు కుతుకం బలరన్. ఆ 3

ఈకుమారధూర్జటికవియే కాళహస్తి మాహాత్మ్యమును రచి యించి తనపెదతాత యైన ధూర్జటికవి కృష్ణదేవరాయలసభలోఁ బ్రసిద్ధి గాంచినట్లు కృష్ణరాయవిజయములో నీక్రింది పద్యముచేతఁ జెప్పి యున్నాఁడు—

చ. స్తుతమతి యైనయంధ్రకవి ధూర్జటిపల్కుల కేలగల్గెనో
యత్కులిత మాధురీమహిమ నా మును మీ పెదతాత చాల స
న్నుతిగనెఁ గృష్ణరాయలమనోజ్ఞసభ న్నిను మీవు నట్లు మ
త్కృతబహుమానవై ఖరులఁ గీర్తివహింపుము ధాత్రిలోపలన్ - ఆ. ౧

అష్టమహిషీకళ్యాణమును ద్విపదకావ్యముగా రచించిన తాళ్ళ పాక చిన్నన్న యనుకవి కూడ కృష్ణదేవరాయని కాలములో నున్నట్లు కొండవీటిచరిత్రములో కృష్ణరాయల దానములనుగూర్చి చెప్పిన యీ క్రిందివాక్యమువలనఁ దెలియఁవచ్చుచున్నది:—

"వినుకొండసీమలో మిన్నికల్లు తాళ్ళపాక చిన్నయ్యగారి కగ్ర హార మిచ్చెను."

"అద్దంకిసీమలో వలపర్ల అను గ్రామము తాళ్ళపాక చిన్నయ్య గారి కిచ్చెను."

వీరుగాక తక్కినకవులు కృష్ణదేవరాయల యాస్థానమునందుఁ గాని యాతనికాలమునందుగాని యున్నట్లు తోచదు. రామరాజభూషణా దులు కృష్ణరాయల యాస్థానమున దున్నట్లనేక కథలు కానఁబడు చున్నవి కాని యితరనిదర్శనములు లేక యవి విశ్వసింపఁదగినవి కావు.

ఆయా కవుల కాలమును గూర్చియు వారివారి విషయమయి చెప్పఁబడు కథలనుగూర్చియు నాయాకవుల చరిత్రములయందుఁ బ్రాయఁబడును. ఆముక్తమాల్యదయందును, మనుచరిత్రమునందును గల యేకరీతి పద్యములనుగూర్చి సహిత మిచ్చట విస్తరించి బ్రాయుట యనావశ్యకము. అయినను దృష్టాంతము చూపుటకయి యొక్క పద్యమునుమాత్ర మిందుదాహరించుచున్నాను:—

సీ. సీలమేఘముడాలు డీలుసేయఁగఁజాలు
మెఱుఁగుఁజామనచాయ మేనిఁగొడ
నవవింబమునకచ్చు లడఁగించుజిగిహెచ్చు
నాయతంబగు కన్నుదోయితోడఁ
బులుఁగురాయసి చట్టుపలవన్నె నొరవట్టు
హొంబట్టుజిలుఁగు రెంకెంబుతోడ
నుదయార్కబింబంబు నొఅపువిడంబంబు
దొరలంగ నాడుకౌస్తుభముతోడ
జయజయధ్వని మ్రోల్గి నంజలులుచేర్చు
శర్వ శతధృతి శతమన్యు శమన శరధి
పాలకై లబిలాది దేవాళితోడ
నెమటఁ బ్రత్యక్ష మయ్యె లక్ష్మీశ్వరుండు :—

మనుచరిత్ర. ఆ. ఉ.

మనుచరిత్రములయొక్క యావతవయాశ్వాసమునందు స్వారోచిష మనువు విష్ణునిగూర్చి తపస్సు చేయఁగా నతఁడు ప్రత్యక్ష మయినట్లు జెప్పఁబడిన పయిపద్యమునే దీర్ఘపాదముల నేమియు మార్పక యెత్తు గీతమునుమాత్ర మిట్లిందిరీతిగా మార్చి యాముక్తమాల్యద ప్రథమాశ్వాసమునందుఁ గృష్ణదేవరాయఁడు తనకు శ్రీకాకుళాంధ్రదేవుఁడు ప్రత్యక్షమయినట్లు చెప్పినపుట్టమునందు వేసికొనియున్నాఁడు :—

సీ. నీలమేఘముడాలు.....కౌస్తుభముతోడఁ
గీ. దమ్మి కే లుండఁ బెఱకేల దండయిచ్చు
లేము లుడిపెము భేఁజూపు లేమతోడఁ
దొల్కు దయుఁదెల్పు చిఱునవ్వుతోడఁ గలఁద
దంభ్రజలజాతుఁ డిట్లని యానతిచ్చె :—

ఆముక్తమాల్యద. ఆ ౧.

కృష్ణరాయలను గూర్చి బహుకవులు చాటుపద్యము లనేకములు కూర్చియున్నారు గాని గ్రంథవిస్తారభీతిచేత వానినన్నిటి నిందు వ్రాయక రెండుమూడు పద్యములనుమాత్రము చూపుచున్నాను :—

౧-శా. శ్రీలీలాత్మజ కృష్ణరాయ సమరోర్వీ స్నిగ్ధవైరిక్షమా
పాలు ర్వీఁగి హయాధిరూఢు లగుచుం బాఱఁ వనీశాఖిశా
ఖాల్న గాయతకేశపాశు లయి యూఁగన్ గేకిసల్లొట్టి యు
య్యాలో జొంపము లంచుఁ బాడుదురు భిల్లాంభోజప్రత్యేక్షణల్.

౨-చ. పెనిమిటి చేయుపుణ్యజనపీడనవృత్తియుఁ దండ్రిభంగముక్
దనయు ననంగభావమును దమ్మునికార్శ్యముఁ జూచి రోసి స
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణ న
వ్వనసధికన్య చేరె జితవైరిసకాయుని గృష్ణరాయనిన్.

3-చ. కాయమువంగి తా ముదిసెఁగన్నులునుం బొరగవ్వఁ గాలు వే
దాయె నటంచు రోసి నరసాధిపనందన కృష్ణరాయ యీ
భూయువతీలలామ నినుఁ బొందిన నాదిభుజంగ భర్తకుఁ
బాయనిచింతచేతఁ దలప్రాణము త్రోఁకకు రాకయుండునే ?

ఈకడపటి పద్యముయొక్క కర్తృత్వమును తెనాలిరామకృష్ణుఁడు కారోపింతురు. రాజు మాత్రమేకాక కృష్ణరాయని కొమార్తలును సంగీతసాహిత్యములయందు నిపుణురాండ్రనియు, రామరాజుభార్యయైన

మోహనాంగి యనునామె "మారీచిపరిణయ" మను నై దాశ్వాసముల శృంగారప్రబంధము రచియించెనసియు, ఒకరు వ్రాసియున్నారు గాని మా కాగ్రంథము లభింపకపోవుటచేత నిది యిట్లని నిశ్చయింపఁ జాల కున్నాము. కృష్ణరాయని యల్లుఁడయిన రామరాజు భార్యపేరు మోహనాంగి యైనట్లు సైతము గానఁబడదు. అయినను మోహనాంగి యను పేరు తిరుమలాంబకు నామాంతరమయి యుండవచ్చును.

మంత్రియైన తిమ్మరుసుయొక్క బుద్ధిబలముచేతను మంత్రశక్తి చేతను కృష్ణదేవరాయని కధికవిఖ్యాతి కలిగెనని చెప్పుదురు. ఇంటిపేరు సాళువవా రయిన ట్లనేక శిలాతామ్రశాసనములవలనను కృష్ణరాజవిజయములవలనను దెలియవచ్చుచున్నందున, ఈమంత్రిశిఖామణి క్షత్రియుఁడైనట్లు కొందఱు తలంచుచున్నారు. అయినను కృష్ణామండలములోని కొండకాపూరి దేవాలయములోని యొక శిలాచానశాసనములో మాత్ర మాతనిపేరు సాళువతిమ్మరుసయ్యంగారని వ్రాయఁబడియున్నది. అయ్యంగారని యుండుటనుబట్టి కొంద ఱాతఁడు బ్రాహ్మణుఁడని భ్రమపడినను, "సాళువ" యనఁడి యింటి పేరునుబట్టియు నితరనిదర్శనములనుబట్టియు నతఁడు బ్రాహ్మణుఁడు కాఁడనియు "అయ్యంగా" రని గౌరవార్థముగా నుపయోగింపఁబడెననియు నిశ్చయింపవలసియున్నదని స్యూయల్ దొర వారు వ్రాసియున్నారు. మాడయ్యగారి మల్లన్న యీమంత్రిశిఖామణి యల్లుఁడగునప్పామాత్యున కంకిత మొసర్చిన రాజశేఖరచరిత్రమువలన నితఁడు బ్రాహ్మణుఁడే యనియు నాఱువేలనియోగి యనియు నిస్సందేహముగాఁ దెలియవచ్చుచున్నది. ఈసాళువతిమ్మరాజు కృష్ణరాయని తండ్రి యైన నరసింహరాజుతమ్ముఁడని కొందఱు చెప్పిరి. ఈసంగతి యథార్థము కాకపోయినను, అతఁడు నృసింహరాయని యొద్ద మంత్రిగా నుండెను. ఈర్ష్యచేత నృసింహరాయని పట్టమహిషి సవతికొడుకైన కృష్ణదేవరాయనిఁ జంపింప యత్నించినప్పు డాతనిని దనయొద్ద నుంచు

కొని కాపాడిన దీసాళువ తిమ్మరుసే. ఈహేతువునుబట్టియే కృష్ణదేవ రాయలు తిమ్మరుసు నప్పాజీ యని పిలుచుచుండుటయు సుప్రసిద్ధము. ఈమంత్రిశిరోమణి ౧౫౧౪ వ సంవత్సరమునందు రాజు కొండవీటి మీఁదికి దండెత్తినప్పుడు తాను సేనాపతిగానుండి సేనలను నడిపి కొండ వీటిదుర్గమును జయించెను. ఈతఁడు కృష్ణదేవరాయలకంటె మూఁడు సంవత్సరములు ముందుగా ననఁగా హూణశకము ౧౫౩౭ వ సంవత్స రమునందు మృతినొందెను. తిమ్మరుసు బ్రాహ్మణుఁడనియు చిన్నతన ములో మిక్కిలి బీదవాఁడయి విద్యలేక తిరుగుచుండెననియు చెప్పెడు కథ యొకటి కొంతకాలమునుండి పరంపరగా వచ్చుచున్నది. ఆకథ యొక్క సత్య మెట్టి దయినను వినువారికి వినోదకరముగా నుండునని యెంచి యిందు సంగ్రహముగా వ్రాయుచున్నాను:—

"తిమ్మరుసు నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు బాల్యమునందే తల్లిదండ్రులను బోఁగొట్టుకొని నిరాధారుఁడై చదువును సంధ్యయులేక తిరుపతి సమీపమున పసులఁగాచి బ్రతుకుచు, పిమ్మట గుత్తికిఁబోయి యచ్చటఁ బుల్లెలుకుట్టి కొంతకాలము జీవించి, తరువాత చంద్రగిరిలోఁ గొంతకాలము మాధుకరవృత్తిచే దినములుపుచ్చి, అనంతరము పెను గొండలో సత్రములో నుద్యోగము సంపాదించి తద్దుర్గాధీశ్వరుని తాంబూలపుతిత్తులు మోచి తదనుగ్రహమువలనఁ గ్రమక్రమముగా వృద్ధినొంది గొప్పయుద్యోగములు సంపాదించి, కడపట తనబుద్ధిబలము వలన మంత్రిపదమును బొందెను. ఇతఁడు చిన్నతనములో తిరుపతి సమీపమునఁ బసులను గాచుచు బడలి యొకనాఁటి మధ్యాహ్నసమ యమున నొకచెట్టునీడను విశ్రమించెను. అంతట సూర్యుఁడు పశ్చిమ మున వ్రాలుటచే సూర్యకిరణము లాతని మీఁదఁబడినను మెలఁకువ రాక యతఁడు మైమఱచి గాఢనిద్రను పొందుచుండుటఁ చూచి యొక కృష్ణసర్పము చేరవచ్చి తనఫణమువిచ్చి యూచిన్నవాని ముఖమున

కెండ సోకకుండ గొడుగువలె నడ్డమునుపెట్టెను. ఈయద్భుతచర్య నప్పుడు దారిపట్టిపోవుచున్న బట్టుమూర్తి యనుబ్రాహ్మణుడు చూచి యీతఁడు శీఘ్రకాలములోనే మహైశ్వర్యవంతుఁడు కాఁగలఁడని తెలిసికొని, సమీపమునకుఁ బోఁగా సర్వమాతనిసి విడిచి పాఱిపోయెను. ఆబ్రాహ్మణుఁడు తరువాత నాచిన్నవాఁడు మేలొక్కనువఅకును వేచియుండి లేచినతరువాత "అయ్యా! నీకచిరకాలములోనే గొప్పయైశ్వర్యము పట్టును. అప్పుడు నన్ను మఱచిపోకుము' అని చెప్పి సెలవుగైకొని స్వగ్రామమునకుఁ బోయెను. అటుపిమ్మట తిమ్మరుసు పయిని జెప్పినరీతిని క్రమక్రమముగా వృద్ధినొంది విద్యాబుద్ధులు సంపాదించి కొంతకాలమునకు మంత్రిపదము నొందెను. అప్పుడు బట్టుమూర్తి తిమ్మరుసుదర్శనార్థముపోయి యతఁడు తగినంత యాదరముచూపి గౌరవింపక యుపేక్షించుటచూచి,

శా. గుత్తిం బుల్లెలు కుట్టి, చంద్రగిరిలోఁ గూడెత్తి, పెన్గొండలో
హత్తిన్నత్రమునందు వేఁడి, బలుదుర్గాధీశు తాంబూలపుం
దిత్తు లొగ్గిసి, పదస్థులైన ఘనులఁ దీవించ

అనునంతవఱకుఁ బద్యము చెప్పినప్పటికి భయపడి తిమ్మరుసు తనకుఁ గృష్ణదేవరాయలు పట్టాభిషేకమహోత్సవసమయమునఁ దిచ్చిన పచ్చలపతకమును బట్టుమూర్తి మెడనువేసెను. అదియందుకొని యాబట్టు తక్కిన పద్యభాగము నీరీతిని పూరించెను—

.....దీవించెదన్

మత్తారాతియయూతి నాగమసుతు న్మంత్రీశ్వరుం దిమ్మనన్.

అని చదివి యప్పుడే యీక్రింది పద్యమును గూడఁ జెప్పెను:—

క. అయ్య వనిపించుకొంటివి। నెయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా నీసరియేరీ। తియ్యనివిలుకాఁడవయ్య తిమ్మరుసయ్యా.

అట్లు గారుత్మతహారమును బట్టుట కిచ్చుటచే నాప్రధానచంద్రుఁడు "బట్టుమూర్తికిఁ గినుకఁ బెట్టింపఁ బచ్చలహార మర్పించెఁ దిమ్మరుసుమాత్యు" యని ప్రసిద్ధిఁగాంచెను.

ఈతనికిని బట్టుమూర్తికిని గల కాలవ్యత్యాసమునుబట్టి కూడఁ బయికథ విశ్వాసార్హ మయినదికాదు. కృష్ణదేవరాయనికిఁ బుత్రసంతా నము లేనట్లు యనేక స్థలములయందుఁ జెప్పఁబడియున్నది. అచ్యుత దేవరాయలే కృష్ణదేవరాయని పుత్రుఁడని యొక చోటను, సదాశివ దేవరాయలు కృష్ణదేవరాయని పుత్రుఁడని యొకచోటను, చెప్పఁబడెను గాని వానిసత్యమునుగూర్చి యింకను సందేహింపవలసియున్నది. కృష్ణ దేవరాయని మరణకాలమునం దాతని కిద్దఱుకొమార్తలుండిరి. వారికప్ప టికి వివాహముకాలేదు. తరువాత తిరుమలదేవికొమార్తైను రామరాజును చిన్నాదేవికొమార్తైను దదనుజుఁడైన తిరుమలదేవరాయఁడును పరిణయ మైరి. ఇట్లు కర్ణాటరాజ్యమును మహోచ్చదశయందుంచి కృష్ణదేవ రాయలు శుక్లసంవత్సర వైశాఖమాసము మొదలుకొని విక్రతిసంవత్స రము వఱకును ఇరువదియొక్క సంవత్సరములు రాజ్యముచేసి హూణ శకము ౧౫౩౦ వ సంవత్సరమునందుఁ గీర్తిశేషుఁడయ్యెను. అచ్యుతదేవ రాయ లా సంవత్సరమున రాజ్యమునకువచ్చి, పండ్రెండుసంవత్సరములు పరిపాలనముచేసి, తిరుణపల్లి మొదలైన దేశములను జయించి పరలోక గతుఁడయ్యెను.

---

2. అల్లసాని పెద్దన్న

అల్లసాని పెద్దనార్యుఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; చొక్కనామాత్యుని పుత్రుఁడు; బళ్లారి ప్రాంతములయందున్న దూపాడు పరగణాలోని దొరాలగ్రామ మీతని జన్మస్థలము; కృష్ణదేవరాయల యాస్థానకవీశ్వరులలోనెల్ల నితఁడు ముఖ్యుఁడు. ఈతఁడు కృష్ణదేవ రాయల యనంతరమునఁగూడ కొంతకాలము జీవించియుండుటచేత, ఇంచుమించుగా ౧౫౩౪ వ సంవత్సరము వఱకును బ్రతికియుండెనని చెప్ప వచ్చును. కృష్ణరాయలు మృతి నొందినతరువాత నీతఁడు చెప్పిన జాలిని పుట్టించెడి యీ క్రింది పద్యమీతఁడు రాయలయనంతరమున జీవించి యున్నట్టు తెలుపుచున్నది :—

సీ. ఎదురై నచోఁ దన మదకరీంద్రము డిగ్గి
కే లూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేగఁ
బల్లకి తనకేలఁ బట్టియె వ్రే
బిరుదైన కవిగండ పెండేరమున కీవె
తగు దని తా నె పాదమునఁ దొడిగెఁ
గోకటగ్రామా ద్యనే కాగ్రహారము
లడిగినసీమలయందు నిచ్చె
నాంధ్రకవితాపితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలత్తో దివి కేగలేక
బ్రతికియుండితి జీవచ్ఛవంబ నగుచు.

అంత్తేకాక కృష్ణదేవరాయలు లోకాంతరగతుఁడు కాఁగానే కట కముఁడు గజపతి దండెత్తివచ్చినట్లును, అల్లసాని పెద్దన యీ క్రింది

పద్యమును వ్రాసిపంపఁగా నతఁడు సిగ్గుపడి మురలిపోయినట్టును జెప్పు చున్నారు :—

సీ. రాయరావుతుగండరాచయేనుఁగువచ్చి
యారట్లకోటఁ గోరామనాఁడు
సంపెటనరపాలసార్వభౌముఁడువచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
సెలగోలుసింహాంబు చేరి ధిక్కృతిఁ గంచు
తల్పులఁ గరుల డీకొల్పునాఁడు
ఘసతరనిర్భరగండపెండెర మిచ్చి
కూఁతు రాయలకును గూర్చునాఁడు
నొడ లెఱుంగవో చచ్చితో యుర్వి లేవో
చేఁజాలక తల చెడి జీర్ణమైతో
కన్నడం బెట్లుచొచ్చెదు గజపతీంద్ర
తెఱచినిలుకుకుక్క చొచ్చిన తెఱఁగుతోఁప.

ఈ కవి రాజునొద్ద మిక్కిలి గౌరవముపొందినవాఁడయి, రాజు చెప్పుమన్నప్పుడు గాక తనయిష్టమువచ్చినప్పుడు మాత్రమే కవిత్వము చెప్పు స్వాతంత్ర్యము గలవాఁడనియు, రాజొకనాఁడు కృతి చెప్పుమని వేఁడఁగా నతఁడు చెప్పక యీ క్రింది పద్యమును జెప్పెననియు వాడుక గలదు :—

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడె మాత్మ కిం పయినభోజన ముయ్యెలమంచ మొప్పుత
ప్పురయురసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకినఁగాక యూరక కృతు ల్రచియింపుమటన్న శక్యమే?

ఈ కవియే కవిత్వ ముండవలసిన రీతినిగూర్చి యీ క్రింది పద్యమును గూర్చెనని చెప్పుదురు :—

చ. ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యురచాటగునాంధ్రవధూటిచొక్కపుం
జనుఁగవలీల గూఢతయుఁ జాటుతనంబును లేకయుండఁ జె
ప్పినయదెపో కవిత్వ మసిపించు నగిం చటుగాక యుండినన్.

ఈపద్యము వేంకటనాథకవికృత మగు పంచతంత్రమునందుఁ గానఁబడుచున్నది. పెద్దనార్యుఁడు సంస్కృతాంధ్రములయం దసమాన సాహిత్యము గలవాఁడు. ఇతఁ డొకనాఁడు కృష్ణదేవరాయలయాస్థాన ములో సకలకవీశ్వరులు నుండఁగా రాజు కోరికమీఁద నుభయభాషా పాండిత్యము వెల్లడి యగునట్లుగా నొక యుత్పలమాలిక నాశుకవిత్వ ముగాఁ జెప్పి సభవారినందఱిని మెప్పించి కాలికి బిరుదండె వేసికొన్న వాఁడు. రాజు కవిగండపెండేరమును బసిఁడిపల్లెరమున నునిచి, సంస్కృ తాంధ్రములందు సమానముగా కవిత్వము చెప్పఁగలవారు దీసిని ధరింప నర్హులని పలికినప్పుడు పెద్దనార్యుఁడు లేచి యీక్రింది యుత్పలమాలి కను జదువఁగా రాజు మెచ్చి తానే యీకవిగండపెండేరమును కవిపాద మునఁ దొడిగెనఁట—

ఉ. పూఁతమెఱుంగుఱుక బసరుపూపబెడంగులుఁ చూపునట్టివా
కైతలు జగ్గుసిగ్గు నెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెఁ
రాతిరియున్ బవల్ మఱపురాఁహాయల్ చెలియూరజాపుని.
ద్రాతరితీపులంబలెను దారసిలన్వలె లోఁదలంచినన్
బాతిగఁ బైకొనన్వలెను బైదలి యత్తుకలోనిపల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు రానలె నాలకించినన్
జేతికొలందిఁ గౌఁగిటను జేర్చినఁ గన్నియచిన్నిపొన్నిమే
ల్మోఁతలచన్నుదోయివలె ముచ్చట గావలెఁ బట్టిచూచినన్
డాతొడనున్న మిన్నలమిటారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచనిగావలెఁ బంట నూఁదినన్

గాతలఁ దమ్మిచూలిదొరకై నసపుంజవరాలి సిబ్బెపు
న్నే తెలియబ్బురంపుజిగినిబ్బరపుబ్బగుగబ్బిగుబ్బపొం
బూఁతలనున్న కాయసరిపోఁడిమి కిన్నెర మెట్లబంతి సం
గాతపు సన్నబంతి బయకారపుఁ గన్నడగౌళవంతుకా
సాతత తానతానల పసం దివుటాడెఁ గోటమీటు బల్
మ్రోఁతలునుం బలెక హారువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతం బుపచరించినపట్టున భారతీవధూ
టీ తపనీయ గర్భనికటీభవదానన పర్వసాహితీ
భాతికనాటకప్రకరభారతభారత సమ్మతిప్రభా
శీతనగాత్మజా గిరిశ శేఖర శీతమయూఖ రేఖికా
పాతసుధాప్రపూర బహుభంగ ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మ లయసంగతి మంచువిపంచికామృదం
గాతత తేహిత త్రిహిత హృధిత డ్ంధణు ధ్ాణుదింధిమి
వ్రాత సయానుకూలపద వారకుహూద్వహ హారికింకిణీ
నూతన ఘుల్ఘులాచరణ నూపుర ఝూళఝుళీమరంద సం
ఘాతవియద్ధునీ చకచకద్విక చోత్పల సారసంగ్రహా
యాతకుమారగంధవహ హారిసుగంధ విలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లునఁ జల్లవలె న్మనోహర
ద్యోతక గోస్తనీఫల మధుద్రవ గోఘృత పాయసప్రసా
రాతి రసప్రసార రుచిరప్రతిమంబుగ సారెసారెకున్.

పెద్దనార్యుఁడు హరికథాసారము, స్వారోచిషమనుచరిత్రము మొదలైన పెక్కుగ్రంథములను రచియించెను. వానిలోనెల్ల మనుచరిత్రము మిక్కిలి ప్రసిద్ధమై యెల్లయెడల వ్యాపించి యున్నది. ఈయనకుం బూర్వమునం దున్నకవు లెవ్వరును స్వకల్పనమును విశేషముగాఁ జేర్చి ప్రబంధములను రచియించి యుండలేదు. వారు పురాణేతిహాసాదులను

మాత్రము తెనిఁగించిరి. ఈతఁడే మార్కండేయ పురాణమునుండి స్వారోచిష మనుసంభవ కథను గైకొని పెంచి స్వకపోలకల్పనత్తో మొట్ట మొదట మనుచరిత్రమును ప్రబంధరూపమున రచియించిన కవి యగుట చేత నీతని కాంధ్రకవితాపితామహుఁ డన్న బిరుదనామము కలిగినది. ఈతనికాలము మొదలుకొని రామరాజభూషణుఁడు వసుచరిత్రము చేయు నంతకును గల కవులందఱును జూలవఱకుఁ దమ ప్రబంధములను మను చరిత్రరీతినే చేసిరి. ఈ కవి జన్మముచేత స్మార్తుఁడే యయినను, నడుమ వైష్ణవము పుచ్చుకొని వైష్ణవాగ్రేసరుఁడయి విష్ణ్వాలయములకు భూదానములను జేసెను. ఈ విషయమే మెకంజీ దొరవారు సంపాదించి యుంచిన రాజకీయప్రాచ్యలేఖపుస్తక భాండాగారమునందలి వ్రాఁతపుస్తకములయందుఁ దెలుపఁబడియున్నది. అందున్న కోకటాగ్రహారమును గూర్చిన యంశము నిందు క్రింద వ్రాయుచున్నాను—

"అల్లసాని పెద్దయ్యంగారు బ్రాహ్మణుఁడు, నందవరీకుఁడు, చొక్కరాజుగారి కొమారుఁడు. కోకటగ్రామమును శ్రీకృష్ణదేవరాయలవారీ కపేశ్వరుని కియ్యఁగా, అతఁడు వైష్ణవము పుచ్చుకొని యీ గ్రామము శ్రీవైష్ణవుల కగ్రహారము చేసియిచ్చెను. అప్పుడు దానికి పెట్టినక్రొత్తపేరు శఠగోపపురము. ఈ కవి శాలివాహనశకనవ్వములు గరళం బహుధాన్యసంవత్సర వైశాఖశుద్ధ గుఱలు నాఁడు ఈ గ్రామమునందుండు సకలేశ్వరస్వామికి నైవేద్య దీపారాధనలకై రెండు పుట్లచేను ధారపోసియిచ్చి సదరు దేవాలయములో శిలాశాసనము వేయించినాఁడు. పయిసంవత్సరము కార్తికశుద్ధ గుఅశి నాఁడు చన్నకేశవస్వామికి నాలుగున్నర పుట్లభూమి ధారపోసి శాసనము వేయించినాఁడు.....కృష్ణదేవరాయలతర్వాత సదాశివదేవరాయల కాలములోను, రామరాయలకాలములోను, నంద్యాలరాజైన మట్లఅనంతరాజు కాలములోను కోకటాగ్రహారము బ్రాహ్మణులకుఁ జెల్లెను."

ఈకవి కోకటాగ్రహారమునకు శరగోపపురమని పేరు పెట్టుటయే కాక తన మనుచరిత్రములోను హరికథాసారములోనుగూడ శరగోప యతిని దనగురువునుగా స్తుతించి యున్నాఁడు—

క. కొలుతు న్మగ్గురు విద్యా
నిలయుం గరుణాకటాక్షు నిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శరగోపయతిన్.

మనుచరిత్ర.

క. శరగోపయతికి శరతరు
కుఠారకోపమమతికిని గురుమతహృ త్క
ర్మశరనిరతికిఁ జతురాగమ
పథనాయతనియతికి నజపాసంభృతికిన్.

హరికథాసారము.

లక్షణగ్రంథములయం దక్కడక్కడ నుదాహరింపఁబడిన పద్యములు లభించుటయేకాని హరికథాసారము పూర్ణముగా దొరికినదికాదు. హరికథాసారములోని యీరెండు పద్యములును రంగరాట్ఛందస్సునం దుదాహరింపఁబడి యున్నవి—

క. అంబరముపగుల నార్చి ప్ర
లంబాసురుఁ డాగ్రహము వెలయఁ గదిరినవే
ళ బలరాముఁడు చేముస
లంబున వానితలఁ ద్రుంచె లావు మెఱయఁగన్.

హరికథాసారము. ఆ. ౪.

క. తెంపరియై మది యింత చ
లింపక యునిలోనఁదెగియె నెవ్వఁ డతఁడు నై
లింప సభ నుండు ననుడుఁ బ
దంపడి యాచార్యుతోడఁ దా ని ట్లనియెన్.

హరికథాసారము.

ఈకవియే మొట్టమొదటఁ దెలుఁగు గ్రంథములలో తురక మాటలు లోనగు నన్యభాషాపదములను స్వేచ్ఛముగాఁ బ్రయోగింప నారంభించినాఁడు. ఆంధ్రకవితాపితామహుని యీక్రింది చాటుపద్య ములోఁ దురుష్కభాషావాక్యమే వేయఁబడినది.

మ. సమరక్షోణిని కృష్ణరాయలభుజాశౌర్యాసిచేఁ బడ్డ దు
ర్దమదోర్దండపుళిందకోటియవసవ్రాతంబు సప్తాశ్వ మా
ర్గమునం గాంచి శబాసహైూ హరిహరంగాఖూబు ఖోడాకి తే
తుముకీబాయిల బాయిదేమలికియందు ర్మింటికెం బోవుచుఁ.

ఈతని జూచి యాకాలమునందలి యితరకవులును దమచాటు పద్యములలోను గ్రంథములలోను యవనభాషావాక్యాదులను జొప్పిం చిరి. అట్టివారిలో నొకఁడగు నందితిమ్మన్న యొకచాటుపద్యములో-

శా. రాయగ్రామణి కృష్ణరాయ భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయం బూడ్చి కళింగదేశనృపతుల్ కానిర్ఘుఁరీపోషణీ
మాయాభీకుముటూకులోటుకుహుటూ మాయాసటా జాహచే
మాయాగ్నేయ మడే యటంద్రు దివి రంభాజారునిన్ యట్టునిన్.

అని చెప్పియున్నాఁడు. ఈలాగుననే పెద్దనార్యుఁడు గ్రంథము లలో నన్యభాషాపదములను ప్రయోగించినందుకు మనుచరిత్రలోని యీక్రిందిపద్యమును దృష్టాంతముగాఁ జూపవచ్చును—

సీ. పచ్చనిహరుమంజిపనివాగెపక్కెర పారసిపల్లంబు పట్టమయము
రాణ నొప్పారు పైఠాణంబుసింగిణి తళుకులకోరీలతరకసంబు
మిహి పసిండిపరుంజు మొహదాకెలంకుల తావుగుజ్జరివన్నెకేవడంబు
డాకెలంకునసిరాజీకరాచురకత్తి కుఱఁగటఁ గ్రొవ్వాడి గొఱికలపొది
పీలికుంచె తలాటంబు పేరొజంబు
మణుల మొగమ్మట్టుఁ బన్ని సాహిణియొకండు

కర్తయెమటికిఁ గొనివచ్చె గంధవాహ
బాంధవం బగునమ్మహాసైంధవంబు.

మనుచరిత్రము. ఆ. శ.

ఈయనను జూచి యాకాలపువాఁ డయిన భూర్జటికవియుఁ దన కాళహస్తిమాహాత్మ్యమునం దీక్రిందిరీతి పద్యములం దన్యభాషాపదములు చేర్చి కూర్చినాఁడు—

సి. బిజమాడుదేవర నిజకృపామహిమఁ జెన్నారునాయిల్లు బిడారునీకు
నాకునీపాదార్చనముసేయనడలింగమూర్తి చేకుఱవచ్చిమూర్తమాడి
యొడయచిత్తేశ నాయునికి నీమజ్జనమాడు శివార్చన మాడుబేకు
విచ్చేయుఁ డిది బూదివీడియం బందుకో జంగమస్వామి నాసదనమునకు
నోగిరంబులు మంచిమే లోగిరమున
నావటించెదఁ బదుఁడు మీ రారగింపఁ
బ్రతిదినంబును జంగమార్చనము లేక
దనువు వడనోల్ల రూపకందర్ప యనఁగ.

కాళహస్తిమాహాత్మ్యము.

ఈయన మనుచరిత్రమునుగూర్చి వ్రాయుచు నొకరు "కొన్ని యెడల నైషధమార్కండేయ పురాణములయందలి వాక్యములకును నందలి వాక్యములకును సుంతయేనియు భేదమగపడక" యున్నదని యించుక దోషారోపణము చేసియున్నారు. మార్కండేయ పురాణము నందు విపులముగాఁ జెప్పఁబడిన స్వాయోచిషమను సంభవకథనే గ్రహించి మారన తెనిఁగించిన యా పురాణమును జదివియే పెద్దన మనుచరిత్రమును రచియించినందున నందలి కొన్ని వాక్యము లిందుఁ బడియున్నవి. అంతేకాక యా కవి శ్రీనాథుని కవిత్వమునం దత్యాదరము కలవాఁడయియున్నట్లీతని గ్రంథశతనమువలన స్పష్టముగాఁ గానవచ్చుచున్నది. మొట్ట మొదట తెనుఁగు కవిత్వమునందు సాంస్కృతిక దీర్ఘసమాసములను

విస్తారముగా నుపయోగించినవాఁడు శ్రీనాథుఁడు. ఆతని కవనరచనయం దత్యాదరము కలవాఁడయి పెద్దన యాతని గ్రంథములను బలుమాఱు చదివి యొక్క చతుర్థాశ్వాసమునుదక్కఁ దక్కినపుస్తకము నంతను ఆతనివలెనే సంస్కృతపద భూయిష్ఠముగా రచియించి యుండుటచేత శ్రీనాథుఁడుపయోగించిన వాక్యములును గొన్ని మనుచరిత్రమునందుఁ బడినవి. అంతిమాత్రముచేత నీతనియందు గ్రంథచౌర్యము నారోపించుట న్యాయముకాదు. ఈతఁడొక్కఁడు మాత్రమేకాక యిటీనటి కవులనేకులు కొన్నిచోట్ల పూర్వకవుల వాక్యములను దమకబ్బములయందుఁ జొప్పించియున్నారు. మఱియు నల్లసాని పెద్దనార్యుఁడు శ్రీనాథుని నైషధమునుండి కొన్ని వాక్యములను గ్రహించుటయేకాక యాతని పద్యములను జదివి యారీతి పద్యములనే పెక్కింటిని మనుచరిత్రమునందుఁ గూర్చియున్నాఁడు. అందుకు నిదర్శనముగా నొకటి రెండుపద్యముల నిందుఁ జూపుచున్నాను :—

సీ. నలినసంభవువాహనమువారువంబులు
కులమునాములు మాకుఁ గునలయాఁటి
చదలేటి బంగారుజలరుహంబులతూండ్లు
భోజనంబులు మాకుఁ బువ్వుఁబోఁడి
సత్యలోకముదాఁక సకలలోకంబులు
నాటపట్టులు మాకు నబ్జవదన
మధురాక్షరము లైనమాటల వినంగ
నమృతాంధసులు యోగ్య లనుపమాంగి
భారతీదేవి ముంజేతి పలుకుచిలుక
నమదగజయాన సద్బ్రహ్మచారి మాకు
వేదశాస్త్ర పురాణాదివిద్య లెల్లఁ
దరుణి నీయాన ఘంటాపథంబు మాకు—

శృంగారనైషధము. ఆ. ౩.

సీ. చిన్ని వెన్నెలకంపు వెన్నుఁదన్ని సుధాబ్ధిఁ
బొడమినచెలువ తోఁబుట్టు మాకు
రహిపుట్ట జంత్రగాత్రముల ఆల్గరఁగించు
విమలగాంధర్వంబు విద్య మాకు
వనవిల్తుశాస్త్రంబు మినుకు లావర్తించు
పని వెన్నెతోడఁ బెట్టినది మాకు
హయమేధ రాజసూయము లనఁ బేర్పడ్డ
సవనతంత్రంబు లుంకువలు మాకు

గనకనగసీమఁ గల్పవృక్షములనీడఁ
బచ్చరాగట్టుగమి రచ్చపట్టుమాకుఁ
పద్మసంభవవైకుంఠ భర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర—

మనుచరిత్రము. ఆ. ౨.

ఉ. వానిఁ బ్రశంసచేయఁ దగు వాఁడు కృతార్థతముండు వానిచే
నీనిఖలంబు పావన మహీనకృపావిభవం బెఱర్ప నె
వ్వానిగృహాంగణంబునకు వచ్చినత్రోవరజంబులందు నీ
మానితపాదయుగ్మక మమద్భుఁ బ్రఫుల్లసరోజదామమున్—

నైషధ. ఆ. ౩.

ఉ. వానిది భాగ్యవైభవము వానిది పుణ్యవిశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిదెజన్మము వేరుసేయ కే
వ్వానిగృహాంతరంబున భవాదృశయోగిజనంబు పావన
స్నానవిధాన్నపానముల సంతస మొంపుచుఁ బోవు నిచ్చలున్—

మను. ఆ. ౧.

ఇట్టివాని నింకను బెక్కులు చూపవచ్చును. పెద్దన చెప్పిన పద్యములను గొన్నిటిని తెనాలి రామలింగకవి యాక్షేపించినట్లు కొన్ని

కథలు గలవుగాని యవి విశ్వాసార్హములు గావు. అయినను దీనిం జదువు వారికి వినోదకరముగా నుండవచ్చునని యెంచి యందొక పద్యమును దానిమీఁది యాక్షేపణమును నిందుదాహరించు చున్నాను :—

క. కలనాఁటిధనము లక్కఱ
గలనాఁటికి దాఁచఁ గమలగర్భనివశమా
నెలనడిమినాఁటివెన్నెల
యలవడునే గాడెఁబోయ నమవసనిసికిఁ.

అనుపద్యమును పెద్దన రచియింపఁగా నందలి "యమవసనిసి" యన్నప్రయోగము నవ ప్రయోగమునుగా భావించి రామకృష్ణకవి యప భ్రంశపదములతోఁ గూడిన యీక్రిందిపద్యముచేత నాతని నాక్షేపించి యున్నాఁడని చెప్పుచున్నారు :—

క. ఎమితిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁ దిని సెపిత్రో
యుమెతక్కయ దిసి సెపిత్రో
యమవసనిసి యన్నమాట యలసని పెదనా.

"అమవసనిసి" యన్నమాట తప్పు కాకపోవుటచేతను, రామ కృష్ణకవి యలసానిపెద్దన కాలములో నున్నవాఁడు కాకపోవుటచేతను. ఈకథ కేవలకల్పితమే కాని యిందు సత్య మెంతమాత్రమును లేదు. కృష్ణదేవరాయల యాస్థానమునకు వచ్చిన విద్వత్కవీశ్వరులను బరీక్షించు టకయి యాంధ్రకవితాపితామహుఁడై నియమింపఁబడుచు వచ్చెననియు, అతఁ డావచ్చిన కవీశ్వరులకు నానావిధము లయిన సమస్యలనిచ్చి వారు పూరించిన పద్యపూరణములనుబట్టి వారి సామర్థ్యమునను నిర్ణయించుచు వచ్చెననియు జనశ్రుతి గలదు. ఒకనాఁడు రాధామాధవుఁ డనుకవి తదాస్థానమునకు వచ్చినప్పుడు పరీక్షార్థముగా పెద్దన్న 'నగరు' 'తగరు' 'తొగరు' 'వగరు' అను పదములు ప్రాసస్థానములందుంచి రామాయణ పరముగాఁ బద్యమును గూర్పు మనఁగా నాకవి యిట్లు చెప్పెనఁట :—

చ. నగరు పగాయె నింక విపినంబుల కేగుఁడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార యని తల్లి వగ ల్మిగులంగఁ దోఁపఁగాఁ
దొగరున రక్షఁగట్టి మదిఁ దోచక గద్గదఖిన్నకంఠయై
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్.

అని చెప్పఁగా సంతోషించి యీప్రాసములతోనే భారత భాగ వతపరముగాఁగూడఁ బద్యములను రచింపు మని యడుగఁగా నాకవీశ్వ రుఁడు వరుసగా నీక్రింది రెండు పద్యములను జెప్పి తనప్రావీణ్యమును జూపెనఁట.-

చ. తొగరుచి కన్నుదోయిఁ గడుఁదోచఁగఁ గర్ణుఁడు భీమసేనుపైఁ
దగరు ధరాధరంబుపయిఁ దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా
వగరుచుచుఁ వెసం జరుగువాఁడిన నచ్చటిరాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁజేసి ధరాతలేశ్వరా.

చ. వగరుపుమాత్రమే వరుఁడు వశ్యుఁడుకాఁడు సఖీసఖత్వ మె
న్న గరుడవాహనుండు మము నాఁ డటు డించుటయెల్ల నుద్ధవా
తగ రని కాక మోహపులతాతనువై న విడంగఁ జూతురే
తొగరుచి యోషశీశునకుఁ దోఁపఁగఁజేయునె వీడనాడఁగన్.

అల్లసానిపెద్దన్నది మృగుశైలి; కవిత్వము సలక్షణముగాను మధురముగాను నుండును. ఈవిషయమునే కృష్ణరాయలు "కృతి రచింపుమీ మాకు శిరీషకుసుమపేశల సుధామయోక్తులఁ బెద్దనార్య" యన్న వాక్యము బోధించుచున్నది. మనుచరిత్రము శృంగారరస ప్రధానమయి నడిగా నున్నది. ఆగ్రంథము సాధారణముగా సంస్కృతపద భూయిష్ట ముగా నున్నను, కొన్నిచోట్ల మనోహరముగా సంస్కృతాంధ్రపద ములు రెండును సమానముగాఁ గలిసినదిగాను నాలవయాశ్వాసము కేవలాంధ్రపదభూయిష్టమైనదిగాను నున్నది. ఈతని కవిత్వమునందలి పదవాక్యజటిలత్వమునుబట్టి "యల్లసానివాని యల్లిక బిగియును" అను

ప్రసిద్ధి వచ్చినది. ఈయన కవితారీతిని దెలుపుట కయి మనుచరిత్రము నుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. అటఁజని కాంచె భూమిసురుఁ డంబరచుంబిశిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠదభంగతరంగమృదంగనిస్వన
స్ఫుటనటనానుయాహపరిఫుల్ల కలాపకలాపిజాలమున్
గటకచరత్కరేణుకరకంపితసాలము శీతశైలమున్. ఆ. ఎ.

మ. అకలంకౌషధసత్త్వముం దెలియ మాయా ద్వార కాపంతి కా
శి కురుక్షేత్ర గయా ప్రయాగముల నే సేవింప కుద్దండ గం
డక వేదండ వరాహ వాహరిపు ఖడ్గవ్యాఘ్రు మిమ్మంచుఁ గొం
డకు రాఁజెల్లునె బుద్ధిజాడ్యజనితోన్మాదుల్గదా శ్రోత్రియుల్. ఆ.ఎ.

ఉ. ఎక్కడియూరు కాల్మలువ కింటికిఁ బోయెదనంచుఁ బల్కె దీ
వక్కడి మీఁగుటీరనిలయంబులకు న్సరిరాకపోయెనే
యిక్కడిరత్నకందరము లిక్కడినందనచందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడియాలవలీనికుంజముల్. ఆ. ఎ.

ఉ. చేసితిజన్నముల్ తపముఁ జేసితి నంటి దయావిహీనతం
జేసినపుణ్యము ల్పలముఁ జెందునె పుణ్యము లెన్ని యేనియుం
జేసినవాని సద్గతియె చేకుఱు భూతదయార్ద్రబుద్ధి నో
భూసురవర్య యింత తలపోయవు నీచను వేల చెప్పుమా. ఆ. ఎ.

ఉ. ఎంతతపంబు చేసి జనియించినవాఁగొఱ్ఱో మర్త్యభామినుల్
కాంతుఁ డవజ్ఞఁ జేసినను గాయముఁ బాయుదు రే నమర్త్యనై
చింతలవంతలం జివికి సిగ్గరితి న్మృతిలేనినాదుచె
ల్వింతయు శూన్యగేహమున కెత్తినదీపిక యయ్యె నక్కటా. ఆ. 3.

ఉ. ఓయి దయావిహీనమతి యూరక యీపసిబిడ్డఁ గొట్టఁగాఁ
జే యెటులాడె నీకు నిది చేసిన దేమి వృథాశపింతురే

బోయవె యాఁడుతోడునను బుట్టవె శాపనిమిత్తమే తపం
బీయెడ నున్నశాంతిపరు లేమనువా రిఁక నీచరిత్రకున్. ఆ. శ.

శా. తండ్రీ నాకు ననుగ్రహింపఁగఁదె పైద్యం బంచుఁ బ్రార్థించినన్
గండ్రల్గా నటు లాడి ధిక్కృతులఁ బోకాల్మంటి వోహో మదిం
దీండ్ర ల్గల్గినవారి కేకరణినేని న్వైద్య రాకుండునే
గుండ్రా డాఁచినఁ బెండ్లి యేమిటికిఁ జిక్కుం గష్టముష్టింపచా. ఆ.౫.

శా. నీవై శిష్యము లిట్టుల న్మ్రొఱయునే నీకంటె నేఁ దక్కవే
యీవే కన్యక నీవుగాక మఱి మద్వ్యాత్తాన్వయాచారముల్
నీవా పేర్కొనుపాటివాఁడ విటఁ గానీ నిల్తుఁ గాకేమి పో
పో విప్రాధమ సిన్నఁబోల నిఁక నల్వు ల్లేరు దంభవ్రతా. ఆ. ౬.

---

3. నందితిమ్మన్న

ఈకవి కృష్ణదేవరాయని యాస్థానమునం దుండి ప్రసిద్ధిగన్న వారిలో నొకఁడు. ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; నంది సింగన్నకును తిమ్మాంబకును పుత్రుఁడు; వరాహపురాణాది గ్రంథములను రచించి ప్రఖ్యాతి కెక్కిన మలయమారుతకవికి మేనల్లుఁడు. ఈతఁడు శివభక్తుఁడు. అఘోర శివ గురుని శిష్యుఁడు. ఈకవిని సాధారణముగా ముక్కుతిమ్మన యని వాడుదురు.

శా. నానాసూనవితానవాసనల నానందించుసారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బలాత్కానం దపం బంది యో
పానాసాకృతిఁదాల్చి సర్వసుమనస్సారభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు నిర్వ్యంకలన్.

అను ముక్కనువర్ణించిన యీ పద్యమును తిమ్మకవి రచియించె ననియు, ఈపద్య చమత్కృతిని జూచి మెచ్చి రామరాజభూషణుడు నాలుగువేల వరాలిచ్చి కొని తన వసుచరిత్రమునందు వేసికొనియె ననియు, ముక్కమీఁది యీ పద్యమును రచించుటచేతనే యీ కవిని ముక్కతిమ్మన్న యని యెల్లవారును వాడుచు వచ్చిరనియు, లోక ప్రవాదము కలదు. కాని యిదియుఁ గవులను గూర్చి మనవారు సాధారణముగాఁ జెప్పుకొను కల్పనాకథలలోఁ జేరినదేకాని నిజమయినది కాదు. మొట్టమొదట రామరాజభూషణుఁ డీకవికాలములలో లేనేలేఁడు, ఒకవేళ నున్నాఁడనుకొన్నను వసుచరిత్రమువంటి మహాప్రబంధమును రచియింపఁ గలిగిన కవిగ్రామణి యింతపూత్రపు కల్పనను నాసికా వర్ణనముఁగూర్చి చేయలేకపోయెననుట పరిహాసాస్పదము. కాఁబట్టి యీ కథ యణుమాత్రమును విశ్వాసపాత్ర మయినదిగాదు. కాకపోయినయెడల నందివారని యింటిపేరుగల యీ కవిని ముక్కతిమ్మన్న యని జనులేలపిలుతురని కొంద అడుగవచ్చును. ఈ కవికి ముక్క పెద్దదనియు, అందుచేత నీతని నెల్లవారును ముక్కతిమ్మన్న యని పిలుచుచు వచ్చిరనియు, ఇంకొక వాడుకగూడఁ గలదు. ఈతనిని ముక్కతిమ్మన్న యని యాడుట కిదియే నిజమయిన కారణము కావచ్చును. ఈతనిపలుకులు ముద్దులు గులుకు చుండుటచేత నిటీవలివారు "ముక్కతిమ్మనార్య ముద్దుపలుకు" అని గ్రంథములయందీతని మృదుపదరచనను శ్లాఘించియున్నారు. తిమ్మన కృతమయిన పారిజాతాపహరణము మృదుమధుర పదములతో రసిక జనహృదయరంజకముగాఁ గూర్పఁబడినది.

అల్లసానిపెద్దన నొక్కనివిడిచినపట్టమునఁ గృష్ణదేవరాయ లీతనినే యెల్ల కవులకంటె నధికముగా గౌరవించుచు వచ్చెనని చెప్పవచ్చును. పెద్దనకృతమైన మనుచరిత్రమువలెనే తిమ్మనకృతమైన పారిజాతాపహరణ ప్రబంధమును గృష్ణదేవరాయునికే యంకితము చేయబడినది. ఇంచు

మించుగాఁ బారిజాతాపహరణము మనుచరిత్రము రచియింపఁబడిన కాలమునందే రచియింపఁబడిన దగుటచేత హూణశకము గఱిఁ వ సంవత్సరమునకుఁ బూర్వముననే పారిజాతాపహరణము ముగింపఁబడి నది. తదనంతరమీకవి కొన్ని సంవత్సరములుమాత్రము బ్రతికి కృష్ణదేవ రాయఁడు జీవించియుండఁగానే మృతినొందెను. కాఁబట్టి యితఁడు దాదాపుగా ౧౫౭౬ వ సంవత్సరమువఱకును జీవించియుండెనని చెప్ప వచ్చును. ఈకవియొక్క జన్మస్థలము గణపవరమని యొకరు వ్రాసి యున్నారుగాని దానిసత్యమును నిర్ధారణము చేయుటకుఁ దగినయాధార మేదియుఁ గానరాదు. మఱియు నీతనిని గృష్ణదేవరాయసభార్య తన పుట్టి నింటి యరణపుఁ గవినిగాఁ దెచ్చెనని చెప్పుకురుగాని యుదియు పుక్కిటి పురాణమే. ఈతని పూర్వులు మొదటినుండియు రాయలవారి పూర్వుల వద్దనే విద్వత్కవులుగా నుండి వారికిఁ గృతు లిచ్చుచు వచ్చినట్లు గ్రంథ నిదర్శనములు గలవు. తిమ్మన పూర్వుఁడైన నందిమల్లనయు, మేనమామ యైన మలయమారుతకవియుఁ గృష్ణదేవరాయల తండ్రియైన నరస రాయల యాస్థానమునండుండి యిద్దఱును గలిసి వరాహపురాణమునుఁ దెనిఁగించి నరసరాజును దానికిఁ గృతిపతినిజేసిరి. తిమ్మకవి తన పారి జాతాపహరణమునఁ బ్రథమాశ్వాసములోఁ గృష్ణుఁడు పారిజాతపుష్ప మును రుక్మిణి కిచ్చుటవలన వచ్చిన కోపమును దీర్చుటకై సత్యభామకు మ్రొక్కినయు, మ్రొక్కఁగా నాపడఁతి యెడమకాల్తో నాతనితల దన్నెనయు, అందుల కాతఁడలుగక ముండ్లవంటి తనగగుర్పొడిచిన తలవెండ్రుకలు సోఁకి కాలు నొచ్చెనని యా ప్రియభార్య నూరార్చె నయు, ఆమె యంతటితోను బ్రసన్నురాలుగాక నాథుని నిష్ఠురోక్తు లాడెనయు, ముద్దులు గులుకు పలుకులతో నీక్రింది పద్యములయందుఁ జెప్పెను :—

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలుకోపభరంబుఁ దీర్ప నె
ప్పాటను బాటుగామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మాళిమణిపట్టికి వన్నియపెట్ట నాజగ
న్నాటకసూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్.

మ. జలజాతాసనవాసవాదిసుర పూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధుకన్నతండ్రిశిర మచ్చో వామపాదంబునఁ
దొలఁగం ద్రోచె లతాంగి యట్లయగు నాథు ల్నేరమున్లేయఁ బే
రలుకంజెందినయట్టికాంత లుచితవ్యాపారము ల్నేర్తురే?

క. కోపనపదనాతిఁ గుహనా
గోపాలుఁడు గాంచి మెయి గగుర్పొడవఁగ ను
ద్దీపితమన్మథరాజ్య
ప్రాపితుఁడై పలికెఁ గూర్మి బయలుపడంగన్.

చ. నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁ బూని తా
చినయది నాకు మన్ననయె చెల్వగునీపదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము తాఁకిన నొచ్చు నంచు నే
ననియెద నల్క మానవుగదా యిఁకనైక నరాళకుంతలా.

చ. అన విని మానినీతిలక మప్పుడు మేయరదోఁప నిక్క వీ
డినకచపంక్తిఁ బల్మఱు ముడి న్వెడఁద్రోఁపుచుఁ బై చెఱంగు గ్ర
క్కునఁ జనుదోయిఁ జేర్చుచు మొగంబున లేఁజెమ రంకురింప జం
కెన నెఱిచూపుచూచి పలికెం జనితాధరపల్లవాగ్రయై.

ఉ. ఈనయగారపుఁబ్రియము లీపస లీమొగమిచ్చమాట లే
లా నిను నమ్మియుండినఫలం బిదె తోడనె కల్గె నీకు నీ
యీన సుమీ ననుం జెనకి యాఁడిపెట్టిన నవ్వువారలం
గాన వెఱంగునే పసులకాపరి భావజమర్మకర్మముల్.

ఉ. ఇంకిటు నిన్ను నమ్మ నను నేమిటికిం గెరలించె దెంతయుం
బొంకెముగాని యీవలనిబొంకులు మాచవిగావు రుక్మిణీ
పంకజపత్రనేత్రకును బ్రాణపదంబులుగాన వల్లవీ
కింకర చాలుఁజాలు నడకింపకు నింపకు లేనికూరుముల్.

ఉ. గట్టివచేఁతలుం బసలుఁ గల్లఁదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన వెందులేనిపలుఁబోకలమాయలు నీకు వెన్నతోఁ
బెట్టినవా రెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజము న్నిగులఁ గోల్పడిపోయితి నేమిచేయుదున్.

చ. మునిపతివచ్చి పూ వొసఁగి మోదముతోడ భవత్ప్రియాంగనన్
వినుతి యొనర్పఁగా వినినవీనుల మాచవిగాని మాటలున్
వినవలసెంగదా యిఫుడు నీ విటవచ్చుట పారిజాతవా
సనఁ బ్రకటించి నాకు నెకసక్కెము చేయనకాదె చెప్పవమా.

క. మానంబె తొడవు సతులకు
మానమె ప్రాణాధికంబు మాన మఖిలస
మ్మానములకు మూలం బగు
మానరహిత మైనబ్రదుకు మానిని కేలా?

ఈపద్యములను విన్నపిమ్మట లోకమున భార్యాభర్తలలో నిట్టి వినోదము జరుగుట స్వాభావికము కాదని యొచి రాజిది స్వభావవిరుద్ధ మని పలికెనఁట! కవి యప్పు డేమియుఁ బ్రత్యుత్తర మియ్యక యూర కుండెనఁట! అటుపిమ్మటఁ గొన్నిదినములకే రాజు ప్రణయకలహము సంభవించినప్పుడు భార్యవలనఁ దనకు నిట్టిగౌరవమే సంప్రాప్తముకాఁగా కామావేశపరవశుఁడయి యానందించి వెంటనే సభకు వచ్చి పుస్తక ములో నెల్ల నీభాగమే మిగుల స్వభావసిద్ధముగా నున్నదని శ్లాఘించె నఁట! ఈకథనే కొంద ఱింకొకవిధముగా మార్చి పొలయలుకలో

నోడలు తెలియక భార్య తనశిరస్సును వామపాదముతో నలంకరింపఁగా గోపించి రాజు భార్యతో సహశయ్యాసంభాషణములు మానివేసె నఁట, కవి యీసంగతి తెలిసికొని యాదంపతులను మరలఁ గలుపు టకై యీగ్రంథమును జేసి వినిపింపఁగా రాజు బుద్ధి తెచ్చుకొని కృష్ణు నంతటివానికే యట్టి యవస్థ తటస్థించినప్పుడు తన కేమిలెక్క యని మరల భార్యతోఁ గూడె ననియు చెప్పుచున్నారు.

ఈకవియొక్క దాతృత్వమునుగూర్చి యొక కథగలదు. ఇతఁడు పారిజాతాపహరణమును రాజున కఁకితము చేసినప్పుడు రాజు చతురంత యానమహాగ్రహారములును మణికుండలములును బహుమానము చేసెను. ఆయమూల్యమణికుండలములను ధరించి తిమ్మన వాకిటఁ గూరుచుండి యుండఁగా నొకబట్టు వచ్చి యాతని కవనన్నె పుణి నిట్లు స్తుతించెనఁట!

క. మాకొలఁది జానపదులకె । నీకవితాఠీవి? యబ్బనే కూపనట
ద్భేకములకు గగనధునీ । శీకరములచెమ్మ? నంది సింగయతిమ్మా!

స్తుతింపఁగానే యతఁడు తనయొద్ద నప్పుడు మఱేదియు నమూల్య వస్తువు లేకపోవుటచేత వెంటనే తనచెవి నున్నయమూల్యరత్నకుండల మొకటి యాబట్టుకవి కిచ్చెనఁట! మఱునాఁడు తిమ్మకవి యొంటిచెవి కుండలముతోనే రాజాస్థానమునకుఁ బోయి యుండఁగా నచ్చటి కాబట్టు కవియు వచ్చెనఁట! అప్పుడు ప్రస్తావవశమున రా జాకుండలదానవృత్తాం తమును బట్టు చెప్పినపద్యమును పిని,

క. మాకొలఁది జానపదులకె । నీకవితాఠీవి? యబ్బనే కూపనట
ద్భేకములకు నాకధునీ । శీకరములచెమ్మ? నంది సింగయతిమ్మా!

అని 'గగన' యనుటకు మాఱుగా 'నాక' యని యుండినచో మరింతసరసముగా నుండునని సెల విచ్చెనఁట! అప్పు డాపద్దెమునకు వన్నెదెచ్చితిరని చెప్పి తన చెవికుండలమును బట్టుకవియు, తనచెవికుండల

మును తిమ్మకవియు, రాజుముందఱ బెట్టి సమర్పించిరఁట! రాజు వారి యౌదార్యమునకును సరసత్వమునకును మెచ్చి యిరువురకును సర్వా బహుమత్తులుచేసి సత్కరించి పంపెనఁట!

రాయల యాస్థానమునందుఁ గొంతకాల మొకబట్టుకవి ప్రబలుఁ డుగా నుండి యితరకవులను సరకుగొనక యవమానించుచుండఁగా పెద్ద నాది కవులందఱును గూడి యొకనాడుఁ తిమ్మకని వాకిటఁ గూరుచుండి యాలోచించుచుండిరనియు, అప్పుడాబట్టామార్గమునఁ బోవుచు వారిని జూచి వారికి వినఁబడునట్లుగాఁ దనభటుఁడైన మాధవునితో

క. వాకిటికావలి తిమ్మని । వాకిటికవికోటి మాధవా కిటికోఁటే

అనిపలికి పరిహసించెననియు, అదివిని కుపితుడయి యాంధ్ర కవితా పితామహుఁడైన యల్లనాని పెద్దన

క. ప్రాకృత సంస్కృత ఘుర్ఘుర । మాకీకృతకుకవితుంగమస్తతికిన్
వాకిటికావలి తిమ్మన । వాకిటికవికోటి మాధవా కిటికోఁటే.

అని పద్యమును బూరింపఁగా బట్టుకవి సిగ్గునడి తలవంచుకొని పోయెననియు ఒక కథను జెప్పుచున్నారు. వాకిటికావలి తిమ్మన నంది తిమ్మన కాఁడనియు అతఁడు రాజునొద్ద సేనాధిపతిగానుండి దుర్గసంరక్షణము చేయుచుండు ఏటియొక తిమ్మనయనియు, అతఁడొకనాఁడు రాజభవనమువాకిట రాజిచ్చిన యమూల్యవస్త్రమును గప్పుకొని కావలి కాచుచుండఁగా రాజదర్శనార్థము లోపలికిఁ బోవుటకయి యచ్చటి కల్ల సాని పెద్దనయు, ముక్కుతిమ్మనయు, బట్టుమూర్తియు, తెనాలి రామ కృష్ణుఁడును వచ్చి యాతనిజూచి వారిలోఁ బెద్దన మొదట

క. వాకిటి కావలితిమ్మా

అని పద్యము నారంభించి లోపలికిఁ బోయెననియు, అటుపిమ్మట నందితిమ్మన

ప్రాకటముగ సుకవివరులపాలిటి సొమ్మా

అని రెండవచరణమును పూరించి లోనికిఁ జనియెననియు, తరు

వాత బట్టుమూర్తి

నీ కిదె పద్యము గొమ్మా

అనిపలికి లోపలి కరిగెననియు, కడపటి వికటకవియైన రామ

కృష్ణుఁడు

నా కీపచ్చడమెచాలు నయమున నివ్మా.

అని పద్యము పూర్తిచేయఁగా నతఁడు వెంటనే తనపచ్చడమును రామకృష్ణునిమీఁద వైచెననియు, రాజావర్తిని యాతని సాహసౌదార్యములకు మెచ్చి గొప్ప బహుమానమిచ్చెననియు ఇంకొకకథను జెప్పుచున్నారు. ఇటువంటి కథలనేకము లున్నవి. ఒకనాఁడు రాయలవా రాస్థానమునఁ గొలువుండి తన పార్శ్వములనున్న తిమ్మన్నను పెద్దన్నను బట్టుమూర్తిని జూచి వరుసఁగా రామరాకులోని నీటిబొట్టును కుక్కుటమును వరాహమును దిరస్కరించుచుఁ బద్యములను జెప్పుఁడని వేఁడఁగా వా రాశుకవిత్వముగా నీమూఁడు పద్యములను జెప్పిరఁట :—

ఉ. స్థానవిశేషమాత్రమునఁ దామరపాకున నీటిబొట్టు నిక్

భూసిక మౌక్తికంబనుచుఁ బోల్చినమాత్రనె గర్వ మేటికిన్

మానవతీశిఖామణులమాలికలందును గూర్పవత్తునో

కానుక లియ్యవత్తునో వికాసముఁ దెత్తువో మేలు దెత్తువో :—

ముక్కుతిమ్మన.

శా. రంతు ల్మానుము కుక్కుటాధము దరిద్రక్షుద్రశూద్రాంగణ

ప్రాంతో లూఖలమూలతండులకణగ్రాసంబుచేఁ గ్రొవ్వి దు

ర్దాంతాభీలవిశేషభీషణధనాంతర్మాంససంతోషిత

స్వాంతుండైన ఖగేంద్రుకట్టెదుట నీజంఝూటము ల్మానఁగునే—

పెద్దన్న.

ఉ. తక్కక నేల ముట్టెగొని త్రవ్వఁగనేర్తు నటంచుఁ దాఁకు తా
వొక్కఁ డొజాతియంచు ముద మొందకు బుద్ధిని వెట్టిపంది నీ
వెక్కడ యాదిఘోణియన నెక్కడ యద్రిసముద్రమగ్గధా
ర్భకుఁతలంబు నొక్కఁయరపంటనె మింటికినెత్త నేర్తువే—
బట్టుమూర్తి.

ఈ తిమ్మకవి కవిత్వము శ్రుతికటువుగాక యర్థగాంభీర్యమును పదలాలిత్యమును గలదయి సలక్షణ మయినదిగా నున్నది. ఈయన శయ్యాలాలిత్యమును జూపుటకుఁ బూర్వోదాహృతము లైన పద్యములే చాలియున్నను బారిజాతాపహరణములోని మఱికొన్ని పద్యములను గూడ నిందుఁ బొందుపఱుచుచున్నాను :—

చ. అతులమహానుభావ మని యవ్వీరిఁ జానొక పెద్ద చేసి య
చ్యుతునకు సిచ్చకం బొదవ నూడిద యిచ్చిన నిచ్చోఁగాక తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణచేసినఁ జేసెఁగాక యా
మతకరివేలుపుందపసి మమ్మఁ దలంపఁగనేల యచ్చట— ఆ. ౧.

ఉ. పిచెలి శౌరి కిచ్చెనఁట యొక్క లతాంతమునఁ దెచ్చి నారదుం
డాచపలాక్షి కిచ్చెనఁట యాతఁడు నవ్వీరి యిట్టినూట లా
హా చెవుల స్వినంబడియుఁ బ్రాణము దాల్చెద మేన నింతగా
నోచితి నింక నెట్టిని కనుంగొని నెమ్మెయి నున్నదాననో— ఆ. ౧.

చ. అరదమునెక్కి కేతనపటాంచలచంచల మైనతాల్మితోఁ
దురగజవంబు మున్గడవఁద్రోచి కడంగెడుతత్తరంబుతోఁ
దిరిగెడుబండికండ్లపగిదిఁ భ్రమియించు మనంబుతోడ నా
హరి చనుదెంచె సత్యసముదంచితకాంచనసౌధవీథికిన్— ఆ. ౧.

ము. ఎలదేఁటు లమవాఁబుఁగన్గవలపై నిందీవరభ్రాంతిచే
మెలఁగం జేరలఁ గప్పుకో నలవిగామిం జీఁదఱాం జెంది యి

చ్చలఁ గాంక్షించిరి నిర్మిమేషజలజాస్య ల్మానుషత్వంబు ల
య్యళిభీతి న్మకుళీకృతాక్షి యగుసత్యాకాంత నీక్షించుచున్. ఆర

ఉ. తానకె పారిజాతవసుధారుహముం గొనిపోవువాఁడు క
ర్ణానఁడు యాదవుం డనుచుఁ గన్నులువేయును జేవురింప వై
శ్వానర ధర్మ దైత్యవర వారిధి పానిల యక్షనాయ కే
శానులదిక్కు చూచి కులిశంబు కరంబునఁ బూన్చి పట్టినన్. ఆ.ర.

ఉ. సొమ్మన నెద్ది యే ననఁగ సొమ్మున కెవ్వఁడఁ గర్త వీవు నీ
సొ మ్మఖిలప్రపంచమును శూరకులంబు నలంకరించు నీ
వమ్మహి నుండు నంతకు ననన్యసురాపము పారిజాతభూ
జమ్మును నుండు నన్న వికసన్ముఖుఁడై హరి వీడుకొల్పుచున్. ఆ.౫

---

4. ధూర్జటికవి

ఇతఁడు పాకనాఁటి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు ; భర
ద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు: కాళహస్తిపుర నిలయుఁడు; శివ
భక్తుఁడు. ఈతఁడు కృష్ణదేవరాయలకాలమునో నున్నందున దాదాపుగా
౧౫౨౦ - 30 వ సంవత్సర ప్రాంతములం దున్నవాఁడని చెప్పవచ్చును.
ఇతఁడు కాళహస్తిమహాత్మ్యమను నాలుగాశ్వాసములుగల పుస్తకమును,
కాళహస్తీశ్వర శతకమును రచించి కాళహస్తీశ్వరున కంకితముచేసెను.
ఈయన కవనము సలక్షణ మయి మిక్కిలి మధురముగా నుండును.
ఈతని కవిత్వ మాధుర్యమున కాశ్చర్యపడి కృష్ణదేవరాయ లొకనాఁడు
సభలోఁ గూరుచుండి తన యాస్థానకవులకు

చ. స్తుతమతి యైనయంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గెనో
యతులిత మాధురీమహిమ—

అని సమస్య యిచ్చినట్లును వారిలో నొక రీక్రిందిరీతిని సమస్యా పూరణము చేసినట్లును చెప్పుచున్నారు :

చ. స్తుతమతి యైనయంధ్రకవిధూర్జటిపల్కుల కేల గల్గెనో
యతులిత మాధురీమహిమ ? హా తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమారవార వనితాజనతా ఘనతాపహారి సం
తత మధురాధరోదితసుధారసధారలు గ్రోలుటంజుమీ.

పయిపద్యమునుబట్టి చూడఁగా ధూర్జటికవి సంతత వేశ్యాప్రియుఁడయిన రసికపురుషుఁడయినట్లు కనుపట్టుచున్నాఁడు. అట్టి యఖండ శివపూజాధురంధరుఁడైన భక్తాగ్రేసరుని నిట్టి జారత్వదోష మేల విడువకుండెనో యూహింపఁజాలకున్నాము. మనదేశముయొక్క దౌర్భాగ్యము చేతఁ జిరకాలమునుండి యిచ్చట విశుద్ధచరిత్రము మతమునుండి విడిపోయినది. ఎట్టి దుశ్చరిత్రముగలవాఁడయినను విభూతి, రుద్రాక్షలు మొదలయిన బాహ్యచిహ్నములను ధరించినమాత్రమున భక్తాగ్రేసరుఁడుగాఁ బరిగణింపఁబడుచున్నాఁడు. అయినను క్రమముగా నిప్పుడిప్పుడు మతమునకు సత్ప్రవర్తన మావశ్యకమన్న సత్యము జనుల మనస్సులలో నాటుకొనుచున్నందున కెంతయు సంతసిల్లవలసి యున్నది. ఈ మహాకవియొక్క కవితాధార తెలియుటకయి కాళహస్తిమహాత్మ్యములోని కొన్ని పద్యములు నిం దుదహరించుచున్నాను:-

చ. అమితము లైనజంతువుల కక్కడ నుత్తమ మధ్య మాధమ
త్వము లరయంగఁ గాన మపవర్గరమాసతిఁ బెండ్లియాడుచో
సమతయెకాని తత్పురమునాటిగ నన్యపురంబు లెన్నఁగా
నమరు నటన్న హస్తిమశకాంతర మంతియ వాసి చూచినన్. ఆ ఁ

చ. పరిచితబంధనై పుణి నపారకళానుభవప్రసక్తి నా
దరసవివేకసంపద సనాశుకవాక్యసుధానుభూతి మో
హరహితవృత్తిఁ బ్రబ్బురదనంగరహస్య విచారబుద్ధి న
ప్పురమునఁ గామినీజనులు పొల్తురు యోగిజనంబుపోలికన్. ఆ. ౧

శా. ఆవేళం బురపల్లవప్రకరనేత్రానందబాష్పాంబుధా
రావర్షాగమచంచలాలతిక దుర్వారప్రసూనాస్త్ర తే
జోవైశ్వానరసామిధేని రశనాసూత్రస్థితస్వర్ణవే
టీవిన్యస్తకపర్ది యొక్క కలకంఠీరత్న మేతెంచుచున్. ఆ. ౧

మ. ప్రణతు ల్చేయుమఁ గాంచెఁ గుంభజుఁడు లోపాముద్రతోఁగూడి ద
క్షిణకైలాసము నంబికాహారకృత శ్రీపాదుకాన్యాసమున్
మణిమంత్రౌషధవాసమున్ భవమహామాయావిపర్యాసమున్
గణనాతీత నటీవిలాసము సమగ్రశ్రీసముల్లాసమున్. ఆ. ౧

చ. పులులు కురంగముల్ కరటిపోతము లేకులు మన్నఁబిళ్ళు దు
ప్పులు కణఁతుల్ కిటుల్ చెవులపోతులు కొర్నవగండ్లు భల్లుకం
బులు చమరీమృగంబు లెనుబోతులు కస్తురిపిల్లు లాదిగాఁ
గల మృగరాజిఁ బెక్కువిహగంబులఁ గానుక లంపెఁ దండ్రికిన్. ఆ. ౩.

---

5. మాదయ్యగారి మల్లన్న

ఈతఁడుకూడ కృష్ణరాయని కాలములో నున్న లక్ష్మణికుఁడయిన కవులలో నొకఁడు. ఆవఱకు మల్లన్నయని మఱియొక కవి. యుండి యుండుటచేత నీతనిని తండ్రి పేరిట్లోడఁగూడఁ జేర్చి మాదయ్యగారి మల్లన్న యని చెప్పుదురు. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు. కొండపీటి పురమందుండినవాఁడు. ఈతనికిఁ బూర్వమునందుండి యేకాదశీమాహాత్మ్య మనునామాంతరము గల రుక్మాంగదచరిత్రమును రచియించిన మల్లన్న ప్రౌఢకవి మల్లన్న యనఁబడును. మాదయ్యగారి మల్లన్న రాజశేఖరచరిత్రమను మూడాశ్వాసముల గ్రంథమును యౌవనారంభ దశయందే రచియించెనఁట! ఈరాజశేఖరచరిత్రము నాదిండ్ల యప్పయా మాత్యున కంకితము చేయఁబడినది. ఈకవి కృష్ణరాయల యనంతరము గూడ జీవించియుండుటచేత నించుమించుగా హూణశకము 1481 వ సంవత్సరప్రాంతమువఱకును బ్రతికియుండెనని చెప్పవచ్చును. ఈతని కవిత్వము మృదుమధుర పదగుంభనము కలదయి మనోహరముగా నున్నది. ఈ కవి చరిత్రమునుగూర్చి మఱియేమియుఁ దెలియకపోవుటచేత రాజశేఖర చరిత్రమునుండి కొన్ని పద్యముల నుదాహరించుచు విరమించుచున్నాను :—

ఉ. చొచ్చినఁ బోకుపోకు మనుచున్ నృపకేసరి తేరు డిగ్గి నీ
వెచ్చటి కేగిన న్విడుతునే పటుబాణపరంపరాహతిన్
బచ్చడి చేయువాఁడ నని ఫాలనటద్భ్రకుటీకరాళుఁడై
యిచ్చ నొకింతయేని చలియింపక తద్బిలవీథి దూఱఁగన్—ఆ. శ.

ఉ. సాహసికాగ్రగామి నృపసత్తముఁ డట్లు తదీయ ఘోరమా
యాహమికల్ హరింపుచు నిరంకుశ విక్రమకేళిఁ జూప ను

స్నానహము తక్కి యాత్మపురిచక్కటి నొప్పెడుకాళికా
గేహముచొచ్చి తద్దనుజకీటము పాటిలుభీతి పెంపునన్—ఆ. ౨.

మ. కలమాన్నంబు ఘృతంబుఁ బొయసము శాకవ్రాతము ల్పిండివం
టలుఁ బా ల్తేనియ జున్ను వెన్నయిడి యూనా లుక్కెర ల్చక్కెరల్
ఫలము ల్పానకము ప్రసాయనము లంబ ఖ్యాతిఁబిం డ్లూరుఁగా
యలు బజ్జ ల్దధిపిండఖండములు నం చావిర్భనించె న్వేసన్—ఆ. ౨.

శా. కేళీకాంచనసౌధవీధికలచక్కి దొట్లలోఁ బెట్టి యో
ప్రాలేయాచలకన్య కాధనకృపాపారంగతా నిద్రవో
వే లానన్యాపయోనిధీ యనుచు నావిర్భూతమోదంబుతో
జోలల్పాడుచు రక్కమారకునకున్ శుద్ధాంత కాంతామణుల్ అ. ౨

ఉ. రాహువుగాను ని న్నరగరాచినశూలినిగాను నీతను
ద్రోహముచేసినట్టియలరోహిణితండ్రినిగాను దజ్జగ
న్మోహిసి నీలనీలకచ ముద్దులచక్కెరబొమ్మఁ గూర్చ క
య్యో హరిణాంశ తావకమయూఖముఖంబుల నేచ నేటికిన్—ఆ. ౨.

వెనుకటి కూర్పులయందుఁ బయివిధమునఁ బ్రకటించినతరువాత, ఈటీవల నాకు రాజశేఖరచరిత్రము సమగ్ర మయిన ప్రతియొకటి దొరకినది. అందలి యాశ్వాసాద్యంతముల యందుండిన ఈ క్రిందిపద్యములను బట్టి కృతిపతి యింటిపేరు నాదిండ్ల వారనియు, పేరప్పామాత్యుఁడనియు, అతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁ డనియు, కృష్ణమాంబా కుమారుఁ డనియు, మంత్రియు దండనాథుఁడు ననియు, తెలియవచ్చుచున్నది.—

శా. వైరించప్రతిభావదావదవచోవై యాత్య సాతత్యస
త్యాయూథస్థితిపాండవాగ్రజ మహీయస్వచ్ఛకీర్తిచ్ఛటా
పారావారసమగ్నశత్రుగణ శుంభత్పూర్వ భూభృద్ధిశా
నారీమన్మథ బంధురక్షణచణా నాదిండ్ల వంశాగ్రణీ—ఆ. ౧.

పూలిని. హరిచరణపద్మోజధ్యానసంధానమార్ద్రా
స్థిరమతిగుణధారా శిష్టశాఖప్రచారా
సురసురభివితీర్ణి స్తోత్రపాత్రప్రకారా
గిరిచరదరివీరా కృష్ణమాంబాకుమారా!—ఆ. ౧.

క. శ్రీరమణీరమణీయవి । హారాయితనూత్నలోచనాంభోజయుగా
దోరమితికీర్తినిరసిత । తారకుభృత్కాశ యప్పదండాధీశా— ఆ. ౨.

సుగంధి. పారదప్రభావిభాసిభద్రకీర్తివాహినీ
పూర దానధూతదివ్యభూజకామధేను మ
ర్వార యూఅవేలవంశవార్ధిపూర్ణచంద్రమా
సారబుద్ధిజాలనీతశత్రుభూమిభృద్రమా— ఆ. ౩.

క. శ్రీచక్రచారుకుచయుగ । సూచకగాఢోపగూహనూచితపులక
ప్రాచుర్య తత్త్వతత్పర । యాచకసంస్తుత్య మంత్రియప్పామాత్యా:—

ఈ యప్పామాత్యుఁడు కృష్ణదేవరాయని మంత్రియైన తిమ్మరుసున కల్లుఁడు. మాదయ్యగారి మల్లన్న తా సఘోరశివశిష్యుఁడయిన ట్లాశ్వా సాంతగద్యమున నిట్లు తెలిపికొనియున్నాఁడు :-

"ఇది శ్రీమదఘోరశివాచార్యగురు కరుణావిశేషలబ్ధ సారసారస్వత మాదయామాత్యపుత్ర మల్లయనామధేయ ప్రణీతంబైన రాజశేఖర చరిత్రంబను మహాప్రబంధంబునందు సర్వంబును దృతీయాశ్వాసము."

ఈ యప్పామాత్యుఁడు కవిసి,

ఉ. శంకరపాదసేవ నవశంవదమానస పంకజాత ని
శ్శంకవచోవిలాస రుచిసారవినిర్జితపూర్ణపూర్ణిమై
ణాంక దురక్షరాన నభయంకర శౌనకగోత్రపాత్ర య
య్యంకిపురాగ్రహారవిభవాకర మారయమల్లసత్కవీ.

అని సంబోధించి యుండుటచేత మల్లన శౌనకగోత్రసంజాతుఁ డనియు, అయ్యంకిపురాగ్రహారస్వామి యనియు తెలియవచ్చుచున్నది. అయ్యంకి

కృష్ణామండలములోని చల్లపల్లిసంస్థానములో మచిలీబందరునకు పదునాలుగు మైళ్ళదూరములో నున్నది. దీనినిబట్టి కవి కృష్ణామండలములోని వాఁడగుట స్పష్టము. ఈకవిశ్రేష్ఠుఁడు కృత్యాదియందు

గీ. సరససంస్పృక్తపుష్పగుచ్ఛప్రభూత
మగుతెనుంగనునెత్తావి కఖిలదిశలఁ
దరుణపమానమగు కవిత్రయవిశేష
చతురవాచానిరూఢి కంజలి యొనర్చి

అని పూర్వకవిస్తుతి చేసి

క. చెప్పఁదగుఁ గవిత రసముల్
చిప్పిల నప్పప్ప బళిబళీ యన లేదా
యెప్పుడుఁ జేయకయుండుఁ
యెప్పుఁజుమీ సుకవి కెంతయుచితజ్ఞుఁడొకో.

శా. గాఢార్థప్రతిపాదనక్రమకళాకౌశల్యము ల్లేక వా
చాఫల్కార్భటితోడఁ దామ తము మర్మ్మాయఁచుఁ గై వారముల్
ప్రౌఢింజేయుచుఁ బ్రొజ్జల న్నగుచు గర్వ్వాగ్రంధులై యుండు న
మ్మూర్ఖస్వాంతుల మెచ్చకుండుటయె సమ్మోదంబు మాభోంట్లకున్.

సుకవియగువాఁడు కవిత్వముఁ జెప్పినచో రసము లుప్పతిల్లునట్లుగాఁ జెప్పవలయును లేదా యూరకుండవలయు ననియుఁ జెప్పి కేవల వాగాడంబరమును జూపువారియెడఁ దీరస్కృతినిజూపెను. కవి కృతిపతి మామగారును కృష్ణదేవరాయనిమంత్రియు నయిన తిమ్మరుసును వర్ణించి, అస్మామాత్యుఁడు తిమ్మరును కూఁతురైన తిరుమలాంబను బెండ్లియైన వార్త నీక్రిందిపద్యములలోఁ జెప్పెను—

సీ. ఏమంత్రిమణి నిజస్వామికార్యక్రియాతత్పరమానసోత్సాహశాలి
యేమంత్రిమణి మిత్రహితబాంధవాశ్రితప్రకరరక్షణకళాప్రౌఢబుద్ధి
యేమంత్రిమణి వచోహేలాతిశైర్మల్యశీతలతాధూతశీతరోచి

యేమంత్రిమణి సుధాధామశాంభవధామధాళధళ్యసుతుల్యధవళకీర్తి
యట్టి మంత్రికులోత్తంస మహితనృపతి
పటలమకుటాగ్రఘటితపత్పద్మయుగళి
సకలకర్ణాటరక్షావిచక్షణుండు
దీనసురశాఖి సాళువతిమ్మమంత్రి.

గీ. అమ్మహామంత్రి కతనియర్ధాంగలక్ష్మీ,
సకలపుణ్యాంగనాజనశ్లాఘనీయ
లక్ష్మమాంబకు నుదయించి లలినిమెఱయు
తిరుమలాంబికఁ బెండ్లియై తేజరిల్లె.

కృతిపతియొక్క తమ్మఁడైనగోపనయు గుత్తిదుర్గమునకు దండనాథుఁడయి యుండినట్లు కవి యీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

ఉ. ప్రాపితరాజ్యవై భవ నిరాకృతిపాకవిరోధియైన యీ
గోపనమంత్రి ధర్మధనగోపనసమ్మతిగుత్తిదుర్గల
క్ష్మీహరిపాలనక్రమసమిద్ధభుజాబలశాలి రూపరే
ఖాపరమత్స్యలాంఛనుఁ డయావహకార్యధురంధరుం డిలన్.

కృతిపతియైన నాడెళ్లయప్పామాత్యుని సుతాతతమ్మఁడైన చిట్టిగంగన్న కృష్ణదేవరాయని తాతయగు సీళ్వరరాజునకుఁ బ్రభువుగానుండినట్టియు జైమినిభారతకృతిపతి యయినట్టియు సాళువనారసింహరాజునొద్ద మంత్రిగానున్నట్లు చెప్పిన యీక్రింది పద్యము కవికాలనిర్ణయమునకుఁ దోడుపడునదియే యయినను దీనిసాహాయ్య మక్కఱలేకయే కృతిపతి తిమ్మరుసుజామాత యగుటచేతనే కవికాలము మనకుఁ దెలియవచ్చినది—

ఉ. సాళువనారసింహమనుజప్రభుకార్యకళాధురంధరుం
డై లవణాబ్ధివేష్టితధరాధిపదుర్మతమంత్రమంత్రిశుం

డాలవితానకేసరి యనంగ ననంగసమానరూపకే
ఖాలలితాంగుఁ డట్టిచిటిగంగన యొప్పు గుణానుషంగుఁడై.

రాజశేఖర చరిత్రమునందలి పద్యములు మృసుమధురవాగ్గుంభ
నము కలవయి ముద్దుపలుకులచే వీనులకు విందు గొలుపుచున్నవి. రాజ
శేఖర చరిత్రమునుండి యీవఱ కుదాహరింపఁబడిన పద్యములన్నియు
ద్వితీయాశ్వాసములోనివే యైనందున మఱికొన్ని పద్యముల నిందుదాహ
రించుచున్నాను :—

ఉ. చందురువంటి నెమ్మొగము చక్కటిదూలఁగఁ బుట్టువెండ్రుకల్
కెందలిరాకుఁబాదములఁ గీలొక్కనఁ జేసినయట్టిచిన్నిపెఁ
దండెలు గిల్లుగల్లుమన నాడుచు నల్లన జేరవచ్చి నా
ముందఱనాడ నెన్నఁడొకొముద్దియముద్దుగుమారుఁగాంచుటల్—ఆ. ౧

శా. రాజచ్చంద్రశిలాతలాంతరలతారమ్యప్రదేశంబుల
గాజుం గుప్పెలలోనియచ్ఛతరగంగావారి నోలార్చి యా
రాజన్యదేవులు మంత్రపూతముగ హేరాళంపుఁబూగత్తులం
బూజ లేయుదు రిచ్చలం జెలఁగి ముప్పూటం బురారాతికిన్—ఆ. ౧

ఉ. పాలిక మేలుకొల్పి నరపాలశిఖామణి వింటివే విసీ
లాలక నిన్న రేయి యొకయచ్చెరు వాశ్రితపారిజాత మ
బ్బాలశశాంకమౌళి మనపాలిటికొంగుపసిండి, మందమం
దాలసలీల వచ్చె దరహాసవిభాసిముఖారవిందుఁడై—ఆ. ౧

ఉ. ముంపటి రాజ్యగర్వమున ముందఱఁగానవుగాక ధాత్రిఁ బా
లింపరొ తొంటిరాజులు దిలీపవసిష్ఠుల్ ముసికోటికూఁత లా
లింపరొ నొంపరో మదవిలీఢకఠోరనిశాటఝూటముల్
నింపరొ దిక్కటాహముల నిర్మలకీర్తిసుధాంశుచంద్రికల్—ఆ. ౨

శా. ఓరోరీ కలగంటివో భ్రమసితో యుగ్రాహవాటోపదు
ర్వారప్రక్రమమామకీనభుజగర్వం బెన్నరో కాక నా

పే రెవ్వారు నెఱుంగరో యకట నిర్భీతి న్నరుండెవ్వఁడే
జేరన్వచ్చునె నన్ను బెబ్బులిపయిం జొంబోతునుం బంచునే— ఆ.౨

ఉ. రమ్మ్న నృపాల నీదగుపరాక్రమ కేళికిఁ జాలమెచ్చి మా
యమ్మ్న భవాని సంయమికులాగ్రణికూరిమిబిడ్డ నిచ్చి రాఁ
బొమ్మ్న వచ్చితిఁ శిఖరిపుత్రిక సేవకురాల నాదుగే
హమ్మ్న నున్న యప్పుడుచు నప్పనచేసెద నంచుఁ బల్కినన్—ఆ.౨

ఉ. ప్రన్నసిపాదములో చిలుక పాటినఁ గండెడు మేనుదీఁగెయున్
వెన్నెలవారునెమ్మొగము నిద్దపుమున్దుమెఱుంగుజెక్కులున్
గ్రొన్నెలవంటి నెన్నుదురుఁ గోమలబాహుమృణాళయుగ్మముఁ
గన్నులఁగట్టినట్లు పొడగానఁగనయ్యెడు నాకు నెచ్చెలీ—ఆ. ౨

చ. అగునగునయ్య యచ్చెలియ యట్టిన యెంత నుతింప నంతకుఁ
దగుఁదగు మర్త్యలోకవనితావినుతాంగి యానన
ద్విగుణితచంద్రమండల తదీయసఘాతకటాక్షపాతముల్
తగిలిన మారుఁ డెవ్వరి హళాహళిసేయఁడు వాఁడిపూవులన్- ఆ·3

మ. కులనిర్మ్మలనకారణంబు ప్రతిభాకుట్టాక ముద్యోగకో
పలతాదోహద మాజవంజవసుఖప్రత్యూహ మాత్మవ్యధా
జ్వలనజ్వాలిక కామినీనయనవీక్షాపాతసంరోధి ని
ష్కలఘుత్వాశ్రయభూమి లేమి యది యూహా యేమి గావింపదే-ఆ3

ఉ. రాములు కేళికాననధరాస్థలికిన్ మును క్రీడసల్పి రా
రో మనసారఁ గమ్మ్ననివిరు ల్తమనేర్పులఁ గోసికొంచుఁ బో
రో మదవృత్తి నీగతి మరుల్గొని పోరినవారిఁ గాన మొం
డేమనువారమమ్మ్న తరళేక్షణ వ్రాఁతఫలం బిట్టుండఁగన్—ఆ. 3

చ. కలితసుధారసంబు దొలఁకన్ సరసప్రియభాషణంబులం
బలికిన శీతకాలమగుఁ బల్లవపాదములెత్తి లీలమై

మెలఁగ వసంతకాలమగు మించుఁగనుంగవఁ దేఱిఁజూచినఁ
దలఁకొనుకారుకాలమగుఁ దస్వీవిలాసవిచిత్ర మెన్నఁగఁ—ఆ. 3
శా. డాకేల న్నిజకన్యకామణులకంఠశ్రేణిఁ గీలించి వీ
ఠాకంజాతము లాత్మపాదనఖరేఖందార్చి సంగీతపా
ద్యాకౌశల్యము గానరా మతికి నాహ్లాదంబు సంధిల్ల గా
రీకళ్యాణముఁ బాడిరప్పుడు పురంధ్రీరత్నము ల్వేడుకన్—ఆ. 3

---

6. తాళ్ళపాక చిన్నన్న

అష్టమహిషీకళ్యాణ మనుద్విపదకావ్యమును రచియించిన యీ కవి కృష్ణదేవరాయల కాలమునందున్నవాఁడు.

గీ. చిన్నన్న ద్విపద కెరఁగును
బన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెరఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.

అని యప్పకవి తెనాలిరామకృష్ణమ్మ చెప్పినట్లుగా నుదాహరించిన పద్యమువలన నితఁడు ద్విపదను నిర్దుష్టముగాను మనోహరముగాను రచించినట్లు కనుపట్టుచున్నది. లక్షణగ్రంథములయం దుదాహరింపఁబడిన చిన్నముక్కలుదక్క నీతనిపుస్తకము నాకు లభింపలేదు. ఈక్రింది రెండు పంక్తులు నప్పకవీయమునం దుదాహరింపఁబడియున్నవి.

ఇంతుల మేల్బంతి యిడినసేవంతి
బంతి చేదోయి నుపాయన మిచ్చి అష్టమహిషీకళ్యాణము.

రంగరాట్ఛందమునం దీక్రిందిపంక్తి లుదాహరింపఁబడినవి—

ఉన్నాఁడు తడవుగా నున్నాఁ డతండు
మన్నాఁడు మమ్మఁ బెమ్మన్నాఁ డటన్న.—అష్టమహిషీకళ్యాణము.

---

7. సంకుసాల నృసింహకవి

ఇతఁడు కవికర్ణరసాయన మను మాంధాతృచరిత్రమును రచి యించిన మహాకవి. ఈ కవి కృష్ణదేవరాయసికాలమునం దుండె ననుటనుగూర్చి యొకకథ గలదు. దానినిచ్చట సంక్షేపించి చెప్పుచున్నాను. పెద్దన్న మనుచరిత్రమును రచించినతరువాత నృసింహకవి కష్టపడి కవికర్ణరసాయనమును జేసి, దానిని కృష్ణదేవరాయని కంకితము చేయఁదలఁచి, విజయనగరమునకువచ్చి తదాస్థానకవియైన పెద్దన్నను దర్శించి, తనగ్రంథము నామూలాగ్రముగా నాతనికి వినిపించి, రాజదర్శనము చేయింపవలెనని వేఁడెనఁట! ఆంధ్రకవితాపితామహుఁడాగ్రంథచమత్కారమున కద్భుతపడి, అట్టిగ్రంథమును రాజునకుఁ జూపినయెడలఁ దన మనుచరిత్రముమీఁది గౌరవము తగ్గునఁటయెంచి, ఈర్ష్యచేత నాతనికి రాజదర్శనము కానియ్యక 'యిదిగో, అదిగో' అని చిరకాలము గడపి యూరక పంపివేసెనఁట! అతఁడు రాజాస్థానమున లాభప్రాప్తి లేకపోఁగా మీఁదు మిక్కిలి తనవెంటఁ దెచ్చుకొన్న కానుపేసములను సహితము వ్యయపెట్టుకొని, దినభుక్తి జరగక తనపుస్తకములోని కొన్నిపద్యములను విక్రయింపవలసినవాఁడయి, తుదకు విసిగి రాజులను దూషింపఁజాలేచిపోయి తనగ్రంథమును శ్రీరంగనాథున కంకితముచేసి కృతార్థుఁడయ్యెనఁట! అప్పుడు విక్రయింపఁబడిన పద్యములలో నొకటి రెండు కృష్ణదేవరాయల కూఁతురైన మోహనాంగిచేతిలోఁ బడెనఁట! కృష్ణరాయనికి మహావిదుషియైన మోహనాంగి యనుకూఁతురు గలదనియు, ఆమె యనుపమానసాహిత్యము కలదయి మారీచిపరిణయమనుశృంగారప్రబంధమును రచియించెననియు, రామరాజుభార్య యనియు కొందఱు వ్రాసియున్నారు. ఆగ్రంథము నాకు లభించినది కాదు. రామరాజు భార్యపేరు తిరుమలాంబ. అయినను తిరుమలాంబకు

మోహనాంగి యనునామాంతర ముండిన నుండియుండవచ్చును. ఆచిన్నది యొక్కనాఁడు తండ్రితో చతురంగ మాడుచు, తనబలము లోని బంటొకటి మంత్రియొక్కయు, నేనుఁగుయొక్కయు సగచేత తొలఁగవలసి వచ్చినప్పుడు "యుద్ధతుల మధ్యమునఁ బేద కుండఁదరమె" యని చదివెనఁట! అదివిని రాజు పద్యమంతయుఁ జదువుమని పుత్రి నడుగఁగా నామె కవికర్ణరసాయనములోని మూడవ యుచ్ఛ్వాసమునందలి యీపద్యము సిట్లు చదివెనఁట—

గీ. ఒత్తుకొనివచ్చుకటికిఁ జోద్యత్తిఁ జూచి
తరుణితనుమధ్య మెచటికో తలఁగిపోయె
నుండె నేనియుఁ గనఁబడ కున్నె యహహా!
యుద్ధతులమధ్యమునఁ బేద కుండఁదరమె?

అప్పుడు రాజాపద్యముయొక్క చమత్కృతి కానందించి యొక్కఁడి దని యడిగి తెలిసికొని పెద్దన్న చేసినమోసము నెఱిఁగి ఖేద పడెనఁట!

రాజసంస్థానమునందుఁ దనకుఁ గలిగినయనాదరణచేత కుపితుఁడయియే నృసింహకవి తనమాంధాతృచరిత్రమునం దీకింది రాజదూషణ పద్యములు జొప్పించెనని చెప్పుదురు—

సీ. ఆందోళికలయందు నంతరచరు లైనసవికృతాకృతులపిశాచజనులు
పరకరాళంబులై ప్రార్థింపఁ గనుఁగోక వాయెత్తకుండుజీవచ్ఛవములు
వాలవీజనములఁ గ్రాలుచు నీఁగకు నంటీనిఖరవర్తులాండసములు
వేత్రపరంపరావిలకంటకావృతిఁ జేరఁ బోరాసబహ్వాగతరులు
శంఖనాగస్వాగస్వరశ్రవణసమద
విస్ఫుటచ్ఛత్రవిస్ఫారితస్ఫటాక
విష్టవిషవైద్యవశవర్తి దుష్టఫణులు
ప్రభుదురాత్మ్మల సెవ్వాఁడు ప్రస్తుతించు.

అయినను పయికథ యిటీవలివారిచేత నెవ్వరిచేతనో కల్పింపఁ బడినట్లు తోఁచుచున్నది. ఆంధ్రకవితాపితామహుఁ డైన యల్లసాని పెద్దన్న యంత యసూయాగ్రస్తుఁ డగుటకుఁ దగినకారణ మేదియుఁ గానరాదు. కవికర్ణరసాయనము మొత్తముమీఁద మంచిదే యయినను, పెద్దనార్యకృత మయిన మనుచరిత్రముకంటె నేవిషయమునందును గుణాతిశయము గలదికాదు.

గీ. యతి విటుఁడుగాకపోవు టెట్లస్మదీయ
కావ్యశృంగారవర్ణ నాకర్ణనమున?
విటుఁడు యతిగాకపోరాదు వెస మదీయ
కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున.

అని నృసింహకవి తన కవిత్వసామర్థ్యమును గూర్చి గ్రంథాదియం దాత్మస్తుతి చేసికొని యున్నాఁడు. మఱియుఁ దక్కిన కవుల వలెఁగాక కుకవిదూషణయుఁ బెక్కుపద్యములతోఁ జేసియున్నాఁడు. కాఁబట్టి యితఁడు స్వాతిశయభావము గలవాఁ డయినట్లు కనుపట్టు చున్నాఁడు. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడయినను భట్టపరాశరాచార్యుల శిష్యుఁడై వైష్ణవమతమునం దధికాభిమానము కలవాఁడై యుండెను. మాంధాతృచరిత్రము విశేషభాగము దీర్ఘసమాస సంస్కృతపద భూయిష్టముగా నున్నను బహుస్థలములయందు తెలుఁగుపదములతోను చక్కని లోకోక్తులత్తోను గూడఁ గూడియున్నది. చేసినవర్ణనము లనేక ములు హృదయాహ్లాదకరములుగా నున్నవి. కవిత్వమునం దక్కడక్కడఁ గవిత్రయము వారి ప్రయోగములకు విరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈ కవియొక్క కవనపుణిని జూపుటకయి కవికర్ణ రసాయనములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను:—

శా. ఏణీలోచన లాత్మనక్షిరుచిచే నేణాంకసౌభాగ్య మ
క్షీణప్రౌఢి హరింప సౌధపరిసంక్షేణేంద్రనీలోపల

శ్రేణీనిర్మలకుట్టిమంబులపయిన్ శీతాంశుఁడంబేదయై
ప్రాణాచారము పడ్డయట్ల ప్రతిబింబవ్యాప్తి చూడందగున్—ఆ. ౧

ఉ. గర్భమునిల్చి కుక్షి యధికంబుగఁ గానఁగవచ్చి ప్రకృష్ట
దుర్భరతీవ్రవేదనలఁ దూలుచు సోలుచు నేల వ్రాలఁగా
నర్భకుఁ డొక్కఁ డయ్యనకులాగ్రణిగర్భ మగల్చికొంచు నా
విర్భవ మొందె భూజనులు విస్మయమగ్నులుగాఁగ నయ్యెడన్—ఆ౧

క. కా కేమి తన్నుఁ దిట్టెనె?
కోకిల తన కేమి ధనము కో కొమ్మనెనే?
లోకము పగ యగుఁ బరుసని
వాకునఁ జుట్ట మగు మధురవాక్యమువలనన్—ఆ. ౨

ఉ. ప్రోడవుగాన నీ పలుకు పోలదు కాదనరాదుగాక యీ
వీడినతాపవేదనల వేఁగెడుచెన్నటిమేనఁ బ్రాణముల్
కూడి వసింపనోర్వ వివిగో చనుచున్నవి యేల వ్రీడయుం
గ్రీడయు నాకు హారమును గీరముఁ జూతము గీతముం జెలీ— ఆ. 3

మ. పటికి న్నార్చినలీలఁ జందనముఁ బైఁబైఁబూయ నంగారక
చ్ఛటలం గాచు తెఱంగునం జిగురుసెజ్జిం బొర్లఁగా నప్పట
ప్పటికిం జేరఁగనిల్చిన ట్లొడలిపైఁ బస్నీరు చల్లంగ ను
త్కటమయ్యెం బెనుకాక బంగరుసలాకంబోలు నబ్బాలకున్— ఆ.3

గీ. తొట్రుకొను నడ్డులును వెడద్రొక్కుపల్కు
లుల్లముల సి గ్గెఱుంగమియును ఘటించి,
జవ్వనులకును మరల శైశవముఁ దెచ్చె
వారుణియు నెట్టిసిద్ధౌషధీరనంబొ—ఆ. ౪

ఉ. లజ్జకుఁ బాపు శీలముఁ గులంబు వడి న్విడిపించు సూన్నృతం
బుజ్జనసేయఁ జేయు మొగమోటమిఁ దూలుచుఁ బాతకంబుల్క

మజ్జన మార్చు నార్చు నభిమానము రోఁతల కియ్యకొల్పు నీ
ముజ్జగ మైనఁ ద్రిప్పు దుదిముట్టదు తా ధనకాంక్ష యేరికిన్ - ఆ. గి

ఉ. ఏకడఁజొచ్చునో సుకృత మెచ్చటడాఁగునొ తృప్తి యెప్పుడో
పోకడ శాంతి కెం దడఁగిపోవునో సౌఖ్యము మాన మేమియా
నో కృప యెట్లు మాయ మగునో యశ మేగహనంబుదూఱునో
లోకమునం దెఱుంగ మొకలోభ మెదిర్చినమాత్రఁ జిత్రమై— ఆ. ౫

ఉ. ఖండసుధాకరాలికలు గాఢవిరక్తిఁ దపస్విశిష్యలై
యుండిరి పూవుదప్పటకు నుల్లము రోసి రతీశుఁ డిక్కునో
దండము, బుప్పబొణములతండము, బొఱ్ఱఁగవై చి చేతులన్
దండమునుం గమండలువుఁ దాలిచి మస్కరి గాకయుండునే— ఆ. ౬

---

8. కాసె సర్వప్ప

ఇతఁడు సిద్ధేశ్వరచరిత్ర మనునామాంతరముగల ప్రతాపచరిత్ర మును ద్విపదకావ్యముగా రచించెను. ఈకవికాల మెప్పుడో నిశ్చయ ముగాఁ దెలియదుగాని యితని గ్రంథము మిక్కిలి పురాతన మైనదను టకు సందేహములేదు. ఇతఁడు ప్రతాపరుద్రుని యనంతరమునఁ గొంత కాల మయినతరువాత నుండినవాఁడు. ఈతని కవిత్వమునందు లక్షణ విరుద్ధము లైనప్రయోగము లనేకములు గానఁబడుచున్నను, చరిత్ర ముగా నీగ్రంథము మిక్కిలి యుపయుక్త మయినది. ఈతని గ్రంథము నుండియే కూచిమంచి జగ్గకవి తనసోమదేవరాజీయమునందు విశేష భాగము గ్రహించి యున్నాఁడు. తిక్కన సోమయాజి చరిత్రమునం దీగ్రంథమునుండి కొంతభాగ ముదాహరింపఁబడినందున, ఇందుండి యిప్పుడు గొన్నిపంక్తులు మాత్రమే గ్రహింపఁబడును.

ద్వి. గణప్రసాదతఁ గలిగినసుతుని
గణపతినామంబు ఘనముగాఁ బెట్టి
తూర్పుదేశం బేగి తూర్పురాజులను
నేర్పుతో సాధించి యోర్పుమీఱంగఁ
బాండుదేశాధీశు బాహుబలాఢ్యుఁ
గాండంబులనుగొని గం డడఁగించి
చండవిక్రమకళాసారదుర్వార
పాండిత్య ధనురస్త్రభద్రుఁ డారుద్రు ఘీఁ.

*　　*　　*　　*

ఇది శ్రీసకలవిద్వదిభపాదకమల
సదమలసేవన సభ్యసంస్మరణ
భాసురసాధుభావనగుణానూన
భూసురాశీర్వాద పూజనీయుండు
కాసె మల్లనమంత్రి ఘనకుమారుండు
వాసిగాఁ జెప్పె సర్వప్పనుతఁడు.

9. భాస్కరపంతులు

ఈకవి కన్యకాపురాణమనెడి యెనిమిదాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. రాజరాజనరేంద్రుని తండ్రియైన విష్ణువర్ధనమహారాజు గోదావరీమండలములోని పెనుగొండలో నుండిన • కుసుమశెట్టియను కోమటియొక్క కూమార్తెను కామించి యామెను తన కిమ్మని యడుగగా తండ్రి యియ్యనన్నట్టును, అందువిూద విష్ణువర్ధనుఁ డాకన్యను బలాత్కారముచేత గ్రహించుటకుఁ బ్రయత్నింపఁగా కుసుమశెట్టియు కూఁతురును నూటరెండు గోత్రముల యితరవైశ్యులును నగ్నిహోత్రములోఁబడి మృతులయినట్టును, కోమట్లలో నూఱుకుటుంబములు పడమటకును, ఎనుబది కుటుంబములు తూర్పునకును, ఇన్నూఱు కుటుంబములు దక్షిణమునకును, నూటముప్పది కుటుంబములు ఉత్తరమునకును పాఱిపోయినట్టును, కన్యకాశాపముచేత విష్ణువర్ధనుఁడు శిరస్సు వ్రక్కలయి చావఁగా నాతనిపుత్రుఁడయిన రాజనరేంద్రుఁడు వైశ్యులను శాంతపఱిచి కుసుమశెట్టి కొడుకైన విరూపాక్షుని పునర్నిర్మించిపట్టణములకధికారినిజేసి మిగిలిన కోమట్లను పెనుగొండలో నుండునట్లు చేసినట్టును ఇందుఁ జెప్పఁబడినది. ఇప్పటికిని పెనుగొండ కోమట్లకు ముఖ్యస్థలము. అక్కడ కన్యకాపరమేశ్వరిపేర దేవాలయము కట్టఁబడి వైశ్యులచే మిక్కిలి గౌరవముతో చూడఁబడుచున్నది. గ్రంథకర్తయైన భాస్కరపంతులనుబ్రాహ్మణుఁడు పెనుగొండ, కొండవీడు, రాజమహేంద్రవరము మొదలయిన ప్రదేశములయందుండిన కోమట్లకు గురువయియుండి కన్యకాపురాణమును రచించి, వైశ్యులవిషయమయి కొన్ని కట్టుపాట్లనుజేసి, నూటరెండు గోత్రములవారి నాకట్టుబాట్లకు లోఁబఱిచి, తనయేర్పాటులను మీఱినవారిని వర్ణభ్రష్టులనుగా బహిష్కరించి తనకు వశ్యులయినవారికిఁ దా నాచార్యుఁడును పురోహితుఁడును

Acc No. 10475

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc No.

నయ్యెను. గ్రంథసామగ్రి తక్కువగుటచేత నీతనికి లభియింపలేదు. నాకిప్పుడు నిశ్చయముగాఁ దెలియక పోయినను, ఇతఁడు పదునాఱవశతాబ్దమునకు బూర్వుఁడని తెలియవచ్చుచున్నది. ఈతని కన్యాదానప్రబంధమునుండి రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. అంతట నింగితజ్ఞుఁ డగునాకసుమాఖ్యుఁడు నాదరంబునన్
గాంతను జూచి యిట్లనుకంప దలిర్పఁగ నీమనంబునన్
జింత వహించి యిట్లునికి చెప్పుము నీకు మనోరథార్థముల్
సంతసమంద నిత్తును విచారము మానుము భైన్య మేటికిన్. ఆ. ౪.

చ. జలనిధి మేరదప్పిన నిశాకరబింబము త్రోవదప్పినన్
బలువిడి ధాత్రి క్రుంగినను భాస్కరుఁ డిట్లుదయింపకుండినన్
గులగిరి సంచలించినను గూర్మము భూమి భరింప కుండినన్
బలికిన బొంకనేరరు కృపాసిధులై తగువైశ్య లెప్పుడున్. ఆ. ౭.

---

10. బైచరాజు వేంకటనాథకవి

ఇతఁడు పంచతంత్రమును పద్యకావ్యమునుగా రచియించెను. ఈకవి క్షత్రియుఁడు ఈతని తాతయైన బైచరాజునుబట్టి యీకవి కీయింటిపేరు కలిగినట్లు తోఁచుచున్నది. కవి తనవంశకర్తయైన బైచరాజు నిట్లు వర్ణించియున్నాఁడు :—

ఉ. ధీరత రాజవంశజలధిం బ్రభవించె మహావిరోధిసం
హారవిహారి సాళ్వబిరుదాంకుఁడు బైచనృపాలుఁ డుద్ధరి
త్రీరమణీమనోహరునితీవ్రయశస్సృతికిన్ హరాద్రినీ
హారవసుంధరాధరము లయ్యె సమగ్రవిహారశైలముల్.

ఈ కవికాలమును సరిగా నిర్ణయించుటకుఁ దగిన యాధారము లేవియు దొరికినవికావు. తమనిఘంటువునందు బ్రౌఁడొరవా రితఁడు ౧౪౦౦ న సంవత్సరప్రాంతముల యందుండినట్లు వ్రాసియున్నారు. ఇందుకు విరుద్ధములైన ప్రమాణములు కనఁబడు వఱకును మన మీకాల ముసే సిద్ధాంతముగా గ్రహింపవచ్చును. ఈ వేంకటనాథుఁడు పూర్వకవి వర్ణనము నీక్రిందిపద్యమునఁ జేసియునాఁడు—

మ. హృదయబ్రహ్మరథం బతిప్రియతమం బెక్కింతుఁ జేత్రోమరు
త్సదనాస్థానికిఁ బెత్తు మానసనభస్సంచారిఁ గావింతు హృ
ద్విదితక్షీరసముద్రఖేలనమునం దేలింతు నుత్కృష్టవ
స్తువులం బ్రాజ్ఞులఁ దిక్కయజ్వ నమరేశుఁ సోము శ్రీనాథునిన్.

ఇందు శ్రీనాథుఁడు వేగొక్కనఁబడియుండుటచేతఁ గవి ౧౪౫౦ వ సంవత్సరమునకుఁ బూర్వపువాఁడు కాఁడనుట నిశ్చయము. కవి కత పెదతండ్రినిగూర్చి "లింగక్ష్మోణిపాలుండు యవనసైంధవకాననానలుండు" అని వ్రాసియున్నందున నతఁడు ముహమ్మదీయులకును హిందువులకును దక్షిణహిందూస్థానములో యుద్ధములు జరుగుచున్న కాలములో నుండి యుండవలెను. ఇతఁడు తన గ్రంథమును హరిహరనాథున కంకితముచేసి, ఆ విషయమున నిట్లు వ్రాసికొనియున్నాఁడు—

క. ఏచనవు గలము హరిహర। సాచివ్యము నొంద నన్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు। నాచనసోమునకు మతియు నాకుందక్కన్.

హరిహరనాథునకుఁ గృతియిచ్చుటచే నితఁడు నెల్లూరిమండలము లోనివాఁడని తోఁచుచున్నది. అప్పకవిగాని మఱి యే యితర లక్షణ కర్తగాని యీతనిపద్యములను లక్ష్యములనుగాఁ జేకొనియుండలేదు. ఆ హేతువునుబట్టి యితఁడాథునికుఁడని యూహించుటకంటె నీతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములయిన ప్రయోగము లుండుటచేత నుదహ

రింప మానిరని తలఁచుట మేలు. ఇతఁడు కవిత్వ మెట్లుండవలెనో యీ క్రిందిపద్యమునఁ దెలిపియున్నాఁడు—

చ. ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యరచాటగునాంధ్రవధూటిచొక్కపుం
జనుఁగవఁబోలి తేటయును జాటుదనంబును గాకయుండఁ జె
ప్పినయదెపో కవిత్వ మసిపింప నగిం చటుగాకయుండినన్.

వ్యాకరణదోషము లనేకము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము వయినిజెప్పినట్లే యుండి ప్రౌఢమయి హృదయాహ్లాదజనకముగా నున్నది. పర్వతరాజపుత్రుఁడయిన యీ వేంకటనాథకవి పంచతంత్రములోని కొన్ని పద్యములను సందర్భాహారించుచున్నాను—

చ. పలికినమాట నిల్వఁ డెడపందడపం జెడనాడు వచ్చుమె
చ్చుల దిగమ్రింగుఁ దొల్తొలుతఁ జూచినచూపులఁ జూడఁ డేర్పడం
జులకదనం బొనర్చు నెరసుల్ఘటియించు నదల్చివైచుఁ గే
వలనృపసంశ్రయంబు పగవారలకు న్వల దివ్వసుంధరన్—

మిత్రభేదము.

చ. ఇట నన్నుడించి యేమిగత మేగెకు చెప్పఁగదన్న యెట్టులె
క్కటిని జరింతు నన్న తృటికాలము నిన్నెడఁబాసియున్కఁ దు
ర్ఘటముగదన్న నాకడను గల్గిన యీధృతి యెందుఁ బోయె ని
ప్పటికి విచిత్ర మన్న విధి భద్రవిరోధిగదన్న యెన్నఁగన్—

సుహృల్లాభము.

చ. సురియ కరంబునం గొనక శూరుఁడు నీతికళావిలాసభా
సురుఁడు వధించు వైరి విరసుస్ దవుదవ్వులఁ జెంత నుండియుఁ
సురియ ధరించియుఁ మగువచొప్పున నేమియుఁ జేయలేఁడు త
న్నెరలఁగఁజేయ మానవ నికృష్ణుఁడు మాటలు వేయునేటికిన్—

సం. విగ్ర.

ఉ. చెప్పిన నంతరంగమున సింగఁడుబూరఁడునై ప్రియంబు సాం
పుప్పతిలంగఁ బల్కెనది యోయి కృతఘ్నుఁడ నీవు కావె ధ్రు
వప్పప సుహృత్తముం డయినయాయన నింటికిఁ దెచ్చి వెల్పు నే
చొప్పునఁ గొల్తు రట్లు పరిశుద్ధసపర్యలఁ గొల్చు టొప్పదే—
లబ్ధనాశము.

ఉ. నావిని బ్రాహ్మణుండనియె ననున్నఁ బ్రయత్న మెలర్పఁ బట్టికిం
గావలిపెట్టి పుట్టిసలు గాల్పఁగ నీ వటుపోవ నేను నా
లో వివరంబుమాలి మృగలోచన ముంగిస నే కిశోరర
క్షావిధి కొప్ప నేర్పఅచి జాటితి మందిర బాహ్యభూమికిఁ—
అసంప్రేక్ష్యకార్వితము.

---

11. అయ్యలరాజు రామభద్రుఁడు

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; తిప్పయార్యుని ప్రపౌత్రుఁడు; పర్వతన్నపౌత్రుఁడు; అక్కయార్యుని పుత్రుఁడు. ఈతఁడు కడపమండలములోని యొంటిమెట్ట గ్రామములోఁ బుట్టి పెరిఁగినవాఁడు; పరవస్తు ముమ్మడి వరదాచార్యునకు శిష్యుఁడయి వైష్ణవమతాభిమాన మును గలిగియుండినవాఁడు. ఇతఁ డొంటిమెట్టలో నున్నకాలములో నచ్చటి వీరరాఘవస్వామివిూఁద నొకశతకమును జేసెను. ఇతఁడు మొట్ట మొదటఁ గృష్ణదేవరాయల యంతిమదశలో విజయనగరములోఁ బ్రవే శించి కృష్ణదేవరాయనిచేతఁ దద్విరచితమయిన సకలకథాసారసంగ్రహ మును తెనిఁగింపఁ గోరఁబడెను. కాని గ్రంథపూర్తి కాకముండే కృష్ణ దేవరాయలు పరమపదము నొందినందున రామభద్రకవి గ్రంథము నాతని కంకితము చేయక యవతారికయందుఁ కృష్ణదేవరాయల ప్రార్థన చేతఁ దానాగ్రంథమును రచించితినని మాత్రము వ్రాసెను. ఈసకల

కథాసారసంగ్రహము శ్రీరామ పురూరవశ్చరిత్రాదులనుగల తొమ్మిది యాశ్వాసముల గ్రంథముగా నున్నది. ఈగ్రంథమునందును రామభద్ర కవి సూక్ష్మబుద్ధి గలవాఁడని యూహించుటకుఁ దగినమార్గము లనేక ములు గానఁబడుచున్నను, కవిత్వము ప్రౌఢముగాక వ్యాకరణదుష్ట మయి బాలరచిత మని సూచించుచున్నది. ౧౫౩౦ వ సంవత్సరమున కొకటి రెండేండ్లముం దీకవి గ్రంథరచన కారంభించినట్లు తోఁచు చున్నది. ఈకవి సకలకథాసారసంగ్రహముయొక్క యవతారికయందుఁ దాను గ్రంథరచన చేయఁబూనుటనుగూర్చి యీక్రిందిపద్యమును వ్రాసి యున్నాఁడు—

ఉ. నన్నయ తిక్కనాదికవినాథులు చెప్పినయట్లు చెప్పలే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరకయుండిరె తోఁచినట్లు ని
ర్వన్నతబుద్ధిఁ గబ్బములు యోజ రచింపక యందు జ్ఞానసం
పన్నులకావ్యముల్ హరిసమర్పణమైఁ జెలువొందు నెందునున్.

ఈబాలకావ్యమయిన సకలకథాసారసంగ్రహమునుగూర్చి యిందు విస్తరించి వ్రాయక యంచలి పద్యములను మాత్రము రెంటిమూటి నిం దుదాహరించుచున్నాను—

సీ. కానకకన్న సత్రానుండు నేఁటికిఁ
గానకకన్న సత్రానుఁ డయ్యెఁ
బుణ్యజనోత్కర్ణ పురుషుండు నేఁటికిఁ
బుణ్యజనోత్కర్ణ పురుషుఁ డయ్యె
ద్విజముఖ్యులనుగూడితిరుగుబాలుఁడు నేఁడు
ద్విజముఖ్యులనుగూడి తిరుగుటయ్యె
గోత్రపావనుఁ డైనకొమరుండు నేఁటికి
గోత్రపావనుఁ డైనకొమరుఁ డయ్యె

మత్తగజదానధారార్ద్రమార్గములను
దరులనీడల నెప్పుడుఁ దిరుగువాఁడు
మత్తగజదానధారార్ద్రమార్గములను
దరులనీడల నెప్పుడుఁ దిరుగుటయ్యె.

చ. చదువు వివేకమూల మసి సద్గురుసన్నిధి ధర్మశాస్త్రముల్
చదివి సుధాకరుండు నిజసద్గురుపత్నిని దా రమించుటన్
జదు వవివేకమూలమయి సంభవ మయ్యె నదేమనందు నా
మదనమహత్త్వ మెన్న నసమానపరాక్రమ మెన్నిభంగులన్.

చ. వినుతనిజాంఘ్రుల న్విడిచిపెట్టక పట్టుక నేలవ్రాలి లే
వనిగయుకు న్నరుండు బలుబాసల నమ్మిక లిచ్చి యాదరం
బునఁ గరమంది లేవనిడి భూతదయాంచితమానసోన్నతిన్
దనరినయాత్మవంశకథనంబు వచించిన లేచె వాఁడొగిన్.

సకలకథాసారసంగ్రహమును ముగింపకమునుపే కృష్ణదేవరా యలు మృతినొందినందున, ఆదరించుప్రభువులులేక బీదవాడయిన రామ భద్రకవి యందంచుఁ దిరిగి గుత్తియప్పలరాజు మొదలైనవారి నాశ్ర యించి వారివిూఁదఁ జాటుపద్యములను జెప్పుచుఁ గొంతకాలము జీవ నముచేసి, కడపటఁ కృష్ణదేవరాయని యల్లుఁడయిన రామరాజుయొక్క మేనల్లుఁడగు గొబ్బూరి నరసరాజువద్దఁ జేరి తాను తరువాత రచియిం చిన రామాభ్యుదయము నారాజున కంకితము చేసెను. ఈకవి గుత్తి యప్పలరాజుపయిని జెప్పిన చాటుపద్య మొకటి యిందు క్రింద బొందుపఱుచుచున్నాను—

రాజమనోజా! విద్యా! భోజా! దీనార్థికల్పభూజా! రిపుసం
భాజా! వైభవవిజితబిఁ డౌజా! రవితేజ! గుత్తి యప్పలరాజా!

ఈకవి చిరకాలము జీవించి బహుసంతానవంతుఁడయి దారి ద్ర్యముచేత బాధపడినవాఁడు. ఈతని సంతానాధిక్యమునుబట్టి యితనిని

జనులు పిల్లల రామభద్రయ్య యనియు పిలిచెదువాడుక గలదు. ఇతఁడు కృష్ణదేవరాయని యాస్థానకవి యన్నపేరే కాని యీతనికాల మంతయు నించుమించుగా నారాయణీయనంతరమునఁ గడపఁబడినది. ఇతఁడు కొంతకాలము పింగళి సూరన్నకును, తరువాత రామరాజ భూషణునకును సమకాలికుఁడుగానుండి కృష్ణదేవరాయల మరణానంతర మున నించుమించుగా నలుబది యేబది సంవత్సరములు బ్రదికి గిర్రాంవ సంవత్సరప్రాంతమునందు మృతినొందెను. ఈతఁడు చేసినగ్రంథము రామాభ్యుదయము ముఖ్య మయినది. ఇది మిక్కిలి ప్రౌఢమయిన కవితాధోరణి కలదయి, పదగుంభనమునందు పాండురంగ మహాత్మ్యమును బోలి యమకానుప్రాసములను గలదిగానున్నది. ఈకవి ప్రారంభదశ యందుఁ గృష్ణదేవరాయల దర్శనార్థముగా విజయనగరము వచ్చినప్పు డూరిబయల రామరాజభూషణునిశిష్యు లొకపద్యమును గుర్వాజ్ఞాను సారముగాఁ జెప్పఁబూని కుదురక యాలోచించుచున్నట్లును, వారు చలిచేత వడఁకుచు నచ్చటకు రాఁ దటస్థించిన యీ కవికి చలిమంట వేసి కప్పుకొన బట్ట నిచ్చి యతనిచేత

సీ. మోహోపదేశ తమోవ్యుత్థితము లైన
కనుదమ్ములఁ హిమాంబు లునుపరాదు
శ్రమబిందుతారకాగమఖిన్నకుచకోక
ములఁ జంద్రనామంబు దలఁపరాదు
శీర్ష్యదాశావృంత శిథిలతాసులతాంత
మసిఁయూడ వీవన ల్వీసరరాదు
పటుతాపపుటపాక పరిహీణతను హేమ
మింకఁ బల్లవపుటా ర్చిడఁగరాదు
లలన కానంగకీలికీలాకలాప
సంతతాలీఢ హృదయపాత్రాంతరాళ

పూరితస్నేహపూరంబు పొంగిపొరలఁ
జల్లనిపటీరసలిలంబు చల్ల రాదు.

అనుపద్యమును చేయించి తాము రచియించిన పద్యముగాఁజెప్పి తమగురువునకు సమర్పించినట్లును, రామరాజభూషణుడాపద్యముయొక్క చమత్కృతికిసంతోషించి దానిని తనవసుచరిత్రమునందు వేసికొన్నట్లును, ఒక పుక్కిటపురాణము కలదు గాని యది యెంతమాత్రమును విశ్వాస పాత్ర మయినదికాదు. కృష్ణదేవరాయలకాలములో రామరాజభూషణుఁడు కవిత్వమును జెప్పుట కారంభించినట్లే కనఁబడక పోవుటచేత నాతని కప్పటికే శిష్యబృంద మున్నదన్నవార్త యసందర్భ మగుటను బట్టియు, వసుచరిత్రము కృష్ణదేవరాయల యనంతరమున ముప్పదియైదు సంవత్సరములవఱకును బ్రకటింపఁబడక పోవుటచేత నంతటి మహాగ్రంథమును రచియించిన రామరాజభూషణుఁ డొక్కపద్యమును రచించుట కశక్తుఁడయి యంతకాలమునకు తరువాత నితరకవియొక్క పద్యమును దనదిగాఁ దనపుస్తకమునందుఁ జేర్చుకొనె ననుటకంటె హాస్యాస్పద మయిననూట వేయొకటి లేకపోవుటనుబట్టియు, ఈగ్రంథ చౌర్యకథ కల్పననిపుణులదేకాని కవిది కాదనుట స్పష్టము.

రామభద్రకవియొక్క కవితాపటిమనుజూచి రామరామభూషణుఁడు మాత్సర్యగ్రస్తుఁడయి యతఁడుచేసిన రామాభ్యుదయముయొక్క ద్వితీయాశ్వాసములోని "సింహనఖాంకురచ్ఛన్నే" త్యాది పద్యమునుజదివినప్పుడు 'పృథుల షడ్జస్వరోద్గీతభిల్లపల్లవాధరాగీతికాకర్ణనాతిభీతిపరవశాత్మపటీరకోటరకుటీరలీనఫణి' యనుచో వీణానాదమునకు ఫణులు బెదరుట స్వభావవిరుద్ధమని తప్పుపట్టె ననియు, దానిపయిని రామభద్రకవి నెమలియొక్క షడ్జస్వరముచేతఁ బాములు భయపడుట స్వభావసిద్ధమే యని సమాధానముచెప్పి యాతని గర్వ

భంగము చేసె ననియు, మఱియొకకథ చెప్పుదురు. కొంచెము మంచి గ్రంథమును రచించిన కవికెల్ల నతని యిష్టదేవతయో సరస్వతియో వచ్చి గ్రంథరచనము చేసిపెట్టినట్లుగా మనలో జెప్పుకొనెడు వాడుక ప్రకారముగా రామభద్రకవికిని రాజునొద్ద దా నాఱునెలలలో గ్రంథమును జేసి తెచ్చెదనని ప్రతిజ్ఞనుపట్టి తేలేక పోయినప్పుడు మితిపెట్టిన కడపటి దినమురాత్రి యాతని యిష్టదైవమయిన శ్రీరామమూర్తియే రామాభ్యుదయమును జేసిపెట్టి కవియొక్క మానము కాపాడెనని జనప్రతీతి యొకటికలదు. సకలకథాసారసంగ్రహమునందున్నరీతి పద్యములలో ననేకము లీరామాభ్యుదయమునందుఁ గానఁబడుచున్నవి. వానిలోనొక్క దాని నిం దుదాహరించుచున్నాను—

సీ. కానకకన్న సంతానంబుగావునఁ
గానకకన్న సంతానమయ్యె,
నరయ గోత్రసిధానమై తోఁచుగావున
నరయ గోత్రనిధానమయ్యె నేఁడు,
ద్విజకులాదరణవర్ధిష్ణుండు గావున
ద్విజకులాదరణవర్ధిష్ణుఁ డయ్యె,
వివిధాగమాంతసంవేద్యుండు గావున
వివిధాగమాంతసంవేద్యుఁ డయ్యెఁ
గటకటా దాశరథి సముత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకమార్గ
గామి యెట్లుచరించు నుత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకతటుల.

ఈకవి రేఫ శకటరేఫములభేదమును పాటింపక యత్రిప్రాసము లంచు యథేచ్ఛముగా మైత్రి కలుగఁజేసినవాఁడు. ఈతని కవిత్వరీతి దెలుపుట కయి రామాభ్యుదయములోని కొన్నిపద్యముల నిందు వ్రాయుచున్నాను—

చ. ప్రమద మెలర్ప నుగ్రమృగబాధ హరింపఁగ వేఁటమై నర
ణ్యమునకు రా నఘుం బొదవె నక్కట! ధర్మముఁ చాలుఁ గుక్కఁబ
ట్టు మనుట యెంచి విల్లటు తటుక్కున భారుణి వై చి సారమే
యములు మరల్పఁ బాచె మృగయాక్రియ పూసి పిభుండు ఖిన్నుఁడై.

అ. ౨.

ఉ. అక్కట! కోసలక్షితివరాత్మజ కానకకన్నముద్దులేఁ
జక్కనిమంచిరాకొమరుఁజందురుఁ డెక్కడ? యధ్వరావనం
బెక్కడ? దైత్యసంహరణ మెక్కడ? ఘోరవనాంతరశ్రమం
బెక్కడ? యెట్టు లంపుమనియె న్మని? నో రెటులాడె నింతకున్?

అ. ౪.

ఉ. వింధ్య మధిత్యకాకటకవిస్ఫుటపాదపపుష్పగుచ్ఛనా
గంధ్యము హేమధాతుమయకల్పితసంధ్యము బద్ధమేరుసా
గంధ్యము చండకేసరనికాయనిరాకృతభద్రదంతిద
ర్పాంధ్యముఁ గ్రుంగఁద్రొక్కితి మహాగుణభూషణ సత్యభాషణా.

అ. ౫.

ఉ. చూచుటలే దశోకవనిఁ జొచ్చి యటుంజని చూచెదంగదా!
యాచపలాక్షి మజ్జనని యచ్చటనుండినయేని లెస్స లే
దా చతురాననుండు మొదలైన సుపర్వ లెఱుంగఁ జిచ్చులో
వై చెడఁగాక యీయొడలు వానరవీరులమ్రోల వై తునే?

అ. ౬.

12. వెల్లంకితాతంభట్టు.

ఇతఁడు కవిచింతామణి యనులక్షణగ్రంథమును జేసిన గొప్ప కవి. ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; ఈతని తండ్రి యబ్బయ్య; తల్లి యెల్లమ్మ. ఈకవి కృష్ణరాయని రాజ్యారంభకాలమునం దుండినవాఁడు. కొంద ఱీతఁడు కృష్ణదేవరాయని కాలమునకుఁ బూర్వమునందే యుండెనని చెప్పుదురుగాని యితఁడు తనకవిచింతామణిలో నైషధము, భోగినీదండకము, జైమినిభారతము మొదలగు గ్రంథములనుండి యుదాహరణములు గైకొని యుంఁటచేతను, జైమినిభారతమును రచించిన పిల్లలమఱ్ఱి పినవీరన్న కృష్ణదేవరాయని తండ్రితాతలకాలములోనే యున్నవాఁడగుటచేతను, తాతంభట్టు కృష్ణరాయనికాలమునకుఁ బూర్వమునం దుండినవాఁడయినట్టు తోఁచదు. ఇతఁడు కవిచింతామణి యందు వ్యాకరణమును, ఛందస్సును, కావ్యలక్షణమునుగూడఁ గొంత వఱకుఁ జెప్పియున్నాడు. ఈలక్షణవేత్త కవిచింతామణియందుఁ దన్నుఁ గూర్చి వేసికొన్నపద్యము నిందుదాహరించుచున్నాను.—

సీ. శుచి యెల్లమాంబాగర్భశుక్తిముక్తామణి యబ్బధీమణిసూనుఁ డనఘబుద్ధి,
పావనవశిష్ఠశాలావతగోత్రుఁ డహార్యధైర్యుండు రామార్యతమ్ముఁ,
డష్టభాషాప్రక్రియాలబ్ధవర్ణుండు సన్నుతసాహిత్యచక్రవర్తి,
యనవద్యసర్వవిద్యాపారదృశ్వుండు విద్వజ్జనవ్రాతవిశ్రుతుండు,
సకలహరిదంతరాళవిశ్రాంతవిశద
కార్తికికచంద్రికాయతకీర్తి కాంతి
హరినిభుం డాస్యవాణీవిహారవసతి
తామసోల్లంఘి వెల్లంకితాతసుకవి.

ఈతఁడు రచియించినది లక్షణగ్రంథమగుటచేఁ గవిత్వనైపుణినిగూర్చి

వ్రాయుట యుచితముకాదు. అయినను గవిత్వరీతిఁ దెలుపుట కయి కవిచింతామణినుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

క. ఆది బురాణాగమములు
వేదంబులు నోరఁగాయవేయక నుడువక,
వాడేలా కవినరులకు
మేదిని నెవ్వారు సాటి మించినగరిమన్.

శా. ని న్నాడింపఁగవచ్చు గోపతనయుల్ నెయ్యంబున న్వేదిపై
నున్నా రీకడిఁగొమ్మ్ల జోగులు కరాళోన్మత్తులై వచ్చెదర్
వెన్నా మీగడయున్ ఫలం బొసఁగెదన్ వేగంబె రా రమ్మ్ల మా
యన్నాయంచును వ్రేతపెట్టు హరి యో యమ్మ్లా నగు న్మ్లాటికిన్.

---

13. కుమ్మర మొల్ల.

రామాయణమును తెనుఁగున రచియించిన యీ మొల్ల యీతఁ కూరి కేసనసెట్టికూఁతురు. ఈమె తనపుస్తకమునం దెక్కడను దన వంశమునుగూర్చి చెప్పుకొనకపోయినను, ఈమె కులాలవంశజాతయని పరంపరగా వాడుకవచ్చుచున్నది. ఈమె నివాసగ్రామము పడుగుపా డనియు, ఈమెయు తిక్కన సోమయాజులు భారతమును దెనిఁగించి నప్పుడు లేఖకుఁడుగానుండిన కుమ్మరగురునాథుఁడును సోమయాజుల తండ్రియైనకొమ్మనకు రంగప్ప యనుకుంభకారునిపుత్రివలన జన్మించి రనియు, కొందఱు వ్రాసియున్నారుకాని యీవ్రాఁత నిరాధారమయి నది. ఈమొల్ల తిక్కనసోమయాజికాలములోనే యుండిన దయిన పక్షమున,

"స్తుతగుణోద్ధాము నాచన సోము భీము
నవ్యమంజులవాగ్ధుర్య నన్న పార్య
రసికుఁ డైనట్టి శ్రీనాథు రంగనాథు"

అని తనరామాయణమందలి కవిస్తుతిలో, దిక్కనసోమయాజి కించుమించుగా నిన్నూఱుసంవత్సరములతరువాత నున్న శ్రీనాథుని స్తుతించుట సంభవింపనేరదు. కాబట్టి మొల్ల శ్రీనాథునికాలమునకుఁ దరువాత నున్నదనుటకు సందేహము లేదు. ఈమె కృష్ణదేవరాయల కాలములోని యల్లసాని పెద్దనాదుల నెవ్వరిని స్తుతియించి యుండక పోవుటచేత మొల్ల యాకాలమున కెంతో తరువాతిది కాదనియు స్పష్ట పడుచున్నది. ఈమె కృష్ణదేవరాయలకాలములోనే యున్నట్టు కథ లనేకములున్నవి. మొల్ల యాకాలమునందలిది కాదని సంశయించుటకు హేతువులేమియు గానరానందునను, ఆకాలపుకవులను స్తుతింపనందునను, ఆమె కృష్ణదేవరాయలకాలమందే యున్నదని నిశ్చయింపవలసి యున్నది. ఇప్పుడున్న తెలుఁగుగ్రంథములను బట్టిచూడఁగా, ఆంధ్ర కావ్యములను జేసినస్త్రీలలోనెల్ల నీమెయే ప్రాచీనురాలుగాఁ గానఁబడు చున్నది. ఈమె తన రామాయణములో,

"... ... ...గోప
వరపుశ్రీకంఠమల్లేశువరముచేత
నెఱిఁ గవిత్వంబు చెప్పంగ నేర్చినాను"

అని చెప్పుకొనుటచేత నీమె నివాసస్థలము నెల్లూరిమండలము లోని గోపవర మని తెలియవచ్చుచున్నది. ఈమె కవిత్వమునుజూచి తెనాలిరామకృష్ణుఁ డింటిపేరును గూర్చి యడిగి యాక్షేపించిన ట్లొక కథ కలదుగాని యది యిందుదాహరింపఁదగినదికాదు. అక్కడక్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁద నీమెకవిత్వము మిక్కిలి మృదువయి మధుర మయి రసవంతముగా నున్నది. ఈరామా

యణమును గొంతకాలముక్రిందటివఱకును వీధిబడులలో బాలురకు పాఠమునుగాఁ జెప్పుచుండిరి. ఇది పురుషులు చెప్పినగ్రంథములలో నసేక ములకంటె మనోజ్ఞమై ప్రౌఢమై యున్నది. మొల్ల రామాయణము నందలి కొన్నిపద్యముల నిం చుదాహరించుచున్నాను—

ఉ. రాజులు కాంతియందు, రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు, మృగరాజులు విక్రమకేళియందు, గో
రాజులు భోగమందు, దినరాజులు సంతతతేజమందు, రా
రాజులు మానమందు, నగరంబున రాజకుమారు లందఱున్.

బాలకాండ.

చ. సుడిగొని రాముపాదములు సోఁకినధూళి వహించి రాయి యే
ర్పడ నొక కాంత యయ్యెనఁట పన్నుగ నీతనిపాదరేణు వి
య్యెడ వడినోడసోఁక నిది యెట్లగునోయని సంశయాత్ముఁడై
కడిగె గుహుండు రాముపదకంజయుగంబు భయంబుపెంపునన్.

అయోధ్యా

చ. చించెదదైత్యసంఘములఁ జిందఱ వందఱ చేసి బ్రహ్మ బా
ధించెద లోకపాలకులఁ ద్రెళ్ళఁగ నేసెద భూతలంబు గ్ర
క్కించెద శైలజాలములఁ గీటడఁగించెద భూమినందనన్
గాంచెదఁ దల్లడిల్లకుము కంజహితాన్వయవార్ధిచంద్రమా.

అరణ్యకాం.

ఉ. సాలముపొంత నిల్చి రఘుసత్తముఁడ మ్మరివోసి శబ్దవి
న్మూలముగాఁగ విల్దివిచి ముష్టియు దృష్టియుఁగూర్చి గోత్ర భృ
త్కూలము వజ్రపాతహతిఁ గూలువిధంబునఁ గూలనేసె న
వ్వాలిఁ బ్రతాపశాలి మృదువందనశీలి సురాలి మెచ్చఁగన్.

కిష్కింధాకాం.

శా. వీరాలాపము లాడ నేల వినుమీ విశ్వప్రకాశంబుగాఁ
బారావారముఁ గట్టి రాఘవుఁడు కోపస్ఫూర్తి దీపింపఁగా
ఘోరాజి న్నినుడాసి లావుకలిమిన్ గోటీశయుక్తంబుగాఁ
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్వెట్టు భూతాళికిన్.

సుందరకాం.

మ. అనఘుం డుజ్జ్వలచాపదండమున బ్రహ్మాస్త్రంబుసంధించి యొ
య్యనఁ గర్ణాంతముగాఁ గడుం దివిచి ప్రత్యాలీఢపాదస్థుఁడై
దనుజాధీశ్వరుబాహుమధ్యము వడిం దాఁకంగ లక్ష్యంబుగాఁ
గొని బిట్టేసె నదల్చి తీవ్రతరమౌకోపంబు దీపింపఁగన్.

యుద్ధకాం.

---

14. పిడుపర్తి సోమనాధుఁడు

ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; పిడుపర్తి బసవనారాధ్యుని పుత్రుఁడు. ఇతఁడు పాల్కురికి సోమనాధుఁడు రచియించిన ద్విపద బసవపురాణమును తెనుఁగున నేడాశ్వాసముల పద్యకావ్యముగా రచియించెను. పాల్కురికి సోమనాధుఁడు రచియించిన పండితారాధ్యచరిత్రము మొదలయిన గ్రంథములను శ్రీనాథాదు లీకవికిఁ బూర్వమునందుఁ బద్యకావ్యములనుగాఁజేసిన ట్లీబసవపురాణపీఠికయం దీకవి యీక్రింది పద్యమునుచేఁ జెప్పియున్నాఁడు.—

సీ. విరచించె శైవమని వేదపాదస్తవం బొకపాదమున వేదయుక్తినిలిపి
హరభక్తి వైదికం బని శ్రుతు లిడి చెప్పెఁ బ్రతిభ సోమేశుఁ

సరవి శ్రీనాథుఁ డాచరిత పద్యప్రబంధముచేసె ద్విపదలు తఱుచునిలిపి
యాతండె పద్యకావ్యముచేసె నై ధష మంచితహర్ష వాక్యములఁ బెట్టి
సోమగురువాక్యములు పెట్టి భీమసుకవి
గరిమ బసవపురాణంబు గణనఁజేసెఁ
గానఁ బూర్వకావ్యము వేఱుగతిరచించు
వారి కాదికావ్యోక్తులు వచ్చినెగడు.

"సోమగురువాక్యములుపెట్టి భీమసుకవి...బసవపురాణంబు... చేసె" నన్న పయివాక్యమునుబట్టి వేములవాడ భీమకవి నన్నయభట్టార కుని కాలములోనివాఁడుగాక పాల్కురికి సోమనారాధ్యున కెంత్తో తారు వాత నుండినవాఁ డయినట్లు విస్పష్టమగుచున్నది. ప్రతాపరుద్రునికాల ములో ప్రతాపరుద్రుని మంత్రులలో నొకఁడును తన శిష్యుఁడును నయిన యిందుటూరి యన్నదండనాథుని సాహాయ్యముచేత పాల్కురికి సోమ నార్యుఁడు గ్రంథకర్తృపూర్వులకు దోకిపర్తియను నగ్రహారమిప్పించెను. ఈయగ్రహారమునకుఁ దరువాత భంగము కలుగఁగా గ్రంథకర్తయొక్క ముత్తాతయైన సోమనారాధ్యుఁడు ప్రౌఢదేవరాయని రాజ్యకాలములో దానిని మరల సంపాదించెను. ఈసంగతి బసవపురాణములో నీక్రింది పద్యమునందు జెప్పఁబడినది.

క. ఆదిన్ బ్రతాపుఁ డిచ్చిన
యాదోకిపురంబు నడుమ నంకిలి పడిన
మోదమునఁ బ్రౌఢరాయమ
హీదయితునివలనఁ దెచ్చె నెల్లరు నెఱుఁగన్.

కృతికర్తయైన సోమనాథునితండ్రి బసవయ్య, బసవయ్యతండ్రి దేవయ్య, దేవయ్యతండ్రి సోమనాథుఁడు. కాఁబట్టి ప్రౌఢదేవరాయని రాజ్యకాలములో దోకిపర్తి యగ్రహారమును మరల సంపాదించిన

యీ సోమనాథుఁడు కవికి ముత్తాత. ప్రౌఢదేవరాయఁడు హూణశకము ౧౪౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినందున, అతని రాజ్యకాలములో నుండిన సోమనాథుని మునిమనుమఁడు తరువాత నఱువది రెబ్బది సంవత్సరముల కుండి యుండును. కాఁబట్టి యీ కవి ౧౫౧౭ వ సంవత్సరప్రాంతములఁ గృష్ణ దేవరాయని రాజ్యారంభకాలములో నున్నాఁడని చెప్పవచ్చును. బసవ పురాణకథానాయకుఁడైన బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు పశ్చిమమున నుండు హింగుళేశ్వరాగ్రహారమునందు వాసము చేయుచుండిన శివభక్తుఁ డయిన మండంగి మాదిరాజను బ్రాహ్మణుని పుత్రుఁడు. ఇతఁడు శివుని వాహనమైన నందియొక్క యంశముచేత భూమిమీఁద ననతరించెనని శైవులు నమ్ముచున్నారు. తల్లిదండ్రు లీయన కుపనయనము చేయఁ బోయినప్పుడు, చేసికోక తాను శివునిఁదవ్ప నేఁబోకని గురువునుగా నంగీక రింపనని నిరాకరించెను. ఇతఁడు పెద్దవాఁడయిన తరువాత పదునొకండవ శతాబ్దమునందు కళ్యాణపురాధీశ్వరుఁడుగా నున్న బిజ్జలరాజునొద్దఁ జేరి యాతని దండనాయకుని గూఁతురయిన గంగాంబను వివాహము చేసి కొని కడపటి బిజ్జలరాజునకు మంత్రియయ్యెను. ఈతఁడే యీ దక్షిణ హిందూస్థానమునందు వీరశైవమతోద్ధారణము చేసినవాఁడు. ఈతని మేనల్లుడయిన చెన్నబసవన్న కూడ వీరశైవమును దేశమునందంతటను వ్యాపింపఁజేసెను. బసవపురాణమునందు బసవేశ్వరుని మహిమ లనేక ములు చెప్పఁబడియున్నవి.

సోమనాథకవియొక్క కవిత్వరీతిఁ జూపుటకయి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను :—

ఉ. ఖండశశాంకశేఖరు నఖండమహత్వమెకాని యాత్మ వే
ఱొండు దలంపఁ డెన్నఁడు పయోజభవాన్వయదుగ్ధవార్ధిచం

ద్రుండు దురత్యయోరుభవదోషవిదూరమనఃప్రచారుఁ డై
మండఁగి మాదిరాజు గుణమండితవందితుఁ డొప్పు నప్పురిన్— ఆ. ౧

ఉ. పట్టకు పట్ట కింక వృషభం బది మాటలు చెల్లినప్పుడే
పెట్టితి లింగముద్ర యదె బీరము తప్పఁగఁ బట్టి తేనియున్
గొట్టుమనీశిరంబు ధరఁగూలఁగ మాబసవన్న యాన చే
పట్టులఁ గాచుచెల్ల శివభక్తులకుఁ బిరుదంబుగావునన్—ఆ. ౫

శా. ఆనందాశ్రుపయోధి నిట్టవొడువన్ హర్షోత్థరోమాంచన
శ్రీ నెమ్మోముకి భూషణంబుగ లసద్దివ్యోద్దమద్దద్ద
ధ్యానమ్ముల్ గురుకర్ణ సత్వములుగాఁ దాత్పర్యముల్ భక్తియున్
లోనన్ గీల్కొనియున్న యాత్మసుతు నాలోకించి మై పెంచుచున్—ఆ.౭

---

15. పిడుపర్తి బసవకవి

ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు. బసవపురాణమును పద్య కావ్యముగా రచియించిన సోమనాథుని తమ్ముఁడయిన పాలనార్యుని పుత్రుఁడు. కాఁబట్టి యీ కవియు సించుమించుగా సోమనాథుని కాలమునందే యున్నవాఁడగుటచేత ౧౫౫౦ వ సంవత్సరప్రాంతమునం దున్నవాఁడని చెప్పవచ్చును. ఇతఁడు పాల్కురికి సోమనాథుఁడు రచియించిన ప్రభు లింగలీలను తెనుఁగున నై దాశ్వాసముల పద్యకావ్యమునుగా రచించెను. ఈ ప్రభు లింగలీలయందు బసవేశ్వరునికిని బసవేశ్వరుని మేనల్లుఁడయిన చెన్నబసవన్నకును గురువయిన యల్లమప్రభుఁడను జంగముదేవరయొక్క కథ చెప్పఁబడియున్నది. పిడుపర్తి బసవకవియొక్క కవనవిధము తెలియుటకై ప్రభులింగలీలనుండి రెండుమూడు పద్యముల నుదాహరించుచున్నాను.—

ఉ. ఊరును నిల్లుఁ బల్లియలు నొల్లక సల్లలితాంతరంగులై
ఘోరతరాటవిఁ ఘనసికుంజములన్ సెలయేళ్ళచెంత శ్రీం
గారవంబులన్ భయదగహ్వారసీమఁ దపంబుఁ జేసి పెం
పారుమహాముసీశ్వరులయాత్మలుఁ దత్తఱ మందె నత్తఱిఁ. ఆ. ౧.

ఉ. చిత్తసరోజ మిష్టమునఁ జేరిచి చూపులు ప్రాణలింగముఁ
హత్తఁగఁజేసి భావమున కంచితతృప్తి యొసంగి సంగముల్
రిత్తలు చేసి యెండును జరింపఁగ నేరిచి తేని నీవ య
త్యుత్తమలింగమూర్తి వివి యొప్పుగఁ జేకొను సిద్ధరామనా. ఆ. 3.

మ. బసవయ్యా భవదీయమందిరమునఁ భక్తిఁ సదాభోజనం
బసలారంగ నొనర్చుజంగమము లాత్యాసక్తి నాఁకంటిచే
విసువంగా నీకనేల తామసము తీవిఁ వారిఁ దోడ్తెచ్చి మీ
రసమానస్థితి నారగింపఁ గదరయ్యా హాయిగా నేఁటికిఁ. ఆ. ౫.

---

16. కోటి శివరామయ్య

ఈకవి సానందోపాఖ్యాన మను నాలుగాశ్వాసముల పద్యకావ్య మును రచించెను. ఇతఁడు శూద్రుఁడు; కౌశికగోత్రుఁడు; కోట బాప నయ్య పుత్రుఁడు; కాళహస్తిపుర నివాసుఁడు. ఇతఁడు తాను కృష్ణ దేవరాయల కాలమునో నున్నధూర్జటికవి శిష్యుఁడ నని గ్రంథములో జెప్పుకొని యుండుటచేత ౧౫౨౫ - ౧౫౫౦ వ సంవత్సరములకు మధ్య నుండియుండును. సానందోపాఖ్యానమునందు లక్షణవిరుద్ధము లైన ప్రయోగములు కొన్ని కానఁబడుచున్నవి. కవిత్వము మృదువుగానే యున్నది. ఈ గ్రంథమునందలి రెండు మూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. గారెలు బూరె లిడ్డెనలుఁ గమ్మనిదోసెలుఁ జక్కి-లంబులుఁ
జారులుఁ గూరలుఁ ఫలరసంబులుఁ జేనెలుఁ బొనకంబులుఁ
సారెలుఁ బొయసాన్నములుఁ జక్కెర లప్పడంబులుఁ
బేరిననేతులుం జెఱకుబిళ్ళలుఁ జల్లసిసీరుమజ్జిగల్. ఆ. ౧.

ఉ. పాపము చేయవద్దనుచుఁ బల్మఱుఁ బెద్దలు చెప్పిన న్మహా
కోపముమీఱి వారియెడఁ గుత్తుకబంటివిషంబు గ్రక్కుచున్
బాపము గీప మేడది నెపం బిడి జీవము దాఁటిపోయి యే
దాపున నెందుఁ బోవునో నిదాన మెఱుంగ రివేటిబోధనల్. ఆ. ౨.

మ. జమువెంటం బురవీధులం జనుచు భాస్వత్పట్టణశ్రీవినో
దము లీక్షింపుచుఁ జూడఁజూడ మతియుం దండోపతండంబులై
భ్రమ కల్పించుపురీవిశేషములకుం బ్రాజ్యాబ్భతానీతుఁడై
యమునిం గన్గొని పల్కె సంయమి మకరందానందసాంద్రోక్తుల. ఆ.3.

---

17. కుమార ధూర్జటి

ఈకవికి నిజ మయినపేరు వేంకటార్యుఁడు. ఇతఁడు పాకనాఁటి నియోగిబ్రాహ్మణుఁడు, కాళియామాత్యుని పుత్రుఁడు ; ధూర్జటికవి పౌత్రుఁడు. ఈకవి యాకువీటిరా జయిన చినవేంకటాద్రియొక్క కోరిక మీఁదఁ గృష్ణరాజవిజయ మనుపేర కృష్ణదేవరాయల చరిత్రమును శ్రీరామాంకితముగా రచియించెను. ఈతని కవిత్వము మిక్కిలి రసవంత మైనది. ఇతఁడు కృష్ణరాజవిజయ మనెడి యీనాలుగాశ్వాసములగ్రంథ మును మాత్రమేకాక సావిత్రీచరిత్రము, ఇందుమతీవివాహము మొద లయిన గ్రంథములుకూడఁ జేసినట్లు తెలియవచ్చుచున్నది. కృష్ణరాజవిజ

యమునందలి యీ ప్రకింది కవిస్తుతి పద్యమువలననే యీకవియొక్క ప్రౌఢిమ తేటపడుచున్నది—

సీ. వాక్చాసనుం డగువాని నిక్కంబుగా నలబ్రహ్మదేవుఁడేయని నుతింతుఁ
గుండలీంద్రసమాఖ్యఁ గొమరొందుకవిచంద్రు ననువొంద శేషాహి
యని తలంతు
శ్రీనాథవిఖ్యాతిజెన్నొందుబుధవర్యుఁబురుషోత్తముఁడటంచుబుజ్జగింతు
భూర్జటిప్రౌఢిచే నూర్జితుం డగువాని సాక్షాచ్ఛివుండని సంస్మరింతు
నవని మతీయును వెలసిన యాంధ్రకవుల
నాధునిక పూర్వకవుల యశోధనికుల
సారసాహిత్యసౌహిత్యసరణి వెలయ
వర్ణన లొనర్తు రమణీయవాక్యములను.

ఈకవి తన్నుఁగూర్చి కృష్ణరాజవిజయమునం దీక్రిందిరీతిగాఁ జెప్పుకొన్నాఁడు—

సీ. నను భరద్వాజగోత్రుని సదాపస్తంబసూత్రుని బాంధవస్తోత్రపాత్రుఁ
బాక నాఁ టార్వేలవంశప్రసిద్ధుని భూర్జటిపౌత్రు బంధురచరిత్రు
సద్గురుకారుణ్యసంప్రాప్తవిద్యావిహారుని శ్రీకాళహస్తినిలయ
చిత్రసూనాంబికాశ్రీకరానుగ్రహాసాదితకవితారసజ్ఞహృదయు
సారరచనాధురీణుఁ గుమారభూర్జ
టిప్రధానాగ్రగణ్యుఁ బటీరహీర
మహితసతీక్షితిఁ గాళియామాత్యపుత్రు
వేంకటార్యుని బిలిపించి వేడ్క నసియె.

క. బాలుఁడ వయ్యును విద్యా । శీలుఁడవు గభీరమధురశృంగారకళా
లాలితచాతుర్య కవి । త్వాలోచననిపుణ వేంకటామాత్యమణీ.

ఉ. చిత్రముగాఁగ బిన్నపుడె చెప్పితివో రసము ల్చెలంగ సా
విత్రిచరిత్రముఁ మిగుల వేడుక నింద్రుమతీవివాహమున్

స్తోత్ర మొనర్ప నర్హా మగుసూ క్తిగతిన్ రచియించితేఁ గదా
ధాత్రిఁ బ్రసిద్ధిఁగాంచితివి ధన్యుఁడ వౌర కుమారగూర్జటీ.

* * * * *

చ. తెలుఁగునఁ జెప్ప నేర్చినసుధీజను లెల్ల సెబాసు ధూర్జటీ
బళి యనఁ దళ్కు-గుళ్కు-వగఁ బాటిలు తేట తెనుంగుమాటలన్
మెలఁకువగాంచు బెళ్కు-జిగిమించఁ బ్రబంధములన్ ఘటించితౌ
పలుకులముద్దరాలిమిహిబంగరుటందెరవల్ చెలంగఁగన్.

* * * * *

క. మాకరుణకుఁ బాత్రుండవు । ప్రాకటగతిఁ బద్యకావ్యఫణితిం జెపుమా
శ్రీకృష్ణరాయచరితము । నీకవితాప్రౌఢి సుకవినికరము మెచ్చఁగ.

శ్రీకృష్ణరాజవిజయములోని యీక్రిందిపద్యమునుబట్టి చూడఁగాఁ
గృష్ణదేవరాయల పట్టాభిషేకమహోత్సవమునాఁటి కార్వేటి బుక్కరాజు
జీవించియున్నట్లే కనఁబడుచున్నది—

సీ. చక్కెరవిలుకాని చక్కఁదనముగల్గి చొక్కమా నార్వేటి బుక్కరాజు,
సాకల్యముగఁ గీర్తి సర్వదిక్తటులందుఁ బ్రాకటస్థితిమించు నొకువారు,
కంటకరాజన్య గర్వంబు లడఁగించి లీలచే మించునంద్యాలవారు,
ధాటీనిరాఘాట ఘోటీహతవిరోధికోటుల్లె వెలయు వెల్గోటివారు.
చండతరశౌర్య లగు పెమ్మసానివారు
బూదహళివారు మొదలైనభూమిపతులు
గొలువఁ పట్టాభిషిక్తుఁడై చెలువుమీఱి
రమ్యగుణపాళి శ్రీకృష్ణరాయమహీళి.

ఈ కవియొక్క తాత కృష్ణదేవరాయని యాస్థానమునం దున్న వాఁడగుటచేతను కృష్ణరాజవిజయమును జెప్పినప్పటి కితఁడు బాలుఁడని చెప్పఁబడియుండుటచేతను కృష్ణరాజవిజయము ౧౫౫౦ వ సంవత్సర

ప్రాంతమునందు రచియింపఁబడి యుండును. ఈ కవియు ౧౫౬౦-౭౦ సంవత్సరముల వఱకు జీవించియుండునని యూహింపఁదగియున్నది. ఈతని కవిత్వము మృదుమధుర వాక్యరచనాధురీణమయి కర్ణరసాయన ముగా నుండును. ఈతని కవనధోరణిని దెలుపుటకుఁ గృష్ణరాయ విజ యములోని రెండుమూడు పద్యము లిందుదహరింపఁబడుచున్నవి—

ఉ. ఠీవిగ నౌకువారును గడిందిరహిన్ వెలుగోటివార లా
రావెలవారుఁ గూడుకొని రాత్రిపగల్ చతురంగసేనతో
నేవగఁ జూచినన్ దివియ నెంతయు శక్యముగాని దుర్గమా
భూవరమూళి కాంచి యొకపూఁటనె తీసెదనంచు నుగ్రుఁడై.

శా. ఔరా చూచితిగాదె రాయలబలం బౌకార మేనుంగు ల
య్యారే యీచతురంగసంఘము లహాహా మన్నెవారల్ బళీ
ధీరుల్ రాజకుమారు లంచు మది నెంతేనద్భుతం బొందుచున్
బోరన్ శక్యమె యీనృపాలమణితో భూరిస్థిరప్రౌఢిమన్—ఆ. 3

మ. చెలువల్ తొడొక్కనిరా మణీఖచితమంజీరధ్వను ల్మించఁగాఁ
దళుకుంజెక్కుల మెఱుంగుటద్దములపైఁ దాటంకరత్నద్యుతుల్
వెలయం దా గజరాజపుత్రి యగుఠీవిం దెల్పుచందాన వ
చ్చె లతాంగీమణి మందమందగతులన్ శృంగార ముప్పొంగఁగన్-ఆర

18. దోనూరి కోనేరుకవి

ఈ కోనేరుకవి తెలుఁగున బాలభాగవతమును రచియించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; దోనూరి నాగయ్యమంత్రి పుత్రుఁడు. కవి తనవృత్తాంత మును బాలభాగవతములోని యీ క్రిందిపద్యమునందుఁ జెప్పుకొని యున్నాఁడు :—

సీ. శ్రీమదహోబిలశ్రీనృసింహసమగ్రకరుణావివేషప్రకాశమహితు
భాసురసంస్కృతప్రాకృతాదికశాస్త్ర భాషాకవిత్వ సౌభాగ్యనిపుణు
జనవర్ణి తాశ్వలాయనసూత్రపావను శ్రీవత్సగోత్రాబ్ధిశీతకరుని
సారస్యవినుతు దోనూరి నాగయమంత్రిపుత్రుఁడ నైనట్టి బుణ్యచరితుఁ
జతురభూనాయకాస్థాన సకలసుజన
వందితుని నన్నుఁ గోనేరు నాథసుకవి
నర్థిఁ బిలిపించి సత్కార మాచరించి
పలికె నిట్లని గంభీరభాషణముల.

ఇట్లు కవిని బిలిపించి గ్రంథరచన చేయుమన్నది తిరుమలరాజు. ఈ తిరుమలరాజు వసుచరిత్రము కృతినందినయతఁడుగాక యీతని పెద్ద తండ్రి కుమారుఁడయిన మఱియొక తిరుమలరాజు. బాలభాగవతము నందుఁ జెప్పఁబడిన వంశానుక్రమమునుబట్టి యీర్వీటి బుక్కరాజునకు తిమ్మరాజనియుఁ, కొండరాజనియు, శ్రీరంగరాజనియు ముగ్గురు కొమాళ్లు గలరు. వారిలో నగ్రజుఁడయిన తిమ్మరాజునకు భార్యయైన గోపమాంబ వలన తిరుమలరాజనియు, విఠలరాజనియు, చినతిమ్మరాజనియు, పాప తిమ్మరాజనియు, నలుగురు పుత్రులు గలిగిరి. వీరిలో జ్యేష్ఠుఁడయిన తిరు మలరాజు కాలమునం దీ బాలభాగవతము రచింపఁబడినది. ఈ తిరుమల రాజు తండ్రియగు తిమ్మరాజునకు తమ్ముఁడయిన శ్రీరంగరాజునకు కోన

రాజు, తిమ్మరాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటరాజు అని యైదుగురు కొడుకులు. వీరిలో మూడవవాఁడైన రామరాజు కృష్ణదేవ రాయల యల్లుఁడు. ఈ రామరాజువద్దనే వసుచరిత్రమును రచించిన రామరాజభూషణుఁడు మొదట ఆస్థానకవీశ్వరుఁడుగానుండి యాతని మరణానంతర మతని తమ్ముఁడైన తిరుమలదేవరాయనికి వసుచరిత్రము నంకితము చేసెను. దీనినిబట్టి చూడఁగా శ్రీరంగరాయని పుత్రులైన రామరాజ తిరుమలదేవరాజులును, తిమ్మరాజుపుత్రుఁడైన తిరుమలరా జును పినతండ్రి పెదతండ్రి పుత్రు లగుటచేత సమకాలికులని యేర్పడు చున్నది. వీరిలో రామరాజు క్రీస్తుశకము ౧౫౮౮ వ సంవత్సరము మొద లుకొని ౧౫౬౮ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసి యా సంవత్స రమునందు తాళికోటయుద్ధములో మృతుఁడగుటచేతను, ఆతనితమ్ముఁ డైన తిరుమలదేవరాయలు ౧౫౬౮ వ సంవత్సరము మొదలుకొని ౧౫౭౩ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసియుండుటచేతను, బాల భాగవతమును చేయించిన తిరుమలరాజుసహిత మించుమించుగా ౧౫౭౦ వ సంసత్సరాంతమునం దనఁగా పదునాఱవశతాబ్ది మధ్యమునం దుండియున్నా ఁడనుట స్పష్టము. కడపమండలములోని కడప పట్టణము నకు పశ్చిమోత్తర దిగ్భాగమునందు ౧౬ మైళ్ళ దూరములోనున్న యెఱ్ఱగుడిపాడు గ్రామములోని విష్ణ్వాలయములోని శాలివాహనశకము ౧౫౭౩ వ సంవత్సరమునం దనఁగా హూణశకము ౧౫౭౧ వ సంవత్స రమునందు తిమ్మరాజు కుమారుఁడయిన తిరుమలరాజు దానము చేసి నట్టున్న శిలాశాసనముకూడ ఈ యంశమును స్థాపించుచున్నది. అయినను బళ్ళారిమండలములోని విజయనగరమునందలి హజారరాముని దేవాల యములో ముఖద్వారముయొక్క దక్షిణపు గోడమీఁద తిమ్మరాజు కుమారుఁ డయిన తిర్మలరాజు శాలివాహనశకము ౧౫౭౭ వ సంవత్స రమునందు దానముచేసినట్టు శిలాశాసన మొకటి కానఁబడుచున్నది.

దీనినిబట్టి చూడఁగా నితఁడు రామరాజు పెదతండ్రికుమారుఁ డగుటచేత రామరాజుకంటె పెద్దవాఁ డయినట్టును, సామంత రాజయిన యీ తిమ్మ రాజు ముందుగా మృతుఁడగుటచేత నాతని కుమారుఁ డయిన తిరుమల రాజు రామరాజుకంటె పదిసంవత్సరములు ముందుగానే రాజ్యమునకు వచ్చినట్టును, ఊహింపఁదగియున్నది. అందుచేత నీ తిరుమలరాజు క్రీస్తు శకము ౧౫౨౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౫౧ వఱకును రాజ్యముచేసినట్టు రూఢిగా చెప్పవచ్చును. కాఁబట్టి దోనూరి కోనేరు నాథ కవియు పదునాఱవ శతాబ్దముయొక్క పూర్వార్ధమునందే యుండి, తిరుమలరాజుయొక్క రాజ్యారంభదశలోనే బాలభాగవతమును రచియించి యుండును. బాలభాగవతము తిరుమలరాజుయొక్క ప్రేరణచేతనే రచియింపఁబడినను, అది తిరుమలరాజున కంకితము చేయఁబడక యాతని ప్రార్థనమీఁద మృతుఁ డయిన యాతనితండ్రి తిమ్మరాజున కంకితము చేయఁబడినది. తెలుఁగు పుస్తకములయందును తామ్రశాసనాదుల యందును తిమ్మరాజునకు తిరుమలరాజనియు, తిరుమలరాజునకు తిమ్మ రాజసియు యథేచ్ఛముగా పర్యాయపదములవలె వాడబడినవి. సంస్కృత పండితులయిన హూణవిద్వాంసు లొకరు రాచూరికోటలో నొక గుమ్మ మునకు దక్షిణముగా గోడలోఁగూర్చిన సుమారు నలువదియొక్క యడుగుల పొడుగును మూడడుగుల వెడల్పును గల రాతిపలకమీఁద చెక్కిన తెలుఁగు శాసనములో :

"శ్రీమతు మాసరగండగొట్టె గంగయ్యరెడ్డివారు పెద్దమానపురము నందు సుఖసంకథావినోదంబున పృథివీరాజ్యము చేయుచుండగాను తద్రాజ్య రక్షామణి అయిన శ్రీనారాయణదేవ దివ్యశ్రీపాదపద్మా రాధక సకలజన ప్రతిపాలక పరబలసాధక సకలదయాసాధక పుణ్య గుణసనాథ విశ్వలనాథ భూనాథుండు ఆదావాని తుంబికి మాగుద హోలువదుర్గాలు సాధించి తదనంతరంబు రాచూరి పట్టణ పట్టిసాభి

ముఖుండై సుఖసంకథావినోదంబున పృథివీరాజ్యము సేయుచునుండి శకవర్షంబులు గ.౨౧౬ అగు జయసంవత్సర మార్గశిర శుద్ధ దశమి రవివాసరంబునందు స్వారాష్ట్ర సమస్త ప్రజారక్షణార్థము గిరిదుర్గము రచియించెను."

అని కాకతీయప్రభువుల కాలములో శాలివాహన శకము గ.౨౧౬ వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము గ.౧౯౯ వ సంవత్సర మునందు గొట్ట గంగయ్యయు నొకానొక విఠలరాజును ఉన్నట్లు చెప్పఁ బడి యుండుటచేతను.

ఉ. "బొంకనిధర్మజుం డడుగఁబోవనిపన్నగశాయి యూజిలో
గొంకనియర్జునుండు కఱకుందులు లేనిశశాంకు డెన్నఁడున్
గ్రుంకనిభానుఁ డన్యసతిఁ గోరసిజిష్ణుఁ డనంగఁబొల్చు ధ
ర్మాంకుఁడు విఠలక్షితివరాగ్రణి మానధనాగ్రగణ్యుఁడై

మ. తనకు న్నెచ్చెలి యైనక్రీడిపయి నంతర్మోహబంధంబు పో
వనివాఁడై హరి విఠలేశ్వరుఁడు తద్వంశేంబునన్ సంపదల్
తనర న్నల్వదియే స్తరంబు లగునంతం దిమ్మభూపాలనం
దనుఁడై విఠలరాజమూర్తి పొలిచెన్ ధర్మావనోద్యోగితన్"

ఇత్యాది పద్యములతో బాలభాగవతమునం దొకవిఠలరాజు వర్ణింపఁబడియుండుటచేతను, ఆవిఠలరాజే యీవిఠలరాజని భ్రమించి యీకపియు విఠలరాజును పదునాల్గవశతాబ్దారంభమునం దున్నట్లు వ్రాసియున్నారు. కాని వారు వివరించినకాలము సరియైనది కాదు. కాకతీయప్రభువులకాలములో నున్న విఠలరాజు వేఱొకఁడు కాని యీతఁడు కాఁడు. అతఁ డొకవేళ రంగనాథరామాయణకృతికర్తయగు కోనబుద్ధరాజుతండ్రియైన విఠలరాజయిన నయియుండవచ్చును. కోనేరు కవి తనబాలభాగవతమునందు పదునేనవశతాబ్దారంభమం దున్న శ్రీనా

థునిఁ బూర్వకవినిగా స్తుతించియున్నాఁడు. కోనేరుకవియు విఠ్ఠలనాథుఁ డును పదునాల్గవ శతాబ్దారంభమునఁ యుండినపక్షమున తరువాత నూఱుసంవత్సరములకు పయిగా పదునేనవశతాబ్దములో 'నున్నశ్రీనా థునిఁ బూర్వకవినిగా పరిగణించుట సంభవించి యుండదుగదా? కాఁబట్టి యీకవి పదునాఱవశతాబ్దమధ్యమునం దున్నాఁ డనుటయే విశ్వసనీయము. ఈతనికవిత్వ మనర్గళధార గలిగి హృదయరంజకము గానే కానఁబడుచున్నది. ఇప్పుడు బాలభాగవతములోని రెండుపద్య ములనుమాత్ర మిం దుదాహరించుచున్నాను—

చ. కలియును రాజచిహ్నములు గ్రక్కున మాని భయోపతాపదు
ర్బలుఁ డయి తత్పదాబ్జములపై నిజహస్తము చేర్చి, దేవ! నీ
లలితకృపాణపుత్రిక థళద్ధళితం బగుచున్న యంతలోఁ
జలమజియుఁ థుళర్థుళితసంగత మయ్యె మదీయచిత్తమున్. ఆ.౧

ఉ. మాన్యుల మన్నెఱుంగ కవమానముచేతకు దుష్టజన్మతా
ధైన్యము కల్గె మాకు ననుతాపము నొందకుఁ డీర లింక నే
మన్యము నొల్ల మేమియును నచ్యుతుఁ గ్రమ్మఱఁజేరగల్గు సౌ
జన్య మనుగ్రహింపుఁ డని సారెకుఁ బ్రార్థనసేయ నత్తఱిన్. ఆ. ౨.

---

19. పింగళి సూరనార్యుఁడు

పింగళిసూరన్న నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; గౌతమగోత్రుఁడు. ఈతనితాత సూరన్న; తండ్రి యమరన్న; తల్లి యబ్బమ్మ; అమలన్న, ఎఱ్ఱన్న తమ్ములు. విష్ణుపురాణమును రచియించిన వెన్నెలగంటి సూరన్న తరువాత నున్నందున, ఈతనిని పింగలి (వెనుకటి) సూరన్న యందురని యొకానొకరు చెప్పిరిగాని యది సరిగాదు. పింగలి యనునది ఈకవియొక్క గృహనామము. ఈతనిపూర్వులును పింగలివారనియే చెప్పఁబడుచు వచ్చిరి. పింగలియనునది కృష్ణామండలములోని యొకయూరు. కాఁబట్టి యీగ్రామనామమునుబట్టియే యీకవివంశమువారి కిటువంటిపేరు గలిగినది. ఈకవి ప్రభావతీప్రద్యుమునందు తనవంశమునకు మూలపురుషుఁడయిన గోంకనామాత్యుని వర్ణించుచు, ఆతనిని పింగళిపురాంకునిగా నీక్రిందిపద్యమునందుఁ జెప్పియున్నాఁడు—

క. ఆగౌతమగోత్రంబున
నాగమనిధి పుట్టె గోంగ నామాత్యుఁడు స
ద్భోగక్షేత్రస్వామ్యస
మాగతిఁ బింగళిపురాంకుఁడై యతఁ డొప్పెన్.

ఈపింగళి గోంకనామాత్యుఁడే పేకియనుదానిని దాసినిగా నేలి నట్లీగ్రంథమునోని యీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

ఉ. పే ర్వేలయుంగ నాఘనుఁడు పింగలి గోంకబుధోత్తముండు గం
ధర్వ నొకర్తుఁ బేకియనుదానిని దాసిగ నేలె యోగితా
గుర్వనుభావుఁడై నెఱపె గోపకుమారునిఖడ్గవర్ణన
బర్వపునిండువెన్నెలలపై నెఱిచూపెడుకీర్తిసంపదన్.

ఈపింగళివారి పేకికథను జను లీప్రాంతములయం దిప్పుడుసహి తము వాడుకగా చెప్పుకొనుచున్నారు. పింగళి గోంకనామాత్యుఁ డొకనాఁ డరణ్యములో సంచరించుచుండగా, అతని కొకసుందరమయిన పూస దొరకినదఁట. అతఁ డాపూసను దెచ్చి తనపెట్టెలోవేసి దాఁచె నఁట. ఆదినమునందే పేకి యనుపేరితో నొకతెవచ్చి వారియిఁట దాసిగా కుదిరి మిక్కిలి విశ్వాసముతో పనులుచేయ మొదలుపెట్టెనఁట. ఇట్లు కొంతకాలము జరగిన తరువాత గోంకనామాత్యునిభార్య గర్భ వతియై ప్రసవసమయము సమీపించినప్పు డాపురుటింటిలో పేకిని కావలి పెట్టిరనియు, అది యాకావలియున్నదినములలో నొకనాఁటిరాత్రి తాను శయనించినస్థలమునుండి లేవకయే నాలుకను దీర్ఘముగాచాచి దాసితో దీప మెగసనఁద్రోచెననియు, అదిచూచి యాతని భార్య భయపడి జర గిన వృత్తాంతమును మఱునాఁడు భర్తతో చెప్పెననియు, అందుమీఁద వారు దాని నేలాగునైన వదల్చుకోవలెనని యెట్టివంటి యసాధ్యము లయినపనులు చెప్పినను పేకి వానినిల్ల నిమిషములో నిర్వహించుచు వచ్చెననియు, అందుమీఁద వారు దానిని వదల్చుకొను సాధనములేక కాశికిపోయి గంగ తెమ్మని దానిని దూరదేశమునకుఁ బంపి యది యింట లేనిసమయమంచు సమస్తసామగ్రితోను పొరుగూరికి లేచిపోయిరనియు, ఇంతలో పేకి కాశినుండి గంగతీసికొనివచ్చి యింటివారు పొరుగూరికి పోవునప్పు డింట దిగవిడిచిపోయిన నలువు రెత్తలేని పెద్దరాతిరుబ్బు రోటిని నెత్తిమీఁద పెట్టుకొని యిది మఱచి వచ్చితిరని పొరుగూరికి పోయి వారికి చేర్చినదనియు, అప్పుడు గోంకనామాత్యుఁడు నీవు మమ్మెల్లను విడిచెదవని దానిని మంచిమాటలతో నడుగఁగా నాఁడరణ్య ములో దొరికిన పూస నిచ్చివేసినయెడల పోయెదనని యది చెప్పె ననియు అంతట దానియభిప్రాయమునుదీర్చి వారు దానిని పంపి వేసిరనియు, కథ చెప్పుచున్నారు.

ఈకవి పూర్వులు మొట్టమొదట కృష్ణామండలములోనివా రయినను, తరువాత దక్షిణదేశమునకు బోఁగా కృష్ణదేవరాయని యనం తరమునంచు విజయనగరరాజ్యము చెడి యనేకులై న చిన్నచిన్నరాజుల యధీనమయి యున్నకాలములో నితఁడు కందనూలు (కర్నూలు) మండ లములోని యాకువీడు, నంద్యాల, మొదలగుసంస్థానములలో జేరినట్లు కానఁబడుచున్నది. ఈతఁడు కృష్ణదేవరాయనియొక్క యాస్థానకవీశ్వరు లయిన యష్టదిగ్గజములలో నొక్కఁడని కొందఱు చెప్పుదురు గాని యీకవి యాకాలమునందుఁగాని యాస్థానమునందుఁగాని యున్నట్లు నిదర్శనము లేవియుఁ గానరావు. ఈసూరకవి పదునాఱనశతాబ్దమధ్యమునం దున్న ట్లూహించుట కనేకనిదర్శనములు కనఁబడుచున్నవి. ఈకవిరచించిన కళా పూర్ణోదయము నంద్యాల సంస్థానాధిపతియైన కృష్ణరాజున కంకితము చేయఁబడినది. ఈకృష్ణరా జార్వీటిబుక్కరాజుయొక్క యాఱవ సంతతి వాఁ డయినట్లు కళాపూర్ణోదయములోని కృతిపతియొక్క వంశానువర్ణ నమువలన స్పష్టముగా గానఁబడుచున్నది. ఆర్వీటి బుక్కరాజుయొక్క పెద్దకుమారుఁడు సింగరాజు; అతని పుత్రుఁడు నరసింగరాజు; ఆతని పుత్రుఁడు నారపరాజు; ఆతని పుత్రుఁడు నరసింగరాజు; ఆతనిపుత్రుఁడు కళాపూర్ణోదయము కృతినందిన కృష్ణరాజు. ఆర్వీటి బుక్కరాజు క్రీస్తు శకము ౧౪౨౩ వ సంవత్సరము మొదలుకొని ౧౪౫౧ వ సంవత్సరము వఱకును రాజ్యముచేసెను. అటుతరువాత వచ్చిన యతని సంతతివారు సలుగురు నొక్కొక్కరు రెండేసి సంవత్సరము లుండి రనుకొన్నపక్ష మున, ఈకృష్ణరాజు క్రీస్తుశకము ౧౪౬౦ వ సంవత్సరప్రాంతముల నున్న ట్లూహించవలసి యున్నది. ఈకృష్ణరాజు విజయనగరమును సదాశివదేవ రాయలు పాలించుచుండిన కాలములో నంద్యాల రాజయి యున్నట్లు కానఁబడుచున్నది. కృష్ణదేవరాయల యనంతరమున ౧౪౩౦ వ సంవత్స రమున రాజ్యమునకు వచ్చిన యచ్యుతదేవరాయఁడు ౧౪౮౯ వ సంవ

త్సరమునంను మృతినొందెను. ఆకాలమునందు సదాశివదేవరాయఁడు ఫసివాఁ డయినంమున సకలము తిమ్మయ రాజ్యమును దానాక్రమించు కొని కృష్ణదేవరాయల యల్లుఁ డయిన రామరాజును రామరాజు తమ్ముఁ డయిన తిరుమలదేవరాయని బట్టి చెఱలోఁ బెట్టవలెనని ప్రయత్నింపఁగా వారిద్దఱును పెనుగొండకు పాఱిపోయి యక్కడఁ గొంతసైన్యమును గూర్చుకొని తరువాత కందనూలురాజు మొదలయినవారి సాహాయ్యమును బొంది విజయనగరము మీఁదికి దండెత్తివచ్చి సలకము తిమ్మయ నోడించి చంపి ౧౫౭౮ వ సంవత్సరమునకు సరియైన శుభకృత్ సంవత్సర జ్యేష్ఠమాసమునందు బొలుఁ డయిన సదాశివరాయని సింహాసనమెక్కించిరి. ఈకార్యమువలనఁ రామరాజు సదాశివరాజ్యసంస్థాపకుఁడని పేరుపొంది, పేరునకు సదాశివరాయఁడే రాజయినను నిజమైన యధికారమునంతను దానే వహించి రాజ్యపరిపాలనము చేయుచుండి ౧౫౬౮ వ సంవత్సరమునందు మహమ్మదీయరాష్ట్రముల వారిసేనతో తాళికోటవద్ద జరగిన యుద్ధమునందుఁ జంపఁబడెను. అప్పుడు మహమ్మదీయప్రభువులు విజయనగరమునందుఁ బ్రవేశించి యనేక క్రూరకృత్యములను జరపి రాజ్యమంతయు పాడుచేసి తమలోఁ దమకు సంభవించిన కలహమువలన రాజ్యమును పూర్ణముగా నాక్రమించుకొనక వెడలిపోయిరి. తరువాత నయిదు సంవత్సరములవఱకు రాజ్య మించుమించుగా నరాజకముకాఁగా నీలోపల ౧౫౭౩ వ సంవత్సరప్రాంతమున సదాశివరాయఁడు స్వేచ్ఛఁ డయ్యెను. ఆసంవత్సరమునందే తిరుమలదేవరాయఁడు విజయనగరమును విడిచి పెనుగొండఁజేరి తానురాజునని ప్రకటించి ప్రమోదూతసంవత్సరములో ననఁగా ౧౫౯౯ వ సంవత్సరమున పెనుగొండరాజ్యమునందు స్థిరపడి ౧౫౭౨ వ సంవత్సరమునందు లోకాంతరగతుఁ డయ్యెను. ౧౫౭౨ వ సంవత్సరమునకు సరియైన ఆంగిరస సంవత్సర వైశాఖశుద్ధదశమినాఁ డాతనిపుత్రుఁ డయిన శ్రీరంగరాయలు

రాజ్యమునకు వచ్చి ౧౫౮౫ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి స్వర్గస్థుఁడయ్యెను. ౧౫౮౫ వ సంవత్సరమునకు సరియైన పార్థివసంవత్సర మాఖశుద్ధదశమినాఁ డాతని తమ్ముఁడైన వేంకటరాయఁడు సింహాసనమునకు వచ్చినతోడనే తనరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చి ౧౬౧౭ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి సంతానహీనుఁడయి పరమపదమును బొందెను. నంద్యాల రాజైన కృష్ణరాజు సదాశివదేవరాయని కాలములోనివాఁడైనందున, అతని రాజ్యకాలము ౧౫౬౭ వ సంవత్సరమునకు లోపల నారంభమై యుండును. కాఁబట్టి పింగళి సూరన్న నంద్యాలసంస్థానమునందుండి కృష్ణరాజునకుఁ గళాపూర్ణోదయము నంకితముచేసిన కాల మించుమించుగా ౧౫౬౦ వ సంవత్సరప్రాంత మని చెప్పవచ్చును. ఈసదాశివదేవరాయఁడచ్యుతదేవరాయని కుమారుఁడయినట్లు కొన్ని శిలాతామ్రశాసనములయందు జెప్పఁబడినదిగాని కృష్ణామండలములోని సత్తెనపల్లెతాలూకాలో దొరకిన శాలివాహనశకము ౧౫౮౫ సిద్ధార్థిసంవత్సరమునకు సరియైన హూణశకము ౧౫౬౦ వ సంవత్సరపు సదాశివరాయల తామ్రశాసనములో నతఁడు రంగరానకును తిమ్మాంబకును బుత్రుఁడయినట్టును రామరాజునకు మఱఁదియైనట్టును ఈక్రింది శ్లోకముచే జెప్పఁబడినది:—

"తిమ్మాంబావరగర్భమౌక్తికమణీ రంగక్షితీంద్రాత్మజః
అత్రాలంకరణేన పాలితమహాకర్ణాటరాజ్యశ్రియా
శౌర్యాదార్యదయావతా స్వ భగినీభర్త్రా జగత్రాయిణా
రామాఖ్యప్రభుణా ప్యమాత్యతిలకై ఃక్లుప్తాభిషేకక్రమః"

ఈశ్లోకమునందలి రంగక్షితీంద్రుఁడన్నది ప్రమాదజనితమేమో! నంద్యాలకృష్ణరాజు వేంకటపతిరాయల రాజ్యారంభదశలోను జీవించి

యున్నాఁడఁట. అంచుచేత నతఁడు ౧౫౫౪ వ సంవత్సరమునకుఁ దరు వాతకూడ నల్పకాలము రాజ్యమేలియుండును.

మఱియును కళాపూర్ణోదయములో కృష్ణరాజు తాతయైన నారప రాజును వర్ణించుచో నతఁడు కుతుబ్‌మల్కును కొండవీటివద్ద నోడిం చినట్లీక్రింది పద్యమునందుఁ జెప్పఁబడినది.

చ. వదలక యుత్కలేంద్రుని సవాయి బరీదు నడంచుదుర్జయున్
గుదుపనమల్కఁ దల్లడిలఁగొట్టె మహాద్భుతసంగరంబులో
నెదిరిచి కొండవీటికడ నెవ్వరు సాటి విచిత్రశౌర్యసం
పదపస నారసింహవిభుపట్టికి నారనృపాలమౌళికిన్.

గోలకొండయందు కుతుబ్‌షావంశరాజ్య సంస్థాపకుఁడయిన యీ కుతుబ్‌మల్కు క్రీస్తుశకము ౧౫౧౭ వ సంవత్సరము మొదలుకొని ౧౫౪౩ వ సంవత్సరమువఱకును గోలకొండయందు రాజ్యముచేసెను. కృష్ణదేవరాయని కాలములో కొండవీటివద్ద జరిగిన యీ యుద్ధము ౧౫౧౭ వ సంవత్సరమునందగుటచేత నాతనితో యుద్ధముచేసిన నారప రాజు మనుమఁడయిన కృష్ణరాజట్టుపోరువాత ముప్పది నలువది సంవత్స రములైన పిమ్మట రాజ్యము చేసెనఁట సత్యమునకు దూరమయి యుండదు. కాఁబట్టి దీనినిబట్టియు సూరకవి ౧౫౬౦ వ సంవత్సరప్రాంత ములయందున్నట్లు నిశ్చయింపవలసియున్నది. ఈ విషయమునే రాఘవ పాండవీయములోని కృతిపతివంశానువర్ణనము నుండియు నొకవిధముగా నూహింపవచ్చును. రాఘవపాండవీయము కృష్ణాలు మండలములోని యాకువీటి సంస్థానాధిపతియైన పెదవెంకటాద్రి కంకితము చేయఁబడినది. ఆకువీడు కోవిలకుంటకు పడమట నాఱుగోసులదూరములో తుంగభద్రా తీరమునం దున్నది. అందు విరూపాక్షస్వామి దేవాలయమున్నది. ఈ వేంకటాద్రియొక్క తాతయైన యిమ్మరాజు రాజమహేంద్రవరమును జయించినట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది:-

క. రాజమహేంద్రవరాధిపు
రీజైత్రవిచిత్రములఁ బరిభ్రాజితుఁ డై
యాజిఘనుం డా యిమ్మ మ
హీజాని ప్రసిద్ధిఁగాంచె నెంతయు మహిమన్.

రాఘవపాండవీయ కృతిపతితాత యయిన యీ యిమ్మరాజును, కళాపూర్ణోదయ కృతిపతితాతైన నారపరాజును, కృష్ణదేవరాయని కాలములో నాతనికి లోఁబడిన సామంతరాజు లయి యుండి, ఆతనితోఁ గలిసి సేనాధిపతులుగా మహమ్మదీయులు మొదలయిన వారితో యుద్ధముచేసిరని తెలియవచ్చుచున్నది. కృష్ణదేవరాయనికి సహాయులుగా నున్నవారిని వర్ణించిన కృష్ణరాజవిజయములోని యీ క్రిందిపద్య మీ సంగతిని కొంత స్థాపించుచున్నది:-

సీ. కోటలు దుర్గముల్ గొనుచు దోఃపటుబలధాటిచే మించునార్వీటివారు
కంటకాహితకఁఠలుంటనోద్ధతలీల దంటులైతగు తొరగంటివారు
నిర్భరంబుగ శత్రునికరంబు నడఁగించి ధీరులైమించు గొబ్బూరివారు
చాలదోర్బలలీల నరదారిసంఘంబుఁ దూలించివెలయు నంద్యాలవారు
నాదిగాఁగల్గురాజులు మేదురగతిఁ
దుళువదొరలును బోయలు దురుసుగాఁగ
బ్రతిదినంబును ఘోరమా రణ మొనర్ప
నిలిచి పోరాడె గజపతి బలము లపుడు.

గగగ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు రాజమహేంద్ర వరమును జయించెను. కాఁబట్టి యిమ్మరా జాకాలమునం చాతనితో నుండియుండును. దీనినిబట్టి చూచినను సూరనార్యునికాలము పయిని చెప్పఁబడినదే యయి యుండవలెను. ఈ యాకువీటిరాజులు విజయ నగర రాజులకు లోఁబడినవా రయినందుకు నిదర్శనముగా రాఘవ పాండవీయములో నుపోద్ఘాతములో నీ క్రిందివాక్యము కానబడుచున్నది:

క. వడిగలతనాన సీగిని
విడిముడిపసఁ బ్రాభవమున విజయనగరిలోఁ
గడునెన్న నేర్వఁగల మేల్
నడకలఁ బెదవేంకటాద్రి నరవరుఁ డొప్పున్.

ఈ పద్యమునుబట్టి విజయనగరరాజ్యము చెడకముం దనగా ౧౫౬౨ వ సంవత్సరమునకుఁ బూర్వమే రాఘవపాండవీయము రచియింపఁబడిన దగుట నిశ్చయము.

కృష్ణదేవరాయని కాలములోనున్న ధూర్జటికవియొక్క మనుమఁ డయిన కుమారధూర్జటి కృష్ణరాజవిజయమును రచించెను. అతఁడు కృష్ణరాజవిజయములోని యీ రెండవపద్యమునందు,

సీ. జగదధిష్ఠానభాస్వజ్జ్యోతి యగువాఁడు
బ్రహ్మాదులదరు దురాయివాఁడు
చలిగట్టురాపట్టి సామేనఁ గలవాఁడు
చిఱునవ్వువెన్నెలల్ చిలుకువాఁడు
వాఁడువీఁడనక యెవ్వనినైనఁ బ్రోచువాఁ
డఖిలదైవతగురుం డైనవాఁడు
లీలమై శూలంబు కేలఁ బూనినవాఁడు
నలమేనిదొరతూపు గలుగువాఁడు
కలితపంపాతటంబున నిలుచువాఁడు
శ్రీవిరూపాక్షశివుఁడు రక్షించునెప్పు
డఖిలసద్గుణమణిపేటి యాకుపేటి
చిన్న వేంకటరాయని చెలువమిదిఅ.

అని వర్ణించిన యీ చినవేంకటరాయఁడు రాఘవపాండవీయములో వర్ణింపబడిన కృతిపతి తమ్ముఁడయిన చినవేంకటాద్రియే యయినపట్ట మున, ఈ పద్యమును పయికాలమును స్థిరపఱుచుచున్నది.

పింగళిసూరన్న కృష్ణదేవరాయనికాలములో నుండెనని యొకా నొక రనుచున్నారు. ఆర్వీటి బుక్కరాజు మున్మనుమఁడైన యళియ రామరాజే ౧౫౬౨ వ సంవత్సరమునఁకు నుండినప్పుడు బుక్క రాజు మున్మనుమని మనుమఁడయి కళాపూర్ణోదయ కృతిపతియైన నంద్యాల కృష్ణరా జంతకుఁబూర్వమునం దుండెననుట పొసఁగనేర నందున వారిమాట విశ్వాసార్హమయినది కాదు. ఇతఁడు ౧౫౬౦ వ సంవత్సరమునకు లోపలనుండుట తటస్థింపదు.

గ్రంథస్థములైన యీ నిదర్శనము లటుండఁగా మతియొక కట్టు కథకూడ వాడుకలో నున్నది. ఈ సూరనార్యుఁ డల్లసానిపెద్దన్న మనుమ రాలిభర్త యనియు, చిన్నతనములో నితఁడు చదువులేక మూఢుఁడై తిరుగుచుండుటచూచి యితనినిమాత్రమే కాక యీతని భార్యను సహి తము మూఢభర్త దొరకెనని యెల్లవారును పరిహసింపుచువచ్చిరనియు, అందుమీఁద సూరనకు రోషమువచ్చి దేశాంతరముపోయి చదువుకొని పండితుఁడైవచ్చి రాఘవపాండవీయమును చేయ నారంభించెననియు, అప్పుడా చిన్నది తనభర్తను వెంటఁబెట్టుకొని తాతగారియొద్దకుఁ బోయి నీ మనుమఁడు రాఘవపాండవీయమును జేయుచున్నాఁడని చెప్పఁగా నతఁ డందులోని పద్యము నొకదానిని చదువుమని యడిగెననియు, అందు మీఁద సూరన,

"తలఁపం జొప్పడి యొప్పె నప్పుడు"

అని పద్యమును జదువ నారంభింపఁగానే యల్లసానిపెద్దన్న 'యింత లోనే నాలుగునిఱుపులా' యని యాక్షేపించె ననియు, తరువాత సూరన పైభాగము నందుకొని,

".....తదుదగ్జైత్రయాత్రాసము
తక్కలికారింఖదసంఖ్యసంఖ్యజయవత్కంఖాణరింఖావిశృం

ఖలసంఘాతధరాపరాగఘటలాక్రాంతంబు మిన్నే రవ
ర్గళభేరీరవనిర్ధళద్గగనరేఖాలేపపంకాకృతిక.

అని చదువఁగా మెచ్చుకొనెననియు చెప్పుదురు. ఈకథ యెట్టిదై
నను సూగన కృష్ణదేవరాయని తరువాతికాలపువాఁ డైనట్టు స్థిరపఱుచు
చున్నది. అల్లసాని పెద్దన కృష్ణదేవరాయని యనంతరమం దనఁగా
౧౫౩౦ వ సంవత్సరమునకు తరువాతకూడ జీవించియున్నందున, సూర
నార్యుఁ డల్లసాని పెద్దన్న మనుమరాలి మగఁడయినను కావచ్చును.
కళాపూర్ణోదయమును రచింపకపూర్వమునం దీకవి యాకువీటిరాజుల
వద్ద మొట్టమొదటనుండి రాఘవపాండవీయమును జేసి వారి కంకితము
చేయుటచే రాఘవపాండవీయము నీకవి ౧౫౫౦ వ సంవత్సర ప్రాంతము
లయందు మంచి పడుచుతనములో రచియించియుండును. ఇంతకుఁ
బూర్వపుదైన గారుడపురాణము బాలకవిత్వ మగుటచే నశించినదేమో!
తిక్కన సోమయాజికి తరువాత నింత ప్రౌఢముగా కవిత్వము చెప్పిన
తెనుఁగుకవి మఱియొకఁడు లేఁడు. ఈసూరన కావ్యరచనయందు సర్వ
తోముఖ చాతుర్యము కలవాఁడు. ఈతని కవిత్వము మృదుపదగుంభిత మై
ద్రాక్షాపాకముగా నుండును. ప్రభావతీ ప్రద్యుమ్నములోని యీ క్రింది
పద్యమువలన నితఁడు గరుడపురాణమును, రాఘవ పాండవీయమును,
కళాపూర్ణోదయమును, ప్రభావతీ ప్రద్యుమ్నమును, మఱికొన్ని గ్రంథ
ములును రచించినట్లు కానఁబడుచున్నది.

వ. జనముల్ మెచ్చుఁగ మున్రచించితి సదంచద్వైఖరిన్ గారుడం
బును శ్రీరాఘవ పాండవీయముఁ గళాపూర్ణోదయంబున్ మరిన్
దెనుఁగుంగబ్బము లెన్నియేనియును మత్పిత్రాదివంశాభిన
ర్ణన లేమిం బరితుష్టి నాకని యొనర్పంబాల వత్యంబునక.

ఇందు పేర్కొనఁబడినవాసలో గారుడపురాణము మాత్రము
మాకు లభించినదికాదు. రాఘవపాండవీయము కిష్కార్థములు లేకుండ

మృదుమధుర సులభపదములతో రామాయణభారతార్థములు వచ్చు నట్లుగా రచియింపబడిన శ్లేషకావ్యమును రచియించుట మఱియొకరికి సాధ్యముకాదు. ఈగ్రంథముయొక్క ప్రౌఢిమను కృష్ణరాజు మెచ్చు కొన్నట్లుగా కవియే కళాపూర్ణోదయమునం దిట్లు చెప్పియున్నాఁడు—

మ. ఇటము న్గారుడసంహితాదికృతు లీవింపొందఁగాఁ బెక్కొన
ర్చుట విన్నారము చెప్పనేల యవి సంస్తుత్యోభయశ్లేషసం
ఘటనన్ రాఘవపాండవీయకృతి శక్యంబే రచింపంగ నె
చ్చట నెవ్వారికి నీకె చెల్లె నది భాషాకావ్యముం జేయఁగన్.

కళాపూర్ణోదయము విచిత్ర మయినకల్పితకథను గలదై తెలుఁగు గ్రంథములలో నిరుపమానముగా నున్నది. సంస్కృతనాటకములలో మాత్ర మిటువంటి కథాచమత్కారము కానఁబడుచున్నదిగాని తెలుఁ గులో నెక్కడను నింతవింతయైన కల్పితకథ మఱియొకటి కానరాదు. ఇది నాతికఠినమై మృదుమధురశైలి గలదై యున్నది. ప్రభావతీ ప్రద్యుమ్నము చక్కని స్వభావోక్తులను గలదయి లలితఘటితమై కథాచమత్కృతి గలిగి చదువువారికి కర్ణరసాయనముగా నుండెడు ప్రౌఢకావ్యము. ఈతఁడు రచియించినపుస్తకములలో నిది కడపటి దగుటచే గవి దీనిని ౧౫౭౦ వ సంవత్సరప్రాంతములయందు రచియించి యుండును. ఈకాలమునకే యీతఁడు వయసుమీఱినవాఁడగుట చేతఁ దరువాత శిష్యకాలములోనే దివంగతుఁడయి యుండవచ్చును. ఈతని కవిత్వశైలి తెలియుటకై పైపుస్తకములనుండి రెండేసిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

రాఘవపాండవీయము

ఉ. హరిమృగవ్యనవ్యవిహితాదరుఁ డాధరణీతలేశుఁ డ
ధ్వరచిత్రశ్రమాకలితుఁడై కడుమెచ్చె సురాపగాజలా

సారసపూగమార్ద్రాతమసారససారససారసౌరభో
దీరణకారణంబు నతిధీరసమీరకిశోరవారముక్. ఆ. గ.

చ. అలవి యెఱుంగలేక యితరాంగనలంబలె నన్నుసమ్మోయిం
గలఁచుట యుక్తమే యొదవుఁగాక భవత్కృతదుష్టచేష్టితం
బులకు ఫలంబు నేఁ డొకటి పూర్ణముగా నుపభోగ్యమై కడుం
జలమున నెండు నీమగతనంబు కడంకల రూపుమాలుటలో. ఆ. 3.

కళాపూర్ణోదయము

శా. అమ్మా నీపలు కెల్ల నెంతయు నిజంబై యిప్డు గాన్పించె నే
నిమ్మాయాప్రకార మిట్లగుట యూహింపంగలే కొక్కయ
ర్థమ్మున్ వీనికృపం గడింతునని యత్యంతాశ ప్రేరేపఁగా
నిమ్మాడ్కిం దెగివచ్చితిం దెరువులే దీపాటు దప్పింపఁగన్. ఆ. ర.

చ. అన నీక నేమిచెప్పుదు జనాధిప యీయతిముఖ్యుఁ డంత నె
మ్మనమును బట్టలేక ప్రతిమన్ బిగియారఁ గవుంగిలించె నిం
పొనరఁగ లేచివచ్చి కడ నొక్కమఱుంగున నప్డు సుగ్రహుం
డునికి యెఱుంగమిన్ నగియె నుండగ లే కతఁడుం గికాకికన్. ఆ. ఴ.

ప్రభావత్యుద్యమ్నము.

ఉ. పాడిదొఱంగజన్నె యొకపట్టునఁ గొల్చెదనంచు నెంతమా
టాడితి సర్వదైవతకులాధిప యోడలబండ్లువచ్చు బం
డ్లోడలవచ్చు నొండొరుల కొక్కొకచో ననువాదుటాలకుం
గూడుట యిష్టబంధులకుఁ గ్రొత్తయె యిత్తఱి నింతయేటికిక. ఆ. ం

ఉ. వట్టిమఱుంగువెట్టి నొడువం బనిలే దదియెల్ల భేరిజో
కొట్టుటగాక నిన్ గెలువఁగూడునె మాటల నీవుకంటి న
న్నట్టినభాంగుఁ డీరమణియూసల కాస్పద మిప్పు డాతనిక
గట్టిగ నన్యాయాదికథనంబుగఁ దెల్పి యనుగ్రహింపవే. ఆ. 3.

పింగళిసూరన్న గిరిజాకళ్యాణములోని దని యీక్రిందిపద్యము రంగరాట్ఛందస్సులో నుదాహరింపఁబడి యున్నదిగాని యీపుస్తకము నాకు లభించలేదు.

క. కోపాటోపంబున ధర , ణీపాలకచంద్రముఁడు మునిశిఖామణులన్
ద్రోపించిన వారు దురా , లాపము లాడుచును బోయి రాసమయమునఁ.

20. అద్దంకి గంగాధరకవి.

ఈ గంగాధరకవి నియోగిబ్రాహ్మణుఁడు; వీరనామాత్యుని పుత్రుఁడు. ఇతఁడు గోలకొండనబాబైన మల్కిభరాము (ఇబ్రహీమ్ మల్కి) వద్ద నాస్థానకవీశ్వరుఁడుగా నుండెను. యయాతిచరిత్రమును రచియించిన పొన్నికంటి తెలగనార్యుఁడుగాక తనగ్రంథమును మహామ్మదీయుల కంకితముచేసిన తెలుఁగుకవి యీతఁడొక్కఁడే యైనట్లు కానఁబడుచున్నాఁడు. ఈకవి రచియించిన గ్రంథములలో ముఖ్యమైనది తపతీ సంవరణ మను శృంగారప్రబంధము. ఈగ్రంథమునందు కృతినాయకుఁడైనమల్కిభరా మిక్రింది రీతిని వర్ణింపఁబడెను.—

సీ. సకలవేదపురాణశాస్త్రపారగు లైన
యొంటరివిద్వాంసు లొక్కచోట
నష్టభాషలయందు నాంధ్యంబు లేకుండు
హూంతకారికవీంద్రు లొక్కవంక
గజపతి నరపతి హ్మాభర్త లంపిన
యొడికంపురాయబా ర్లొక్కదండ
మేరుమందరముల మించఁగల్గినమన్ని
యులు దండనాథు లొక్కొక్కయెడలఁ

జేరికొల్వ భద్రాసనాసీనుఁడగుచు
రమ్యగుణహారి మల్కిభరామశౌరి
భారతక్షీరమయసింధుబంధమధ్య
లలిత పుణ్యకథాసుధాలహరిఁ దేలి.

దక్షిణహిందూస్థానమునందు భామినీవంశీయతురుష్క రాష్ట్రావ సానవశమందు స్వతంత్రులయిన యయిదుగురు మహమ్మదీయ ప్రభువు లలో నొకడయి గోలకొండ రాజ్యసంస్థాపకుడయి క్రీస్తుశకము ౧౫౧౮వ సంవత్సరము మొదలు ౧౫౪౩ సం॥ వఱకును రాజ్యముచేసిన కుతుబ్ షా కీయిబ్రహీము చతుర్థ పుత్రుడు. గోలకొండ రాజ్యస్థాపకుడయిన కుతుబ్ షా హిందువులను మాత్రమేకాక మహమ్మదీయులను సహిత మనేకులను జయించి తన రాజ్యమును వ్యాపింపఁజేసెను. అతని విజ యములను గూర్చి తపతీసంవరణములోని యీ క్రింది పద్యము కొంత వివరించుచున్నది—

సీ. పడమటను సవాయి బసవసిఁ గాఁజేసి
యచటఁ గొయ్యలకొండ నావరించె
దమదిమలాఖాను దక్షిణంబునఁ గొట్టి
హరియించెఁ బొనుగ ల్లాదిగిరుల
నుత్తరంబునఁ బరీదోడి పాఱఁగఁదోలి
మెఱుకుదుర్గం బాక్రమించి మించెఁ
బ్రబధమదికుక్షిన నొడ్డి పాత్రసామంతుల
ఘట్టించి కంబమునెట్టి గొనియె
నతసిఁ బొగడంగఁ దగదె యాచతురసీతి
రూఢిగిరిదుర్గలుంతనప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహ రేవంతమూర్తి
కుతుబుశాహినిహ్నాపాలు గుణవిశాలు.

అయిన కృష్ణదేవరాయలు క్రీస్తుశకము ౧౫౧౯వ సంవత్స రమునందు తెఱుఁగుదేశమాతయు జయించి, ఓఢ్రరాజులయిన గజపతుల కొమార్తెను తాను వివాహమాడుటచేత తత్సంబంధమునుబట్టి రాజ మహేంద్రవరము ప్రధాన నగరముగాఁగల యాంధ్రదేశమునంతను గజ

పతులకిచ్చెను. కాని కృష్ణదేవరాయల మరణానంతరమున కుతుబ్‌షా కొండపల్లివద్ద జరిగిన యుద్ధములో హిందువుల నోడించి కృష్ణా గోదావరీ మధ్యరాష్ట్రమునంతను నాక్రమించుకొనెను. ఈయంశమునే పూర్వోక్తగ్రంథములోని

"కటకేశ్వరునిఁ దోలి కైవసంబుగఁజేసెఁ
గొండంతజయమ్ముత్రోఁ గొండపల్లి."

అను సీసపాదము చెప్పుచున్నది. కుతుబ్‌షాయొక్క యనంతరమునందాతని ద్వితీయపుత్రుఁడైన జామ్‌షీదు రాజ్యమునకు వచ్చి క్రీస్తుశకము ౧౫౮౩ వ సంవత్సరము మొదలుకొని ౧౫౫౦ వ సంవత్సరము వఱకును రాజ్యముచేసెను. ఇతఁడు మహాక్రూరుఁడు, రాజ్యాశచేత తనయన్నగారి నేత్రములను తీయించివేసి యాతని నంధునిగాఁ జేసిన పాపాత్ముఁడు. ఈతని దుష్టస్వభావము నెఱిఁగి భయపడి పాఱిపోయి యిభరామ్‌షా తనయన్నగారి మరణమువఱకును విజయనగరమునందు కృష్ణదేవరాయని యల్లుఁడైన రామరాజుయొక్క సంరక్షణమునందుండెను. ఇతఁడక్కడనున్న కాలములోనే రామరాజభూషణుఁడు మొదలయిన కవులతోడి సహవాసముచేత సంస్కృతాంధ్ర సాహిత్యమును సంపాదించి, కవిత్వమునం దభిరుచిగలవాఁడయి క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరమునందు తాను రాజ్యమునకు వచ్చినది మొదలుకొని యాంధ్రకవుల నాదరించి పెక్కుకృతుల నొందెను. ఇతఁడు తన రాజ్యకాలములో హిందువులతో మైత్రిగలవాడయి హిందూరాజులను వారివారి కవీశ్వరుల తోడఁ గూడ తన యాస్థానమునకుఁ బిలిపించి తఱుచుగా పండితగోష్ఠిని కాలము గడుపుచువచ్చెను. ఈతఁడొక్కసారి తన యాస్థానమునకు పెమ్మసాని తిమ్మనాయనిని, అనంతపురపు హాండెయప్పయను, మట్ల అనంతరాజును, బంగారేచమనాయనిని, పేరమల్లారెడ్డిని, పిలిపించి వారివారి కవీశ్వరులు వారివారిని స్తుతించిన పద్యములను వినుచుండఁగా కాపువాఁ

డయిన మల్లారెడ్డి కనీశ్వరుఁడు చెప్పిన యీ క్రింది పద్యమునకు రాజు లందఱును గోపించి యుద్ధసన్నద్ధులయినప్పుడు మల్కిభరామువారిని వారించి శాంతపఱిచినట్లొక పుస్తకమున వ్రాయఁబడియున్నది.—

చ. బలరిపుభోగ కృష్ణనరపాలునిపేరకుమారమల్ల మీ
కలితయశఃప్రభావములు కన్గొనఁజే కలకట్టుమన్నెమూఁ
కలు తల లొల్లరో బిరుదుగద్దియముల్ చదివించుకొంచు రా
కొలఁదియెఱుంగఁజాల కలకుక్కలు చుక్కలఁజూచి కూయవే.

పయిని జెప్పిన యితరరాజుల కవులు చెప్పినపద్యములుకూడ నింపుగా నుండవచ్చును గాన వాటిని వరుసగా నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.—

ఉ. చాలుగుఱాలు మాళిగడిసంగడిరాజులు గొల్వరంతహో
హాలమహోగ్రఫాలదహనాక్షుసియంతటిధాటివాఁడు నా
యేలిక వేంకటాద్రిధరణీశునితిమ్మఁడు పెమ్మసానిభూ
పాలుఁడు హెచ్చు ధాత్రిఁ గలపార్థివు లెల్లను లొచ్చు వీనికిన్.

ఉ. మట్లకరాఁడు బెట్టురికి మన్నెకుమారుల సీమ ధూళిగాఁ
గొట్టకమానఁడేగద యకుంఠితసింహతలాధిరాయఁ డీ
పెట్టినదండుఁ దీఁడు రణభీష్ముఁడు హుండియయప్పశౌరికిం
బెట్టుఁడు వేగ దండములు బింకము లేటికి శత్రుభూపతుల్.

ఉ. కొద్దిసరాఁడు దిండుజికి కోటులుకొమ్మలు గొన్నశూరుఁ డా
గద్దతిగబ్బిరాచపులి గండరబాలుఁడు మట్లనంతుఁ డే
ప్రొద్దును వైరిభూభుజులపొంక మడంపనె పుట్టినాఁడు మీ
పెద్దతికాలు సాగ వీకఁ బ్రేలకుఁడీ గడిమన్నెభూపతుల్.

ఉ. కెక్కునఁ గొండతోఁ దగరు డీకొని తాఁకినజోక గాక యీ
బిక్కపకీరుమన్నెసరిబేసిదొరల్ మొన లందు నిల్వ నా

నిక్కము బంగరేచన్నృప నీవు రణస్థలి మోహరించిన
బక్కున లోకముల్ పగిలిపాఱువె కూలువె దిగ్గజంబులున్.

ఈ యిభరామమల్క (ఇబ్రహీమ్ మల్క) క్రీస్తుశకము ౧౫౬౭ వ సంవత్సరమునందు రాజమహేంద్రవరమువిూదికి దండెత్తి వచ్చి దానిని జయించి శ్రీకాకుళము వఱకునుగల కళింగదేశమునంతను స్వాధీనము చేసికొనెను. ఇతఁడు హూణశకము ౧౫౫౩ వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౧ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసినందున, ఈతని యాస్థానకవియైన గంగాధరకవియు నాకాలమునందే యున్న వాఁడు. ఈకవికృత మయిన తపతీసంవరణము సరసమయిన దయి మంచి కల్పనలఁగలిగి దాదాపుగా వసుచరిత్రమునుబోలి వఱలుచున్నది. ఈతని కవిత్వధోరణిని దెల్పుటకై తపతీసంవరణములోనుండి రెండు పద్యముల నిందుఁ జూపుచున్నాను.—

ఉ. అక్కమలాక్షీ హస్తములయందము నేమనివిన్నవింతు నే
నొక్కొకవేళ నక్కనలయోష్ఠిసమీపమునందునున్నచోఁ
జొక్కపుఁదమ్మిపూవు లనుచుం దరుణభ్రమరాళి వ్రాలుఁ బెం
పెక్కినపల్లవంబు లనునిచ్చను డాయును గండుగోయిలల్. ఆ. ౨.

మ. చివురుందామరపాకులక్ సలలితశ్రీఖండపంకంబులక్
నవనీహారజలాభిషేచనములక్ నాళీకపాళీమృణా
ళవితానంబుల మౌక్తికగ్రథితమాల్యశ్రేణులక్ బాలప
ల్లవతల్పంబుల శీతలక్రియలు చాలం జేసి రయ్యింతికిక్. ఆ. 3.

---

21. పొన్నికంటి తెలగన్న

ఈతెలగనార్యుఁ డచ్చతెనుఁగు గ్రంథములు చేసినవారిలో మొదటివాఁడు. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భావనార్యుని పుత్రుఁడు. అచ్చతెనుఁగునందు గ్రంథములు రచియించుట మిక్కిలి కష్టము. ఈకవికిఁ బూర్వమునం దెవ్వరును శుద్ధాంధ్రభాషలో ప్రబంధములు చేయుటకు ప్రయత్నించినవారై ననులేరు. ఇట్టిగ్రంథరచన కితఁడు మొట్టమొదటివాఁడే యయినను, ఈకవి రచియించిన యయాతి చరిత్రము సర్వవిధములచేతను కూచిమంచి తిమ్మకవి రచియించిన యచ్చతెలుఁగు పుస్తకములకంటె శ్రేష్ఠతరముగా నున్నదని నాయభిప్రాయము. ఈయనకుఁ బూర్వమునం దుండినకవులు కొందఱు తమ కృతులలో నక్కడక్కడ నొక్కొక్క యచ్చతెలుఁగు పద్యమును వేయుచు వచ్చిరి. అట్టివానిని జూచియే జను లత్యాశ్చర్యపడుచుండిరి. ఈయంశము కృతిపతి యన్నట్లుగా యయాతి చరిత్రముయొక్క పీఠిక యం దీక్రిందిపద్యముతోఁ జెప్పఁబడినది.—

ఉ. అచ్చతెనుంగుపద్దె మొకఁ డైనను గబ్బములోనఁ నుండినన్
హెచ్చని యీడు చుందు రదియెన్నుచుఁ బెద్దలు పొత్త మెల్లనిట్లచ్చతెనుంగున న్నొడువ నంచులచంద మెఱుంగువారు సి
మెచ్చరొ యబ్బురం బనరొ మేలనరో కొనియాడరో నిర్మ.

ఈకవి తనగ్రంథము నవీనుఖానునకు కృతి యిచ్చెను. ఈ యయాతిచరిత్రముగాక యింకొక తెలుఁగు గ్రంథము మాత్రము మహమ్మదీయప్రభువున కంకితము చేయఁబడెను. అవీనుఖాను ఇభరాముశాయొద్ద కొలువున్నట్లు యయాతి చరిత్రములోని యీక్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.—

సీ. తెలివి సింగంపుగద్దియలరా తెఱుగంటిదొరతెల్గ మోడ్పుచేతులనెకొల్వఁ
బూని యేబది యూఱుమానిసి నెలవులపుడమిటేం డ్లూడిగంబులకుఁజొరగ
ఠీవి మున్నీటిలో దీవు లన్నియు నేలుమున్నీలు మెట్టదామరలకెరఁగఁ
దనతేజు సుడిగట్టువెనుక చీఁకటి నెల్ల విరియించు తమ్మాలవిందుగాఁగ
వెలయు మల్లికిభరామునౌఁ గొలిచిమనుచు
కలనఁ దనచెయ్యి మోఁదుగా, గడిమిమెఱసి
మేలుసిరు లందునట్టి యమీనుఖాన
యొడయఁ డొకనాఁడు నిండుపేరోలగమున.

ఇబ్రహీమునే మనవారు గ్రంథములలో నిభరామని వాడి యున్నారు. ఈతనిపేరనే కృష్ణామండలములో నిభరామపురమని యొకయూరు కట్టఁబడినది. ఈతని పూర్ణమైన పేరు ఇబ్రహీమ్ కుతుబ్ షా. ఇతఁడు కుతుబ్ షా వంశీయులయిన గోలకొండనవాబులలో మూడవవాఁడు. ఈతని తండ్రిపేరు జామ్‌షీద్ కులికుతుబ్ షా. ఇతఁడు క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౭౦ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. కాఁబట్టి గ్రంథకర్త యయిన తెలగనార్యుఁడును ఈకాలములోనే యున్నట్టు స్పష్టమగుచున్నది. యయాతి చరిత్రములోని యీక్రింది పద్యములో నమీనుఖానుని కొడుకయిన ఫాజిలఖాన్ విజయనగరపురాజైన శ్రీరంగరాయని గోలకొండకుఁ దీసికొనివచ్చి మైత్రిచేసినట్టు చెప్పఁబడి యున్నది.—

చ. కని తను రాజు లెన్నుకొనఁగాఁ బెనుపొఁజులతో సిరంగరా
యనికడ కేగి మాటలనె యాయనఁ దేటిచి తెచ్చి మల్కకున్
మనుకువ నంటుచేసి యొరిమం దగ మెచ్చులుగొన్నమేటి నే
మని పొగడంగవచ్చు నవునౌ నిఁక ఫాజిలఖానరాయనిన్.

ఇంనువల్ల శ్రీరంగరాయని రాజ్యకాలములో యయాతిచరిత్రము రచియింపఁబడినట్టు స్పష్టమగుచున్నది. తిరుమలదేవరాయని పుత్రుఁడైన

శ్రీరంగరాయఁడు క్రీస్తుశకము ౧౫౭౪ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౫ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినట్లు కానఁబడుచున్నది. శ్రీరంగరాయలు రాజ్యమునకు వచ్చినతరువాతను, ఇబ్రహీమ్‌పా మరణము పొందకమునుపును, యయాతిచరిత్రము రచియింపఁబడి యున్నందున, ౧౫౭౪ వ సంవత్సరమునకును ౧౬౮౧ వ సంవత్సరమునకును మధ్యకాలమునందు యయాతిచరిత్రము రచియింపఁబడినట్లు నిశ్చయముగాఁ దెలియవచ్చుచున్నది. ఈ కవియొక్క శైలి మొదలైనది మిక్కిలి చక్కఁగా నున్నవని యీ వఱకే చెప్పియున్నాను. శైలి తెలియుటకయి యయాతిచరిత్రములోని రెండు పద్యములు నిందుదాహరించుచున్నాను—

ఉ. పిన్నవుగాన నీవు కడుఁబ్రేముడి ముంగిటిలోనఁ దిమ్మరన్
సిన్నబలెం దలంపఁబడు నీ విటనిల్చిన పెక్కులేండ్లు మా
కన్నను వాచు నీ మొగము గానక యెప్పుడుఁ జూడ కున్న నా
యన్న యిదేటి కీతమక మారసిచూచిన వింతవాడవే—ఆ. 3

ఉ. తొంగలిపువ్వుఁదేనియలఁ దూఁగొని మత్తలి తుమ్మెదల్ పయిన్
బొంగుచు వ్రాల నొప్పెనఁగఁ బూచినపొన్నఁ గడంగికాంచి మున్
మ్రింగినయూవిసంబు వెస మీఁదికిఁ బిచ్చిలువేఁడికంటియూ
జంగ మటంచు మ్రొక్కఁ నొకచాన నెలంతలు చూచి నవ్వగ-ఆర

22. రామరాజ భూషణుఁడు

రామరాజభూషణుఁడు వసుచరిత్రమను శృంగారప్రబంధమును రచియించిన మహాకవి. రామరాజభూషణుఁడనునది రామరాజుయొక్క-యాస్థానమంకుండుటచేత వచ్చిన బిరుదునామమునియు నిజమయిన పేరు బట్టుమూర్తి యనియు చెప్పుదురు. ఇతని జన్మభూమి బట్టుపల్లెయను గ్రామము. ఈ గ్రామమును కృష్ణదేవరాయలు కవిత్వమునందుఁ బ్రవీణులై ప్రబంధాంకమువారని బిరుదుపొందిన యీతని పూర్వులగు బట్టు రాజుల కిచ్చెను. ఈబట్టుపల్లె బళ్ళారిమండలములోని పాలమండలమునకు సమీపమున నున్నదని యొకరును, కడపమండలములోని వులివెందల తాలూకాలో నున్నదని యొకరును వ్రాసియున్నారు. ఈ కవి కృష్ణ దేవరాయల కాలముఁగోఁ బుట్టి యుండవచ్చును గాని యీతని యాస్థా నమునందలి యష్టదిగ్గజము లనఁబడు కవులలో నొకఁడుమాత్రము కాడు. ఇతఁడు మొట్టమొదట ౧౫౨౨ వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౫ వ సంవత్సరమువఱకును సదాశివరాయల పేర విజయనగర ములో రాజ్యముచేసిన కృష్ణదేవరాయల యల్లుఁడయిన రామరాజు యొక్క- యంతిమదశలో నతని యాస్థానమునందుఁ బ్రవేశించి యీతని మీఁదఁ గొన్ని చాటుప్రబంధములను చేసి రామరాజుభూషణుఁడని బిరుదు పేరొందెను. కాఁబట్టి యీతని కవిత్వము ౧౫౬౦ వ సంవత్స ర ప్రాంతములయం దారంభ మయినదని చెప్పవచ్చును. ఈతఁడు రామ రాజుయొక్క- జీవితకాలములోనే యీతనిమీఁద కృతులు చెప్పినట్లు వసుచరిత్ర కృతినాయకుఁడయిన తిరుమలదేవరాయలు కవిసిగూర్చి పలి కిన యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

శా. శ్రీరామక్షితిపున్మదగ్రజు జయశ్రీలోలు నానాకళా
పారీణున్ బహుసంస్కృతాంధ్రకృతులం బల్మాఱు మెప్పించి త

తా॥రుణ్యంబున రత్నహారహాయవేదండాగ్రహారాది స
తా॥రం బందితి రామభూషణకవీ ధన్యుండ వీవన్నిటన్—ఆ. ౧

ఈ పద్యమునందుఁ జెప్పఁబడినతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడయిన యూర్వీటి రామరాజు. కృష్ణదేవరాయని యల్లుఁడయినందున నీతనికి నళియరామరాజని సాధారణముగా వాడుకకలదు. ఈతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడయి సదాశివరాయని రాజ్యభారమును వహించిన సంగతి రామాభ్యుదయములోని యవతారికయందీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

ఉ. ఆపటుకీర్తి రామవసుధాధిపచంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతిసార్వభౌమదుహితృప్రియుఁడై విలసత్ప్రతాపసం
తాపితశత్రుఁడై యలసదాశివరాయసిరంతరాయవి
ద్యాపురరాజ్యలక్ష్మికి విధానము దా నయి మించె నెంతయున్.

ఈ రామరాజు వివాహము చేసికొన్న కృష్ణదేవరాయని కూఁతురి పేరు తిరుమలాంబ. ఆమెవలన నీతనికి కృష్ణరాజు, పెదతిమ్మరాజు అని యిద్దఱుపుత్రులు కలిగిరి. ఈ సంగతి నరపతి విజయమునందీక్రింది పద్యములలోఁ జెప్పఁబడినది—

గీ. అనఘుఁడౌ వైరసేని భీమాధిపేంద్రు
పట్టి దమయంతిఁ జేపట్టినట్టిరీతి
రామభూపాలకుఁడు కృష్ణరాయతనయ
యగుతిరుమలాంబ నుద్వాహమయ్యె వేడ్క.

చ. శతమఖునిం బులోమజను శంకరుని న్గిరిపుత్రి శంబరా
హితు రతిదేవిఁ బోలుచు నహీనసుఖానుభవాప్తి రామభూ
పతియును దిర్మలాంబయును భానుసమానునిఁ గృష్ణపాధ్వ్య నం
చితగుణుఁ బెద్దతిమ్మనృపశేఖరుఁ గాంచిరి హర్ష మొప్పఁగన్.

రామరాజుయొక్క యనంతరమున మూర్తామహార్జితమయిన విద్యానగరరాజ్యమునకు రాఘలసినవాఁడు కృష్ణరాయని దౌహిత్రుఁడయిన కృష్ణరాజే యయినను, రామరాజు తమ్ములయిన తిరుమలదేవరాయలును వేంకటపతిరాయలును బలవంతులయి యాతనికిఁ దక్కినియ్యక యారాజ్యమును తామే యాక్రమించుకొని యేలసాగిరి.

మూర్తి యనియు రామరాజభూషణుఁ డనియు నిద్దఱు వేఱు వేఱుకవు లనియు నంచు మూర్తికవి నరసభూపాలీయమును, రామరాజ భూషణకవి వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానములను రచియించిరనియు కొందఱును, ఇద్దఱు నొక్కరే యనియు మూర్తి యనునది నిజమయినపేరనియు రామరాజభూషణుఁ డన్నది రామరాజుయొక్క సభకలంకారముగా నుండుటచేత వచ్చిన బిరుదుపే రనియు నతఁడు సూరపరాజున కౌరసపుత్రుఁ డయి తదగ్రజుఁ డయిన వేంకటరాయభూషణునకు స్వీకృతపుత్రుఁ డనియు మఱి కొందఱును జెప్పుచున్నారు. "శ్రీరామచంద్రచరణారవిందవందన పవననందనప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకష చతుర్విధకవితా నిర్వాహకసాహిత్య రసపోషణ రామరాజభూషణప్రణీతం" బని వసుచరిత్రములోని గద్య మొకవిధముగాను "శ్రీహనుమత్ప్రసాదలబ్ధకవితాసార సారస్వతాలంకార నిరంకుశప్రతిభాబంధుర ప్రబంధరచన రచనాధురంధర ప్రబంధాంక వేంకటరాయభూషణపుత్ర తిమ్మరాజపౌత్ర నకలభాషావిశేష నిరుపమావధాన శారదామూర్తి మూర్తిప్రణీతం" బని నరసభూపాలీయములోని గద్య మింకొకవిధముగాను నుండుటను బట్టియు, హరిశ్చంద్ర నలోపాఖ్యానములో "ప్రబంధాంక సింగరాజ తిమ్మరాజ ప్రియతనూజ ధీర సూరపాత్మజుఁడ రామనృపభూషణాఖ్య సుకవి" ననియు నరసభూపాలీయములో "ప్రబంధాంక సింగరాజసుత తిమ్మరాజపుత్ర ప్రసిద్ధ సరస వేంకటరాయభూషణసుపుత్రు నను బుధవిధేయు శుభమూర్తి

నామధేయు" ననియు తండ్రులను వేఱువేఱుగాఁ జెప్పినటనుబట్టియు, వేఱువేఱు కవులయినట్లు పయికిఁ గానవచ్చుచున్నను గొన్ని హేతువులను బట్టి రెండవవారుమువారు చెప్పెడి యంశములుకూడ సావధానముగా విచారింపవలసినవిగా నున్నవి. ఉభయపక్షములవారును జెప్పెడుయుక్తు లను జక్కఁగా గ్రహింపఁగలుగుట కయి వంశక్రమమును దెల్పెడు పూర్వోక్తము లయిన రెండు పద్యములను పూర్ణముగా నిం దుదాహరించుట యావశ్యకమని త్రోచి యట్లు చేయుచున్నాను. మొట్టమొదట బుస్తకములను జదివినప్పు డిరువురుకవులఁను వేఱువేఱనియే నేనును నభిప్రాయపడినను రెండవవారి యుక్తులను విన్నపిమ్మట నామనస్సునకుఁ గొంత సందేహము కలిగినందున, నేతన్నిర్ణయమును దీసిని జదువువారికి విడిచిపెట్టి గ్రంథసౌలభ్యము నిమిత్త మిం దుభయుల నొక్కరినిగానే భావించి వ్రాసెదను. ఇరువురును భిన్నులయినను కాకపోయినను చరిత్రభాగమునందు వేఱువేఱుగా వ్రాయవలసిన యంశము లేవియుఁ గానఁబడవు.

౧. సీ. శతలేఖినీపద్యసంధానధౌరేయు ఘటికాశతగ్రంథకరణధుర్యు
నాశుప్రబంధబంధాభిజ్ఞు నోష్ఠ్యనిరోష్ఠ్యజ్ఞు నచలజిహ్వోక్తినిపుణుఁ
దత్సమభాషావితానజ్ఞు బహుపద్యసాధిత వ్యస్తాక్షరీధురీణు
నేకసంస్కోచిత్తశ్లోకభాషాకృత్యచతురు నోష్ఠ్యనిరోష్ఠ్యసంకరజ్ఞు
నమితయమకాశుధీప్రబంధాంకసింగ
రాజసుత తిమ్మరాజపుత్ర ప్రసిద్ధ
సరస వేంకటరాయభూషణసుపుత్రు
ననుఁ బుధవిధేయు శుభమూర్తినామధేయు. నరసభూపాలీయము.

౨. సీ. వసధిలంఘనకృపావర్ధితోభయకవితాకళారత్నరత్నాకరుండ
సకలకర్ణాటరక్షౌధురంధరరామవిభుదత్తశుభచిహ్నవిభవయుక్తుఁడ

వసుచరిత్రాదికావ్యప్రీతబహునృపప్రాపితానేకరత్నప్లవుండ,
శాశ్వతశ్రీవేంకటేశ్వరానుగ్రహనిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ
శ్రీకరమహాప్రబంధాంక సింగరాజ
తిమ్మరాజప్రియతనూజ ధీరసూర
పాత్మజుఁడ రామనృపభూషణాఖ్య సుకవి
నంకిత మొనర్తు నీకావ్య మనఘుభక్తి-హరిశ్చంద్రనలోపాఖ్యానము

మ. ననుఁ శ్రీరామపదారవిందభజనానంద్ధ జగత్ప్రాణనం
దనకార్ష్ణ్యకటాక్షలబ్ధకవితాధారసుధారాశి సం
జనితైకైకదినప్రబంధఘటికాసద్యశ్శ్రీత గ్రంథక
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వంబంచి పలెఁ గృపన్-వసుచరిత్ర

పయిపద్యములలో నుపయోగింపఁబడిన విశేషణములు కొన్ని భిన్నములుగా నున్నను పరస్పరవిరుద్ధము లయిన వేవియు లేనందున వానినిబట్టి గ్రంథకర్తలు భిన్నులని సాధించుట కాధార మేదియు లేదు. రెండు గ్రంథములను జేసినవారాంజనేయ ప్రసాదలబ్ధ కవిత్వవైభవుల మని వ్రాసికొనుటచేతను, రెండు కవిత్వవులు నేకరీతినే యుండుట చేతను, ఆదినుండియు నిప్పటివఱకును బట్టుమూర్తియే వసుచరిత్రము రచియించెనని జనశ్రుతి వచ్చుచుండుటచేతను, కవికిఁ దరువాత నల్ప కాలములోనే వసుచరిత్రమునకు వ్యాఖ్యానము చేసినవారు కొందఱు బట్టుమూర్తి తాను రచించిన నానారసభాసురమగు ప్రబంధమునందలి వివిధాలంకారములకు లక్షణగ్రంథముగ నుండునట్లు నరసభూపాలీయ మను నలంకార గ్రంథమును రచియించెనని వ్రాసియుండుటచేత, తద్గ్రం థత్రయకర్త యొక్కఁడే యై యుండునేమో యని యెట్టివారికిని సందే హము కలుగకమానదు. ఇఁక పైపద్యములలోని యంశములనుబట్టి విచారింపవలెను. నరసభూపాలీయకృతికర్త వేరందలి గద్యమునుబట్టి

మూర్తియనుట స్పష్టము. దానికి బట్టు మొదలయిన పదములను వేనిని జేర్చినను, అవి కులనామములో బిరుదనామములో యయి యుండును. కావ్యాలంకారసంగ్రహ మనఁబడెడు నరసభూపాలీయములోని పూర్వోదాహృతమయిన పద్యములో "శుభమూర్తినామధేయు" నని 'శుభ' విశేషణమొకటి గానఁబడుచున్నది. ఈ శుభవిశేషణ మెట్లు వచ్చినది, ఎవ్వరికిఁజెందినది, అన్నవిషయము నాలోచింపవలయును. పూర్వోదాహృత మయిన హరిశ్చంద్రనలోపాఖ్యానములోని పద్యములో రామభూషణకవి "రామవిభుదత్త 'శుభ' చిహ్న విభవయుతుఁడ" నని వ్రాసికొని యున్నాఁడు. కాఁబట్టి దీనినిబట్టి చూడఁగా శుభబిరుదమును రామరాజిచ్చెనసియు, రామరాజభూషణనామము గలవానికిది చెందు ననియు, విస్పష్టమగుచున్నది. నరసభూపాలీయ కృతికర్త తనకు శుభ విశేషణమును వేసికొనుటయు, హరిశ్చంద్ర నలోపాఖ్యాన కృతికర్త తనకు రామరాజు శుభచిహ్న మిచ్చెనని చెప్పుకొనుటయు, ఈ రెంటిని గూర్చి చిరకాలమునుండి పరంపరగావచ్చుచున్న జనప్రతీతితోఁజేర్చి విచారించినపట్టున నారెండు గ్రంథములను రచించినవా రొక్కరేయని చూపుట కది యొక ప్రబలసాక్ష్యముగాఁ గనఁబడుచున్నది. రామరాజ భూషణపదము బిరుదనామమే యైనపక్షమున, పైపుస్తకములయందలి నామవ్యత్యాసములనుబట్టి కవులు వేఱనిచెప్పుట కవకాశ ముండదు. రామరాజభూషణపదము బిరుదుపేరుగాక పేరేయై యుండినయెడల నది యంతట నేకరూపముగా నుండునేకాని పై పద్య గద్యములయం దున్న శ్లోకచోట 'రామరాజభూషణ' యనియు, ఇంకొకచోట 'రామభూషణ' యసియు, వేఱొకచోట 'రామనృపభూషణ' యనియు నుండదని యొక యుక్తి చెప్పుదురుగాని యదియంత ప్రబల యుక్తికాదు. కట్టకడపటఁ జేసిన హరిశ్చంద్ర నలోపాఖ్యానములో "వసుచరిత్రాదికావ్య" "బహు నృపప్రాపితానేకరత్న" పదములను బ్రయోగించుటచే నాదిపద ప్రయో

గముచేత రెంటికినమమ నతఁడు చేసినకావ్య మింకొకటి యుండవలసి నంమున నదియే నరసభూపాలీయమనియు, బహుపదప్రయోగముచేత నిద్దటికంటె నెక్కువరాజు లుండవలసినందున వారే రామరాజు తిరు మలరాజు నరసరాజు ననియు, మూఁడుగ్రంథములను రచించినవాఁ డొక్కఁడేయనుట కింకొకయుక్తి జెప్పుచున్నారు. ఈ యుక్తి యెంత యాదరణీయమో బుద్ధిమంతులు తమలోఁ దాము నిర్ణయించుకో వలెను. ఈకవి తన జనకపితను పాలకపితనుగూడ సంతోషపెట్టుటకయి యొక పుస్తకమునందు కన్నతండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునందు పెంచుకొన్న తండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునం దెవ్వరిపేరును వేయక విడిచెననియుఁ జెప్పుచు, ఆమూపుస్తకములయం దుపయోగింపఁ బడిన పదములే యొకఁడు జనకపితయనియు నొకఁడు పాలకపితయనియు సూచించుచున్నవని చెప్పుచున్నారు. హరిశ్చంద్ర నలోపాఖ్యానములోని "సూరసాత్మజుఁడ" నను వాక్యమువలన సూరపరాజున కౌరసుఁడని యాత్మజ శబ్దము దృఢపఱుచు చున్నదనియు, నరసభూపాలీయములోని "వేంకటరాయభూషణ సుపుత్రు" నను వచనమువలన వేంకటరాయ భూషణునకు దత్తుఁడని సుపుత్రశబ్దము దృఢపఱుచుచున్నదనియు వాదిం చుచున్నారు. ఈయర్థములయం దాత్మజశబ్దమునకుఁ దనవలనఁ బుట్టిన వాఁడుకాని దత్తుఁడు కాఁడనియు, సుపుత్రశబ్దమునకు పున్నామనరకము నుండి రక్షించు దత్తుఁడుకాని కన్నవాఁడు కాఁడనియుఁ గ్రహింపవలెను. ఈయంశముల కనుకూలముగానుండు కథలు కొన్నికలవుగాని గ్రంథ విస్తారభీతిచే వానిని విడుచుచున్నాను.

వసుచరిత్ర కర్తయు నరసభూపాలీయకృతికర్తయు నొక్కఁడేమో యని నాకు సందేహము కలిగించుటకుఁ గారణములయిన యంశములను మఱికొన్నిటిఁగూడ నిప్పు డిందుఁ జేర్చుచున్నాను. వీనిని పయినిజెప్పిన వానితోఁజేర్చి చదివి బుద్ధిమంతులు తమ యిచ్చవచ్చిన సిద్ధాంతము చేసి కొనవచ్చును.

ం. గీ. తా రచించిన వసుచరిత్రమునఁ గన్న
తండ్రి సూరన వెలయించి తలఁపఁ డయ్యె
ననుఁ మన శారదామూర్తి నాఫలంబె
దత్తుఁ డగువానిఁ జేపట్టుఁదరమె నాకు.

అను చాటుధారాపద మొకటి రామరాజభూషణుఁడు తన వసు చరిత్రములో జనకపితయైన సూరపరాజు పేరుదాహరించి తన్నుఁ బేర్కొ నకపోవుటచేత సాలకపితయైన వేంకటరాయభూషణునిచేఁ జెప్పఁబడినదని వాడుకలోనున్నది.

ఎ. చతుర్భుజాభిషేకము, యౌవనచరిత్రము, గంగాగౌరీసంవా వము అను ప్రబంధములను రచించి ప్రసిద్ధుడయి వసుచరిత్రమునకు వ్యాఖ్యానముచేసిన సోమనాథకవి గ్రంథాదిపీఠికలో నిట్లు వ్రాసి యున్నాఁడు—

శా. ఈరీతిం గవితావితానవృతగౌరీశానమాళిస్థలో
దారోద్దేశుఁడ నైననాకు వెస విద్యావంతు లెల్లన్ననో
హాగప్రక్రియ మూర్తిచేత రచితంబై విశ్రుతంబౌ వసు
చ్ఛ్మారాట్చ్ఛ్రితచరిత్రటీక కయి యుత్సాహంబు పుట్టించినన్.

ఉ. కారణజన్ముఁడై కవినికాయము మెచ్చుఁగఁ గావ్యకర్తయై
భూరికళాకలాపుఁ డయి పొల్పువహించెడు బట్టుమూర్తిచే
నీరితమై సుఖారవదహీనపదాస్పద మైన యీవసు
చ్ఛ్మారమణప్రవృత్తము సుసాధ్యముకాదు తలంచిచూడఁగన్.

అని యిందలి మొదటిపద్యములో వసుచరిత్రము "మూర్తి" చేత రచిత మనియు, రెండవపద్యములో "బట్టుమూర్తిచే నీరిత" మైనదనియు, వ్యాఖ్యాత చెప్పియున్నాఁడు. ఈ వ్యాఖ్యాత యేకాలమునందుండిన వాఁడో సరిగా తెలియదుగాని, అప్పటి కవికిని నహోబలపతికిని దరు వాత నత్యల్పకాలములోనె పదునేడవశతాబ్దాంతమున నున్నట్లు తెలియ

వచ్చుచున్నది. పూర్వకాలమునందే యితఁడిట్లు వ్రాయుటనుగూర్చి మేమిచెప్పెదరు? ఇతఁడు సావధానముగా గ్రంథమును బరిశీలించి ప్రతి వాదులు తమ వాదమున కనుకూలములుగా నుదాహరించెడు గద్య పద్యముల కన్నిటికిని బ్రతిపదార్థమును వ్రాసి విమర్శించినవాఁడేకదా?

3. అనేక గ్రంథములను జేసిన గొప్పకవులు సమానవర్ణనలు వచ్చెడుపట్టున తాము మొదట రచియించినగ్రంథములలోనుండి పద్యము లను జేకొని యావశ్యకములైన పూర్వులను జేసి తరువాత రచియిం చెడుగ్రంథములలో జేర్చుకొనెడి యాచారముగలదు. తిక్కనసోమయాజి తననిర్వచనో త్తరరామాయణములో మూడవయాశ్వాసమున,

చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ దార భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబులొక్కటి నరాతిబలంబులఁ గప్ప శార్ఙ్గి
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్.

అని రచియించినపద్యమునే విరాటపర్వములో నయిదవయాశ్వా సమునఁ గొంచెము మార్పుచేసి యీక్రిందిరీతిగాఁ బ్రయోగించు చున్నాఁడు—

చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ జాల భీ
షణముగ నుప్పతిల్లి రభసంబునఁ రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కటి నరాతిబలంబులఁగప్ప గాండివ
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్.

ఇందు "తార" యనునది "చాల" గను "శార్ఙ్గనిక్వణ మునునది "గాండివ క్వణనము" గాను, మార్పఁబడినవి. మఱియు సోమయాజులు,

మ. కలగెం దోయధిసప్తకంబు గిరివర్గం బెల్ల నూటాడె సం
చలతంబొందె వసుంధరావలయ మాశాచక్ర మల్లాడెఁ గొం

దల మండెం ద్రివిశేంద్రుపట్టణము పాతాళంబు ఘూర్ణిల్ల నా
కుల మయ్యెం గ్రహతారకాకులము సంక్షోభించె నవ్వేధయున్.

అనుపద్యమును మార్పుచేయుకయే నిర్వచనోత్తరరామాయణ
ములో నైదవయాశ్వాసములోను విరాటపర్వములో నాలవయాశ్వాస
ములోనుగూడ వేసియున్నాఁడు. ఈ ప్రకారముగానే నసుచరిత్రము
ప్రథమాశ్వాసములోని,

శా. రామత్కాన్మవరుదానత్తోయ తటిసీవ్రాతంబు కల్లోలినీ
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గువర్షాశర
త్సామాన్యాధికరణ్యాలబ్ధి కచటం చక్రాయుధుం డొంను ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేక కాలంబునన్.

అనుపద్యము కొంతవఱకు మార్పఁబడి నరసభూపాలీయము ద్వితీ
యాశ్వాసములో,

శా. ఆమోదంబున శ్రీనృసింహవిభుదానాంభోనము ల్సాగర
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గువర్షాశర
త్సామాన్యాధికరణ్యశంక నచటం దామోదరుండొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేక కాలంబునన్.

అని ప్రయోగింపఁబడియున్నది. ఇట్టిలు నేకకవులయిసం దక్క
నిట్టిప్రయోగముల నెట్లు సాధువుగా సాధింపవచ్చును? ఈగ్రంథద్వయకర్త
యొక్కఁడు కాఁ డనెడుపక్షమున, ఈసుహృకవులను గ్రంథచౌర్యము
చేసెడి యల్పకవులలోఁ బరిగణింపవలసివచ్చును. ఈవిధముగానే నసు
చరిత్రము ప్రథమాశ్వాసములోని,

శా. ఆమంచాకిని మాళిఁ బూని నను నర్థాంగీకృతం జేసితా
నా మే ల్మేలని యార్య యల్లఁ బ్రణతుండై తత్పదాంభోజయో
గామర్షంబున గంగయు నొ్మరయఁ జూడాభోగసమ్యక్క్రియా
సామర్థ్యంబున నేఁడుశంభుఁడు కృత్తిస్వామిం గృపం బ్రోవుతన్.

అను శివస్తుతిపద్యార్థమును గొంచెము మార్చి యధికసార
స్యము గలిగించి,

శా. గంగఁదాల్చితి వుత్తమాంగమున నన్ గైకోలు కావించి త
ర్థాంగీకారమసం బురంధ్రి నిను వామాంగంబునందాల్ప నే
శృంగారోన్నతిఁ జూపు మంచు గిరిజన్ శీర్షాపగాబింబిత
స్వాంగానందితఁ జేయుశంభుఁడు నృసింహాధీశ్వరుం బ్రోవుతన్.

అని నరసభూపాలీయములోఁ గవి ప్రయోగించియున్నాఁడు. మొదటిపద్యములోని కొన్నిపదముల శ్లేషార్థముల నటుండనిచ్చినయెడల, ఉభయపద్యములలోను గంగను శిరస్సునఁదాల్చి నన్నర్థాంగీకృతను జేసితివని పార్వతి కుపితురాలుకాఁగా శివుఁ డామె కోపమును దీర్చుట కయి పాదములఁబడె నన్నయర్థము సామాన్యముగాఁ జెప్పఁబడినది వీనిలో మొదటిపద్యమున శివుఁడు పార్వతికిఁ గోపశాంతి చేయలేక పోవుటయే కాక గంగకుఁగూడ కోపము తెప్పించి యామెను వేఁడుకో వలసినవాఁ డయ్యెను. రెండవపద్యమున గంగాప్రతిబింబితస్వరూపమును పార్వతికిఁ జూపి తా నామెనుఁగూడ నుత్తమాంగమునఁ దరించి భ్రమ కలిగించి శివుఁ డామెను శాంతచిత్తురాలిని జేయఁగలిగెను. ఈరెండు కావ్యములకు నొక్కరినే కర్తలనుగాఁ జెప్పకపోయినపక్షమున వారి యందుఁ బదార్థచౌర్య మారోపింపవలసి వచ్చును.

౪. రామరాజభూషణునికాలములోనే యుండి యాకాలము లోనే మనుమల నెత్తిన వేంకటపతిరాయల విద్యాగురువగు మండ రామానుజాచార్యుని మున్మనుమని మనుమఁడగు లక్ష్మీనరసింహాచా ర్యులు తాను రచించిన యాంధ్రకౌముదియందు,

"ముప్రత్యయాభావస్య అల్లసాని పెద్దనార్యశ్లేష బట్టుమూర్తి మహాకవినా విరచితే వసుచరిత్రే-"

ముప్రత్యయాభావమున పెద్దనార్యశిష్యుఁ డైన బట్టుమూర్తి మహాకవిచేత రచితమైన వసుచరిత్రమునందని వ్రాసి,

"సీ. రాజహంసలుగాని రాజహంసలుగారు
సరసకళాసారసారరుచుల"

అను వసుచరిత్రలోని యీసీసపాదమును లక్ష్యమునుగా, జూపి యున్నాఁడు. బట్టుమూర్తికి నూఱుసంవత్సరములలోపలనే యిట్లు గ్రంథస్థము చేసినవ్రాఁతను నిరాకరించుటకు ప్రబలప్రమాణము కావలసి యుండునుగదా?

౫. అప్పకవీయములో నుదాహరింపఁబడి యించుమించు రామ రాజభూషణునికాలములోనే రచియింపఁబడిన లక్షణదీపికలో రంగ వ పద్యము తరువాత,

"మంజీర శబ్దమునకు బట్టుమూర్తి వసుచరిత్ర మొదటిపద్యము ప్రథమచరణమున హాల్లునకుఁ బ్రయోగము."

అని వ్రాయఁబడి,

"శా. శ్రీభూపుత్రివివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్వలీ. ఈఁ.

ఇత్యాదివసుచరిత్రపద్య ముదాహరింపఁబడియున్నది. సరికాల మువారుకూడ సుప్రసిద్ధుఁడైన రామరాజభూషణుని బట్టుమూర్తియని భ్రమించుట పొసఁగ నేరదు గాన నిరువురు నొక్కరేయనుట యధిక విశ్వాసనీయము.

ఈరామభూషణకవి మొట్టమొదట రచియించిన కావ్యము వసు చరిత్రము. ఈప్రబంధముతో సరిరాఁదగినశ్లేషకావ్యము తెనుఁగున మఱియొకటిలేదు. ఇందలివర్ణనలు మిక్కిలి మనోహారము లయి యున్నవి; పదములకూర్పు మిక్కిలి సుందరముగా నున్నది. శబ్దార్థా లంకారము లాహ్లాదకరముగానున్నవి; రసభావాదులు యథాయోగ్య ములుగా నున్నవి. ఈగ్రంథము రచియింపఁబడినతరువాత నేఁటివఱ

కును ప్రబంధములను జేయఁబూనినకవు లెల్లరు వసుచరిత్రమును ప్రతి రూపముగాఁ జేకొని దాని ననుసరించి తమగ్రంథములను రచియించు చున్నారు. ఈవసుచరిత్రము హూణశకము ౧౫౭౦ వ సంవత్సరమునకుఁ దరువాతనే రచియింపఁబడినది. వసుచరిత్ర కృతిపతియైన తిరుమలదేవ రాయఁడు ౧౫౬౭ వ సంవత్సరమునందు తనరాజధానిని పెనుగొండకు మార్చెను. ఈతఁడు పెనుగొండను రాజధానిగాఁ జేసికొన్నతరువాత మహమ్మదీయులతో జరిగిన యుద్ధవార్త వసుచరిత్రలోని యీపద్యము నందుఁ జెప్పఁబడియున్నది—

చ. తిరుమలరాయశేఖరుసధీరచమూభటరాజి యూజి భీ
కరయవనేశ్వరప్రహితఖాసబలంబులఁ జక్కఁసేయ సి
ద్ధరఁ బెనుగొండకొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబు లయి బ్విడిఁ గాంచె గిరీశభావమున్.

తిరుమలదేవరాయలు తనజ్యేష్ఠపుత్రుఁ డయిన రఘునాథరాజు మృతుఁడయినతరువాత ద్వితీయపుత్రుఁ డయిన శ్రీరంగరాజును యువ రాజునుజేసి రాజ్యభారము నాతనిమీఁదమోపిన కిథగూడ సూచనగా నీపుస్తకమునందుఁ జెప్పఁబడియున్నది—

చ. హరిపదభక్తిశీలుఁడగు నారఘునాథనృపాలుకూర్మిసో
దరుఁడు సిరంగరాయవసుధావరుఁ డాత్మగుణప్రమోదవ
త్తిరుమలరాయశేఖరవితీర్ణ మహాయువరాజపట్టబం
ధురుఁడయి సర్వభూభువనధూర్వహశక్తినహింపు నెంతయున్.

తిరుమలదేవరాయఁ డవసానదశలో తనరాజ్యభారము నంతను కొడుకులమీఁద వదలివేసినతరువాత మూఁడవకొడు కయిన వేంకటపతి రాజు ఆలీ ఆడిల్‌షాతో యుద్ధము చేసి పరాజితుఁడయి ౧౫౭౭ వ సంవత్సరమునందు రాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మరల మార్చెను. వేంకటపతిరా జోడిపోయినసంగతిని జెప్పకపోయినను కవి

వసుచరిత్రములోని యీ క్రిందిపద్యములో వేంకటపతి రాజధానిని చంద్ర గిరికి మార్చినసంగతి సూచించియున్నాఁడు—

మ. హరుఁ డాతారకశైలచర్మమున నధ్యాసీనుఁడై రాజశే
ఖరవిఖ్యాతి వహించుఁ జందగిరిదుర్గంబందు శ్రీవేంకటే
శ్వరుఁ డొప్పెన్, బహురాజశేఖరసదాసంసేవ్యుఁడై యీర యి
ద్ధర బంగారికవాసి తద్గిరులకున్ దద్వల్లభశ్రీలకున్.

ఈపద్యముల నన్నిటిని బట్టి చూడఁగా వసుచరిత్రము ౧౫౭౭ వ సంవత్సరము తరువాతనే ముగింపఁబడినట్లు స్పష్ట మగుచున్నది. తిరుమలరాయఁ డేసంవత్సరమునందు మృతినొందెనో స్పష్టముగాఁ దెలియ మిగాని ౧౫౭౭ వ సంవత్సరమువఱకును నాతఁ డిచ్చిన దానశాసనములు కనఁబడుచున్నవి; ౧౫౭౭ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౫ వ సంవత్సరమువఱకును అతని రెండవకొడు కయిన శ్రీరంగరాజు దానశాసనములును, ౧౫౮౫ వ సంవత్సరము మొదలుకొని ౧౬౦౭ వ సంవత్సరమువఱకును మూఁడువకొడు కయిన వేంకటపతియొక్క దానశాసనములును కానవచ్చుచున్నవి. తిరుమలదేవరాయఁడు ౧౫౭౭ వ సంవత్సరమునకుఁ దరువాత రాజ్యభారమునంతను పూర్ణముగా కొడుకుల కప్పగించి తాను విద్వద్గోష్ఠితో ప్రొద్దుపుచ్చుచుండియుండవచ్చును. ౧౫౭౭ వ సంవత్సరమునందు ఆలీఅడిల్‌షా తిరుమలదేవరాయని పెనుగొండనుండి చంద్రగిరికి పాఱఁదోలినట్లు మహమ్మదీయులు వ్రాసినచరిత్రమునం దున్నది. దీనిసిబట్టిచూడఁగా తిరుమలదేవరాయఁడు ౧౫౭౭ వ సంవత్సరమునకుఁ దరువాతకూడఁ గొంతకాలము జీవించియున్నట్లు తోఁచుచున్నది. రామరాజభూషణుఁడు తిరుమలరాయనికి వసుచరిత్రము నంకితము చేయునపుడు తెనాలిరామకృష్ణుఁ డక్కడకు వచ్చి "శ్రీభూపుత్రి" యని మొదటిపద్యమును జదువ నారంభింపఁగానే పకపకనవ్వి యీాకృతి చదువుటతోనే శ్రీపోయెనని గేలిచేసె ననియు, అదియెట్లని సభవా రడు

గగాఁ నతఁడు చేతిలో బూడిద వేసికొని యందు శ్రీ యనునక్షరమును వ్రాసి చేయి నోటిదగ్గఱగాఁ బెట్టుకొని బిగ్గరగా శ్రీభూపుత్రి యని (భూ) ద్వితీయాక్షర మొత్తి చదువఁగానే యాగాలిచేత చేతిలో వ్రాసిన శ్రీ యెగిరిపోవుట చూపె ననియు, అంతమీఁద రాజు కృతి నందక నిరాకరించెననియు పసికిమాలిన కథయొకటి చెప్పుకురు. ఈప్రకారముగానే రామరాజభూషణుడు 'నానాసూనవితానవాస'లన్నపద్యమును నందితిమ్మన్నయొద్దను "మోహాపదేశ తమోముద్రితములై న" యను పద్యము నయ్యలరాజు రామభద్రుని యొద్దను కొని తన నసుచరిత్రము నందు వేసికొనెనని కొందఱు కొన్నికథలు కల్పించి యున్నారుగాని యవి యన్నియు నవిశ్వసనీయములే. అటువంటి యుద్గ్రంథమును జేయఁ గలిగిన మహాకవి రెండు సామాన్యపదములను జేయలేక యితరులవలన దొంగిలించి తనవిగాఁ దన గ్రంథమునందు వేసికొనెనని చెప్పుటకంటెఁ బరిహాస్యాస్పద మయిన మాట మఱియొకటి యుండదు.

రామరాజభూషణుఁ డొకనాఁడు సభలో రాజాజ్ఞమీఁద కవీశ్వరులకు "కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్" అని సమస్య యియ్యఁగా తెనాలిరామకృష్ణుఁడు

క. గంజాయి వ్రాగి తురకల
సంజాతులఁ గూడి కల్లు చవిగొన్నావా ?
లంజెలకొడుకా ! యొకఁడఁ
గుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్ ?

అని పూరించె ననియు, అదియే రాజు తాసిచ్చినట్లు భావించి పూరింపుమని యడుగఁగా

క. గంజన చెడి పాండవు లరి
భుంజనులై విరటుఁగొల్వఁ బాల్పడి రకటా !

సంజయ! విధి నేమందును?
గుంజరయూథంబు దోమకత్తుక జొచ్చెఁ.

అని పూరించెననియు, రాజాతని సమయోచితబుద్ధికి సంతో షించి బహుమాన మిచ్చెననియు చెప్పుదురు. ఈనాలిరామకృష్ణుఁడు రామరాజభూషణునియొక్క కడపటి దినములలో నున్నవాఁడగుటచేత నిది సత్య మయినను కావచ్చును.

నరసభూపాలీయము రచియించినకవి యెవ్వరయినను కృతిపతి రామరాజ తిరుమలదేవరాయలకు మేనల్లుఁడయిన నరసరాజు. ఈనరస రాజుయొక్క మాతామహుఁడయిన శ్రీరంగరాజునకు కోనరాజు, తిమ్మ రాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటపతి, అని యయిదుగురు కొడుకులును, లక్కమాంబ, ఓబమాంబ, కోనమాంబ అని ముగ్గురు కూఁతులును ఉండిరి. ఆ కొమార్తెలలో లక్కమాంబ కుమారుఁడయిన నరసరాజు కావ్యాలంకార సంగ్రహమును నరసభూపాలీయమును కృతి నొందెను; ఓబమాంబ కుమారుఁడయిన గొబ్బూరి నరసరాజు రామా భ్యుదయమును కృతినందెను; కోనమాంబ కుమారుఁడయిన తిమ్మరాజు పరమయోగివిలాసమును రచియించెను. వీనిలో నరసభూపాలీయము ప్రతాపరుద్రీయమునకు తెలుఁగు. నాటక ప్రకరణమును మాత్రము విడిచి ప్రతాపరుద్రీయములోని లక్షణభాగమునంతను కవి తెనిఁగించినను లక్ష్యములను నరసభూపాలుసివేఱ గ్రొత్తగా రచించెను.

రామరాజభూషణుఁడు సాహిత్యమునందు మాత్రమేకాక సంగీ తమునందును మిగుల ప్రావీణ్యము గలవాఁడు. ఈతఁడు రచియించిన కృతులు కొన్ని యక్కడక్కడ నేటివఱకును పాడఁబడుచున్నవి. ఒక వేళ వసుచరిత్రములో తిరుమలదేవరాయఁడు కవిగూర్చి "బహు సంస్కృతాంధ్రకృతులం బల్మాఱు మెప్పించితి" వన్న కృతులివియే యయి యుండునేమో!

కవులిప్పటివలెనే పూర్వకాలమునందును విద్వాన్మత్సరము కల వారయి యొండొరులతో వివాదములు పెట్టుకొనుచుండినట్లు కనఁబడు చున్నది. ఇట్టి యసూయాపరత్వము రామరాజభూషణునివద్ద సహితము బొత్తిగా లేకపోలేదు. ఇతఁడొకసారి యయ్యలరాజు రామభద్రకవి కవిత్వమునందు తప్పుపట్టఁబోయి యవమానము నొందెనఁట. రామభద్ర కవి విరచితమైన రామాభ్యుదయమునందు తప్పుచూపెదనని పంతము పట్టి, తప్పు చూపలేకపోయినయెడల తలఁమోద తా నాతనిఁతన్ను తినెద నని రాజసభలో రామరాజభూషణుఁ డొప్పుకొనెనఁట. అంతట మధ్య వర్తుల సమక్షమునందు గ్రంథపఠన మారంభించి చదువుచుండఁగా ద్వితీ యాశ్వాసారంభములోని

సీ. సింహనఖాంకురచ్ఛిన్న వారణకుంభజసితముక్తాఫలశర్కరిలము
సమదసూకరపరస్పరభీకరాఘాతశిథిలదంష్ట్రాచూర్ణసికతిలంబు
గంధసింధురఘటాకటకటాహస్రవద్బంధురదా నాంబుపంకిలంబు
దవగంధవహబంధుదహ్యమానానేకకాశికాగురుధూపగంధిలంబు

పృథులషడ్జస్వరోద్గీతభిల్లపల్ల
వాధరాగీతికాకర్ణనాతిభీతి
పరవశాత్మఘటీరకోటరకటీర
లీనఫణియగు నక్కాన కాన నయ్యె.

అను పద్యముకడకు వచ్చునప్పటికి రామరాజభూషణుఁడు రామభద్రకవిని వారించి "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాసరసం ఫణి" యనున్యాయముచేత సంగీతమునకు సర్వము లానందింపవలసియుండఁగా భయపడి పటీరతతు కోటరములలో దాఁగినట్లు చెప్పితివిగాన నిది దోష మని యాక్షేపించెనఁట. దానికి రామభద్రకవి తాను కేవల సంగీతము నకు భీతిల్లినట్లు చెప్పక షడ్జస్వరముతో పాడఁబడినగీతికను పాములు

భయపడినట్లు చెప్పితినిగాయు, "షడ్జం మయూరో వదతి" యని యుండుటచేత షడ్జస్వరోద్గీతమైన గీతమును విని నెమలికూఁతయని పాములు భయపడి పాటి తొట్రులుదూఁటుట స్వభావమేయనియు, సమాధానమును చెప్పెనఁట. సభవారాయఁజేపణ సమాధానములు విని రామరాజభూషణుఁడే యోడెనని నిర్ధారణము చేసిరఁట! అంతట పట్టిన ప్రతిజ్ఞ ననుసరించి రామభద్రకని రామరాజభూషణుని శిరోవేష్టనము తీయించి క్రిందఁ బెట్టించి సభలో నాతనితల దన్నెనఁట! కొందఱాతని తలకు మాఱుగా శిరోవేష్టమునే తన్నెనని చెప్పుదురు. ఈ కథ యిప్పుడు క్రొత్తగా వచ్చినదిగాక యప్పకవికాలమునాఁటికే యున్నంతన దీని యందుఁ గొంత సత్యమున్నదని యూహింపవలసియున్నది. అప్పకవి పూర్వకవివర్ణనము చేయుచు తన గ్రంథములో

"రామరాజవిభూషణరత్నఖచిత
చారుమస్తకలాపాపహారివాక్య
గౌరవము పెక్కుభంగుల గణనచేసి"

అని రామరాజభూషణునియొక్క కిరీటమును దీయించినవాఁడని రామభద్రకవికి విశేషణముగాఁ జెప్పినాఁడు.

హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచించునప్పటికి రామరాజభూషణుఁడు వృద్ధుఁడయినాఁడు. అప్పటికే విద్యానగరసంస్థానమంతయు పూర్ణముగా నశించిపోయినది. పింగళి సూరనార్యుఁడు రాఘవపాండవీయమును జేసినతరువాత రామరాజభూషణుఁడు హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచియించెను. ఈ రెండుగ్రంథములలోని గుణదోషము లెట్టివైనను రాఘవపాండవీయమునకు వచ్చిన ప్రసిద్ధి యీ గ్రంథమునకు రాలేదు. రామరాజభూషణుఁడీ ద్వ్యర్థికావ్యమును శ్రీరామాంకితము చేసెను. ఈకృతి పదునాఱవ శతాబ్దాంతమునందు రచియింపఁబడినట్లు

కనఁబడుచున్నది. కాఁబట్టి రామరాజభూషణుఁడు ౧౫౫౦ వ సంవత్స రము మొదలుకొని ౧౫౯౯ వ సంవత్సరమునటకును గ్రంథరచన చేయుచున్నట్లు చెప్పవచ్చును. పూర్వోక్తములయిన మూఁడు గ్రంథముల నుండియుఁ గొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

వసుచరిత్రము

మ. సతియూరుద్యుతిఁ జెందఁబూని సజనుశ్చర్మాపనోదక్రియా
రతిఁ బాఁథోలవపూర్తిత్రోదరములై రంభేభహస్తంబు లు
న్నతటిన్ పీడె మరుద్విభూతిఁ గదళిం ద్వగ్దోష మాచంచలో
ద్ధతకుండాతతిఁ బాయ దయ్యె నడె పోతద్వైరమూలం బిలన్. అ. ౩
శా. రాజీవాక్షుల నేచుపాతకివి చంద్రా! రాజవా నీవు? నీ
రాజత్వంబునఁ జక్రముల్ మనియెనో? రంజిల్లి సత్సంతతుల్
తేజం బందెనో? డిందెనో యహిభయోద్రేకంబు? తాఁ జెల్లరే!
రాజై పుట్టుట రశ్మిమాత్రఫలమే? రా జౌట దోషార్థమే? ఆ ర.

హరిశ్చంద్ర నలోపాఖ్యానము.

ఉ. కమ్మనిపువ్వుఁదేనియలఁ గాఁక లడంచుఁ బ్రవాళతాళవృం
తమ్ములఁ సేదఁదేర్చు విరతావులచల్వలుగ్రమ్ముమంచిపూ
దుమ్ములఁ బూజసల్పుఁ బ్రతతు ల్వరమంజులతాధిరాజ్యయో
గమ్మునఁ బొల్చు వానుగుణకల్పకవల్లి వసిం జరింపఁగన్. ఆ. 3.
చ. కుదురుమెఱుంగునిబ్బరగుబ్బలపై నయనాంబుపూరముల్
చెదరఁగ నేల యేడ్చెదవు చెల్వ దురంతవిషాదవేదనా
విదళితమానసాబ్జవయి వే తగు నాయువు శాశ్వతంబె సం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁట, దరంబె యేరికిన్. ఆ. ౫.

నరస భూపాలీయము.

మ. బలితంబై నమనోజబాణహతిచే, బల్మాఱు సిల్పోపలే
కలిసీలాలకప్రాణము ల్వెడలి నేత్రాంభోజమూర్ధంబునన్

గలయంబ్రాఁకుచువచ్చి యన్నెలవుస్ర గన్నీటియే అడ్డమై
నిలుప న్నిల్చె నృసింహభూరమణ మన్నింపంగఁ బాఁడింతటన్. ఆ. ౩

ఉ. చందనశైలసానువులఁ జాలఁ జెలంగుభుజంగబాలికా
బృందము శ్రీనృసింహవిభుఁ బేర్కొనిపాడఁ దదీయగానని
ష్యందము లానువేడ్క బెరయుంగఁ గురంగతురంగ మేగమిన్
మందగతిప్రసంగములు మానవు దక్షిణగంధవాహముల్. ఆ. ౫.

---

23. మల్లారెడ్డి.

ఇతఁడు రచియించిన షట్చక్రవర్తులచరిత్ర మను నెనిమిదాశ్వాస ముల పురాతనగ్రంథ మొకటి నాయొద్దనున్నది. దీనిని తాలపత్రముల మీఁద వ్రాసినవా రేహేతువుచేతనో కృత్యాదిపద్యములను వదలివేసి షష్ట్యంతములు మొదలుకొని వ్రాసియున్నారు. ఈపుస్తకమునందలి యీశ్వాసాంతగద్య మిట్లున్నది.

"ఇది శ్రీమద్భిక్కనవోలిపట్టణ ప్రసిద్ధ సరస్తటావలంబ సిద్ధరా మేశ్వర వరప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాకవి రతాసపోషణ విశేషతా చమత్కార గురుభక్తివిహార రాచుల్ల గోత్ర పవిత్ర కాచభూపాలపుత్ర బుధవిధేయ మల్లారెడ్డి నామ ధేయ ప్రణీతంబైన షట్చక్రవర్తి చరిత్రంబను మహాప్రబంధంబు నందు—ఆశ్వాసము."

ఈమల్లారెడ్డి యిభరామస మనపుస్తకములలోఁ జెప్పఁబడిన యిబ్రహీము గోలకొండ నవాబుగా నున్నకాలములో నుండి యొకసారి యాతని యాస్థానమునకు దనయాస్థానకవీశ్వరునితోడఁగూడఁ బోయినప్పుడు,

చ. బలరిపుభోగ కాచనరపాలునిపెద్దకుమార మల్ల నీ
కలితయశఃప్రభావములు కన్గొనలే కలకట్టు మన్నెమూఁ
కలు తల లొల్లరో బిరుసుగద్దియము ల్చదివించుకొందురా
కొలఁది యెఱుంగఁజాల కలకుక్కలు చుక్కలఁజూచి కూయవే.

అను పద్యమును దనకవిచేత చదివించుకొనఁగా రాజులందఱును గోపించి యుద్ధసన్నద్ధులయియున్నప్పుడు మల్కిభరాము వారినివారించి ప్రశాంతులను జేసెనని యీవఱకే గంగాధరకవిచరిత్రమునందు వ్రాసి యున్నాను. దీనినిబట్టి యీకవి యిబ్రహీము కాలములో నున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇబ్రహీము క్రీస్తుశకము ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౮౧ వ సంవత్సరము వఱకును గోలకొండరాజ్యమును పాలించెను. "కుమారమల్ల" యని పయిపద్యములోఁ జెప్పఁబడి యుండుటచేత మల్లారెడ్డి యిబ్రహీముకాలములో కౌమారదశయందుండి ౧౬౦౦ వ సంవత్సరప్రాంతముల వఱకును జీవించియున్న ట్లూహిం చవలసియున్నది. ఈమల్లారెడ్డి కాపుకులజుఁడు; కాచరాజుపుత్రుఁడు; గోదావరిమండలములోని బిక్కనవోలుసంస్థానప్రభువు. ఇతఁడు రాజ మహేంద్రవరమును పాలించిన వీరభద్రరెడ్డి మొదలై నరెడ్లసంబంధుఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వము రసవంత మయి సలక్షణముగా నున్నది. ఈతని షట్చక్రవర్తిచరిత్రమునుండి కొన్నిపద్యముల నిందుదా హరించుచున్నాను—

సీ. గోపుర గోపుర గోపురప్రతిమంబు
కల్పద్రు కల్పద్రుగౌరవంబు
మానవ మానవ మానవాభిశయంబు
మణిజాల మణిజాలమంజిమంబు
సారంగ సారంగ సారంగనయనంబు
సుమనోబ్జ సుమనోబ్జశోభితంబు

బహుధామ బహుధామ బహుధామచిత్రంబు
ఘనసార ఘనసారగంధిలంబు
భవ్యకాసార కాసారబంధురంబు
జనసైంధవ సైంధవసంకులంబు
బహుళకేతన కేతనభస్థలంబు
నై విజృంభించె సిరి నయోధ్యాపురంబు. ఆ. ౧.

ఉ. రాజవు నీవు సద్గతి తెఱంగు లెఱింగి బుధానురాగివై
రాజరుచిం జెలంగి సముదంచితవిష్ణుపదానువర్తి వి
భ్రాజితసత్కళానిధివి రశ్మి యొకానొకవేళ నిండినన్
హా జనపాలకా కువలయం బడలక గృశియించు టొప్పనే. ఆ. 3.

చ. అతను వియోగతాపము నిజాంగమునం దగ నిండియుండఁగా
నతివ సతృష్ణయై నలకథామృత మెంతయుఁ గ్రోలె నందునన్
మిత మెడల న్వోసన్ జ్వరము మించె నటంచును దత్సుఖీభిష
గ్వితతులు దానికిం దగుచికిత్సలు చేయఁ దొడంగి రత్తటిన్. ఆ. ౪.

సీ. గోరక్షణము చేయుశౌరి యుండుటఁ జేసి
గోరక్షణము చేయుకోర్కె మెఱసె
బుధులఁబ్రోచెడు చతుర్భుజుఁ డుండుటనుజేసి
బుధులఁ బ్రోచుచునుండు బుద్ధిమించె
సత్యానురక్తుఁ డౌచక్రి యుండుటఁజేసి
సత్యానురక్తుఁడై చాల వెలసె
బలభద్రయుతుఁడు శ్రీపతి యుండుటనుజేసి
బలభద్రయుక్తుఁడై ప్రజ్ఞ మీఱె
నొడలఁ బురుషోత్తముఁడు పూనియుంటఁజేసి
తాను పురుషోత్తముం డన ధాత్రి నొప్పె.

భవ్యలక్ష్మీవిలాసవిభ్రమము లలరు
చక్రధరమూర్తి పురుకుత్సచక్రవర్తి. ఆ. ౬.

చ. ఘనములదర్పణంబు లిభకర్ణతలాగ్రము లెండమావు ల
వ్వానధితరంగము ల్నిరులు, వాయువుముందఱ నిడ్డదీపముల్
వనములబుబ్బదంబులు జలంబులపై లిఖియించువర్ణ ముల్
తనువులు, రాకుమార పరితాపము వల్వదు నీమనంబునన్. ఆ. ౭.

చ. సరసులఁ దేలి పుష్పవనసంతతిపై, గడుప్రాలి సుప్తబం
భరములఁ దోలి చారుశుకపంక్తుల నేలి ప్రసూనగంధ మా
దరమునఁ గ్రోలి పుష్పితలతాతరు లెక్కుచు సోలి మెల్లఁగా
జరగఁగఁజొచ్చె దక్షిణపుఁజల్లనిగాలి వయారిపెంపునన్. ఆ. ౮.

---

24. రామరాజు రంగప్పరాజు.

ఈకవిత్రియకవి సాంబోపాఖ్యాన మనెడి యైదాశ్వాసములప్రబం
ధమును రచించి శ్రీరంగనాయకున కంకితము చేసెను. ఈకవి కృష్ణ
దేవరాయనియల్లుఁ డైన రామరాజునకుఁ బెదతండ్రికొడుకు కోనేటి
తిమ్మరాజున కాశ్రితుఁడై యుండినవాఁడు. కాఁబట్టి కవి గ్రమ్మఁవ
సంవత్సరప్రాంతములం దుండినవా ఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.
కోనేటితిమ్మరాజునకును రామరాజునకును తాత యగు నార్వేటిరాము
రాజును, కృష్ణదేవరాయనియల్లుఁ డగురామరాజును, కవి తనసాంబో
పాఖ్యానమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

ఉ. పోరుల నారువీటిపురబుక్కయరామనృపాలుఁ డాగ్రహో
దారత వాలు పూనిన సదాగతికంసితజీర్ణపర్ణలీ
లారభటిన్ విరోధిమహిళాంగవిభూషణరాజిరాలు దై
వారుఁ బ్రతాపపల్లవశుభప్రభ వర్ధిలుఁ గీర్తిపుష్పముల్

మ. దివిజేంద్రాభుఁడు కృష్ణరాయధరణీదేవేంద్రుజామాత శ్రీ
ధవపాదాంబుజబంభరం బమరు మేధావేధ రామప్ప శా
త్రవకంఠాంతరర క్తశీకరసమిద్ధారోర్మిసిక్తాతఖ
డ్గవనీకీర్తిలతాంతగంధిలహరిత్కాంతాకచాభోగుఁ డై

క్షత్రియవంశజుఁ డై నయాకవి యాపస్తంబసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిరుమల శ్రీనివాసాచార్యశిష్యుఁడు. ఈతనిది సలక్షణమై నిరర్గళధార గల మంచికవిత్వము. కవనరీతి తెలియుట కయి సాంబో పాఖ్యానములోనిపద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

చ. పరమజ్ఞానిహృదంతరాళమణిదీపంబుల్ నమన్నాగకి
న్నరనక్తంచరనాక నాయకశిరోనాళీకరాగప్రభాం
కురనీరాజితముల్ నిజాంఘ్రితలముల్ గోపాలబాలుండు ని
ల్పె రటద్గోఖురధూళిధోరణుల నాబృందావనక్ష్మోణులన్. ఆ. ౧.

ఉ. వల్లవవల్లభుండు చెలువ ల్లలపూఁడఁగఁ దత్కటీతటీ
పల్లవముల్ హరించి తనుఁ బ్రార్థనచేసిన నీక నవ్వు నా
ఫల్గుతికాలవిత్రమయి పాండవపత్నికి నెట్లు లిచ్చెనో
చుల్లర వెట్టుప్రల్లదపుజూదరి సిగ్గుపడం బటావళిక్. ఆ. ౭

శా. ఆనియమంబు నాయమము నాదమ మాశమ మానిరంతర
ధ్యానవిధాన మాబహువిధాసనబంధవిదగ్ధభావ మా
మానస మెందునున్ జననిమట్టును గుట్టును మాను లౌనసం
గాఁ నతఁ డొప్పు భక్తికలికాకలికించితబోధమాధురిన్. ఆ. ౮.

ఉ. నడి గాకుండఁగ నుగ్రసేనసృపు భిక్షోవృత్తిఁ బట్టంబునం
దిడి కంసార్జితరత్నకోటులు మహాహేమంబు లాందోళికల్
పడఁతు ల్పర్వతసన్నిభేభములు ఝంపా సంపతద్వాహముల్
నడపించెం దనయింటి కీ వెఱుఁగవే నారాయణుం డుద్ధవా. ఆ. ఎ.

చ. కళలు భజింప వచ్చు శశికాంతివిధంబున నేగు దెంచె నా
యెలుఁగులఁ జేనియాజ్ఞఁ గమలేక్షణుసన్నిధికిన్ సఖీజనా
వళి భజియింప జాంబవతి వ్రజమయూభరణోఘశింజితం
బులు పదవమ్మ నీ వనుచు బుజ్జవ మారఁగ బల్కఁగన్. ఆ.౭.

ఉ. భోజనపాత్ర మొక్కటి యపూర్వము పర్వతధారి కిచ్చెనం
భోజభవప్రసూతి యది భోజనవేళఁ దలంచుభోజ్యముల్
యోజనసేయఁజాలు నది యోజనమాత్రవిసారికాంతివి
భ్రాజితగారుడాశ్మనిసరస్థగితంబు విపాపహారియున్. ఆ. ౩.

మ. అమృతస్యందము కందళింప దరహాసాంకూరముల్ లోచనా
గ్రములం దాండవమాడఁ జంద్రధరుఁ డాకంజాక్షు నీక్షించి యో
కమలాక్షా పరురీతి నీవు వ్రతదీక్షన్ రూక్షచర్యాసము
ద్యమసుం జూపుదు వయ్య యెయ్యెడ సుహృద్భావంబె
యాచంద్రముల్. ఆ. ౮.

చ. కమలసహస్రము న్నయనకాంతి యొనర్పఁగ ఫాలబింబముల్
గుముదహితాయుతంబు నొడఁగూర్పఁ బెనంగు మృగాక్షీమోముతో
గమలవసుఁ జంద్రుఁ బోల్చుకవిగాథల కెయ్యదిమేర యుత్తమో
త్తము నధము న్సమాన మనఁ జారడె బుద్ధి యవజ్ఞఁ జేరదే.ఆ.౯.

చ. అనుచుం బెగ్గిలి కుందుఁనంగనల నయ్యబ్జాక్షి వీక్షించి యో
యనుఁగున్నె చ్చెలులార మీకలు సరోజాలి న్మనోజాతుఁ గ్రో
న్నినలం జిలుకలఁ గోకిలప్రతతి నింద ల్సేయఁగా నేల నా
తనువే నిత్యము ప్రాణ మేమి ధ్రువమే తర్కింపుఁడీ యాదెసన్. ఆ.౫

ఉ. కారవనాథ యేఁ గలుగఁగాఁ గలశీతనయుండు గల్గఁగాఁ
బారుషసింహమూరు లగుబాహ్లికముఖ్యులు కల్గియుండఁగా
నూరక కుండె డేటి కిది యోధులచందమె శీరసాధనున్
వారణచేసి సాంబు నని వ్రాలిచి లక్షణఁ దెత్తుఁ గ్రమ్మఱన్. ఆ.ఱ.

---

25. మట్ల అనంతభూపాలుఁడు.

ఈక్షత్రియకవి కాకుస్థవిజయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించి తనతండ్రి యైన యెల్ల భూపాలున కంకితముచేసెను. తనతండ్రి సభాసీనుఁడయి యభినవాంధ్రకవితాపితామహుఁ డైనయుప్పుగుండూరిపురి వేంకటకవినిజూచి శాశ్వతమగు ధర్మ మెద్దియని యడుగఁగా నక్కవికంఠీరవుఁ డిట్లనియెనని తనకృత్యాదిని వ్రాసికొని యున్నాఁడు—

ఉ. కోనయయెల్ల వైరినృపకుంజరభంజన కంజదళాక్షుసే
వానిరవద్య యాద్యజనవల్లభనీతిసార యా
రా నవఖండరాజరసనాంచలరంగముల న్నటింపఁ ద
న్మానసగర్వపుంబెరఁ దెమల్చి యమర్చితి కీర్తినర్తకిన్.

శా. ధారాపాతము వాసినప్పుడ ఘనత్వం బేర్పడున్ జంద్రహా
సారూఢి న్వెలసిల్లుచున్నపుడ శైత్యం బెల్లఁ గాన్పించు రా
నీరాజద్భుజఖడ్గరాజ మభివర్ణింప న్వశంబే మహా
గ్రారిధ్వంసక మట్ల కోనవిభునెల్లా రాజకంఠీరవా.

గీ. అమితచారిత్ర పుణ్యసూర్గములు గలవు
పెక్కులయ్యును సత్కీర్తి కెక్కునయ
సప్తసంతానములు నందు శాశ్వతంబు
కావ్య మందును సత్కవి కలిగె నీకు.

క. మహి నీపుత్రుఁ డనంతుఁడ
బహుమహిమం జెప్పనేర్చు భవమాళిధుసీ
లహరీఘుమఘుమితవచో
మహితముగా నెల్ల శౌర్యమాయాభిల్లా.

* * * *

ఈకవి పూర్వులలో వరదరాజను నతఁడు కృష్ణదేవరాయని కల్లుఁ డైనట్లు కవి యీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

చ. వనజదళాక్షశంకరులు వార్ధికి నద్రికిఁ బోలె గృష్ణరా
యనికి ననుంగుపల్లుఁ డటులై తనరుఁ వరదక్ష్మాధవుం
డనిమిషవాహినీమునిగజాశ్వమహీరుహధేనుభీమవా
హనమకుటావతంసకుధరాభరణాదికహేతుకీ రియై.

కవి తనతండ్రిని,

ఉ. ఎక్కడఁ గాన మెల్ల ధరణీశ్వరు హేతి కరాతి భీతిమై
నెక్కనిధారుణీధరము లేగసదుర్గదిగంతరాళమున్
ద్రొక్కనికాననాంతరముఁ దోఁగనిదివ్యనదీహ్రదంబులున్.
మ్రొక్కనిఱాలునుం దిననిమూలపలాశిపలాశజాలమున్.

ఇత్యాది పద్యములలో వర్ణించిన వర్ణననుబట్టి యతఁడు క్షత్రియుఁ డగుటయేకాక భూపాలుఁడనియు దెలియనచ్చుచున్నది. తండ్రిమాత్రమే కాక కుమారుఁడైన యనంతభూపాలుఁడును గోలకొండ నవాబయిన యిబ్రహీముషాకాలమునఁ రాజ్యపరిపాలనము చేయుచుండినట్లు చరిత్ర నిదర్శనములు కనఁబడుచున్నవి. కాఁబట్టి కవి ౧౫౫౦ వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁ డయినట్లు తెలియవచ్చుచున్నది. ఈకవి సూర్యవంశజుఁడు ; రంగాంబాపుత్రుఁడు ; తిరుమల తోళప్పాచార్య

శిష్యుఁడు. ఈతనికవిత్వము నిర్దుష్టమయి హృదయంగమముగానున్నది. కాకుస్థవిజయములోని కొన్నిపద్యముల నిందు బొందుపఱుచుచున్నాను.-

ఉ. మనుతనయుండు నంతట సమాధిసమాహనవేళయైన లో
చనములు విచ్చి ముందటఁ బ్రసన్నపరిస్ఫుటబింబ మొప్ప ని
ల్చినచెల నిల్వ్యాటద్దమువలెన్ మెఱయంగ మరుండు మాధవుం
డును నునుగాడ్పు మేనులకు నోచఁగ నచ్చర లాట లాడఁగన్. ఆ-౧

చ. కలువలవిందున క్తమును గమ్మకొలంకులగాడ్పుక్రుంకుఁ జె
ల్వలజడలుక్ వసంతువనవాసనుఁ గ్రొవ్వారిక త్తికోఁతలుక్
వెలసిన నాదుమాధుకరవృత్తి విశిష్టగుణంబు నెంచియో
చెలిమియుఁ బ్రేమయుం బొదలఁజేసె మహాముని యాతిథేయముల్.
ఆ. ౨.

ఉ. నీ విదియెక్కి పద్మభవనిర్జరనాథులఁ జూడ నెప్పుడుం
బోవుచు వచ్చుచుండి ఘనిపుట్టిన వేల్పుల పాలఁగల్గి చే
చేసయొకింత చూపు మని చెప్పి తిరోహితుఁ డయ్యె నయ్యెడన్
వైవతలోకశిల్పి యురదం బటువెట్టి మహాద్భుతంబుగన్. ఆ. ౨.

చ. పుడమికి నీవు రాజ వయి పుట్టితివెన్నఁడు నాఁటనుండియున్
గొడవలు గట్టిపెట్టి నినుఁ గొల్చిరి రాజులు కన్నుదోయికిన్
బడలికగాక యేకలహకారణ గట్టురఁ బ్రేచెదక్ వ్యధం
దడవులఁబట్టి చూడనికతంబున మాసెఁజుమయ్య వీణయున్. ఆ-౩

ఉ. వేల్పులకంటె మున్ననురవీరుల మేము సృజించుకొంచి స
కల్పము మాప్రసన్నతకుఁగా నొనరించితి నన్న వీవచఃకల్పన కర్థ మేమి యలకయ్యము మాకు ననిష్టమంచునో
యల్పులఁ ద్రుంచి లోకములయాపదఁ దీర్చితి వింతయొప్పదే. ఆ-3

ఉ. వచ్చిన నిచ్చట నొ్మ్మలచి వచ్చితిరే యన నోల లాడుచున్
వచ్చితి మమ్మ యేము నొకవారిరుహాకరవీధి నీజటా

భృచ్చతురాననుండు మొలపింపఁగఁ దమ్మలత్రోడఁబుట్టి మా
కిచ్చె సుగంధగంధి పదహారకిరీటము లబ్జనామముల్. ఆ. 3.

చ. అడవుల నీవుదాల్చునడియాలపుసొమ్ము లటుండుఁగాని మా
తొడవులు వెట్టుమంచుఁ గృపతో మణిమంజులభూష లాదిగా
నుడుగర లిచ్చిన న్వేఱుచు చొయ్యన నంది యతండు సైఁచుమీ
విడువనితప్పు నేఁడు వెతఁబెట్టక మానితి వేఁటకానుకల్. ఆ. ర.

ఉ. ఎల్లరుఁ దృప్తులైన నొకయించుకసే పట విశ్రమించి రా
గిల్లినమూఁకతోడఁ దమకింపనియానముతోడ భిల్లరా
డ్వల్లభలక్ష్మితోడ వనవల్లభుతోడ జయంబుతోడ భూ
వల్లభనందనుండు హయవల్గన మొప్పఁగ వచ్చె వీటికిన్. ఆ. ర.

ఉ. ఆరభసంబునప్పు కఠినాదులచేఁ దలలేని బొందులన్
జూరేఁ గడంక లూరెనని చూపటుమెచ్చుల మూరిఁబోయి రా
సూరెల మున్ను కన్నిడినసూటిన వామభుజాభుజాదులన్
బీరముసూపి త్రెళ్లె నవి భీమమహోక్షురాహతంబులై. ఆ. ఎ.

ఉ. అక్కడఁజూడు నిన్న యొడయం డరదీఱెను దల్లిదండ్రితో
నక్కట నేఁడు కల్యకఠినాదులలోపల నొక్కఁడేనియున్
ద్రిక్కకపోయెనే యిసుకదేఱెనె తానకశౌర్యవార్ధియం
దుక్కివు లై రె వేల్పు లొకఁ డూఁటగా నిఁక నేమిచెప్పుదున్. ఆ. ఎ

---

26. ఎఱ్ఱన

ఈకవి కొక్కోకమును, సకలనీతికథానిధానమును తెనుఁగునఁ బద్యకావ్యములఁగా రచియించెను. కొక్కోకమునకు రతిరహస్యమని నామాంతరము. దీని కవిత్వము హృద్యముగానేయున్నను నీతిమంతులు చదువఁ దగినగ్రంథముకాదు. ఈగ్రంథము కుంటముక్కుల మల్లయామాత్యున కంకితము చేయఁబడినది. శైలిని జూపుటకయి కొక్కోకము లోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. పెనిమిటిభాగ్యలేఖగుణబృందము లేనరు లైన ముందటన్
వినుతులు చేయ సౌఖ్యమొదవించును నాథునియందు మిత్రులం
గనుఁగొని సంతసిలుఁ గలకంఠిగుణంబులుచూడఁ జూచి చ
య్యనఁ దెలియంగవచ్చు మదనాంకురభావముఁ జూడకుండినన్. ఆ-౧

చ. తరుణులు పుష్పకోమలులు త త్తఱిపాటున నేమిచేసినన్
విరసము పుట్టుఁ గావున వివేకమునం బురుషుండు తత్సఖీ
పరిచితభంగి రాగరసబంధురుఁడై యెట నేప్రయోజనం
బురమణి కిష్టమూనదియె పూర్వముగా గెడఁబాటుచేయుచున్. ఆ-౭

ఈకవి యుండిన కాలమువిషయమై మన మిప్పుడు కొంచెము విచారింపవలసి యున్నది. కవి కృతిపతియగు భైరవమల్లామాత్యుని వర్ణించుచు—

సీ. హరిపదధ్యానతత్పరుఁడు చండలమహాలక్ష్మ్యప్రసాదై కలబ్ధవరుఁడు
రహి గజపతిమహారాయ లిచ్చినసమంచితమహాపాత్రప్రసిద్ధయశుఁడు
నాజమాఖానరాయనిచేతనొడయుఁడై వినుకొండదుర్గ మేలినఘనుఁడు
కృతివననిక్షేపపృథుతటాకాలయతనయా దిసప్తసంతానఘనుఁడు

మునిపరాశరగోత్రసంజనితుఁ డార్య
సేవ్యతిరువేంగళాచార్యశిష్యుఁ డనఘు
మంత్రి పెరుమాళ్ళకొమ్మయమనుమయోబ
మంత్రి తెలగయ భైరవమల్లమంత్రి.

అని యతఁడు జమాఖానునిచేతఁ బ్రభువుగాఁ జేయఁబడినట్లు చెప్పియున్నాఁడు. ఈ జమాఖాను పదునాఱవ శతాబ్దమధ్యమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది. కవికాలమును నిర్ణయించుట కీగ్రంథ ములో నింకొకయాధారముకూడఁ గానవచ్చుచున్నది. ఇతఁడు పూర్వ కవులను వర్ణించుచు,

నీ. * * * *
* * * *

ఆ. "రావిపాటి తిప్పరాజాదిముఖ్యశ్రీం
గారకవుల నెల్ల గారవించి"

అని రావిపాటి తిప్పరాజును బేర్కొనియున్నాఁడు. ఈరావిపాటి తిప్పరాజు—

మ. సరిబేసై రిపు డేల భాస్కరులు భాషానాథపుత్రా వసుం
ధరయం దొక్కఁడు మంత్రియయ్యె వినుకొండన్ రామయామాత్యభా
స్కరుఁడా యనతఁడే సహస్రకరశాఖ ల్లే వవే యున్నవే
తిరమై దానముఁ జేయుచో రిపుల హేతి న్వ్రేయుచో వ్రాయుచో.

పయిపద్యమును రామయామాత్యభాస్కరునివిషయఁ జెప్పిన ట్లప్పకవీయములో నుదాహరింపఁబడియున్నది. ఈరామయభాస్కరుఁ డచ్యుతదేవరాయని కాలములో నుండినట్లు కొండవీటిలోని గోపీనాథ స్వామివారి దేవాలయద్వారశాఖయందు వ్రాయఁబడియున్న యీక్రింది పద్యమువలన స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది—

సీ. నిర్మించె నేమంత్రి నిరుపమప్రాకారనవకంబుగా గోపినాథపుర మ్ము
గెలిచినాఁడేమంత్రి లలితవిక్రమమునఁబ్రబలుఁడై యవనులబలమునెల్ల
నిలిపినాఁ డేమంత్రి నియతవై భవమున గోపికావల్లభుఁ గూర్మివెలయఁ
బాలించె నేమంత్రి ప్రకటధర్మఖ్యాతి మహిమమిఱుఁగ నాంధ్ర
మండలంబు

నతఁడు భూపాలమంత్రీంద్రసతతవినుత
ధీవిశారదుఁ డచ్యుతదేవరాయ
మాన్యహితవర్తనుఁడు శౌర్యమహితయశుఁడు
భానుతేజుండు రామయభాస్కరుండు.

దీనినిబట్టి రావిపాటి తిప్పరాజు ౧౫౮౦ వ సంవత్సరప్రాంతములయం దుండెననుట స్పష్టము. ఈరావిపాటి తిప్పరాజును స్తోత్రముచేసిన యెఱ్ఱనకవి యాతనికాలమునందో తరువాతనో యుండియుండవలెను. కొక్కోకమును రచించిన కొన్ని సంవత్సరముల కీయెఱ్ఱనకవి సకలనీతి కథానిధానమును రచించి కొక్కోక కృతిపతియైన మల్లామాత్యుని యన్నకొడుకగు కుంటముక్కుల పినభైరవామాత్యున కంకితముచేసి నందునఁ గవి ౧౫౬౦-౭౦ సంవత్సరప్రాంతములయం దుండెనిన చెప్పవచ్చును. సకలనీతికథానిధానములోఁ గృతిపతి కవినిగూర్చి చెప్పిన ట్లున్న యీక్రింది పద్యములు పయియంశమును తెలుపుడు చేయుచున్నవి—

సీ. శ్రీవత్సగోత్రవారిధిపూర్ణశీతాంశుఁ డగుకూచమంత్రికి నాత్మజుఁడవు
వివిధాష్టభాషాకవిత్వవాచాప్రౌఢిఁ బూర్వకవీంద్రులఁ బోలినాఁడ
వఖిలపురాణేతిహాసకావ్యస్మృతిచయము రచించినచారుమతివి
మాపినతండ్రియామల్లమంత్రికిని గొక్కోకంబు చెప్పినకోవిదుఁడవు
రసికు లభినుతిచేతఁ బురాణసార మనుపమంబుగ నా కిచ్చినట్టిప్రోడ
వట్లుగావున నొకటి నిన్నడుగఁదలఁచియిచ్చటికి బిల్వబంచితినెఱ్ఱనార్య.

క. భావమునఁ దోఁచెఁ గలియుగ । పావనభూపాలకథలు బంధురకావ్య
శ్రీ వెలయ నాంధ్రభాషను । గావింపఁగవలయు సుప్రకాశత నాకున్.

పయిపద్యములనుబట్టి యితఁడు పురాణసారమను గ్రంథమును గూడ రచించినట్లు కనఁబడుచున్నదిగాని యీ గ్రంథము దొరకలేదు.

చ. వినుతియొనర్తు నాంధ్రసుకవీంద్రుల నన్నయభట్టుఁ దిక్కనా
ద్యును నమరేశ్వరుం జెదలువాడమహాత్ముని మారనార్యు నా
చనసుతుసోము భాస్కరుని జక్కనయుం గవిసార్వభౌమునిన్
వనరుహపుత్రసన్నిభుల వర్ణితకావ్యకళావిధిజ్ఞులన్.

అని కవి తన సకలనీతికథానిధానములో శ్రీనాథుని వఱకును గల కవుల నేస్తుతించి యున్నాఁడు. "చంద్రశేఖర క్రియాశక్తి రాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుద" మని యుండుటనుబట్టి యీ పద్యము నంముఁ బేర్కొనఁబడిన కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడనుటకు సందేహము లేదు. ఇంచుమించుగా సమకాలికులగుటచేఁ గాబోలు నల్లసాని పెద్దనామల నితఁడిందుఁ బేర్కొనలేదు.

సీ. ప్రభవించె నేపేటఁ బర్వతాగ్రంబున నరిగెరీశ్వరుఁడు శ్రీనాయకుండు
వసియించె నేపేట వర్ణితసాలాంతరమున మూలస్థానరాజమౌళి
యుదయించె నేపేట నుత్తరాశాతటభూషణీకృతనింబ పుట్టలాంబ
వరియించె నేపేట వలదిశాకోణంబునందు గుబ్బటలమైలారమూర్తి
వినుతిగాంచె నేనేటను విప్రరాజ । వైశ్యశూద్రాదిబహువిధవర్ణ సమితి
యట్టి పురరత్న మెప్పుభవ్యాంబుజాత।మండితామరతరువల్లికొండపల్లి

క. ఇటువంటి కొండపల్లీ । పుటభేదనమంత్రిమకుటభూషణ మరిరా
ట్పటకవిభేదనఘటనో । ద్భటుండు కుంటముకుల పినభైరవుఁడొప్పున్.

ఇత్యాది పద్యములనుబట్టి సకలనీతికథానిధానకృతిపతి కొండపల్లి కధికారియైనట్లు కనఁబడుచున్నాఁడు. ఇట్లొక కృతిపతి వినుకొండకును

మతియొక కృతిపతి కొండపల్లికిని ప్రభువగుటచేత నీకవి కృష్ణామండ లమునీని కొండవీటిసీమవాఁ డయినట్లు స్పష్టపడుచున్నది. కొక్కోకము నందు కవి తన్నుగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. శ్రీవత్సగోత్రప్రసిద్ధసంభూతి నాపస్తంబసూత్రప్రశస్తఘనుఁడ
గురుదయానిధి యైనకూచనమంత్రికి నంగనామణి ముత్తమాంబికకును
దనయుండ సత్కవీంద్రసుమాన్యచరితుండ శివకృపాసుజ్ఞాన శేఖరుండ
నాభూధవిద్యాచలానందయోగీంద్రశిష్టప్రచారవిశిష్టఘనుఁడ
నెల్లనామాత్యుఁడను సత్కవీంద్రహితుఁడఁ
గలితవాక్ప్రౌఢిఁ గొక్కోకకవివరుండఁ
జతురమతితోడ రతికళాశాస్త్ర మిదియుఁ
దెనుఁగు గావింతు రసికులు వినుతిచేయ.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; కూచనామాత్య పుత్రుఁడు. ఇతఁడు తా నష్టభాషాకవితాప్రవీణుఁ డయినట్లును, నవఘంటసురత్రాణ బిరుదాంకితుఁ డయినట్లును, గ్రంథమునం జెప్పుకొనియున్నాఁడు. ఈతని కవిత్వము మనోహర మైనదని యీవఱకే చెప్పియున్నామనుగదా. ఇప్పుడీతని సకలనీతి కథానిధానమునుండి నాలుగు పద్యముల నిందుదాహరించుచున్నాము—

శా. ధారాపట్టణ మేలు భోజుఁడు మహోదారుండు వాహ్యాళిగా
నారణ్యంబున కేగి వచ్చునెడ బ్రహ్మప్రాప్తభూయావనా
శారంభస్థలిచేరువం జనఁగ సైన్యవ్రాతమున్ జూచి య
ప్పాఱుం డిట్లనె జొన్నచొచ్చి వలెనా భక్షింపుఁడీ బియ్యముల్—ఆ౧

ఉ. ఊరకయేలయుండ మన మోహనకరత్నమ యస్మదీయసం
చారవినోదము ల్కలిసి సల్పుద మన్నఁ దొలంగు చేర కో
రమ పూరుషు ల్బహుళకిల్బిషచారు లసత్యభాషణుల్
క్రూరులు వారితోడ నొడగూడి మనంగలరే వధూమణుల్—ఆ.౨

చ. అధిపతి నంచు గ్రద్ద మిము నందఱు నీనగవింధ్యవాసకున్
వధ యొనరించి మాంసము లవారణగా బలిపెట్టఁజూచె మీ
రథములువోలెనుండఁ దగదన్న ఖగంబులుపల్కఁ మమ్ము నీ
విధమునఁ బాపఁగాఁదలఁచి వీడఁగనాడుట మీకు ధర్మమే.—ఆ. 3

ఉ. అంతట రాగమంజరి గృహంబున సీధురసంబు గ్రోలి యే
కాంతమ యప్సరంబు చిఱుగ్రంతల నేగఁ దలారిమానుసుల్
చెంతల డాసి పట్టుకొని చేతుల దంపిన నన్నుమిన్న మీ
భ్రాంతిమునందుఁ గ్రెళ్ళి కెళవారయుదూతికఁ గాంచె నాదటన్-ఆర

---

27. శంకరకవి

ఈకవి హరిశ్చంద్రోపాఖ్యానమును పద్యకావ్యమునుగా రచించెను. ఈకావ్యమును నెల్లూరికావ్య మనియు, కవిని నెల్లూరి శంకరకవి యనియు, బ్రౌన్‌దొరగారు వ్రాసిరికాని యీవ్రాఁత నిరాధారమైనది. కవి గోదావరిమండలములోనివాఁడు; కృతి నాయకుఁడైన యీడూరి యెల్లనయు గోదావరీమండలములోనివాఁడయి యీడూరి కరణమును కాల్కొలనువాస్తుఁడు నయియుండెను. ఈయంశములను కవి తనపుస్తకమునం దిట్లు చెప్పినాఁడు.—

గీ. మతి వితర్కింపఁ గేవలమంత్రిమాత్రుఁ
డే ధనంజయబాహుశౌర్యాధికుండు
సత్యవ్రతునుఁ డీడూరిశాసనుండు
హితవచోహారి బాచయయెల్లశౌరి.

వ. అమ్మంత్రినిధానంబునకు నిజస్థానంబు.

మ. అరవిందాసనవాసవాద్యమరలోకారాధ్యకరోకటకే
శ్వరకారుణ్యసదాభిరక్షితము భాస్వద్ధ్రిమదూభసురో
త్కరనిత్యశ్రుతిపాఠనిస్వన ముదాత్తశ్రీ నజస్రంబు ని
ద్ధరణిం బేరొకొన నొప్పు గారొకొలను గోదావర్యుపాంతంబునన్.

ఒక్క కృతిపతిమాత్రమేకాక కృతిపతియొక్క తాతముత్తాత లును గోదావరిమండలములోనే పుట్టి పెరిగి యక్కడనే సంబంధబాం ధవ్యములను జేసికొనుచుండిరి. కవి కృతిపతియొక్క ముత్తాతను వర్ణం చుచు నతడు గోదావరిమండలములోని యుండి గ్రామములో సంబం ధము చేసికొన్న ట్లీక్రిందిపద్యమునఁ జెప్పినాఁడు.—

చ. ప్రెగడనమంత్రి బంధుజనబృందము వేరొకన నుండిశాసనుం
డగుమతిశాలివీరసచివాగ్రణిపుత్రికఁ దిప్పమాంబికన్
దగుమహిమ న్వివాహ యయి ధన్యచరిత్రులఁ గాంచెఁ బుత్రులన్
జగదభివర్ణనీయుల విశాలయశోవిభవాభిరాములన్.

ఈడూరికరణమునకుఁ గృతి యిచ్చినకవియు తద్గ్రామపరిసర మున నివసించువాఁడే యై యుండవలెనుగాని యెక్కడ నుండియో నెల్లూరినుండి వెదకుకొనుచు వచ్చినవాఁడయి యుండఁడు. కవి తన గ్రంథ ములోనే తానాయెల్లనార్యునికి బంధుఁడును విధేయుఁడు నయినట్లును తన్నతఁడింటికిఁ బిలిపించి హరిశ్చంద్ర చరిత్రమును దన కంకితము చేయు మని కోరినట్లును చెప్పిన పద్యములలో నొకటి యిందు వ్రాయుచున్నాను—

మ. నను గౌండిన్యమునీంద్రగోత్రజు సుధాంధస్సింధుకల్లోలతు
ల్యనిరాఘాటవచోధురంధరుని దేచామాత్యసత్పుత్రుఁ బా
వనచారిత్రు శశాంకమౌళిపదసేవాలబ్ధసాహిత్యస
ద్ధనునిన్ బంధు విధేయు శంకరకవిన్ దాక్షిణ్యపుణ్యాధికున్.

కృతిపతియుఁ గృతికర్తయు నిరువురును గూడ నాఁటివేలనియో గులు. వారిరువురును కుతుబ్‌షా గోలకొండ నవాబుగా నున్నకాల

ములో నున్నట్లు కవికృతినాయకుని గూర్చి పంచమాశ్వాసాంతమున సంబోధించిన యీ పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

క. అలఘుప్రతాపకుతుబన । మలకేంద్రకృపాసమగ్రమహిమాన్విత కా
కొలనిగ్రామనికేతన । జనసీమారక్షణైక కచాతుర్యనిధీ.

ఈకుతుబనమలకేంద్రుఁడు సాధారణముగా నిభరామని చెప్పబడెడి యిబ్రహీము కుమారుఁడయినమహమ్మదు కుతుబ్‌షా. ఇతఁడు క్రీస్తుశకము ౧౫౮౦వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧వ సంవత్సరమువఱకును గోలకొండలో రాజ్యము చేసినందున, కవియు నప్పుడే యుండి పదునాఱవ శతాబ్దాంతమునకో పదునేడవశతాబ్దాదియందో యీప్రస్తకమును జేసియుండును. శంకరకవివిరచితమైన హరిశ్చంద్రోపాఖ్యానము మృదుమధురపాకము గలదయి రసవంతమయి సహృదయాహ్లాదకరముగా నుండును. ఇందలి పద్యముల నొక్కొక్కయాశ్వాసమునుండి యొక్కొక్కదాని నిం దుదాహరించెదను—

శా. ఆకర్ణింపుము పాకశాసన సుపర్వానీకసంసేవ్య భూ
లోకాధీశుఁ డగణ్యపుణ్యుఁడు కృపాలోలాత్మకుం డర్థిర
క్షాకల్పద్రుము మద్రిధీరుఁడు హరిశ్చంద్రాభిధానుండు ధా
త్రీకాంతుం డొకఁ డొప్పు సూనృతవచఃశ్రీవై భవోపేతుఁడై. ఆ. ౧.

చ. మును ధర యేలి చన్ననృపముఖ్యు లనేకులు చర్చచేసినఁ
జనవర వారిలోన విలసన్మతిసారగు లెవ్వరైన సొం
పునఁ దమవెంట ముంటిమొనమోపఁగఁజాలినయంతమేరయుఁ
గొని చనిరే ధరాతలము కొంకకువిూ యిల దానమిచ్చుచోఁ. ఆ. ౨

సీ. పరమపావనత్రేజ పావక సదయాత్మ హరిణాంకమౌళిపర్యాయకాయ
యనఘుపాతివ్రత్యమున మనోవాక్కాయకర్మవిస్ఫూర్తిచే ధర్మనిరతిఁ
బూని చరించితినేని మత్రాణేశ్వరుండు సూనృతవచోరూఢి మెఱసి
భూనుతకీర్తివిభూతిశోభితుఁడేని శీతలాకృతి మానిశిష్యునకును

విశదవాత్సల్యమున మున్ను కుశలమొసఁగి
పిదపఁ గౌశికఋణము సంప్రీతిఁదీర్పఁ
గూడునట్లుగఁ బెనిమిటిఁ గూడుకుఁ గరుణ
నరసి రక్షింపవయ్య జోహారునీకు.

శా. ఏణీలోచన నానిమిత్తమున నీ కీపాటు పాటిల్లనే
క్షోణీనాథులరాణివాసములు చక్కుఁకొతుకాపాదిని
శ్రేణీలాలితహర్మ్యవాటికలలోఁ గ్రీడావిశేషంబులన్
బ్రాణేశాన్వితలై నిరంతరసుఖప్రౌఢిన్ వినోదింపఁగన్. ఆ. ర

మ. అకటా చేరెఁడు నేలకుం దగఁడై సప్తాంభోధివేష్టిభవ
త్సకలద్వీపకలాపభూపమకుటాంచత్పద్మరాగోజ్జ్వల
ప్రకటానర్ఘనిర్ఘళత్కిరణశుంభత్పాదుఁ డైనట్టిరా
జుకుమారుం డని యేడ్చె గన్నుఁగన నశ్రు ల్కాల్వలై పాఱఁగన్.
ఆ. శ.

---

28. కంచి వీరశరభకవి.

ఈకవియు శంకరకవివలెనే హరిశ్చంద్రోపాఖ్యానము నయిదా
శ్వాసములపద్యకావ్యముగా రచియించెను. కవి శైవబ్రాహ్మణుఁడు;
కాశ్యపగోత్రుఁడు; శోభనాద్రీశునకును పండితారాధ్యుల వీరనారాధ్యుని
పుత్రియగు గురవమాంబకును బుత్రుఁడు. ఈయిరువురుకవులు నించు
మించు నేకకాలమునందే తమకావ్యములను రచియించినట్లు తోఁచు
చున్నది. ఇందు శంకరకవిపుస్తకమునకంటె నేఁబదిపద్యము లధికముగా
నున్నవి. ఒకరు వ్రాయుచున్నకథ నొకరెఱుఁగక యిరువురుకవులును
గౌరనమంత్రికృతమైన ద్విపదకావ్యము ననుసరించి తమ పద్యకావ్య

ములను జేసి యుండవచ్చును. ఒకవేళ నీయిద్దఱిలో నొకరు రెండవ వాని కావ్యమును జూచి తరువాతఁ దనపుస్తకమును జేసియు నుండవచ్చును. ఈయంశమును దీనిం జదువువారు నిర్ధారణ చేసికొనఁ గలుగుట కయి యించుమించుగా శంకరకవిగ్రంథములోనుండి యుదాహరించిన పద్యముల యర్థమునిచ్చెదము పద్యములనే యిందుదాహరించుచున్నాను—

చ. ఉరుతరసత్యవాక్యవినయోచితభూరిగుణప్రసిద్ధికిఁ
నరపతు లేమిలెక్క పదునాలుగులోకములందుఁ జూడఁ గి
న్నరసురయక్షకింపురషనాయకులం దొకఁ డైన లేఁడు ని
ర్భరమహితప్రభావమునఁ బన్నిద మిత్తుఁ బురారిసన్నిధిన్. ఆ. ౧.

ఉ. మానవనాథ యీకొఱఁత మాట్లఁ దీఱదు గాధిసూనుఁ డీ
పూనికఁ దప్పఁ డింకఁ గొనిపోయిరె మున్ను ధరిత్రి చేరెఁడం
బైన నరేంద్రముఖ్యులు దివాకరవంశపయోధిచంద్ర నీ
మానితవాగ్వదాన్యమహిమం బెఱఁబాయు టదేమి చూడఁగన్.
ఆ. ౨.

చ. ధృతిమెఱయంగ నేనిటు పతివ్రత నేని, ధరిత్రిమోఁద మ
త్పతిఘనసత్యవాక్యనయభాసురుఁ డైన కృశాన నీ విదే
హితమతి శీతలాకృతి వహించి ధరామరవర్య భూవిభు
సుతుఁ డగులోహితాస్యు దయఁజూచి మునీంద్రుబుణంబుదీర్పుమా.
ఆ. ౩.

ఉ. ఏమనవచ్చు మున్ను ధరయేలినరాజులదేవులెల్ల స
త్కామవినోదవై భవసుఖప్రదలై వసియింప, నిన్ను బల్
బాములఁ గప్పి కాఱడవిపాలుగఁ ద్రిప్పి కృతఘ్నబుద్ధిచే
నీమము దప్పి యమ్మకొన నేరుపు గల్గె లతాంగి యేమనన్. అ. ౪.

శా. సప్తద్వీపసముద్రముద్రితమహాసర్వంసహాచక్రసం
ప్రాప్తశ్రీకమనీయలక్షణజగత్ప్రావీణ్యసత్యవ్రతో
ద్దీప్తప్రాభవుఁ డైనరాజసుతుఁ డర్థిఁ దైన్యభావోదయ
వ్యాప్తిన్ బెత్తెఁడునేల కైనఁ దగఁడే యంచు న్వీలాపించుచుఁ.

ఆ. ౫.

---

29. తెనాలి రామకృష్ణుఁడు.

ఈతనికి మొట్టమొదట రామలింగ మని పేరనియు, ఆపేరుతో నితఁడు శివభక్తిపరాయణుఁ డయి లింగపురాణమును తెనిఁగించెననియు, చెప్పుదురుగాని యిది యెంతవఱకు నిజమో తెలియదు. ఈతనిచే నాంధ్రీకరింపఁబడినదన్న లింగపురాణ మిప్పు డెక్కడను గానఁబడదు. అప్పకవి మొదలగువారు రచించిన లక్షణగ్రంథములలో నందలిపద్య మొక్కటియు నుదాహరింపఁబడి యుండకపోవుటచే పూర్వకాలము నందుసహితమట్టి గ్రంథ మున్నట్లు తోఁచదు. ఈకవి మొట్టమొదట శివభక్తుఁ డయినను విష్ణుభక్తులగు చంద్రగిరిరాజులను సంతోషపెట్టుట కయి తరువాత విష్ణుభక్తుఁ డయి వైష్ణవులను గురువులనుగాఁ గైకొనె ననియుఁ గూడ జెప్పుదురు. ఈకథ సత్యమైనను గావచ్చును. ఇతఁడు రచియించినట్లు చెప్పెడు చాటువద్యములలోఁ గొన్నిటిలో నీతనిపేరు రామలింగమని కానఁబడుచున్నది. అందొకపద్యము నిం దుదాహరించుచున్నాను—

ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచెలింగని, మేచకకంధరుం ద్రిశూ
లింగని సంగతాళి లవలింగని, కర్దమదూషిత న్మృణా
లింగని, కృష్ణచేలుని హాలింగని నీలకచన్ విధాతృనా
లింగని, రామలింగకవిలింగనికీర్తి హసించుదిక్కులన్.

కూర్మపురాణమునందు రాజలింగకవి కవిస్తుతిచేయుచు "రంగ నాథుని రామలింగకవిని" అని రామలింగనామమునే వాడియున్నాఁడు. ఈరామకృష్ణకవి గృష్ణామండలములోని తెనాలిగ్రామమునందు శాలి వాహనశకము ౧౩౯౮ వ సంవత్సరమున నసఁగా క్రీస్తుశకము ౧౪౭౬ వ సంవత్సరమున జనన మొందెననియు, ఈతనియింటిపే రీశ్వరప్రెగడవా రనియు, పయికాలమును సూచించెడి యాతని జన్మపత్రికవలన సితఁడు మంచిలగ్నమునఁ బుట్టినట్లు కానవచ్చుచున్నదనియు, అయిదవసంవత్సర ములక్రిందట తమదక్షిణాంధ్రసాహిత్యచరిత్రమునందు కావలి వేంకట రామస్వామిగారు వ్రాసియున్నారు. అయినను మన కీతనికాలమును గూర్చి యిప్పుడు దొరకిన నిదర్శనములనుబట్టి చూడఁగా పూర్వోక్త కాలము సరియైనదని నమ్ముటకు వలనుపడదు. రామకృష్ణకవి దని చెప్పఁబడెడు జన్మపత్ర మిటీవలివారిచేత సృష్టింపఁబడిన దయి యుండ వలెను. అటుగాక యితఁడు పయిని జెప్పఁబడిన సంవత్సరమునందే జన్మించి యుండినపక్షమున, ఈకవి కృష్ణదేవరాయలు సింహాసనమునకు వచ్చినప్పటికే దాదాపుగా నేఁబదియేండ్లప్రాయము గలవాఁ డయి యుండవలెను. రామకృష్ణకవి యప్పయదీక్షితులవార్తోను తిరుమల తాతాచార్యులతోను సమకాలికుఁ డయి చంద్రగిరిరా జగు వేంకటపతి రాయల ప్రభుత్వకాలములో నుండినవాఁ డయినట్లు కొన్ని నిదర్శనములు కనఁబడుచున్నవి. ఈవేంకటపతిరాయలు వసుచరిత్రమును కృతినందిన తిరుమలదేవరాయల యనంతరమున తనరాజధానిని విజయనగరమునుండి చంద్రగిరికి మార్చుకొని క్రీస్తుశకము ౧౫౭౫ వ సంవత్సరము మొదలు కొని ౧౬౧౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినవాఁడు. కృష్ణ రాయని మరణానంతరమున నేఁబదియైదుసంవత్సరములకు రాజ్యమునకు వచ్చిన వేంకటపతిరాజుయొక్క రాజ్యకాలములోనున్న రామకృష్ణకవి నిజముగా నొకవేళ కృష్ణదేవరాయలకాలములోఁగూడ నుండుటయే తట

సించినపఱమున, అతఁడప్పుడు బాలుఁడయియుండెవలెనుగాని జన్మ
పత్రమునంబుఁ జెప్పఁబడినప్రకారము వయసుమీఱినవాఁడయియుండఁ
జాలఁడు. కాఁబట్టి యీజన్మపత్ర మెంతమాత్రమును విశ్వాసపాత్ర
మయినదికాదు. ఈకాలవ్యత్యాసమును సరిపఱుచుట కయి కొంద
అప్పయ్యదీక్షితులవారుకూడ కృష్ణదేవరాయలకాలమునాఁటివారే యని
చెప్పుచున్నారు. అప్పయ్యదీక్షితులవారు మిక్కిలి వృద్ధు లగువఱకును
జీవించినవా రగుటచేత బాల్యమున కృష్ణరాయసి దినములలో నుండిన
నుండవచ్చునుగాని యీసంస్కృత విద్వత్కవి వేంకటపతిరాయల
యాస్థానమునందే యుండి ప్రసిద్ధుఁడయినవాఁడు. ఈదీక్షితులవారు
కాంచీపురమునకు నలుబదిమైళ్ళదూరములోనున్న యడెపోల మను
నగ్రహారమున నీశ్వరాంశచేత నారాయణదీక్షితులకు పుత్రుఁడయి పుట్టి
ననియు, ఇతఁడు తనపండ్రెండవసంవత్సరమునాఁటికే వేదాధ్యయనము
చేసి "శివార్చనచంద్రిక" "శివతత్త్వవివేకము," "శివమణిదీపిక" "ఆత్మా
ర్పణము" మొదలయిన శైవగ్రంథము లనేకములు చేసెననియు, వాధము
నందు వేంకటపతిరాయలసంస్థానమున రాజగురువయిన తాతాచార్యుల
నోడించి రాజసమ్మానము పొందెననియు కావేరీతీరమునందనేక యాగ
ములుచేసి యవసానదశయందు కాశీవాసము చేయవలెనని యయివది
యేండ్లు నిండినతరువాత ప్రయాణ మయిపోవుచుండఁగా త్రోవలో చిదం
బరపురనివాసు లాతనిపోనీయక తమయూరనుండునట్లు ప్రార్థించి నిలిపి
నందున నపరకాశి యగు చిదంబరమునందుండి యందే దేహావియోగము
నొందెననియు అత్రఁడు నూటికంటె నెక్కువపుస్తకములు రచించె
ననియు చెప్పుదురు. ఇప్పు డీమహాకవి రచించినగ్రంథము లనేకములు
నశించినవి. కువలయానందమనెడి యలంకారశాస్త్రము సుప్రసిద్ధమయి
సర్వదేశములయందును వ్యాపించియున్నది. తనతండ్రికిఁ గలిగిన గెలుపు
లను వర్ణించుచు నీలకంఠవిజయమును సంస్కృతగ్రంథమును జేసిన

యయ్యదీక్షితు లప్పయదీక్షితులవారికి మేనల్లుఁ డయి మధురరాజగు తిరుమలనాయకునియొద్ద మంత్రిగా నుండినందునను, ఈతిరుమలనాయకుఁడు మధురాపురము రాజధానిగా హూణశకము ౧౬౨౩ మొదలు కొని ౧౬౫౯ వ సంవత్సరమువఱకును పాండ్యదేశమును పాలించినందు నను, ఆకాలమునందుండిన యయ్యదీక్షితుల మేనమామయైన యప్పయ్య దీక్షితులవారు నూఱుసంవత్సరములక్రిందట కృష్ణదేవరాయలసభయం దుండిరనుట నమ్మఁదగినదికాదు. అందుచేత దీక్షితుల చరిత్రోడిసమ కాలికుఁడయిన రామకృష్ణకవియు కృష్ణరాయని యాస్థానమునందుండలేద నుట నిశ్చయము.

రామకృష్ణునిగూర్చి తాతాచార్యులవారిత్రో సంబంధించినకథ లనేకములు చెప్పుచున్నారుగాన, దీక్షితులవారి చరిత్రమువలెనే యాచా ర్యులవారిచరిత్రమును మనకథతో నంతగా సంబంధించినది కాకపోయి నను తాతాచార్యులవారినిగూర్చికూడ నిచ్చట గొంచెము వ్రాయు చున్నాను. ఈయనజన్మస్థలము కాంచీపురము; ఈతఁడు గొప్పవిద్వాం సుఁడును, సంస్కృతకవియు, ధర్మాత్ముఁడును అయి యుండెను. అప్పయ్యదీక్షితులవారు శివాంశచేత పుట్టికని చెప్పినట్లే యితఁడు విష్ణ్వంశ చేతఁ గలిగెనని జనులు వాడుకొందురు. ఇఁడు తనధనముత్రో బీదల కనేకవివాహములు చేయించినందున వీరివంశనామము తిరుమల వారయి నను తరువాత కన్యాదానమువా రని మాఱినది. ఈతఁడు గీర్వాణ భాషలో "సాత్వికబ్రహ్మవిద్యావిలాసము" అనుగ్రంథమును జేసెను. ఇతఁడు చంద్రగిరిరాజులకు వంశగురువయి తఱుచుగా కాంచీనగరము నుండి చంద్రగిరికిఁబోయి వేంకటపతిరాయలసంస్థానమునందు వసించుట చేత, ఈయన కక్కడ రామకృష్ణకవిత్రోడి సంబంధము కలుగుచు వచ్చెను. ఈతాతాచార్యులు మొట్టమొదట రామరాజుయొక్క రాజ్యాంతదశలోఁ దలయెత్తి, వైష్ణవమతమునం దత్యంతాభినివేశము

గలవాఁడయి తనశిష్యులయిన రాజులబలముచేత బలవంతముగా జనులను బట్టి చంకార్కంకణాదులు చేయుచువచ్చెను. అంకుచేతనే "తాతాచార్యులవారిముద్ర భుజము తప్పినను వీపుతప్పదు" అనుసామెత నేటివఱకును వచ్చుచున్నది.

రామకృష్ణకవియొక్క కాలమును నిర్ధారణము చేయుటకుఁ దగిన యాధారములు కొన్ని తద్విరచితమైన పాండురంగమాహాత్మ్యమునందే కనఁబడుచున్నవి. కవి యీక్రిందిపద్యమునందు కృతిపతియైన విరూరి వేదాద్రియొక్క గురువుగా కందాళ యప్పలాచార్యులవారిని వర్ణించి యున్నాఁడు—

సీ. వేదపూర్ణప్రతిష్ఠాధైవతజ్యేష్ఠుఁ డభ్య స్తషడ్దర్శనార్థరాశి
యతిరాజరచితభాష్యగ్రంథనిర్ణేత యఖిలపురాణేతిహాసకర్త
బంధురదివ్యప్రబంధానుసంధాత పంచసంస్కారప్రపంచచణుఁడు
వాధూలమునిచంద్రవంశవర్ధనమూర్తి సకలదేశాచార్యనికరగురువు
పట్టమేనుంగు శ్రీరంగపతికి నణ్ణ
గారిగర్భాంబురాశిసీహారరశ్మి
సారసాహిత్యసర్వస్వశయ్యపేటి
యాళవంచారు కందాళయప్పగారు.

వై జయంతీవిలాసమును రచియించిన సారంగు తమ్మకవియు నీకందాళ యప్పలాచార్యులవారినే తనగురువునుగా విప్రనారాయణ చరిత్రము యొక్క ప్రథమాశ్వాసమునం దీక్రిందిపద్యముచేతఁ జెప్పియున్నాఁడు—

క. వందారు దాసజనతా
మందారు న్వేదశాస్త్రమహితప్రజ్ఞా
బృందారకగురు మద్గురుఁ
గందాళాప్పలగురుఁ జగద్ధితుఁ గొలుతున్.

పయిపద్యద్వయమునుబట్టి చూడఁగా రామకృష్ణకవియు తమ్మకవియు సమకాలీను లగుట స్పష్ట మగుచున్నది. వీరిలో తమ్మకవి తన వైజయంతీవిలాసమునందు తా ను గోలకొండ కరణ మయినట్లును తనకాలము నందా దేశమును మహమ్మదుశాహి పాలముచేయుచుండినట్లును ప్రథమా శ్వాసములో నీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

చ. ఇనసమతేజులౌ నృపుల నెల్ల మహమ్మదుశాహి యేలు నీ
యెనుబదినాల్గుకుర్గముల నేలినయేలిక గోలకొండ త
ద్ఘనగరస్థలిన్ గరణికం బొనరించును దమ్మమంత్రి యా
జనపతి రమ్మ పొ మ్మనఁ ప్రజ ల్జయపెట్ట గృహాస్థు లౌననన్.

ఈమహమ్మదుశాహి నవాబుగానుండి గోలకొండరాజ్యమును క్రీస్తుశకము ౧౫౮౧ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ సంవత్స రమువఱకును పాలించినందున, ఈతని కాలమునందున్న తమ్మకవియు నాకాలమునందే జీవించియుండెను. తమ్మకవితోడి సమకాలికుఁ డయిన రామకృష్ణకవియు నించుమించుగా నీకాలమునందే యనఁగా పదునాఱవ శతాబ్దాంతమునందును పదునేడవ శతాబ్దాదియందు నుండెననుటకు సందేహము లేదు. కవియొక్క కాలనిర్ణయము చేయుటకు పాండురంగ మాహాత్మ్యమునం దింకొకయాధారముకూడ కనఁబడుచున్నది. పాండు రంగమాహాత్మ్యమును కృతి నందిన విచారి వేదాద్రి యొక చిన్నజాగీరు దారయిన పెదసంగమరాజువద్ద ప్రధానిగా నుండెను. ఈవిషయము పాండురంగమాహాత్మ్యమునం దిట్లు చెప్పఁబడినది—

సీ. తనకులాచారవర్తన వైష్ణవాచారపర్యాయముల కొజ్జబంతియనఁగఁ
దనసూనృతముపురాతనసత్యసింధులయున్నతికిఁ బునఃప్రతిష్ఠితముగాఁగఁ
దనబుద్ధి నీతిశాస్త్రరహస్యములఁ దెల్లముగఁ దెల్పువ్యాఖ్యానముద్ర
గాఁగఁ
దనవాయుగంటంబు నొనవాఁడి విశ్వంభరాప్రజలకుఁ బ్రాణరక్షగాఁగ

వెలయు మంగయగురువభూవిభుని పెద్ద
సంగభూపాలమణి ప్రాయసప్రవర్తి
ప్రియయుతుం డై నరామానుజయసుతుండు
భద్రచారి విహారి వేదాద్రిశౌరి.

కృతినాయకుఁ డై నవేదాద్రికి ప్రభువగుసంగరాజుయొక్కతండ్రి గురువరాజు సదాశివదేవరాయని రాజ్యకాలములో నుండి యాతని వలన శాలివాహనశకము ౧౫౭౪ వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౫౯౫ వ సంవత్సరమునందు దేవుని నిమిత్తము నాలుగుగ్రామ ములు సంపాదించినట్టు మొకెంజీదొరవారు సమకూర్చి చెన్నపురిలో ప్రాచ్యలిఖితపుస్తకనిలయమునం దుంచిన స్థానికచరిత్రమువలనఁ దెలియ వచ్చుచున్నది. మంగయకొడుకై న గురువరాజును మంగయతమ్ముసిగాఁ జెప్పిన యాచరిత్ర మెంత నమ్మవచ్చునో యాలోచనీయముగా నున్నది. ఈకాలమును బట్టిచూచినను గురువరాజుకొడుకయిన సంగభూపా లుఁడు పదునాఱవ శతాబ్దమునొక్క కడపటి భాగమునందు రాజ్యము చేసినట్టే యూహింపఁదగియున్నది. అతని యాశ్రితుఁ డగుటచేత రామ కృష్ణకవియు ౧౫౬౦ - ౭౦ సంవత్సరప్రాంతమునుండి కవియై యుండ వచ్చును. కవి పాండురంగమహాత్మ్యమును వేదాద్రి కంకితము చేయు నప్పటికే వేదాద్రికి కొడుకులు మొదలయినవారు కలిగియున్న ట్లీపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

క. సోదరులు సుతులు సతులును
వేదోదితమార్గచర్య వినయము నయముక్
శ్రీదాంపత్యము నెనఁగఁగ
వేదాద్రిమహాప్రధాని వెలయుం గృతులక్.

రెట్టమతమును రచియించిన యయ్యలరాజు అయ్యలభాస్కరుల కాలమునుబట్టి చూడఁగా రామకృష్ణుఁ డింకను దరువాతివాఁడని తెలి

యవచ్చుచున్నది. పాండురంగ మాహాత్మ్యకృతిపతియగు విరూరి వేదాద్రి కాశ్రేయుఁడగు పెదసంగభూపాలుని మేనల్లునికి రెట్టమతము సంకితమొన ర్చిన యాకవులు తమకాలము నీక్రిందిపద్యముచేఁ దెలిపికొనియున్నారు—

సీ. కలియుగప్రథమభాగమునాల్గువేలయెన్మ్మిదినూర్ల్మై నిడెబ్బదియునొకటి
శాలివాహనశకసమలిలవేయునారూఢిత్రొంబదిరెండు రూఢిగాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వదిమూఁడు నేండ్లయ్యె నెంతయు
నెన్న బుధులు

అట్టికాలంబున నయ్యల భాస్కర కవివర్యులలరాజకమలహితుని
యాజ్ఞఁబూర్వోక్త రెట్టమతాఖ్యకావ్య
మునునొనర్చిరి యాచంద్రముగను గీర్తి
వ్యక్తశ్రోతలకునుగల్గ వసుధమీఁద
నలయసాహోబల నృహరికి నర్పణముగ.

సంగభూపాలుని యనుగ్రహమువలన వేదాద్రిసంపదల నొందినట్లు

గీ. గుఱుతుగలరాజు మంగయ గురువరాజు
పుత్రుఁ బెదసంగభూపాలుశత్రుజైత్రు
భానుసమతేజు విద్యానధానభోజుఁ
గొల్చి వేదాద్రి నిత్యలక్ష్మీలఁ దలిర్చు.

ఇత్యాది పాండురంగమాహాత్మ్యములోని పద్యములు చెప్పు చున్నవి. పెదసంగభూపాలుఁడు గురువరాజుయొక్క త్రొమ్మండ్రుపుత్రు లలో జ్యేష్ఠుఁడు. ఈతని తమ్ముల నామము లాగ్రంథమునందుఁ జెప్పఁబడి యుండకపోవుటచేత గ్రంథరచనకాలమునకు వారు బాలురనియు సంగ భూపాలుఁడు యౌవనదశయం దుండినవాఁడనియు స్ఫురించుచున్నది. పెదసంగభూపాలుని తమ్ముల నుగూర్చి రెట్టమతములోఁ గృతిపతియొక్క తండ్రి యగుపెదతిమ్మరాజును వర్ణించుసందర్భమున నిట్లు చెప్పఁబడినది—

గీ. అట్టి పెదతిమ్మరాజు ధైర్యాద్రిరాజు
మంగవిభుగుర్వశౌరియనుఁగుఁగూఁతు
నంగనాశిరోమణిఁ బాపసంగమాఖ్యఁ
బ్రేమవరియించె విభవాభిరాముఁ డగుచు.

క. గుణనిధి యగుతత్క-న్యా
మణిజనకుఁ బోధజనకు మంజులభాషా
ఫణివరు రణవిజయార్జునుఁ
బ్రణుతింపఁ దరంబె గురువపార్థివవర్యున్.

సీ. పృథులవిక్రమశాలి పెదసంగనృపతియు సత్యసంధుఁడు చినసంగరాజు
ధర్మగుణాఢ్యుండుతమ్మభూపాలుండురుచిరకీర్తినుండు రుద్రఘనుఁడు
ప్రథనాంగణకిరీటి బసవనరేంద్రుండుస్థిరభాగ్యనిధి పెదచిట్టఘనుఁడు
సింధుగాంభీర్యుండు చినచిట్టవర్యుండు సతతధన్యుఁడు పొట్టిసంగశౌరి
కలితతేజుండు పాపసంగప్రభుండు
ననఁగ బరఁగినతొమ్మండ్రు తనయవరులఁ
గాంచి విజయసంశీలుఁడై మించె నౌర
మంగరాజన్యగురువసప్రమోద్వరుండు.

క. ఆగురువరాజవరునకుఁ। ద్యాగసముద్రునకు నల్లుఁడయి వెలసె ధరా
భాగధురంధరతను నా। భాగుఁడు పెదతిమ్మరాజు ప్రజలు నుతింపన్.
కృతిపతితల్లియు మంగయగురువరాజుకూతురు నైన పాపసంగ
మాంబ పెదసంగభూపాలాదులగు తొమ్మండ్రకును జెల్లె లయియుండ
వచ్చును. అట్లయినచో నీమె సంగభూపాలునికంటె నిరువదియిరువది
యైదేండ్లు చిన్నది కావచ్చును. కృతిపతియైన వేంకటరా జీమెయేడు
గురుపుత్రులలో మూఁడవవాఁడు. కాఁబట్టి యితఁడు తల్లి కించు
మించుగా నిరువదియైదువత్సరములప్రాయమునందు జనించి యుండ
వచ్చును. అందుచే నీవేంకటరాజు తనమేనమామ యగు పెదసంగ

భూపాలునికంటె నేఁబదియేండ్లు చిన్నవాఁడగుట యసంభవము కానేరదు. రెట్టమతమునందు కృతిపతియొక్క విక్రమధురంధరులైన యేడుగురు కొడుకులు వర్ణింపఁబడుటయేకాక కృతిపతియొక్క కొడగొట్టు తమ్మునిపుత్రులుసహిత మేవురు బాహుబలశాలులయి నట్లు వర్ణింపఁబడియున్నారు. అందుచేత నత్తఁడీగ్రంథమును గృతినందినకాలమున కనఁగా ౧౭౬౯ వ సంవత్సరమునాఁటికి మిక్కిలిఁ వృద్ధుఁడయి యుండవలెను. అతని కప్పు డెనుబదిసంవత్సరములవయస్సుండె ననుకొందము. అట్లను కొన్నను పాండురంగమాహాత్మ్యము రచియింపఁబడినకాలము ౧౬౫౦వ సంవత్సరమునకంటెఁ బూర్వమయి యుండదు. అప్పటికి రామకృష్ణుఁడు వృద్ధుఁడనుకొన్ననుఁ, అతఁడు కృష్ణదేవరాయల యాస్థానమునందలి కవుల నాక్షేపించె నన్న కథలన్నియు నసత్యకల్పనములనుట స్పష్టము. అయినను మన మీకవుల కాలమునుగూర్చి యింకను విచారింపవలసి యున్నది.

ఈరామకృష్ణకవి యాజ్ఞవల్క్య బ్రాహ్మణుఁడు; కౌండిన్యస గోత్రుఁడు; తండ్రి రామయ్య; తల్లి లక్ష్మమ్మ. తాను తెనాల్యగ్రహార నివాసి యయినట్టును, ఆశుకవిత్వాదులయందు మేటియైనట్టును, కృతిపతి తన్నుద్దేశించి పలికినట్టుగా కవియే పాండురంగమహాత్మ్యమునం దీక్రింది పద్యములతోఁ జెప్పుకొనియున్నాఁడు—

క. ననురామకృష్ణకవిఁ గవి
జనసహకారావళీవసంతోత్సవసూ
క్తినిధిఁ బిలిపించి యర్థా
ననమునఁ గూర్చుండఁ బనిచి చతురత ననియెన్.

సీ. నలుడెఱుంగులకావ్యనవసుధాధారలఘనుఁడనాశువునందుఁగరము మేటి
వఖిలభూమీపాలకాస్థానకమలాకరోచ్చయతరుణసూర్యోదయుఁడవు

శైవవైష్ణవపురాణావళి నానాస్థరచనాపటిష్ఠైకరవ్యనుతివి
లాకికవైదికలక్షణచాతుర్యధైర్యప్రభావూఢకార్యచణుఁడ
వాంధ్రభూమీకుచాగ్రహారాభ మైన
శ్రీతెనాల్యగ్రహారనిష్ఠైత వగ్ర
శాఖికాకోకిలమ వీవు సరసకవివి
రమ్యగుణకృష్ణ రామయరామకృష్ణ

క. కౌండిన్యసగోత్రుఁడ వా
ఖండలగురునిభుఁడ వఖిలకావ్యరససుధా
మండనకుండలుఁడవు భూ
మండలవినుతుఁడవు లక్ష్మినూవరతనయా.

క. యశముఁ గలిగించు నీమ్యము
విశదోక్తులఁ బౌండరీకవిభుచరితఁ జతు
ర్దశభువనవినుతముగ శుభ
వశగతి నాపేర నుషువు వరత త్త్వనిధీ.

ఉ. స్కందపురాణనీరనిధికౌస్తుభమై ప్రభవించుదేవకీ
నందనుసత్కథోద్యమము నవ్యకవిత్వకళాకలాపమున్
కుందనమున్ ఘటించి కడుఁగ్రొత్తగు సొమ్మొనరించి విష్ణుసే
వం దిలకించునప్పరమవైష్ణవకోటి నలంకరింపుమా.

మ. ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా
విదితంబైనమహిన్మహాంధ్రకవితావిద్యాబలప్రౌఢి నీ
కెదు రేరీ సరసార్థబోధఘటనాహేలాపరిప్కార శా
రద నీరూపము రామకృష్ణకవిచంద్రా సాంద్రకీర్తీశ్వరా!

ఈపద్యములనుబట్టి చూడఁగా కవి కొంతవఱ కాత్మశ్లాఘూప్రియు డని తోఁచక మానదు. ఇతఁ డెంతప్రౌఢకవియైనను స్వోత్కర్షప్రకట

నము నింతగాఁ జేసికొనక నమ్రతనుజూపినచో నధికశ్లాఘాపాత్రుఁడయి
యుండును. ఈతనినివాసస్థలము కృష్ణామండలములోని తెనాలియమ్ర
హారము; ఇతనిపూర్వులు కాపుర ముండినచోటు తెనాలికి రెండుక్రోసుల
దూరములోనున్న గార్లపాడు గ్రామమనియు, ఇతఁడు తననివాసము
నచ్చటనుండి తెనాలిగ్రామమునకు మార్చుకొనెననియు నొకరు వ్రాసి
యున్నారు. ఇతఁడు చిన్నతనములో బట్టుపల్లెయను గ్రామమునం
దుండు బ్రాహ్మణులతో సాంగత్యముచేసి, వారిచెలిమిచేత సంస్కృతాంధ్ర
సాహిత్యమును కవిత్వకౌశలమును సంపాదించి బుద్ధిబలముచేత ప్రబంధ
కవీశ్వరుఁడయి వన్నెకెక్కినఁట. ఇతఁడు రచియించిన పుస్తకము
పాండురంగమహాత్మ్య మను స్థలపురాణము. ఇందుఁ గొన్నివర్ణనలు
విలక్షణముగానుండును. "పాండురంగ విభుని పదగుంభనంబును" అన్న
ట్లితనికవిత్వము పదములకూర్పుచేత మేలిమి గన్నది. అందు నిరర్థక
పదము లెక్కడనోకాని కానఁబడవు.

క. అటు లేనియుఁ జెప్పెద నీ
పొటిపొటితలపోఁత లెల్లఁ బోవ నడువు మా
రట ముడుగు నెమ్మనము నో
క్కటిగా నొనరించి గట్టిగా వినుమధిపా.

ఇత్యాదిపద్యములలోఁ గట్టిగా లోనగుపదము లొకానొకటి
యక్కడక్కడ వ్యర్థములుగాదోఁచినను మొత్తముమీఁదఁ బదసందర్భ
మితనికిఁ గుదిరినట్లు నుతియొకకవికిఁ గుదిరిన దని చెప్ప వలనుపడదు.
ఈపాండురంగమాహాత్మ్యమునకే పాండురంగవిజయమని నామాంతరము
గలదు. ఇదిగాక పాండురంగవిజయమని రామకృష్ణకవివిరచితగ్రంథము
వేఱొకటియున్నదని కొంద ఱందురుగాని యీమాట పాటింపఁ దగినది
కాదు. ఈకవికి తరువాత సల్పకాలములోనే యున్నయప్పకవి లోనుగాఁ
గలలాక్షణికు లొక్కరును పాండురంగవిజయ మున్నదనిచెప్పి దాని

లోనుండి యొక్కపద్యమునైన నుదాహరించియుండలేదు. ఇప్పుడు పాండురంగవిజయములోనివని యందందఁ జదువఁబడెడు పద్యములలో ననేకము లితరగ్రంథములలోనివిగాను కొన్ని యప్రౌఢకవికల్పితములు గాను గానఁబడుచున్నవి. ఎట్లనఁగా,

సీ. భుజగలోకాధీశభోగతల్పశయాన హరిరూపధర మహాపురుషయనుచు
నతులాబ్జమకుటవర్ణితపాదరాజీన రామార్చనీయ శ్రీరంగయనుచు
మారీచమదభంగ మహితవాయవ్యాస్త్రశరదనిద్రితనేత్రశౌరియనుచు
సముదగ్రవర్షావసరయోగనిద్రాణ కరిరాజవరద శ్రీకాంతయనుచుఁ
దలఁకు నులుకును నలుకు బెగ్గిలుచుఁబలుకు
సఖులనయనస్వరశిరోజచరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ
భటనటప్రియసముదాయపటిమదోఁప.

ఈపద్యము పాండురంగవిజయములోనిదని సర్వసాధారణముగాఁ జదువుదురు. నిజము విచారింపఁగా నిది పైడిమట్టి వేంకటపతికృతచంద్రాంగదచరిత్రమునందలి చతుర్థాశ్వాసములోనిది. ఇట్లే

గీ. అరుణపల్లవరుచిఁబోలు నాపదంబు
లాపదంబులఁబోలు సయ్యలకజాత
మలకజాతముఁబోలు నిత్యముఖలీల
నిత్యముఖలీలఁబోలు న న్నెలఁతనడుము.

అను నీపద్యము పాండురంగవిజయములోని దని కొందఱు చెప్పుచున్నను, ఇది సింహాద్రి వేంకటాచార్య విరచితమైనచమత్కారమంజరిలోఁ గనఁబడుచున్నది. ఈప్రకారముగానే పాండురంగవిజయములోనివని చపువఁబడెడు మఱికొన్నిపద్యము లితరప్రబంధములలోనివిగాఁ గనఁబడుచున్నవి. తాను ప్రబంధరూపముగాఁ బాండురంగమహాత్మ్యములోఁ జెప్పినకథనే స్వీకరించి యాకవియే మరలపాండురంగవిజయమని మఱి

యొకప్రబంధము జేయవలసిన యావశ్యకముసహిత ముండదుగాన పాండురంగవిజయమని వేఱొకప్రబంధ మున్న దన్నవార్త కల్లయని నిశ్చయింపవలసి యున్నది. ఇతఁడు నిరోష్ఠ్యరామాయణము మొద లయిన చిత్రకావ్యములను రచియించెనని యొకప్రవాదము కలదుగాని యదియు నిజమయి యుండదు. ఇతఁడు వికటకవి యనియు, అనేకుల ననేకవిధ ముల వంచించె ననియు, పెక్కు కథలు చెప్పుదురుగాని పాండురంగ మాహాత్మ్యము నంతటి భక్త్యావేశముతో రచియించిన వైష్ణవభక్తాగ్రే సరుఁడు పామరజనై కారణీయములై న తుచ్ఛకార్యములకు లోనగునా యని సందేహింపవలసియున్నది. ఈదేశములో పామరజనులు కవులు రసికులని చూపుట కయి వారికి వేశ్యాగమనదోషాదు లారోపించుట చిరకాలమునుండి యాచార మయి యున్నది. ఇతఁడు వికటకవియని చూపుట కయి యితఁడు రచియించిన పుస్తక మొక్కటియు లేదు.

"శప్పనిజయంబు చెప్పెదఁ జిత్తగింపు
మేకదంతుండు నీకిచ్చు నింతబొచ్చు."

ఇత్యాది లగుయతిభ్రంశదోషాదులను గలిగిన పనికిమాలిన బూతుపుస్తకము నొకదాని నెవ్వరో మహాత్ములు "శప్పనిజయ" మనెడి యపాత్రపు పేరిత్తో రచియించి దాని కర్తృత్వమును రామకృష్ణున కారోపించిరిగాని యం దొకపద్యము నైనను జదివినవారి కాపాడుపు స్తకమునందుఁ జూపినయహంభావమునుబట్టి యితఁ . డితరకవులగ్రంథముల నాక్షేపించి పద్యములు చెప్పెనన్నంతవఱకు నమ్మవచ్చును.

ఈరామకృష్ణకవికి మొట్ట మొదట రాజాస్థానమునందుఁ బ్రవేశము కలుగకపోయినను రాజపురుషుల నాశ్రయించి వారివినోద పద్యములు చెప్పి వారిమూలమున కడపట రాజానుగ్రహము సంపాదించుకొనెనట! అల్లయ్య నితఁడు సాధుస్వభావము కలవాఁడు కానందునను, పరుల వంచించుటయందును పరిహసించుటయందును ఆసక్తికలవాఁడయినందు

నను, ఏవో కొంకెపనులు చేయుచువచ్చి పలుమా ఱు రాజుల యాగ్ర హామునకు పాత్రుఁ డగుచు వచ్చెనఁట! ఇందుఁ గొంతసత్య ముండక పోదు. అట్లుకానియెడల నితఁడు తనగ్రంథములను పేరుగలరాజుల కెవ్వ రికి నంకితము చేయక యొకవ్రాయసగాని కంకితము చేయఁట తటస్థించి యుండదు. మహమ్మదీయుల దాడిచేత పేరుగల హిందూరాజ్యములు నశింపఁగా ధనసంపన్నుఁడుగాని రామకృష్ణకవి స్వకుటుంబపోషణార్థ మయి ధనస్వీకారముచేసి తనగ్రంథమును సంగరాజుజాగీరులోని విరూపి కరణమున కంకితము చేసినను చేసియుండవచ్చును. కృతిపతి యయిన వేదాద్రికి వాసస్థానముగా నుండినవిరూరు నెల్లూరుమండలములో పినా కినీనదికి వంతెనగట్టఁదలఁచిన సంగమునకు రెండు క్రోసులదూరమున నున్నది.

రామకృష్ణుఁడు చేసినయపరాధములను దెలిపెడుకథలలో నొకటి రెంటి నిం దుదాహరించుచున్నాను—

ఒకప్పుఁ డితఁడు రాజగురు వయినతాతాచార్యులవిషయమున చెప్పరాని మహాపరాధమును జేసినందున, రాజు దురాగ్రహాగ్రస్తుఁడై యీతనిని తలవఱకు భూమిలో పాతిపెట్టి యేనుఁగుచేత తల క్రొక్కింపుఁ డని రాజభటుల కాజ్ఞయిచ్చెనఁట. రాజభటు లాతనిని గొనిపోయి యీరిబయలను కంఠములోఁతు మంటిలోపాతిపెట్టి, క్రొక్కించుటకొఱ కేనుఁగును దీసికొనివచ్చుటకై వెళ్ళిరఁట. ఈలోపల గూనిచాకలివాఁ డొకఁ డామార్గమునఁ బోవుచు రామకృష్ణుని జూచి యిది యేమని యడుగఁగా, అతఁడు తనకు సంభవించిన గూను పోఁగొట్టుకొనుట కయి వైద్యులయాజ్ఞ చొప్పునఁ దా నీచికిత్సను జేయించుకొనుచున్నా ననియు గూను పోయినదో లేదో పయికితీసి చూడవలసిన దనియు వానితోఁ జెప్పెనఁట. వాఁ డాప్రకారముగాఁ జేసి యీతనికి గూను లేకుండుట కద్భుతబడి తన కాచికిత్స చేయుమని కోరఁగా, రామకృష్ణుఁడు వానిని

పాతిపెట్టి తాను పలాయితుఁ డయ్యెనఁట. అటుతరువాత రాజభటు లేనుఁగును గొనివచ్చి దానిచేత చాకలవానితల క్రొక్కించిరఁట. రాజ భటులు పోయి తాము రామకృష్ణుని జంపినమాట రాజుతో విన్నవించిన తరువాత రామకృష్ణుఁడు రాజసభకుఁ బోయి సభవారందఱు విస్మయ పడునట్లుగా రాజసందర్శనము చేసి తనయం దీశ్వరుఁ డనుగ్రహించి చచ్చినవానిని మరల బ్రతికించి పంపెనని రాజునకు నమ్మకము పుట్టు నట్లుగాఁ జెప్పి నమ్మించి రాజువలన నూఱుతప్పులు క్షమించునట్లు వరము పొందెనఁట.

ఇంకొకసారి రామకృష్ణుఁడు తాతాచార్యులను మోసముచేసి తన్ను మూఁపుమీఁద నెక్కించుకొని రాజమందిరము చేరువనుండి మోసుకొనిపోవున ట్లొడఁబఱిచె ననియు, ఆచార్యులవా రాతనిని మోసుకొని రాజవీథిలోఁ నడచుచుండఁగా రాజు మేడమీఁదనుండి చూచి కోపించి పయివానిని తన్ని యీడ్చుకొనిరండని తనభటులకాజ్ఞ యిచ్చెననియు, రామకృష్ణుఁ డామాటలువిని చివాలున తాను క్రింద కుఱికి గురువర్యులపాదములమీఁదఁ బడి తానుచేసిన భాగవతాపచా రము క్షమింప వేడుకొని పాప పరిహారార్థముగా నాతనిని తనవీఁపు మీఁద నెక్కించుకొని మోచెదనని చెప్పి యొప్పించి తాతాచార్యులను భుజములపయి నెక్కించుకొని నడుచుచుండఁగా రాజభటులువచ్చి పయి నున్నగురునే తన్ని రాజసన్నిధి కీడ్చుకొని పోయిరనియు, అందుమీఁద రాజునకు మతాంత యాగ్రహమునచ్చి గురుద్రోహియైన యాఖలుని వెంటనే శిరశ్ఛేదము చేయుఁడని భటుల కాజ్ఞ యొసఁగె ననియు, రాజ భటుల కతఁడు లంచమిచ్చి తన్నువిడిచిపెట్టి యొకమేనుజంపి దాని నెత్తురు గొనిపోయి రాజునకు జూపునట్లు వారి నొడఁబఱిచెననియు, రాజు కోపముతీఱి బ్రహ్మహత్య చేయించినందునకుఁ బశ్చాత్తాపపడుచున్న కాలములోఁ దాను బ్రహ్మరాక్షసుఁ డయినట్లు వేషమువేసి రాజును

జడిపించి తరువాత నిజమును జెప్పి రాజుచే మన్నింపఁబడి బహుమాన ముల నందెనసియు మఱియొక కథగలదు.

ఇట్లే యితఁ డనేకకవులను విద్వాంసులనుగూడ నాక్షేపించినట్లు పెక్కుకథలుగలవు. అవి యెంతవఱకు సత్యములో చెప్పఁజాలము. అయినను వానిలోఁ గొన్ని సత్యములు కాననియు నటీవలివారిచే గల్పింపఁబడినవనియు మనము సులభముగా నూహింపవచ్చును. తాను రచియించినపాండురంగమాహాత్మ్యకృతికి నాయకుఁడగు వేదాద్రియొక్క గురువైన కందాళ అప్పలాచార్యులువారు సభకు వచ్చినప్పుడు వ్యాకరణశాస్త్రమునందలి యాయనపాండిత్యప్రకర్షమును శ్లాఘించుచు నొకశిష్యుఁడు,

శ్లో. "అపశబ్దభయం నాస్తి । అప్పలాచార్యసన్నిధౌ"

అని చెప్పఁగా రామకృష్ణుఁడు,

"అనాచారభయం నాస్తి । తిష్ఠన్మాత్రస్యసన్నిధౌ"

అని శ్లోకపూర్తిచేసి పరిహసించెనని చెప్పుదురు. దీనిని తెనిఁగించినచో శిష్యుఁడు చేసిన శ్లోకముయొక్క పూర్వార్ధము

గీ. "అప్పలాచార్యసన్నిధియందు (వీస
మంతయిన) నపశబ్దభయంబు లేదు"

అనియు, దానిని పూరించిన రామకృష్ణునియొక్క యుత్తరార్ధము

"నిలిచి మాత్రవిసర్జన సలుపువాని
వద్దఁ (గూడ) ననాచారభయము లేదు"

అనియు నగును. శబ్దశాస్త్ర పాండిత్యమునుబట్టి యెట్టి యప శబ్దము నైన సుశబ్దమునుగా సాధింపఁగల సామర్థ్యముగల తనగురువు వద్ద నెవ్వరును నపశబ్దమునకు భయపడవలసిన యక్కఱలేదని యర్థము వచ్చునట్లు శిష్యుఁడు శ్లాఘించినప్పుడు నిలుచుండి మూత్రము విడుచు

హానివద్ద ననాచారభయ మెట్లకఁ-అ లేదో యట్లే శుంఠయైన యీ యాచార్యునివద్ద నసశబ్దభయ మకఁ-అలేదని విపరీతార్థము వచ్చునట్లు శ్లోకము పూరించి యాక్షేపించి వైష్ణవభక్తాగ్రేసరుఁడైన రామకృష్ణుఁడు భాగవతాపచారము చేయునని నమ్మఁదగియుండలేదు.

"కలనాఁటిధనము లకఁ-అగలనాఁటికి" అను పెద్దనపద్యముపై రామకృష్ణకవి యాక్షేపణ చేసె నన్నకథ కల్పితమని యీవఱకే యల్లసాని పెద్దన చరిత్రమునందుఁ జెప్పియున్నాముగదా? ఆప్రకారముగానే రామకృష్ణకవి ముక్కఁ-తిమ్మనార్యునియెడఁ గూడ నొకయపరాధము చేసెననియు, తిమ్మన యలిగి పంఢ్లూడఁదన్నఁగా మఱునాఁడు రామకృష్ణకవి దుప్పికొమ్ములతో నూడినపల్లమర్చుకొని కృష్ణరాయలసభకు వచ్చి కూరుచుండ రామభూషణకవి యెఱిఁగి రాజు "రవిగానిచోఁ గవి గాంచునేకదా" యన్న సమస్య నిచ్చినప్పుడు

ఉ. ఆరవి వీరభద్రునిపదాహతి డుల్లినబోసినోటికిన్
నేరఁడు, రామకృష్ణకవి నేరిచెఁబో మనముక్కఁ-తిమ్మరాట్
క్రూరపదాహతిం బడినకొక్కిరిపంటికి నుప్పికొమ్ము ప
ల్లా రచియింప; నౌర! రవిగానిచోఁ గవి గాంచునేకదా.

అని పూరించి యతని నవమానపఱిచెననియు; చెప్పెడికథ కూడ రామకృష్ణకవి ముక్కఁ- తిమ్మనకాలములో నుండినవాఁడు కాక పోవుటచేత నిటీవలి బుద్ధిమంతులచేఁ గల్పింపఁబడినదసియే నిశ్చయింపవలసియున్నది. ఇతఁడు రామరాజభూషణునితో సమకాలికుఁడే యయినను, రామరాజభూషణుని వసుచరిత్రములోని "శ్రీ భూపుత్రి" యను పద్యముమీఁద రామకృష్ణుఁడు చేసెనన్న యాక్షేపణము పండితులు చేయఁదగినది కానందున దానిని సహేతము సత్యమని నమ్మఁబడుకాధారము కనఁబడదు. ఇతఁడు రామరాజభూషణుని కవిత్వను నాక్షేపించుచు,

క. చీపగపాపరతీఁగలఁ । జేఁపలబు ట్టలినట్లు చెప్పెడు నీయీ
కాపుకవిత్వపుమూటలు । బాపనకవివరుసిచెవికిఁ బ్రబమదం బిడునే?

అని చెప్పెనఁట. నిజముగా రామకృష్ణకవియే చెప్పిన దయిన యెడల నీర్ష్యచేతనే చెప్పినదనవచ్చును. ఒకానొకకవి రాయలయాస్థానమునకు వచ్చినప్పుడు

క. తువ్వఁట బాబా, తలపై
పువ్వఁట జాబిల్లి, వల్వ బూదఁట, చేఁదే
బువ్వఁట, చూడఁగను హాళి
క్కవ్వఁట, యరయంగ నట్టిహారునకు జేజే.

అను పద్యమునుజెప్పి తాటాకువ్రాఁద వ్రాయుమని యిందలి 'తువ్వ' 'హాళుక్కి' అను పదములను వికారముగాఁ జదివి రామకృష్ణుఁడాకవిని పరాభవించి పంపెనని చెప్పుదురు. ఈకథ కేవలపామరజనైకాదరణీయము. అప్పకవీయమునం దుదాహరింపఁబడిన రామకృష్ణకవియొక్క చాటుపద్యముల రెంటిలోను,

క. బసవనకుఁ బుట్టినప్పుడె
పసరము గోవిందరాజు పసరం బైనన్
గస వేటికిఁ దినఁ డనఁగాఁ
గసవుం దిను శత్రు లాజి- గదిసినవేళన్.

అను పద్యమువలన నతఁడు పరులను దూషించుస్వభావము కలవాఁడయినట్లు కనఁబడుచున్నను,

క. చిన్నన్న ద్విపద కెరఁగును
బన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెరఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్యశ్రేణిన్.

అను పద్యమువలన నతఁ డితరులకవిత్వమందలి గుణములను గ్రహించి శ్లాఘించు గుణగ్రహణపారీణుఁ డనియు స్పష్టపడుచున్నది.

తెనాలి రామకృష్ణుని యిందుధరోపాఖ్యానములోనిదని,

మ. ఒకనాఁ డిందుధరుండుఁ బార్వతియు లీలోద్యానకేళీసరి
న్నికటానేక వనప్రదేశముల నై తేయేంద్రకన్యాప్సరో
నికరుంబంబులు పారిజాతకుసుమానీకంబు నైఁ జల్ల ద
ర్పకబాణంబుల కెల్ల నెల్లయుఁగునౌ భాగ్యంబు శోభిల్లఁగన్.

అనెడి యీపద్యము రంగరాట్చందమునం దుదాహరింపఁబడి యున్నది. అప్పకవి యీపద్యమునే యాదిపురాణములోనిదని యుదాహరించి యున్నాఁడు. ఆదిపురాణమును, ఇందుధరోపాఖ్యానమును వేఱు వేఱు గ్రంథములో, ఒక్క గ్రంథమునకె రెండును వేఱువేఱు పేరులో, మా కాగ్రంథములు లభింపకపోవుటచేత మే మిప్పుడు చెప్పఁజాలము. ఈపద్యము సోముని హరివంశములోనున్నది. కాఁబట్టి యిది పై రెండు గ్రంథములలోను దేనిలోనిదియుఁ గానట్లు తోఁచుచున్నది. ఈకవి యొక్క పాండురంగమాహాత్మ్యములోని కొన్నిపద్యముల నుదాహరించి యీతని చరిత్రము నింకటితో ముగించుచున్నాము :—

మ. బొమలెక్కించిన విల్లువంచు ననుఁజూపు ల్చంచలాచంచల
క్రమరేఖ న్నిగిడింప శాతవిశిఖౌఘంబుల్ మెయిన్నించు నె
య్యమునక్ బలుఁగ నల్కమోఁతి చటులజ్యాఘోషముంజేయు న
య్యమవ్రా పొంది రతీశ్వరుండు హరు బిట్టోడింప నుట్టాడుచున్.ఆ-౧

చ. హరిహయదేశికాభుఁ డగునమ్మహిదై వతవాళియందు బం
గరువునకున్ మృగీమదసుగంధము సంధిలుభాతి నంబుజో
దరచరణారవిందనతతస్మృతిలోలుప మైనబుద్ధియున్
బరిణతి గాంచెసంపదలపై మతియుం జనియించు సంపదల్. ఆ-౫

శా. ప్రారంభించినవేదపాఠమునకుం బ్రత్యూహమానంచునో
యేరా తమ్ముఁడ నన్నుఁ జూడఁ జనుదే వెన్నాళ్ళనోయుండి చ
ల్లూరాజీవయుగంబు వాచె నినుఁ గన్గోకున్క మీబావయున్
నీరాక న్మదిఁ గోరుఁ జంద్రుపొడమున్ నీరాకరంబుంబలెన్. ఆ-3

మ. వలనా యేటికి నాశ్రయించి మనఁగా నాసీరమున్ నీరమున్
దలవెట్టే పచరింపనేటికి సమిద్ధానంబు దానంబున
చ్చలమా యేటికి నెత్తిఁ గట్టుకొనఁగా సన్యాసము న్న్యాసమున్
గలిఁ దేఁజాలు మదీయభక్తిరుచి భక్తశ్రేణి కశ్రాంతమున్. ఆ-ర

సీ. నిలువున నొలిపించె విలువంగడము నెల్లశరములయాయంబుఁ
బొరయు టుడిపెఁ
దగశబ్దమాత్రపాత్రముచేసె గుణలత్రమాఁకునఁ గట్టించెమాలబలముఁ
గంచుకివశము గావించెసేనానాథుఁ గట్టించె సహాచరుఁ గటికియెండఁ
బ్రతిపక్షభావసంగతుఁడనిహేతుఁజూచె వరకేతసమున్ స్థిరముమలిపె
ధర్మనిర్మలబుద్ధి సుశర్మఁ గదిసి
గెలువఁగా లేక చని కోపగించి మదనుఁ
డురక తనవార లతనికి నోడు మనిరె?
పతికిఁ గీడాట బంట్లపాపంబు గాదె?

185

30. తిమ్మరాజు

ఈకవి రాజవంశజుఁడు; ప్రబలరాజు కొడుకు; అనంతరాజు మనుమఁడు. మంగళగిరి శ్రీనృసింహస్వామి కంకితము చేసి పరమయోగి విలాస మనెడి యైదాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఈపద్యకావ్యము నితఁడు వెంగళనాథుఁడుచేసిన ద్విపదకావ్యమును జూచియైనను జేసియుండవచ్చును; లేదా స్వతంత్రముగా నైనను జేసియుండవచ్చును. ఇరువురుకవులును నించుమించుగా సనుకాలీను లయినందున, ఎవ్వరే గ్రంథమును ముందుగాఁ జేసిరో నిర్ధారణము చేయుటకు శక్యము కాదు.

శా. శ్రీరంజిల్లఁగఁ బానకం బనిశమున్ సేవింపఁగాఁ దద్గుణం
బారూఢిం బొలుపొందెనో యనఁగ యోగానందమాధుర్యల
క్ష్మీరమ్యాకృతి నొప్పుమంగళగిరి శ్రీమన్నృసింహుండు స
త్కారుణ్యామృతవృష్టిచేఁ దనుపు నిత్యంబుం బ్రపన్నావళిన్.

ఇది పరమయోగివిలాసములోని ప్రథమపద్యము. ఈకవిత్వము సర్వవిధములచేతను ద్విపదకావ్యమునకంటె శ్రేష్ఠతరముగా నున్నది. ఈకవి కృష్ణదేవరాయనియల్లుఁడై నయళియరామరాజునకు దోడఁబుట్టిన పడుచైనకోనమాంబకు మనుమఁడుఁడై నందున, వసుచరిత్రము కృతినందిన తిరుమలదేవరాయనికిని మేనల్లుఁడే. ఆకాలమునం దితఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమకు పరిపాలకుఁడుగా నుండెను. కవి తాను రామరాజులకు మేనల్లుఁడయినట్లును, కొండవీటికి ప్రభువయినట్లును, పరమయోగివిలాసములోని యీక్రిందిపద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. ఏరాజుమత్తాత భూరిసామ్రాజ్యలక్ష్మీధురీణభుజుండు సిద్ధనృపతి
యేనరాధిపుతాత నానార్థిసంతానసంతానశాఖి యనంతశౌరి

యేగుణాఢ్యునితండ్రిభోగవైభవనూత్నసుత్రాముఁడోబలక్ష్మోణిభర్త
యేవిభుం డళ్కెరామభూవిభు తిరుమలప్రభువేంకటేంద్రుల భాగినేయుఁ
డట్టితిమ్మభూవరుఁ డాజిహతతురుష్క
రక్తశోణనదీక్వతప్రబలసలిల
వితతకృష్ణానదీకుఁ డూర్జితుఁడు కోన
మాంబసుతుఁడు శ్రీరంగరాజానుజుండు.

మ. సకలశ్రీయుతకొండవీటినగరీసామ్రాజ్యధౌరేయతా
ధికతక్ మీఱుచు నొక్కనాఁ డచలభక్తిస్ఫూర్తి శ్రీవైష్ణవ
ప్రకరంబు న్భజియింపుచున్ హరికథాప్రస్తావనన్ దివ్యయో
గికథల్ వించుఁ దదర్థకావ్యరచనాకేళీసమాసక్తుఁడై.

ఉ. ఉన్నతి మీఱఁగాఁ బరమయోగివిలాసము పేరికావ్య ము
ద్యన్నవభావబంధురరసాన్వయసన్నుతశబ్దశుద్ధిసం
పన్నత నిట్లు సిద్ధనరపాలునియోబళతిమ్మభూవరుం
డెన్నికఁ జేయఁ బూని మది నెంతయు సంతస మొందు ధన్యతన్.

పయిపద్యములనుబట్టి యీకవి కావ్యాలంకారసంగ్రహాదులకృతి భర్తలగునరసభూపాలాదులతోను, కృతికర్తలగు రామరాజభూషణాదులతోను, సమకాలికుఁ డగుట స్పష్ట మగుచున్నది. కాఁబట్టి యీ తిమ్మరాజు గ్ఱ2౦వ సంవత్సరము మొదలుకొల గ్ఱ౯౦వ సంవత్సర ప్రాంతములవఱకును ప్రసిద్ధుఁ డయియుండవచ్చును. ఈకవి కవిత్వముసం దసమాన మయినప్రజ్ఞాగలవాఁడు; ఇతఁడు రచియించిన పరమయోగి విలాసమును నద్భుతములైన చరిత్రములను కలిగియున్నది. పరమ యోగివిలాసములోని యీక్రిందిపద్యములవలన కవిత్వప్రౌఢిమ కొంత తేటపడవచ్చును—

ఉ. రెండవమాటానిపుంగవుఁడుఁ బ్రేమసమాహ్వయు మైనప్రమ్మదక
నిండఁగఁ భక్తియన్ చమురు నించి హృదబ్జము వత్తిగాఁగ ను

ద్ధండతరప్రబోధసముదంచితదీపము సర్వలోకనా
థుఁ డగుచక్రికిం బ్రియముత్తోత సమర్పణ చేసె నయ్యెడన్. అ. ౧.

ఉ. ఇంతులఁగూడి చిట్టకము లీ ట్లొనరింపఁగ నించు కేసియున్
వింత తెఱంగు లేక ధరణీధరముంబలె నున్నయాదృష
స్వాంతునిఁ జూచి తాపతిమచక్కిలిగింతలువోలెఁ గంటిచే
యెంతయు రిత్తవోయె మనయిందతిచేష్టలు నంచు నవ్వుచున్. ఆ. ౨

ఉ. దేవుఁడొ మానియో యని మదిం దలఁపోఁతలు నాకె కాని నిన్
వేవురు వేయిచందముల నిందయొనర్చెద రిప్డు మూగయున్
సావులనోరు నీయెడమసాదతలంబునఁ దన్నినట్లుగా
నీవొక యింతయూవ్వురని యేడ్వఁగదన్న కుమారరత్నమా. ఆ. ౩.

---

31. తాళ్ళపాక తిరువెంగళనాథుఁడు

ఇతఁడు నందవరీకబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భర
ద్వాజగోత్రుఁడు. ఈకవి పరమయోగివిలాస మనుపేర నాళ్వారుల
చరిత్రమును ద్విపదకావ్యముగా నెనిమిదాశ్వాసములగ్రంథమును రచిం
చెను. ఈగ్రంథరచననుబట్టియే యితఁడు విష్ణుభక్తుఁడని స్పష్టమగు
చున్నది. ఇతఁడు తాళ్లపాక యన్నయార్యుని మనుమఁడును, తిరుమ
లార్యునిపుత్రుఁడును అయినట్లు గ్రంథారంభమునందలి యీక్రిందివాక్య
ములవలనఁ దెలియవచ్చుచున్నది—

ద్వి. హరిసేవ కాశ్వలాయనసూత్ర నంద
వరవంసభవ భరద్వాజగోత్ర
పావనశ్రీతాళ్ళ పాకాన్నయార్య

ధీవిశారదసూను తిరుమలాచార్య
వినుతనందనుఁ దిరువేంగళనాథు.

ఈకవిత్రాత యైనయన్నయార్యుఁడు కృష్ణదేవరాయనికాలములో నుండి కొన్నియగ్రహారముల నందెను. కవి తనకు వేంకటాద్రిరాయలు కుండలములు వేసినట్లు తనగ్రంథములోని యెనిమిదవయాశ్వాసాంతము నం దీవాక్యములచేఁ జెప్పుకొన్నాఁడు—

ద్వి. అతిలోకమతికి శేషాచలరాజ
పతికిఁ బరాముఖ్య భక్తసంతతికి
నంకితంబుగను శ్రీహరిభక్తనికర
పంకజార్యమ తాళ్ళపాకాన్నయార్య
తనయ తిమ్మార్య నందన రత్నశుంభ
దనపమ శ్రీవేంకటాద్రీశ దత్త
మకరకుండలయుగ్మ మండితకర్ణ—

ఈకవికి మకరకుండలములువేసిన వేంకటాద్రివసుచరిత్రము కృతి నందిన తిరుమలదేవరాయని తమ్ముఁడని తోఁచుచున్నది. అట్లై యైన పక్షమున కవి గగిరం వ సంవత్సరప్రాంతములయం దుండెను. అట్లు గాక యతఁడు తిరుమలదేవరాయని కొడుకైన వేంకటాద్రి యైనపక్ష మున, అతఁడు గగిరగవ సంవత్సరము మొదలుకొని గఒంగర వ సంవ త్సరమువఅకు రాజ్యముచేసినందున కవియు నాకాలమువాఁడే యయి యుండవలెను. కవియొక్క కవిత్వరీతి తెలియుటకయి ద్వితీయాశ్వా సమునుండి కొంచెముభాగ ముదాహరించుచున్నాను—

ద్వి. భానుకోటిస్ఫూర్తిఁ బ్రభసించుచున్న
మౌనినందనుఁ గాంచి మది సంతసించి
పిల్లిగా దోరి జాబిల్లి గాఁబోలుఁ
జల్లనివెన్నెలఁ జల్లుచున్నాఁడు;

అనుచు నబ్బాలు తెప్పార్పఁ కెంతయును
గనుఁగొని వేడుకకడలి నోలాడి
యానందబాష్పంబు లాననాబ్జంబు
మైనుండి దిగువార మై గరుసారఁ
బెన్నిధిఁ గన్నట్టిపేదచందమున
నున్నతోన్నతుఁ డైనయోగినందనునిఁ
దనయులుఁ లేని యాదరమున నెత్తి
కొని కూర్మితోడ నక్కునఁ జేర్చి వేడ్కఁ
గొనకొని యావేత్రకుంజంబు వెడలి
తనవార లెల్ల నెంతయుఁ జోద్యపడఁగ
మునిపుత్రుఁగొని పురంబున కేగుదెంచి
తనయాలిచేతి కెంతయుఁ బ్రేమ నొసఁగె.

---

32. రాయసము వేంకటపతి

ఇతఁ డాఱువేల నియోగి; అక్కమామాత్యుని కుమారుఁడు. ఈకవి తన వంశమువారిని వర్ణించుచు తమది వసిష్ఠగోత్ర మయినట్లీ క్రిందిపద్యమునందుఁజెప్పెను—

శా. శ్రీల స్థించి సమస్తధీకలనచేఁ జెన్నొందు నార్వేలవం
శాలంకారకరుల్ వసిష్ఠమునిగోత్రాంకుల్ బుధు ల్దీనర
క్షాలీలం బొగ డొంది రందు వెలసెఁ సన్మాసి భానప్ప ది
గ్జాలోద్వేలవిశాలకీర్తుల సుధీసందోహమందార మై.

ఇతఁడు లక్ష్మీవిలాసమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. "రసిజనహృదయంగము సంగీతసాహిత్యకళాధారంధర్య" అని గద్యములోఁ జెప్పుకొన్నదానినిబట్టి యీకవి సాహిత్యమునందు మాత్రమేకాక సంగీతమునందును సమర్థుఁ డైనట్లు కనఁబడుచున్నాఁడు.

ఇతఁడు శ్రీరంగరాయని యాస్థానమునందుండి యాతనినలన సగ్రహార రత్నాభరణాదులను బొందినట్లు లక్ష్మీవిలాసము లోని యీక్రిందిపద్య ములవలన విదితమగుచున్నది—

మ. అలఘుప్రాభవభవ్యఁ డాకుతపశాహామేయసైన్యంబు న
గల్గిక న్నాభహులచేత గెల్చి బిరుదుల్ గైకొన్న శ్రీరంగరా
యలచిత్తం బిగురింప రాయసము వ్రాయం జాలి తౌనౌ సుధీ
తిలకా యక్కయమంత్రి వేంకటపతీ దీవ్యత్కళావాక్పతీ.

ఉ. వ్రాయుచు రాజ్యవై భవధురంధరభూతి దలిర్పఁ గీర్తిఁ గాం
చేయసిరంగరాయమహీభృన్మణిరాయస మగ్రహారమ్మొ
మాయతకత్న భూషలు నృపాధ్యులు వర్తనలీయ్య నుబ్బుచుఁ
వేయన నేమి రాయసము వేంకటమంత్రియనన్ యశస్వివై.

ఈశ్రీరంగరాయలు వసుచరిత్రను కృతినందిన తిరుమలదేవరాయని కుమారుఁడు. ఇతఁడు గగిరెరవ సంవత్సరము మొదలుకొని గఱగవ సంవత్సరము వఱకును రాజ్యముచేసినందున, కవియు నాకాలమునందే యుండినవాఁడు. లక్ష్మీవిలాసము సలక్షణమై మృదుమధురరచనను గలిగి యున్నది. కవితాశైలిఁ జూపుట కయి గ్రంథమునుండి రెండు పద్యముల నుదాహరించుచున్నాను—

చ. తనదువిలాసహాసములఁ దాలిమి దూలఁగ రాగసాగరం
బునఁ బలుమాఱు మారుడెస మున్గుచుఁ దేలుచు నిచ్చ మెచ్చఁగా
మునుకొని వారిత్రో భువనమోహిని యీకుహనావియచ్చరాం
గన పలికెం బికస్వరవికస్వరసుస్వరభాస్వరంబుగన్. ఆ. ౨.

మ. హరికిం బట్టపురాణి వీవ యని కళ్యాణైకవాక్యస్తుతుల్
పరఁగం బుణ్యనదీనదోదకములం బట్టాభిషేకంబు చే
సిరినా నుజ్జ్వలహేమకుంభములచేఁ జేత న్సుగంధాంబువుల్
హరిమధ్యస్థలగ నించి నించి జలకం బాడించి రబ్జాలయన్. ఆ. ౫.

33. తరిగొప్పుల మల్లన

ఈకవి చంద్రభానుచరిత్రమనెడి మైదాఖ్యానముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; దత్త్రాత్రేయయోగీంద్రుని శిష్యుఁడు; దత్తనామాత్యుని తమ్ముఁడు. ఈతఁడు లాక్షణికకవి; కవిత్వము రసవంతముగా నుండును. ఈకవి వసుచరిత్రమును కృతినందిన తిరుమలదేవరాయని పుత్రుఁడగు వేంకటపతిరాయల కాలములో నుండినట్లు; చంద్రభానుచరిత్రములోని యీక్రిందియెత్తుగీతములో జెప్పినాఁడు—

సీ. ... ...

అనుచు బుధులెన్నవలయు రాజాధిరాజ
రాజపరమేశ సకలకర్ణాటకాంధ్ర
రాజ్యధౌరేయ తిరుమలరాజతనయ
చంద్రగుఁ డగువేంకటపతిక్షితీంద్రమణికి.

ఈవేంకటపతిరాయలు గుఱ్ఱపు సంవత్సరము మొదలుకొని గజగర పవఱకును రాజ్యముచేసినవాఁడయినందున, కవియు నాకాలమునం దుండినవాఁడే. తాళికోట యుద్ధమయినతరువాత తండ్రియైన తిరుమలదేవరాయఁడు తనరాజధానిని విజయనగరమునుండి పెనుగొండకు మార్చుకొన్నట్లే కొమారుఁడైన యీవేంకటపతిరాయఁడును తనరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చుకొనెను. ఈకవి కవితారచనను సూచించెడుపద్యములను రెంటిమూటి నిందుఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. అంత దిగంతదంతురలతాంతనిభాంతనితాంతకాంతవ
న్యంతికతాంతపాంధజనతాంతరసంతతకృంతనప్రధా

త్యంతసమంతవిస్ఫురదుదంత పరంతపకాంతిసంతతి
క్రాంతదురంతకుంతరతికాంతము పొల్చె వసంత మెంతయున్. ఆ. 3.
ఉ. తత్తఱపాటుతోడఁ గనుఁదమ్ములడాలు దిగంతరంబులన్
జిత్తరు నింప లేఁబయిఁటచేల కుచంబులపొంత జూఱి నా
బిత్తరి ప్రేమానుపాటొదవఁ బిమ్మటితో నొకకొంతఁ గొంకి లోఁ
జిత్తము మట్టుపెట్టుకొని చేరి సహోదరుదండ నిల్వఁగన్. ఆ. ర.
ఉ. ధరణితలేంద్రనందనవిధంబునఁ గనుంగొనఁ గోరి మున్ను కి
న్నరవరుఁ డిచ్చినట్టి భువనస్తుతమైనయదృశ్యవిద్య న
య్యిరువురు గుప్తమూర్తులయి యింపుసహోదరమందిరంబునన్
దరలకయుండి రట్టియెడఁ దన్వియుఁ జేరఁగ వచ్చి యచ్చటన్. ఆ. ౫.

---

34. చరిగొండ ధర్మన్న

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కౌండిన్య గోత్రుఁడు; తిమ్మయపుత్రుఁడు. ఇతఁడు చిత్రభారత మనెడియెనిమి దాశ్వాసములగ్రంథమును జేసి దాని నిమ్మలపల్లి పెద్దనామాత్యున కంకి తముచేసెను. చిత్రభారతమునందు కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పు కొన్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రదుగ్ధసముద్రచంద్రు నాపస్తంబసూత్రశోభనగరిష్ఠు
సర్వవిద్యాభిజ్ఞుఁ జరికొండతిమ్మనామాత్యాగ్రణికిమాదమకునుగూర్మి
నందను నతిశాంతు నారాయణధ్యానతత్త్వజ్ఞు శ్రీరంగధామసదృశ
భట్టపరాశరప్రభురంగగురుపాదసీరేజబంభరు నిర్మలాత్మ

ధర్మనాహ్వాయు సత్కవితాధురీణు
డాంతు శతలేఖనీసురత్రాణబిరుద
కలితు ననువేడ్కఁ బిలిపించి కరుణమీఱఁ
దేనియలుగుల్క నిట్లని యానతిచ్చె.

మ. శతలేఖన్యవధానపద్యరచనాసంధానసుత్రాణచి
హ్నితనామా చరికొండధర్మనుకవీ నీవాగ్విలాసంబు లా
శితికంఠోజ్జ్వలజూటకోటరకుటీశీతాంశు రేఖాసుధా
స్రవితగంగాకనకాబ్జనిర్భరరసావిర్భూతమాధుర్యముల్.

గీ. కావున విచిత్రగతి నలంకారసరణి
మీఱు రసములు చిప్పిల మెప్పు లొసఁగఁ
దెనుఁగు గావింపు నాపేర ననఘసుకవి
ధీరు లరుదందఁగాఁ జిత్రభారతంబు.

పై పద్యములనుబట్టి వైష్ణవభక్తుడనియు, శతలేఖనీసురత్రాణబిరుదము గలవాఁడై శతలేఖన్యవధానపద్యరచనయందు సమర్థుఁడనియు, తెలియువచ్చుచున్నది. కృతిపతియైన పెద్దనమంత్రి మాదనకుమారుఁడు; నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు. అతఁడు మానభూనాథుని మంత్రియైన ట్లీక్రిందిపద్యములలోఁ జెప్పబడియున్నది—

సీ. అనువత్సరంబుబ్రాహ్మణులకు గోసహస్రము లిచ్చు నృగనకేశ్వరునిరీతి
కంఠులనెనయుపాకాలచెర్వాదిగాఁదగుఁ చెఱువులు నిల్పు సగరుకరణి
దివ్యత్పితాపుఁడై దిగ్విజయంబు గావించు మాంధాతృభూవిభునిలీల
దేవభూదేవతార్థిశ్రేణి కగ్రహారము లిచ్చుభార్గవరాముపగిది
నిందుశేఖరపాదారవిందయుగళ
భావనాపరుఁ డంగనాపంచబాణుఁ
డతులధైర్యాభిభూతహిమాచలుండు
మానభూనాథ చిత్తాబ్జభానుఁ డతఁడు.

శా. ఆరాజేంద్రశిఖావతంసనిజబాహాయు క్తవిశ్వంభరా
ధారేయుండు విరోధినుంత్రిముఖముద్రాదక్షుఁ డుద్యద్దయా
పారీణుండు షటీరతారకసుధాపాణింధమ్మశీయశో
హారుం డిన్మలపల్లి మాదవిభు పెద్దామాత్యుఁ డుల్లాసియై.

ఈమానభూనాథుఁ డెవ్వరో గ్రంథమువలన స్పష్టపడదుగాని యెనిమిదవయాశ్వాసాదియందలి యీక్రింది కృతిపతిసంబోధనపద్యము వలన నతఁడు శ్రీరంగరాయని రాజ్యకాలములోని యొక మండలేశ్వరుఁడని యూహింపఁదగియున్నది—

క. శ్రీరంగరాజసేవా । పారంగతహృదయ! కమలభవ వంశపయఃపారావార సుధాకర ! మారసమానావతార ! మాదయపెద్దా!

మొదటి శ్రీరంగరాజు విజయనగరసంస్థానమును గీ.శ.1572 సంవత్సరము మొదలుకొని గీ.శ.1586 సంవత్సరము వఱకును పాలించెను. రెండవ శ్రీరంగరాజు గీ.శ.1587 సంవత్సరమునకు తరువాత రాజ్యము నకు వచ్చెను. ఈకవి యీ యిరువురు రాజులలో నొకరికాలమునం దుండినందున, పదునాఱవశతాబ్దముయొక్క యంతమునందో పదునేడవ శతాబ్దముయొక్క యాదియందో యుండియుండుటకు సందేహములేదు. ఇదిగాక కవియొక్క కాలమును నిర్ణయించుటకు గ్రంథమునందే యిం కొక యాధారము కనఁబడుచున్నది. కృతినాయకునివంశమును వర్ణించుచు కందాళ అప్పలాచార్యులు కృతిపతియొక్క తండ్రికిని పెదతండ్రికిని గురువైన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు—

శా. వందారువ్రజదోషమేఘపవనుఁ వారాశిగంభీరు నా
నందాత్మున్ హరిపాదభక్తు నిఖలామ్నాయజ్ఞు విశ్వంభరా
మందారక్షితిజాతమున్ నిగమసన్మార్గప్రతిష్ఠాపరుఁ
గందాళప్పగురున్ వివేకనిధి లోకఖ్యాతు వర్ణించుచున్.

క. ఆదేశికపదకమలము
లాదరమున హృదయవీథి ననవరతంబున్
మోదమున నిలిపి శ్రీలల
నాధవునిఁ గొలుతురు నారనయు మాదనయున్.

ఈపద్యములనుబట్టి యీచిత్రభారతకృతిపతియు పాండురంగ మాహాత్మ్య కృతిపతి కాలములోనివాఁడయిన ట్లేకగురుశిష్యత్వము వలనఁ దేలపడుచున్నందున, ఈధర్మకవి యించుమించుగా తెనాలిరామ కృష్ణునికాలపువాఁడే. కందాళ అప్పలాచార్యులుగారు చిత్రభారత కృతిపతితండ్రికి గురువై నందున, ధర్మకవి రామకృష్ణకవికిఁ గొన్నసంవత్స రములుతరువాత నుండిన నుండవచ్చును. చిత్రభారతకవిత్వ మనర్గళ మయిన ధారకలదయి సలక్షణముగా నున్నది. ఈకవియొక్క చరిత్ర మునుగూర్చి యిప్పుడు చెప్పినదానికంటె నధిక మేమియుఁ దెలియ రానందున, చిత్రభారతమునుండి కొన్నిపద్యముల నుదాహరించుటతోనే తృప్తినొందవలసి యున్నది.

చ. అనిమిషనాథుఁ డమ్మునితపోనలకీలల నబ్ధి యింకినఁ
దనకు విపక్షుఁడై యచట దాఁగిన మాహిమవన్నగాత్మజుఁ
గినిసి విపక్షుఁ జేయ గమకించి ప్రచేతనునింట నిర్గమం
బనిచెడువిల్లనంగ నపరాశ సురేశ్వరచాప మొప్పెమ్ఁ. ఆ. 3.

సీ. ప్రవహించుశృంగారరసపూర మమ్మునిమేనికి జలకంబుగా నొనర్చి
తళతళ తారకాంతిచేఁ దనరెడుదరహాసచంద్రికావితతి వస్త్రముగ నొసఁగి
మువ్వంపుదేనియల్ చివ్వున నిడువాక్యములు ప్రసూనములుగాఁ
బూజచేసి
చొక్కంపునిడువాలుఁజూపు మొఱుంగులుపాసఁగనీరాజనంబులుగఁజేసి
యమృతరసములు చిప్పిలునధరబింబ
మదన నై వేద్యముగను నియ్యఁగఁ దలంచి

యడుగుఁదమ్ముల కెరఁగి నెయ్యంబుతోడ
రంభ యిట్లను సంభ్రమారంభ యగుచు—ఆ. 3.

ఉ. హారము భారమై మణిగణాకరబంధురసౌధరంగసం
చారము దూరమై తనువుసంగతి నొప్పెడుచందనాదిశృం
గారము క్రూరమై చెలియకై వడి నెమ్మియొనర్చినట్టిరా
కీరము వైరమై నిగిడెఁ గేసరిమధ్యకు నొక్కపెట్టునన్. ఆ. ౫.

శా. ఏమేమీ హరి శూరుఁడంటి నిజమానే యాజరాసంధుఁ డు
ద్దామప్రక్రియఁ జుట్టుకొన్నఁ బురమున్ దర్పంబు డించెఁ సమి
త్సీమం దా యవనుండు క్రోల గుహఁ జొచ్చెం జూడఁగా నిన్నఁగా
దా ముంజేతులకంకణంబులకు నద్దం బేల యక్రూరకా. ఆ. ౬.

మ. హరిత్రో ణీధరణీవరాగ్రణికిసై యాయోధనక్రీడకున్
బురికొంటి న్వాడి నేఁడు మేనులు తృణంబుల్గా విచారించి వీ
రరసోద్రిక్తమనస్కులై మెఱయవార ల్నిల్వుఁ డాత్మన్ శరీ
రరతిం జెందినభూవరుల్ చనుఁడు పుత్రభ్రాతృసంయుక్తులై. ఆ. ౭.

---

35. సారంగు తమ్మయ్య

ఈప్రాంతములయందు సారంగువారు సాధారణముగా మాధ్వులుగా నున్నారు. ఈకవి తనవంశమును వర్ణించుచు,

ఉ. తమ్మనయంబుఁ బ్రోచుటకు ధారుణిబంధులు బంధుపారిజా
తమ్మన రామభక్తిఁ గలతార్కికు లెల్లను వీనిదార చి
త్తమ్మన జూపులం దనిసి ధార్మికు లీతని దెంతమంచివ్
తమ్మన నాగిరిప్రభునితమ్మన మించె నుదంచితస్థితిన్.

గీ. తమ్మమంత్రి గాంచెఁ దిమ్మాయియందు నం
దనుల శౌర్యసింహు నారసింహుఁ
జతురబుద్ధిచంద్రు సత్కళాగుణచంద్రు
గిరిచమూవరేంద్రుఁ గీర్తిసాంద్రు.

తనతాతను రామభక్తునిగాఁ జెప్పుటచేతను, ఆతనిభార్యను తిమ్మాయియని చెప్పుటచేతను కూడ నితఁడు మాధ్వవంశజుఁ డేమో యని యూహింపఁ దగియున్నను,

క. సారమతి యాన్నసింహుఁడు
వారాశిగభీరుఁ డతులవై భవమున గౌ
రీరమణి నీశుఁడుంబలె
నారూఢాన్వయ వరించె నకలంకసాధ్విన్.

అని తనతల్లిదండ్రులను పార్వతీపరమేశ్వరులత్రోఁ బోల్చుట చేతను తనపూర్వుల కమాత్యాదిపదములను జేర్చుచు వచ్చుటచేతను కవి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁ డాపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; నరసింహామంత్రిపుత్రుఁడు; సారంగు తమ్మయామాత్యపౌత్రుఁడు. ఈకవి వైజయంతీవిలాస మనునాలుగాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇందు విప్రనారాయణుఁడనెడి యాళ్వారుచరిత్రము వర్ణింపఁబడినందున, దీనికి విప్రనారాయణచరిత్రమనియు నామాంతరము గలదు. ఈవిప్రనారాయణునికే తొండరడిప్పొడియాళ్వా రని యఱువపేరు. ఈపుస్తకమునందలి కవిత్వము మనోహరముగానే యుండునుగాని యందందు కవిత్రయమువారి ప్రయోగములకు విరుద్ధములయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. కథయు మిక్కిలి యింపుగా నుండును. విప్రనారాయణుఁడను వైష్ణవబ్రహ్మచారి కావేరీతీరమునందు శ్రీరంగక్షేత్రమునందు వసించుచు మాధుకర

వృత్తిచే జీవించుచు భక్తితో శ్రీరంగనాయకునకు తులసిమాలల నర్పించుచు కాలము గడపుచుండెను.

శా. స్వాధ్యాయంబుఁ బరించు సాంగకముగా సంధ్యాద్యనుష్ఠానముల్.
విధ్యుక్తక్రియ నాచరించుఁ దతితో వ్రేల్చుం బ్రపూతాత్ముఁడై
మధ్యేరంగశయానమూర్తి కిడు సమ్యద్భక్తిఁ దోమాలికల్
మధ్యాహ్నంబునఁ గుట్టి బిక్షుఁ దనుపు న్మాధూకరప్రక్రియన్.

ఇట్లుండఁగా మధురవాణియు, దేవదేవియు ననువేశ్య లక్కచెలియం ద్రిద్ద జాతనిని దేవాలయములోఁ జూచి యాతనిష్ఠ కద్భుతపడి భక్తితో మ్రొక్కఁగా నతఁడు వారిమ్రొక్కు గైకొనకపోయెను. అప్పుడు దేవదేవి యలిగి యప్పతో,

ఉ. మ్రొక్కిన నెవ్వ రే మనఁడు; మో మటువెట్టుక చక్కఁబోయె; నీ
దిక్కును జూడఁడాయెఁ; నొకదీవనమాటయు నాడఁడాయె; వీఁ
డెక్కడి వైష్ణవుండు? మన మేటికి మ్రొక్కితిమమ్మ? యక్కటా!
నెక్కొని వెట్టిబుద్ధి యయి నిద్దురవోయినవానికాళ్ళకున్.

అని యతని నిరాకరించి పలికెను. మధురవాణి చెల్లాలి నూరార్చుచు,

ఉ. చూచిన నేమి? నీనలను చూడకయుండిన నేమి? పూజ్యులం
జూచిన భక్తి మ్రొక్కటయె శోభన; మీతఁడు బ్రాహ్మణుండు; ధా
త్రీచరులందు బ్రాహ్మణుఁడు దేవుఁడు; దేవుఁడు సీవు మ్రొక్కినన్
జూచునొ? పల్కునో? యటుల సుమ్మితఁడున్ సరసీరుహాననా!

అని శాంతచిత్తను జేసి యతనివై రాగ్యమును గొంత ప్రశంసించెను. అప్పు డప్పమాట లంగీకరింపక,

చ. ప్రకటజితేంద్రియుల్ ధరఁ బరాశరకౌశికులంతవారు స్త్రీ
లకు వశు, లంతకంటె మిగులన్ దృఢమౌమగకచ్చ బిగ్గఁ గ
ట్టుకొనఁగ నీతఁ డొంత? శుకుఁడో? హనుమంతుఁడో? భీష్ముఁడో? వినా
యకుఁడో? తలంచుకో సరసిజాయతలోచన నెమ్మనంబునన్.

క. ఈనిష్ట లింతత్తారస । మైనందాఁకానెసూ! సదాచారి యటం
టే, నబ్బినదాఁకనె యగు,।మానిజనవిడంబనములు మనమెఱుఁగనివే?

క. ఱటువంటయ్యలె కారా
చిటుకు మనకయుండ సందెచీఁకటివేళ
ఘటచేటీవిటులై యీ
కటకంబునఁ దిరుగువారు? కంజదళాక్షీ!

* * * * *

గీ. నిర్జితేంద్రియుండు నిష్ఠాపరుం డంచు
నప్ప సారెసారెఁ జెప్పెదీవు;
వీనిఁ బ్రతినచెఱిచి విటుఁజేసి తెచ్చినఁ
గలదె పంచె మసినఁ గాంతపలికె.

* * * * *

క. నీ వీవైష్ణపు విటునిం । గావించిన, లంజెతనపుగడ నే విడుతున్;
గావింప లేకయుండిన । నీవు న్విడిచెదవెయనిన నెలఁతుక యొప్పెన్.

చెల్లె లాపీరవైష్ణవుని విటునిఁ జేయవచ్చు ననియు, అప్పయతని నట్లు చేసినయెడల తాను వేశ్యావృత్తిని విడిచెద ననియు వివాదపడిన మీఁదట దేవదేవి తా నావైష్ణవబ్రహ్మచారిని విటునిజేసి యిఁటికిఁ దేలేకపోయినపక్షమునఁ దాను వేశ్యావృత్తిని విడిచెదనని పంతము పలికి తనరత్నాభరణములను, కస్తూరీతిలకమునుదీసి తులసిపూసలపేరులును తిరుమణినామములును వేసి సానివేషమునఁ బాసి దాసరిసాని యయి తిన్నఁగా విప్రనారాయణుఁడున్న యారామమునకుఁ బోయి యాతనికి నమస్కారము చేసి, హేయభాజనమయిన వేశ్యావృత్తిపై విరక్తి పొడమినట్లు నటించి,

గీ. * * హేయభాజన మెన్నిట నెన్నిచూడ
వేశ్యజన్మంబు జన్మమే విప్రవర్య

* * * *

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కనియింటి కేగుచు, మఱొక్కని నానడుచక్కి నొక్కచోఁ
బొక్కికలంచి చూడ భ్రమఁబొంది విటుల్తెలియంగ లేరుగా
క్రొక్కడిసత్య మేడవల పెక్కడినేఱము వారకాంతకున్?

గీ. అనఘ వేశ్యావిడంబవర్తనము లెన్న
నిసుకపాతఱ యీాకోలి యేల త్రవ్వ?
నప్పడుపుఁగూటిపై నసహ్యత జనించి
నామనసు రోసినట్టిచందంబు వినుము.

* * * *

గీ. వారసతులైన యీసీమవారివలెనె
మోడిమూనిసి నైన నేగోడు నెఱుఁగ;
జిహ్వ నాల్గచ్చరాలు నేర్చినకతానఁ
బడుపుఁగూటికి మనసు గొల్పక నిశ్చితి.

అని వేశ్యావృత్తిని నిందించుచు తియ్యనిమాటలుఁజెప్పి యాతని చెంతఁ జేరి పరిచర్యచేయుచు దాస్యమిషమున మెల్లమెల్లఁగా నాతని యుల్లము కలంషఁ బొచ్చెను. ఇట్లు కొంతకాలము దాసురాలిపొత్తు గలుగునప్పటికి,

శా. ఆవిప్రోత్తమువజ్రపంజరనిభంబై నిశ్చలంబైన స
ద్భావం బంగనసాహచర్యగుణసంపర్కంబునన్ లోహమై,
గ్రావంబై, దృఢధారువై, తరుణవృక్షంబై ఫలప్రాయమై,
పూవై, తన్మకరందమై, కరఁగె బోఁబో నీళ్ళకుం బల్చనై.

విప్రనారాయణుని వజ్రకఠినమైన హృదయము దినదినక్రమమునఁ గరఁగి నీటికంటెను బలుచనై దేవదేవిమనస్సులోఁ నైక్యమయ్యెను. అంతట గురువే దాసురాలికి దాసుఁడయి పరిచర్యచేయ నపేక్షించి వేఱు కొనఁగా మొట్టమొదట నాటక్కరివారాంగన,

గీ. నిడుదపట్టె తిరుమణియె వైష్ణవముగాని
మీర లాడుమాటతీరు చూడ
ననఘు నోసలు బత్తుఁడును నోరు త్రోడేల
టన్నరీతి తోఁచుచున్న దిపుడు.

. అని నీతులు చెప్పియు,

క. ఓసతి భగవత్సేవకు । వాసి గణింపంగ భాగవతసేవయ; త
ద్దాసులకైంకర్యముఁ గృపఁ । జేసిన రంగేశ్వరునకుఁ జేయుచెనుమ్మా.

అని యాతనిచేత బతిమాలించుకొని భాగవత కైంకర్యము నంగీకరించి, తుద కాతని నింటిబంటునుజేసి తనయింటికే గొనివచ్చి పండెము గెలిచెను. ఇట్లావైష్ణవవటుని విటునిజేసి తెచ్చి యిల్లు చేర్చిన తరువాత వేశ్యమాత తగులుకొని

క. నవమదనునైన మెచ్చవు; । తవిలితి వీయుఱవ; బోడితలకు వలచితో?
ధవళాక్షీ। వీనిప్రేలుం । జెవులకు వలచితివో? పిల్లసిగకు వలచితో?

అని కూఁతునకు బుద్ధిచెప్ప మొదలుపెట్టెను. తాను పట్టినప్రతిజ్ఞ నెఱవేటినందున,

క. పెదయప్పయు నేనును బ
న్నిదమాడినపసికి నీతనిం దెచ్చితి నా
కొదవ యిఁటదీఱె నిఁక నీ
కొదవయె యున్నదనఁ బల్లి కూఁతునకనియెన్.

కూఁతురును తల్లిమాటలకు సంతోషించి క్రొత్తయల్లుని నిల్లు వెడలింపఁ దల్లిం బురికొల్పెను. ఆసన్నగైకొని వేశ్యమాత నూతన జామాతను జేరి,

సీ. నీపట్టెతిరుమణి నీతిరుచూర్ణంబు గణికకు వెండిబంగారులౌనె?
నీపుట్టగోచియు నీకావిపేష్టములు వారకాంతకుఁ బట్టుచీరలౌనె?

నీముష్టిగూడయు నీతులసిసరులు వేశ్యకుఁ బండుగవేఁట లౌనె?
నీవేదశాస్త్రములు నీజపసంధ్యలు లంజెసానికిఁ బాఁజులగము లౌనె?
పెట్టనోపితివా యెప్పటట్టె యుండు
పెట్టలేకున్న విచ్చేయు పెందలకడ
మొదల రోయింతులకు నొక్కముడుపె కాక
నీసదాచార మేలయ్య! దాసరయ్య!

అని కసరి సాగనంపఁగా నాభాగవత్తోత్తముఁడు వేశ్యాగృహము విడిచి తనకుటీరముచేరి తనహృదయేశ్వరిని తలఁచి చింతిల్లుచు,

గీ. అతివ వైష్ణవమతరహస్యములఁ జాలఁ
బరిచయము గన్నయట్టిప్రసన్నురాలు
శూద్రసంపర్కమున కేల చొచ్చుమరల?
నిచ్చటికి నెంతప్రొద్దైన వచ్చుఁగాక.

అని ప్రియురాలి గుణసంపత్తిని బ్రశంసించి యడియాసపడుచు,

గీ. తనకు నేమిత్రవ్వి తలకెత్తిరమరు లీ
యుర్విమనుజు లేమి యొసఁగరైరి?
సింగివారసతుల నిర్మాతృకలఁ జేసి
పుడమి మాతృభూతముల సృజించె.

అని భూలోకమున వేశ్యలకు తల్లులను సృష్టించినందునకు బ్రహ్మదేవుని నిందించుచు పరితపింపఁజొచ్చెను. వేశ్యాసంపర్కరమువలన నెట్టి దృఢమనస్కులకును ననర్థములు వచ్చునని చూపుటకయి యింతవఱకుఁ గల్పింపఁబడినకథ నీతిబోధకముగానే యున్నదికాని తరువాతి కథ మాత్రము నీతిబాహ్యముగా నున్నది. భక్తుఁడట్లు పరితపించుట చూచి భక్తజనార్తిహారుఁడగు రంగేశుఁడు శిష్యరూపము ధరించి

క. సారమణిఖచిత మగు బం
గారపుఁదనగిన్నె వారకామిని కొసఁగఁ

శ్రీరంగదివ్యధామని
హారుఁడు స్వయమర్థచోరుఁడై కొనిపోయెన్.

తనగుడిలోని బంగారపుగిన్నెను గొనిపోయి తనగురు వగు విప్ర నారాయణుఁడు పంపినట్లుగా వేశ్యమాతకు సమర్పించి తనభక్తునకు మరల వేశ్యతోడిపొత్తు సమకూర్చెనఁట!

చ. సతతవసు బ్రహ్మరుద్రసురసంయమిముఖ్యుల నాత్మమాయ మో
హితులుగఁ జేయుసామి వెలయింతిని మోహితఁ జేయలేక ప్ర
కృతజనునట్ల తాను దనగిన్నెనొసంగెను బంటుకోసమై
మతకరివేశ్యమాతవెడమాయ లజేయులు విష్ణుమాయకున్.

వేశ్యమాయలు విష్ణుమాయనుసహితము మించినవఁట! దేవా లయములోని స్వర్ణపాత్రము మాయమగుటకనుఁగొని జియ్యరు రాజ భటుల కెటిఁగించి, వారు వేశ్యయింట గిన్నెపట్టుకొని విప్రనారాయణుని చోరునిగా దండితుఁ జేయుటకయి కొనివచ్చినప్పు డాతని గుడివెడల నడవఁ బోవుచుండఁగా, శ్రీరంగేశుఁడు సాక్షాత్కరించి భక్తప్రమోద సంధానముకొఱకు తానే గిన్నెను వేశ్య కిచ్చితినని చెప్పి రాజభటులు పట్టుకొన్న స్వర్ణపాత్రమును మరల వేశ్యకిప్పించి భక్తునకు బ్రహ్మరథము పట్టించి జీవన్ముక్తి యొసంగెనఁట!

గీ. బ్రహ్మసభయెల్ల భక్తి నప్పరమవైష్ణ
వోత్తముని బ్రహ్మరథమున నునిచి పట్ట
ణమున నేగించి రధికసంభ్రమముమీఱ
జియ్య ముంవఱికొమ్మునఁజేరి మ్రోవ.

ఆహా! ఏమి యీబ్రాహ్మణోత్తముని భాగ్యము!

ఉ. చోరుఁ డనంగ రా దొరులసొమ్ములు ముచ్చిలినం బ్రపన్ననిన్
జారుఁ డనంగ రాదు పెలుచం బరకాంతలఁ గూడినన్, దురా

చారుఁ డనంగ రాద యనిశంబును వేశ్యలతో రమించినన్,
బోరున మీర లాతనికిఁ బూనుఁడు బ్రహ్మరథంబు వైష్ణవుల్.

ఇటువంటి సిద్ధాంతములే మనదేశములో నీతికిని మతమునకును గూడ నమిత మైన చెఱుపును గలుగఁజేయుచున్నవి. నీతిని విడిచినమత మెప్పుడును దేవునికి ప్రీతికరము కానేరదు. వైజయంతీ విలాసములోని,

చ. ఇనసమతేజులౌనృపులనెల్ల మహమ్మదుశాహి యేలు నీ
యెనుబదినాల్గుదుర్గముల నేలినయేలిక గోలకొండఁ ద
ద్ఘనగరస్థలిం గరణికం బొనరించుచుఁ దమ్మమంత్రి యా
జనపతి రమ్మ పొమ్మనఁ బ్రజ ల్జయవెట్ట గృహస్థు లౌనన్

అను పద్యమునుబట్టి యీతిమ్మకవి మహమ్మదుశాహి గోల కొండ నవాబుగా నుండిన ౧౪౮౧ వ సంవత్సరమునకును ౧౬౧౧ వ సంవత్సరమునకును మధ్యకాలములో వైజయంతీవిలాసమును రచి యించిన ట్లీవఱకే తెనాలి రామకృష్ణకవి చరిత్రమునందుఁ దెలుపఁబడి నది. పయిపద్యములవలననే కవియొక్క కవిత్వరీతి తేటపడునుగనుక వేఱుగఁ బద్యముల నుదాహరింపవలసిన యావశ్యకము లేదు.

---

36. తురగా రామకవి

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండినట్లును, అడిదము సూరకవి తోడి సమకాలికుఁ డయినట్లును ఎల్లవారును వాడుచున్నారు. వేముల వాడ భీమకవికిఁ దరువాతఁ దిట్టుకవిత్వమునం దీతనితో సమానుఁడు మఱియొకఁడు లేఁడు. భీమకవివలెనే యితఁ డాడినమాట యెల్ల నగుచు వచ్చెనని యు, అందుచే నెల్లవారు నీతనికి జడియుచు వచ్చిరని యు,

చూపుట కనేక కథలు కల్పింపఁబడినవి. అందుఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

౧. ఈకవి లేటవరపు పోతురాజను క్షత్రియుని యింటికిఁ బోఁగా నతఁడు కవి కేమయిన నియ్యవలసివచ్చునని యింటనుండియు లేఁడని పించెనఁట అప్పుడు రామకవి,

క. కూటికిఁ గాకులు వెడలెడు। నేటావల మూఁకచేరి యేడువఁదొడఁగెన్
గాటికిఁ గట్టెలు చేరెను। లేటనరపు పోతరాజు లేఁడా లేఁడా?

అని ప్రశ్న వేయునప్పటికిఁ బోతురాజు మృత్యుఁడయ్యెనఁట! దహన నిమిత్త మయి బంధువు లింటినుండి శవమును గొనిపోవనున్నప్పుడాతనిభార్యవచ్చి కవికాళ్లమీఁదఁ బడి పతిభిక్ష పెట్టుమని వేఁడుకోఁగాఁ గరుణించి,

క. మేటి రఘురామమంత్రుఁడు। పాటిగ సంజీవిచేత బ్రతికినరీతిన్
గాటికిఁ బో నీ కేటికి। లేటవరపు పోతురాజ లెమ్మా రమ్మా.

అని కవి పిలువఁగానే మరల బ్రతికిలేచి పోతురాజు కటుకమీఁదనుండి దిగివచ్చెనఁట!

౨. ఈకవి బావయైన తల్లాప్రగడ సూర్యప్రకాశరావు ఉంగుటూరను స్వగ్రామమునం దొక పెద్దయిల్లు కట్టించి, దానిని జూపుటకయి కవిని లోపలికిఁ దీసికొనిపోయి యొకగదిలో విడిచి బావమఱఁది పరియాచకమున కయి తాను మఱియొకచోట దాఁగియుండెనఁట. కవి యాయింటఁ దిరిగి తిరిగి దారి కనుఁగొనలేక విసిగి,

గీ. అంగణము లెన్ని కేళీగృహంబు లెన్ని
యోడుబిళ్లలయిండ్లెన్ని మేడ లెన్ని
కళ్లఁ గాకేమి సూర్యప్రకాశరాయఁ
డుంగుటూ రిండ్ల రాకాసు లుండవచ్చు.

అనఁగానే కావుకావను యఱచుచు నింట నేమూలఁజూచినను దామే యయి పట్టపగలు పిశాచములు సంచరింపఁ జొచ్చెనఁట.

3. పెద్దాపురపు సంస్థానాధీశ్వరులయిన శ్రీవత్సవాయి తిమ్మగజపతిమహారాజుగారి దర్శనార్థము పోయినప్పుడు రాజు కవికి దర్శనమియ్యకపోఁగాఁ గోపించి,

క. అద్దిర శ్రీభూనీళలు । ముద్దియ లాహారికిఁ గలరు మువ్వురందులలోఁ
బెద్దమ్మ నాట్య మాడును । దిద్దిమ్మని వత్సవాయితిమ్మనియింటన్.

అని శపింపఁగానే రాజు రాజ్యమును బోఁగొట్టుకొని దరిద్రుఁడయ్యెనఁట!

ర. రామకవి యిల్లు కట్టించుకొనునప్పుడు దారిని బోవువారి నందఱిని బిలిచి తనగోడకిట్టుక లందింపని నియమించుచుండెనఁట! ఒకనాఁ డాదారిని అడిదము సూరకవి పోవుచున్నప్పు డాతనిని బిలిచి తక్కినవారి నడిగినట్లే యతనిని గొన్ని యిటుక లందిచ్చి పొమ్మని యడుగఁగా నతఁడు కోపించి రామకవి యని యెఱుఁగక,

"సూరకవితిట్టు కంసాలిసుత్తెపెట్టు"

అని పలికి పోఁ బోయెనఁట। రామకవి యీమాట విని కన్ను లెఱ్ఱచేసి బిగ్గఱగా,

"రామకవిబొబ్బ పెద్దపిరంగిదెబ్బ"

అని కేకవేసెనఁట. అంతట సూరకవి యతఁడు రామకవి యని తెలిసికొని కొన్నియిటుక లందిచ్చి మఱి వెడలిపోయెనఁట!

ఇవి యన్నియుఁ గేవల కల్పితకథ లయి యుండవచ్చును. ఇటు వంటి మహామహిమగలవాఁడన్న వేములవాఁడభీమకవి కోమటివేరఁ గృతిచేసి స్తుతించినట్లే యీరామకవియుఁ గంసాలివేరఁ గృతిచేసి స్తుతులు చేసెను. ఈతఁడును నయ్యంకి బాలసరస్వతి యను మఱియొక కవియు గలిసి రచియించిన నాగరఖండమనెడి ద్వ్యాశ్వాసముల గ్రంథమొకటి

కానఁబడుచున్నది. ఈయిద్దఱుకవులును దమగ్రంథములయొక్క యాశ్వా
సాంతగద్యము నీప్రకారముగా వ్రాసికొనియున్నారు—

"ఇది శ్రీమద్దుర్గాదక్షిణామూ ర్తివరప్రసాదాసాదితసారస్వత తురగా
రామకవి వరాయ్యంకి బాలసరస్వతినామధేయ ప్రణీతంబై న శ్రీ
స్కాందంబను మహాపురాణమునందు సనత్కుమారసంహితను
నాగరఖండము"

ఈనాగరఖండము ధవళేశ్వరపు మార్కండేయుఁడను స్వర్ణకారకులజుని
కంకితము చేయఁబడినది. ఈవిశ్వకర్మవంశజుఁడు బెజవాడకుఁ బ్రభువుగా
నుండిన ట్టీక్రిందిపద్యమువల్లఁ దెల్ల మగుచున్నది—

మ. రజతాగం బొకరాజమౌళికి వినిర్మాణంబు గావించి యి
చ్చె జగంబెన్నఁగ విశ్వకర్మ మును దాఁ జిత్రంబు గా దిప్పు డీ
బెజవాడప్రభుఁ డియ్య నెంతయును గల్పించున్ ధరిత్రిన్ మహా
రజతస్వర్ణగృహంబు లెప్పుడు బుధవ్రాతంబు మోదింపఁగన్.

ఈధవళేశ్వరపుమార్కండుఁడు మహమ్మదు కుతుపషాహి కాల
ములో నుండినట్లు నాగరఖండముయొక్క యవతారికలో నీక్రిందిపద్య
మునఁ జెప్పఁబడిది—

క. అతఁడు ప్రసిద్ధి వహించెన్
క్షితినగరజపతుల గెల్చి చెలఁగి జయశ్రీ
సతిఁ జేకొనిన మహమ్మదు
కుతుపషహాచంద్రునకును గుడిభుజమనఁగన్.

దీనినిబట్టి చూడఁగాఁ గవి పదునాఱవశతాబ్దాంతమునందో పదు
నేడవశతాబ్దారంభమునందో యుండినట్లును, కవినిగూర్చి చెప్పెడికథ
లన్నియు నబద్ధము లయినట్లును కనఁబడుచున్నది. మహమ్మదుకుతుబు
షాహి క్రీస్తుశకము ౧౫౮౭ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ
సంవత్సరమువఱకును గోలకొండనవాబుగానుండి రాజ్యము చేసెను.

కుతుబ్ షాహి వంశము ౧౬౨౨ వ సంవత్సరముతోనే నశించినది. నాగర ఖండమునందుఁ గొన్ని వ్యాకరణవిరుద్ధములగు ప్రయోగము లున్నను మొత్తముమీఁద గవిత్వము హృద్యముగానే యున్నది. నాగరఖండము నుండి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి —

ఉ. ప్రీతియొనర్ప నగ్గిరి నిరీక్షణయొనర్ప దరీసరత్ప్రివం
తీతటజాతరూపధరణీరమణీయమణీసమగ్రమై
స్ఫీతసుధాంబుపూరసరసీరుహశీకరశీతలానిలా
స్వీతవిహారదేవతరుణీహరిణీకరిణీసమూహమై. ఆ. ౧.

ఉ. ఆదికి నాదికారణ మహార్ణవికోటిసమానతేజుఁ డు
త్పాదితసర్వలోకుఁడును బ్రహ్మమునై తగు విశ్వకర్మ నా
నాదినిజాళిలోన భువనంబుల నెల్లను హేతుకార్యక
ర్తృత్వాదులు తానయై తగు యథార్థమునుమ్మ్ల మయూరవాహనా.
ఆ. ౨.

ఉ. ఇచ్చిన నైదుసాధనము లింపుగ నైదుగురున్ ధరించి యు
ద్యచ్చరిత ప్రశస్తయజనాదిరతుల్ శివతత్త్వబోధులై
యచ్చెరు వందఁ జేసిరి సమస్తజగంబులఁ దత్త్రిణంబునన్
హెచ్చినయాత్మవర్తనల నెన్నికగాఁగ సరోజబాంధవా. ఆ. 3.

చ. కమలజుకంటె మున్ను శశిఖండశిఖామణికంటెమున్ను శ్రీ
రమణునికంటెమున్నుగ విరాజిలు బోధకుఁ డైనయట్టిబ్ర
హ్మముగ మహానుభావుఁడని యాత్మనివేకముచే నెఱుంగువా
యమితపువిశ్వకర్మను మహాత్ముని లోకకృత్ప్రవీణునిన్. ఆ. ౪.

చ. కడఁకఁ గనుంగొనంగఁ దొలుకారుమెఱుంగులు గ్రుమ్మరింపఁగా
నడుగిడ గల్లుగల్లు మను హంసకనాదము హంసరావమున్
దడఁబడఁ బద్మరాగసముదాయముదాపున నేపు చూపి యె
ల్లెడలఁ బదాగ్రరాగరుచు లీనఁగ వచ్చెను గౌరి వేడుకన్. ఆ. ౫.

37. చెన్నమరాజు చెన్నమరాజు

ఈకవి చారుచంద్రోదయ మనెడి యైదాశ్వాసములప్రబంధమును జేసెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆత్రేయగోత్రుఁడు; శేషయామాత్యపుత్రుఁడు. ఈకవి తాను పెమ్మసాని తిమ్మరాజునకాశ్రితుఁడయినట్లు చెప్పి తిమ్మరాజు శ్రీరంగనాయనికిని వేంకటపతిరాయనికిని మంత్రియైన ట్లొకపద్యములో నీక్రిందివాక్యముతోఁ జెప్పియున్నాఁడు—

సీ. శ్రీరంగరాయ ధాత్రీతలాధ్యక్ష దక్షిణభుజాదండమై చెలఁగినాఁడు.

* * * *

రమణ వేంకటపతిరాయేంద్రుఁడు నుతింపఁ బటుకాగ్యదక్షుఁడై
ప్రబలినాఁడు

ఈకవి తనముత్తాతయైనలక్ష్మీపతి శ్రీనాథకవికి శిష్యుఁడై నట్లీక్రింది పద్యములలోఁ దెలిపియున్నాఁడు—

క. సన్నుత కవిత్వవిద్యా । భ్యున్నతి శ్రీనాథసుకవిపుంగవుకరుణన్
జెన్నమరున్ లక్ష్మీపతి । చెన్నమరాజప్రధాన శేఖరుఁ డెలమిన్.

కవి శ్రీరంగరాయ వేంకటపతిరాయల కాలములోనున్నవాఁడగుటచేత క్రీస్తుశకము ౧౫౭౮-౧౬౧౭ సంవత్సరములమధ్యను ప్రబలియున్నవాఁడు. కవియొక్క కవిత్వరీతి తెలియుటకై చారుచంద్రోదయములోనిపద్యముల రెంటిని నిం నుచాహరించుచున్నాను.

ఉ. ఎల్లి యవశ్యమున్ వనికి నేగి మహోగ్రతపం బొనర్చి సం
పల్లలనామనోహరుకృపన్ వరలాభము గాంచివత్తు నీ
యుల్లమునం బ్రమోదము సముల్లసితంబుగ నిందు నిల్వు మో
పల్లవపాణి యంచుఁ బ్రియభాషల భూవిభుఁ డాదరించినన్.

శా. తావు ల్గులెక్కడు మేనుతీవకుఁ బరీతాపంబు గావించునీ
జీవంజీవమనోజ్ఞమూ ర్తి యకటా శీతాంశువా కాదు శో
భావై రూప్యమునఁ జనభ్రమదవా భస్మాన్వితానంగతే
జోవై శ్వానరవిస్ఫులింగమునుమీ చూడఁ దిశానాయకా.

---

38. తెనాలి అన్నయ్య

ఈకవి సుదతీపరిణయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు తెనాలిపురనివాసుఁడు; శైవాచార సంపన్నుఁడు; రామపండితపుత్రుఁడు.

శా. శ్రీలీలాహరినీలపీతరుచిరశ్రీవత్ససంపన్నవ
క్షోలాలిత్యుఁడు వేంకటేశుఁడు కృపం గోనేటిరామక్షమా
పాలస్వామిసమస్తరాజ్యభరణోపాయాధికుఁ హృద్యవి
ద్యాలోలున్ బులిజాలరామవిభుసోమామాత్యునిం బ్రోచుతన్.

సుదతీపరిణయములోని యీప్రథమపద్యమునుబట్టియే యీకావ్యము కోనేటి రామరాజు మంత్రియైన పులిజాల సోమామాత్యున కంకితము చేయఁబడినట్లు తెలిసికోవచ్చును. ఆసోమామాత్యుఁ డొకనాఁడు సభాసీనుఁడయి తన్ను రావించి కృతిఁ వేఁడిన ట్లీక్రిందిపద్యములోఁ గవి చెప్పుకొనియున్నాఁడు—

మ. కవులుఁ గాణలు జాణలార్యులు హితుల్ కాంతానమూహంబులు
త్సవలీలం దనుఁ గొల్వ నిండుకొలువై సత్కావ్యగోష్ఠివిశే
షవినోదైకపరాయణత్వమును రాజ్యశ్రీవిహారంబుఁ బ్రా
జ్యవివేకంబుఁ దనర్ప రామవిభుసోమామాత్యుఁడత్యున్నతిఁ.

గీ. నవ్యసుగుణాభిరామ తెనాలిరామ
పండితాగ్రణిసత్పుత్రు భవ్యమిత్రు
హారపదాంభోజసౌముఖ్య నన్నపాఖ్య
నన్నుఁ బిలిపించి యాదరోన్నతి వహించి.

చ. పలుకులకల్క కప్పురపుఁబల్కలుచల్లినరీతిఁ బండువె
న్నెలతళుకుల్ విభుండు హవణించినమించున శంబరారి చెం
గలువలతూపుకోపుల ముఖాముఖిఁ జూపినయేపునం గృతుల్
పలుకఁగ నేర్తు పూర్వకవిపద్ధతి రామయయన్న సత్కవీ.

గీ. సరససాహిత్యసౌహిత్యపరత నీవు
పరిష్వించుసుదక్షిణాపరిణయంబు
కోరి విలసిల మాకు నంకితము సేయు
తేట యగువాగ్విలాసంబు కోటిసేయ.

ఇఁక దీనినిబట్టి కృతికర్తయొక్క కాలనిర్ణయము చేయవలసి యున్నది. కృతిపతియొక్క కాలము తెలియునేని, కవియొక్క కాలమునుఁ దెలియును. కృతినాథుని ప్రభువై న రామరాజుయొక్క వంశము గ్రంథమునం దీవిధమునఁ జెప్పఁబడినది—

గీ. చంద్రవంశాబ్ధిపూర్ణిమాచంద్రుఁ డారు
వీటి బుక్కయరామభూవిభునిసుతుఁడు
తిమ్మరాజేంద్రుఁ డన్వయదీపకుండు
కనియెఁ బినకొండభూపాలు ననఘుశీలు.

చ. కులనిధి యాన్నృపాలకుఁడు కోనమదేవి వరించి కాంచెఁ జే
కొలఁది నరాతులం దునుముకోనెటితిమ్మనరేంద్రు భూమిభృ
త్తిలకముఁ జిన్నతిమ్మవిభు ధీరసుధానిధి నప్పరాజు ని
ర్దళితవిరోధిభూవరకురంగుని రంగన్నృపావతంసమున్.

ఇట్లార్వీటి బుక్కరాజుకొడుకు రామరా జయినట్లును, రామ రాజుకొడుకు తిమ్మరా జయినట్లును, తిమ్మరాజుకొడుకు చినకొండరా జయినట్లును, చినకొండరాజుకొడుకు కోనేటి తిమ్మరా జయినట్లును, చెప్పఁబడెను. ఈకోనేటి తిమ్మరాజు కొడుకయిన రామరాజువద్దనే కృతిపతియైన సోమామాత్యుఁడు మంత్రిగానుండెను. పయిని జెప్పిన వంశావళినిబట్టి విచారింపఁగాఁ గృష్ణదేవరాయని యల్లుఁడయిన రామ రాజున కీరామరాజు పెదతండ్రికొడుకునకు మనుమఁడయినట్లు స్పష్ట మగుచున్నది. అళియ రామరాజు ౧౫౬౨ వ సంవత్సరమువఱకును జీవించి యాకాలమునకే మనుమల నెత్తినవాఁడగుటచేత నాతని పెద తండ్రికొడుకును నప్పటికే యెదిగినమనుమలు గలవాఁడయి యుండ వచ్చును. కాఁబట్టి విమర్శించిచూడఁగా సుదక్షిణాపరిణయకృతీశ్వరుని ప్రభువు పదిసంవత్సరము లీవలావలగా ౧౫౭౦ వ సంవత్సరప్రాంత ములయం దుండెనని తేలుచున్నది. ఇదియే కవికాలము. ఈకవికిఁ గందాళ శ్రీరంగాచార్యులు గురు వయిన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలియ వచ్చుచున్నది—

క. కందాళ భావనార్యుల । నందను శ్రీరంగగురుని నతబుధరక్షా
మందారంబు నుతింతును । మందారమరందబిందుమధురారభటిన్.

సుదక్షిణాపరిణయకవిత్వము సలక్షణమయి కర్ణరసాయనముగా నున్నది! కవిత్వమాధుర్యము తేటపడుటకయి కొన్నిపద్యము లిందుదా హరింపఁబడుచున్నవి—

చ. పలుకఁగ నేర్చుచిత్రములు పాడఁగ నేర్చినపుష్పవల్లికల్
మెలఁగఁగ నేర్చురత్నములు మెల్లన నడ్వఁగ నేర్చుచంచలల్
నిలుకడ నేర్చువెన్నెలలు నెయ్యముతియ్యము నేర్చుపెఁడిక్రొం
దళుకు లనం జెలంగుదురు తామరసేక్షణ లప్సరంబునక్. ఆ. ౧.

చ. ఏనొకవింతయే రఘుకులేశ్వర యీదివమవిష్ణుమూ ర్తివె
యీసిఖిలావనీతలము నేలెడు నిన్ గనుఁగొంటి నేఁడుగా
నానియమంబు నాజపము నాతపమున్ ఫలియించె భక్తిస
న్మానధురంధరత్వమున నా జననాయక యిట్లుపల్కుటల్. ఆ. ౧.

ఉ. విప్రకులావతంస వినవే యనుమానము మాని పుత్రకుం
డప్రతిమప్రభావనిధి యన్వయదీపకుఁ డుద్భవిల్లు న
వ్యప్రచురాంగకాంతిభరయా వనలక్ష్మియు నిన్నుఁ జెందు ని
త్యప్రమదంబు చేకుఱుమహౌషధ మొక్కటి నీకు నిచ్చెదన్. ఆ.౨.

చ. నృపవర నిన్ను మీఁ దెఱుఁగనేరక వేఁడితిఁగాక చంచలా
చపలము లై నరాజ్యసుఖసంపదలన్ మదినమ్మ కీర్తియుం
గృపయు వివేకమున్ నయముఁ గేవలధర్మపరత్వమున్ సదా
కపటమతిం దొఱంగుమహికాంతుల కేడ పరోపకారముల్. ఆ-౨

మ. జలకంబుం దగఁగూర్చి నెన్నుదుట రక్షాకాంక్షఁ బాదాంగుళీ
స్థలమృత్తాన్నతిలకంబు దీర్చి రుచులం దట్టాడువజ్రంపుటు
య్యలపైఁ బొత్తుల నుంచి యోకుధరకన్యాధీశదివ్యాంశపే
శలమూర్తి నిదురింపవే యను సుతుం జంద్రాస్య జోకొట్టుచున్.ఆ-౨

ఉ. వాడినమోముతోడఁ గయివాలినచూపులతోడ దీనతం
గూడినపల్కుతోడ నెఱిగూడనిగంద పుఁబూఁతత్తోడఁ గీ
లూడినయం దెతోడ బిగియూడిన కాలిమితోడ వచ్చెఁ గి
గ్గాడియుఁబోలెఁ గామగవిగాడిగలయ్య నృపాలువీటికిన్. ఆ. 3.

ఉ. విన్నఁదనం బిడేమి నెఱిపీడినచిత్త మిడేమి వేయిక్రా
ల్గన్నులవాఁ డిడేమి శరఘాతల నెత్తు రిడేమి వెంబడిం
గిన్నరసిద్ధకింపురుషఖేచరవీరులురా రిడేమి మీ
యున్నవిధం బిడేమి నిఖిలోన్నతశాసన పాకశాసనా. ఆ. 3

ఉ. భానుమతీకుమారకుఁడు పల్కఁ మహేంద్రునిఁ దేవ యెం
వ్వానికి గెల్పు నోటమియు వచ్చు నొకానొక వేళ దీనికై
దీనత యింతయేటికి మదీయభుజాగ్ర ధనుర్విము క్తనా
నాసిశితాస్త్రపాతముల నాకుల నే నవలీలఁ గాచెదఁ. ఆ. 3.

ఉ. మేలు బళీ చతుర్ముఖుఁడు మిక్కిలినేర్పరి యెట్టులన్న నీ
బాలిక మాదిలీపనరపాలకు దేవిగ నిశ్చయించె ల
క్ష్మీలలనేశునాభిసరసీరుహమందిరవ ర్తి యైనవాఁ
డేల యొనర్చు వేదజపముఁ డేనియు నీపుకుఠారిచేతలన్. ఆ. ర.

చ. కుడిచెవిఁ జేరి మంచుమలకూరిమియల్లుఁడు తారకంబు మున్
నొడువునఁ గూర్చి పల్కుచు వినోదము సల్పఁగ నేదదేటి చె
ట్టపఁచినఁ జేకొఁడన్నినటలాంబకమూర్తులు కానవచ్చు నా
మడ పరుగెత్త నేల యఘమర్దనసిద్ధయ మైనకాళికన్. ఆ. ర.

శా. ఏణాంకోపలసౌధవీధికలపై నింపొంది చిత్రంబులౌ
వీణ ల్కొల ధరించి రాగలహరీతస్ఫూర్తిమైఁ జొక్కుచున్
జాణల్ సాధ్యకుమారు లాగమవిధానస్నిగ్ధగానంబులన్
ద్రాణ ల్మీఱఁగ నాలపించెదరు చిత్తప్రీతిమై వింటిరే. ఆ. ౫.

మ. కమలామందమరందబిందుకణికాకల్లోలడోలావిలో
లమరాళీగరుదంచలత్పవనబాలక్రీడనప్రోల్లస
త్తుముదామోదిపరాగవాసితదిశాకుంభీంద్రగండస్థలీ
సముదాయం బలరున్ న్యపాల యొకకాసారంబు దూరంబునన్. ఆ-౫

39. సవరము చిననారాయణనాయకుఁడు

ఈకవి కువలయాశ్వచరిత్ర మనెడి యైదాశ్వాసములప్రబంధమును రచియించి, తిమ్మనరపాలపుత్రుఁడయిన నారాయణభూపాలుని కంకితము చేసెను. ఈకవి తాను క్షత్రియుఁడ ననియు, రాయభూపాలుని పుత్రుఁడ ననియు చెప్పికొనియున్నాఁడు. ఈతఁడు రాయభూపాలునకుఁ దిరుమలాంబవలన గలిగిన ట్లీక్రిందిపద్యమువలన దెలియవచ్చుచున్నది.—

మ. అతఁ డాతిమ్మమయంబు వేంకటనృపాధ్యక్షు రిపుచ్ఛేదనో
ద్ధతు రంగాధిపుఁ దిర్మలాంబవలనఁ ధర్మాత్మ గోపాలు ను
న్నతకీర్తిం బిననారనాఖ్యఁ దగు నన్నుఁ గస్తూరీంద్రుఁ సమం
చితకీర్తిన్ రఘునాథుఁ దిమ్మవిభుఁ గాంచెఁ నజ్జనాధారులఁ.

కృతిపతి యైన నారాయణభూపాలుఁడు శ్రీరంగరాజ వేంకటపతి రాయలకు సహాయుఁ డయియుండినట్లు చెప్పఁబడినందున గవి గ్రంథం వ సంవత్సరప్రాంతములయుఁ దుండినట్లు కానవచ్చుచున్నాఁడు. మఱియు గృతినాయకుఁడైన నారనరనాథుఁడు మట్ల యనంతభూపాలునికాల ములో నుండిన ట్లీక్రింది పద్యమునందుఁ జెప్పబడినందునను, కవి పదు నాఅవశతాబ్దాంతమునం దుండినట్లు నిర్ధారణము చేయవచ్చును—

సీ. తనమాటచెంజికా తంజాపురీ మధురాధినాథులకు నెయ్యంబు నెఱపఁ
దనసిరి గోలకొండనరేంద్రముఖధరాధవపద్మబంధు లౌదల వహింపఁ
దనకీర్తిమట్లనంతనృపాలముఖ్యగోత్రామరేంద్రులు కొనియాడికొనఁగఁ
దనదానగుణము గోదావరీతీరభూనిర్జరేశ్వరులు వర్ణించుకొనఁగ
వెలయు వేదండగండనిర్గళదవర్గ
ళమదధారాఘనీనాథకుముదబంధు
కార్యకృద్దండిమారావధుర్యసైన్యఁ
డతఁడు ప్రభుమాత్రుఁడే నారనాథి నేత.

ఈకవి కాశ్యపగోత్రుఁడు; శరగోపతాపసేంద్ర శిష్యుఁడు. ఈతని కవిత్వము సలక్షణమయి వినసొంపుగా నుండును. ఈతని కువలయాశ్వ చరిత్రములోని కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. మిటిమిటి యెండవేఁడి బలిమిం దెలిదమ్ముల జేకుసందులం
జిటుకుమనంగఁ గూడి నివసించి త్రదగ్రమరంద మప్పట
ప్పటికిని మూతిముట్టి పయిపై నది చల్లఁబడంగ బ్రొద్దుగ్రుం
కుట గని యంతటం బొదలుఁ గోడెనిటారపుఁదేఁటు లత్తఱిన్. ఆ-౧

చ. మునివనితల్ శచీముఖతమోనిభ వేణులకుం బతివ్రతా
జనతతిఁ దెల్పుచోఁ బరవిచారముగాఁగను వేల్పుటొజ్జ
వ్వని మొగ మవ్వలం జొనుప వారలు నవ్వుదు రామె సిగ్గుపెం
పునఁ దలవంచుఁ జందురుఁడు పొంగఁగ నయ్యయిమూగ వేళలన్. ఆ-౨

చ. తలఁపున నెంత మోహపరితాపముగల్గిన దాఁచుకొందురో
యలయిక లేక నీకరణి నంగడిఁ బెట్టుదురో వధూటికల్
పలుకవు నిన్ను వంటికులభామలఁ గానమె వారి కాత్మనా
థులపయి బాళిలేదొ తమిదొట్టినపట్టున మట్టుపెట్టరో. ఆ. 3.

మ. అతఁ డచ్చోఁ దురగంబు నెక్కి హృదయాబ్జాపూర్ణ మోదార్ణవాం
చితుఁడై వారల వెనక్క నుంచుకొని యచ్ఛైక్యమాణిక్యదీ
ధితిజాతామృతరుగ్వితాన మగుచై తేయాధినాథాయతా
యతనం బల్లన నిర్గమించి పురబాహ్యక్షోణి కేతెంచుచున్. ఆ. ౪.

చ. వెలుపలిరచ్చ నొక్కయెడ వేలుపునానికి వన్నెకానికిన్
గలహాము కల్గనేని గుఱికానితనంబున వచ్చి రోసపుం
బలుకుల వాదు రేఁచి సిగపట్లకు డగ్గఱఁజేసి క్రొవ్వునం
గలకల నవ్వువాఁడు చవుకట్లసియాడ రుమాలువీడఁగన్. ఆ. ౫.

---

40. దామెర వేంకటపతి

ఈకవి పద్మనాయకకులజుఁడైన శూద్రుఁడు; ఈపద్మనాయక కులమువారి నీదేశమునందు వెలమలని వాడుదురు. ఈకవితాత సంస్థానాధిపతియై వేంకటగిరిసంస్థానాధిపత్యులైన వెలుగోటివారితో సంబంధబాంధవ్యములను జేసినవాఁడు. ఈకవి తన మేనత్తయైన వేంకటాంబను వెలుగోటి యాచమనాయనికుమారుఁడయిన కస్తూరిరంగనాయని కిచ్చినట్టును ఆదంపతులకు యాచమనాయడు పుత్రుడైనట్టును చెప్పి యాతనిని తనబావమరిళాశ్వచరిత్రమునం దిట్లు వర్ణించినాఁడు.

సీ. ఉత్తరమల్లూరియొద్ద దావలుపాపవిభుని గొట్టిననాఁటివిజయకలన
చెంగలుపట్టు నీఱ్ఱించి లగ్గలువట్టి యాక్రమించిననాఁటివిక్రమంబు
పాళెముకోటవెల్పుల నాజి యతిరాజు జరగజేసిననాఁటిశౌర్యపటిమ
తిరుమలఁజేరి ధాత్రినున్నెరాజులఁ బాఱఁదోలిననాఁటిబాహుబలము
మున్నెతోపూర జగ్గరాణ్ముఖుల నొంచి
మధురదొరఁ జెంజిమన్నీని మద మడంచి
తిరుచనాపల్లిదొరఁ దోలుతేజము గల
మేటి వెలుగోటియాచని సాటిగలరె!

కవియొక్క మేనత్తభర్తయైన కస్తురి గంగనాయఁడు గోలకొండ మహమ్మదీయులను కొండవీడు వినుకొండ ప్రభువులను గెలిచి, ౧౫౭౯ వ సంవత్సరమునందు చంద్రగిరియందున్న విజయనగరపు రాజులపక్షమున యుద్ధముచేసి వారిశత్రుల నోడించెను. కవియొక్క మేనత్తకొడుకయిన యాచనాయఁడు చెంగల్పట్టుమండలములోని మధురాంతకముఁగో వాసముచేసి విజయనగరాధిపతియైన వేంకటపతిరాయలవలన పెరమాడి సీమను బహుమానమందెను; అంతేకాక యితఁడు ౧౬౦౨ వ సంవత్సరమునందు శత్రువులతో యుద్ధముచేసి వారి నోడించెను; ఆవఱకు పరులపాలైన వేంకటగిరిని మరల స్వాధీనము చేసికొనెను. కవియు

నీతనికాలములోనివాఁడే యయినందున నతఁడు పదునాఱవశతాబ్దాం
తమునందును పదునేడవశతాబ్దాదియందును నుండినవాఁడు. ఈకవి
తాను బహుళాశ్వచరిత్రమును జేయకమునుపు కృష్ణకథ నొకదానిని
జేసి దానిని రామభద్రున కంకితము చేసినట్లు బహుళాశ్వచరిత్రములో
రామభద్రుఁడు తన్నుద్దేశించినట్లే క్రిందిపద్యములోఁ జెప్పుకొన్నాఁను.

ఉ. దామెర వేంకటప్రభువతంసుని వేంకటభూప మాపయిన్
శ్రీమెఱయంగఁ గృష్ణకథ చెప్పితి విప్పుడు నీదుతండ్రియున్
మామకభక్తుఁ డాతనికి మాకును భేదము లేదుగాన నీ
వామహిమాఢ్యవేర బహుళాశ్వచరిత్రము చెప్పు మొప్పుగన్.

ఈబహుళాశ్వచరిత్ర మయిదాశ్వాసములు కలదయి రసవంత
మయి సలక్షణమయినదిగా నున్నది. అందుండి రెండుపద్యముల
నిందుదాహరించుచున్నాను—

చ. తటములఁ జుట్టుకొన్న బిగిదన్నినక్రొన్ననపొన్నగున్నలఁ
జిటపొటమంచు మంచుజడి చిల్కెడిగొజ్జఁగికిన్ రసాలపున్
జటిపొటితేనెవానలకుఁ జేసినకాల్వలతేటనీటిప
ల్లటముల నిక్కు నక్కొలఁకులచ్చికి మెచ్చిరి వచ్చినెచ్చెలుల్.

ఆ. 3.

ఉ. రామునిఁ జూచి కామునిశరంబుల గాసిలి చేష్టదక్కఁ కాం
తామణి యుండెనోర్తు రఘునందనపాదరజంబుచేత మున్
గోమలిరేఖ పాతి కొడఁగూడెనో లేదొ యటంచు నెంచి లీ
లామహితాంగ మొందఁగ శిలామయరూపము దాల్చెనోయనన్.

ఆ. 4.

---

41. చిత్రికవి పెద్దన్న

ఇత, డాఱువేలనియోగి; భారద్వాజగోత్రుఁడు. ఇతఁడు పసు
నాఱవశతాబ్దాంతమునం దుండినవాఁడు. ఇతని కొడుకైన యనంతకవి
యింమతీపరిణయమును, మనుమఁడైన రమణకవి సాంబవిలాసమును
రచించిరి. ఇతఁడు సర్వలక్షణసారసంగ్రహమను నామాంతరముగల
లక్షణసారసంగ్రహమును రచించినట్లు,

సీ. * * * లక్షణసారసంగ్ర
హం బొనరించి యుద్యత్కీర్తి బ్రఖ్యాతుఁడగు చిత్రకవి పెద్దనార్య
సుతుఁడ"

అని యాతనికుమారుఁడైన యసంతకవియు,

సీ. "సర్వలక్షణసారసంగ్రహం బొనరించి తనరె మాతాత పెద్దనకవీంద్రుఁ"

డని యాతని పౌత్రుఁడైన రమణకవియు చెప్పియున్నారు.
ఈలక్షణసారసంగ్రహము నాకు లభింపకపోయినను, యప్పకవీయమున
గ్రహింపఁబడిన రెండుపద్యముల సిచ్చట ఉదాహరించుచున్నాను—

గీ. మహిమ నెక్కటివళులన మరవఱలలు
రహిని దమతమ కయి యేఁగు రమ్యచరిత
వనధిగంభీర సద్గుణవాసయనఁగ
భంజితాసురసముదాయ యాంజనేయ.

చ. ఎఱుఁగవుగాక భోగముల కెల్లను నెచ్చెలి జవ్వనంబ యి
త్తఱి నుడివోవకుండ నుచితంబుగ జక్కవదోయిఁ బోలి క్రి
క్కిఱిసినచిన్నిచన్నుఁగవ యింపెసలారఁగ నాదుచిత్త మన్
వఱలుసరోవరంబున నవారణఁ గేళి యొనర్చు కోఱలీ.

---

42. యాదవామాత్యకవి

ఇతఁడు చంద్రహాసవిలాస మను కావ్యమును పూర్వోత్తరభాగ ములుగా రచియించెను. ఈతనికాల మెప్పుడో తెలియలేదుగాని లక్షణ శిరోమణి యనునామాంతరము గలయాదవామాత్యఛందములోని,

సీ. రగణము శంఖమనఁగనొప్పుమూడవజామునఁబవడపుఁజాయపుజుఁడు
గ్రహముగావేల్పు హిరణ్యరేతుఁడుగాఁగఁ దార కృత్తికగాఁగఁ
దగరురాశి
గా మేషయోనిగా గణమాసురంబుగా శృంగారరసముగా స్థిరఫలంబు
భయముగా గౌశికభద్రగోత్రమున నెల్లినిమేన నృపకులమున జనించె
బంధుజనగేయ సత్కవిభాగధేయ
రమ్యచారిత్ర వేంకటరాజపౌత్ర
వర్ణితోదార బాపన్నవరకుమార
మదనసౌందర్య యాదవామాత్యవర్య.

ఇత్యాదిపద్యములనేకములు సులక్షణసారములో నుదాహరింపఁ బడి యుండుటచేత నీయాదవామాత్యకవి ౧౬౮౦ వ సంవత్సరమునకుఁ బూర్వపువాఁడనిమాత్రము నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇట్టిదైనము త న్నుద్దేశించి పలికినట్లుగాఁ గవి చంద్రహాసవిలాసములో నిట్లు వ్రాసి కొనియున్నాఁడు—

సీ. ఇట్లనిపల్కె మహీసురాన్వయమున వాసి కెక్కినభరద్వాజమౌని
గోత్రసంభవులందుఁగొమరొప్పుభానప్పవంశంబునకుఁజాలవన్నె తెచ్చి
నట్టి తిమ్మకవీంద్రు నన్వయంబునఁబుట్టి మహి మించు నారపమంత్రి
పుత్రుఁ
డగువేంకటాద్రి కిల్లాలైన కొండాంబతనయుఁ డాబాపన్నతమ్ముఁడైన

ఘనులు కృష్ణయ వీరనల్ కవియెఁ జెన్న
మాంబ యనుసాధ్వియందు ని న్నాదరమునఁ
దలఁప రామన్న నీపినతండ్రికొడుకు
మదనసౌందర్య యాదవామాత్యవర్య.

ఈకవియొక్క వినయశైశీల్యాదులు కవిస్తుతి మొదలైన యీ కృత్యాదిపద్యములవలనఁ దేటపడుచున్నవి—

సీ. వాల్మీకి ముఖ్యగీర్వాణకవీంద్రులకును నన్నపార్యాది తెలుఁగుకవుల
కును శుభంబు లొసంగు మని భద్రగిరిరామభద్రునిఁ గడుభ క్తిఁ
బ్రస్తుతించి
కవివరు ల్నామీఁదఁ గలదయచేతను గబ్బంబు చెప్పఁగాఁగలనటంచు
భావించి నే నీప్రబంధంబు గల్పింపఁదలఁచినాఁడను సతతంబు నియతి
శారదాదేవిఁ బ్రార్థించి గారవమున
వరముఁ గైకొని మీ రంప వచ్చి వాణి
నాదుజిహ్వాంచలంబునఁ బాదుకొనిన
ధైర్యమునఁ బల్కెదను గవివర్యులార।

గీ. పెంపుమీఱు వేల్పుఁ బెద్దలు పూజింప। బాలుఁడట్లు చేయుభంగిగాను
మీరు కవితఁ జెప్పినారని నే నిట్టి। చర్య కొనరితిఁ గవివర్యులార!

క. కదళీపాకముగాఁ బెం। పొదవఁగ నీప్రబంధ మొగి రచియింతున్
గొదవలు మిక్కిలి గల్గిన। సదయతఁ దగ దిద్దవలయు సత్కవివర్యుల్.

గీ. లేకయుండినఁ జదు వేమిలేనివాని
కిట్టి సద్బుద్ధి జనియించు నెందుఁ గలదు
నిచ్చనిచ్చలు మీ రంప వచ్చి వాణి
పొసఁగ నన్నిట్లు పలికింపఁ బూనెఁ గాక.

గీ. నన్నుఁ బోలినకవి గల్గకున్న ధాత్రి
వరకవీంద్రులన్ వే రెట్లు వచ్చు మీకుఁ

బిన్న లుండుటచేఁగాదె పెద్ద లనుచుఁ
దెలియఁగలుగుట యార్యులు తెలిసికొనుట.

ఉ. నేరిచి యాడుపుత్రులును నేరక పల్కిననందనుండునున్
గూరిమితల్లి కొక్కటియుగుం దలపోయఁగ వాగ్వధూటికిన్
మీరలు నేను నొక్కటియె మీరువచించినకావ్యమండలిం
జేరి మదీయవాక్యములఁ జేరకపోవునె యంచు నెంచుచున్.

పై పద్యములలో భద్రాద్రిరాముని బేరొక్కని యుండుటవలనఁ గవి గోదావరీమండలములోనివాఁడని తేటపడుచున్నది. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటరాజ పౌత్రుఁడు; బాపనార్యపుత్రుఁడు. ఇతఁడు కృతు లందుట మొదలైన వానినిబట్టి చూడఁగా నితఁ డున్నతపదమునం దుండినట్లు త్రోఁచు చున్నది. ఇతఁడు గ్రంథాదిని కేవలాంధ్రపద్యము చెప్పక నన్నయాదుల వలె సంస్కృతభాషతో నీక్రిందిపద్యమును వేసియున్నాఁడు—

చ. శ్రితజనరక్షణాయ సరసీరుహపత్రవిలోచనాయ వి
శ్రుతశుభకీర్తనాయ రవిసూనుసఖాయ మఖావనాయ సం
తతసుగుణాకరాయ వసుధాతనయాపరితోషణాయ నే
వితపవనాత్మజాయ రఘువీరవరాయ నమోనమోనమః.

ఈతనికవిత్వము కవి తాను జెప్పకొనినట్లు కదళీపాకముతోఁ దేనె లొలుకుముద్దుపలుకులతో వినువారి చెవులకుఁ జవులు గొలుపుచు హృదయంగమముగానున్నది. కవనభంగిని జూపుటకయి చంద్రహాసవిలాసములోని నాలుగుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. బంగరుమేడలం జలువసందిరులన్ నెలరాతిపిన్నెలన్
రంగగుమేలివిద్దియల రచ్చలపంతుల నాట్యశాలలన్
సింగపుమోము లొక్కయెడఁ జెక్కినచక్కనిగోపురంబులన్
బొంగుచు నప్పురీవరము పొల్పు వహించు ధరాతలంబునన్. పూర్వభా.

ఉ. తప్పక చూచు నుగ్గనుచు దాదులు పల్కినఁ గేరినవ్వు మా
యప్పుడొ నిద్ర పొమ్మనిన నల్లన బారలు చాఁచుఁ జేతులం
జప్పటిచేయఁ జేరి విను సారెకు నత్తయటంచుఁ బల్కు నా
యొప్పులబాలుఁ డంత ముద మొందుచుఁ దల్లియుఁ దండ్రి కన్గొనన్.
పూర్వ.

చ. కమలదళాక్షు నీవు ననుఁగానక తక్కిన నిప్పు డిందిరా
రమణికి విన్నవింతు ననురాగము తండ్రికిఁ గల్గకున్న చో
దమి నిజపుత్రులందు దయ తల్లికిఁ గల్గక పోవ దంతటం
గమల మదర్థమై కినుక గాంచును నీపయిఁ జాటిచెప్పితిన్ —పూర్వ.

ఉ. లేమలమోఁదిప్రేమ లవలేశము వీడవు దానధర్మముల్
నేనుముతో నొనర్వఁగను లెక్క యొనర్పవు శ్రీరమాధవున్
బ్రేమముతోఁ దలంపఁగను రేయిఁబగళ్ళను బూన వ్యూరకే
పామర మొందు చీ వితరపద్ధతి గోరెద వేమి కామమా.—ఉత్తరభా.

---

43. కంసాలిరుద్రయ్య

కృష్ణదేవరాయనికాలములోఁ గంసాలిభద్రయ్యయని యొకస్వర్ణ కారకవి యుండెననియు, అతఁడు రాయలయాస్థానమునందుండిన యష్ట దిగ్గజములలో నొకఁడనియు కొందఱు వ్రాసియున్నారు. అతఁడు సరస మనోరంజనమను ప్రబంధము రచియించెనని కొందఱు చెప్పుదురుగాని యాగ్రంథ మిప్పు డెక్కడను గానరాకున్నది. సరసజనమనోరంజనము లోనిదని బ్రౌన్‌దొరవారి ఛందస్సునం దీక్రిందిపద్య ముదాహరింపఁబడి యున్నది—

ఉ. ఎన్నఁడు నేరిచెన్ బెళుకు లీచెలికన్నులు, కారుకమ్ము ల
న్నన్న కురుల్, పిఱుందు బటువై పటువై ఖరి గై కొనెంగదే,

మొన్నఁగదమ్మ పిన్న మొనమొల్కలు నేఁ డివె ముద్దులాడిలేఁ
జన్నులు గొప్పలై పయిఁటసందున దాఁగుడుమూఁత లాడెడున్.

ఈపద్యమును రాయలవారియాస్థానములోఁ జదివినప్పుడు రామ కృష్ణకవి మొల్కయని ప్రయోగించినంను కాక్షేపించెననియు, అందు మీఁద నొకరు దానికి సమాధానముగా నీక్రిందిపద్యమును జెప్పిరనియు, బ్రౌన్ దొరవారు సంపాదించి చెన్నపురిరాజధానిలోని ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున కిచ్చిన చాటుపద్యమంజరిలో వ్రాయఁబడి యున్నది—

చ. వెలగకు వెల్ల యంచు సరవిఁ జలికొండ నృసింహుఁ డాడఁగా,
మొలకకు మొల్క యంచుఁ గవిముఖ్యుఁడు భద్రయపల్కదోసమా?
బళిబళి! మంచిమాటయె ప్రబంధమునా జలరాశి దానిలో
పల నెరసుల్లణింతురే యపారములౌ మణు లెల్ల నుండఁగన్?

చలికొండనృసింహుఁడు వెలగకు వెల్ల యనియు, అగసాల రుద్రయ యనునాతఁడు మొలకకు మొల్క యనియు, అప్రయోగములు చేసిరసి యప్పకవి చెప్పి యీపయిపద్యము నినకొండలో గుంటుపల్లె భాస్కరయ్యగారి సమ్ముఖమందుఁ గందుకూరి రుద్రయ్యగారు చెప్పినట్లీక్రిందిపద్యములలో వ్రాసియున్నాఁడు—

చ. కొలఁదిగ మున్ను చెప్పెఁ జలికొండ నృసింహుఁడు వెల్లయంచు నీ
వల నగసాల రుద్రపనువాఁడును మొల్క లటంచుఁ గూరిచెం
దెలియక కొంద టీట్లు వికృతిం బదమధ్యమునన్ లకార రే
ఫలతలపై యకారమును బాపుదు రార్యులు నవ్వునట్లుగన్.

వ. ఖిందులకు నినకొండలో గుంటుపల్లె భాస్కరయ్యగారి సమ్ముఖమందుఁ గందుకూరి రుద్రయ్యగారు చెప్పినపద్యము.

చ. వెలగకు వెల్ల యంచు సరవిం జలికొండ నృసింహుఁ డాడఁగా
మొలకకు మొల్క యంచుఁ గవిముఖ్యుఁ డురుద్రయ పల్క దోసమే?

ANDHRA MEMORIAL LIBRARY
R.NARA225
D.P.R.I.
No.

బళిబళి మంచిమాటయె ప్రబంధమునా జలరాశి యుదుల్లో పల నెరసు ల్గ్రహింతురె యపారములౌ మణు లెల్ల నుంధుగా.
అప్పకవీయము. పంచమాశ్వాసము-

దీనినిబట్టి చూడఁగా సరసమనోరంజనములోని దొన్నె మదు పద్యము భద్రయ చెప్పినదిగాక రుద్రయచెప్పినదనియు, అతఁడు కృష్ణ దేవరాయలకాలములోఁగాక గుంటుపల్లె భాస్కరునికాలములో నుండె ననియు స్పష్టబడుచున్నది. కాఁబట్టి కృష్ణదేవరాయనికాలములో భద్రయ్య యనుకవి యున్నాఁడో లేఁడో యనికూడ సంశయింపవలసి యున్నది. పయినిజెప్పిన లిఖితపుస్తకభాండాగారములోని చాటుపద్య ములలోనే సరసమనోరంజనములోని దయినట్లుగా నీక్రిందిపద్యముకూడ వ్రాయఁబడియున్నది—

సీ. కొప్పునఁ జుట్టినగొజ్జంగివిరిదండ నటనతో వీఁపున నాట్యమాడ,
బటువై నముత్యాలపాపట విరజాజితీరుగాఁ జెంపల దిమురుగట్ట,
ధగధగద్ధగలచేఁ దనరుకెంపునతాళి సరులత్రోఁ బెనఁగొని చొకళింప,
గబ్బిగుబ్బలమీఁది కస్తూరిచెమటల గరఁగివాసనలచేఁ గ్రమ్మ్మకొనఁగ.
వింతమాటల తేటల విభునిఁ గూడి
కాంత రతికేళి మిక్కిలి గారవింప
దప్పి తీఱంగ నధరామృతము లొసంగి
చంద్రబింబాస్య మగలాగు సలిపె నపుడు.

ఇతఁడు నిరంకుశోపాఖ్యాన మను నాలుగాశ్వాసముల ప్రబంధ మును సుగ్రీవవిజయమనుయక్షగానమును రచియించెను. ఈగ్రంథమును బట్టి చూడఁగాఁ గృష్ణదేవరాయనికాలములో భద్రయ్య యనుకవి లేఁ డనియు భద్రయ్య యనఁబడినకవి యప్పకవి చెప్పినట్లుగా గుంటుపల్లి భాస్కరునికాలలోనుండిన రుద్రయ్యయేయనియు స్పష్టపడుచున్నది. ఈగుంటుపల్లి భాస్కరుఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండిన

వాఁడు. సునందాపరిణయమునందు గుంటుపల్లి భాస్కరుఁ డిట్లు వర్ణింపఁబడి యున్నాఁడు.

సీ. స్థిరతరప్రజ్ఞావిశేషాతినిష్ఠాతిరస్కృతనిర్జరరాడ్గురుండు
అసదృశమంత్రయోగాతివశీకృతసన్మంత్రదేవతాసముదయుండు
నిరుపమశ్రుతిశూక్తినిర్ణీతసన్మార్గవర్ణోచితాచారవర్తనుండు
ఘనతరపాణినీగ్రంథార్థశోధనసందర్భసన్మనీషాన్వితుండు
సత్యభాషాహరిశ్చంద్రజనవిభుండు
సలలితౌదార్యనిర్జితజలధరుండు
ఎల్లమాంబాసతీప్రాణవల్లభుండు
గుంటుపల్లి భాస్కరుఁడు సత్కులవరుండు.

దీనినిబట్టి కంసాలిరుద్రయకవి కృష్ణదేవరాయనికాలములో లేక, ౧౬౨౦వ సంవత్సరప్రాంతములయం దుండినట్లు తేలుచున్నది. నిరం కుశోపాఖ్యానములోని,

శా. శ్రీభాషారమణావిమృష్టపదరాజీవోత్తమాంగాగ్రుఁ డా
ర్యాభామాపరిణీత సర్వజగదారాధ్యుండు మూర్తిత్రయీ
శోభాకందము కందుకూరినగరీసోమేశ్వరస్వామి లో
కాభీష్టంబు లొసంగుఁగాతఁ గరుణాయత్తైకచిత్తంబునన్.

ఈమొదటిపద్యమునుబట్టి కవి తనగ్రంథమును కందుకూరి సోమే శ్వరస్వామి కంకితముచేసినట్లు తెలిసికోవచ్చును. ఈకావ్యమును శివుని కంకితము చేసెదనని కవి యీక్రిందిపద్యములో మనోహరముగాఁ జెప్పి యున్నాఁడు—

ఉ. కోమలవర్ణధామయును గోవిదసంస్తవనీయలక్షణ
స్తోమపదాభిరామయును శుంభదలంకరణప్రసాధన
స్థేమయు నప్రతర్క్యగుణసీమయు నైనమదీయకావ్యక
న్యామణి నిచ్చి మంచుమలయల్లుని నల్లునిగా నొనర్చెదన్.

కవి కంసాలియగుటచే ననేకు లాక్షేపించుచువచ్చుటచేత గాఁ బోలు రుద్రయ్య తనకృతిలో నీపద్యమును వేసియున్నాఁడు—

ఉ. శుష్కవచశ్శిలాతతుల సూటిగఁ జూచి మహాకవిశ్రేవ
శ్నష్కళికావిదారణము సల్పఁగ నేర్చినజాణలార మీ
ముష్కరతానమున్నతికి మ్రొక్కెద నాయెఱఁ జూపరాకుఁడీ
దుష్కవులార సాధుజనదూషణభూషణభూషితాత్మలై.

ఈకవి స్వర్ణకారుఁడు; పెదలింగన్న పుత్రుఁడు. ఈకవిత్వము మృదుమధురపదభూష్టయిమై సలక్షణమయి వినువారివీనులకు విందు చేయునదిగా నున్నది. ఈతని కవిత్వరచనాకౌశలమును జూపుటకయి నిరంకుశోపాఖ్యానములోని కొన్నిపద్యముల నిందుఁ బొందుపఱచు చున్నాను—

ఉ. అడిగిన నేమి దోషమె సమస్తధరాతలనాథ కోరికల్
నుడువుల నున్నవే మనసులోపలఁగాక రతిప్రసంగముల్
తడవనియంతమాత్రనె విదారితమోహుఁడె యీవిచారముల్
విడువుము వాగ్విశేషమును విశ్రుతవేషను మోక్షహేతువే. ఆ. ౧.

ఉ. ఏమిజపంబు చేసి రొకొ యేమితపం బొనరించి రొక్కొ యే
మేమిసపర్య లార్యతతి కిచ్చిరొకో జగదేకపూజ్యలై
తామునఁ దనూజరత్నములుఁ దామరతంపరలై చెలంగువా
రీమహిఁ దొల్లి యంచు నుతియించి మహీసురుఁ డాత్మలోపలన్.

ఆ. ౧.

ఉ. అత్తవు సర్వలక్షణసమగ్రగుణాఢ్యవు నన్నుఁ దిట్టనున్
మొత్తనెకాని నీకొడుకుమూఢత మానుప వేల వాఁడు గో
త్రోత్తులమారియై గృహముఁ ద్రొక్కక యొక్కొకదానిఁ బూసికన్
గుత్తకు నంచు నుంచుకొని కోకలు రూకలు జోక నియ్యఁగన్.

ఆ. ౨.

మ. ధరణీనాథ దరిద్రతాపిశునవక్త్రుస్ఫూర్తి నాభారతీ
వరవంశోత్తమసూతి చింతిలఁగ నవ్వారాంగనామాత ని
ర్భరపాండిత్యముఁ జూపి దీనదశకున్ రాఁబోలు నీపాటి జే
పరమేశా యనిపించఁగావలదె విప్రస్వామి నంచు న్మదిన్. ఆ. 3.

ఉ. ఓడకు మోయి భూసురకులోత్తమ నెత్త మకారణంబ నే
నోడితి నీవు గెల్చితి సమున్నతి న న్నతిరోషవృత్తి నీ
వాడినయంతవట్టు సహజార్థమ యర్థమహాభిలాషుఁడై
యోడినఁ బన్నిదంబు పడకుండినఁ జండినకాఁ దలంపరే. ఆ. 3.

మ. అపరాధంబులు పెక్కుచేసితి మహాహంకారకామక్రియా
విపులాంభోనిధిఁ గ్రుంకువెట్టి జపతావేశంబున న్నిమ్మ ది
వ్యసభోద్వృత్తిని గొల్వ నైతిని మనోవాక్కాయకర్మంబుల
జపలాత్మ న్నను బ్రోవుమీ దయయకా సాక్షాత్కటాక్షేక్షణా.
ఆ. 3.

ఉ. ఎక్కడివాఁడవోయి యొకయింత యెఱుంగవు బుద్ధికౌశలం
బెక్కడి కేగె నాలుకపయి న్నువ్వుగింజయు నాననట్టిబల్
తక్కరినారదుం డతఁడు దైవతమార్గమునందు నేగఁగా
నక్కడ నన్నుఁ బోల్కనియె దాతఁడు విన్న ననర్థ మొందదే. ఆ. ర.

చ. నెఱయ విషాదహేతువుగ నీతెలిగన్నుల నశ్రుబిందువుల్
దొరుఁగు నెఱుంగ మెన్నఁడు కుతూహలకారణభావ్యజాలముల్
కురియు నెకాని నేఁడు కనుఁగొల్కులవెంబడి నశ్రుపూరముల్
వరదలుగట్ట నేడ్చెదవు వారిజలోచన యేర్పరింపవే. ఆ. ర.

సుగ్రీవవిజయములోని ఈకడపటిద్విపదమువలనఁ గవిసిగూర్చి
కొంత తెలియవచ్చును—

ద్వి. అని కందుకూరి జనార్దనుపేర

* * *

నంకితంబుగఁ గాళికాంబాప్రసాద
సంకల్పితకవిత్వచాతుర్యధుర్య
యావీరపెదలింగనార్యతనూజ
కోవిదస్తవనీయగుణ రుద్రధీర
విరచితసుగ్రీవ విజయాభిధాన
గరిమ భాసిలు యక్షగానప్రబంధ
మాచక్రవాళశైలావనియందు
నాచంద్రతారార్కమై యొప్పుఁగాత!

ఈగ్రంథము కవియొక్క ప్రథమకవిత్వ మగుటచే నంతరసవంత ముగా నుండకపోయినను, ఇందుండియు రెండుపద్యముల నుదాహరించు చున్నాను—

గీ. అనిన విని రాఘువేశ్వరుం డలరి నవ్వు
మొలక మొగమునఁ జిగు రొత్త నిలిచి పాద
వనరుహాంగుష్ఠమునఁ జిమ్మ దనుజవరుని
సముదితాంగంబు పదియోజనములు పడఁగ.

క. తారాదిసతులశోకము
వారిచి కుమారుఁ దేర్చి వాలికిఁ బరలో
కారోహణాదిసత్క్రియ
లారవితనయుండు రామునానతిఁ జేసెన్.

బకం

44. ఎలకూచి బాలసరస్వతి

ఈకవి పదునేడవశతాబ్దారంభమునం దుండి మహామహోపా
ధ్యాయబిరుదము నందినవాఁడయి పాండిత్యముచేత మిక్కిలి ప్రసిద్ధి
కెక్కినవాఁడు.

క. ఆలోకనుతుఁడు మొన్నటి
కీలకసమ నామతంగగిరికడ నొసఁగెన్
బాలసరస్వతులకు నతఁ
డోలఁ దెనుఁగుటీక దాని కొప్పుగఁ జేసెన్.

అని యప్పకవి చెప్పుటనుబట్టి యితఁ డాంధ్రశబ్దచింతామణికి
తెనుఁగుటీకను ౧౬౦౪వ సంవత్సరమునంను చేసినట్టు కనఁబడుచున్నది.
ఈకవి కట్టకడపట రచించిన రాఘవయాదవపాండవీయమునందు తాను
చేసినగ్రంథములనుగూర్చియు తన్నుఁగూర్చియు నిట్లు చెప్పుకొను
చున్నాఁడు.

సీ. కవిసమ్మోహితరంగ కౌముదీనామనాటకవిధానప్రతిష్ఠాఘనుండ
సారసారస్యసచ్చంద్రికాపరిణయప్రముఖశతాగ్రప్రబంధకర్త
సంధ్రచింతామణివ్యాఖ్యానభాషావివరణాదిబహుతంత్రకరణచణుఁడ
వేదశాస్త్రపురాణవివిధసంగీతసాహిత్యాదివిద్యోపబృంహణుండ
ననఘకౌండిన్యగోత్రుఁడ హరిపదాబ్జ
భక్తశీలుఁడ నెలకూచి భైరవార్య
కృష్ణదేవతనూజుఁడ నేవిచిత్ర
కావ్య మొక్కటి నిర్మింపఁగాఁ దొడంగ.

శా. మెండై నట్టి విచిత్రవైఖరులచే మీఁదౌమహాకావ్యముల్
దండిం దొల్లియె చేసి రాదిములు తత్కావ్యాధికశ్లాఘుమై

నుండ ప్రాఘువకృష్ణపాండవకథాయుక్తప్రబంధంబు వా
క్పాండిత్యం బలరార శ్లేషరచనైకప్రౌఢి నేఁ జేసెదన్.

ఇతఁడు రచియించిన యీరాఘువయాదవపాండవీయము మూడర్థ
ములు గలది. ఇట్లు త్ర్యర్థికావ్యములను రచియించినవారిలో నితఁడే
మొదటివాఁడు. పూర్వోదాహృతమయినసీసపద్యమువలన నితఁడు రంగ
కౌముదియనునాటకమును, చంద్రికాపరిణయమను ప్రబంధమును, ఆంధ్ర
శబ్దచింతామణివ్యాఖ్యానము, భాషావివరణము నను లక్షణగ్రంథములను
రాఘువయాదవపాండవీయ మనుత్ర్యర్థికావ్యమును రచియించినట్లు కన
బడుచున్నది. ఇతఁ డాంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానమునూత్రమే
చేసినట్లు పయిపద్యమునఁ జెప్పబడినను మూలగ్రంథమునుగూడ నితఁడే
చేసి గౌరవముకలుగుటకయి దానికర్తృత్వమును నన్నయభట్టున కారో
పణచేసినట్లనేక హేతువులచేత నిశ్చయింపఁ దగియున్నది. ఈవిషయ
మునుగూర్చి నన్నయభట్టారకునిచరిత్రమునంచుఁ గొంత వివరముగా
వ్రాసియున్నాను. నన్నయిభట్టునకు శబ్దశాసనుఁ డన్నబిరు దీశబ్దశాస్త్ర
నిర్మాణముచేతఁ గలిగినదని కొందఱు భ్రమపడుచున్నారుగాని యది సరి
కాదు. నన్నయభట్టారకుఁడు మొట్టమొదట లక్షణప్రాయమైన సకా
ర్యమును రచియించి యితరకవులకు కావ్యరచనకు దారిచూపుటచేత
నాతనికి వాగనుశాసనుఁ డన్నబిరుదము వచ్చినదేకాని వ్యాకరణనిర్మా
ణముచేత రాలేదు.

"భట్టార బాలసరస్వతికవి మహోపాధ్యాయుఁడు" తానురచియిం
చిన చంద్రికాపరిణయమును పత్రికాల జమీన్‌దారుఁడగు జూపల్లి
వేంకటాద్రి కంకితముచేసెను. ఈపత్రికాల బెజవాడకు రెండామడల
దూరమున నిజామురాష్ట్రములో నున్నది. ఈకవిని కాకునూర్యప్పకవి
చూచియుండవచ్చును. చంద్రికాపరిణయము కృతినాయకునితండ్రి.

జూపల్లి లింగన్న. ఈలింగన్నను రంగరాజు లింగన్నగూఢముగాఁ దిట్టిన యీక్రిందిచాటుపద్యము నప్పకవి యుదాహరించియున్నాఁడు—

క. రవికోటిధామమయ్యమై
నవకాంచనయుతము నగుచు నానాఁటి కొగిన్
భువిని శివాన్విత మగు నీ
భవనము జూపల్లి లింగ భవగుణసంగా.

చంద్రికాపరిణయమునందు కాశిరాజుకూఁతురైన చంద్రికను భీముఁడు వివాహమాడినకథ వర్ణింపఁబడినది. ఇతఁడు పదునేడవశతాబ్దారంభమునుండి ౧౬౩౦-౪౦ సంవత్సరములవఱకును పండితకవిగా పేరుపడియుండవచ్చును. ఈతని రెండు తెలుఁగుకావ్యములనుండియు రెండేసిపద్యముల నిం దుదాహరించుచున్నాను.

చంద్రికాపరిణయము

ఉ. జంగమరోహణాద్రిసదృశంబులు తత్పురిఁ గల్గుభద్రపా
రంగవరేణ్యము ల్వయికి హస్తము లించుకసాఁచి యన్వియ
ద్గాంగరయురంబు పీల్చి మరి తద్వసుధూప్రకరంబు దప్పిపా
యంగ నొసంగు రంగుగ నిజాఖ్యవహించినచాతకాలికిన్.

ఉ. అంతట రుక్మబాహువసుధాధిపనందన యొక్కనాఁడు శు
ద్ధాంతగృహంబు వెల్వడి విహారగతిం జనుదెంచె నెచ్చెలుల్
చెంతలఁ గొల్వఁ జంచదళిశింజితరంజితకుంజమంజుల
ప్రాంతగిళత్ఫలానవరతాంగజఘోటికిఁ బుష్పవాటికిన్.

రాఘవ యాదవ పాండవీయము

ఉ. బోరన సద్దునంగడచి పో నెడయీక చరించుమంచు న
వ్వారిధిగాఁ దలంచి పురివాడలకుం దిగఁబోలు గేహసం
స్కారకధూపధూమమమిషంబున మబ్బు దివాంతవేళల
న్వారవధూటు లందుఁ గలవాలు మెఱుంగులువో గణింపఁగన్.

ఉ. పాయక భ్రాతృయుక్తుఁడయి భవ్యసుఖంబులు గాంచుచు నగ
ద్దేయయశుం డతండు పరఁగె న్మహిఁ దైవతపూజలం బితృ
వ్యాయతతర్పణక్రియల నంచితధర్మము విస్తరిల్లఁగాఁ
జేయుచు భూరినిష్ఠ మహిషీయుతుఁడై మమఖాళి సల్పుచున్.

---

45. ముద్దరాజు రామన్న

ఇతఁడు కవిసంజీవని యనులక్షణగ్రంథమును రచించెను; మఱియు నితఁడు రాఘవపాండవీయమునకు వ్యాఖ్యానమునుగూడఁ జేసెను. ఇతఁడు నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు; గణపయామాత్యుని కుమారుఁడు. ఇతఁడు పదునాఱవశతాబ్దాంతమునం దున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈకవి "శ్రీమన్మదనగోపాలకృపాకటాక్ష సంప్రాప్తసారసారస్వత సంపదానంద" యని గద్యమునందు వ్రాసికొన్నను లక్షణగ్రంథమును బట్టి కవిత్వపటుత్వనిర్ణయము చేయబూనుఁట యుచితముకాదు. ఇతఁడించుమించుగా లింగమగుంట తిమ్మకవితోడి సమకాలికుఁ డగుటచే నీకవిలోకసంజీవనినుండి యతఁడు తనసులక్షణసారములో నేమియుఁ గైకొనలేదు.

---

46. చిత్రకవి అనంతకవి

ఇతఁ డాఱువేలనియోగి. రామరాజభూషణుఁ డొనర్చిన హరిశ్చంద్రనలోపాఖ్యానమునకు వ్యాఖ్యానము చేయుటయేకాక యీకవి యిందుమతీపరిణయ మనుప్రబంధమును రచించెను. ఇతఁడు ౧౬౨౦వ సంవత్సరప్రాంతములందు కవిగాఁ బ్రసిద్ధికెక్కినాఁడు. ఇతఁడు చిత్రకవి పెద్దనార్యునిపుత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈకవి తన్నుగూర్చి తన హరిశ్చంద్రనలోపాఖ్యానములో నిట్లు చెప్పుకొన్నాఁడు.

సీ. శ్రీహనుమద్వర శ్రీలబ్ధసుకవిత్వచతురుండ లక్షణసారసంగ్ర
హం బొనరించి యుద్యత్కీర్తి బ్రఖ్యాతుఁ డగుచిత్రకవి పెద్దనార్య
సుతుఁడ
విష్ణుచిత్తీయాదివివిధకావ్యార్థముల్ తెలిసి వక్ర్తాణించుధీరసుతుఁడ
గండికోటాఖ్యదుర్గస్థలాద్యక్షుఁడై పృథివి వంతుకు నెక్క పెమ్మసాని
చిన్నతిమ్మక్షమాపాలశేఖరుండు
గారవింపఁగ బహుమానగౌరవముగ
మనినధన్యుండ సభ్యసమ్మతగుణైక
గరిమ వెలయు ననంతాఖ్య కవివరుండ.

ఈవ్యాఖ్యానమును చేయునప్పటికిఁ గవి యిందుమతీపరిణయ మును జేయలేదు. ఇతఁడు చేసిన యిందుమతీపరిణయము నాకు లభించి నదికాదు. కవికాశ్రయుఁడైన పెమ్మసాని చినతిమ్మరాజుయొక్కయన్న పెదతిమ్మరాజు ౧౬౧౭వ సంవత్సరమువఱకును రాజ్యముచేసిన వేంకట పతిరాయనికి మంత్రిగా నుండెను.

47. లింగముగుంట రామకవి

ఈకవి చతుర్వాటికామాహాత్మ్య మను నైదాశ్వాసములస్థల పురాణమును రచియించెను. ఇతఁడు మత్స్యపురాణము వామనపురా ణము మొదలయిన గ్రంథములను రచియించిన ట్లీతని తమ్ముఁడైన లింగ ముగుంట తిమ్మకవి తనసులక్షణసారమందు వ్రాసెను గాని యాగ్రంథ ములు నాకు లభింపలేదు. ఈకవి తెనాలిరామకృష్ణునితోడి సమకాలి కుఁడు. రామకృష్ణుని గురువైన భట్టరు చిక్కాచార్యులు తనకు గురు వైనట్లు కవి యీపద్యమున వ్రాసికొని యున్నాఁడు—

క. గురురాయపట్టభద్రుని
నరిహరు శ్రీరంగనాయకాంశభవున్ భ
ట్టరు చిక్కాచార్యుని మ
ద్గురుఁ దలఁచుచు నడుగులకు నతు ల్గావింతున్.

ఇతఁడు ౧౬౨౦ - 30 సంవత్సరప్రాంతములయం దుండినవాఁడు.

ఈరామకవి తన చతుర్వాటికా మహాత్మ్యములో,

సీ. శ్రీవల్లభోపేంద్రదేవేంద్రజనకకశ్యపఋషిగోత్రాబ్ధిచంద్రుఁ డగుచు
వృద్ధకుండికపొంత వెలయులింగముగుంట నేకభోగముగాఁగ నేలినట్టి
చెన్నయామాత్యుని శ్రీరామమంత్రినందనుఁ డన్నపకును దద్ధర్మపత్ని
కమ్మలమ్మకు సుతుఁడనుసంభవుండుతిమ్మనకుగాదనకుఁగస్వనకుఁ బెద్ద
భవ్యభాగీరథీసతీప్రాణవిభుఁడు
ఘనులు బస్వన రామ లక్ష్మణులతండ్రి
మహితవిద్యుండు మత్పితామహుఁడు నైన
సర్వకవిసార్వభౌముని సన్నుతింతు.

తనపితామహుఁడును గవి యైనట్లు స్తుతించి యున్నాఁడు. ఇతఁడు యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; లక్ష్మయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వము నిర్దుష్టమయి రసవంతముగా నున్నది. చతుర్వాటికామాహాత్మ్యములోని కొన్ని పద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చీటికిమాటికిన్ సకలసీమలఁ గ్రుమ్మరుచున్ శ్రమంబునన్
బాటిల నేల దర్శనవిపాటితకల్మషకోటికిం జతు
ర్వాటికి నేగి రామున కవశ్యము మ్రొక్కుచు ముక్తికామినిన్
జేటికఁజేయగా వలదె సిద్ధమనోరథుఁడై నరుం డిలన్. ఆ. ౧.

మ. తలఁపం బూర్వభవంబునం దెచట నేదానంబు లీఁగంటినో
విలసద్భావులు దానపాత్రులు మహావిద్యానిధుల్ మీరు ముం

గలి కేతెంచితి రీప్సితార్థములు వీఁక నీ కిచ్చి నర్పించి మీ
వలన్ దీవన లందినన్ భువనము ల్వర్ణింపవే కావునన్. ఆ. ఏ.

శా. ఉద్వేలప్రళయాబ్ధిలో యనఁగ నత్యుద్రేకమానంబులై
విద్వద్వార్యునిఁ గుంభసంభవు మహావిర్భావధైర్యున్ మనం
బుద్విగ్నంబుగఁ బట్టి కట్టుటకు నిట్లొక్కమ్మడిన్ డాయ భా
స్వద్విఖ్యాతుల నాత్మసైన్యముల హస్తం బెత్తి మాన్చెన్వడిన్. ఆ-3

చ. ఇవిరేఁ గొలంకు లాపగలు నింకుచుఁ గాల్నడ లయ్యె వేండ్రమై
పవనము వీచె భూజములపత్రము లన్నియు నూడె జీవజం
తువులు తపించె లోకులకుఁ దోఁచె విదాహము లక్కడక్కడ
దవము జనించె శైలములఁ దాసె తనంతట మండువేసవిన్. ఆ. ర.

చ. వరద శరణ్య నీవు వనవాసము చేయుచు నేగుదెంచి నా
చరణము లంటి మ్రొక్కినఁ బ్రసన్నతఁ గైకొని ధన్య నిన్ను భూ
వరుఁ డని యుంటిఁగాని పరవస్తు వటంచు నెఱుంగనైతి నా
యెఱుఁగమి సైఁపవే తెలియనెవ్వఁడ నీఘునమాయ నచ్యుతా. ఆ. ౫.

---

48. లింగమగుంట తిమ్మన్న

ఈకవి సులక్షణసార మనుగ్రంథమును రచియించెను. ఇతఁడు యాజ్ఞవల్క్యబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; లక్ష్మన్నయ్యకును తిమ్మాంబకును పుత్రుఁడు. ఈకవి యించుమించుగా తెనాలిరామకృష్ణ కవితో సమకాలికుఁడు. ఇతఁడు తనకు భట్టరు చిక్కాచార్యుఁడు గురు వైన ట్లీక్రిందిపద్యమున వ్రాసికొని యున్నాఁడు—

సీ. శ్రీవైష్ణవహితుండఁ జిక్కయభట్టరుశిష్యుఁడఁ గవితావిశేష శేష
తులితసర్వార్యపౌత్రుఁడ లక్ష్మణయకుఁ దిమ్మాంబకుఁ సుతుఁడఁ
బెద్దనకు మార

నకు రామకవివరునకు ననుజన్ముఁడ నారామకవి చెప్పినట్టిమహిత
మత్స్యపురాణ వామనపురాణాది సత్క-వితలకెల్ల లేఖకుఁడ వృద్ధ
కుండికాతీరలింగమకుంటనామ
పట్టణస్థితికుఁడ సౌభాగ్యయుతుఁడ
నాదిశాఖాప్రవర్తన నమరువాఁడఁ
గాశ్యపసగోత్రుఁడను దిమ్మకవిని నేను.

ఇందుఁ జెప్పఁబడిన భట్టరు చిక్కాచార్యులే తనకు గురువై నట్లు తెనాలి రామకృష్ణకవియు పాండురంగమహాత్మ్యమున నీక్రిందిపద్యమునఁ జెప్పికొని యున్నాఁడు—

క. వాక్కాంతాశ్రయభట్టరు । చిక్కాచార్యులమహాత్ముశ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద । నిక్కావ్యకళాకలాప మీఁడేఱుటకున్.

రామకృష్ణునితోడి సమకాలీనుఁడగుటచేత లింగమగుంట తిమ్మకవి ౧౬-౨౦ వ సంవత్సర ప్రాంతములం దున్నవాఁడు. ఇతఁడు వృద్ధదశలో కాకునూరి యప్పకవికాలములో సహిత ముండియుండవచ్చును. ఇతఁడు బహులక్ష్యలక్షణగ్రంథములను శోధించినవాఁడు. అప్పకవి యుదాహరించిన పెక్కు పద్యము లీసులక్షణసారమునందును గానఁబడు చున్నవి. "గడియలోపల మూడుకండ్లికలై ప్రాడు ధరఁ గూలఁదిట్టి మేధావిభట్టు" ఇత్యాదిసీసపద్యములను దానిక్రింద నప్పకవీయములో నుదాహరింపఁబడిన "సాళువ పెదతిమ్మమహీపాలుఁ" డిత్యాది సమస్త పద్యములును సులక్షణసారమునందుఁ గానవచ్చుటయేకాక శరభాంకుఁడు పద్యము మొదల చకారమును, ౬వ చోట హకారమును, ౧౧వ చోట కకారమునుంచి ఢిల్లీపట్టణమును దిట్టిన చాటుధారయని యీక్రిందిపద్య మొకటి యధికముగా నుదాహరింపఁబడి యున్నది—

ఉ. చాపముగా నహార్యమును జక్రిని బాణముగాఁగ నారిగాఁ
బాపదొరం బొనర్చి తలఁపం ద్రిపురంబులఁ గాల్పవే మహో

ద్దీపితతీవ్రకోపమున దేవత లెల్ల నుతింప నాఁటివిల్
పాపపుఢిల్లి మీఁదఁ దెగఁ బాపఁగడే శరభాంకలింగమా.

తిమ్మకవి సులక్షణసారమునఁ దన్నుఁ గూర్చియుఁ డనప్రజ్ఞాది కమునుగూర్చియు నిట్లు చెప్పుచున్నాఁడు—

క. లక్షణశాస్త్రము లెల్లఁ బరీక్షించుటఁ గొంతకొంత యెటిఁగినవాఁడన్
లాక్షణికానుగ్రహత సు । లక్షణసారం బొనర్తు లక్ష్యము లమరన్.

గీ. గొంద లెంచులక్షణమును గొంద లెంచ
రందఱును నెంచినవికొన్ని యవియు నసియు
దొరయఁగాఁ గూర్చి కవిసమ్మతులను వ్రాయు
దొకటి కొకటికి సంస్కృతాంధ్రోక్తు లెనయ.

గీ. గ్రంథసామగ్రి గలుగుటఁ బ్రతిపదమున
కన్నిలక్షణములువ్రాయు దనిన నంచు
గ్రంథవిస్తార మగుఁగాన నఁ గవితసూత్ర
మెన్నిటను జేలిపడు నన్ని విన్నవింతు.

ఈకవియన్నయయిన రామకవిచేసిన మత్స్యావామనపురాణములు నాకు లభింపలేదు. ఈకవిచే నుదాహరింపఁబడిన శూద్రకరాజచరిత్రము, అనిరుద్ధచరిత్రము, ఆదినారాయణచరిత్రము మొదలయిన తెలుఁగుకావ్యములుసహిత మిప్పుడు కొన్నిగానరావు. ఇప్పుడు ముద్రితమైయున్న సులక్షణసారమునకును నాయొద్దనున్న యముద్రితపు స్తకమునకునుమిక్కిలి వ్యత్యాసము కనఁబడుచున్నది. కవిసర్వగారుడము, శ్రీధరఛందస్సు, కవిగజాంకుశము, వాదాంగదచూడామణి, ఆంధ్రశబ్దచింతామణి, సర్వలక్షణశిరోమణి, సర్వలక్షణసారసంగ్రహము, గోకర్ణఛందస్సు, ఉత్తమగండఛందస్సు. భీమనఛందస్సు, అథర్వణఛందస్సు, అనంతఛందస్సు, కావ్యచింతామణి, కావ్యాలంకారచూడామణి, ఛందోదర్పణము, ఆంధ్రభాషాభూషణము అను తెనుఁగులక్షణగ్రంథములనుండి యీసుల

క్షణసారమునం దనేకలక్షణములు చేకొనఁబడినవి. కవిత్వరీతిని జూపుట కయి లక్షణగ్రంథములనుండి పద్యములను జేకొనుట న్యాయము కాక పోయినను సులక్షణసారమునుండి రెండుపద్యముల నిం దుదాహరించు చున్నాను—

మ. వినుమీరీతియటంచుఁ గావ్యకరుఁడై వెల్లంకి తాతప్ప చె
ప్పినసూత్రంబులు కల్లగాఁ గనఁబడెఁ వీటింప నెట్లన్నచో
మునుదీర్ఘంబులపై అకారములకే పూర్ణసితప్రజ్ఞ గా
దనియెఁ లింగమగుంట తిమ్మకవి నేఁ దర్కింతు నిప్పట్టునన్.

చ. అనుచు నదేమొకో మును రయంబున లక్షణసారసంగ్రహం
బెనయ వచించెఁ జిత్రకవిపెద్దన లెస్సవుపోఁడు వోడ్డ శ
బ్దనయతగానరో వినరొ దద్దను లెంతయు ధన్య లయ్యు మే
ల్గన భ్రమ గాంతు రాత్మల నొకానొకచోటఁ బరాకు గ్రమ్మఁగన్

---

49. వెలగపూడి వెంగనార్యుఁడు

ఇతఁడు శ్రీలీలాశుకయోగివిరచితమైన కృష్ణకర్ణామృతమును మూడాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; పెద్దనామాత్యునిపుత్రుఁడు. ఇతఁడేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదుగాని యీతని కృష్ణకర్ణామృతములోని పద్యమొకటి సులక్షణసారమునం దుదాహరింపఁబడి యుండుటచేత నితఁడు ౧౬౩౦వ సంవత్సరమునకుఁ బూర్వమునం దుండెనని మాత్రము తెలియును. ఈతనికవిత్వము నిర్దుష్టమయి శ్రావ్యముగా నున్నది. కృష్ణకర్ణామృతములోని పద్యముల మూటి నిందుఁ జూపు చున్నాను—

శా. బాలు న్మంజులతాలవాలచపలాపాంగోల్ల సల్లీలునిం
గాళిందీపులినాంగణప్రణయశృంగారై కఖేలున్ శుభ
శ్రీలోలుం గరుణావలోకనసుధాశీలున్ విసీలప్రభా
జాలుం గొల్చెద రామణీయకరసస్వారాజ్యపాలు న్మదిన్. ఆ. ౧.

చ. ఉదరము నింపఁగోరి ఖలు లుండెడితావులు చేరి వారిక
ట్టెమట నశేంక నిన్ను నటియింపఁగఁజేసినపాతకంబులన్
సదయత నోర్వఁగావలెఁ బ్రసన్నమతిన్ ననుఁగన్నతల్లి శా
రద యదువంశనాయకుసి ప్రస్తుతి నిష్కృతి నే నొనర్చెదన్. ఆ. ౨

ఉ. చల్లనివాని నవ్వు వెదజల్లెడువాసి దయారసంబు జొ
బ్బిల్లెడువానిఁ గెంపుజిగిపెంపు చెలంగెడుమోవివానిఁ సం
ఫుల్ల సరోజనేత్రములఁ బొల్చినవానిఁ బయోధివీచికా
వేల్లి తనీలసీరదనపీనతనుద్యుతివానిఁ గాంచెదన్.—ఆ. 3.

---

50. రెంటూరి రంగరాజు

ఇతఁడు భానుమతీపరిణయమను నాలుగాశ్వాసములప్రబంధమును రచియించి వేంకటగిరిప్రభువగు వెలుగోటి రామభూపాలున కంకితము చేసెను. ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; చినగంగనామాత్యపుత్రుఁడు. కృతిపతి తన్నుఁగూర్చి పలికినట్లుగా కవి తనశక్తిసామర్థ్యాదులను భానుమతీపరిణయమునం దిట్లు తెలుపుకొని యున్నాఁడు—

సీ. వ్యస్తాక్షరీధుర్యవిస్తీర్ణభావంబు క్రముకసంఖ్యాఖ్యానకౌశలంబు
నారోహణావరోహణలేఖనప్రౌఢి యగ్రపద్యగ్రహణాభిరక్తి
యనవలోకితశారికాభిఖేలనరీతి వరసమస్యాపూర్తివైభవంబు
సముదగ్రవీక్షితచతురంగబలకేళికావిలాసము నేకకాలమునన

యలరఁ బ్రకటింపనేర్చు వష్టావధాన । కలితశత లేఖనీపద్యగద్యశక్తి
సాటివిమోటితి వాంధ్రకర్ణాటచోళ।రాజసభలను రెంటూరి రంగనార్య.
గోలకొండ మహమ్మదీయులను, కొండవీడు వినుకొండప్రభువులను
జయించి ౧౫౯౮వ సంవత్సరమునందు విజయనగరరాజులపక్షమునఁ
బోరాడి విపక్షరాజబృందము నోడించిన కస్తురి రంగనాయనికిఁ గృతిపతి
యైనరాయభూపతి పెదతండ్రిమనుమఁడు. భానుమతీపరిణయము కృతి
నందునప్పటికి రాయన్నపాలునికి యుక్తవయస్సువచ్చిన కొడుకు
లుండుటచేత గ్రంథరచనచేసినకాలము ౧౬౨౦వ సంవత్సరప్రాంతమని
చెప్పవచ్చును.

చ. అనుపమభద్రలీల వెలమాన్వయవార్ధిఁ బ్రతాపలక్ష్మితో
నెనసినరాయశౌరి జగదేకవదాన్యశిఖామతంస మా
ననుచు నుతించుటేమియరు దావిభుఁ డిచ్చినభూరిసంపదఁ
ధనములు రాజులున్ ఘనులుఁ దా రగుచు న్నిఖిలార్థు లుండఁగఁ.

ఇత్యాదిపద్యములతోఁ గవి కృతిపతిని బహువిధముల వర్ణించి
యున్నాఁడు. ఈతని కవనము ద్రాక్షాపాకమయి మనోహరముగా
నున్నది. నైలిసి జూపుటకయి భానుమతీపరిణయములోని కొన్నిపద్య
ముల నిందుఁ జూపుచున్నాను.

ఉ. తీరినజాతినీలములతిన్నెలపైఁ బ్రతిబింబితంబులౌ
తారకసౌధమా కికవితానము లొప్పుగఁ జూచి బాలికల్
చారుమృగీమదం బలఁది చక్కనికప్రపుముద్దలిప్పి డి
చ్చో రచియించినామనుచు సూటిగ నాత్మఁ దలంతు రప్పురిన్. ఆ.౧

చ. సుమముల వ్రాలివ్రాలి పరిశుద్ధవసంతకళా ప్రమత్తరం
గములను జేలితేలి యతికాంతసుధామధురోల్లసన్మరం
దము చవి గ్రోలిగ్రోలి నవదక్షిణగంధవహానుకూలసం
భ్రమమున సోలిసోలి మదబంభరము ల్విహరించు వామనిన్. ఆ.౭

చ. అలరెఁ జకోరముల్ ప్రియుతరాబ్జముఖీమణిదృక్చకోరముల్
కలఁగె సరోజముల్. మదనకంపితపాంథమనస్సరోజముల్
తొలఁగెను భీతిఁ జక్రములు ధూర్తగుణోజ్జ్వలజారచక్రముల్
నలినవిరోధినూత్నకిరణంబులు కొన్ని దినం దలిర్పఁగన్. ఆ. 3.

చ. అతిముద మొప్ప ధర్మతనయాదులు చూచిరి కేకికోకిల
ప్రతతివతంసహంసమదబంభరడింభరథాంగనాదమం
డితబహుగంధబంధురపటీరతటీరమమాణగోపికా
ధృతమణిదీపికానికరతేజము రైవతకాద్రిరాజమున్. ఆ. ర.

---

51. సింహాద్రి వేంకటాచార్యుడు

ఈకవి లక్షణావివాహమనునామాంతరముగల చమత్కారమంజరిని రచించెను. చమత్కారమంజరి నూఢాశ్వాసములప్రబంధము. ఈకవి శ్రీవైష్ణవుఁడు; చెన్నకేశవాచార్యులపౌత్రుఁడు; తిరుమలాచార్యులపుత్రుఁడు; గౌతమగోత్రుఁడు. "భద్రాచలస్వామి రామచంద్రుఁ డొనర నాడెందమున నిండియుండుఁగాత" అని భద్రాచలరామస్వామి నిష్టదైవతముగా స్తుతియించి యుండుటచేత కవి గోదావరిమండలము లోని వాఁడని తోఁచుచున్నది. ఇతఁడు తనగ్రంథమును వైష్ణవమత్రో ద్ధారకుఁడైన రామానుజాచార్యున కంకితము చేసెను. అప్పకవికిఁ బూర్వికులయిన లాక్షణికు లెవ్వరు నీతనిగ్రంథమును వేరొకనకపోవుట నితఁడు గి॥30-రం వ సంవత్సరప్రాంతములయుండుండెనని యూహింపఁ దగియున్నది. అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను, ఈతని కవిత్వము మొత్తముమీఁద ప్రౌఢముగానే యున్నది. చమత్కారమం జరినుండి రెండు మూడు పద్యముల నిందుదాహరించుచున్నాను—

గీ. అరుణపల్లవములఁబోలు నాపదంబు
లాపదంబులఁ బోలును నలకజాత
మలకజాతముఁబోలు నిత్యముఖలీల
నిత్యముఖలీలఁబోలు ననెలఁతనడుము.

మ. బిగువుంగుబ్బలు గాంచి మానను నలజంబీరంబు బీరంబు క్రొం
జిగిమోము ల్గని సిగ్గున న్వాదలు రాజీవంబు జీవంబు విం
తగ భ్రూరేఖలుచూచి భీతి నిడుఁ గోదండంబు దండంబు త
జ్జగతీమోహనమ్రోల నున్న చెలులం జర్చింపఁగా శక్యమే. ఆ. వె.

శా. జోక న్వీడొక్కని చుక్కరేఁగెను జుమీ శుభ్రాంశుబింబప్రభో
ల్లేకంబు ల్తటిగెం జుమీ కడకువచ్చెం జుమ్మి యీరేము చిం
తాకాలుష్యము లేల బాల మదిలో ధైర్యం బవార్యంబుగాఁ
గోకోయన్గతిఁ గుక్కుటంబు లఱచెం గోకోవిరావార్భటిన్. ఆ. 3.

---

52. చేమకూర వేంకటకవి

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు. లక్ష్మణామాత్యుని తనూభవుఁడు. ఈకవి సారంగధరచరిత్రము, విజయవిలాసము అను పద్యకావ్యములను జేసి తంజాపురీవల్లభుఁడైన రఘునాథరాజున కంకితము చేసెను. విజయ విలాసమునకు సుభద్రాపరిణయమని నామాంతరము గలదు. కృష్ణదేవ రాయ లించుమించుగా దక్షిణహిందూదేశమునంతను జయించిన కథ నీవఱకే మాచదువరులు తెలిసికొని యున్నారు. ఆరాయల యనంతర మున తంజావూరు, మధుర, మొదలయిన ద్రావిడరాజ్యములు పాలిం చుటకయి తెలుఁగునాయకులు నియమింపఁబడిరి. తంజాపురిరాజ్యము నకు చెవ్వరాజు పాలకుఁడుగా నియమింపఁబడెను.

గీ. తీవి నచ్యుతరాయలదేవియైన
తిరుమలాంబకుఁ జెలియలై తేజరిల్లు

మూర్తిమాంబను బెండ్లియై కీర్తి వెలసెఁ
జెవ్వవిభుఁడు మహోన్నతశ్రీ చెలంగ.

అను విజయవిలాసములోని పద్యమునుబట్టి యీ చెవ్వరాజు విజయనగరాధీశ్వరుఁడైన యచ్యుతదేవరాయనికిఁ దోడియల్లుఁ డయినట్లు కనఁబడుచున్నాఁడు. అయినను వేంకటకవి చెవ్వరాజు మనుమఁడైనకృతిపతి యగు రఘునాథరాజు నాశీర్వదించుచు,

మ. ప్రకటశ్రీహరియంఘ్రిఁ బుట్టి, హరుమూర్ధం బెక్కి యింపార మ
స్తకముం బేరొక్కన నెక్కుడేవి సహజోదంచత్కలోత్పన్న నా
యకరత్నం బని యచ్యుతేంద్రరఘునాథాధీశ్వరస్వామికిఁ
సకలైశ్వర్యములు న్నిజేశువలనం దాఁ గల్గఁగాఁ జేయుతఁ.

శూద్రుఁగా వర్ణించినందున శూద్రకులసంజాతుఁడగు చెవ్వరాజునకును క్షత్రియవంశ జాతుఁడగు నచ్యుతదేవరాయనికిని బంధుత్వముండునా యని సందేహము త్రోచుచున్నది. మొట్టమొదట కృష్ణదేవరాయలే యుత్తమక్షత్రియుఁడు గాక దాసీపుత్రుఁడయినట్లు వాడిక గలిగియున్నదిగదా! క్షత్రియుఁడైన నరసింహరాజునకు దాసియు శూద్రయు నగు నాగాంబకుబుట్టిన కృష్ణదేవరాయనికి మొట్టమొదట క్షత్రియులెవ్వరును గన్య నియ్యనందున, అతఁడు శూద్రజాతి స్త్రీని గాంధర్వవిధిచే వివాహమాడి యచ్యుతదేవరాయని పుత్రునిగాఁ బడసి యుండవచ్చును. అంచుచేత నాయచ్యుతదేవరాయఁడు శూద్రకన్యనే పెండ్లిచేసికొనియు నుండవచ్చును. పెక్క శాసనములలో నచ్యుతదేవరాయఁడు కృష్ణదేవరాయనికి కుమారుఁడైనట్లు చెప్పఁబడినను, శాలివాహనశకము 1529 హేవిళంబి సంవత్సరమున నచ్యుతదేవరాయలొక బ్రాహ్మణునకి నారాయణపురము నగ్రహారమునుగా నిచ్చిన దాన శాసనములో,

శ్లో. తిప్పాజీ నాగలాదేవ్యో కౌసల్యాశ్రీసుమిత్రయోఃఁ

జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ మహీపతిః
అస్మాదోబాంబికాదేవ్యా మచ్యుతేంద్రోపి భూపతి.

అను శ్లోకములయందు నరసింహరాజునకు తిప్పాంబయందు వీర నృసింహరాయుఁడును, నాగలాంబయందు కృష్ణదేవరాయుఁడును, ఓబాంబయం దచ్యుతదేవరాయుఁడును కలిగినట్లు చెప్పఁబడి కృష్ణదేవరాయని కతఁడు తమ్ముఁ డయినట్లు చెప్పఁబడియున్నది. ఈబంధుత్వ మింకను విచారణీయము. ఒకవేళ బయిశ్లోకములలోఁ జెప్పఁబడినదే నిజమయి నను, నాగమ్మవలెనే యోబమ్మయు శూద్రజాతయైన భోగభార్యయై యుండవచ్చును. ఈవిచారము నటుండనిచ్చి యికఁ గథాంశమునకు వత్తము.

క. ఆమాత్యాంబకు నఖిల మ
హీమండలవిస్తుతుఁ డచ్యుతేంద్రుఁడు సుగణో
ద్దాముఁడు జనియించెను ద
ద్భూమీపతి రంగధామపూజన్మించెన్.

* * * *

క. ఆపుణ్యఫలంబునఁ ద
ద్వాపాథోరాశియైన యాయచ్యుతభూ
మీపతికిఁ రఘునాథ
క్ష్మాపాలకుఁ డుదయమయ్యెఁ జాత్మకుఁడై.

చెవ్వరాజున కచ్యుతరాజును, అచ్యుతరాజునకుఁ గృతినాయకుఁ డయినరఘునాథరాజును బుట్టి తంజాపురరాజ్యము పాలించిరి. విజయ విలాసములోని యీక్రిందిపద్యములవలన రఘునాథరాజు రసికజనాగ్ర గణ్యుఁ డయినట్లును, విద్వల్లయం దసమానుఁ డయినట్టును తెలియ వచ్చుచున్నది—

గీ. నన్ను నడిపినయధికసన్మాన మెంచి
యఖిలవిద్యావిశారదుఁ డగుటగాంచి

యవని నింతటిరా జెవ్వఁడని నుతించి .

కృతి యొసఁగఁ గీర్తికలదని మత్రిఁదలంచి.

వ. కలిగెంగా తనసమ్ముఖంబనియు సత్కారంబుతాఁజేయ నా
దల నెంతే శిరసావహింతురనియుం దాఁగాక వేఱొందు సా
ధులకున్ దిక్కనియుఁ దయన్మనుపురీతుల్గాక శక్యంబె వి
ద్యల మెప్పింపఁగ నచ్యుతేంద్ర రఘునాథస్వామి నెవ్వారికిన్?

రసికావతంసుఁడయిన కృతిపతి తన కంకితము చేయఁబడిన సారంగధరచరిత్రమునంతను విని యందు శోకరస మత్యద్భుతముగా వర్ణింపఁబడుటచూచి యది సిజముగా నేడిచినట్టి యున్నదని పలికి నసియు, ఆపయిఁ గవి తనశక్తినంతను జూపి ప్రతిపద్య రసాస్పదముగా విజయవిలాసమును జేసి తీసికొనివచ్చి వినిపింపఁగా నతని యింటిపేరును బట్టి శ్లేషించి చేమకూర మంచిపాకమునఁ బడెనని మెచ్చుకొనెనని యు చెప్పుదురు. అచ్చతెలుఁగుపదములను పొందికగాఁ గూర్చి కవనము చెప్పనే ర్పీకవికిఁ గుదిరినట్లు మఱియొకకవికిఁ గుదిరినదని చెప్ప వలను పడదు. అందుచేతనే కృతిపతి,

క. ప్రతిపద్యమునందుఁ జము। త్కృతి గలుగఁగఁ జెప్పనేర్తు వెల్లయెడలవై
కృతపాఠము బాఢముగా। క్షితిలో నీమార్గ మెవరికిని రాదుసుమీ.

అని కవిని శ్లాఘించి యున్నాఁడు. పింగళి సూరనార్యుని ప్రభా వతీప్రద్యుమ్నమునకుఁ . దరువాత విజయవిలాసమే సర్వవిధములచేతను తెలుఁగులో శ్లాఘ్యకావ్యముగా నున్నది. జాతీయాదిచమత్కృతినిబట్టి విజయవిలాసమే శ్లాఘ్యతర మయినదనియు ననేకు లభిప్రాయపడు చున్నారు.

ఉ. కారసవృత్తిమె ప్రతిపదంబును జాతియు వార్థయుం జను
తాకారము నర్థగౌరవముఁగల్గ ననేకకృతుల్ ప్రసన్నగం

భీరగతి న్వచించి మహిం మించినచో నిఁక శక్తు లెవ్వార
య్యా రఘునాథభూపరసికాగ్రణికిం జెవిసోఁకఁ జెప్పఁగఁ ?

అని కవియే తన్నుఁగూర్చి తనకవిత్వమునందువలె జాతియుఁ జనతాఁకారము నర్థగౌరవముఁ గలుగునట్లుగా నింకొక్కరు చెప్పలేరని చెప్పికొనియున్నాఁడు. ఈకవి తనగ్రంథములయందు రేఫ శకటరేఫము లకు యతిప్రాసమైత్రి కూర్చుటయేగాక, ఇకారసంధులు, క్త్వార్థక సంధులు, మొదలయిన పూర్వలాక్షణికసమ్మతములుకాని ప్రయోగము లనేకములు చేసియున్నాఁడు.

ఉ. కోపమొకింతలేను బుధకోటికిఁ గొంగుపసిండి సత్యమా
రూపము తారతమ్యము లెఱుంగు స్వతంత్రుఁడు నూతనప్రియా
టోపములేని నిశ్చలుఁ డిటుల్ కృతలక్షణుఁడైన చెలంగఁగా
ద్వాపరలక్షణుం డనఁగవచ్చునొకో యలధర్మనందనున్. విజయవిలాసము.

ఈపద్యమునందలి రెండవచరణములో రాకును బండిఱాకును యతికూర్చినాఁడు.

గీ. అరుగఁగొంకెదు కన్నియ తెఱఁగుఁ గాంచి, విజయవిలాసము.

మ. ఖరభానుప్రియసూనుఁ డెప్పుడు నినుంగారించునేకా విభుం
డఱచేలోపలి నిమ్నపంటివలె నత్యాసక్తి మన్నింప సౌ
ఖ్యరసైకస్థితినుండి కావరమునం గన్గాన కాపత్పరం
పర రాఁ ద్రుళ్ళెదవేల యీవిధిఁదరింప స్నేతరంబే యుహిన్. సారంగధ.

ఇత్యాది స్థలములయందు రేఫఱకారములకుఁ ప్రాసమైత్రి కూర్చినాఁడు.

క. సైకము నడుము విలాసర
సైకము నెమ్మోము దీనిమృదుమధురోక్తుల్
సైకముఁ దెగడు న్నవలా
సైకములోనెల్ల మేలుబంతిది బళిరా. విజయవిలాసము.

చ. వడి నరపాలుభోగసతివావులు నాకుఁబనేమి యంట వం
గడమునకెల్ల సొడ్డనినఁ గా దటునేనలపిన్ననాఁడె యే
ర్పడితినటన్న బోవునె స్వభావము దల్లినినాకు నేక్రియం
బడతుఁక నీవు వానిచెడ మందు మహింగలదమ్మయెందునున్.

సారంగధరచరిత్ర.

ఇందు మొదటిపద్యములో (మేలుబంతి + ఇది=) మేలుబంతిది యనియు, రెండవపద్యములో (పని + ఏమి=) పనేమనియు, ఇకారసంధులను గూర్చినాఁడు.

చ. అనవిని పాపపూపజవరా లెదలోపలఁ బాపలేక యీ
తని తెలిముద్దునెమ్మొగముఁ దప్పక తేటమిటారికల్కిచూ
పునఁ దనివారఁజూచి నృపపుంగవ యన్నిటజాణ వూరకే
యనవలసంటిగా కెఱుఁగవా యొకమాటనె మర్మకర్మముల్.

విజయవిలాసము.

ఉ. కానకుఁ గొంచుబోయిపుడు కాళ్ళను జేతులుఁ గోయుఁడంచు లో
నూనినకిన్క రాజు ముదుటుంగర మిచ్చెను మాకు బుద్ధి యే
మానతియిండు మీరనిన నట్లులెచేయుఁడు కొంకనేల రా
జాన నతిక్రమింపఁ దగునాయసి యీదృఢచిత్తుఁ డాడినన్. సారంగధ.

ఇత్యాది స్థలములయందు (వలసి + అంటి=) వలసంటియనియు, (పోయి + ఇపుడు=) పోయిపు డనియు, క్త్వార్థమునకు సంధి కలిపినాఁడు.

చ. చందనగంధి నెన్నుదురు చందురులో సగపాలు బాల ము
ద్దుం దెలిచూపు లంగజునితూపులలోపల మేల్తరంబు లిం
దిందిరవేణిమోవి యలతేనియలో నికరంబుతేటు యే
మందము మందయానముఖమందము మీఱు నవారవిందమున్.

విజయవిలాసము.

ముఖమందమని యీపద్యమునందును, రాజానయని పయిపద్య
మునందును షష్ఠీతత్పురుషమునం దుత్తర కచ్చు వరంబగునప్పుడు నుగా

గమమువచ్చి 'ముఖమునందము' 'రాజునాన' యని యుండవలసినదానికి మాఱుగా నుగాగమము పోగొట్టి ప్రయోగించినాఁడు.

మ. అని బాహాపరిరంభసంభ్రమరసాయత్తైకచిత్తంబునం
దను నీక్షింప నెఱింగి యందియలమ్రోఁతం గేకినున్ రా సఖీ
జను లేతెంచి రటంచు వే మొఱఁగి హస్తంబు న్వికంజేసె నే
ర్పునఁ దప్పించుకపోవ భూవరుఁ డనుం బూబోఁడికిం గ్రమ్మఱిన్—
విజయవి.

సీ. నిలుచుండి చంకఁజేతులపెట్టుక కిరీటములు గలరాజులు కొలువుచేయ-
సారం.

ఇందు 'తప్పించుకొని' 'పెట్టుకొని' యని యుండవలసినచోట్ల కొనునకు మాఱుగా కవర్ణకము ప్రయోగించినాఁడు.

సీ. చెంతఁగూర్చుండిని చేఁజూపఁ గూరుచుం
డెదవుగా కూరకుండెదవు సుమ్ము. విజయవి.

అచ్చు పరమగునపుడు ప్రార్థనార్థక మధ్యమపురుష మువర్ణకము నకు లోపము రాఁగూడకపోయినను 'గూర్చుండు' అని మువర్ణలోపము కలిగించి ప్రయోగించినాఁడు.

ఉ. ఓన్యప నాకుఁ జూడ నటయుగ్మలి నీసుతునిఁ మనోహరా
మానవిలానుఁ జూచి నిలు పోపక పట్టిన లోనుగామి నెం
తే నెగు లూని వానిఁ బొలియింపఁగ మాయలు పన్ని నిట్లు కొం
డేనకు ధర్మరా జలుగు నిక్కముగా మిముఁ జెప్పనేటికిన్—సారంగధ.

తెలుఁగులందుఁ గొన్నియెడల లులనలు పరమగునపుడు మువర్ణము లోపించి పూర్వమందున్న యకారమునకు మాత్రమే దీర్ఘము రావలసియుండఁగా నిచటఁ గొండెమునకని యుండవలసినదానికి మాఱుగా నెకారమునకు దీర్ఘముపెట్టి కొండేనకని ప్రయోగించినాఁడు.

ఇట్లు లఘ్వులఘు శేషములకు యతిప్రాసములయందు మైత్రి

కల్పించినను, పూర్వ కవిప్రయోగములకు విరుద్ధములయిన ప్రయోగ గములు చేసినను, లింగమగుంట తిమ్మన్న, అప్పకవి, కూచిమంచి తిమ్మన్న మొదలయిన లక్షణవేత్త లీ వేంకటకవిని లాక్షణికకవినిగా నంగీకరించి తమ లక్షణ గ్రంథములయందీతని గ్రంథములనుండి పద్య ములనుదాహరించియున్నారు. ఇప్పటివారు కవిత్వసారస్యమును విచా రింపక గ్రంథములయంగు రేఫద్వయప్రాస విశ్రమమైత్రియో యేదో వ్యాకరణదోషమో యున్నదన్న హేతువుచేత రసవంతములైన యుత్తమ గ్రంథములను సహిత మగ్రాహ్యములని నిరాకరించుచున్నందున, అట్లు చేయుట యుక్తముకాదనియు ఛందోవ్యాకరణదోషములు లేని రస హీనములగు గ్రంథములకంటె ఛందోవ్యాకరణదోషములను గలవయి నను రసవంతములయిన గ్రంథములే యధికాదరణీయము లనియు జూపు టకయి యీ కవివిషయమున నింతదూరము వ్రాసినాఁడను. కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని నెరసులున్నను జాతీయములతోను సామెతలతోను నిండియుండి యర్థగౌరవము కలదయి రసవంతమయి యున్నందున చేమ కూర వేంకటకవి కవిత్వము సర్వజనాదరణీయమయినదని తలఁచు చున్నాను. ఈ కవి యించుమించుగా పదునేడవ శతాబ్దమునకు మధ్యభాగమునందున్నట్లు తెలియవచ్చుచున్నది. కృతిపతియైన రఘునాథ రాజుయొక్క కుమారుఁడగు విజయరాఘవరాజు ౧౬౭౮ వ సంవత్స రమునందు మధురాపురము రాజధానిగాఁగల పాండ్యదేశపురాజగు చొక్కలింగనాయకునితో యుద్ధముచేసి సహాయుఁడయ్యెను. అతనిత్రోఁ గృతిపతివంశ మంతరించినది. దీనినిబట్టి విజయవిలాసమును సారంగధర చరిత్రమును ౧౬౩౦-౪౦ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడి నట్లు కనఁబడుచున్నవి. మూడేసి యాశ్వాసములుగా రచియింపఁబడిన యీ పుస్తకద్వయము నుండియుఁ గొన్ని పద్యముల నుదాహరించుచు నీ కవిచరిత్రము నింతటితోఁ బరిసమాప్తి నొందించుచున్నాను—

విజయవిలాసము.

చ. ఱీతిపయి వట్టిక్రూఁకులు చిగిర్చి వసంతుఁడు తా రసోపగుం
భితపదవాసనల్ నెఱప మెచ్చక చంక్రుఁడు మిన్ననం బ్రస
న్నతయును సౌకుమార్యముఁ గనంబడ తా ల్గరఁగఁజేసె నే
గతిరచియించి రేని సమకాలమువారల మెచ్చరేకదా—ఆ. ౧.

ఉ. కోమలి యీగతి న్మది తగుల్పఁగ బల్కిన నవ్వ నిర్జర
గ్రామణిసూను మీ రెచటఁ గంటికొ యంటివి కన్నమాత్రమే
యేమని చెప్పవచ్చు నొకయించుక భేదము లేక యీయనే
మేమయియున్నవారమునుమీ వికచాంబుజపత్రలోచనా—ఆ. ౨

చ. శివుఁ డిటు రమ్మటంచు దయచేసినచోఁ దల కెక్కి తొగ్గవై
భవమునఁ జూచుచో నడుగుఁబట్టితి వేమనవచ్చు నీగుణం
బవునవు నందినఁ సిగయు నందకయున్నను గాళ్ళుఁ బట్టుకొం
దువు హరిణాంక వేళకొలఁదు ల్గద నీనడక ల్తలంపఁగన్.—ఆ. 3

సారంగధర చరిత్రము.

ఉ. చక్కలిగింతపెట్టినను సారెఁ గికాగిక నవ్వుచున్ బయిం
బక్కఁబడంగఁ జక్కనికుమారుని మక్కువమీఱి నేమ్మరా
జెక్కలిమీఁటి యొత్తి యెదఁ జేరిచి ముచ్చట దీరునట్లుగా
నక్కట ముద్దు లాడవలదా వలదా యిటువంటిభాగ్యముల్ ? ఆ.౧

ఉ. ఆతరలాక్షి డెందమున నారట మొందుచు నేమిచేయుదున్
రాతికిఁ దోడుపోయినది రాసుతుఁడెండము మొత్తగాదు దా
దాతికి వచ్చియుండ నిఁకఁ దాలిమి చెల్లునె మారుఁ డంటిమా
ఘాతుకుఁ దోడ్వరాదు సముఖంబున నేటికి రాయబారముల్—ఆ.౨

ఉ. కందుఁ గదయ్య నీమురువు కన్నులపండువుగాఁగ నంటినం
గందుఁ గదయ్య నీతనువు కౌతుక మొప్పఁగ నీదుప్రాపు నేఁ
గందుఁ గదయ్య యంచు నినుఁగన్న సహిమ్మ సహింప దందుఁ బో
కందుఁ గదయ్య యేల వినవైతివి నావచనంబు పుత్రకా—ఆ. 3

53. రాజలింగకవి

ఈకవి కూర్మపురాణ మనెడి యీశ్వరోపాఖ్యానముల గ్రంథమును తన కాప్తుఁడైన చెఱుకు లక్ష్మణామాత్యుని ప్రేరణముచేత రచియించెను. ఈలక్ష్మణామాత్యుఁ డ్వెవరిమంత్రియో చెప్పఁబడలేదు గాని తురకప్రభువుల కొలువులో నున్నట్లీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

గీ. సకలనృపకార్యధౌరీణత్వ
మధిగమించి యవిూరుల ననుసరించి
సప్తసంతానములఁ బ్రశస్తముగనిలిపెఁ
నతనికతడెఁ సమానుఁడీక్షితితలమున.

కొరపుట్ల గ్రామనివాసుఁడగు చెఱుకు లక్ష్మణామాత్యుఁడు తన్నుఁ గూర్చి యీవిధముగాఁ బలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు,-

ఉ. శ్రీగిరినాథపాదసరసీరుహచింతను వీరశైవశా
స్త్రాగమమార్గ నిర్ణయవిరంసు నిరంతరధీజనౌఘసం
యోగమనస్కు నుత్తమగుణోచితసంగ్రహధర్మవర్తనా
భోగుని రాజలింగకవిపుంగవు మంజులభాషు ననొగిన్.

క. వినయంబున రావించియుఁ । గనకవిభూషణము లంశుకంబులువీడ్యం
బనురక్తినొసఁగి నాతో । ననియె న్మధురోక్తి లక్ష్మణామాత్యుఁడొగిన్,

క. నీ వతిధన్యుఁడ వాగమ
శైవపురాణార్థసారసంగ్రహుఁడ వటుల్
గావునఁ గూర్మపురాణము
భూవిదితముగాఁగ నాంధ్రమునఁ జెప్పఁదగున్.

ఈలక్ష్మణామాత్యుఁడు తనకు సఖుఁడైనట్లు కవియే గ్రంథమునం దిట్లు చెప్పికొనియున్నాఁడు—

చ. అతనికి మేలువాఁడనయి యాప్తుఁడనై సచివుండనై మహా

హితమతిన్ సఖుండనయి యెల్లపుడుం బెఱబాయకుండి సం
తతము మృదూక్తులన్ శివకథాకథనంబులఁ బ్రొద్దుపుచ్చుచున్
గుతకమ్ముగో వసించెదనకుంఠితవృత్తిఁ గవు ల్నుతింపఁగన్.

ఈపద్యములవలననే కవి పీఠికై వుండగుట స్పష్టముగుచున్నది.

ఇతఁడు వసిష్ఠగోత్రుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; సర్వేశ్వరారాధ్య పుత్రుఁడు. ఈకవి తనగ్రంథమునందు "రంగనాథుని రామలింగకవిని సూరపరాజును గౌరనాహ్వాయు" నని రామకృష్ణుని స్తుతించుటచేత రామకృష్ణకవికిఁ దరువాతను కూర్మపురాణమునుండి యప్పకవి పద్యము నొకదాని నుదాహరించి యుండుటచేత నప్పకవికిఁ బూర్వమునందును, ఉన్నట్టు తేటపడుచున్నది. అందుచేతఁ గవి హూణశకము ౧౬౩౦ వ సంవత్సరప్రాంతములయం దున్నట్టు నిశ్చయింపవలసి యున్నది. ఈతనిది మిక్కిలి సరసమైన కవిత్వమని కూర్మపురాణములోని యీక్రింది పద్య ములవలననే తెలియవచ్చును —

ఉ. భంబుగదే నఖావళి సభంబుగదే నడుము స్మేదద్వితే
భంబుగదే కచంబు దిగిభంబుగదే నడతీరు హేమకుం
భంబుగదే కుచంబు కరభంబుగదే తొడ పూర్ణచంద్రికా
భంబుగదే స్మితం బురుశుభంబుగదే వచనంబు బోటికిన్. ఆ. 3.

చ. దురితవినాశనం బమరదుర్లభ మవ్యయ ముత్తమంబు నై
వఱలెడుయోగసంగతి నవశ్యము జ్ఞానముచేఱుఱు న్మహే
శ్వరుఁడు కనంబడున్ బరమశాంతి యపూర్వసమాధియు కవ్వ
వరశివయోగమార్గమున వర్తిల మోక్షము కల్గుఁ గావునన్. ఆ. ౪.

ఉ. శాంతులు నీతిపారగులు సభ్యు లహింసకు లప్రమత్తు లా
గంతుకు లాహితాగ్ను లుపకారులు కోవిదు లప్రతిగ్రహుల్
దాంతులు పావనుల్ పరమధార్మికు లాశ్రితు లీశ్వరార్చన
స్వాంతులు సత్యవాదు లనవద్యులు పంక్తికి యోగ్యులారయన్.

54. చిత్రకవి రమణకవి

ఈకవి సాంబవిలాసమను ప్రబంధమును రచియించి వేంకటేశ్వరుని కంకితముచేసెను. ఇతఁడు ౧౬౩౦ వ సంవత్సరప్రాంతములం దున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇతని తండ్రియైన యనంతకవి రామరాజ భూషణకృతమైన హరిశ్చంద్రనలోపాఖ్యానమునకు వ్యాఖ్య చేసినందున, అతఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండుట స్పష్టము. సాంబవిలాసములోని పద్యముల నప్పకవి లక్ష్యములనుగాఁ జేకొని యుండుటచేత రమణకవి తప్పక తనసాంబవిలాసమును ౧౬౫౦ వ సంవత్సరమునకుఁ గొంతకాలము పూర్వమే చేసియుండవలెను. కవి తన్ను ద్వేషించి యాక్షేపించి వాక్యములను తనపుస్తకములోఁ జెప్పుకొన్నాఁడు—

ఉ. ఓరమణాఖ్య సత్కవికులోత్తమ! నీమనోజ్ఞమంజులాహ్వాయ
శ్రీరమణీయ! నీవిపుడు చేయఁగఁబూనినసాంబలక్షణా
సారసదృగ్వివాహకథ సన్మతి మాకిపు డంకితంబుగాఁ
గూరుపు నీకుఁ గల్గు జయగుర్వచలాయురభీష్టవస్తువుల్.

సీ. సర్వలక్షణసారసంగ్రహం బొనరించి
తనరె మీతాత పెద్దనకవీంద్రుఁ
డలహరిశ్చంద్రనలాభీశసత్కథా
శ్లేషసత్కృతికిఁ బ్రసిద్ధిగాఁగఁ
గవిహితుండొచు వ్యాఖ్యానంబు నొనరించి
మరియు నిందుస్తుతీసుపరిణయంబు
మొదలై నసత్కావ్యములు చేసి గహిగాంచె
నరయ మీతండ్రి యనంతసుకవి
చిత్రకవిమంజులాన్వయక్షీరవార్ధి
చంద్రమూర్తిని సద్బుద్ధిశాలి వీవు

రమణసత్కవి నీవొనర్పంగఁబూను
కృతివతంసంబు నతసకంకిత మొసర్పు.

సాంబవిలాసమునంచు దుర్యోధనపుత్రియైన లక్ష్మణాకన్యను
కృష్ణుని కొడుకైన సాంబునికిచ్చి వివాహము చేసినకథ చెప్పఁబడినది.
ఇది సలక్షణమైన గ్రంథము. ఇందుండి రెండుమూడు పద్యములు
నిందుదాహరించుచున్నాను.

చ. కొడవలిచేత బొడ్డు తగఁగోసి గడానిపసిండిచేటలో
నిడి నులివెచ్చనీట నొడ లెంతయు నారిచి మేలిచల్వపా
వడఁ దడియొత్తి ఫాలమున బొగుగ నున్ననికాపుదృష్టిబొ
ట్టిడి రహి దీవన ల్నలిపి హెచ్చుగ నారతు లిచ్చి క్రచ్చుఱా. ఆ-౧

ఉ. జాంబవతీతనూజుఁ డలసాంబుఁడు బాల్యమునంచు మందహా
సం బనుభవ్యచంద్రిక నజస్రము మాతృమనోంబుజాతహా
ర్ణాంబుధిఁ బొంగజేయుచు నుదంచితనై జకుమారచంద్రభా
వంబు యథార్థమై తనర వర్తిలు సత్కళలం జెలంగుచున్. ఆ. ౧.

మ. ఒక భిల్లాగ్రణి వెంబడించి తనపై నుత్సాహ మొప్పంగ వ
చ్చు కఠోరాధికగర్వభూర్వహాతరక్ష్మాశ్రేష్ఠమున్ సాంబభూ
పకరీంద్రంబు నుతింప మేలితభుకుం బల్వాడియందంపునుం
జికటారింబడఁగూల్చి యార్భటు లొనర్చెంబేర్చి శౌర్యంబునన్. ఆ ౧

ఈకవి భారద్వాజగోత్రుఁడు; కాత్యాయనసూత్రుఁడు; ఓబ
ళాంబాపుత్రుఁడు. ఇతనిచే రచింపఁబడిన రామాయణమొకటిగూడఁ
గానఁబడుచున్నది. దాని కీతఁడు "విద్వత్కవికర్ణరసాయనసకలవర్ణనా
పూర్ణరామాయణము" అని పేరు పెట్టెను. ఈరామాయణములోని
గద్యమునుబట్టి కవి యభిమన్యువిలాసము, కుమారగురువిలాసములోనగు
గ్రంథములనుగూడ రచించినట్లు తెలియవచ్చుచున్నది. ఈరామా

యణములోనివి ప్రతికాండమునుండియు రెండేసి పద్యముల నిందుదా
హరించుచున్నాను—

చ. బిరుదులజల్లులున్ బునుఁగుఁబిల్లులపిల్లలు నల్లసద్దలిం
బరఁగెడు మేలిమూలికలపల్లులు పీఁకుణపర్వకారిబం
ధురమృగరాణ్మత్తల్లులు వినూత్నతరంబులు కొల్లలై తగన్
సరవిని గాన్క లిచ్చి మహిజానికి నిట్లని రంవఱుం దగన్.

బాలకాండము.

శా. దేహం బస్థిర మెల్లవారలకు ధాత్రీభాగమం దేల యి
ట్లూహాపోహాలు చేయ నీతనికి ము న్ను త్సాహమై యిత్తునం
చాహాపత్యతి వి ప్రబద్ధములు పెక్కాడంగ యు క్తంబుకా
నా హేయాంగము దీని నమ్మి యిటు లేలా దబ్బఱ ల్వల్కఁగన్.

బాలకాండము.

మ. భరతుం డెవ్వఁడు కైక యెవ్వతె ధరాపాలుండు తా నేమి త
ద్వరయుగ్మం బన నేది నాఁశితతీవ్రస్ఫారఖడ్గంబుచే
భరతుం ద్రుంచి ధరాస్థలంబునకు నిన్ బట్టంబు నేఁ గట్టెదన్
ధరణీశుండలి నల్లమానవులు మోదం బూని కీర్తింపఁగన్.

అయోధ్యాకాండము.

మ. నిను నున్నించి మదాత్మజున్ రఘువరున్ నేసట్లు కోల్పోయితిన్
నినుఁ బెండ్లాడి సమస్తభూమిజనము ల్నీచాత్మఁ డీతం డనం
గ నవేలంబగుసంద వర్జిలిఁ గైకా సూర్యవంశంబు నీ
దునిమిత్తంబున నెన్నిభంగులఁ జెడెఁ దోషంబు నిన్ జూడఁగన్.

అయోధ్యాకాండము.

ఉ. ఉత్తములై నరాజవరు లుద్ధురబాణకృపాణచాపముల్
హస్తి ధరించు నెల్ల సభయాత్మకులై శరణన్నవారి ను
ద్యత్తరలీలఁ గావఁగ రణాంగణమం దెదిరించినట్టియు
న్మత్తరిపుప్రకాండముల మర్దనచేయఁగఁ గాదె యెన్నఁగన్.

ఆరణ్యకాండము.

ఉ. ఆచెలువంపుజొక్క పుటొయారము లాజిగిప్రాయ మాఘున
శ్రీచణరూప మాతళుకుఁజెక్కులచక్కఁదనంబు లామహా
ధీచతురత్వ మాపలుకుఁదేనియ లాగమనంబు లావిభా
ప్రాచురి యెక్కడం గనుట పలుకట వింటయు లేదు రావణా.

ఆరణ్యకాండము.

శా. నీకుఁ శత్రుఁడఁ గాను భవద్రిపులతో నే సఖ్యముం జేయ నే
జోక న్నీకపకారిగా నకట యిచ్చోఁ జాలనిర్హేతుకం
బై కన్నట్టిరుష స్మను న్నిశితతీవ్రామోఘబాణంబుచే
వే కూల్పంగ నిమిత్త మేమి యిది దోర్వీర్యంబె శ్రీరాఘవా.

కిష్కింధాకాండము.

ఉ. అంగదుఁ గాంచి యోతనయ యాత్మ వగం దురపిల్లఁ బోకు ని
న్నుం గడు నాదుమాఱుగఁ గనుంగొను నీరవిపుత్రుఁ డిమ్మహో
త్తుంగభుజప్రతాపనిధితో నెడఁబాయక యుండినఁ జయా
భంగురభోగభాగ్యములఁ బ్రస్తుతి కెక్కి రహింతు వన్నిటఁ.

కిష్కింధాకాండము.

ఉ. బంగరుమేలినిగ్గు గలపర్వతమోయన నై జగాత్ర ము
త్తుంగముగాఁగఁ బెంచి మతిత్రోడనె పాశము లెల్ల నూడ్చి సా
రంగపరంపరం గదుమురాజితసాహససింహమోయనన్
బొంగుచు వెంటవచ్చుదితిపుత్రులఁ బోవఁగఁదోలి రోషియై.

సుందరకాండము.

ఉ. రామకరాగ్రముద్రిక ధరాసుతచేతి కొసంగి రాఘువ
క్షేమము తెల్పియాజనని కేవలశోకము మాన్పి లంక వా
లామితహవ్యభుక్శిఖల నంతయు దగ్ధము చేసి సీతచూ
డామణిఁ గొంచువచ్చితిఁ దటాలున నిప్పు డటంచుఁ బల్కినన్.

సుందరకాండము.

శా. కామాసు ల్గడు నీమదిం బెనగొనంగా నాదు నీతీరిత
శ్రీమద్వాక్యము నీకుఁ బథ్య మగునే శ్రీరామభీమాగ్ని
లామేయాంబకరాజి నీతలలు నుగ్గాడంగ నావేళలన్
నామాట ల్మది నీకుఁ బథ్య మగు నన్నన్ రావణుం డుగ్రుఁడై.

యుద్ధకాండము.

ఉ. సర్వసురౌఘముల్ ననుఁ భుజాబలము ల్వీడనాడి కొల్చు టా
సర్వవిదుండు విష్ణుఁడు నిజంబుగ నాతఁ డెటులుంగఁడే మహా
గర్వితవిష్ణుఁ డొక్కరుఁడెకాఁ డలబ్రహ్మ యెదిర్చె నేని నే
నోర్వక యుగ్రబాణముల కొక్కట నాహుతి చేసి వ్రేల్చెదన్.

యుద్ధకాండము.

---

55. అందుగుల వెంకయ్య

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; అందుగుల సూరన్నకొమా రుఁడు. ఈకని కృష్ణదేవరాయల యల్లుఁ డయిన రామరాజుతమ్ముఁడగు తిరుమలదేవరాయని మనుమని మనుమఁ డగు కోదండరామరాజు కాల ములలోనుండి యీతనిపేర రామరాజీయ మను నామాంతరముగల నర పతివిజయమను గ్రంథమును జేసెను. ఈగ్రంథమునందు రామరాజు పూర్వులయిన నరపతులచరిత్రమును విశేషముగా రామరాజుయొక్క చరిత్రమును జెప్పఁబడియున్నది. రామరాజు ౧౫౬౮ వ సంవత్సరమున తాళికోట యుద్ధములో మహమ్మదీయులచేతఁ జంపఁబడెను. తదనంత రము మూడుతరములు గడచిన తరువాత నీగ్రంథము రచియింపఁబడిన దగుటచేత, ఇది ౧౬౫౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్లు చెప్పవచ్చును. రామరాజు గుత్తి, పెనుగొండ, గండికోట, కందనూలు,

ఆదవేని మొదలయిన ప్రదేశములు గెలిచిన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

గీ. సకలవిభు తిమ్మరాజుసేనలను ద్రుంచి
గుత్తి పెనుగొండ మట్రిగండికోట కంద
నూలుపుర మాదవే నవలీల గెలిచి
తొలుఁదొలుత రామనృపతి దోర్బలము మెఱసి.

ఈపుస్తకమునం దీరామరాజు నిజాముతలన నహమదాబాదు గొనుట మొదలయిన మహమ్మదీయులతోడి యుద్ధములు కొన్ని వర్ణింపఁబడినవి. ఈరామరాజు పేరునకు సదాశివదేనరాయని మంత్రి యని వ్యవహరింపఁబడినను, సింహాసనమునకు వచ్చినపుడు సదాశివ రాయలు బాలుఁడగుటచేతను కర్ణాటకరాజ్యము నచ్యుతదేవరాయల యనంతరమున నాక్రమించుకొన్న సకలము తిమ్మరాజును బాఱఁదోలి సదాశివదేవరాయల రాజ్యమును స్థాపించినవాఁడగుటచేతను క్రీస్తు శకము ౧౫౨౭ వ సంత్సరము మొదలుకొని ౧౫౬౨ వ సంవత్సరము వఱకును నితఁడే రాజ్యపరిపాలనము చేసెను. ఇతఁడు సలకము తిమ్మ యను గెలిచిన కథను నూంచిచు నితనిప్రతాపము నరపతివిజయమునం దీక్రిందిరీతిని వర్ణింపఁబడినది—

చ. ఎలమిని రామరాజవసుధేశుప్రతాప మవార్యమై మహో
జ్జ్వలనశిఖాసముత్కరముచందము నందమునొందె నెంతయున్
సకలయ తిమ్మయప్రముఖశత్రుపురంబుల నెల్ల నారయన్.

ఈరామరాజుతండ్రియైన శ్రీరంగరాజు కృష్ణదేవరాయల తండ్రి యైన నృసింహరాజునకు కర్ణాటకరాజ్యమును నిలుపుటలో సహాయుఁడుగా నుండినట్లు కానఁబడుచున్నది. ఈశ్రీరంగరాజుయొక్క శౌర్యము నరపతివిజయములో నీక్రింది పద్యమున వర్ణింపఁబడినది—

సీ. కడువిజాపురవరకామినీ గర్భముల్ భేదించు నెవ్వనిభేరిరవము
దామిడిఁ బోయి నిజాముపట్టణముల ధూళిగాఁజేయు నేదొరబలంబు
గోలకొండవజీర్ల కోటులకాయముల్ చించు నేరాజేంద్రుచేతిక త్తి
సకలభూపాలకాస్థానసన్నుతిఁ గాంచి వెలయు నేశూరునివిజయలక్ష్మి
యతఁడు కేవలనృపతియే యఘనిధూర
చర్యఁ డాశ్రితరక్షావిచక్షణుండు
జీర్ణ కర్ణాటభూపునర్జీవనుండు
రమ్యగుణశాలి శ్రీరంగరాయమహీళి.

ఈనరపతివిజయము కవిత్వముకంటెఁ జరిత్రమును జెప్పుటయం
దెక్కువ ప్రసిద్ధమైనదై నను, కవిత్వముకూడ రసహీన మయినదికాదు.
కవిత్వరీతిని దెలుపుట కయి రామరాజీయములోని రెండు పద్యముల
నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఇమ్మహిసోమదేవమనుజేంద్రుప్రతాపము నిండి దిక్కులం
బమ్మినఁ జూతపోతనవపల్లవబింబఫలారుణాంబుజా
తమ్ము లటంచుఁ గోకిలకదంబము కీరచయంబు చంచరీ
కమ్ములు క్రమ్మచుండు నొడికంబుగ భ్రాంతివహించి పల్మఱున్.

చ. అతివిభవంబునన్ దితిసుతాహితరాజు మహాపరాక్రమో
న్నతి మృగరాజు సోయగమున న్నలరాజు సమస్తధర్మప
ద్ధతి నలధర్మరాజు పటుధైర్యమునన్ గిరిరాజు వాక్ప్రశ
స్తత ఫణిరాజు నిర్దళితశాత్రవరా జగుబుక్కరాజిలన్.

---

56. కాకునూరి అప్పకవి

ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు, పదునేడవ శతాబ్దిమధ్యమునం
దుండిన లక్షణవేత్త. ఈకవి యాంధ్రశబ్దచింతామణి యనుపేర్మితో సాధా
రణముగా నప్పకవీయ మని వాడఁ బడెడు లక్షణగ్రంథమును పద్య
కావ్యమునుగా రచించెను. ఇతఁ డెనిమిదాశ్వాసముల గ్రంథమును
జేయునట్లు ప్రతిజ్ఞ చేసినను, అయిదాశ్వాసములు మాత్రమే యెల్ల
యెడలఁ గానఁబడుచున్నవి. తక్కిన యాశ్వాసములు చేయకమునుపే
యితఁడు మృతినొంది యుండవచ్చును. ఈయప్పకవీయమునందు ఛందో
విషయము సమగ్రముగా నున్నను, వ్యాకరణవిషయ మత్యల్పముగా
నున్నది. ఇప్పు డున్న భాగములో సంజ్ఞా సంధి పరిచ్ఛేదములు మాత్రమే
తెనిఁగింపఁబడినవి. ఇతఁడు బహుగ్రంథములు శోధించినవాఁడే యయి
నను, పూర్వగ్రంథములనుండి యితఁ డుదాహరించిన పద్యములన్నియు
దాదాపుగా లింగమగుంట తిమ్మన్న మొదలయినవా రీతనికి ముందు
చేసినలక్షణగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఇతఁడు తనకాలపువా
రయినకవుల గ్రంథములనుండి విశేషముగాఁ బద్యములను జేకొని
యున్నాఁడు. ప్రక్రియాకౌముదియు నాంధ్రశబ్దచింతామణియు నని
నామాంతరములు గలనన్నయభట్టీయమును బాలసరస్వతికాలమువఱకు
నెవ్వరు నెఱుఁగరు. అది సన్నయభట్టారకవిరచితమనియు, వేములవాడ
భీమకవి దానిని గోదావరిలో గలుపఁగా నేనూఱు సంవత్సరము
లయిన తరువాత సారంగధరుఁడు దానిని దెచ్చి బాలసరస్వతి కిచ్చె
ననియు అప్పకవి కలగనెనఁట! అటు తరువాత నొక బ్రాహ్మణుఁడు
దానిని తనకుఁ దెచ్చి యీఁగా తెనిఁగింప నారంభించెనఁట! ఈగ్రంథా
రంభమునకుఁ బూర్వమునఁ దప్పకవి యేదో తెలుఁగున ఘనకావ్యము
చేయ సంకల్పముపూనిన ట్లొక్కింది పద్యములవలన దెలియవచ్చుచున్నది—

క. అని యిష్టదేవతాస్తుతి
యును సకలకవీంద్రస్తుతియును గురునతియుఁ
వినయమున సలిపి తెలుఁగున
ఘనకావ్యం బొకటి సేయఁగాఁ దలఁచుతఱిఁ.

సీ. ధాత రెండనపరార్ధమున నాదినంబుపగట వరాహకల్పంబునందు
మహితవైవస్వతమనువేళ దేశంబు లర్థింపనైన మహాయుగమునఁ
గలిసమయంబున దొలిచరణంబున మానితంబగుచాంద్రమానమునను
శాలివాహనశకమున గజ శైల శర సుధాకిరణులసంఖ్యనడవ
నంగజాబ్దంబుననుదక్షిణాయనమున|జలధరర్తువు మొదటిమాసంబునందు
బహుళమున దేవకికిఁ జక్రపాణిపుట్టి | నట్టియష్టమి చనుదేరనధికభక్తి.

* * * * *

క. కల్పోక్తమార్గమున సం | కల్పము గావించి గోపికావిభుపూజల్
సల్పిమది నతనిపదములు | నిల్పి పురాణార్థగోష్ఠి నిశ గడపునెడఁ.

గీ. నుదుటఁ గస్తూరి తిలకంబు పొదలువాఁడు
తలఁచిచూచిన నాకులదైవ మగుచుఁ
బొలుచు నాకులదైవంబుఁ బోలువాఁడు
నిలిచె నొకరుఁడు నాదుముంగలను గలను.

ఇష్టదేవతావందనాదులును గురుదేవతాస్తుతియుఁ జేసి తెనుఁగున ఘనకావ్యమొకటి చేయ నుద్యమించి శాలివాహనశకము గఱిపి వదగు మన్మథనామసంవత్సర శ్రావణ బహుళాష్టమినాఁడు సంకల్పముచేసి కామెపల్లెదేవాలయములో రాత్రి పురాణగోష్ఠిని గడపుచుండఁగా శ్రీకృష్ణుఁడు కలలోవచ్చి యాంధ్రశబ్దచింతామణి నశించిన కథ చెప్పి—

చ. రమణను సత్కవీంద్రులు పురాణచయం బితిహాసపంక్తి కా
వ్యములును దొల్లియైన నిపుడైనను ముంగలనైన దీని సూ

త్రములను దక్క వేఱొకవిధంబున నాంధ్రముఁ జేయఁజాలమిన్
ఱుమఁ దెనిఁగింపు దీన నవి సర్వముఁ జేయుఫలంబు నీ కగున్.

దానిని తెనిఁగింప నానతిచ్చెనఁట! శ్రీకృష్ణుఁడు స్వప్నదర్శన
మిచ్చుటకుఁ బూర్వమే గ్రంథమును జేయ సంకల్పించెనో చెప్పలేము.
ప్రక్రియాకౌముది యనఁబడెడి యీ యాంధ్రశబ్దచింతామణి బాలసర
స్వతి కృతమనియు దానికి గౌరవము కలుగుటకయి యీ కథ కల్పింపఁ
బడినదనియు నే నీవఱకే చూపియున్నాను. పయి పద్యములనుబట్టి
యీ పుస్తకము శాలివాహనశకము ౧౫౭౮ వ సంవత్సరమునందనఁగా
క్రీస్తుశకము ౧౬౫౬ వ సంవత్సరము నందారంభింపఁబడి ౧౬౬౦ వ
సంవత్సరప్రాంతమున కింతవఱకుఁ జేయఁబడియుండును. అప్పటికప్పకవి
కవసానకాలము తట్టస్థించినందున గ్రంథము సమాప్తినొంది యుండక
పోవచ్చును.

సీ. జగతి నాపస్తంబశాఖోక్తషట్కర్మపద్ధతిఖండనిబంధనంబు
కాలబాలార్ణవాఖ్యజ్యోతిషగ్రంథసంహితానుశ్లోకసంగ్రహంబు
శ్రీమదనంత ప్రసిద్ధమహావ్రతకల్పకథాంధ్రోక్తికావ్యరచన
శ్రీనగాధీశసుశ్లేషనిందాస్తుతిభావగర్భితసీసపద్యశతము
లలితకవిల్పకాఖ్యానలక్షణంబు । మహితనాధ్వీజనౌషధకర్మద్వీపదము
నంబికావాదనాయకయక్షగాన । కృతియుఁజేసితి నాకునూరికులయప్ప.

అను పద్యమువలన నప్పకవి యీ గ్రంథమును రచించుటకుఁ
బూర్వము కొన్ని సంస్కృతాంధ్ర గ్రంథములను రచించినట్లు తెలియ
వచ్చుచున్నది గాని యిప్పుడాగ్రంథములు లభించుట యరుము. ఈతని
కవిత్వము సుగమమైన మృదుమధురపాకము గలదిగానున్నది. అప్పకవికిఁ
బూర్వమునందు రకార ఱకారములకు యతిప్రాసమైత్రి కలదు లేదను
నభిప్రాయభేద మున్నను, "నాన్యేషాంవై ధర్మ్యం లఘ్వోలఘూనాం

రయోస్తు నిత్యం స్యాత్" అన్నది బాలసరస్వతి సూత్రమనుకోక వాగను శాసనసూత్రమని భ్రమపడి

గీ. చెల్లునని మున్నభీమన చెప్పెననుచుఁ
గలుపుదురు రేఫములును ఱకారములును
దుష్టకవు లవి యొకటైనఁ దొంటిపెద్ద
లందఱును నేల విభజింతు రసి తెలియరు.

అని రేఫఱకారములకు యతిప్రాసమైత్రికూర్చువారు దుష్టకవు లని యప్పకవి దూషించి యున్నాఁడు. రకారద్వయమైత్రిని నిషేధించిన బాలసర్వతియే తద్భేదము గ్రహింపలేక చంద్రికాపరిణయములోని యీ క్రింది పద్యమునందు రేఫఱకారములకు విశ్రమము కూర్చినాఁడని కూచిమంచి తిమ్మకవి వ్రాసియున్నాఁడు—

ఉ. అక్కమలేక్షణ న్నినయంబుగఁ గాంచును నాను మాఱుగా
మ్రొక్కము సేయమా భువనమోహిని నీకనిపల్కు మార్తిచే
జిక్కితి వేగఁబ్రోవుమని చెప్పము పొమ్మ్మనకఁ దేటిరాయ నీ
యొక్కలమాటున న్నను భరించి లభింపుము కీర్తిపుణ్యముల్—

చంద్రికాప.

రేఫరకారమైత్రికి సమ్మతింపనివారవి రెండును నేకాక్షరమే యందురా? భిన్నాక్షరము లందురా? ఏకాక్షరమేయయి లఘ్వులఘు రూపములుమాత్రమే యయినయెడల, యలనల లఘ్వులఘు రూపము లకువలెనే వీనికిఁ గూడ మైత్రి యేల యుండరాదు? భిన్నాక్షరము లనెడు పక్షమున, రయోస్తు నిత్యం స్యాత్తనుచోటనేక శేషవృత్తి యెట్లు కుదురును? అవి యొకటైనఁ దొంటిపెద్దలేల విభజింతురని యప్పకవి యడిగిన ప్రశ్నమునకు యలవల నేల విభజించిరో యా హేతువుచేతనే యని చెప్పుటయే తగిన యుత్తరమగును.

చరిత్రము తెలియని యితరకవుల గ్రంథములు

అప్పకవీయాది లక్షణగ్రంథములలో నుదాహరింపఁబడిన గ్రంథము లిప్పుడనేకములు గానరాకున్నవి; కొన్ని గ్రంథములపేరులు తెలిసినను గ్రంథకర్తలపేరులు సహితము తెలియరాకున్నవి. అమరేశ్వరుని గొప్ప కవిసిగా పూర్వకవులనేకులు స్తుతించియున్నారు. ఈతఁడు చేసిన గ్రంథము లేవియో తెలియరావుగాని కూచిమంచి తిమ్మకవి తన సర్వ లక్షణసార సంగ్రహమునందుఁ జిమ్మపూడి యమరేశ్వరుని విక్రమసేనము లోనిదని యీ క్రిందిపద్యము నుదాహరించియున్నాఁడు—

గీ. నీర నగ్నియుసికి యూరయ విన్మయం
బనుచు బాడబాగ్నికడలి యప్పు
రంబుఁజొచ్చెనొక్కొ రత్నాకరమువఱు
లనఁగ జెలువ మమరునాహవములు.

ఈ ప్రకారముగానే హూణశకము ౧౬౫౦ వ సంవత్సరమునకుఁ బూర్వమునందున్నట్టు నిశ్చయముగా తెలిసిన కొందఱకవుల గ్రంథనామములు తెలిసినను, నా కాగ్రంథము లిప్పుడు లభింపనందున గ్రంథకర్తల చరిత్రమును గూర్చికాని వా రుండినకాలమును గూర్చికాని నేనిప్పు డేమియు వ్రాయుటకు శక్తుఁడను గాకున్నాను. గ్రంథకర్తల నామములు సహిత మనేకములు తెలియరాలేదు. తెలిసినవారు నా కానిషయమును తెలుపుదురన్న యపేక్షతోను. ఇతరు లట్టి గ్రంథసంపాదనమునకయి కృషిచేయుదురన్న విశ్వాసముతోను, ఆ గ్రంథముల పేరులనుమాత్ర మిందుఁజెప్పి వానిలోనుండి దొరికిన పద్యముల నుదాహరించుచున్నాను—

౧. కవులషష్ఠము—ఇది యెవ్వరు చేసినదో తెలియలేదు. పుస్తకముయొక్క పేరునుబట్టి యిది యనేక కవులుచేరి చేసినట్లూహింపఁ దగియున్నది. "తృతీయవర్ణసరళమునకు రాచమల్లువారి షష్ఠస్కంధ

ములోఁ బ్రయోగ"మని యప్పకవి వ్రాసియుండుటచే నిది రాచమల్లు వారను నింటిపేరుగల కవులచే రచియింపఁబడినట్లు స్పష్టమగుచున్నది. ఆకవు లన్నదమ్ములయి యుండవచ్చును.

శా. శ్రీరామామణి సీత నాధునియురస్సీమ న్నిజచ్ఛాయఁ గ
న్నారం గన్గొని యాత్మ నన్యవనితాశ్రేష్ఠ్యం బూనఁ దత్కంధరన్
హారం బున్చుచు నింకఁ జూడుమనఁ దా నౌటం ద్రపంజెందఁ జే
ల్వారుఁ రాముఁడు ప్రోచుఁగాత మిఁక నవమ్మాధీశుతిమ్మాధిపున్.

శా. చండాంశుప్రభ చిక్కతిమ్మయతనూజా తిమ్మ విధ్వస్తసా
షండం బైనత్రిలింగభాగవతషష్ఠస్కంధకావ్యంబు నీ
షుం డక్కెం జతురాననత్వగుణయుక్తు ల్మీఱి వాణీమనో
భాండారోద్ధత చూరకారబిరుదప్రఖ్యాతి సార్థంబుగన్.

అని కవిసంశయవిచ్ఛేదములోను, సర్వలక్షణసారసంగ్రహము లోను గవులషష్ఠమునుండి యుదాహరింపఁబడిన పద్యములనుబట్టి యీగ్రంథము తిమ్మయపుత్రుఁడయిన తిమ్మయ కంకితము చేయఁబడి నట్లు తెలియుచున్నది. ఈతిమ్మయ యచ్యుతదేవరాయని మంత్రులలో నొకఁ డయిన ట్లొకానొకరు వ్రాసియున్నారు. అదియే నిజమైనపక్ష మున బమ్మెరపోతరాజకృతభాగవతము శిథిలముకాఁగా పోయినభాగము లలో నొకటియైన యీషష్ఠస్కంధమును ౧౫౩౦ - ౪౭ సంవత్సరముల మధ్యను రాచమల్లువారు చేసియుందురు. దీనియందు శృంగారరస మధి కముగా వర్ణింపఁబడినందున దీనికే శృంగారషష్ఠమని నామాంతరము కలిగియున్నట్లు కనఁబడుచున్నది. అప్పకవ్యాదులుదాహరించిన శృంగార షష్ఠములోని కొన్నిపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను —

గీ. తల్లియును దండ్రి దైవంబు తలఁప గురుఁడ
కాఁడె? యితఁ డేమిచేసినఁ గనలఁ దగునె?

నా స్తికాధమ యోరి యన్యాయవృత్తి
నా స్తికత్వం గురోఃపరమ్మనఁగ వినవె. (అప్పకవి)

మ. పదము ల్తొట్రిలఁ గానుఁదీఁగ చలియింపం గేశము ల్తూలఁ బ
య్యెద వక్షోరుహపాళిఁ జేరఁ గనుదోయిన్ బొప్పము ల్గ్రిమ్మ గ
ద్గదకంఠమ్మున వాక్యము ల్తడఁబడఁ తద్దేహామం జొచ్చి యా
సుదతీరత్నము కాంచె బాలుని మనశ్శోకానలజ్వాలునిన్. (తిమ్మన్న)

చ. వయసునఁ బిన్నవాఁడ నభివంద్యుఁడ నౌదునె మీకునంచు సం
శయ మొనరించె డేని మునిసత్తమ కార్యములందునాగమా
ధ్యయనములందు మంత్రములయందుఁ గనిష్ఠుఁడ యేని పెద్ద ని
శ్చయ మిది వానియం దఖిలసన్నుత మైనువిద్య గల్గినన్.
(అ. సూరన్న)

ఆ. శ్రీరంగమహాత్మ్యము - ఇది భైరవకవిప్రణీతము. కవిగజాం
కుశమును రచియించిన భైరవకవి యితఁడేయయి యుండవచ్చును—

చ. పరిచరుఁగాఁగ నేలె నిరపాయచరిత్రునిఁ బాపకానన
స్ఫురదురుపీతిహాత్రుని సముజ్జ్వలమేరుసమానగాత్రునిన్
జరమపవిత్రునిన్ మునిసుపర్వవరస్తుతిపాత్రునిన్ మనో
హరఫలశేముషీకబళితాంబుజమిత్రుని వాయుపుత్రునిన్.
(అప్పకవి)

ఊ. గందపుఁగొండనెత్తములకందున నేలకితీవయిండ్లలోఁ
గెందలిరాకుపాన్పున సుఖించి నితాంతరతిశ్రమాంబునం
జెందినచెంచుగుబ్బెతలచెక్కులఁ జిమ్మ జవాదివానసల్
విందులుచేయుచు న్మెలఁగు వేఁకువఁ గోమలగంధవాహముల్.
(లిం. తిమ్మన్న)

ఊ. ఆకులవృత్తి రాఘవశరాగ్రమునంపుఁ దృణాగ్రలగ్ననీ
రాకృతి వార్ధి నిల్చుట దశాననుఁ డీల్గుట మిథ్యగాదె వా

లీశ్వరులు చెప్పుకున్నఁ గృతిలేనిశేశ్వరవ ర్తనంబు ర
త్నాకరవేష్టితావని వినంబడఁ దాతఁడు మేరు వె ర్తిసన్.

(కూ. తిమ్మన్న)

3. త్రైశంకోపాఖ్యానము—దీనిని సింగరన్న రచియించిన ట్లప్పకవి చెప్పుచున్నాఁడు. ఇంను హరిశ్చంద్రునికథ చెప్పఁబడి యుండ వలెను—

క. ఘుషకేతుద్విషునకుఁ గి
లిబిషపర్వతవృషున కమృతవిషనిధిజామా
త్రిషునకు బుషిపూజితునకు
విషమాతున కింద్రముఖదినిజషతునకున్.

క. డుంఠీరభైరవుని సితి
కంఠ విశాలాక్షి దండకరు జాహ్నవి వై
కుంఠపతి గుహుని లోలా
ర్కుం శేనలువిూఱ భూవరుఁడు పొడగసియెన్.

ర. శమంతకమణి చరిత్రము—ఇది వణుకూరి గుర్వారాజుచేఁ జేయఁబడినదని యప్పకవి వ్రాయుచున్నాఁడు—

ఉ. కాయవచోమనస్థ్నలనకల్పితదోషము లెల్లఁ బాయఁగా
నాయెదలోన సిత్యము సనాతనధర్ముఁ బూని యుర్మిలిం
బాయకకొల్తు రామనరపాలనిరంతరసౌఖ్యదాయి సీ
తాయి సమస్తశోభనసిధాయి మహాఫలసిద్ధిదాయి గ్రక్.

ఱ. శశిబిందు చరిత్రము—

క. నాకొకసు లైనను సీ
ధాకకు నిల్చెదరె కటకటా మనుబోంట్లక్
జేకొని సంరక్షింపక
సీకిటు లుచితంబె యురవణింప నరేంద్రా.

క. నూవుంబూవును సంపెగ
పూవుగలిచి బిరుదుము త్తెపుంజల్లి దగం
దా వై చె నవగ ముంగర
త్తో వనరుహనేత్రనాస తుల లే కొప్పున్.

ఉ. చారుధేష్ణచరిత్రము—

గీ. అచ్చరలు నందనంబునఁ బెచ్చుకొనుసు
రాగసుమములు హర్మ్యవాతాయనముల
చెంతఁ గా లూఁది తత్పురస్త్రీల కొసఁగి
వేఁడికొనిపోవుదురు కప్రసీడియములు.

క. ఈలలన వేలుపుంజప | రాలో యచ్చరయొ కిన్నరవధూమణియో
వ్యాళాంగనయో కా కో | భూలోకస్త్రీల కిట్టిపొంకము కలదే?

ఉ. భేతాళపంచవింశతి—

ఉ. చోరగ్రాహగజాంకుశంబు నలినీశుంభన్మదేభంబు ది
జ్ఞారీమూర్తికదర్పణంబు గజనీకాంతామనోహారి వి
స్ఫారాంభోధితరంగ కారి గిరిజాప్రాణేశభాస్వజ్జటా
శ్రీరమ్యాభరణంబు చంద్రుఁ డుదయించెఁ సుప్రభాభాసియై.

ఉ. ఆవిభవాశికోమణి రయంబునఁ బోయి రహస్యవేళఁ బ
ద్మావతిఁ గాంచి రాజసుతుఁ డాడినమాటలు విన్నవింప ల
జ్జావతి దానిఁ జూచి ఘనసారకరంబుల గండపాళికల్
వావిరి బ్రేసినఁ జరవారిజలోచన వచ్చె ఖిన్నతన్.

ఁ. చమత్కారరామాయణము—

క. ఓశశిముఖి లోపాము
ద్రేశుఁడు కలశభవుఁ డుండు సిట నతఁడు తపో
రాశి మహాత్ముఁడు మును పా
పోశనముగఁ గొనియె సాగరాంబువు లెల్లన్.

క. నిన్నుఁ జెఱఁగొన్న హైహయు
కన్నఁ దోర్వీర్యమెక్కుడగుభార్గవు లీ
ల న్నిర్జించినరామున
కన్నను శూరుండు ముజ్జగంబులఁ గలఁడే?

౯. శేషధర్మములు—

క. పెట్టుఁడు నారకమార్గం
బెట్టి మహాక్రూరకర్మఁ డేసియుఁ దుద ని
ట్టటనక నెమ్మనంబున
నెట్టన హరిఁ దలఁపఁ గలిగెనేసు మహాత్మా.

౧౦. విజయసేనము—

ఉ. వల్లభుఁ డేగు దుర్లభుఁడు వానిదెసందగు లూఁది యిమ్మెయిఁ
దల్లడ మందెదేల యుచితస్థితికి న్ననుఁ బొమ్మఁజూచినఁ
దల్లియు బంధులోకమును దండ్రియు నేమనువా రెఱింగరే
మల్లమ యిట్లునీకుఁ దగునో తగదో పరికించిచూడుమా.

౧౧. దేవీవిజయము—

గీ. వాక్ప్రణేత్రాంగనాశచీశక్తు లధిక
సంభ్రమంబునఁ గుంభనికుంభదైత్య
మంత్రిఁ బూజింపుదురు త్రయీమంత్రములను
స్తోత్రములుచేసి మంగళారాత్రికలిడి.

౧౨. మధుసేనము—

క. పోనుద్యోగము చేసిన ప్రాణంబా యింకనీకుఁ బాథేయం బీ
మానినిమందస్మితమధు రాననచంద్రికలు గ్రోల నరుగుము పిదపఁ.

౧౩. అనిరుద్ధచరిత్రము — కనపర్తి యబ్బయామాత్యప్రణీత మయిన యీపేరుగల యాధునిక ప్రబంధమొకటి కలదుగాని యీక్రింది పద్యము పూర్వగ్రంథములోనిది—

చ. నెలవుల నుప్పతిల్లి సరినిక్కి మొన ల్తల లెత్తి క్రొవ్వి లో
బలిసి సమంబులై బిగిసి వట్టువలై మెఱుఁ గెక్కి చక్కనై
కెలఁకులఁ బిక్కటిల్లి చెలికిం గడునొప్పెఁ గుచంబు లొప్పుకు
ప్పలుగను మన్మథుండు సరి వాఁలగఁ ద్రాసునఁ దూచెనోయనఁ.

౧౪. భూద్రకరాజచరిత్రము—

మ. సమదేభారి మసంగిపై నుఱికినఁ శంకించి భూపాలుఁ డో
లము గన్నం గని దాని భూద్రకుఁడు లీలంద్రుంచె నె నప్పు డ
త్యమలోద్యత్ప్రసవార్థినై కుసుమగంధఘ్రాణలుబ్ధభ్ర
ద్భ్రమరభ్రాజితపాటలీవిటపమధ్యస్థుండ నై చూచితిన్.

౧౫. ఆదినారాయణచరిత్రము—

ఉ. శ్రీయుతలోచనోజ్జ్వలమరీచులు భానుమరీచివిస్ఫుర
త్తోయజకాంతితోడఁ దులఁదూఁగెడుపచ్చనిపట్టు గట్టి య
త్యాయతశంఖచక్రరుచిరాసిగదాధరుఁ డేసుదెంచె నా
రాయణుఁ డార్తరక్షణపరాయణుఁ డాకరిరాజుపాలికిఁ.

౧౬. పంచబాణవిలాసము—

క. చిత్తంబుల రంజిల్లుచు
ముత్తెదువ లపుడు గదిసి పూవిల్తనకుఁ
బిత్తరికిఁ బలుదెఱఁగుల
నెత్తిరి హారతులు పౌరులెలఁ జెలంగఁ.

౧౭. పద్మినీఖండాఖ్యానము—

క. పంచశరుం డపు డని చా
లించి మహాప్రధనభూమి నీక్షించి మదో
వంచితుఁడై శంఖము పూ
రించెం గులగిరులు దిక్కరివ్రజ మదరన్.

———

272

ఆంధ్రకవుల చరిత్రము.

తృతీయభాగము

ఆధునికకవులు

By

K. VEERESALINGAM

వెల రు. 3-8-0

రాజమహేంద్రవరము
అవంతీ ప్రెస్ నందు ముద్రింపబడినది.
జనవరి, 1950

విషయసూచిక.

	పుట
1. హరిభట్టు	1
2. ఒడ్డెపూడి పెద్దయ్య	6
3. కాకమాని మూర్తి	9
4. కామేశ్వర కవి	14
5. వెణుతురుపల్లి విశ్వనాధకవి	17
6. నూతనకవి సూరన్న	18
7. సముఖ వేంకటకృష్ణప్పనాయకుడు	22
8. రోసనూరి వేంకటపతి	23
9. పైడిపుర్రి వేంకటపతి	27
10. వెలగపూడి కృష్ణయ్య	29
11. శేషము వేంకటపతి	32
12. కూచిమంచి తిమ్మకవి	39
13. వక్కలంక వీరభద్రకవి	56
14. కూచిమంచి జగ్గకవి	61
15. కొవలె గోపరాజు	67
16. కొడిచెర్ల శ్రీనివాసకవి	69
17. పట్టమట్ట సోమనాధకవి	70
18. దివి రమణకవి	72
19. కోడూరి వేంకటాచలకవి	73
20. ఏనుగు లక్ష్మణకవి	77
21. నెల్లూరి వీరరాఘవకవి	89
22. నంజరాజు	92
23. కోటి వెంకనార్యుడు	94
24. అడిదము సూరకవి	95
25. మంగళగిరి ఆనందకవి	111
26. కనుపర్తి అబ్బయామాత్యుడు	114
27. కాణాద పెద్దనసోమయాజి	118

	పుట
28. కుందుర్తి వేంకటాచలకవి	123
29. ఈదురుపల్లి భవానిశంకరుడు	126
30. ధూర్జటి వేంకటరాయకవి	128
31. అయ్యల రాజు – అయ్యల భాస్కరకవులు	131
32. అజ్జరపు పేరయలింగము	134
33. మరింగంటి సింగరాచార్యులు	139
34. అనంతరాజు జన్నయకవి	141
35. ముద్దు పళని	142
36. కంకంటి పాపరాజు	144
37. పుష్పగిరి తిమ్మన్న	148
38. ధరణిదేవుల రామమంత్రి	151
39. దిట్టకవి నారాయణకవి	154
40. అతలూరి పాపకవి	166
41. కస్తూరి రంగకవి	170
42. ఆలూరి కుప్పనకవి	171
43. పింగళి ఎల్లనార్యుడు	175
44. చింతకుంట కోదండరామకవి	179
45. కైపు మాయనకవి	180
46. వెలిదండ్ల వేంకటపతి	182
47. పట్టమెట్ట సరస్వతిసోమయాజి	183
48. అవుడూరి కిచ్చయ్య	185
49. తకెళ్లపాటి లింగన్న	187
50. గుడిపాటి కోదండపతి	189
51. మల్లవరపు వాలేశ్వరుడు	192
52. చింతలపల్లి వీరరాఘవుడు	194
53. రేచర్ల మాధవరాయకవి	196
54. అనియాది గణపతిదేవుడు	197
55. వేంకటాచార్యుడు	198

	పుట
56. లింగకవి – గంగకవి	200
57. అంగర నృశింహకవి	201
58. సిరిప్రెగడ ధర్మనామాత్యుడు	204
59. గణపవరపు వేంకటకవి	207
60. వేమునంటి దత్తోజీపండితుడు	215
61. గుడారు వేంకటదాసకవి	217
62. కామనూరి కృష్ణయ్య	218
63. వేంకటాచార్యుడు	219
64. మల్లంపల్లి నాగభూషణకవి	219
65. చిత్రకవి సింగరాచార్యుడు	221
66. రేవుణూరి వేంకటార్యుడు	225
67. పోచిరాజు వీరన్న	227
68. అయ్యలరాజు నారాయణకవి	230
69. వెఱుతుర్ల వడ్డికవి	232
70. కొత్తలంక మృత్యుంజయుడు	233
71. తిరుమలఱుక్క-పట్టణపు వేంకటాచార్యుడు	236
72. కటికనేని రామయకవి	237
73. కొండమడుగు పురుషోత్తమకవి	239
74. నాగులూరి శేషనారాధ్యుడు	240
75. వీణెము లక్ష్మీపతి	241
76. వేమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుడు	242
77. ములపాక బుచ్చన్నశాస్త్రి	243
78. పాలవేకరి కదిరీపతి	245
79. మాధవమంత్రి	246
80. గోపాలుని సింగయ్య	247
81. గూళికల్లు వేంకటరమణకవి	248
82. కృష్ణకవి	249
83. వల్లూరి నరశింహకవి	252

	పుట
84. గొంతేటి సూరన్న	253
85. బేతపూడి కృష్ణయ్య	254
86. బసవరాజు నాగేంద్రకవి	255
87. మాచవరపు పాపనామాత్యుడు	256
88. కృష్ణదాసకవి	258
89. చెన్నూరి శోభనాద్రి	259
90. కోటీశ్వరుడు	260
91. చల్లపిల్ల నరసకవి	261
92. అయ్యగారి వీరభద్రకవి	263
93. ఘట్టుప్రభువు	265
94. ముప్పిరాల సుబ్బరాయకవి	267
95. ప్రయాగ కామేశ్వరకవి	269
96. అనంతనార్యుడు	269
97. భైరవకవి	270
98. అనమగుర్తి రంగయ్య	271
99. తామరపల్లి తిమ్మయ్య	272
100. నారన సూరన	273
101. పోడూరి పెదరామామాత్యుడు	274
102. రామావర్ఝుల కొండుభట్టు	276
103. మారయకవి	278
104. పరశురామపంతుల లింగమూర్తి	278
105. పరశురామపంతుల రామమూర్తి	280
106. వేగినాటి కొండనార్యుడు	282
107. వాసుదేవయోగి	283
108. కానాల నరశింహకవి	284
109. రామనామాత్యుడు	286
110. పోచన	286

	పుట
111. పెనుపల్లె ఖాపనామాత్యుడు	287
112. చదువుల సోమలింగయ్య	288
113. శ్రీధరమల్లె వేంకటస్వామి	289
114. ఓరుగంటి సోమశేఖరకవి	291
115. ముడుంబి వేంకటాచార్యుడు	292
116. అక్కినపల్లి నృశింహకవి	293
117. పైడిపాటి వేంకటనృశింహకవి	295
118. కొటికెలపూడి వేంకటకృష్ణకవి	297
119. కాకరపర్తి కృష్ణకవి	299
120. కృష్ణయ్య	301
121. తరగొండ వెంకమ్మ	302
122. పిండిప్రోలి లక్ష్మణకవి	307
123. అల్లమరాజు రామకృష్ణకవి	312
124. కాకరపర్తి బుచ్చిపాత్రకవి	315
125. శిష్టు కృష్ణమూర్తికవి	317
126. మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి	323
127. ఫక్కి వేంకటనరసయ్య	325
128. వేల్పూరి వేంకటేశ్వరకవి	326
129. తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యులు	329
130. మాడభూషి నృశింహాచార్యుడు	330
131. కోటమరాజు నాగయ	330
132. కరాలపాటి రంగయకవి	332
333. దామరాజు లక్ష్మీనారాయణ	334
334. త్యాగరాజ మొదలి	335
335. ఓగిరాల జగన్నాధకవి	337
336. నడకుదుటి రామనకవి	338
137. మాడభూషి వెంకటాచార్యకవి	341
138. పెనుమత్స బుచ్చిరాజు	343

	పుట
139. మందపాక పార్వతీశ్వరకవి	344
140. సత్యవోలు భగవత్కవి	346
141. గురురాజకవి	347
142. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి	349
143. గోపీనాథము వేంకటకవి	350

ఆంధ్రకవుల చరిత్రము.

ఆధునికకవులు

1. హరిభట్టు

ఈకని మత్స్యపురాణమును వరాహపురాణమును తెనిఁగించెను. ఇతని నివాసస్థానము కంబమువెట్ట; ఇది బెజవాడ కాఁబామడలదూర ములో నున్నది. ఇతఁడు తన వరాహపురాణమునందు కంబమువెట్ట గ్రామము నీప్రకారముగా వర్ణించియున్నాఁడు—

సీ. వరుణదిగ్వీథి నేపురమునఁ బ్రవహించే బొవనసలిలసంపన్న మున్న
దీపించె నేపురి గోపికామానసాస్పదవర్తి చెన్నగోపాలమూర్తి
భాసిల్లె నేవీటఁ బ్రహ్లాదభక్తివిశ్రాణి కొండనృసింహశార్ఙ్గపాణి
యేపట్టణంబునఁ జూపట్టె హితపద్మహేళి వీరేశబాలేందుమౌళి
చతురచతురంగబలరత్నసౌధయూథ । సాలగోపురతోరణసకలవర్ణ
పౌరవారాంగనాజనప్రముఖవస్తు । మేదురం బట్టికంబమువెట్టపురము.

కవి వైదికబ్రాహ్మణుఁడు; భారద్వాజసగోత్రుఁడు; రామపండితుని పుత్రుఁడు. ఇతఁడు మొదట వరాహపురాణము కొలిపాక యెల్లనామాత్యుని కంకితము జేసెను.

మ. సన తెంతుం గొలిపాక యెల్లనికిఁ దేజశ్శ్రీర్యగాంభీర్య స
త్త్వవిభూత్యుక్తి ధనుర్జయోన్నతి యశస్త్యాగక్రియాశాంతులన్
సవితృ సాత్యకి సింధు సీరి సురశాస్తృ సూతు సేనాని స్వై
ధవనిర్భేదను సోము సౌమ్యరుచి సంతానంబు సస్యాధిపున్.

ఇత్యాది పద్యములచేత గుణితక్రమమునఁ గవి కృతినాయకుని నెంతగా నభివర్ణించినను,

క. శ్రీమహిత స్తంభాచల । నామసముద్దామపట్టణస్థలగణక
గ్రామణికి బంధుహితర । క్షామణికిఁ గవీంద్రపంకజనభోమణికిఁ.

అను షష్ఠ్యంతపద్యమువలన నతఁ డాయూరికి కరణమయినట్లు స్పష్టపడుచున్నది. ఇట్టి నాయకగ్రామణి తన్నుఁ బిలిపించి—

మ. అమృతప్రాయవచోవిశేషరచనాహంభావపుంభావవా
గ్రమణీమూర్తి వేదశాస్త్రవివిధగ్రంథార్థనిర్ణీతి నే
కముఖబ్రహ్మవు యాజుషప్రకటశాఖాధర్మధుర్యుండ వ
ర్యమతేజుండవు రామనార్యహరిభట్టా సత్యవిగ్రామణీ.

గీ. అష్టఘంటావధానవిశిష్టబిరుద
నీవు రచియింపఁ దలఁచిన నిరుపమార్థ
రమ్య మగు నీవరాహపురాణకావ్య
మంకితముచేయు నాపేర నభిమతమగ.

అని పలికినట్లు కవి వ్రాసికొనియున్నాఁడు. పయిపద్యమునందే గాక యీశ్వాసాంత గద్యమునంమును "అష్టఘంటావధానపరమేశ్వర బిరుదవిఖ్యాత" యని కవి వ్రాసికొనెను గాని యీబిరుద మెవ్వరిచే నియ్యఁబడినదో తెలియఁబడదు. అయినను కవిత్వము మాత్రము పయి పద్యమునందుఁ జెప్పఁబడిన రీతిగా నమృతప్రాయముగానే యున్నది. ఇతఁడు తానాపస్తంబసూత్రుఁ డయినట్టును తిమ్మాంబ పుత్రుఁ డయినట్టును మత్స్యపురాణములో నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

శా. భారద్వాజసగోత్రసంభవుఁడ నాపస్తంబుఁడన్ దిమ్మకాం
బారాజద్వరగర్భసంభవుఁడ రామక్ష్మాసురానేకజ
న్మారూఢాధిక పుణ్యలబ్ధహరి నామాంకాప్తసంస్తుత్యుఁడన్
శ్రీరామావరపాదపద్మయుగళీ చింతాసమాయుక్తుఁడన్.

ఇతఁడు మొదట రచించిన వరాహపురాణమును నరాంకితముచేసి యట్లు చేయుట పాపకార్యమని తలచి తత్పాపపరిహారార్థముగా మత్స్య

పురాణమును శ్రీరంగాంకితముచేసి యం దీక్రిందిపద్యమును బొందు పఱిచెను—

సీ. ఆయురారోగ్యనిత్యైశ్వర్యములు గల్గి
విభవంబుతో ధాత్రి వెలయుకొఱకు
ధనమునకై నరాధముల సన్నుతిచేయఁ
బొడమినపాపము ల్చెడుటకొఱకు
హృదయంబు లక్ష్మీశపదపంకజములందు
నిశ్చలవృత్తిఁగో నిలచుకొఱకు
కౌరవాదులఁ బాసి రయమున వైకుంఠ
సదనంబునకు వేడ్కఁ జనెడుకొఱకుఁ
బరమవైష్ణవజను లెల్లఁ బ్రస్తుతింప
మత్కృతం బయి హరికథామాన్య మగుచు
నుత్తమం బగువిష్ణుధర్మోత్తరంబు
రంగనాథున కర్పింతు రమణ మెఱసి.

కవికాలమును నిర్ణయించుట కీ పుస్తకములు రెంటిలోను నాకాధారము లేవియు గానరాలేదు. అక్కడక్కడఁ గొన్ని యల్పదోషములున్నను మొత్తముమీఁద నిర్దుష్టమని చెప్పఁదగిన గ్రంథరచనను బట్టియు శైలిబట్టియు చూడఁగా నీపుస్తకములు చిరకాలము క్రిందటనే రచియింపఁబడిన వయినట్లు తోఁచుచున్నది. "అష్టఘంటావధాన" యని రెండు పుస్తకములయందును గనఁబడుచున్నది. గంటమను తెలుఁగుశబ్దమునకుఁ బ్రకృతియయి లేఖినియని యర్థనిచ్చెడు "ఘంట" శబ్దము సంస్కృతమున నున్నదేమో! అప్పకవి యీగ్రంథములనుండి లక్ష్యములను జేకొనకపోవుటచేత నీకవి యతనికిఁ దరువాతనున్నాఁడేమో యని యూహ కలుగుచున్నది. కాఁబట్టి తగిన యాధారములు దొరకువఱకును మన మిప్పటి కీ కవికాలము క్రీస్తుశకము ౧౬౬౦

సంవత్సర ప్రాంతమని భావింతము. తెలియనివిషయముల నూహించి పెంచి వ్రాయుటకంటె కవికృతగ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించి యింతటితో విరమించుట యుక్తమని యెంచి యట్లు చేయుచున్నాను.

వరాహపురాణము.

ఉ. మిక్కిలి శీతలాంబువులు మేనికిఁ గీడు మహోష్ణవారిచేఁ
బొక్కు శరీర మీ యుభయముం దొరలించిన నింపొనర్చు సు
ల్లోకనయంబ యొండె భయ మొండె నొనర్పక తద్వయంబుఁ దా
నికు వెఱంగి చూపు మనుజేంద్రునకు న్వశు లౌదు రందఱున్.-ఆ౧

మ. సమరాజేంద్రునిగూర్చి సామము భుజాశౌర్యాధికంగూర్చి దా
నము దీనం గలయంగనేరనిమహీనాథాగ్రణింగూర్చి భే
దము శక్తిత్రయహీనుఁగూర్చి కడిమిం దండంబుఁ గావింప యు
క్తము భూపాలున కాత్మరాజ్యపరిరక్షాకార్యనిస్తంద్రతన్—ఆ.౨

శా. వేదార్థంబులు వేఱుగాఁ దెలిసి దుర్విజ్ఞాను లాత్మేశ్వరా
భేదధ్యానసమేకులై తుది భవిత్రీప్రేత్యర్థమై కర్మముల్
మోదం బొప్పఁగఁ జేయనేరక మహామోహాంధులై యుండు రం
తాదివ్యాప్తి విహీనసంస్మృతిసముద్రాంతర్నిమగ్నాత్ములై—ఆ. 3

ఉ. దేహవినాశమూల మగు తీవ్రవిషావృత మైనయట్టి యా
బాహువుఁ ద్రెంచి మేను నిలుపందగు నందురుగాన సోదరీ
స్నేహము చేయు టొప్ప దని చెల్లెలిముందల వట్టి యాజగ
ద్రోహి గళంబుఁ ద్రెంచుటకు దోరసి యెత్తినఁ జూచి యత్తఱిన్-ఆ౪

చ. ఘనతరకష్టలోభిఁ దనుకంబునఁ జంపెనునంతయల్క నె
మ్మనమునఁ బుట్టె నేని విషమారణ కర్మకృపాణముఖ్యసా
ధనములు గూర్ప నేల ప్రమదంబున డగ్గటి కాను వీస మి
మ్మనుటయె చాలు వారి నిమిషార్ధమున న్మృతి నొందఁ జేయఁగన్-ఆ౫

మత్స్యపురాణము.

చ. చదివితి వేదశాస్త్రములు సాంగపదస్వరవర్ణరూఢి నం
దొదవిన మార్గముల్ వివిధయోజ్యములై విలసిల్లు వానిలో
నెదిరిన కర్మకాండమున హింసము జ్ఞానమునందఁ గర్మమున్
వదలక పల్కఁజుండును బ్రవాహముల న్విపరీతవృత్తులై .—ఆ.గ

చ. తిరిగితిఁ గాననంబు లతితృష్ణఁ జలింపక తద్వనంబులఁ
దొరకవు కందమూలములు తోయజనాభుసియాజ్ఞఁగాక యి
ప్పురమున నన్నపూర్ణ పరిపూరితయై విహరింపుచుండఁగాఁ
గఅవగునే తదన్నము లకాలమున న్మనమందిరంబునన్ —ఆ. ౭

చ. విప్పగు నీచకర్మపదవిం జనువారికి మంత్రతంత్రముల్
తప్పినఁ బ్రత్యవాయములు తాఁకొనివచ్చుటెకాని దానలే
దప్పరమేశుఁ జొందెడుప్రయత్నము నే నిటనీకు వేడుకం
జెప్పెద నుత్తమార్గమునఁ జేయుము తత్క్రియ భూసురోత్తమా-ఆ౩

మ. రమణీబంధుజనాప్తులు న్విడిచి తద్రాజ్యంబు వర్జించి దు
ర్దమకామాదులఁ జెందనీక హృదయస్థైర్యంబున న్మించి నీ
వమితోద్యద్గుణకీర్తనామృతముచే నాహ్లాదముక్తుండవై
విమలాంతఃకరణుండ వై ననిను నే వీక్షించితిం బుత్రకా—ఆ. ౮

మ. హరి సంగీతవినోదలోలుఁ డగుచో నత్యంతశీఘ్రంబునన్
వరగానంబులు నాత్మసద్గుణకథావర్ణంబు లై నట్టిగీ
తరసంబుల్ రసనం జవిం గొనెడుమ ర్త్యశ్రేణి కిష్టార్థముల్
పరిపూర్ణంబులుగా నొసంగును దయాపారీణుఁడై వేడుక—ఆ.౫

2. ఒడ్డెపూడి పెద్దయ్య

ఈ కవి వాయుపురాణమును తెనుఁగించి, పురుషోత్తమపట్టణ నివాసుఁడయిన దాసరి చిన్నగంగయ్య యను కమ్మచౌదరి కంకితము చేసెను. పురుషోత్తమపట్టణము కొండపల్లెకుఁ బ్రాగ్భాగమున నున్న ట్లును, దానినివీరపురుషోత్తమ గజపతి తనపేరఁ గట్టించినట్లును గవి చెప్పియున్నాఁడు. వీరపురుషోత్తమగజపతి కొండవీటి కధిపతిగా నుండి క్రీస్తుశకము ౧౫౬౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౯౬ వ సంవత్స రము వఱకును రాజ్యపాలనము చేసెను. ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన యితని మనుమఁడైన వీరభద్రగజపతిని ౧౬౧౫ వ సంవత్సరము నందు కృష్ణదేవరాయలు జయించి కొండవీటిని స్వాధీనము చేసికొనెను. దీనినిబట్టి వాయుపురాణము కృష్ణదేవరాయని కాలమున కనంతరమునఁ రచింపఁబడినట్లు తెలిసినదికాని యెప్పుడు చేయబడినదో తెలియదు. అప్పకవి యీ పురాణమునుండి పద్యములు నుదాహరించియుండకపోవుట మొదలయిన కొన్ని హేతువులనుబట్టి హరిభట్టకవికాలమువలెనే యీ కవికాలమును ౧౬౬౦ వ సంవత్సరప్రాంతమని యూహింపఁ బగియున్నది. ఈ యిద్దఱుకవులును కవిత్రయమునని ప్రసిద్ధిగన్న నన్నయ తిక్కన శంబుదాసులనుదిక్కు నితరాంధ్రకవులను దమ గ్రంథముల యందుఁ బేర్కొనియుండలేదు. కవికృతినాయకుఁడైన చినగంగయ్య కొలువుఁ గూర్చుండి తన్నుఁగూర్చియు సభికులనుగూర్చియుఁ బలికిన వాక్యముల నిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అత్రులితశాస్త్రేతిహాసంబు లొకవంక నొకవంక దండనాయకగణంబు
తతచతుర్విధవేదతత్త్వజ్ఞు లొకవంక నొకవంక నిపుణశాబ్దిక చయంబు
ప్రకటితప్రౌఢతార్కికబృంద మొకవంకనొకవంకఁజతురవాక్కునవినికర
మకళంకపౌరాణికకదంబ మొకవంక నొకవంక జ్యోతిషప్రకరవేత్త

లొక్కచో బంధునిచయంబు లొక్కయెడ స
మగ్రసామంతవిసరంబు మహిమఁ గొలువఁ
గొలువుకూటంబు నందుండి కలితవచన
గౌరవముమీఱు సభికులఁ గాంచి పలికె.

* * * *

చ. వినతసమస్తభూభుజుని వేంకటమంత్రికిఁ బేరమాంబకున్
దనయునిఁ బుణ్యవర్తనుని దానగుణాన్వితు నారసింహ్మా
ద్వ్యనరుహచంచరీకు ననివార్యవచోరచనావిశారదున్
నను బినయొడ్డెపూడి పురనాథునిఁ బెద్దకవీంద్రచంద్రునిన్.

తోటకము—వినయంబునఁ గన్గొని వేమక ని
ట్లనియెన్ సుకవీంద్ర మురారికథల్
వినినంత నభీష్టనవీనఫలం
బనయంబును గల్గు జనావళికిన్.

* * * *

ఉ. పంకజగర్భదారకటిభాగవిభాసితభర్మమేఖలా
కింకిణికావిరావములఁ గేరి తదీయకరాగ్రపిస్ఫుర
త్కంకణనిష్కళంకనినదంబు నగున్ బినయొడ్డెపూడిమా
వేంకటమంత్రిపెద్దన నవీనవిలాసవచోనిగుంభనల్.

ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; వేంకటమంత్రి పుత్రుఁడు; ఒడ్డెపూడి గ్రామమునకు కరణము. ఇతఁడు వాయుపురాణము లోనికొంతభాగమును మాత్రమే తెనిగించినట్లు కనబడుచున్నది. ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని దోషములున్నను మొత్తముమీఁద కవిత్వము రసవంతముగానేయున్నది. వాయుపురాణమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

మ. కరకోచ్ఛారితమై ఘనాఘనబృహద్గర్జారవోపేతమై
వరవిద్యుల్లతికాతతిప్రబలమై వాస్తోష్పతీష్వాసబం
ధురమై సర్వదిశాభిభాగములు నస్తోకాంబుపూర్ణంబుగాఁ
గురిసె న్వర్షము నీషజ్రవజము సంక్షోభింప భీమంబుగన్—ఆ.౧

ఉ. పొంగినవేడ్కచే నతఁడపూర్వముగా విహరించుచుండి యా
చెంగటఁ గాంచె దివ్యసరసీరుహశోభితమత్తభృంగ ను
త్తుంగతరంగఁ దోయపరిపోషనిష్కీర్ణ బలాకచక్రచ
క్రాంగ నభంగగంగ నికటాగతసంయమిసంగ నెంతయున్—ఆ. ౨

మ. కడుదూరంబున నుండి మేను వడఁకంగాఁ బాదముల్ తొట్రిలన్
వడచేఁ జిక్కి హరీ యటంచును గ్భహద్వారంబుఁ జేరంగ నే
నిడఁగాఁ బంచితి నీరసాన్న మతఁడున్ హేయంబుగాఁ జూడకే
కుడిచెం దత్కలుషంబు చేయుకతనన్ ఘోరాటనీభూములన్—ఆ. 3

మ. మునిసంఘంబులు బ్రెమొక్కఁ దామరలు సమ్మోదంబున న్నిక్కఁ గో
కనికాయంబుల కింపు లెక్కఁ గుముదౌఘంబుల్ రుచు ల్దక్క నో
ర్వనిగర్వంబులు చూలి జాలిఁబడి జీనంజీనముల్ బ్రుక్కఁ దూ
ర్పున మార్తాండుఁడు గానిపించె భువనంబుల్ రంజిలం జేయుచున్—ఆర

ఉ. ఇంద్రుఁడ నీవు దుఃఖపడ నేటికిఁ గౌశిక మాని చేయుని
స్తంద్రతపంబు మాన్పుటకు శక్యము గాదననేల ధీరతన్
రుంద్రమతి న్సుఖంపుము నిరూఢిగ నేనిడె చక్కఁ జేసెదన్
జంద్రముఖీవిలోకనసుసంగతిఁ జొక్కఁక యెట్టివారలున్—ఆ. ౪

———

3. కాకమాని మూర్తి

ఈకవి కాకమానికులజుఁడైన బ్రాహ్మణుఁడు; కౌండిన్యస గోత్రుఁడు; రామలింగ భట్టుపుత్రుఁడు. ఇతఁడు పాంచాలీపరిణయము, రాజవాహనవిజయము అను రెండు ప్రబంధములను రచియించెను. రాజవాహనవిజయములోని యీక్రింది పద్యమునుబట్టి యీకవి యింటి పేరు పెన్నావారసి తెలియనచ్చుచున్నది—

సీ. గుణధన్యుఁగౌండిన్యగోత్రునాపస్తంబసూత్రునివెలనాఁటిశుభచరిత్రుఁ
గాకమానీమహాగ్రామాబ్జమిత్రుఁ బెన్నాకలశాబ్ధితారాకళత్రు
సరసవిద్వత్కవి సార్వభౌముని రామబుధసంభవునకుఁ బ్రబోధసుధికిఁ
బౌత్రునిఁ బినరామభట్టాగ్రజన్ముఁడై తనరు శ్రీరామలింగనకుఁ దిమ్మ
మాంబికకుఁ బుత్రుఁ సూర్యనారాయణద్వ
యైకసహాజన్ము నుభయభాషాకవిత్వ
తత్వనిధి నన్ను మూర్తివిద్వత్కవీంద్రు
హర్షమునఁ జూచి యిట్లని యానతిచ్చె.

ఇతఁడు తనగ్రంథములను నరాంకితములఁ జేయక రాజవాహన విజయమును శ్రీవేంకటేశ్వరులకును, పాంచాలీపరిణయమును శ్రీరంగ పతికిని, అర్పించినందునఁ గృతిపతులను బట్టి కవికాలమును నిర్ణయిం చుట కాధారములేదు. ఇఁకఁ గవిస్తుతిలోనై నను పాంచాలీపరిణయ మునం దితఁ డితరాంధ్రకవులను బేరుకొనక తనముత్తాతయు తాతయు నై నగ్రామపండితుని ప్రబోధపండితుని మాత్ర మీపద్యమునందు పేరులు పెట్టి నుతించియున్నాఁడు—

చ. ప్రబలమతి న్ననుతింతుఁ బ్రతిభాకృతిభాషితభారతీశులన్
గబళితసర్వదర్శనులఁ గావ్యచమత్కృతికాళిదాసులన్
నిబిడతపోవిలాసులఁ దృణీకృతవాదులఁ గాకమాని రా
మబుధవిధున్ ప్రబోధసుధి మత్పితామహునిన్ బితామహున్.

రాజవాహనవిజయమునందు వీరినిగాక యీపద్యమునందుఁ గవి త్రయమునగూడఁ బేర్కొని యున్నాఁడు—

ఉ. శ్రీరఘురామకావ్యకృతశిష్టవిధిజ్ఞుఁ, బరాశరాత్మజున్
భారవిఁ గాళిదాసు శివభద్రు మురారి మయూరు బిల్హణున్
జోరుని మల్లనాదిసురసూక్తి కవీంద్రులఁ గొల్చి యెంచెదన్
భారతకర్తృతాచణుల నన్నయఁ దిక్కన నెట్టినార్యునిన్.

ఇతఁ డన్యకవుల నెవ్వరిని గొనియాడకపోయినను వసుచరిత్రకర్త యైన బట్టుమూర్తికిఁ దరువాతివాఁ డయినందుకు సందేహములేదు. వసుచరిత్రకర్త మూర్తి యన్నమాట వినఁబడఁగానే మూర్తి నరస భూపాలీయకర్తగాని వసుచరిత్రకర్త కాఁ డనియు, ఉభయగ్రంథకర్తలు బట్టువంశజులయి యేకకాలవా రగుటచేఁ బూర్వకాలమునుండియుఁ బండితపామర సాధారణముగా వసుచరిత్రకారుఁడు బట్టుమూర్తి యన్న భ్రమ యంధ పరంపరగా వచ్చుచున్నదనియు, కొందఱు చెప్పవత్తురు. ఒక్కకాలమునం దిద్దఱు కవులుండి వారిలో నొక్కఁడు సుప్రసిద్ధుఁడును రెండవవాఁ డప్రసిద్ధుఁడును నయినప్పుడు సుప్రసిద్ధునిపే రడఁగిపోయి యప్రసిద్ధునిపేరు పైకివచ్చుట యెన్నఁడును సంభవింపనేరదుగాన, అధిక ప్రసిద్ధుఁ డయిన రామరాజభూషణునిపే రడుగంటి యాతని గ్రంథ కర్తృత్వము బట్టుమూర్తివిమోఁదఁ బడెననుట యుక్తియుక్తముకాదు. ఒకవేళ భ్రమకలిగెను పక్షమున, నరసభూపాలీయకర్త రామరాజ భూషణుఁడని కలుగవలెను. అప్రస్తుతమైన యీవాదాంశము నటుండనిచ్చి కార్యాంశమునకు వత్తము. అనేకులీకవిని బట్టుమూర్తినిగా భ్రమించి యితని పాంచాలీపరిణయములోని యీక్రిందిపద్యమును—

గీ. అల్లసానివానియల్లిక బిగిసొంపు । మిక్కు-తిమ్మనార్యు ముద్దుఁబలుకుఁ
బాండురంగసుకవి పద్యంబుహారువును । గాకమానిరాయ నీకె కలదు.

బట్టుమూర్తినిగూర్చి రామకృష్ణకవి పలికినట్లు చెప్పుచున్నారు. ఇది నామసామ్యమునుబట్టి కలిగిన భ్రమగాని వేఱుకాదు. మఱియు నీపద్యమునుబట్టి యీకవి తెనాలి రామకృష్ణునికాలమునకుఁ దరువాతి వాఁడనుట స్పష్టమగుచున్నది. పయిపద్యములో శ్రీరంగేశుఁడు తన కవిత్వమునుగూర్చి యట్లు పలికినట్లు చెప్పుకొనుటయే కాక రాజవాహన విజయములో సరస్వతిని ప్రార్థించునప్పుడుకూడ నిట్లు చెప్పియున్నాఁడు.

ఉ. చోరు నలంక్రియావిహృతిసొంపు మయూరునిసౌకుమార్యమున్
భారవికాంతిసంపదయు బాణగుణాఢ్యతర ప్రయోగ మా
దారి మురారికోమలపదంబుప్రసాదముఁ గల్గునట్లుగా
భారతి యిచ్చుఁగాతఁ బ్రతిభారతి మత్కృతికిం జమత్కృతిన్.

ఈతని కవిత్వమునం దీకవి పొగడుకొన్నంత యాధిక్యము లేక పోయినను, రసవంతమయి సలక్షణమయి యమకాది శబ్దార్థాలంకార యుక్తమయి కవితారచన యనర్గళధారగా ప్రవహించుచున్నది. గ్రంథ ములం దన్యదేశ్యపదములును పూర్వాలాక్షణిక సమ్మతములుకాని ప్రయో గములును గొన్నియందందుఁ గానఁబడుచున్నవి. కవి ౧౬౭౦ వ సంవత్సరప్రాంతములయందుండి యుండియుండును. కాకమానిమూర్తి బహుళాశ్వచరిత్రములోనివని కొన్నిపద్యములు రంగరాట్ఛందమునం దును సర్వలక్షణ సారసంగ్రహమునందును ఉదాహరింపఁబడియున్నవి కాని యితఁడు రచియించిన బహుళాశ్వచరిత్రము నాకు లభింపలేదు. ఈమూర్తికవి రాజవాహనవిజయములో చంద్రగిరి హనుమంతుని స్తుతించి యుండుటచేత నీతని వాసస్థానమైన కాకమానిగ్రామము చంద్రగిరి సమీపమున నుండియుండును. కవిత్వరీతిని దెలుపుట కీతని గ్రంథముల నుండి కొన్నిపద్యముల నుదాహరించుచున్నాను—

రాజవాహన విజయము.

శా. ధాటిఘోటఖురాగ్రనిర్దళితగోత్రాధూళికాగంథచూ
ర్ణాటోపాతిపరిస్ఫురత్కటినసర్వాశావధూటీకుచా
ఘాటచ్ఛాయదరాగశాటితసమాఖ్యావిక్రమప్రక్రమా
త్యాటీకాహితరాజహంసుఁ డగు నాహా రాజహంసుం డిలక్ — ఆ. ౧.

ఉ. మీసపు మొక్కనిక్కనకు మిక్కిలి తొల్కరివాన కుంతలా
ళీసురపాలనీలమణిలీలకుఁ గ్రొన్ననుసాన విభ్రమ
శ్రీ సరసీరుహంబు మదసింధురసప్రసవంబు సూనబా
ణాసతపఃఫలం బపుడు యౌవన మబ్బెఁ గుమారమౌళికిన్ — ఆ. ౨

శా. పూవుందోఁట యొయ్యూరి చేరి బలితంపుంజందురాతిన్నెలం
బూవుందేసియ సోనవాన చొతుకు ల్పోవై చు గొజ్జంగిపూ
పై వాటు ల్గలదాసనంపుఁగనిమల్ పస్నీటిమున్నీటి బల్
త్రోవం గట్టినపచ్చమెట్టికలపైఁ దోడ్తోడఁ గ్రీడింపఁగన్ — ఆ. 3.

ఉ. తాలిమిదూలి తూలి చెలి దర్పకుఁ డప్పుడె వంచుతమ్మిపూ
వాలికతూపొ క్రొంజెమటవానకుఁ గారణ మైననిద్దపుం
గోలమెఱుంగొ యాననచకోరహితాగతరశ్మియోర యో
లోలమృగాక్షి నాపయిఁ దళుక్కునఁ జూచినచూపు బాపురే. ఆ-ర

మ. కటకంబు ల్గలయుతటద్విపఘటల్ ఘంటాపథప్రస్ఫుట
తటకంబు ల్గొల్పరయంగఁ జక్కఁజన వాద్యధ్వానశక్తి మహా
కటకంబుల్ ప్రతివాద మీన విభవోత్కంఠన్ దిశాభూమిభృ
త్తటకంబు ల్గన రాజు చేరఁ జనియెం దన్మంది రాళిందమున్. ఆ. ౪.

పాంచాలీపరిణయము.

ఉ. ఏయుఁ గఠోరమార్గణము లివ్వలి కవ్వలి కద్రి దూయఁగా
వ్రేయుధరాస్థలిన్ సబిడివెంటనె గాంగరుధరంబు లేవఁగాఁ

జేయును నగ్గునూఁచములు చెట్టునుజట్టునఁగొట్టి బిట్టుగా
నాయనలాయనప్రభవుఁ డాయన యీవనగర్వసంపదన్. ఆ. ౧.

ఉ. ఎంతటివన్నిఁ దెచ్చె గుటి యేసి యితండు ద్విజన్మజాతికిఁ
వింత యటంచు రాజుల గణింపక తిట్టుచు గేలి గొట్టుచున్
గంతులు వై చుచుం దలకుఁ గట్టినచెం గెగవై చి పట్టుచున్
గొంతులురాయఁగోయనుచుఁ గూఁతలు పెట్టిరిగ్రామ్యభూసురుల్. ఆ-౨

ఉ. ముందఱఁ గాంచె దిగ్రమణముఖ్యుఁడు వారుణవేషభూషణుఁ
మంధరకంధరాకనకమందిరమధ్యవితర్దిమందపొ
రందరనీలకందరధురంధరసింధురవై రిపీఠవా
సేందుకళాకలాపు హృదయేశ్వరితోడుత నెత్తమాడఁగన్. ఆ. 3.

శా. నీకేవచ్చు సువాలయ్య ధవళ మింతీ యల్లో నేరేళ్లు గా
రీకళ్యాణము లంచు నింటికడ నేరీతి స్వజృంభింతువే
వాకీ విచ్చట నంచు సిద్ధఱుసతు ల్వ్యాకోపవాక్యంబులన్
గాకై ముందలపల్లకుం దొడఁగి రాకల్యాణవేదిస్థలిన్. ఆ. ౪.

శా. ఆఁడుంగాన్పును గంటకన్న సతి గొడ్రా లౌటయే మేలు నూ
జేఁడు ల్పెంచినఁ గూఁతు రేమి సతమా యీవియ్యము ల్కోఁడలిన్
గాఁడంబల్కినఁ దాళఁగావలసెఁగా కాఁగానితిట్లాడికల్
నేఁ డీతండ్రియుఁ దల్లి వంగడముకానీ పంచుకోనాయెఁగా. ఆ. ౫.

4. కామేశ్వరకవి

ఇతఁడు సత్యభామాసాంత్వనమను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచియించి, మధురనాయకుఁడైన ముద్దులగరి నృపాలున కంకితముచేసెను. ఈమధుర శ్రీకృష్ణుని జన్మస్థల మయిన మధురాపురముగాక పాండ్యమండలమునకు రాజధానియైన దక్షిణ మధుర యైన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలిసికొనవచ్చును—

క. లక్షణలక్షితకమలా । వీక్షణపుంఖానుపుంఖవిభవోన్మేషా
నుక్షణతతవిశ్రుతియై । దక్షిణమధురాపురంబు తనరు ధరిత్రిన్.

కృష్ణదేవరాయని యనంతరముఁ దెలుఁగు నాయకులు పాండ్య మండలమును జిరకాలము పాలించిరి. ఈకవి యీకాలమునంను మధురా పురమును బాలించుచున్న ముద్దళగరిరాజు సభలోఁ గూరుచుండి తన్నుఁ గూర్చి యిట్లు పలికిన ట్లీపద్యములలోఁ జెప్పినాఁడు—

శా. ఆరీతిన్ సభ ముద్దులళ్గరిధరాధ్యక్షుండు కొల్వుండి తా
హేరాళంబుగ నయ్యెడన్నడుచుసాహిత్యప్రసంగంబు గం
భీరప్రౌఢిమ వించు నచ్చిలిచి నెమ్మిం బల్కి వీణాకన
ద్ధారీపాణిసువర్ణకంకణ రుణత్కారానుకారోక్తులన్.

చ. అనువుగ రుక్మిణీపరిణయంబును ముహావణించి యీర్ష్యలా
ననఁ దనియించినావు మము నప్రతిమంబుగ నవ్యకావ్య మిం
పున రచియింపుమీ సొగసుపోఁడిమి మీఱఁగ సత్యభామసాం
త్వనమును గప్పురంపుఁజలువం గెలువం దిరుకామసత్కవీ.

క. కాకులనలె నింటింటను । గాకవు లున్నారు హంసకై వడి భువిలో
శ్రీకామ నీకె తగురా । వేకడ నుడిసాలు నీరు నేర్పఱుపంగన్.

క. ఏ భాష నైనఁ గృతిపతి । శోభనములు చెంది నీమసూక్తులవలనన్
నీ భాగ్య మసదృశము గా । రీభవకరుణానివేశ శ్రీకామేశా.

ఈ ముద్దళగరి తన సవతియన్నగారయిన చొక్కనాథుఁడు స్త్రీలోలుఁడయి రాజ్యభారమును తమ్మునివిమాఁదఁ బెట్టి తంజావూరిలోనున్న కాలములో యువరాజుగా రాజ్యముచేసెను. చొక్కనాథుఁడు క్రీస్తుశకము ౧౬౬౦ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౨ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసెను. కవి యీ ముద్దళగరినే రాజునుగా వర్ణించినను, అతని వర్ణనలోఁగల యీ క్రింది పద్యమునుబట్టి యన్న యుండగానే యతఁడు రాజ్యభారము వహించినట్లు స్పష్టమగుచున్నది—

ఉ. అన్నయు దమ్ము లీకరణి నందఱు నొద్దికమై యఖోరమల్
చెన్నున వహింప రాముక్రియచేఁ దనుఁ జెందినరాజ్యసంపద
భ్యున్నతభోగభాగ్యుఁడయి యుర్విని సర్వనృపాలకోటిలో
నెన్నిక కెక్కె ముద్దళగరీంద్రుఁడు తాను మహాప్రతాపియై.

ఈ ముద్దళగరి ౧౬౭౬ వ సంవత్సరప్రాంతమునఁ దానే రాజ్యమునాక్రమించుకొని సంవత్సరకాలము స్వతంత్రముగాఁ దనపేరనే పాలనము చేసెను గాని యింతలో చొక్కనాథుఁడు వచ్చి దేశము మరల స్వాధీనము చేసికొనెను. చొక్కనాథుఁడును, ముద్దళగరియు, మఱిముగ్గురును ౧౬౭౭ వ సంవత్సరము మొదలుకొని ౧౬౮౯ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి ప్రసిద్ధికెక్కిన తిరుమలనాయకుని కొమార్తె. ఇందుఁ దెలుపఁబడిన చరిత్రమునుబట్టి కవి యీ గ్రంథమును ౧౬౭౫ వ సంవత్సరప్రాంతమునందుఁ రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఇతఁడు రుక్మిణీపరిణయమును గూడ రచియించినట్లు చెప్పఁబడినదిగాని యీపుస్తకము నాకు లభింపలేదు. "దక్షిణసింహాసనాధ్యక్ష తిరుమలక్ష్మాకాంత కరుణాకటాక్షలక్షిత స్వచ్ఛముక్తాగుచ్ఛసితచ్ఛత్ర చామరకళాచికా కనకాందోళికా విరాజోపచార" యని యీశ్వాసాంత గద్యమునఁ జెప్పుకొని యుండుటచేతఁ గవి తిరుమలనాయకుని కాలమునందు సహితముండి ౧౬౫౦ వ సంవత్సరప్రాంతములనుండి కవిత్వమునందుఁ బ్రసిద్ధి

నొందియుండును. ఈ గద్యమునందే యితఁడు "శ్రీకాళహస్తీశ్వర చరణారవింద మిళిందాయమాన జ్ఞానప్రసూనాంబికా కృపాలంబ విజృంభమాణ సారసారస్వత సుధాతరంగ" యని చెప్పుకొనుటచే నితఁడు కాళహస్తినివాసుఁడయి మధురనాయకుల యాదరమువలన మధురసంస్థానమును జేరినట్లు కనఁబడుచున్నది. విజయవిలాసమునలెనే యిదియు శుద్ధ ద్రవిడదేశమునందుఁ జేయఁబడిన ప్రబంధము. ఇవిగాక యఱవదేశమునందుఁ జేయఁబడిన తెనుఁగుకావ్యము లింకను బెక్కులు గలవు. "వల్లకీ వాదన ఝురీణ వర్ణగీతాది గాంధర్వస్వర్ణవీనకల్పనాప్రవీణ" యనియు గద్యమునందు కవి వ్రాసికొన్నాఁడు. అందుచేత నితఁడు సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁడని విశదమగుచున్నది. ఈ కవి యింటిపేరు లింగనమఖివారు; తండ్రిపేరు నాగనామాత్యుఁడు; తల్లిపేరు కామాక్ష్యంబ. ఈతని కవిత్వము ప్రౌఢమయినది, సత్యభామా సాంత్వనమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.—

ఉ. ఆపురమందుఁ గెంపుజిగియందపుఁగోట పయోధికన్యకున్
ప్రాపయి తిమ్మిపోలికను భాసిలెఁ గొమ్మలు లేకు లట్లు చా
లై పరఁగెం దతంతరగళన్నవమౌక్తికలీల నబ్ధివీ
చీపృగుశీకరమ్ము లెగసెన్ హరి సేసలు చల్లు కైవరిన్.

ఉ. తావులవెంబడిం గదలి తారొక్కనెఁ దేటులు వ్రేటిలేక్కలం
బోవక నాలుఁ బువ్వాడియుఁ బువ్వాడిత్రోఁ దగెఁ బూవుసోన యా
పూవులసోనతో మిగులఁ బొల్చెను గల్పతరుప్రసూనమా
ధ్వీవిసరంబు నావెనుక వీచెను ఒల్లని కమ్మతెమ్మెరల్—ఆ. ౩

ఉ. చూడక చూచినట్లు తమి సోలుచు సొక్కుచు మోహ ముంచి మా
టాడక యూరినట్లు కలయుం గమకించి మదిం గణించి యా
చేడియతోడిలోక మయి చింతిలి కార్యము నెంచ కుండుటల్
పాడియె తెల్పుమా యవితపాండవ కాళియమోళితాండవా—ఆ.3

శా. భాసిల్లె న్నిజసోదరేందుశుభగంభావక్రియావీక్షణో
ల్లాసోదారముకుందదారకృతలీలాస్యసారస్యభృం
గీసంగీతతరంగితాబ్జరుచిభంగీజాతరంగోల్ల స
త్కాసారాబ్ధితరంగజాలము శరత్కాలం బవేలంబుగన్ —ఆ. ర

---

5. వెణుతురుబల్లి విశ్వనాథకవి

ఇతఁడు శేషధర్మములను బద్యకావ్యమునుగా రచియించి పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁడయిన వత్సవాయతిమ్మన్నపాలుని కంకితము చేసెను. ఇతఁ డాఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. ఈతని తండ్రిపేరు వేంకటామాత్యుఁడు. ఇతఁడు ౧౬౦౦ వ సంవత్సరప్రాంతములయం దుండినవాఁడు. ఈకృతిపతినగూర్చియు.కృతికర్తనుగూర్చియు నేనుఁగు లక్ష్మణకవి చరిత్రమునందుఁ గొంత తెలుపఁబడి యున్నది. ఇతనిది సలక్షణమయిన మంచికవిత్వము. ఈతని శేషధర్మములనుండి రెండు పద్యము లిందుఁగై కొనఁబడుచున్నవి—

శా. మాయామావిప్రుల కాద్విజుండు కడిగెన్ బాదాంబుజద్వంద్వముల్
చేయారం గుసుమాక్షతాదులను బూజించెం గాత్రము ల్వ్రచె న
ట్లాయాపాత్రములందు నన్నము లిఱన్ నారంభుఁ డానంతలో
నాయింద్రుండు గృహస్థుఁజూచిపలికెన్ సాక్షేపపూర్వంబుగన్. ఆ.౧
ఉ. కాలినయప్పగుండ్ల ముఖగహ్వారభాగములందుఁ గ్రుక్కుచున్
సోలుపు లేర్పడ న్నెఱుఁగుసూదులఁ గ్రుచ్చుచుం దలల్
నేలకుఁ జేర్చి పాదములు నింగికి నెత్తుచుఁ బెక్కుజాడలన్
గాలభటుల్వ్రాతల్గుమపఁగాఁ బడియుండుము రంతమోఁదటన్. ఆ. 3.

---

6. నూతనకవి సూరన్న

ఈకవి సకలజనాభిరామ మను నామాంతరముగల ధనాభిరామ మను మూడాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; తిప్పయా మాత్యపుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు—

సీ. ని స్సీర్ణవై భ వాపస్తంబసూత్రుండఁ గాశ్యపగోత్ర విఖ్యాతయశుఁడ
ఘనతననంతసేనుని మల్ల యామాత్యపౌత్రుఁడఁ దిప్పయప్రభుసుతుండ
భార్గవతీశుభగర్భసాధోనిధానసంధానేశచిత్తుండ మానధనుడ
సత్కావ్యసారీణ సారస్యసంలబ్ధవిస్తారమతి గలవిమలయశుఁడ
భద్రవై భవశ్రీవీరభద్రలబ్ధ । జనితచాతుర్యకావ్యలక్షణవిచిత్ర
విపులవాచాసమగ్రసంవిద్ధమతిని।సూరనామాత్యనామకసుకవివరుఁడ.

కవి తనగ్రంథమున వ్రాసికొన్న యీక్రింది పద్యమునుబట్టి తాను దిక్కన సోమయాజి సంతతివాఁడనని చెప్పుకోఁదలఁచినట్లు కనుపట్టు చున్నది—

చ. అనువుగ భారతాంబుసిధి యవ్వలికిం దెగనెట్టి యందులో
ఘనకవితామృతంబు చవి గాంచిన తిక్కన సోమయాజిపా
వనతర మైనయట్టికులవర్ధను మహిం పేరుగల్గు నూ
తనకవి సూరనార్యుఁడను ధర్మగుణాంచితపాలనీయుఁడన్.

ఈకవి తన కావ్యమును దాక్షారామభీమేశ్వరుని కంకితము చేయుటచేత నితఁడు గోదావరీ మండలములోనివాఁడయినట్లు కనఁబడు చున్నాడు. ఈతఁడేకాలపువాఁడో తెలియరాలేదుగాని పూర్వకవులను మధ్యకవులను మాత్రము స్తుతించి చిమ్మపూడి యమరేశ్వరుని—

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె

న్నలరిన చిన్మూపూడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దఁతు నపూర్వాదివ్యకవితామహనీయసమగ్రచిత్తులన్.

అని కవిస్తుతిలోఁ బేర్కొనియుండుటచేతను, ఇంతమంది పూర్వ కవులను జెప్పి మధ్యకవులలో నొక్కనిని జెప్పకపోవుటచేతను, ఇతఁడు మధ్యకవులలోఁ జేరినవాఁడేమో యని సందేహము కలుగుచున్నది. అయినను స్వతంత్రములైన యితరాధారములు లేక మధ్యకవులను బేర్కొనక పోయినంతమాత్రమున నితఁడు మధ్యకవి యని నిశ్చయించుటకు వలనుపడదు. కాని యితఁ డిన్నూఱుసంవత్సరముల క్రిందటివాఁడని యైనను జెప్పవచ్చునని తోఁచుచున్నది. ఈతఁడు రచియించిన ధనాభిరామము కథ కొంతవఱకు మనోహరముగా నున్నది. ఇంద్రసభా మందిరమునందు మన్మథునికిని కుబేరునికిని రూప మెక్కువ యనియు ధన మెక్కువ యనియు వివాదము సంభవించి వారితగవు మాటలతో తెగనంచున—

చ. తకమిడి యిన్నిమాటలు వృథాపనిలేదు సమస్తవై భవో
త్కర మగుదాక్షవాటిపురి గల్గు ధరాస్థలిలోనఁ బోయి నీ
నిరుపమరూపసంపదయు నేరుపుఁ జూపుము నేను వచ్చి యీ
పురవరసీమఁ జూపెదను భూరిధనంబున నామహత్త్వమున్.

అని కుబేరుఁడు మన్మథునిజూచి, 'మాటలతోఁ బ్రయోజనము లేదు. మన మిద్దఱమును భూమిమీఁద దాక్షారామములోఁ బుట్టుదము. అక్కడ నీవు మొట్టమొదట నీసౌందర్యమును నేర్పునుజూపుము. తరువాత నేను వచ్చి నాధనమహిమను జూపెదను. అప్పుడు మనయిద్ద ఱిలో నెవ్వరు బలవత్తరులో తేటపడి రూపమహిమ యెక్కువయినదియు ధనమహిమ యెక్కువై నదియు నెల్లడియగును' అని పలుకఁగా మన్మథుఁ డాతని యాహ్వాన మంగీకరించి పూర్వకాలమునుండియు వేశ్య లచేఁ బ్రసిద్ధమయిన నదాక్షవాటికకుఁ బోయి యందుఁ దన రూపవిశేష

మును జూపఁగా నాట్యమునకయి భీమేశ్వరస్వామి యాలయమునకుఁ బోయిన సుగుణావతి యను పణ్యాయువతి యాతనిని గాంచి కామించి యింటికిఁబోయి యాతనిం దనయింటికిఁ దోడితెమ్మని తన చెలికత్తెను వేఁడుకోఁగా నావయస్య—

ఉ. అక్కట వాసివన్నె గలయట్టికులంబునఁ బుట్టి రూపుచే
నెక్కుడు భాగ్యసంపదల నెన్నిక కెక్కినదాన వింతలో
నెక్కడివానికి న్వాలచి తెయ్యదొ వానికులంబు విన్న వా
రొక్కట నవ్వరే విబుధు ముత్పలలోచన నీకు బ్రమొక్కెదన్.

ఉ. నిచ్చలు నిండి వల్లభులు నీకడ గానఁగలేక కానుకల్
తెచ్చి తమంతఁ గ్రందుకొని తేకువ మోసలఁ గాచుచుండఁగాఁ
జెచ్చెరవారలన్ ఘనము చేయక డాయక యూరకున్నచో
నొచ్చెముకాచె నీకును బయోరుహలోచన యిప్పురంబునన్.

చ. కలికితనంబుమీఱఁగ వికారముతోడ మనోజకేళి ని
చ్చలుఁ దమకంబుపుట్టి విటసంఘము తెచ్చియొసంగునీమహా
జ్జ్వలమణిభూషణాదిఘనవస్తువు లొందుట కర్తిగాక తా
వలచుట పంతమా ధరణి వారవధూమణికిం దలోదరీ.

అని యసారధనము నిచ్చెఁడు విటు లనేకు లుండఁగా ధనమియ్య జాలని క్రొత్తవానిని కేవలరూపసంపదను జూచి వలచుట వారకాంతకు ధర్మముకాదని బుద్ధి చెప్పియుఁ గార్యము గానక తుదకు మన్మథుని దానియింటికిఁ దెచ్చి యప్పగించెను. సుగుణవతియు మన్మథుఁడును గొంతకాల మిట్లప్రకారముగా సుఖ మనుభవింపుచుండఁగా, కుబేరుఁడు యోగివేషమునవచ్చి భీమేశ్వరస్వామి యాలయమునఁ జేరి యచ్చటికి వచ్చెడు వేశ్యలకెల్లను ధనమును చీరలును కొల్లఁగా నొసఁగసాఁగెను. అంత సుగుణవతి తల్లియు నొకనాఁ డచ్చటికిఁ బోయి యాతఁ డిచ్చిన ధనకనకాంబరములను దెచ్చి కూఁతునకుఁ జూపి బోధించి మతిపోఁచి

రూపవంతుఁ డయిన మారుని విడనాడి విత్తవంతుఁడైన కుబేరునిఁ గూడుమన ట్లాగుణవతి నొడఁబఱిచెను. అంతట మన్మథుఁ డోడి పోయి దేవాలయముచేరి భీమేశ్వరస్వామిని ప్రార్థింపఁగా నతఁడు సాక్షాత్కరించి. యొకప్పుడు ధనమును మఱియొకప్పుడు రూపమును విజయము నొందినను మొత్తముమీఁద ధనసౌందర్యములు రెండును సమానములే యని తెలియఁబలికి వారిరువురిని సమాధానపఱిచి వారి స్థానములకు వారిని బంపివేసెను. ఈపుస్తకము చిన్నదే యయినను, కవిత్వము హృద్యముగానే యున్నది. నేలిస జూపుటకై ధనాభిరామమునుండి రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చ. మదనునిగాఁ దలంతు రిల మానిను లెల్లను, సత్కవీశ్వరుల్
పదపడి కర్ణుఁ డీతఁడని ప్రస్తుతిచేయుదు రాత్మగోపలన్
మదవదరాతినర్గములు మానుగఁ గవ్వడి యంద్రు, భూజనుల్
మది దిననాథుఁ డందురు, సమస్తము ద్రవ్యముఖంబు చూచినన్. ఆ ౧

మ. కమనీయంబుగ నాడఁ బాడఁ జదువంగా నేర్చు వీణాది వా
ద్యములన్నైపుణి సొంపుమీఱఁగ గళాస్థానాంగతంత్రంబులన్
సుమనస్సూర్తిమనోజకేళి విటులం జొక్కింపఁగా నేర్చు వి
భ్రమసౌందర్యముల న్వహించు సరిచెప్పన్ లేరు నాపుత్రికిన్. ఆ.3.

7. సముఖ వేంకటకృష్ణప్పనాయకుఁడు

ఈకవి యహల్యాసంక్రందన మను మూడాశ్వాసముల ప్రబంధ మును రచించెను. ఇతఁడు శూద్రకులజుఁడు; సముఖ మీనాక్షీనాయకుని తనుజుఁడు. "శ్రీమత్పాండ్య మండలాధీశ్వర నిజయరంగచొక్కనాథ మహీనాథ కరుణాకటాక్ష సంపాదిత గజతురంగమాందోళికా చ్ఛత్ర చామరవిజయ దోహళకాహళభూరిభేరీ బిరుదధ్వజప్రముఖ నిఖిలసంప త్పారంపరీసమేత" అని యాశ్వాసాంత గద్యమునందుఁ జెప్పుకొనుట చేత కవి మధురాధినాథుఁ డయినవిజయరంగ చొక్కనాథునికాలములో నున్నవాఁ డగుట స్పష్టము. ఈవిజయరంగ చొక్కనాథుఁడు క్రీస్తు శకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరము వఱకును పాండ్యమండలాధీశ్వరుఁడుగా నుండెను. కాఁబట్టి కవియు ౧౭౦౦ సంవత్సరప్రాంతములనుండి యున్నవాఁడే. ఇతఁడు జైమినిభారత మును వచనకావ్యమునుగా రచించినట్లహల్యాసంక్రందనములోని యీక్రింది పద్యమువలన దెలియవచ్చుచున్నది—

గీ. సముఖమీనాక్షినృపగర్భనిధులజలధి
చంద్ర వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర
మునుపు జైమినిభారత మనఘ వచన
కావ్య మొనరించినట్టి సత్కవివికావె.

ఈ కాలమునందే మంచికవులచేత తెలుఁగున వచనకావ్యము లారంభింపఁబడినట్లు వినఁబడుచున్నవికాని యీవచనకావ్యము లిప్పుడు కానరావు. తారాశశాంకమును రచించిన శేషము వేంకటపతి యీకవి కాలమునం దుండినవాఁడు. కవితాను "పురోహితభృత్యామాత్య సామాజిక బంధువర్గంబులు కొలువంగూరుచుండి యుభయభాషాకవితా

విశేషుండై శేషము వేంకటపతికవీంద్రుం డాప్తసఖుండు గానఁ బిలి
పించి" నవు డతఁ డీక్రిందిపద్యమును జెప్పెనఁట—

చ. నల నాసత్య వసంతులం గెలుచుసౌందర్యంబు ధైర్యంబు దో
ర్బలముఁ స్వామిహితానువృత్తిదయయుఁ బ్రౌఢత్వము న్విద్యయున్
వెలయఁ బాల్యమునండె నీవు మధుకోర్వీనాథు మెప్పింపవా
బళిరా వేంకటకృష్ణభూవరమణీ బాపాఫణిగ్రామణీ.

అహల్యాసంక్రందనములోని రెండుపద్యముల నిం దుదాహరించు చున్నాను—

ఉ. బంటుతనంబు లాడుకొని పాఱఁగ రావణుచేతిపెట్టునన్
గంటికి నీరు గ్రమ్మఁ గలఁకంబడి పాఱెను నీకుతండ్రి నీ
యాటను లేదు పౌరుష మొకింతయు బీరములేల చేతివా
లంటకు కోడెకాఁడ చుఱు కంటఁగ వెంటనె చెంపగొట్టెదఁ. ఆ. 2

ఉ. ఆతటి నాలతాంగిని మహాగ్రహదృష్టిని జూచియోసి నీ
చేతిజలంబు లంట నిఁకఁ జెల్లునె యెంతటిజంతవే బలా
రాతినిగూడి తీ విపుడు రాతిరిజామునఁ గావునఁ బలా
రాతిశరీర మందు మని రాజముఖిన్ సునఖిఁ శపింపఁగఁ. ఆ. 3.

---

8. రోసనూరి వేంకటపతి

ఈకవి విష్ణుమాయావిలాస మను మూడాశ్వాసముల పద్య కావ్యమును రచియించి దానిని వేంకటగిరిసంస్థానప్రభువయిన శ్రీవెలు గోటి బంగరు యాచమనాయని కంకితము చేసెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; లింగనామాత్యుని పౌత్రుఁడు; గంగనమంత్రి పుత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు. కృతిపతి తండ్రియైన కుమారయాచ భూపాలుఁడు తనకు "తిక్కయజ్వ" యను బిరుదము నిచ్చినట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

మ. నను శ్రీభూపతిలింగపాదభజనానంద గుమారేచ భూ
జనపాలాగ్రణి తిక్కయజ్వయనుచుం జాలంగ బే రిచ్చి ప్రో
చినఁ బెంపొందినరోసనూరికులుసన్ శ్రీవేంకటాఖ్యుం గృపా
ఘనగంభీరశుభైకదృష్టి వెలయంగాఁ జూచి పల్కెం దగన్.

కృతినాయకుఁడైన బంగిరుయాచమనాయఁడు ఔరంగజేబు ఢిల్లీచక్రవర్తిగానున్న కాలములో ౧౬౯౫ వ సంవత్సరమునందు వెల్లూరినబొబగు జుల్ఫగారుచేఁ జంపఁబడినందున ఈపుస్తకము ౧౬౯౦వ సంవత్సరప్రాంతములయందు రచియింపఁబడిన దని చెప్పవచ్చును.

వేంకటగిరిసంస్థానప్రభువు లనేకులు తెలుఁగుభాషయం దభిమానము గలవారయి కవులను బ్రోత్సాహపరిచి తా మనేక ప్రబంధములకుఁ గృతిపతులయిరి. వీరు పద్మనాయకవంశజు లయినవెలమలు. ఈసంస్థాన మును స్థాపించిన మూలపురుషుఁడు బేతాళనాయఁ డనుబిరుదనామము గల చెవిరెడ్డి. ఇతఁడు చేయూరి పోలిరెడ్డికుమారుఁడు. ఇతఁడు తన నివాసస్థల మైన యనుమగల్లు గ్రామమున రేచర్ల యాచఁడు (పచఁడు) అను మాలవాసచేత దనపొలమును దున్నించుచుండఁగా నాగటికఱ్ఱున కొకరాగిశాసనము తగిలెను. దానిని జదివిచూడఁగా నందు "నాగ భైరవపొలము" అనెడి యాచోట త్రొవ్వుదిలక్షలధనము భూస్థాపిత మయి యున్నదనియు, నరబలి యిచ్చినపక్షమున బలియిచ్చినవాని కాధనము దక్కునని యు, వ్రాయఁబడియుండెను. అతఁ డప్పు డేమి చేయుటకును తోఁచనివాఁ డయి యేచనిత్రో నాలోచింపఁగా, వాఁడా స్థలమునందుఁ దనయింటిపేర నొక గ్రామము కట్టించి తనయింటిపేరును గోత్రముగా బెట్టుకొని వంశమునందుఁ బుట్టినపురుషుల కెల్లను దనపేరు పెట్టుచు వివాహము చేయవలసి వచ్చినప్పుడెల్ల ముందుగా దనకులజు లలో నొక్కనికి విహాహముచేయుచు వచ్చుట కంగీకరించినపక్షమునఁ దాను బలియగుట కొప్పుకొనెద నని రెడ్డితోఁ జెప్పెను. చెవిరెడ్డియు

వాఁడు కోరిన నియమముల కన్నిటికి నొప్పుకొని యప్పుడే వాని నాపోలమునకు బలిపెట్టి యీనిక్షేపమును స్వాధీనము చేసికొనెను. తరు వాత నతఁ డాక్షేత్రమున చేచెర్ల యనుగ్రామమును గట్టించి, తనగోత్ర మును చేచర్లవారని మార్చుకొని, ఆయూరు విడిచి పిల్లలమఱ్ఱి యను గ్రామముచేరి యీచోటు నివాసముగా జేసికొనెను. ఈగ్రామమునం దితఁ డొకనాఁడు రాత్రి చీఁకటి పడువఱకును పొలములో బనిచేసి యింటికి వచ్చుచుండగా దారిలో నురుములతోను మెఱుపులతోను గొప్పవాన వచ్చెను. ఆవానలో నతఁ డొక మఱ్ఱిచెట్టుక్రిందికిఁ బోయి నిలువఁబడియుండఁగా, చెట్టువీఁదినుండి యొకభూతము దిగివచ్చిన ట్లాతనిదృష్టికిఁ గనఁబడెనఁట! అతఁ డెంతమాత్రమును జడియక చేత ఖడ్గము ధరించి యెదురుగా నడువఁగా, అతని ధైర్యసాహసములకు మెచ్చి యీబేతాళుఁడు చెవిరెడ్డియు నాతని సంతతివారును శౌర్య సామ్రాజ్యైశ్వర్యవంతు లగుదురనియు శత్రువులతోడి యుద్ధములలో నెల్ల వాను దోడ్పడి వారికి జయము కలిగింతుననియుఁ బలికిన ట్లాతని చెవు లకు వినఁబడెనఁట! బేతాళుఁ డాతనికి ప్రత్యక్షమయి వరములిచ్చెనన్న వార్త దేశమునం దంతటను వ్యాపించి యచిరకాలములోనే కాకతీయ ప్రభువయిన గణపతిరాజు చెవిసోఁకఁగా, అతఁ డాచెవిరెడ్డిని తనరాజధాని యైన యెరంగల్లు నగరమునకు రప్పించి లక్షసాయలువచ్చు గ్రామములిచ్చి తనవద్ద సేనాపతినిగా నియమించి "పిల్లలమఱ్ఱి బేతాళ నాయఁడు" అన్న బిరుదుపేరిచ్చి గౌరవించెను. ఇది ౧౨౫౦ వ సంవ త్సరప్రాంతమయి యుండును.

ఈతఁడు చేసిన నియమములఁ ననుసరించి యీతనివంశమువారు నేటివఱకును యాచనామమునుగూడ దమపుత్రుల నామమునకుఁ జేర్చుచు, తమయింట వివాహము జరఫుటకు ముందుగా నొక మూల వానికి బెండ్లిచేయుచు, పూర్వమర్యాదను జెల్లించుచున్నారు. చెవిరెడ్డి

యొక్క ద్వితీయపుత్రుఁడయిన ప్రసాదాదిత్యనాయఁడు గణపతిరాజు యొక్క మరణానంతరమునం దాతనిభార్యకును బుత్రికకును సహాయుఁడయి యుండి రాజ్య మన్యాక్రాంతము కాకుండఁ గాపాడి కాకతిరాయ రాజ్యప్రతిష్ఠాపనాచార్యుఁడని బిరుదుఁబొందెను. చెవిరెడ్డి యింటిపేరు రాను వారు. ఈరాపువారు మొదట నోరుగల్లురాజ్యమునఁ నేయుండి పేరొంది నను, తరువాత దమపౌరుషమువలన నన్యభూము లాక్రమించుకొని సంస్థానప్రభువులయిరి. ఈవంశమువారిలో నొకఁడగు తిరుమలనాయఁడు కృష్ణదేవరాయల రాజ్యకాలములో వెలుగోటిరాజ్యమును సంపాదించి వెలుగోడుపట్టణము తనకు రాజధానిగాఁ జేసికొన్నందున, ఆతనివంశము వా రప్పటినుండియు వెలుగోటివా రనఁబడుచున్నారు. విష్ణుమాయా విలాసకృతిపతియొక్క తాతయైన పెద్దయాచమనాయఁ డావఱి కన్యా క్రాంతమయిన వేంకటగిరిపురమును మరల స్వాధీనపఱిచుకొని దానిని స్వరాజధానిని జేసికొనఁగా నాటినుండియుఁ దత్సంతతివారి కదియే రాజ ధానిగా నున్నది. చెవిరెడ్డి వంశజులలోనొక్కఁడగు సర్వజ్ఞ సింగమ నాయఁడు బమ్మెర పోతనామాత్యునివలన నుద్దండభోగినీదండకమును శ్రీనాథునివలన గొన్నికృతులను బొందుటయేగాక తాను పండితుఁడయి సింగభూపాలీయ మను నలంకారశాస్త్రము మొదలగు సంస్కృతగ్రంథ ములను సహితము రచించెను. ఆతని వంశజులలో నొకఁడగు రాయప నాయఁడు ౧౬౨౦ వ. సంవత్సరప్రాంతములయందు భానుమతీపరిణ యము కృతినందెను. ఈవెలుగోటివా రిప్పటికిని తెనుఁగుకవుల నాద రించుచున్నారు. కవిత్వరీతి తేటపడుటకయి విష్ణుమాయావిలాసములోని రెండు పద్యములఁ జూపుచున్నాను—

చ. ఇటువలెనేమి యీపయన మిప్పుడు మీ రఖిలేశ మాయలఁ
బటువగు విష్ణుఁడం చనెడుపల్కులు సిద్ధము సుందరీక్రియా

కుటిలశికోజియైన హరి గొబ్బునఁ జూచితి రేని మీకు నో
కృష్ణ జపలత్వ మైనతటి గౌరవ మెట్లగునో తలంపుఁడీ. ఆ. ౧.

చ. వనయువతీవసంతులవివాహమహోత్సవవేళ నెమ్మదిం
దనరు కుతూహలంబున లతాలలనల్కురపల్లవంబులన్
ఘనముగ సేసవెట్టుటకుఁగా ధరియించిన మౌక్తికంబులో
యన విలసిల్లె నెల్లెడ మహాసుకుమారకకోరకావళుల్. ఆ. 3.

---

9. పైడిమట్టి వేంకటపతి

ఈకవి చంద్రాంగదచరిత్ర మనెడి యాశ్వాసముల ప్రబంధ మును రచించి యున్నాఁడు. ఈతని కవిత్వము మిక్కిలి ప్రౌఢ మయి రసవంతమయి పూర్వకవుల రచనలబోలి హృదయాహ్లాదకర మయి నదిగా నున్నది. ఇతడు తన గ్రంథమును శ్రీరామాంకితము చేసియుంటచే గృతిపతినిబట్టి యీతని కాలనిర్ణయము చేయుట కాధారము కనఁబడ లేదు. ఉన్నయాధారమంతయు కృతికర్త తనవంశవర్ణనము చేసికొన్న యీక్రింది పద్య మయియున్నది—

సీ. సకలసత్కవిపూజ్యసుకవిత్వసామ్రాజ్యనిర్వాహకుఁడు పెద్ద పర్వతన్న
వివిధభాషావార్యవిరచనాచాతుర్యసర్వంకషుఁడు బోడిపర్వతన్న
వరపద్యదాకార వాచామత్కారనిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భ కవితాచ్ఛసందర్భ కీర్తితప్రజ్ఞుండు కేశవన్న
దనకు నన్నలుగాఁగను దనరుకృష్ణ
రాయభూషణకులరామరాజతనయ
కేశవాత్మజ పర్వతాధీశు వేంక
టాద్రి నిడె కావ్య మేనిత్తు నంకితముగ.

ఇందలి పేరులనుబట్టియు కవికాల మిదియని నిశ్చయించుట కాధారము దొరకలేదు. ఇందు 'కృష్ణరాయభూషణ' యను పదముండు టనుబట్టి కర్నల్ మెకంజీదొరగారు సంపాదించిన లిఖితపుస్తకముల పట్టి కలో కవి కృష్ణదేవరాయని కాలములోనివాఁడని చెప్పఁబడి యున్నది. ఇటీవల బ్రౌన్‌దొరగారు తమ నిఘంటువునం దీకవి యాంధ్రనికుఁడని వ్రాసి యున్నారు. పయి పద్యములో నున్న కృష్ణరాయభూషణశబ్ద మాకవికి కృష్ణదేవరాయని యాస్థానమున కలంకారముగా నుండుటచేతనే వచ్చినను ఈకవి కృష్ణరాయభూషణుని వంశజుఁడగురామరాజుకొడు కైన కేశవార్యుని పుత్రుఁడగు పర్వతాఖ్యునిసుతుఁడగు వేంకటపతి యగుటచే గృష్ణదేవరాయని యనంతరమున బెక్కుతరములు గడచిన తరువాత నున్నవాఁడగుట స్పష్టము. అప్పకవి యీచంద్రాంగదచరిత్ర ములోని పద్యముల నుదాహరించి యుండకపోవుటచేత నీకవి గ్రం౹౹౦ వ సంవత్సరమునకు దరువాతివాఁడనియు నూహింపఁ దగియున్నాఁడు. అందుచేత కవి గ౮౦౦ వ సంవత్సరప్రాంతములయం దున్నవాఁడని తోఁచుచున్నది. చంద్రాంగదచరిత్రమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అప్పచు లాడుచుఁ నగపు లాపచు బారలు సాఁచిసాఁచి మా
యప్పలు వచ్చి రంచు సకియ ల్గనుదమ్ములు మోడ్చి పిల్వఁగా
గుప్పునఁ దప్పుతప్పు టడుగుల్ నడలం గొమరుండు పైఁబడుం
దప్పక చూచుతల్లికిని దండ్రికి ముచ్చట తీఱునట్లుగన్—ఆ. ౨

మ. హరిమ్రోలం గడుపోటుబంట నయి గర్వాలాపము ల్మున్ను స
త్వరతం బల్కితిఁ గొన్ని నోరికొలఁదుల్ తథ్యంబు నేఁ డస్మియ
బరఁగం బందకుఁ జెప్పసాధనగతిన్ బాటిల్లె వ్యర్థంబులై
సురలోకంబున కేగు చెట్లు సవయస్కు ల్నన్నల న్నవ్వఁగన్—ఆ.3

సీ. భుజగలోకాధీశ భోగతల్పశయాన హరిరూపధరమహాపురుషయనుచు
సతులాస్థమగుటవర్ణితపాదరాజీవ రామాగ్ర్యనీయ శ్రీరంగ యనుచు
మారీచమదభంగమహితవాయవ్యాస్త్రశరదనిద్రితనేత్ర శౌరియనుచు
సముద్రగర్వావసరయోగసిద్రాణ కరిరాజవరద శ్రీకాంత యనుచుఁ
దలఁకు నుఱుకును నలుకు బెగ్గిలుచుఁబలుకు
సఖులనయనస్వరశిరోజచరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ
భటనటప్రియసముదాయఘటినుద్యోప—ఆ. ర

ఊ. ఓరిమృగాంక నాజడకు నోడినరాహువు కిన్క నంకమున్
పేర విస్రంబు నీయొడలఁ జేరఁగఁ గోరలకొద్ది నొక్కి దు
ర్వారసజత్వడీయకరవారవిషంబుల నొంచసాఁగెఁ బె
న్వేరముఁ బూని యిప్పు డిది నీదగుచేతఁగఁ జూడ కెమ్మెయిన్.ఆ-గి

---

10. వెలగపూడి కృష్ణయ్య

ఈ కవి భానుమద్విజయమునెడి యైదాశ్వాసముల ప్రబంధము రచియించెను. మఱియు నితఁడు మాలతీమాధవీయము, గౌళికా శాస్త్రము, చతుర్విధకందశతకము అను పద్యకావ్యములను, వేదాంత సారసంగ్రహ మను వచనకావ్యమును, రచించినట్లు భానుమద్విజయము లోని యీ క్రింది పద్యములోఁ గని చెప్పికొనియున్నాఁడు—

సీ. మహిలోనమాలతీమాధవీయ మనంగ శృంగారకావ్య మెసంగఁజేసి
గౌళికాశాస్త్రంబుకడులోకహితముగా నెనయనేకాశ్వాసమున రచించి
పరిఢివిల్లఁగఁ గందపద్యపుశతకంబు నాల్గుయోగంబుల ననువుఁదీర్చి
సన్నుతవేదాంతసారసంగ్రహశాస్త్ర మమరంగ వచనకావ్యం బొనర్చి

చాటుకృత్తులను మఱికొన్ని సంఘటించి
మామకాంకిత మొనరించి మంచిపుణ్య
శాలియనఁగీర్తిఁగైకొన్న సత్కవీంద్ర
మధురవాక్సాంద్రకృష్ణయామాత్యచంద్ర.

పూర్వమీతని వంశపువారు గాంగేయోపాఖ్యానము, సుమంతో దయము, ఆంధ్రకర్ణామృతము, వజ్రభుజోపాఖ్యానము, సేతుమాహాత్మ్యము, దత్తాత్రేయచరిత్రము, మర్యాద రామసచివచరిత్రము, మొదలగు గ్రంథములను రచియించి యుండినట్టును గవి యీ క్రింది పద్యములతోఁ జెప్పియున్నాఁడు—

క. భూనుత గాంగేయోపా । ఖ్యానసుమంతోదయాంధ్రకర్ణామృతముల్
మానిత వజ్రభుజోపా।ఖ్యానము సుభ హేతుసేతుమాహాత్మ్యంబున్.

క. దత్తాత్రేయచరిత్రన్ । సత్తగు మర్యాదరామసచివచరిత్ర
బిత్తరపుఁ గృతులు చేసిన । యుత్తమకవు లెల్లమీఱులోద్భవులగుటన్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; లోహితసగోత్రుఁడు; వెల్గపూడి నారసింహార్యపౌత్రుఁడు; నరహరిమంత్రి పుత్రుఁడు. ఈ కవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కభూపాలుని దండనాథుఁడగు సాంబయామాత్యుని పుత్రుఁడగు గోవిందయామాత్యునికి మేనమఱఁదియైనట్లీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పాండ్యభూమండలాఖండలుండైన విజయరంగ చొక్కభూజాని కాప్త
మండనుండగు సాంబదండనాథాగ్రణితనయులలో మేటిదండి యగుచు
సంగీతసాహిత్యసంస్కృతాంధ్రకవిత్వసరసజ్ఞుఁడై మేనమఱఁదియగుచుఁ
గొమరొప్పుచుండెడుగోవిందయామాత్యుఁడనుపమవిద్యాధికార్య

నింపుకొలు వుండె నపుడు నేదండఁ జేరి
సారస్లాపముల మీఱి చతురమతిని
దక్షిణామూర్తికృపను బ్రత్యక్షమగుచుఁ
గృతిపతిత్వంబుఁ గోరుసంగతిని దెలుప.

ఇంపుఁ బేర్కొనబడిన విజయరంగ చొక్కభూపాలుండు దక్షిణ మధురాపురము రాజధానిగా పాండ్యమండలమును క్రీస్తుశకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును పాలించిన ట్లీవఱకే చెప్పఁబడెనుగదా? అందుచేత నీకృష్ణకవియు నాకాలపువాఁడే యని వేఱుగఁ జెప్పనక్కఱలేకయే తెలిసికోవచ్చును. కవి సాంబదండ నాథుని వర్ణించుచు—

సీ. సరిజేటి మూర్కాటిసాదులాఖానుతో ఘటియించె నెవ్వాఁడు ఘనత మీఱఁ
బేర్మిదంజావూరిపేషువాయూనంనరావును నెవ్వాఁడు రహి నడంచె
మయిసూరిసంజరాజయగారిప్రియవాక్యసంధికి నెవ్వాఁడు శక్తి దాల్చె
* * * నసుపకారి శ్రీదళపన సాంబశౌరి.

అని యతఁ డారూకాటివాబగు సాదతల్లాఖాను మొదలగువారి నోర్చినట్లు చెప్పియున్నాఁడు. ఈసదతల్లాఖాన్ ౧౭౦౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౭ వ సంవత్సరమువఱకును నవాబుగానుండి యూరాకాటురాజ్యము చేసెను. కాఁబట్టి కవి ౧౭౩౦ వ సంవత్సర ప్రాంతమునందు మధురాపురములో భానుమద్విజయమును రచియించి యుండును. ఈతనికవిత్వము రసవంతమైనది. కవితాధోరణి తెలియుటకై భానుమద్విజయములోని రెండు పద్యముల నిందుదాహరించుచున్నాను.

ఉ. ఏమియు లేనిమానులె యహీనమతిభ్రమ లందుచుండఁగా
భూమిపతిత్వ మొందినప్రభుల్ వ్యసనంబులఁ గాంచుటబ్రమే?

యేమయిన న్నుమేరుధృతి నేర్పడఁబూని సమస్తకార్యముల్
తామ వహించిచూడమిని ధాత్రి యరాజక మాను భూవరా. ఆ-౨

మ. గిరులం బాఁపెడియేఱులొల్లగ వడిం గీలొక్కన్నకన్నీరు లా
గురువక్షోరుహతారహారములతోఁగూడం బ్రకాశింప నా
ధరణీశాంగన దుస్సహాత్మగతసంతాపంబుచే నేడ్చె భా
స్వరవాసంతపికీస్వరాకలితవాచామాధురీవై ఖరిన్. ఆ. ర.

---

11. శేషము వేంకటపతి

ఇతఁడు శశాంకవిజయ మనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమునుజేసి వంగలసీనయార్యున కంకితము చేసెను. శశాంకవిజయము నకు తారాశశాంకమని నామాంతరము గలదు. ఇందుఁ జంద్రుఁడు బృహస్పతివద్ద విద్యాభ్యాసమునకయి చేరి గురుపత్నియగు తార సింటి నుండి లేవఁదీసినకథ మిక్కిలి పచ్చిగా వర్ణింపఁబడినది. ఈశేషము వేంకటపతి నియోగి బ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁడు కందాళ రాయానుజాచార్యుని శిష్యుడు; కృష్ణయార్యుని కుమారుఁడు. కృతినాయకుఁడు తన్నుఁ బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీక్రింది పద్యము లలో కృతిపరంపరలు చేసినట్లు కవి చెప్పుకొనుటయేకాని యొక్కగ్రంథ మునైన బేకొనియుండలేదు.—

క. నను రంగేశ్వరపదయుగ । ఘనతరభజనానికూఢకవితాసాంద్రా
జ్ఞని శేషముకృష్ణసుధీ । తనయుఁ బిలిపించి పలికె దయదై వారన్.

చ. అసదృశభక్తి సద్గురుకటాక్షముఁగాంచి సమంచితాత్మతన్
బిసరుహామాకరందరసపేశలకోశలవన్మృదూక్తులన్
రసికుల కింపుగాఁ గృతిపరంపరలన్ రచియించి కీర్తిచే
నెసఁగితివయ్య వేంకటపతీ బళి శేషమువంశసత్కృతీ.

ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కనాథుల కాలముంకో నున్నట్లీవరకే సముఖ కృష్ణప్పనాయకునిగూర్చి వ్రాయున ప్పుడే చెప్పఁబడెనుగదా! కవియు తారాశశాంక కృతినాయకుఁడైన వంగల సీనయార్యుని వర్ణించుచు, అఖండమండితక మహీమండలమండనా యమానపాండ్యమధురాధరాఖండల శ్రీవిజయరంగచొక్కనాథ మహీ నాథ కృపాకటాక్ష వీక్షణానుక్షణ వర్ధమాన.....నిఖిల సంపత్పరం పరాకంపితనిలింపనాయకుండని యతనికొక విశేషణమును బ్రయోగించి యున్నాఁడు. మఱియు ద్వితీయాశ్వాసారంభమున

క. శ్రీవిజయరంగచొక్క। క్ష్మావిజయ గురుప్రసాదసంపన్నిత్యా
శ్రీవరదాచార్యమణీ। శ్రీవరదాత్మైక్యకృత్య సీనామాత్యా.

అని కృతిపతిని సంబోధించియున్నాఁడు. దీనినిబట్టి కవి విజయ రంగచొక్కనాథుని కాలములో మధురలో నుండుట నిశ్చయమగుట చేతను, ఆరాజు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౦ వ సంవ త్సరమువరకును రాజ్యముచేసినవాఁడగుటచేతను, శేషము వేంకటపతి యీకాలమునంచున్నట్లు స్పష్టమగుచున్నది. అక్కడక్కడ క్వార్థకసంధి మొదలయిన కొన్ని లక్షణదోషము లున్నను, కవిత్వము మొత్తము మీఁద బ్రాఢోపాకమయి మిగుల రసవంతమయియున్నది. చక్కఁగమెత్తిన విషమువలె నీతిమాలిన యీకథ మనోహరములయిన తేటమాటలత్రో నింపుగా చెప్పఁబడినందున, అనేకులయిన యీవపురుషుల నాకర్షించి పాడుచేయుచున్నది. దుర్నీతిని వర్ణించునప్పు డీకవి తన యుసమ్మతిని దెలుపు వాక్యముల నెక్కడను బ్రయోగింపక, "లోకములోనఁ గొంద ఱబలుల్.....తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁగూడినఁ బాప మంచు" "ఎన్నిపువ్వులఁ వ్రాలుతేఁటి యట్లనుగవాఁడనువానికి దోస మున్నదే?" యిత్యాది వాక్యరత్నములచేత వలపుగలచోటఁ గలయు టయే పరమార్థమన్నట్లు తెలిపి పామరులను భ్రమిరిపఁజేసి యున్నాఁడు.

రంకును మంచిదని సాధించుటకు సహితము మనవాడికి పురాణముల నుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకుననుట కీక్రిందిపద్య మును నిదర్శనముగాఁ జూపవచ్చును—

సీ. కన్నకూఁతు రటంచు నెన్నక భారతీతరుణిఁ గూడఁడె నీపితామహుండు
మేనత్త యనుమేరమీఱి రాధికఁ గోడ నెనయఁడే నిన్ననీయనుఁగుబావ
వదినెయంచు నొకింత వావి లేకయె జ్యేష్ఠునెలఁతఁ గోరఁ బొందఁడే
నీగురుండు
మునిపత్ని యనకహల్యనుబట్టఁడే నీదుసహాపాఠి యగుపాకశాసనుండు
యిట్టివిమీవారినడతలు కట్టిపెట్టి
యమ్మనేచెల్ల న్యాయంబు లాడె దార!
కడకు నీఱంకు నీవెఱుంగనివితాన
దూఱెదవు నన్నుఁ జలపోరి దోసకారి!

"వసున్నలదారుకావనస్త్రీలు గిరీశునిం గలియఁ జే? వ్రజభామలు శౌరిఁగూడఁ జే? యీలలనాశిరోమణుల కంధును సందును నేమిచెప్పుమా" యఁట! ఆహా! ఏమి యీదేవత్వలక్షణము! దేవత్వమున కెప్పుడును శుద్ధచరిత్రమే లక్షణముగా నుండవలయును గదా? నీతిమాలి యన్య కాంతలఁ గలయుటకంటె నాసురకృత్యము మఱియేమిండును?

ఉ. ఎంచఁగరాసమోహమున నే సిటు పిన్నటనాఁటనుండియున్
బెంచితిఁ బెద్దఁజేసితిని బేర్మిగఁ బ్రాయము వచ్చినంతనే
యెంచక మాటలాడె దిపు డిన్నప్రియోక్తుల కిమ్మపుట్టెఁగా?
మంచిది నిన్నుఁగూడుటకు మాకు స్వతంత్రత లేకపోయెనే?

గురుపత్ని శిష్యునిఁ బిన్నఁటనుండియుఁ బెంచి పెద్దవానిని జేసె నఁట! అందుచేత నామె కాతనిఁగూడుటకు స్వాతంత్ర్యము గలదఁట! ఏమి యీమర్మీతి! దుర్నీతి యింతకంటెను దూరముపోవుట సంభవింపనేర్చునా? కృతయుగమునం డైనను కలియుగమునం డైనను

జారత్వ మెప్పుడును మొదలంట నశింపదు. కృతయుగపు తారలును చంద్రులును మన యీకలియుగమందును గలరు. అయినను మన యీపాడు కలియుగమునందుపుత్ర మిల్లునిడిచి లేచిపోయినదానిని మగని కిప్పించుటకయి పెద్దమనుష్యులుపోయి జారుని బతిమాలుటయు, మగని కిప్పించిన యీఅంకుటాలికి సంతానము కలిగినప్పుడు జారపురు షుడువచ్చి పుట్టినబిడ్డ కయి యింటినుగనితో తగవులాడుటయు లేవు. ఇవి కృతయుగధర్మములు కాబోలును! దూరపుకొండలు నునుపయి నట్లు వెనుకటివారి యకృత్యములు కంటికి ముఱుగుకాగా మనవారు పూర్వకాలమును పొగడుచుందురు, బ్రహ్మదేవుని యంతటివాడువచ్చి భార్యను గోలుపోయి మఱిఁచుదున్న బృహస్పతికి తారను మరల నిమ్మని చంద్రుని ప్రార్థించెనఁట!

చ. అని పరమేష్ఠి పలుకఁటయు నట్లనకా కని చంద్రుఁ డయ్యెడన్
ఘనతరగర్భభార నఖకాంతివినిర్జితతారఁ దారఁ దా
ననునయనోక్తులం దెలిపి యంపినతోడనె దివ్యతూర్యని
స్వనములు మ్రోసె మింట విరినానలు షర్వను జంట జంటగన్.

బ్రహ్మదేవుని ప్రార్థన నంగీకరించి చంద్రుఁడు గర్భవతియైయున్న గురుని భార్యను గురుసకియ్యఁగానే, తమగురునిల్లు కూలఁద్రోచి యింతటి ఘనకార్యమును జేసినందున కాతనిమీఁద సిగ్గులేక సురలు విరులవాన గురిసిరఁట!

చ. అమరులతోడ నప్పుడని రబ్జభవుండు భవుండు నగ్గురుం
బ్రమదము మీఱఁగాఁ బిలిచి మాటవచనంబునఁ దారఁ జెందుమీ
రమణీ కశుద్ధిలే దమృతరశ్మిని బొందుటచేత దాన నీ
కొమ పరిశుద్ధిఁ గాంచెఁ గయికొమ్మనఁ గొమ్మ గురుండు చేకొనెన్.

దేవతలును బ్రహ్మరుద్రులును గురునిఁ బిలిచి వ్యభిచారదోషము లేకపోవుటయేకాక యమృతరశ్మిని బొందుటచేతఁ ఛార ఘరిశుద్ధురా లయ్యెనని చెప్పి యొప్పగించిరఁట.

ఉ. తత్సమయంబునన్ శశి ముదంబున నచ్చటి కేగుదెంచి పు
త్రోత్సవ మాచరింప విని యుద్ధతిత్రో గురుఁ డందువచ్చి య
ప్పత్సుతుఁ డీబుధుం డిట నిశాకర రాఁ గత మేమి సీకన
న్మత్సరబుద్ధి వానికిఁ బునఃకలహంబు జనించె నయ్యెడ్ల.

ఆపతివ్రతాతిలకమునకు పుత్రుఁడు పుట్టఁగానేవచ్చి చంద్రుఁడు పుత్రోత్సవ మాచరించి నప్పుడు గురు శిష్యులకు పునఃకలహము జనించెనఁట!

క. నావిని యజుఁ డొహోహో
మీవాదము చాలుఁ గుముదమిత్రునిపుత్రుం
డీవత్స మితనిఁ జంద్రుని
గా విమ్మా ఫలదు విరస మిఁక నాంగిరసా.

అని బ్రహ్మదేవుఁ డింటిమగనికి బుద్ధిచెప్పి శిశువును తేరమగని కిప్పించి వివాదము తీర్చెనఁట! ఈవిషయమునే చెప్పుచుఁ గాశీఖండములో

గీ. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబుఁ దొలుతఁ
బరమవిశ్వాసతాత్పర్యభక్తిగరిమఁ
జదివెఁ జంద్రుఁడు కామశాస్త్రంబుపిదపఁ
దలిరుపాన్పున ననురక్తిఁ దారయొద్ద.

పీ. భువనైకధన్విచేఁబుప్పాయుధునిచేతఁబ్రసవాస్త్రమునఁ జేటుపడనివాఁడు
నతిగాఢమైన క్రోధాంధకారంబునఁ గన్నుల నంధుఁడు గానివాఁడు
నిర్నిబంధనలోభనిద్రాభరంబుఁ బారవశ్యంబుచేఁ బడనివాఁడు
లక్ష్మీకటాక్షవిలాసదుర్మదమున మనములోపల నన్నుకొననివాఁడు

లేఁడు భూపతి గలిగినే న్వాఁడు నృపుఁడె
విశ్వధాత్రీజనులపాలివేల్పు గాక
బాహ్యశత్రులఁ బరిహరింపంగవచ్చు
నంతరరులను వర్జింప నలవికాదు.

ఈవిధముగా శ్రీనాథుఁడు చెప్పినరీతి ప్రౌఢవాక్యములుగాని, పురూరవశ్చరిత్రములో—

క. పాపపరాఙ్ముఖతాయుతి । దీపాంకుర మానెలంతదీర్ఘశ్వసితా
టోపమరుద్ధతి నడఁగినఁ । బ్రాపితమోహాంధకారబంధురుఁ డయ్యెన్.

సీ. లలనానితంబమండలముపై నుత్పల
దళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణి కెమ్మోమునిమ్మోదఁ బ్రవాళమణిసొంపు
గులుకఁగా ఘటియింపఁదలఁచుఁగాని
జలజాక్షి కుచకుంభములమీఁద శశకప్లు
తంబుఁ దా నొనరింపఁదలఁచుగాని
మృగరాజమధ్య నెమ్మేను లతావేష్టి
తంబునఁ బెనఁగొనఁ దలఁచుగాని
తలఁపఁ డెప్పుడు గురువనితా సమాగ
మాగతాత్యుష్ణదురితదవానలంబు
దుస్సహాంబని కటకటా తొగలజేఁడు
కలుగదుగదా వివేకంబు కాముకులకు ?

సీ. సకియకౌనుఁ దలంచి సన్మార్గ మనుఁగాని
యింతిదుర్మార్గత నెంచఁడయ్యెఁ
జెలువచన్గవఁ దలంచి సువృత్త మనుఁగాని
తరుణికువృత్తంబుఁ దలఁపఁడయ్యె
నతివమోమునుఁదలంచి యకళంక మనుఁగాని

తెఱువకళంకంబుఁ దెలియఁడయ్యె
సుదతినవ్వుఁ దలంచి శుచి యనుఁగాని య
వ్వేలఁదుకయశుచి భావింపఁడయ్యె
గురువువంటిమహాత్ముఁ డిక్కరణిఁ దరుణి
చక్కఁదనమేగుణంబుగ సంస్మరించుఁ
గాని వ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె
నజ్ఞుఁడనఁ బ్రాజ్ఞుఁడన నెవ్వఁడవనినింక ?

ఈవిధముగా నబ్బయామాత్యుఁడు చెప్పినరీతి నీతిబోధకవాక్యములుగాని, తారాశశాంకమున లేవు. కవియొక్క రచనను దెల్పుపద్యములు కొన్ని యుదాహరించుచున్నాను—

చ. హతబహుకిల్బిషంబగుప్రయాగము యాగముదావహంబు సాం
ప్రతముగ నందు నిందిరకుఁ బట్టనఁ బట్టణముఁ సృజింపుమా
యతులితశిల్పశక్తిగొని యంచసి యంచ నిరూఢి నెక్కి యం
చితగతి ధాత యేగె జపసిద్ధులు సిద్ధులు. తన్బజింపఁగన్.—ఆ ౧.

చ. అలసలినారి పొల్చె నిజయూవనవేళస్వకీయబింబలీ
లలు తననెమ్మొగంబునఁ గళంకరుచు ల్మునుమాసకట్టునన్
వలదు దయారుణద్యుతులు వాతెఱ వెన్నెలడాలు లేఁతన
వ్వ్వాలనమృతంబుపల్కులనుబూనెనునాఁగమనోహరాంగుఁడై.—అ.౩

ఉ. చండురుఁడుం బురందరనిశాతశరాహతిఁ గంది నివ్వెఱం
జెందఁగ నింద్రుఁ డిట్లను శశీ వినరా వినరానిపాతకం
బందినవాని కార్తి యరుదా గురుదార కృతాపరాధమే .
ధం దిగఁద్రోచి చేసితి వృథా విబుధావళితో వికోభమున్.—ఆ.౫.

---

12. కూచిమంచి తిమ్మకవి

ఈకవి యనర్గళమయిన కవితాధార గలవాఁడు; బహుగ్రంథము లను రచియించినవాఁడు; ఇన్నిగ్రంథములను సలక్షణమయిన మృదుమధురపాకమున రచించినకవి యాధునికులలో మరియెవ్వఁడును లేఁడు. ఈ కవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుడు; బయ్యనామాత్యుని ప్రపౌత్రుఁడు; తిమ్మయామార్యుని పౌత్రుఁడు; గంగనామాత్యుని పుత్రుఁడు. ఈయనకు లచ్చమాంబతల్లి; జగ్గన్న, సింగన్న, నరసన్న, పితృవ్యులు; వీరమ్మ, పాపమ్మ, మేనత్తలు; సింగన, జగ్గన, సూరన, తమ్ములు; గొట్టెముక్కుల రామయామాత్యుని కూఁతురైన బుచ్చమ్మ భార్య. ఈవిషయములను రుక్మిణీపరిణయములోని యీ క్రిందిపద్యము తెలుపుచు చేయుచున్నది—

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు బయ్యనమాత్యుఁ డేభవ్యతాత
నిగతాన్న దానవర్ణితయశస్సాన్ద్రుండు తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులుజగ్గనయుసింగనమంత్రియునరసన్నయు నేమంత్రియనుఁగుదమ్ము
లలరఁ దిమ్మకవి సింగన్న జగ్గనయును సూరన యేధన్యసుతవరేణ్యు
లొనర వీరమ్మ పాప మేఘనునిసహజ
లతిపతివ్రత లక్ష్మ్మ యేచతురరాణి
యట్టి శ్రీకూచిమంచి వంశాబ్ధిచంద్రు
మజ్జనకు నలగంగనాపుత్త్రుఁ దలఁతు.

ఈమధ్యను ముద్రింపఁబడిన రుక్మిణీపరిణయములో నీపద్యములోని నాలవపాదమున సింగన్న యనుటకు మారుగా రాజన్నయని యున్నది కాని యది యచ్చుతప్పని తలఁచెదను. తిమ్మకవికి సింగన్నయు జగ్గనయు సూరనయునేకాని రాజన్నయను తమ్ముఁడు లేనట్లతఁడు రచించిన పుస్తకము లన్నింటివలనను దెలియవచ్చుచున్నది. అందు సింహాచలమాహా

త్వ్యములో గవి తనవంశవర్ణనము చేయుచుఁ బెద్దతమ్ముఁడగు సింగ
న్నను గూర్చి చెప్పిన పద్యముల నిందుదాహరించుచున్నాను—

క. నాతమ్ములు సింగనయును
ఖ్యాతయశుఁడు జగ్గనయును ఘనతరసుగుణ
వ్రాతాంకుఁడు నూరనయును
భీతారిసమూహ లగుచు వెలసిరి సితులన్.

సీ. వక్రించుచందంబు వదలక మూఢత నలరెడు సురమంత్రి నపహసించి
సానులంగూడి యింపూని బుధేంద్రుని గననోడు నచలపుంగవునినెంచి
శ్రుతిదూరుఁడై చరించుచు రెండునాలుకల్ గలిగియుండెడి
భోగికులునుఁదెగడి
భంగంబు నొంది యేపట్టున నడలెడు రత్నాధివాసుఁ దిరస్కరించి
ప్రజ్ఞచే గౌరవమున వాక్పాటవమున
ధీరిగాంభీర్యమున జనుల్ పొగడనెగడేఁ
గూచి మంచ్యన్వయాంభోధికుముదహితుఁడు
శిష్టహితతంత్రిగంగయసిఁగమంత్రి.

కవియొక్క జన్మసంవత్సరమేదో తెలియనుగాని యితఁడు రచి
యించిన గ్రంథములలో నెల్లను మొదటిదగు రుక్మిణీపరిణయము—

ఉ. ఆరయ శాలివాహనశకాబ్దము లబ్రిగుణాంగచంద్రులం
బేరగుమన్మథాబ్దమునఁ బ్రేమఁ బ్రబంధ మొనర్చి మీకిటుల్
చేరికతోఁ సమర్పణము చేసితి మీకృతి యాతమిస్రహృ
త్పైరవమిత్రతారకముగా భువిఁ జెల్వగుఁగాత శంకరా.

అను పద్యముబట్టి శాలివాహనశకము ౧౬౩౭ వ సంవత్సరము
మన్మథాబ్దమునకు సరియైన హూణశకము ౧౭౧౫ వ సంవత్సరమునందు
జేయఁబడిన దగుట నిశ్చయమయినందున, కవి యప్పటి కిరువదియైను
సంవత్సరముల ప్రాయమువాఁ డయినపక్షమున ౧౬౯౦ వ సంవత్సర

ప్రాంతమునఁ బుట్టినవాఁడై యుండవచ్చును. అచ్చతెలుఁగు రామా
యణములోని—

గీ. మునుపు మాకీవె భళ్ళాణుఁ డనెడిపోని
కతయురుక్మిణి పెండిలికతయుబొబ్బ
మెకపుగుబ్బలికతయు మేల్మిఆనీల
పెండ్లికతయును గబ్బముల్ పేర్మిఁగూర్చి-

అను పద్యమునుబట్టి భళ్ళాణరాజచరిత్రము రుక్మిణీపరిణయము
కంటె ముంపుగా రచియింపఁబడినట్లు భ్రమ కలుగునుగాని నిజ మూర
యఁగా రుక్మిణీపరిణయమును రచించిన తరువాతనే కవి రాజశేఖర
విలాసమను నామాంతరముగల భళ్ళాణచరిత్రమును రచించి నట్లు
పెక్కు నిదర్శనములవలన స్పష్టమగుచున్నది. రుక్మిణీపరిణయమునందుఁ
గవి తా నావఱకు గ్రంథము లేవియుఁ జేసియున్నట్లు చెప్పుకొనలేదు.
కవిచేత రచియింపఁబడిన మూఁడవగ్రంథమగు సింహాచలమాహాత్మ్యము
నందు—

గీ. ప్రతిభమీఱంగ రుక్మిణీపరిణయంబుఁ
గలుషహారమగు రాజశేఖరవిలాస
మును మఱియుఁ జాలదండకములును శతక
ములును రచియించి కృతులు శంభునకు నిడితి.

అని కవి రుక్మిణీపరిణయమునే మొదటఁ జెప్పియున్నాఁడు.
లక్షణసారసంగ్రహము, రసికజన మనోభిరామము మొదలయిన గ్రంథము
లన్నిటిలోనుగూడ కవి మొట్టమొదట రుక్మిణీపరిణయమునే పేర్కొని
యున్నాడు. కవి యే హేతువుచేతనో రుక్మిణీపరిణయము చేసినతరువాత
జేసిన యచ్చతెలుఁగురామాయ్యణము నీలాసుందరీపరిణయము లోనుగా
గలపుస్తకములలోఁ దా నాపుస్తకములను జేసి ముగించినకాలమును
వేసికొనలేదు.

తిమ్మకవి గోదావరీమండలములోని పిఠాపురసంస్థానములోని
ధైన కందరాడ గ్రామమునకు కరణము. ఇతఁడు కందరాడగ్రామవాసుఁ
డయినట్లు లక్షణసారసంగ్రహములోని యీక్రిందిపద్యమునలనఁ దెలియ
వచ్చుచున్నది—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతుఁడఁ గూచిమంచ్యన్వయాంబోధినీహారకరుఁడ
గంగనమంత్రిశేఖరునకుఁ బరమపావనియగులచ్చమాంబకును సుతుఁడ
వెరవొప్ప రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబునీల పెండ్లి
కథయును రాజశేఖరవిలాసమునచ్చ తెనుఁగురామాయణంబును
మొదలగు
కృతులు రచియించి పార్వతీపతికి భక్తి
తోడ నప్పన మొసఁగినవాఁడఁ గంన
రాడపురసంస్థితుఁడఁ గడుఁబ్రోడ నేను
దిమ్మకవిచంద్రుఁడను జగద్విదితయశుఁడ.

ఈయన గ్రంథములుచేయ నారంభించిన కాలమునందు పీఠికా
పురసింస్థానమునకు రావు మాధవరాయనృపతి ప్రభువుగా నుండెను.
ఈవిషయము రుక్మిణీపరిణయములోని యీపద్యమువలనఁ దెలియవచ్చు
చున్నది—

సీ. చక్రవాళాహార్యజలధితులోన్నతప్రాకారపరిఖావిరాజితంబు
సాంద్రముక్తాసౌధచంద్రశాలానేకభర్మనిర్మితహర్మ్యశర్మదంబు
కరిసైంధవాందోళికాధేనుధనధాన్యవనదేవగృహసరోపర్ణితంబు
విమలచాతుర్వర్ణ్యవిద్వత్కవిశ్రేష్ఠ భటనటామాత్యవిస్ఫారితంబు
రాజమహేంద్రవరదుర్గరాజ్యభూరి
భారసంభరణాక్రాంతభాసమాన
రావు మాధవనృపపరిరక్షితంబు
భోగనికరంబు పీఠికాపురవరంబు.

ఈరావు మాధవనృపతియే కొన్నిగ్రంథములు రచించిన యనంత రమునఁ గవికిఁ గవిసార్వభౌమబిరుదము నిచ్చినట్లు రసికజనమనోభిరామ ములోని యీక్రింది పద్యమువలనఁ గనఁబడుచున్నది—

సీ. నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహోదరుఁడగుజగన్నత్రవితనయులు
ఘనులుతిమ్మనయుసింగనయును లేఖకపాఠకులై కృతుల్వ్రాయఁజేయఁ
బేర్మిఁగాంచినవాఁడఁ బీఠపురరాజ్యరాజ్యాధిపత్యవిరాజమాన
భూరివై భవుఁడు నద్భుతపరాక్రముఁడును దానకళాధురంధరుఁడునై న
రావు నీలాద్రిమాధవరాయనృపతి
చేతఁ గవిసార్వభౌమ విఖ్యాతబిరుద
మందినఘనుండఁ దిమ్మయామాత్యుఁడ నేను
విమలతరభక్తి మదిలోనవిస్తరిల్ల.

కవి పీఠికాపురసంస్థానములో నుండినవాఁడయినను తనగ్రంథములు వేనిని నరాంకితము చేయక యిష్టదేవతయైన కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసియున్నాఁడు. ఇతఁడు రుక్మిణీపరిణయమును రాజశేఖర విలాసమును జేసినతరువాత రాజు తనకొక గ్రంథము నంకితముచేయ నడిగినట్లును కవి యట్లుచేయ నిష్టములేనివాఁ డయినట్లును సింహాచల మాహాత్మ్యములోని యీపద్యమువలన నూహింపఁదగియున్నది—

క. నృపులకుఁ గావ్యం బొసఁగిన
నపవర్గం బిడఁగఁగలరో యటుగాకున్నన్
ద్విపతురగభూషణాంబర
తపనీయాదికముచేతఁ దనుపంగలరో.

సీ. ద్విజపుంగవులకుఁ బ్రవేశింపఁగారాని
పృథుగృహాంతరములఁ బ్రేమనుండి
కృతియంతధర్మపద్ధతు లెవ్వి యెఱుఁగక
ధరణిపై నడువఁ బాదములు లేక

దుష్క్రియల్ చేయుమంత్రులు చెప్పినటులె మీ
ఆకనటింపుచుద్విజహ్వికలుగలిగి
వితతంబుగా వక్రగతులచేఁ బొదలుచుఁ
బూని యేప్రొద్దును బుస్సు రనుచు
గాఢరోషవిషానలోద్గారిఘోర
నక్రములుగల్గి దుర్మదవర్తు లగుచుఁ
జెలఁగుచుండెడు భోగిరాజులభజనపఁ
గుటిలతరబుద్ధి నెవ్వాఁడు కోరఁగలఁడు ?

* * * *

క. ఘనిపూని తుచ్ఛభోగం । బునకై కొఱగానిజనులఁ బొగడుటయెల్లన్
గనుఁగొన నిహపరదూరం।బని తలచిఁ వినిర్చలాంతరంగుఁడ నగుచున్.

ఈయన శివభక్తుఁడయి తాను జేసిన గ్రంథముల నన్నిటిని పిఠాపురమునందలి కుక్కుటేశ్వరస్వామికే యంకితము చేసినను, ఒక్క సర్పపురమాహాత్మ్యమును మాత్రము రాజానుగ్రహము నపేక్షించి కాఁబోలును కవిసార్వభౌమబిరుద మందినతరువాత సర్పవరమందలి భావనారాయణస్వామి కంకితముచేసెను. ఈ సర్పవరము పిఠాపురపు రాజుల గురువులగు వైష్ణవస్వాములకు నివాసస్థలమయి పీఠికాపురమునకు సమీపమున నున్నది. కవిమాత్రము సర్పపురమాహాత్మ్యములో భావనారాయణస్వామి తనకు స్వప్నమున సాక్షాత్కరించి యిట్లానతిచ్చినట్లు చెప్పికొనియున్నాఁడు—

సీ. ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపొడ్డి
కథయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనరేశ్వరచరితంబు సప్తార్ణవసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహము నింపారఁ గూర్చి

కృతులు శంభుని కిడినసుకృతివినీవు
ప్రతిభ మెఱయంగనొక్క-సత్కృతిదొనర్చి
మాకు నర్పణచేయు నెమ్మదిదలిర్పఁ
తిమ్మకవిచంద్ర ముదితసుధీకులేంద్ర.

తనకు మాహేశ్వరాచారవృత్తి నుపదేశించిన శైవుఁడగు దెందు లూరి లింగనారాధ్యుని

క. చిరభక్తిం బొగడెద మ। ద్గురునాథుం దెందులూరికులపావనునిన్
గరుణానిధినపరాంతక । హరమూర్తిని ఘనుని లింగనారాధ్యమణిన్.

ఇత్యాది బహుపద్యములతో బహుగ్రంథములయందు స్తుతించి శివభక్తుఁడయినను, కవి తాను కేవల శివమతస్థుఁడుగాక శివకేశవులకు భేదము లేదని భావించెడి యద్వైత మతస్థుఁడయియుండెను. కవి తాను కల్పికడపట రచియించిన శివలీలావిలాసములో నించు క్రిందఁ బొందుపఱిచిన పద్యమునందుఁ దాను జేసినపుస్తకముల నన్నిటిని బేరొక్కని యున్నాఁడు—

సీ. ప్రతిభమైరుక్మిణీపరిణయంబును సింహశైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కతయును రాజశేఖరవిలాసంబును నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనృపచరితంబు సాగరసంగమాహాత్మ్యంబు రంగుమీఱ
రసికజనమనోభిరామంబు లక్షణసారసంగ్రహమును సర్వపురస
మంచితక్షేత్రకథనంబు మఱియుఁబెక్కు-
శతకదండకసత్కృతుల్ ప్రతిభఁగూర్చి
యుల్లమలరారఁ బార్వతీవల్లభునకు
భక్తి నర్పణ చేసినభవ్యమతిని.

ఈ గ్రంథములలో సారంగధర చరిత్రమును సాగరసంగమాహాత్మ్యమును నాకు లభింపలేదు. అవి చిన్న గ్రంథములని కవివంశములోని వారొకరు నాతోఁడఁ జెప్పియున్నారు. ఈ కవి కవిత్వములో నచ్చతెనుఁగు

పదము లధికముగా నుండును. కష్టపడి మొట్ట మొదట యౌవనకాలము నందు శృంగార ప్రధానముగా రచియించిన దగుటచే రుక్మిణీపరిణయము నందే కవి యొక్కవ ప్రౌఢిమను జూపియున్నాడు. కవిక్పితములయిన బహుగ్రంథములు పురాణపాకమున రచియింపఁబడినవి. శేషములును శబ్దాలంకారములును విశేషముగా నుండినను, కవిత్వమునందద్భుత కల్పన లంతఁగాఁ గానఁబడవు. మొట్ట మొదట రచియింపఁబడిన గ్రంథము లలో నదంత స్త్రీవాచకపదసంధులు లోనుగాఁగల కొన్ని దోషములు కనఁబడుచున్నను, అటుపిమ్మటఁ జేసిన గ్రంథములు నిర్దుష్టములుగా నున్నవి. కవి యితరగ్రంథములను రచియించిన కాలపరిమితినిబట్టి విచారింపఁగా, ౧౭౧౫ వ సంవత్సరమునందు ముగింపఁబడిన రుక్మిణీపరిణయము ౧౭౧౦ వ సంవత్సరమునందారంభింపఁబడి సంవత్సరమున కొకొక్కయాశ్వాసము చొప్పున నయిదాశ్వాసములు నయిదు సంవత్సరములలో రచియింపఁబడెనని చెప్పుట సత్యమున కంతదూరముగా నుండదు. కవన మారంభించి యొకటిరెండు శతకములను జేసి గ్రంథ రచనకుఁ బూనునప్పటికిఁ గవికిరువది సంవత్సరముల ప్రాయముండునను టయు నంతగా తప్పు కానేరదు. కవి తరువాత రచియించిన రెండవ గ్రంథమగు రాజశేఖర విలాసము మూడాశ్వాసములును మూఁడు సంవత్సరములలోఁ జేసినపట్టున, ఆ పుస్తకమును ౧౭౧౮ వ సంవత్సరమున ముగించియుండవచ్చును. మూడవగ్రంథమగు సింహాచల మహాత్మ్య మయిదాశ్వాసములు నయిదు సంవత్సరములలోఁ జేసినయెడల, ఆ స్థలపురాణము ౧౭౨౩ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. కవిచే రచింపఁబడిన గ్రంథములలో నాలవదియు నచ్చతెలుఁగు కావ్యములలో మొదటిదియునైన నీలాసుందరీ పరిణయము మూడాశ్వాసములును మూఁడు సంవత్సరములలో రచియింపఁబడినచో, అది ౧౭౨౬ వ సంవత్సరమునందు ముగింపఁబడియుండును. అయిదవగ్రంథమగు నచ్చతెనుఁగు

రామాయణ మాఱుకాండములు నాఱుసంవత్సరములలోఁ గూర్పఁ బడిన పఱుమున, అది ౧౭23-వ సంవత్సరమునందు సమాప్తి నొంది యుండును. ఈ యచ్చ తెనుగుఁ కావ్యముల రచనచేతఁ గవి కభినవ వాగనుశాసనబిరుదము వచ్చెనని చెప్పుదురు. ఆఱవ గ్రంథమగు సారంగ ధర చరిత్రమును రెండుసంవత్సరములలోఁ జేసెనేని, అది ౧౭23౪ వ సంవత్సరములో పూర్తియయియుండును. ఏడవది యగు సాగరసంగమాహత్మ్యము రెండుసంవత్సరములలోఁ జేయఁబడినయెడల, ౧౭23౬ వ సంవత్సరమున సంపూర్ణమయి యుండును. ఎనిమిదవగ్రంథమగు లక్షణసార సంగ్రహము

గీ. శాలివాహనశక వర్ష సంఖ్యాకరర
సాంగ శశిసంజ్ఞలరు కౌద్ర్యబ్దమునను
భాద్రపదశుక్ల పంచమివఱకుఁ బూర్ణ
మయ్యె నీకృతి నీపేర నగనుత్తేశ.

అని శాలివాహనశకము ౧౬౬౨ వ సంవత్సరమునకు సరియైన క్రీస్తుశకము ౧౭౪౦ వ సంవత్సరమునందు ముగింపఁబడినదని కవియే చెప్పియున్నాఁడు. మూడాశ్వాసములుగల యీలక్షణగ్రంథమును రచియించుటకుఁ గవికి ౧౭23౬ వ సంవత్సరము మొదలుకొని నాలుగు సంవత్సరములు పట్టియుండును. చంద్రపాలెములోనున్న యీకవివంశమువారి యింటఁ గలపు సకములను వెదకింపఁగా సంస్కృ భారతాదులును లక్షణవిషయకగ్రంథములునుదక్క విశేషగ్రంథము లేవియుఁ గానఁబడనందునను, లక్షణసారసంగ్రహములో లక్ష్యములుగాఁ జూపఁబడిన ప్రబంధాదులలోని పద్యములు చాలవఱ కితరపూర్వలక్షణగ్రంథములలో నున్నవే యగుటచేతను, కవి యీగ్రంథరచనమునందు భారత రామాయణములను మఱికొన్ని ప్రబంధములను మాత్రమే శోధించు

నట్లు తోఁచుచున్నది. అందుచేత గ్రంథపరిసమాప్తికి నాలుగు సంవత్సరములు చాలును.

గీ. తెలుఁగు కు మున్న లక్షణంబులు మహాక
వీశ్వరుల్ పెక్కు రచియించి యిడి రిఁకేల
కూర్పవలెనన్నఁ బ్రౌఢిమకొఱకునాకుఁ
దెలిసి తెఱుంగుఁ దగఁగొంత తెలియఁబఱుతు.

అని కవి లక్షణసారసంగ్రహమునఁ బూర్వలక్షణగ్రంథములలో లేని నూతనవిషయములను గొన్నిటిని జేర్చినట్లు చెప్పియున్నాడు. కొన్ని విషయములను గవి క్రొత్తగా శోధించి చేర్చెననుటకు సందేహములేదు. తొమ్మిదవగ్రంథమగు రసికజనమనోభిరామ మనెడి యీ తృతీయాశ్వాసముల ప్రబంధమును రచించుటకు గవికి ౧౭౮౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౫౦ వ సంవత్సరమువఱకును పదిసంవత్సరములు పట్టినది.

సీ. * * రసికజనమనోభిరామం బనెడుపేరఁ దెనుఁగున శాలివా
హనశకాబ్దములఁ గరగిరసభూసంఖ్యఁ దద్ద్యువఱలు
ప్రమోదూతవత్సరమున నీప్రబంధంబు రచియించి
నీకొసఁగితి.

అని కవి రసికజనమనోభిరామమును దాను శాలివాహనశకము ౧౬౭౭ వ సంవత్సరమునకు సరియైన ౧౭౫౦ వ సంవత్సరమున రచియించినట్లు చెప్పెను. ఈ కవి యీ గ్రంథమును బహుపుస్తకములు శ్రమచేసి తన ప్రౌఢిమ నంతను జూపి వసుచరిత్రమువలె నుండవలెనని దాని ననుసరించి చేసెను. అందుచేతనే కవి యీ గ్రంథాదియందు—

సీ. బహుపురాణములుప్రబంధముల్లక్షణశాస్త్రములివిధకోశములునాట
కము లలంకారశాస్త్రములును శోధించి ప్రౌఢిమై నేతత్ప్రబంధ మేనొ
నర్చెద * * * * * *

అని వ్రాసికొనియున్నాఁడు. అయినను వసుచరిత్రమునందుఁగల ప్రౌఢిపులోను సారస్యములోను శతాంశమైనను రసికజనమనోభిరామము నకు రాలేదు. అన్యోన్య తారతమ్యము తేటపడుటకయి యుభయ గ్రంథములనుండియు సమానవిషయములను దెలుపు పద్యములను గొన్నిటి నింకుఁ జూపెదను. వసుచరిత్రములో గిరికాదేవిని గూర్చుట కయి రాజుచేతఁ బంపబడిన దూత పోయి సభాజనమధ్యమున నున్న కన్నియను జూచి సమయోచితసరసాలాపములతో ముచ్చటించి యామె చెలికత్తెల చేతనే—

ఉ. ఇన్నగరాజుఁ జూడ వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చు వచ్చి యీ
క్రొన్ననతీవజొంపములకోనకు నెన్నఁడు డిగ్గు డిగ్గి యీ
కన్నియఁ గన్నులారఁ గుతుకంబున నెన్నఁడు గాంచుఁ గాంచి తా
నెన్నఁడు గారవించుఁ జెలు లెన్నఁడు కాంతు రభీష్టసంపదల్.

రాజు నిమిత్తమయి ప్రార్థించునట్లుచేసి నేర్పుతో కార్యసంఘట నము చేయుఁగా, రసికజనమనోభిరామములో బ్రియురాలి నిమిత్తమయి రాజుచేఁ బంపబడినదూత యామె కడకుఁబోయి—

చ. పలుకులు వేయు నేటి కిఁక భావభవప్రతిమానుఁ డైనయా
చెలువునితోడుతం జెలిమి చేకుఱ కున్న నయూరె నీమెయిం
గల యెలజవ్వనం బడనిగాచిన వెన్నెలసుమ్మ ముద్దులేఁ
జిలుకలకొల్కి— నాపలుకు చిత్తమునం దలపోసిచూడుమా.
అని చెప్పి యామెచేత,

చ. అవునవు మంచిప్రోడవె బళా యళు కించుక లేక మాసినీ
నివహసభాగ్రభాగమున నిల్చి వినం గొఱగానివాక్యముల్
తవిలి వచింపఁ జాగితివి తాళుదుమే మఱియొక్కఁడైన దూ
తవు నిను నేమియుం బలుక ధర్మము కాదని యుంటి మిత్తఱిన్.
అని చీవాట్లుతిని తనప్రభువువద్దకు మరలి వచ్చెను.

చ. కటకట మమ్మ్మ నొక్కత్రుటికాలముఁ బాయనిదాన వొఁటిమై
నెటువలె వచ్చి తమ్మ చెలి యిచ్చటిప్రేకపుఁదేనెవాక లీ
వెటువలె నీఁది తమ్మ తెరు వెల్లను బుప్పొడి నీపదాంబుజం
బెటువలె నోర్చె నమ్మ తరుణీ తగు నమ్మకడిందిచ్చె దమ్ముల్ —వసుచ.

ఉ. కొమ్మరొ మమ్మరంపువెతఁ గుందుచు నిల్లెడఁబాసి యిమ్మెయిన్
మమ్మఅచేసి యొంటిగ వసంబున కేటికి వచ్చితమ్మ నె
త్తమ్ములగేరునీమృదుపదంబులు కందెఁ గదమ్మ మేలు మే
లమ్మక చెల్ల నీబలుగయూళితనమ్ములు చెప్పఁ జిత్రముల్ — రసికజ.

ఈ పుస్తకమునందు స్త్రీవర్ణనములు మొదలయినవి వెట్టిగాఁ జేయఁబడినవి. ఈశృంగార ప్రబంధమును రచియించిన కొంతకాలము నకుఁ గవి వీధినిబడి పోవుచుండఁగా నొక వేశ్య చూచి రసికజనమనోభి రామమును జదివియున్న దగుటచే నందలి రసికముద్ర కానందించి వలచి వచ్చి పైఁబడి కవిని కౌఁగిలించుకొనఁగా నతఁడు పెడమొగము పెట్టి నసియు, అందుపయి నా సరసురాలు

చ. చతురులలోన నెంతయును జాణ వటంచును నేను గౌఁగిలిం
చితి నిటు మాఱుమో మిడఁగఁ జెల్లునె యోరసికాగ్రగణ్య
అని యాశుకవిత్వము చేసి యడుగఁగా,

అద్భుతమగునట్టి బంగరపుబొంగరపుంగవఁబోలునీకుచ
ద్వితయము మొమ్మ నాటియలవీఁపునదూసెనటంచుఁజూచితిక్.

అని కవి పద్యమునూరించి యుత్తరమిచ్చెననియు, చెప్పు వాడుక యొకటి కొంతకాలమునుండి కలదుగాని యిదియు రసికత్వమున కెల్లను జారత్వమే ముఖ్యమని భావించెడి యపూర్వ పండితులచే నితర కవుల యందారోపింపఁబడినరీతి యసత్యకల్పనమే యనుటకు సందేహములేదు. రుక్మిణీపరిణయమును ముగించునాటికిఁ గవి కిరువదియైదు సంవత్సరము

లున్నచో నిప్పటి కాతని కరువది సంవత్సరములు దాటియుండవలెను. కులవృత్తిదోషముచే నెంత సిగ్గువిడిచినదయినను పట్టపగలు నట్టనడివీధిలో నడుచుచున్న ముసలి రసికుని బయిఁబడి పడుచు పడుపుపడఁతి యెల్లరుఁ జూచుచుండఁ గౌఁగిలించుకొన్నదనుటకంటెఁ బరిహాస్యాస్పదమయిన విరుద్ధపు మాట మఱొకటి యుండదు. పదనదియగు మూడాశ్వాసములు గల సర్వపురమాహాత్మ్యము తరువాత నాలుగు సంవత్సరములలో ౧౭౫౮ వ సంవత్సరమునంపు ముగింపఁబడినది.

పదునొకండవదియు కట్టకడపటిదియు నగు శివలీలావిలాసమను రెండాశ్వాసముల గంథము మఱి రెండేండ్లకు

గీ. శాలివాహ శకపర్వ సంఖ్య వసున
గాంగశశిసంజ్ఞ నలరుధాతాబ్దమునను
దగరచించిన యీకృతి ధగణియందు
నానుధాకరతారార్కమగుచునుండు.

శాలివాహనశకము ౧౬౬౮ వ సంవత్సరమునకు సరియైన ౧౭౫౬ వ సంవత్సరమున రచియింపఁబడినది. అటుతరువాతఁ గవిచే రచియింపఁబడిన గ్రంథము లేవియుఁ గానరావు. ఆరంభదశలో రచియింపఁబడిన కుక్కుటేశ్వరశతకము మొదలయిన కొన్ని శతకములను దండకములును గలవు. శివలీలావిలాసము ముగిసిన యల్పకాలములోనే కవి పరలోకగతుఁడయ్యెను. కాఁబట్టి యతఁడు ౧౭౫౭ వ సంవత్సరమునందు మృతినొందెనని యించుమించుగా నిశ్చయముగానే చెప్పవచ్చును. అందుచేతఁ గవి దాదాపుగా డెబ్బది సంవత్సరములు జీవించి సుమారు నలువదియైదు సంవత్సరములు గ్రంథరచనయందుఁ గడిపినట్లు స్పష్టమగుచున్నది. ఈకవికి సంతతిలేదఁట. ఈకవియొక్క కడపటికాలములో నింగ్లీషువారికిని ఫ్రెంచివారికిని యుద్ధములు జరగినందున కందరాశ మీఁదుగా రాకపోకలు చేయుచువచ్చిన సేనలదాడికి వెఱచి

యీ గ్రామము విడిచి చంద్రమపాలెము నివాసముగా నేర్పఱచుకొనెను. ఈ కవివంశమువారిప్పటికిని చంద్రమపాలెములోనే యున్నారు. ఆంధ్ర నామసంగ్రహముచేసిన పైడిపాటి లక్ష్మణకవి, కన్నప్పచరిత్రము చేసిన కంచిరాజు సూరయ్య, శివజ్ఞానదీపికనుజేసిన కవిలోకబ్రహ్మ, ఇందుమతీ కళ్యాణముచేసిన యంగర బసవయ్య, ద్వాదశరాజచరిత్రచేసిన కట్టవరపు చిట్టమరాజు, ద్విపద రుక్మాంగదచరిత్రముచేసిన రామయ భాస్కరుఁడు మొదలగు కవు లీకవికిఁ బూర్వమునందుండినట్లు లక్షణసారసంగ్రహ ములో నియ్యఁబడిన లక్ష్యములవలనఁ దెలియవచ్చుచున్నది. కవి యొక్క శైలిని జూపెడు పద్యములఁ గొన్నిటి నిందుదాహరించు చున్నాను—

రుక్మిణీ పరిణయము.

ఉ. సారము ముద్దుఁబల్కు ఘనసారము సిద్ధపుమేనితావి కా
సారము నాభిరంధ్రము విసారము తేటమిటారిచూపు శ్రీ
కారము కర్ణయుగ్మము చొకారము నవ్వుమొగంబు షట్పదా
కారము కొప్పు సన్మధువికారము మోవి వధూలలామకున్. ఆ.-౩.

ఉ. కౌను చలింప సిద్ధపుమొగంబునఁ జెమ్మటముంప గంకణ
ధ్వానము లింపునింపఁ గరతాళగతు ల్పచరింప హారముల్
పూసినటింప నూర్పుసొలపు న్వలితెమ్మర లంకురింపఁగాఁ
జానయొకర్తు రుక్మిణికి సంపఁగినూనెఁ దలంటె నేర్పునన్. ఆ. ౪.

రాజశేఖరవిలాసము.

శా. ఏరాభూవర మాకుఁ గాంచనతురంగేభాంబరాందోళికా
భూరిస్యందనమందిరోపవనసద్భూపామణి శ్రేణులున్
బే రెన్నందగుపల్లెలుం బడుపులుఁ లెక్కింప కర్థంబులున్
ఈరా కోరికతీఱ మాఱు కీక నీవెంతేనియుఁ ధీరతన్. ఆ. ౧.

ఉ. అయ్యెడఁ జెల్లమాంబ విభునానతి గైకొని వాఁడిచూపు లొ
య్యొయ్యనమీఁటి లేనగవు లొప్పగఁ జెక్కులఁబాఱ తీవియో
బయ్యెదజాఱ ముద్దునునుబల్కులు చెల్వలరార నవ్వుటుం
జయ్యనఁ జేరి మ్రొక్కి నెఱజాణగు చెల్ల నెఱింగి రంగుగన్. ఆ.3

సింహశైల మాహాత్మ్యము.

మ. వలపుంగొజ్జగినీటిశీతలహరీవార్బిందువు ల్చిమ్మచున్
గలయం గప్పురపుందుమారము మెయిన్ గాటంబుగాఁ గప్పచున్
బలవద్దర్పకబాణపంక్తులక్రియన్ బైపై విరు ల్లుప్పచున్
జెలఁగె న్మందసమీరణుండు దితిజశ్రేష్ఠాగ్రభాగంబునన్. అ. ౨.

ఉ. అక్కట! దైత్యనాయకుఁ డహర్నిశయుం దనయాత్మ నెంతయున్
మక్కువమీఱ ని న్మనుచుమాట దలంపక తద్విపక్షునిన్
బెక్కుఁడెఱుంగులం గడఁగి వేఁకొనఁజూచెదు చిన్నవాఁడ వీ
వెక్కడ? తత్త్వ మెక్కడ? సహింపఁడుసుమ్మనిశాచరార్భకా.అ-3

నీలాసుందరీ పరిణయము.

ఉ. మినుకుఁగడానిబంగరపుమేడల సోరణగండ్ల వెంట రే
ల్చనియెడిరిక్కమొత్తమును జక్కఁగఁజూచి మెఱుంగుబోండ్లు ని
చ్చలు పిడికిళ్ళఁబట్టి యవి జాఱీచనం దమగోళ్ళు చుక్కలం
చును నెడనిల్చి చేవదలి చూచుచు నబ్బురపోదురందులన్. ఆ. ౧.

ఉ. కన్నులవింటివాఁడ తిగకన్నులదేవరతోడఁబోరి ముఁ
బన్నము నొంది మేఁదొఱఁగుపట్టున నెక్కడ డాఁగిపోయె నీ
మన్నెఱికంబు? నేఁడు కొఅమాలినకోయిలచిల్కమూఁకలన్
బన్నుగఁ గూడి చేడియల బాములఁ బెట్టెదు పోటుబంటవై. ఆ.3.

అచ్చతెలుఁగు రామాయణము.

ఉ. కాయను మేటితప్పి కొడుకాయను సిద్ధపుఁబూఁతమావిమో
కాయనుఁ బంజరంపుఁజిలుకాయను నబ్బపునోయగంపుఁబ్రో

కాయనుఁ బలుకవేమి యలుకాయనుఁ బంతముతీఁ బెనోటు కై
కాయనునేర యిట్లు దుడుకాయనుఁ మాయఁగఁ గోరికాయనన్.
అయోధ్యా.

చ. జగములతల్లియై పుడమి జవ్వనిగాదిలిపట్టి యైనయి
మ్మగుదలమిన్నఁ దెచ్చితిని మోస మెఱుంగక నీకు నెవ్వరుం
దగ దిదియుంచుఁ దెల్పఁ గలదంటలు గల్గమిఁజేసి యిట్టికీ
డగపడె నింకనైన విడనాడక రామునిఁ బ్రాపుఁ జేరుమీ. సుందర.

లక్షణసారసంగ్రహము.

చ. కరములు దోయిలించి కుతుకంబున నిచ్చలుఁ బ్రస్తుతింతు భా
స్వరగుణవంతునిన్ సకలసత్కవిజాలవసీవసంతునిన్
జరకరుణానిశాంతుని విశిష్టజనావనతావిశాంతునిన్
సురతరుమంజరీసిభయకోహరిదంతుని నేకదంతునిన్. ఆ. ౧.

మ. ఘనకారుణ్యకటాక్ష రాక్షసచమూగంధేభహార్యక్ష స
జ్జనసంరక్షణదీక్ష పాలితసరోజాతాక్ష శక్రాంబుజా
సనముఖ్యామరపక్ష దక్షసవనాంచత్రోధితాగ్రూక్ష యా
చనకల్పాంగణకల్పవృక్ష రిపుశిక్షోదక్ష మోక్షప్రదా. ఆ. ౨.

రసికజనమనోభిరామము.

మ. తరుమూలంబులపొంత బొంచి సచినో త్తంసంబు వీక్షించె బా
స్వరకాత్తస్వరవిగ్రహ సమదచంచచ్చంచరీకాలకన్
శరదిందుప్రతిమానచారువదనన్ జక్రస్తని స్విస్ఫుర
త్సరసీజాతదళాయతాక్షి నొకకాంతాలోకచూడామణిన్. ఆ. ౩.

మ. సవనాదిక్రియల న్సుధాంధులను మెచ్చుంజేసి ధన్యాత్మలై
నవిశేషజ్ఞుల కబ్బుఁగాక యకటా నా కేటికింగల్గు ని
ర్భవనాతీతవిలాసవిభ్రమకళాభూరిప్రభాంచన్మరు
ద్ధవళాక్షీమధురాధరాధరసుధాధారాసరిద్దోరణుల్. ఆ. ౪.

సర్పపుర మాహాత్మ్యము.

మ. సరసీనిర్మలనీరబిందుకణముల్ సమ్యగ్గ్రహింబూని వి
స్ఫురదారామలతాంతసౌరభరజఃపుంజంబుఁ గైకొంచు ని
ర్భరమందాసిలశౌబకప్రకరముల్ షల్మ్మలు నకోకనల్లోఁ
దిరుగుం బొంధజనశ్రమాపహరణోద్వ్యత్తిం బ్రకాశింపుచున్. ఆ-౩

ఉ. నీకరుణావిలోకమునన్నిల్పినచోఁ గులహీనుఁడున్ హాయా
నేకపహేమచామరమణీరమణీయవిభూషణాదికా
స్తోకవిభూతి చెంది పరిశుద్ధకులుం డన మించు లేనిచో
నాకనివాసుఁడున్ వెతల నందుఁగదమ్మ జగత్కుటుంబినీ. ఆ. 3.

శివలీలావిలాసము.

ఉ. అంగదముద్రికావలయహారలలాటిక లెమ్మె నెమ్మెయిన్
రంగులు గుల్కఁ గ్రొందగటునాడెపుఁబావడ సొంపునింప మే
ల్బంగరుగిల్కుటందియలు బాళిగ నంఘ్రులఘుళ్ఘుళ్ఘుళ్ఘన
గంగ యనుంగులం గలసి కౌతుకలీలలఁ గ్రీడ సేయుచున్. ఆ. ౧.

ఉ. కన్నులుమూయుఁ గ్రుళ్ళిపడి గ్రక్కునదిక్కులరోయు నూరకే
సన్నలుచేయుఁ బైవలువ చయ్యనవ్వలఁగ్రోయు మింటిపై
వెన్నెలగాయుచంనురుని వేఁడికిఁ దాఁ బెడఁబాయు నద్దిరా
చిన్నెలజంగమప్రభునిచిత్తవికారము లెన్నఁజిత్రముల్. ఆ. ౨.

---

13. వక్కలంక వీరభద్రకవి

ఈకవి కూచిమంచి తిమ్మకవి జగ్గకవుల కాలములోనే పిఠాపుర మునందుండి నిక్కలి ప్రసిద్ధిగన్నవాఁడు. కూచిమంచి తిమ్మకవివలెనే యితఁడును దెందులూరి లింగనారాధ్యుని శిష్యుఁడయి తన వాసవదత్తా పరిణయమునం దాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. అంభోధివలయితకుంభినీజననుతదంభశాంభవకళాజృంభితములు
నందివాహపదారవిందవిశ్వాసమరందసంపాదనేందిందిరములు
స్వేక్షణాదరనరాధ్యక్షులక్ష్మీప్రదానక్షమసామ్రాజ్యదక్షిణములు
ఊహాపదాత్మబోధాహతస్వాంతసందేహలీలాపశ్యతోహరములు
ధీరతాగుణమణిహారి దెందులూరి
లింగగురువరసత్కృపాపాంగవీక్ష
ణములు సతతంబు శుభసిదానంబులొసఁగు
శిష్టజనముల వయను రక్షించుఁగాత!

ఈకవి గౌరీకళ్యాణ మను నామముతోఁ గాళిదాసకృతమయిన కుమారసంభవమును బెలిగించుటయేకాక సుబంధకవి విరచితమయిన వాసవదత్తను వాసవదత్తాపరిణయమను పేరితో నాంధ్రీకరించి దానిని పీఠికాపురాధీశ్వరుఁడయిన రావు మాధవరాయనింగారి కంకితముచేసెను. పద్మనాయకకులసంభవుఁడైన శ్రీరామచంద్ర మాధవరాయకృపాలుఁడు తన్ను బిలిపించి వాసవదత్తను బెనిఁగింపనడిగిన కథను కపి వాసవదత్తా పరిణయమునం దిట్లు చెప్పికొనియున్నాఁడు—

శా. శ్రీమచ్చంద్రకళాకిరీటపదరాజీవద్వయీభావనా
సామర్థ్యోదితవాక్ప్రపంచఘటనాచాతుర్యవిద్వజ్జన
స్తోమానందద శేముషీనిజవిలాసు న్వక్కలంకాన్వయున్
బ్రేమా ద్యాస్పను వీరభద్రుని ననుం బిల్పించి యుప్పొంగుచున్.

క. తాతలతరముననుండియు। నీతనిజనకుండు మనకు హితుఁడు కవీంద్రుం
డీతనిచేతం గృతి వి। ఖ్యాతిగఁగై కొందు ననుచు హర్షం బొదవన్.

గీ. సవినయంబున సముచితాసనమునందు
నంతికంబునఁ గూర్చుండ నాజ్ఞయొసఁగి
మందహాసాంచితముఖారవిందుఁ డగుచు
నతిదయాస్ఫూర్తి నిట్లని యానతిచ్చె.

క. శ్రీవెలయ నుభయభాషల। నీవలెఁగృతిఁజేయఁగలరె నేఁటికవీంద్రుల్
భూవిశ్రుతకవితావి। ర్భావయశస్సాంద్ర వీరభద్రకవీంద్రా.

సీ. మీతాత లోకవిఖ్యాతభాషాఖిలశేషహి యాచంద్రశేఖరుండు
మీతండ్రి చాటువాగాతతచిత్రప్రబంధకల్పనశాలి భాస్కరుండు
మీతల్లితండ్రి పురాతనసత్కవినాథుల కెన విశ్వనాథసుకవి
మీ మేనమామ సుత్రామవై భవుఁడుసద్యఃకృతిమతి వేంకటాద్రిసుకవి
చదువకయె శ్రీసతీశప్రసాదగరిమ
బాల్యమునను గుమారసంభవము తెనుఁగు
చేసి కవు లెంచఁ బ్రఖ్యాతిఁ జెంది తీవు
కలరె నీసము లాధునికులు కవీంద్ర.

ఉ. అత్యలఘుక్రియానిపుణుఁడై ధరణీతల మేలు విక్రమా
దిత్యసభాంతరంబునఁ బ్రతిష్ఠితుఁడై ఘనధీసమగ్రతన్
సత్యవతీతనూభవునిజాడఁ బ్రసిద్ధికి నెక్కి నవ్యసా
హిత్యమునన్ సుబంధుసుకవీంద్రుఁడు ప్రస్తుతిఁగన్నవాఁడిలన్.

గీ. ఘనతరమనీష నమ్మహాకవివరుండు
ప్రతిపదశ్లేషగద్యప్రబంధ మత్యు
దారతను జెప్పె వాసవదత్తయనఁగ
నార్యులాకథ కడుచోద్య మనిరి సభను.

మ. స్తవనీయుంబగు తత్కథాక్రమము భాషాయోషిదంఘ్రిస్ఫుర
న్నవమంజీరనినాదమేదురనితాంత ప్రౌఢవాగ్గుంభన
భవదీయోక్తుల నాంధ్రకావ్యముగ వై దర్భీగతిం గూర్పు త
త్కవినవోక్తులు కొన్ని నీకవితకుం గై దండ గావింపఁగన్.

క. వరమతి వాసవదత్తా । పరిణయమును జెప్పి యీప్రబంధము విద్వ
త్పరిగణ్యంబుగ మాకుం । దిరముగ నంకితముచేయు ధీరవిచారా.

భర్తృహరియొక్క సుభాషితరత్నావళిని దెనిఁగించిన యేనుఁగు లక్ష్మణకవి మొదలైన వారీకవిత్రో సమకాలికులు. సమకాలమునం దున్న కవులు కూచిమంచి తిమ్మకవిని బొగడక యీతనిని బొగడుటచే దిమ్మకవి కవిత్వముకంటె నీతనికవిత్వమునం దప్పటివారి కధికాదరమున్నట్లు స్పష్టమగుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తనరామవిలాసమునందుఁ బూర్వకవులను స్తుతిచేసిన పిమ్మట—

గీ. దిట్టకవి విశ్వనాథుఁ బ్రార్థించికొలుతు
నతనినందనుఁ డగువేంకటాద్రికవికి
వాక్యపూజలు గావింతు వక్కలంక
వీరభద్రుని భావింతు గౌరవమున.

అని యీవీరభద్రకవిని బేర్కొని యున్నాఁడు. ఆకాముసం దుండిన యీదరపల్లి భవాని శంకరకవియుఁ దాను దెనిఁగించిన ధర్మ ఖండములో—

మ. హరితుల్యుం డగురావుమాధవ నృపాలాగ్రేసరున్ గావ్యచా
తురి మెప్పించి తదీయసత్కృప సిరు ల్తోరంబుగాఁ బొంది బం
ధుర తేజుండగు వక్కలంకకులపాథోరాశిరాకాసుధా
కిరణుండై తగు వీరభద్రసుకవిం గీర్తింతు నా నెచ్చెలిన్.

అని వీరభద్రకవిని బ్రశంసించి యున్నాఁడు. సమానకాలమువా రిట్లు మెచ్చుటచేతనే యీకవి యసమానకవిత్వప్రౌఢిమ గలవాఁడని తేట

పడుచున్నది. ఈవీరభద్రకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భార
ద్వాజగోత్రుఁడు; భాస్కరకవి పుత్రుఁడు; చంద్రశేఖరకవి పౌత్రుఁడు;
దిట్టకవి విశ్వనాథకవి దాహిత్రుఁడు. ఈతనితల్లి జగ్గాంబ; మేనమామ
దిట్టకవి వేంకటాద్రికవి. ఈకవి తండ్రితాతలనుండియుఁ బిఠాపురసంస్థాన
మునం దుండినవాఁడు. తండ్రి తరమువారును తల్లి తరమువారునుగూడ
సత్కవీశ్వరులు. ఈకవి మాతామహుండైనఁ విశ్వనాథకవి పెద్దాపుర
సంస్థానస్థాపకుఁడయిన శ్రీవత్సవాయ ముసలి తిమ్మరాజుగారికిఁ దాను
రచించిన శేషధర్మప్రబంధము నంకితము చేసెను. శేషధర్మరత్నాకర
మనుపేరితో నీగ్రంథమునే రాజమహేంద్ర నివాసుఁడగు కొండయ కొడు
కగు శ్రీనివాసకవియు రచియించెను. వీరభద్రకవి ౧౭౫౦ వ సంవత్సర
ప్రాంతమువఱకును జీవించియుండవచ్చును. ఇతఁడు తనవార్ధకదశలో
పిఠాపురమును విడిచి వృద్ధగౌతమీతీరమునందున్న ముమ్మిడివరము
ప్రవేశించి సన్న్యాసాశ్రమమును స్వీకరించి యక్కడనే సిద్ధిపొందెనఁట.
ఈకవి విరచితగ్రంథములనుండి కొన్నిపద్యముల నిందుదాహరించు
చున్నాను—

వాసవదత్తాపరిణయము.

శా. భల్లూకంబులఁ జూచితే తిమిరసంపల్లాలితాంగప్రభో
ద్వల్లీలత ఘననీలనీలఘనసఖ్యం బెప్పుడుం జేయఁగా
వల్లీవేల్లితవామలూరువులక్రేవం గొంటుజుంటీఁగలం
దెల్లం గుయ్యిడఁ దేనియల్గొనెడు భూమీశా విచిత్రంబుగన్. ఆ-౬

శా. ప్రచ్ఛాయస్థలపల్లవాస్తరణనిద్రాయోగ్యముల్ పాటలీ
గుచ్ఛాకల్పమరు న్మనోజ్ఞతరముల్ కూలంకషాభ్యంతర
స్వచ్ఛాంభఃపరిపేనపార్శ్వాములు పశ్చాద్భాగసౌభాగ్యముల్
స్వచ్ఛందస్థితి గ్రీష్మవాసరము లెంచం జాల మించెం ధరన్. ఆ. 3.

కుమారసంభవము.

చ. హారుఁ డఖిలేశుఁ డవ్వనరుహోజ్ఝితపాప్రతిఘూతి హేతువై
పరఁగినతత్సపర్యలకు భావమునం గడుమెచ్చి యొప్పెఁ దా
నరయ వికారకారణము లంటిన నిశ్చలతం దనర్చు నె
వ్వరిహృదయారవిందములు వారలె ధీవరు లెంచిచూడఁగన్. ఆ-౧

చ. మలయవసుంధరాధరసమాగతబంధురగంధవాహరా
జుల నెదిరించుచున్ వివిధసూనగుళుచ్ఛరజఃపరంపరల్
కలయఁగఁ జూపు లడ్డుకొనఁగాఁ గను గానక దర్ప మేర్పడ
జెలఁగి మృగంబు లవ్వికసీమ నటించె మధూదయోన్నతిన్. ఆ-౨

ఉ. అన్ను తలంచు రూపము హితాళి తలంచుఁ గులంబు తల్లి దా
నెన్ను సువస్తువుల్ వరుల నేర్చుతఱిన్ బురవైరి నెంచినన్
గన్నులు మూఁడు పుట్టుటయె కానఁగరాదు దిగంబరుండనుం
జిన్నముసొమ్మ్ములేదు తెలిసెం దగఁ డాతఁడు నీకు మానినీ. ఆ. 3.

ఉ. క్రొత్తలుచేసి గేహములు గోవజవాజిని బచ్చికస్తురిన్
మెత్తిరి గోడ లందుపయి నిద్దపుఁజాయలపాలసున్నముల్
చిత్తరువుల్ లిఖించిరి విచిత్రగతి న్నయనోత్సవంబుగా
నత్తఱి నుత్తముల్ ప్రతిగృహంబున శోభనశోభ సంధిలన్. ఆ. ౪.

14. కూచిమంచి జగ్గకవి

ఇతడు సుప్రసిద్ధుఁ డయిన తిమ్మకవి సార్వభౌముని రెండవ తమ్ముఁడు. ఈతని జన్మసంవత్సర మేదో తెలియదుగాని తిమ్మకవికంటె నాలుగయిదుసంవత్సరములు చిన్నవాఁడయి యుండవలసినందున, ఇతఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతమునందు పుట్టిన ట్లూహింపఁదగియున్నది. ఈజగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును చదువెఱుఁగక యల్లరిమూఁకతో దిరుగుచు కాలము గడపెననియు అప్పుడు వివాహితుఁడయి యత్తవారియింటికి మనుగుడుపునకు బోయి మామగారు తనకుఁ బరమశుంఠ యైనయల్లుఁడు దొరకినందున కనుతాపపడఁగా రోషముచేత దేశాంతరమునకు లేచిపోయి పండ్రెండు సంవత్సరములు విద్యాభ్యాసముచేసి పండితుఁ డయి కవిత్వము చెప్ప నారంభించెననియు, పుక్కిటపురాణ మొకటి కలదుగాని యిది కేవల కల్పితకథయని తోఁచుచున్నది. ఈకథనుబట్టి యీకవికి కవిత్వము చెప్పనారంభించు కాలమునాఁటికి ముప్పదిమూఁడు సంవత్సరముల ప్రాయ మయి యుండవలెను. కూచిమంచి తిమ్మకవి తాను ముప్పదిసంవత్సరముల ప్రాయమునఁ జేయ నారంభించిన సింహశైలమాహాత్మ్యమునందు దనపెద్దతమ్ముఁడైనసింగన్నను వర్ణించినతరువాత రెండవతమ్ముఁడైన యీజగ్గకవిని గూర్చి యిట్లు ప్రాసియున్నాఁడు—

క. అతని యనుజన్మఁ డతులిత
మతియుతుఁడు సమస్త రాజమాన్యుఁడు సుగుణా
న్వితుఁడు సమంచితకవితా
చతురుఁడు జగ్గప్రధానచంద్రుఁడు తనరున్.

క. భోటకలాటకిరాటవ
రాటమరాటాంగవంగరాజన్యసభా

ర్భూటనిరాఘూటనట'

చ్చాటుకవిత్వాంకుఁ డరయ జగ్గన ధరణిఁ.

సీ. నిరతంబునుడివోనిసిరినిరవొందియుఁ దవుటినిప్పటిమెక్కఁ దలఁపఁడేని
సదమలాచారప్రశ స్తి గాంచియువర్ణ ములు సంకరంబుగాఁ గలఁపఁడేని
ఖలజనసంశిక్ష గావింపుచుండియుఁ బతిత్రుల నెపుడుఁ జేపట్టఁ డేని
యురుపుణ్యవ ర్తియయ్యును బాడబాగ్రేయసీమ నిల్లుగను వసింపఁడేని
యలజగన్నాయకుఁడు సాటియనఁగఁబోలు
భోగమున నిర్మలాచారమున విశిష్ట
రక్షణంబునఁ బుణ్యమార్గమున నరయ
గంగనామాత్య జగ్గయఘనునిత్తోడ.

ఈపద్యపద్యములు రచియింపఁబడిన కాలమునకు జగ్గకవి యించు మించుగా నిరువదిమైదు సంవత్సరముల యీడుగలవాఁడయి యుండును. ఇరువదిమైదేండ్ల ప్రాయమునాఁటి కన్నిదేశములు తిరిగి రాజసభలలోఁ బ్రసిద్ధిగాంచఁ గలుగుటకు కవి యిరువదియేండ్ల వయస్సునకు లోపలనే పండితుఁ డయి కవనచాతురి గలవాఁ డయియుండవలెను. అందుచేత జగ్గకవి యిరువది సంవత్సరముల ప్రాయము వచ్చువఱకును నక్షర జ్ఞానము లేనివాఁడని చెప్పెడికథ నమ్మఁదగినదికాదు. ఈకవి తనవివాహా నంతరమున ధనార్జనము నిమిత్తమును పాండిత్యప్రకాశనము నిమిత్త మును బహుదేశాటనముచేసి రాజాస్థానములలో మెప్పొందిన సత్కార మును బొందుట వాస్తమే యైనను, "భోటకలాటకిరాటవరాట్టమరా టాంగవంగ" యని ప్రాసనిమిత్తమయి వేయఁబడిన దేశసంచారము కొంత యతిశయోక్తియై యుండవచ్చును. ఇతఁడు దేశాటనముచేసి వచ్చిన తరువాతను దక్షార్వ్యమునను, జానకీపరిణయమును, ద్విపద రాధాకృష్ణచరిత్రమును, చాటుప్రబంధములును, సుభద్రాపరిణయమును, చంద్రరేఖావిలాపమును, సోమదేవరాజీయమును రచియించెను. చంద్ర

రేఖావిలాపములోని యీక్రింది పద్యమున వర్ణింపఁబడిన వరుసనుబట్టి విచారింపఁగా నితఁడు దేశసంచారముచేసి రాజాస్థానములయందు రాజులమీఁద చాటు ప్రబంధములు చేయుటకుముందే జానకీపరిణయమును రాధాకృష్ణచరిత్రమును రచించినట్లు తోఁచుచున్నది—

సీ. రచియించితివిమున్ను రసికు లౌననిమెచ్చ సురుచిరజానకీపరిణయంబు
వచియించితివి కవిప్రాతము ల్పొగడంగ ద్విపదరాధాకృష్ణదివ్యచరిత
ముచ్చరించితివి విద్వచ్ఛయంబు నుతింపఁ జాటుప్రబంధముల్
శతకములును
వర్ణించితివి యిరువదిరెండువర్ణనల్ రాణించఁగా సుభద్రావిహావా
మాంధ్రలక్షణలక్ష్యంబు లరసినావు
భూరిరాజన్యసంసత్పూజితుఁడవు
బళిర నీభాగ్యమహిమ చెప్పంగఁదరమె
జగ్గకవిరాజచంద్ర వాచాఫణీంద్ర.

ఇతఁ డీచంద్రరేఖావిలాపమును విజయనగరసంస్థానాధివతులగు శ్రీ పూసపాటి విజయరామరాజుగారి చెల్లెలి పెనిమిటియగు చింతలపాటి నీలాద్రిరాజుమీఁది కోపముచేతఁ జేసెను. ఇది బూతుపుస్తకమగుటచే నిందలిపద్యము లుదాహరింపఁ దగియుండలేదు. "అర్ణవవేష్టితాఖిల మహామహిమండలిలోని బూతులం। బూర్ణుఁడ" నని కవియే చెప్పుకొనుటచే నీతఁడు తిట్టుకవిత్వమునం దసమానపాండిత్యముకలవాఁ డయినట్టు స్పష్టమగుచున్నది. జగ్గకవి ధనసంపాదనము నిమిత్తమయి విజయనగరమునకుఁ బోయి రాజు బావయైన నీలాద్రిరాజు నాశ్రయింపఁగా నితఁడు తానుంచుకొన్న వేశ్యను నాయికఁగా జేసి తనమీఁద ప్రబంధము చేయుమని కోరెనఁట! ధనాశచేత నట్టిప్రబంధరచన కొప్పుకొని కవి చంద్రరేఖావిలాసమను శృంగారకావ్యమును జేసెనఁట! అటు తరువాతఁ దాను సంస్కృతకావ్యమును రచించి యిచ్చెదనని చెప్పి

రాజుమతి మరలించిన యాడిమళ్ల వేంకటశాస్త్రి ప్రోత్సాహముచేత నీలాద్రిరాజు జగ్గకవికి తగినబహుమానముచేసి సత్కరింపక తిరస్కార మును జూపెనఁట! అందుపై ని ముంగోపియైన యీశ్వరకవితాను రచియించిన చంద్రరేఖావిలాసమును చింపివేసి చంద్రరేఖావిలాపమను పేరిట నిప్పటి బూతుగ్రంథమును జేసెనఁట! ఇందలి కవివర్ణనలో సహితము సాధుకవులను విడిచి యిట్లు తిట్టుకవిత్వము చెప్పినకవులనే పేర్కొని యున్నాఁడు—

క. భీమకవి రామలింగని। శ్రీమంతుండై వెలుంగు శ్రీనాథకవిన్
రామకవిముఖ్యులను బ్రో। ద్దామగతిం జిత్తవీథిఁ దలఁచి కడంగన్.

ఈపుస్తకములోని మొదటిపద్య మిట్లున్నది—

శా. శ్రీకంఠుండు భుజంగభూషణుఁడు భస్మీభూతపంచాస్త్రుఁ డ
స్తోకాటోపబలప్రతాపపురరక్షోదక్షసంశిక్షణుం
డాకాశోజ్వలకేశపాశుఁడు త్రిశూలాంకుండు రుద్రుండు దా
వీఁకం డింతలపాటనీలనృపతి నీక్షించు నేత్రత్రయిన్.

ఈపుస్తకమునుజేసి జగ్గకవి నిజాంరాజ్యమునకుఁబోయి హైదరాబాదునగరమునందుఁ గల తురకదొరల నాశ్రయించి వారిమోద పద్యములుచెప్పి తన్మూలమున నవాబుయొక్క దయను సంపాదించి, నిజాము ప్రభుత్వమునకు లోఁబడిన సామంతరాజ్యమైన విజయనగరమునకు ప్రభువగు శ్రీవిజయరామరాజుగారివద్దకుఁ దనగ్రంథమును నీలాద్రిరాజు సమ్మోఖమున సభలోఁ జదివించి వినునట్లు నవాబువద్దనుండి యుత్తరువు తెచ్చి యట్లు చదివెనని చెప్పుదురు. ఇతఁడు గ్రంథమునందు నీలాద్రి రాజు నెంత దూషించినను, తత్పత్నియగు నరసమాంబను దూషింపక యాపతివ్రత నిట్లు భూషించెను—

క. ఖలుఁడైన నీలనృపుఁ డీ। యిలపై నిన్నాళ్ళు బ్రతుకునే నరసాంబా
గళకలితకనకమయ మం। గళసూత్రోత్కృష్టమహిమఁగాక కుమారా.

ఈజగ్గకవియు నించుమించుగా నన్న జీవించినంతకాలము జీవించి నట్లు కనఁబడుచున్నది. అందుచేత నితఁడు ౧౭౦౦ వ సంవత్సర ప్రాంతము మొదలుకొని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండినవాఁడని జెప్పవచ్చును. ఈతఁడు రచియించిన గ్రంథములలో నాఱాశ్వాసములు గల సుభద్రాపరిణయము మనోహరముగా గనఁబడు చున్నది. ఆపుస్తకమునందు జగన్నాయకస్వామినిగూర్చి వ్రాయఁబడిన మొదటిపద్య మిట్లున్నది.

ఉ. శ్రీయలరఁ సుభద్రయును సీరియుఁ బార్శ్వముల న్మెలంగ న
త్యాయతలీల నీలకుధరాగ్రమునందు వసించి నిచ్చలుం
బాయక భక్తకోటి కనపాయశుభంబు లొసంగు శ్రీజగ
న్నాయకదేవదేవుఁ డభినంద్యకృపామతి మమ్ముఁ బ్రోవుతన్.—ఆ. ౧.
సుభద్రాపరిణయమునం దితఁడు

గీ. నన్నపార్యుని తిక్కన నాచిరాజు
సోము నమరేశు శ్రీనాథు భీమకవిని
రంగనాథునిఁ బోతనఁ బ్రాజ్ఞపరుని
శంభుదాసుని భాస్కరు సంస్తుతింతు.

అని కవిస్తుతిచేసి తనయన్నయగు తిమ్మకవినిట్లు పొగడి యున్నాఁడు—

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతునిఁ గూచిమంచ్యన్వయాంభోదినీహారకరుని
గంగనమంత్రిశేఖరునకు నంగనామణి యగులచ్చమాంబకును సుతుని
బహుకావ్యనిర్మాణబంధురప్రతిభునిఁ గుక్కటేశ్వరకృపాంకూరలబ్ధ
సత్కవితామహాసామ్రాజ్యభారధౌరేయుని బుధజనప్రియచరితుని
వెందులూరి లింగనారాధ్య దేశికేంద్ర
దత్తమాహేశ్వరాచారవృత్తిరతునిఁ
గందరాడఘనగ్రామమందిరుని మ
దగ్రజునిఁ దిమ్మకవిరాజు నభినుతింతు.

ఇతఁడు తనగ్రంథములను జగన్నాథస్వామి కంకితము చేసెను. ఈకవిచేరచియింపఁబడిన జానకీపరిణయము మొదలయినగ్రంథములునాకు లభించినవి కావు. ఇతఁడు కాకతిప్రతాపరుద్రవంశజుఁ డయిన మందపాటి నారాయణరాజుయొక్క ప్రేరణముచేతఁ బ్రతాపరుద్రవంశమును వర్ణించుచు సోమదేవరాజీయమను మూడాశ్వాసముల గ్రంథమొకటి రచియించెను. కవియొక్క కవితానైపుణిని జూపుటకై కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

సుభద్రాపరిణయము.

చ. సురుచిరలీలఁ గన్గొనియె శోభనదివ్యసరోజమాలికా
పరిమళలాభలోభమదబంభరడింభరవామషంగ దు
ర్భరదురితౌఘభంగ నతిభాస్వరగాఢతరంగ రంగదీ
శ్వరమకుటాగ్రరంగ శుభసంగను గంగఁ దగంగఁ జెంగటన్. ఆ.౨.

ఉ. ఆరమణీలలామము లుదంచితలీలలఁ గాంచి రొక్క కా
సారము సారసౌరభవిశంకటసారసపుండరీకక
ల్హారమరందపానపరిలంపటమాద్యదళీంద్రసాంద్రఝుం
కారము కోకహంస బకకచ్ఛపమీనఝుళీకళీరముల్. ఆ. 3.

శా. కారంబయ్యె నితంబినీమణి కలంకారంబుఁ రోలంబఝుం
కారంబుల్ సమదోగ్రకోకిలకుహూకారంబుఁ జంద్రోద్ధతా
కారంబుల్ గుసుమాస్త్రచాపగుణటంకారంబు రాయంచక్రేం
కారంబుల్ శుకశారికానికరహుంకారంబు ఘోరంబుగన్. ఆ.౫.

చ. తళుకుఁబిసాళివాలుఁగనుదమ్మి లొకించుక విప్పి కన్యకా
తిలకము కాంచె నీలమణిదీధితిజాలమనోజ్ఞ గాత్రునిన్
జలవదరాతిజైత్రునిఁ గృపాపరిపూరిత నేత్రునిన్ సమూ
కలితవిలాసచైత్రుని జగన్నుతిపాత్రునిఁ బాండుపుత్రునిన్. ఆ. ౬:

సోమదేవరాజీయము.

శా. అన్నా యెక్కడనుంటి వొక్కడవు రే మాహా మహాశ్చర్య మీ
వెన్నన్ బాలుఁడ విట్టు లుంట విహితంబే రేయి నల్లాములున్
నిన్నుం గానక కుందుచుంటిమిగదా నిక్కంబు మాప్రాణముల్
కన్నార న్నినుఁ జూడకున్న నిలువంగా నేర్చునే లేశమున్. ఆ. ౧.

ఉ. వింటిరె మీర లిప్ప డొకవింత కువాళపుబండివాండ్రు మొ
న్నంటినిశార్ధభాగమున నాచి మహేశగృహంబు చొచ్చి రా
బంటులె నిన్న రేయి మనపట్టణభూసురవర్యుఁ గొట్టి వా
రింటిపదార్థ మెల్ల హరియించి రనాయక మయ్యె రాజ్యమున్. ఆ. ౨

---

15. కొవలె గోపరాజు

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; గోపరాజు పౌత్రుఁడు; కసవరాజునకును కామాంబికకును పుత్రుఁడు. ఇతఁడు సింహాసనద్వాత్రింశతిక యనుపేరవిక్రమార్కునికథలను పండ్రెండు ద్వ్యాసముల పద్యకావ్యముగా రచియించెను. ఈద్వాత్రింశత్కథాస్థలభంజికల కథలను రచించుటనుగూర్చి కవి యిట్లు వ్రాయుచున్నాఁడు—

క. అప్పరమేశ్వరుకరుణన్। గుప్పలుగొనువిక్రమార్క గుణములకొఱకై
చెప్పెద రసభావంబులు। మస్పిరిగొనునట్లు కథలు ముప్పదిరెండున్.

ఈకవివంశమునకు మూలపురుషుఁడైన పెన్నయామాత్యుఁడు

సీ. కలుషమండలికభేకఫణీంద్రుఁడన రాయగజగంధవారణఖ్యాతి మెఱసి

* * * *

నెగడె నందవోలు నెలవుగా భూసుర। వంశసాగరామృతాంశుమూర్తి
చక్రవర్తి మాన్యసౌజన్యధుర్యుండు। విక్రమార్కనిభుఁడు పెన్నవిభుఁడు.

అనుపద్యమునుబట్టి నందవోలురాజులయొద్ద మంత్రిగానుండి బిరుదముల నందినట్లు కనుపట్టుచున్నాఁడు. ఇతఁడు పదునాఱవ శతాబ్ది మధ్యమునందుండి యుండవచ్చును. కాఁబట్టి యీపెన్నయామాత్యుఁడు కేడవపురుషుఁడైన కవి తరువాత నూటయేఁబది సంవత్సరముల కనఁగా పదునేడవశతాబ్దాంతమునం దుండి యుండును. కవితండ్రియైన కసవరాజు వేములగల్లు పురాధీశ్వరుఁడయిన మల్లరాజు మంత్రియైనట్లు,

శా. రాణా మల్లనకీర్తిచంద్రికలు పర్వం బొంగి మధ్యాశ్రిత
క్ష్మాణీభృద్ఘనదుర్గమై గుణమణిస్తోమంబుల న్నిండి యీ
క్ష్మాణి శ్రీపురుషోత్తమాశ్రయము నై శోభిల్లి దానామృత
శ్రేణి ద్యాగసముద్రనామము వహించెన్ వేములగల్లిమ్మహిన్.

ఇత్యాది పద్యములవలన, దెలియవచ్చుచున్నది. కాని యీమల్ల నృపాలుఁ డెవ్వఁడో యేకాలమునందుండినవాఁడో యింకను విచారింప వలసియున్నది. ఎట్లయినను గవి యింపుమించుగా నిన్నూఱుసంవత్సర ములక్రిందటివాఁ డగుటకు సందేహములేదు. ఈ విక్రమార్క-చరిత్రము లోని గద్యమునందు

"ఇది రాయగజగంధవారణ వైరిమండలీకఫణీంద్ర వీరఘోట్ట
విభాళాదిబిరుద ప్రకటచారిత్ర కొవలె పెన్నయామాత్యపౌత్ర
హరితసగోత్ర పవిత్ర సకలసుకవిమిత్ర కసవరాజతనూజ గోప
రాజ విరచితంబైన....."

అని పెన్నయామాత్యుఁడు తనకు తాతయైనట్లు చెప్పుకొనెను గాని వంశవర్ణనమువలన కవి కేడవపురుషుఁడైనట్లు స్పష్టమగుచున్నది. ఈద్వాత్రింశత్పుత్తలభంజికాకథల కవిత్వము విక్రమార్క-చరిత్రమును రచించిన జక్కనకవిత్వమునకుఁ జాలకపోయినను మొత్తముమీఁదఁ జక్కనిదిగానే యున్నది. ఈపుస్తకములోని రెండుపద్యము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. అన్నలొ రమ్ములో చెలులొ యాత్మజులో చనువారు పీరికై
మిన్నక చావనేల యిదిమేలె భువిఁ బలిభోజికయ్యు నా
యున్నెడ విశ్వసింప నొరునొద్దకుఁ జేరఁ బ్రమాద మొనుఁగ
న్నన్న నెఱింగి యొండొడకుఁ జాగుఁడు ప్రాణము తీపి చూచితే. ఆ.౨

ఉ. దేవసమాన నిన్ను వినుతించుట వాంఛితసిద్ధి భూమిలో
నేవసుధేశు నీయెదుట నెన్నఁగవచ్చు మదీయజిహ్వ ల
జ్జావశమై చలింప దిఁక సద్గుణముం దగ సద్గుణాఢ్య ప్ర
స్తావన చేయ నేరనియతం డతిమూర్ఖుఁడుగానఁ జెప్పెదన్. ఆ.౧౧

---

16. కొడిచెర్ల శ్రీనివాసకవి

ఇతఁడు శేషధర్మరత్నాకర మనియెడి యాశ్వాసముల పద్య కావ్యమును రచియించెను. ఈగ్రంథము శేషధర్మములనియు వాడుదురు. ఈకవి యాత్రేయగోత్రుఁడు. కొండయభవానిపుత్రుఁడు. రాజమహేంద్ర పుర నివాసుఁడు. ఇతఁ డిన్నూఱుసంవత్సరములకు ముందుండినవాఁడు. ఇతఁ డొకవేళ బదునేడవశతాబ్దమధ్యమునందుండి మధ్యకవులలోఁ జేర వలసినవాఁ డేమో ! పుస్తకములోని

'ఇది నవరసానుబంధ బంధుకప్రబంధ నిబంధనా చాతురీ ధురీణ నకలకళాప్రవీణాత్రేయగోత్రపవిత్ర కొడిచెర్ల కొండయభవాని పుత్ర ఐవరగండ బిరుదప్రచండ మంత్రిమార్తాండ సమస్త సద్గుణా వాస శ్రీనివాసప్రణీతంబై న హరివంశమునందలి శేషధర్మసారం బను మహాప్రబంధంబునందు.'

అను గద్యమునుబట్టి చూడఁగా నితఁడు మంత్రిశిఖామణియై బిరుదముల నందినట్లును, అత్యంతాభిమానికుఁడు కానట్టును, కనఁబడుచున్నాఁడు. ఈతని

కవిత్వము ప్రౌఢమయి రసికజనహృదయంగమముగా నున్నది. ఈతని శేషధర్మములనుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. నెలకొని సంగమంబున జనించును గామము కామవృద్ధిచేఁ
దలకొనుఁ గ్రోధ మట్టిబెడిదంబగుక్రోధమునం దనర్చు మో
హలతిక మోహవృత్తి నుదయం బగు విస్మృతి విస్మృతిం జనన్
దలఁపఁగ బుద్ధి బుద్ధి చనఁగ మతిత్వం జెడు మానవుం డిలన్. ఆ.౧.

ఉ. మేఁడియు సీరముక్ భుజముమీఁద భరించుచుఁ బోతు నెద్దుతోఁ
గూడఁగఁ గాఁడిఁబూన్చి మునికోల కరంబునఁ బట్టి పగ్గపుం
ద్రాడును మోకువారెనయుఁ దాలిచి ముందట వెన్కఁ జుంగుచ్రవే
లాడఁగఁ గాసె కట్టుకొని యక్కుటిలాత్మకుఁ డేఁగెఁ జేనికిన్. ఆ.3.

ఉ. రామ కృపాభిరామ రిపురాక్షస వీరవిరామ సాహసో
ద్దామ లసద్గుణప్రకరధామ సమస్తనృపాలలోకసు
త్రామ విభాకరాన్వయసుధాసరిదీశ్వరసోమ సద్గుణా
రామ నిను న్నుతింప నల రాజకళాధరుఁడైన నోపునే. ఆ. ౪.

---

17. పట్టమట్ట సోమనాధకవి

ఇతఁడు స్కాందపురాణములోని నూతనసంహితను నేడాశ్వాస ముల గ్రంథముగాఁ జెనిఁగించెను. ఈకవి యాఁబువేల నియోగిబ్రాహ్మణుఁడు. హరితసగోత్రుఁడు; వేంకటామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనగ్రంథమును బిక్కనవోలి కామారెడ్డి కంకితముచేసెను. ఈగ్రంథము రచియింపఁబడినకాల మిప్పటి కిన్నూఱుసంవత్సరములకంటె నెక్కువయినట్లు తోఁచుచున్నది. కృతిపతియైన కామినేని కామారెడ్డి యెప్పుడుండిన

వాఁడో తెలిసినదికాదు. కృతికర్త గోదావరిమండలములోనివాఁడు. సూతసంహిత కవిత్వము సలక్షణమయినదిగానున్నది. కవితాధ్యోరణిని దెలుపుటకయి సూతసంహితలోని పద్యములు కొన్ని యిందుదాహరింప బడుచున్నవి—

ఉ. మున్ను పురాణపూరుషుఁడు ముఖ్యుఁడు విష్ణుఁడు శంభుమాయ పై
కొన్న విమోహితుండయి యహంకృతగర్వ మెలర్ప నేన యీ
యన్నిజగంబులుం బొదివి యూసినకర్తను బేరుకొన్న నా
కన్న ఘనుండు నాసముఁడు గన్గొన నెవ్వఁడు శాశ్వతంబుగన్. ఆ.౧

ఉ. పాపము లట్లు కొన్ని యెడఁబాసిన రోగము లెల్ల మాని యు
ద్దీపితసత్వుఁడై దృఢమతిన్ శశిపర్ణుఁడు తన్మనై కర
ద్రౌపరతంత్రవృత్తి దృణకాష్ఠఫలోదకశాకమూలనా
నాపరిచర్యలన్ దినదినంబు గురుఁ భజియించు నెంతయున్. ఆ. 3.

చ. సరవి నబోధమూలమగు సంసృతివృక్షము మూలనాశనం
బురుగతిఁజేయ మంత్రరచితోదక పుష్పముఖార్చనంబు లే
సరణిసి జాల వాత్మరతి జ్ఞానమె ముఖ్యశివార్చ యూబహి
ర్విరచితపూజనంబు లవివేకులు స్థూలము లంచు రజ్ఞతన్. ఆ. ౪.

ఉ .అట్టిమ హేశ్వరుం డెలిపి యవ్యయధామము నొందవచ్చు నే
పట్టునఁ గర్మకోటి నది ప్రాప్తముకాదు సమస్తయజ్ఞముల్
నెట్టన భూరిసంసరణనీరధి దాఁటఁగ మంటియోడ లా
నెట్టును మృత్యువున్ జరయు నేచును గేవలకర్మతంత్రులన్. ఆ. ౭.

---

18. దివి రమణకవి

ఇతఁడు వాసిరెడ్డి రామలింగప్రభుని ప్రేరణముచేత శృంగారధామ మను రెండాశ్వాసముల ప్రబంధమునుజేసి నృసింహస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁ గృతిచేయఁ బ్రేరేపించిన రామలింగప్రభునిఁ దన ప్రబంధమునం దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఏధన్యవంశేశుఁ డెలమి నుమానాథువరమున నభిపృద్ధివంతుఁ డయ్యె
నేమేటికూటస్థుఁ డెసఁగ వేమనృపాలుప్రీతిచే భువి వాసిరెడ్డి యయ్యె
నేమహోత్మ్మనితండ్రి యెండెఁ గుతుబుశానృపాలుచే గజాంద్రోళికంబు
లేయయ్యయగ్రజుఁ, డెలమి శాతవవీరగజరాజసింహతఁ గలన నమరె
నతనివంశజుఁ డతనికూటస్థజాతుఁ,
డతనిసత్పుత్రుఁ డాతనితమ్ముఁ డగుచు
నమరె బహుగుణరత్నరత్నాకరుండు
కదనవిజయుండు రామలింగప్రభుండు.

ఈపయిపద్యమునుబట్టియే యీకవి నిర్దుష్టముగాఁ గవిత్వము చెప్పలేనివాఁడగుట స్పష్టమగుచున్నది. అభివృద్ధిమంతుఁడనుట కభివృద్ధివంతుఁడనియు, అందుననుట కెందెననియుఁ ప్రయోగించినను మొత్తము మీఁద గవిత్వము రసహీనమైనదికాదు. కృష్ణామండలములోని యమరావతీ సంస్థానప్రభువుల ప్రేరణమునుబట్టి పుస్తకమును రచించుటయు మంగళగిరి నృసింహుని కంకితముచేయుటయు విచారింపఁగా నీకవికృష్ణామండలములోనివాఁడనుట తేలుచున్నది. కుతుబుశాను బేరొకాని యుండుటచేతఁ గవి పదునేడవశతాబ్దిమధ్యమునం దుండిన ట్లూహింపఁ దగియున్నది. శృంగారధామమునుండి రెండుపద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి—

చ. అలికులవేణికిం బ్రియుఁ డనంగనృపాలుఁడు దాడిచేసి యా
వలనికి నేఁట రేపటనె వాసిగ రాఁగలడంచు బాల్యముఁ
గళవళనుంది చింతిలఁగఁ గన్పడెఁ దన్ముఖరాజచిహ్నముల్
కలికి వయఃప్రకాశగుణకాంతియు బాల్యవయస్సునంధిగన్. ఆ. ౧.

మ. సరి నీ వాయెదిరింటి కేగఁ గని యేఁ జాలించి యున్నంతలో
నరయం దత్పల మేమి మున్నటిమదీయార్థంబు మాకిచ్చి యే
సరణింబోయినఁ బొమ్మటంచు వడిఁ జంచచ్చిత్తయై వేశ్య త
త్కరయుగ్మాంచితకంకణంబు లొగిఁ దాఁ గాంక్షించి తీసెన్వ్రేసన్. ఆ-౨

---

19. కోడూరి వేంకటాచలకవి

ఈకని స్కాందపురాణములోని శివరహస్యఖండమును తెనిఁ గించెను. ఈతనికి బాలసరస్వతియను బిరుదాంకముగలదు. ఈతఁ డాఱు వేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; ఎల్లనామాత్యపౌత్రుఁడు; శంకరామాత్య పుత్రుఁడు. ఈశివరహస్య ఖండము శ్రీ ముసురు ముళువాగళుప్రభుని కంకితము చేయఁబడినది. ఇతఁడు బళ్లారిప్రాంతములయందుండిన లింగబలిప్రభువని తోఁచుచున్నది. కృతిపతియొక్క పూర్వులలో నొకనిని వర్ణించుచు—

క. ధరణీస్థలి నాపరశివ । చరణోద్భవులందు సకలసామ్రాజ్యరమా
భరణుఁడు వీరనృపాలుఁడు। వరభింగకగోత్రుఁ డగుచు వర్ధిల్లెఁగడున్.

అని కవి యతనిని శివపాదోద్భవకులజునిఁగాఁ జెప్పినందునఁ దద్వంశము శైవశూద్రవర్ణమని చెప్పవచ్చును. కృతిపతియొక్క పితామహుని మాతామహుఁడైన చిక్కరాజను నామాంతరముగల ముళువాగళునృపాలు నీక్రిందిబద్యములలో మధురాపురీశ్వరుని జయించినట్టును శ్రీవేంకటపతిరాయలకాలములో నుండినట్టును కవి వర్ణించియున్నాఁడు.

మ. ప్రకటారాతివిదారితార్గళభుజాప్రావీణ్య మింపార వా
రక యెంతే మధురాపురీవిభుని దర్పం బెల్ల వారించి భూ
రికృపాణోద్ధతిచేత వేంకటపతిశ్రీరాయసన్మాన్యుఁడై
చికరాజాఖ్య వహించె భాసురజయశ్రీధుర్యుఁడై వేడుకన్.

క. ఆముళువాగళునృపతి ధ । రామండలిఁ గీర్తి గాంచె రాజత్కార్యో
ద్దామబలావార్యజయ । స్తోమమునైశ్వర్యధుర్య .శూలాన్వితుఁడై .

సీ. ఏధన్యనిర్మలబోధాంతరంగంబు రంగంబు పార్వతీరమణిపతికి
నేనరేశ్వరుకరాన్వితచంద్రహాసంబు హాసంబుఁ జేయు వజ్రాయుధంబు
నేరసజ్ఞునికీర్తి శారదామోదంబుమోదంబుహరిదంతములకుఁ గూర్చు
నేసుధీపటుభాపాసుధాసారంబు సారంబు బుధజనశ్రవణములకు
నతఁడు చెలువొందు హాటకాహార్యధైర్య
సహితుఁ డనివార్యశౌర్యమాంసలభుజుండు
దానగాంభీర్యసౌందర్యమాననీయ
సుప్రభావుండు మళువాగళుప్రభుండు.

ఈపద్యములవలనఁ గృతిపతిపూర్వులు విజయనగర సంస్థానాధీశ్వ
రుల సేనాపతులయియుండి ప్రభుత్వము సంపాదించిరని మాత్రమేకాక
కవికాలమును సహితము నిర్ణయింపవచ్చును. వేంకటపతిరాయలు
౧౫౭౫ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౫ వ సంవత్సరమువఱ
కును రాజ్యము చేసినవాఁడగుటచేత నాతనికి నాలుగుతరముల తరువాత
నున్నకృతిపతియుఁ గృతికర్తయు ౧౭౦౦ వ సంవత్సరప్రాంతములయుం
దున్నట్టు నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఇంతేకాక యీఆంధ్రకవిస్తుతి
లోని యీక్రిందిపద్యములో బింగళి సూరన్నను బూర్వకవినిగా నభి
వర్ణించుటనుబట్టికూడ గవి యీధునికుఁ డని చెప్పవచ్చును—

సీ. చతురాస్యుఁడనఁగనుజగతివాగనుశాసనప్రౌఢిఁ జెలువందునన్న పార్యుఁ
గుండలీంద్రుఁ డన నఖండమేధాస్ఫూర్తినలరారు తిక్కనయజ్వమణిని

నచ్యుతైకసమాఖ్య నంచితవరధార ప్రకటించు శ్రీనాథసుకవివరుని
సన్మార్గు లన సుప్రసాదత్రేజంబులఁ బరిఢవిల్లెడు సోమభాస్కరులను
భూరిసత్కళాద్విజరాజుఁ బోతరాజు
శుభమనోరథుఁ బింగళి సూరవిభుని
మతియు నాంధ్రోక్తివిశ్వనిర్మాణపటిమ
ఘటితకమలోదయులమహాకవుల నెంతు.

ఈక్రింది పద్యములలోఁ గవి కృతిపతియొక్క తాతయగు పొట్టి లింగభూపాలునిని తండ్రి యగు లింగభూపాలునిని బహువిధముల వర్ణించి యున్నాఁడు—

సీ. ఘనమార్గవర్తనుల్ గానివిరోధుల ఘనమార్గవర్తను ల్గాఁగఁజేసె
గరిదానమహిమంబు గాంచనిమతుల కరిదానమహిమంబుగాంచఁజేసె
మిత్రపద్ధతిదప్పి మెలఁగెడువైరుల మిత్రపద్ధతిఁ జెంది మెలయఁజేసె
నెలమిఁ బాదములాశ్రయింపనిరిపులను నెలమి బాదములాశ్రయింపఁజేసె
ననుచు మెచ్చుచు జయరమావనజనయన
యూజి నెవ్వానిభుజపీఠి నాశ్రయించె
నతని నుతియింపఁదరమె నహార్యధైర్య
భైరవుని పొట్టిలింగభూపాలవర్య.

* * * *

సీ. ధరణి రాజులుగాని ధరణిరాజులుగారు దీటుదారటఁ మూదివ్యరుచుల
నినకేసరులుగాని యినకేసరులుగారు ప్రతిప్రభావాటోపపటుబలముల
నలనరేంద్రులుగాని నలనరేంద్రులుగారు పురుషు భాసురవచో
భోగములను
గోత్రేశ్వరులుగానిగోత్రేశ్వరులుగారు సరిధైర్యబంధురైశ్వర్యములను
నతని కనియెన్న ధారుణీపతులు దిశల
వెలసె నెవ్వాఁడు ప్రఖ్యాతి విస్తరిల్ల

నతఁడు చెలువొందె రాయవేశ్యాభుజంగ
జయబిరుదశాలి లింగభూజానిమౌళి.

ఉ. లింగనృపాలపుత్రుఁ డగులింగనృపాలుని శుభ్రకీర్తిశో
లింగని శారదాభ్రపటలింగని నాకధునీతరంగపా
ళింగని నీలచేలునిహలింగని మానసవిస్ఫురన్మరా
ళింగని పద్మగర్భునిచెలింగని సారె హసించు నెంతయున్

ఈవఱ కుదాహరింపఁబడిన పద్యములచేతనే యితఁడు ప్రౌఢకవి యనియు నిరర్గళకవితాధార గలవాఁడనియుఁ దెలియ నయి యున్నను శివరహస్యఖండములోని కొన్ని పద్యములఁగూడ నిం దుదాహరించు చున్నాను—

సంభవకాండము.

ఉ. తేసియవాఁక యిచ్చటను దిన్నఁగ రాఁగదవే మృగీమదం
బీనెలతాలబోడె లిడు నిచ్చటజాఱెదుసుమ్ము కోకిలో
ద్ధానము లిందు వింటె కలకంఠి యటంచు సఖీజనావళుల్
మానుగ హెచ్చరింప నసమానమహామహిమాభిరామయై. ఆ. ౧.

మ. పలితస్వచ్ఛశిరోజము ల్దనరఁగా జీర్ణ మామేనునఁ
వళులున్ ప్రేలఁగఁ గంపమంద శిరమున్ వక్త్రంబు నిర్దంతమై
వెలయున్ భూరిజరాతిభారమున గర్వీభూతుఁడై సారె ప్ర
స్ఖలదంఘ్రిద్వయ మొప్ప గద్దదిక మించన్ వృద్ధవిప్రాకృతిన్. ఆ. ౨.

ఉ. పోయెద నుండెదన్ సమరము ప్రచియించెద నాయథేచ్ఛ నే
లా యిటు లాడఁ దావకబలంబుఁ జలంబును లావుఁ జేవయున్
వేయివిధంబులం బలుక వేమఱు నాకు జనించు హాస మో
హో యిదిచాలుఁ జాలు వినుమోరి వచించెద దానవాధమా. ఆ-౫

20. ఏనుఁగు లక్ష్మణకవి

ఈకవి బహుగ్రంథములుచేసి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈతఁడు చేసినగ్రంథములలో రామవిలాసప్రబంధము కడపటిదిగాఁ గనఁబడు చున్నది. ఈప్రబంధము పెద్దాపురసంస్థానమం దుండిన శ్రీవత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. ఈ గోపరాజు తన్నుఁగూర్చి పలికి నట్లు కవి తన రామవిలాసములో నీపద్యములఁ జెప్పుకొన్నాఁడు—

సీ. సురుచిరాపస్తంబసూత్రు వాధూలసగోత్రు సద్వినయాదిగుణసమేతు
నేనుఁగు లక్ష్మకవీంద్రునపౌత్రుని శ్రీమాచిరాజు నృసింహామంత్రి
దౌహిత్రుభూవరాస్థానపూజ్యుఁడుత్తిమ్మమంత్రికిఁ బేరమాంబకునుపుత్రు
ధన్యు ననంతాభిధానానుజుని వీరభద్రున కగ్రజు భాగ్యవంతు
లలితకవితాకళాధుర్యు లక్ష్మణార్యు
నన్ను బిలిపించి యుచితాసనమున నుంచి
చాలఁ గరుణించి తనముఖాబ్జమున మంద
హాస మమరంగ నిట్లని యానతిచ్చె.

సీ. సృజియించినాఁడవు సేతురామేశ్వరమహిమంబు పాండిత్యమహిమ
మెఱయఁ
గల్పించినాఁడవుఘనులెన్న జాహ్నీమాహాత్మ్యకృతిసుధామధురఫణితి
నిర్మించినాఁడవు నిర్జరభాషచే శతకంబు భాస్కరస్వామి కెలమి
రచియించినాఁడవు రుచిరంబుగా సుభాషితరత్నమాలిక శివునిపేర
రమ్యవిశ్వేశ్వరో దాహరణ నృసింహ
దండకాదిస్తుతిప్రబంధములు గూర్చి
సములలో నుత్తమఖ్యాతి నమరినావు
లలితగుణధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. వారిజాసననారీముఖారవింద
సారసౌరభఘన ఘనసారసాంద్ర
వీటికాబంధురసుగంధవిభవమధుర
లలితవాగ్ధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. ధీరులు నుతింప నిప్పుడు మీరుసేయు
భాసురం బగురామవిలాసకావ్య
మంకితము చేయు మాపేర నచలధీర
ధరణి నాచంద్రతారకస్థిరముగాఁగ.

పై పద్యములవలన నితఁడు రామేశ్వరమాహాత్మ్యము, గంగా మాహాత్మ్యము, గీర్వాణసూర్యశతకము, సుభాషితత్రావళి, విశ్వేశ్వ రోదాహరణనృసింహదండకాదిస్తుతులు, రామవిలాసము చేసినట్లు తెలియవచ్చుచున్నది. మఱియు నితఁడు విశ్వామిత్రచరిత్రమను మఱి యొక గ్రంథమునుగూడ రచించినట్లు సుభాషితరత్నావళి యవతారిక లోని యీక్రింది పద్యమువలనఁ గానవచ్చుచున్నది—

క. రామేశ్వరమహిమము వి | శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం
గామాహాత్మ్యము మొదలగు|శ్రీమచ్ఛ్రుతిరత్నములురచించితిమఱియున్

ఆఱువేల నియోగివైన యీకవి యాపస్తంబసూత్రుఁడు; వాధూలసగోత్రుఁడు; తిమ్మకవి పుత్రుఁడు; లక్ష్మణకవిపౌత్రుఁడు; మాచిరాజు నృసింహుని దౌహిత్రుఁడు. ఈతని తల్లిపేరు పేరమాంబ; అన్న యనంతకవి; తమ్ముఁడు వీరభద్రుఁడు. ఈకని వంశమునకు మూల పురుషుఁడు పైడిపాటి సింగన్న. ఈకవి పూర్వులయింటిపేరు పైఁడిపాటి వాఁ రయినను సింగన్నవంశజులలో నొకడగు జలపాలామాత్యుఁడు పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁ డగు గజపతిరాజుచే నేనుఁగును బహుమాన మందుటచే నప్పటి నుండియు నేనుఁగువారని మాటిసది. ఈయంశమే సుభాషితరత్నావళ్యవతారికలో నిట్లు చెప్పఁబడినది—

సీ. పరమేష్ఠితుల్యప్రభావుండు వాధూలుఁ డనుబుసీంద్రుం డొప్పు
ననఘమూర్తి
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబునిధి సుధాకరుఁడు జన్మించినట్లు
ప్రభవించిశ్రీపైఁడిపాటి సింగనమంత్రి వంశాగ్రగణ్యుఁడై వఱలు నతని
మహామసంతానక్రమముననుజలపాలసచివుఁడొప్పెబలారిసచివసముడు
గజపతిక్షితిభర్తచే గజముతోడ
నగ్రహారము లతఁడు పరిగ్రహించె
నెలమి నేనుఁగువారన్న యింటిపేరు
గలిగె సతనికి గజలాభగరిమవలన.

గీ. ఈడ్యగజపతిదత్తసోమేశ్వరాగ్ర
హారశాసనుఁడై మహోదారభాగ్య
మహిమ గలిగినజలపాలమంత్రిమణికి
గరికిరాజు జనించె విఖ్యాతయశుఁడు.

ఈకవియొక్క పూర్వీకులు చిరకాలమునుండి పెద్దాపురసంస్థాన మున నుద్యోగములలో నుండుచు వచ్చిరి. వారిలో గొండఱు కవులు సహిత ముండిరి. పయి పద్యమునఁ బేర్కొనఁబడిన గరికిరాజునకు మనుమఁడును కవికి బితామహుఁడును పెద్దాపుగ్రామమునకు కరణము నయిన యేనుఁగు లక్ష్మణకవి పెద్దాపురసంస్థానమునం దుండి వత్సవాయవంశజు లయిన యచ్చటిరాజుల కనేకకృతు లంకితము చేసెను. ముందుగాఁ గవి తనతాతనుగూర్చి సుభాషితరత్నావళిలో చెప్పినపద్యములనుమాత్ర ముదాహరించి యతఁడు రచించిన గ్రంథనామములను కృతిపతులనామ ములను రామవిలాస కృతిపతిని గూర్చి చెప్పునప్పుడు ముందు వివ రించెదను—

ఉ. సారదయూరసత్రుహిణసారథికిన్ గురురాజమంత్రికిన్
బేరమయందు నందనుఁడు పేర్మిజనించె విలాససంపదన్

మారుఁడు విక్రమంబునఁ గుమారుఁడు లక్ష్మణశౌరి భూరిశో
భారవి సాహితీవిజిత భారవి ధీరవిచారవిశ్రుతిన్.

ఉ. దండి మనోజ్ఞశబ్దకవితారుచిరే నుపమాసమృద్ధిచే
రెండవకాళిదాసు రసరీతితరంగితసూ.కిఁ గుండలీం
ద్రుం డని ధీరులెంచఁగఁ గృతుల్ రచియించిన ధన్యునిన్ మహా
పండితమాన్యు నెన్నఁదగు భాజితసూర్యుని లక్ష్మణార్యునిన్.

గీ. కృతు లొనఁగి వత్సవయతిమ్మనృపతిచేతఁ
దురగమణిభూషణాంబరాందోళికాది
పూజఁ గైకొని పెద్దాడపురవరాను
శాసనుఁ డయి లక్ష్మణశౌరి తనరె.

కవియొక్క యన్నయైన యనంతార్యుఁడు గౌరీపరిణయకావ్యము రచించినట్లు సుభాషితరత్నావళిలోనే యీక్రింది పద్యమునఁ బెప్ప బడినది—

క. గౌరీపరిణయకావ్యము । సూరీంద్రులు మెచ్చఁజెప్పి శుంభత్కవితా
పారీణబిరుద మందిన । భూరియశోఘునుఁ డనంతభుధవరుఁ డలరున్.

లక్ష్మణకవి రచియించిన రామవిలాసమునుబట్టి యితనికాలమును దెలిసికొనవచ్చును. ఇతఁడు కూచిమంచితిమ్మకవికి బంధువయినను కాక పోయినను అతనితో సమకాలికుఁడయినందుకు సందేహము లేదు.

క. హాటకగర్భవలీ । లాటనచలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ । తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్.

అను కూచిమంచి తిమ్మకవినిగూర్చిన పద్యమొకటి చెప్పినదైన నయియుండవచ్చును. రామవిలాసము వత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. కవి కృతినాయకుని

సీ. తనమహౌదార్యంబుతనమహోధైర్యంబుకరణిజీమూతలాఘువమొనర్పఁ
దనవినిర్మలకీర్తి తనవిక్రమస్ఫూర్తిపగిదిఁ బద్మాహితోపమ వహింపఁ

దననువిద్యాభూతి తనరూపవిఖ్యాతిగతిఁ గమలోద్భవగరిమ మీఱఁ
దనకార్ముకప్రౌఢి తనప్రతాపసిరూఢిభాతి ధనంజయప్రథిమఁ బూన
ధరణి నుతికెక్కి నిజభుజాదండమండ
లాగ్రదర్శనచకితమత్తారినృపుఁడు
వత్సవాయసింహాద్రిభూవరసుతుండు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

సీ. శారదనీరదనారదపారదహారదసూక్ష్మ నవఘుళించి
శరదింనుకరకుంద శకబృందవరచందనహారిచందనకాంతిలహరి మీఱి
హరికాంతహరికుంతహరిదంతకరిదంతవిధుకాంతపృథుకాంతవిభవసించి
పురవై రిధరసీరిగిరిదారిహరిశౌరిచరణనిష్ఝరవారిసురుచి గేరి
పాండురాఖండనిజకీర్తిమండలంబు
పుండరీకభవాండంబు నిండిమెఱయఁ
బ్రాభవము గాంచె సింహాద్రిరాజసుతుఁడు
ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

ఇత్యాది పద్యములతో నెంతవర్ణించినను, ఈగోపరాజు పెద్దాపురసంస్థానాధీశ్వరుఁడుగాక తత్సంస్థానాధిపతియగు తిమ్మజగపతిమహారాజుగారి కాప్తబంధువయి గౌరవము నొందినవాఁడుగా నుండెను. అప్పుడు ప్రభువుగా నుండిన జగపతిమహారాజుల పుత్రుఁడగు తిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౬౭ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనముచేసిరి. ఈయన సింహాసనమునకు వచ్చినది ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధదశమి. గతదినమునం దీయన తండ్రిగారగు రాయజగపతిరాజుగారు శ్రీపూసపాటి యానందగజపతిరాజు గారితో ఉండూరువద్ద జరిగిన యుద్ధములో హతులైరి. ఆంగీరస సంవత్సర కార్తికశుద్ధ ప్రథమదినమున జనన మొందినందున, జనకుని మరణము నాఁటి కీయనకు వయస్సెనిమిదిసంవత్సరములు. ఈయన నలువదియైదు

సంవత్సరములు జీవించి పింగళ సంవత్స రాశ్వయుజబహుళ పంచమి నాఁడు పరలోకగతులై నారు. ఈయనకాలమునం దుండి యీయనను బహుపద్యములతో స్తుతించిన వారగుటచే నేనుఁగు లక్ష్మణకవిగారు ౧౭౭౦—౮౦ సంవత్సరములవఱకును జీవించి యున్నట్లు కనఁబడుచున్నది. అందుచేత నీకవి కూచిమంచి తిమ్మకవి మరణానంతరమున నిరువది యేండ్లు జీవించి యుండవచ్చును. పెద్దాపురపురాజులగు వత్సవాయ వారు తాము మొదటినుండియు విద్వాంసు లయి విద్వత్కవుల నాదరించు చుండినట్లు వారివంశచరిత్రమువలన విస్పష్టమగుచున్నది. ఈవంశపువారి మూలపురుషుఁడు సూర్యవంశ్యుఁడయి కృష్ణామండలములోని గుడిమెట్ట రాజధానిగాఁ గల చాగి పోత రాజైనట్లు రామవిలాసములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

గీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ
సిరుల కిరవగు గుడిమెట్టపుర ము తనకు
రాజధానిగ సత్కళాభోజరాజు
చాగిపోతక్షమాభర్త జగతి యేలె.

ఈసాగిపోతరాజుయొక్క శాసనములు గుడిమెట్టలోను బెజవాడ లోను ౧౪౩౦ వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఈతని యింటిపేరు సాగివారే యైనను, ఈతని వంశమువారిలో నొకఁడగు రామనృపాలుఁడు—

"తగవత్సవాయాఖ్యనగరంబు నిజనివాసముచేసె నదికారణముగసాగి
వంశమునకువత్సవాయనామములోకసుప్రసిద్ధమగుచుసొంపుగాంచె"

తననివాసమును వత్సవాయనగరమునకు మార్చినందున గృహ నామము వత్సవాయవా రయినది. వీరి వంశజులలో నొక రగు (పేర రాజసుతు లయిన) ముసలి తిమ్మరాజుగారు ౧౭౫౫ వ సంవత్సరము నకు సరియైన యానందసంవత్సర భాద్రపద బహుళసప్తమినాఁడు పెద్దా

పురసంస్థానమును సంపాదించి ౧౬౦౭ వ సంవత్సరమునకు సరియైనపరా
భవసంవత్సర మార్గశిరబహుళ ద్వితీయవఱకు నేఁబదిరెండు సంవత్స
ముల రెండుమాసముల యిరువదియైనుదినములు రాజ్యముచేసి
లోకాంతరగతు లయిరి. దిట్టకవి విశ్వనాథకవి విరచిత మైన శేషధర్మ
ములను గృతినందిన దీయనయని రామవిలాసములోని యీపద్యము
తెలుపుచున్నది—

సీ. బిరుదాంక పురిని సుస్థిరముగా నిర్మించెఁ బాలమున్నీటినిబోలుచెఱువు
తిరుపతివల్మీకగిరిఁ బూలపల్లెసు ఫలవృక్షవనములు నిలిపెఁజాల
నృహరిగేహతటాకనిక్షేపవనములు కొమరుగాఁ బెద్దాపురముననునిచె
విశ్వనాథకవీంద్రవిరచిత శేషధర్మప్రబంధము సాదరముగ నందె
విప్రవంశప్రతిష్టలు వెలయఁజేసెఁ
బుత్రులను గాంచె నీతిని బుడమి యేలె
వత్సహాయాన్వయమునకు వన్నెఁదెచ్చె
హెచ్చి పేరయఃతిమ్మధాత్రీశ్వరుండు.

ఈతిమ్మరాజుగారు డెబ్బదియాఱు సంవత్సరములు బ్రతికి కాల
ధర్మము నొందఁగా, శ్రీముఖసంవత్సర కార్తికశుద్ధ పంచమినాడు జనన
మొందిన యీయనపుత్రుఁడు రాయపరాజుగారు ౧౬౦౭ వ సంవత్స
రమునందు తండ్రి పోఁగానే రాజ్యపరిపాలన మారంభించి నలువదిరెండు
సంవత్సరములు రాజ్యముచేసి ౭౫ ఏండ్లు బ్రతికి ౧౬౫౯ వ సంవత్సర
మునకు సరియైన సర్వధారి సంవత్సర మాఖశుద్ధ సప్తమినాఁడు పరమ
పదప్రాప్తి నొందిరి. ఈయన హరిభక్తిసుధోదయ మనుకృతినందిన
ట్లీక్రింది పద్యము చెప్పుచున్నది—

సీ. శ్రీరామునకుఁ గట్టమూరనుగట్టించె గుళ్లు మంటపములు గోపురములు
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహస్థపురంబున సుస్థిరముగఁ

బొలుపుగా వాల్మీకిపురికాంద్రకోటను ఫలభూజవాటిక ల్పదిలపటిచేఁ
బ్రకవ్యమగుహరిభక్తిసుధోదయంబనుమహాకృతిరత్నమందుకొనియెఁ
బేరుగలుగు మహమ్మదుబేగు నదిమి
మెచ్చుఁగాఁ దగినఫమీలు తెచ్చుకొనియెఁ
బగతు రగువారినుండియ ల్దిగులుకొనఁగఁ
దిమ్మనృపరాయపట్టమాధీశ్వరుండు.

ఈయన యనంతరమందు పింగళసంవత్స రాశ్వయుజ శుద్ధస ప్తమి నాఁడు జన్మించిన యీ యనపుత్రుడు సార్వభౌమ తిమ్మరాజుగారు సింహాసనమునకు వచ్చి ముప్పదితొమ్మిది సంవత్సరములు ప్రజాపరిపాల నముచేసి డెబ్బదవయేట ిఒఒళ వ సంవత్సరమునకు సరియైన ఓభవ సంవత్సర ఫాల్గుణబహుళ త్రయోదశినాఁడు దేహవియోగమునొందిరి. మన కవి తాతయైన యేనుఁగు లక్ష్మణకవిగా రీయనకాలమునందే యుండి యీమహారాజునకుఁ దాను రచించిన ద్రౌపదీపరిణయము నంకి తము చేసిన ట్లీక్రింది పద్యములవలనఁ దెల్లమగుచున్నది—

సీ. రాజులుమెచ్చుఁ బర్లాకోట సాధించి నరహరదేవు దుర్ణయ మడంచెఁ
గుదురై నభావినికోట లగ్గలుపట్టి యోంధుకో టంతయు నుర్విఁగలపె
దుగరాజు మొదలైనదొరలనుభంగించెవిశ్వంభరునియుద్ధనిహతుఁజేసెఁ
దగఁబూసపాటి సీతారామభూపాలుఁడభినుతింపఁగ విజయంబుగాంచె
సరిసమతుయవనాధీశు నురగపతిని
గయ్యమున గెల్చె లోకవిఖ్యాతి చెందె
వత్సవాయీన్వయమునకు వన్నె తెచ్చె
రాయపన్నృపాలు శ్రీతిమ్మరాజమంత్రి.

చ. హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగు లక్ష్మణార్యచే
సురుచిరశబ్దభావరసశుంభదలంకృతిపూధురీమనో

హారమగు ద్రౌపదీపరిణయం బను నుత్తమకావ్య మొదె సు
స్థిర మగుకీర్తి సొం పెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మదక్షతిన్.

ఈయేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁ డగు జగ్గరాజునకును, తుల్యామహాత్మ్యమును కస్తురిరంగరాజపుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయకులజు లయిన రాజబంధువుల కంకి తము చేసిన ట్లీక్రింది పద్యములనలనఁ దెలియవచ్చుచున్నవి—

చ. కవికులసార్వభౌముఁ డనఁగాఁదగు లక్ష్మణార్యుచే
ధ్రువచరితప్రబంధము బుధు ల్వినుతింపఁగ నంది యూగభు
గ్భవనమహాసుఖానుభవకారణ మైనయశంబు గాంచె వా
సవనిభవుండు వత్సవయ జగ్గనృపాలుఁడు సద్గుణోన్నతిన్.

ఉ. హేమనగేంద్రధీరుఁడగు నేనుఁగు లక్ష్మణసత్కవీంద్రుఁ డు
ద్దామసుధామయోక్తి వితతం బగునట్లు రచించినట్టి తు
ల్యామహితప్రబంధము గుణాఢ్యులు మెచ్చఁ బరిగ్రహించెఁ బ్ర
జ్ఞామహితుండు జగ్గనృపచంద్రుఁడు శాశ్వతకీర్తి సంధిలన్.

ఈతిమ్మరాజుగారి యనంతరమునం దాయన తమ్ములైన బలభద్ర రాజుగారి కుమారులు రాయపరాజుగారు ౧౬౮౮ వ సంవత్సరమునందు రాజ్యమునకువచ్చి యిరువదియాఱు సంవత్సరములు భూపరిపాలనమున చేసి నలువదేండ్లు ప్రాయమున ౧౭౦౪ సంవత్సరమునకు సరియైన మన్మథ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థినాఁడు పరమపదమునొందిరి. ఈయన తండ్రి యగు బలభద్రరాజుగారు తాము కవులయి రామశతకమును జెప్పుటయే కాక కిరాతార్జునీయకృతినందిన ట్లీపద్యము తెలుపుడు చేయుచున్నది—

చ. అమితఖ్యాతికి మూలమైనకృతిఁ దా నందెఁ గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బారూఢి నిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగనయె స్సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్.

తరువాత రాయపరాజుగారి కుమారుఁడు తిమ్మరాజుగారు రాజ్యమునకు వచ్చి దాదాపుగా నిరువది సంవత్సరములు పాలనముచేసి ముప్పది సంవత్సరముల ప్రాయమునఁనే ౧౭౩౮ వ సంవత్సరమునకు సరియైన రాక్షససంవత్సర చైత్రశుద్ధ ద్వాదశినాఁడు పరమపదమునొందిరి. తదనంతర మాయన పుత్రుఁడు శ్రీరాయజగపతిరాజుగారు రాజుగాఁ జేయఁబడి యిరువది సంవత్సరముల యెనిమిదినెలలు రాజ్యపాలనముచేసి యుండూరువద్ద శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో జరిగిన యుద్ధములో నిరువదియైదు సంవత్సరముల యీఁడుననఁగా ౧౭౫౯ వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధ నవమినాఁడు రణసహితులయిరి. ఈయన పిమ్మటనే యేనుఁగు లక్ష్మణకవిగారి కాశ్రయుఁడయి యుండిన (రాయ జగపతిరాజుగారి పుత్రుఁడయిన) తిమ్మజగపతి గారు రాజ్యమునకు వచ్చి ౧౭౯౭ వ సంవత్సరమువఱకును ప్రభుత్వము చేసి స్వర్గస్థులయిరి. పయిని వివరించిన చరిత్రమునుబట్టి పెద్దాపురసంస్థానాధిపతు లందఱు నించుమించుగాఁ దాము కవులయ్యును కవుల నాదరించి కృతులందినవారయ్యును ఉండిరని తెలియవచ్చుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తిమ్మజగపతిరాజు తండ్రియగు రాయజగపతి మహారాజుగారి కాలములో సహిత ముండినట్లు తద్రచితమైన యీచాటుపద్యము పలుకుచున్నది.

ఉ. ఆయతవత్సవాయసుకులాంబుధిపూర్ణనిశాపతీ జగ
ద్ధేయశుభాకృతీ ! విదితకీర్తిసతీ కమనీయయౌవన
ప్రాయనలాకృతీ సతతవైభవనిర్జితపూర్వదిక్పతీ
ధీయుతవాక్పతీ జగపతీ నృపతీ సుకృతీ మహోన్నతీ.

ఈజగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులయి పెక్కుపదములు శతకములు దండకములు మొదలగునవి భద్రాద్రిరామునిమీఁదఁ జెప్పినట్లు రామనిలాసములోని యీపద్య ముద్ధోషించుచున్నది—

చ. పదములు కీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికల్
మృదుపదదండకంబులు సమిద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశై లరఘుభర్తకుఁ గానుకగా నొసంగె నా
త్రిదశులు మెచ్చుఁగా జగపతిప్రభుచంద్రుఁడు భక్తి పెంపునన్.

ఏనుఁగు లక్ష్మణకవికృతములయిన గ్రంథములలో సుభాషితరత్నావళియు రామవిలాసమును మాత్రము నాకు లభించినవి. ఇందు మొదటి పుస్తకము భర్తృహరియొక్క సంస్కృతగ్రంథమునుండి తెనిఁగింపఁబడినను, గొంచెమయినను విరసముగా నుండక మూలానుసారముగాను నిర్దుష్టముఁగాను, రసవంతముగాను, హృదయరంజకముగాను ఉన్నది. స్వస్థల మయిన పెద్దాడ గ్రామమునందలి సోమశంకరస్వామి తనహృదయమున సాక్షాత్కరించి సుభాషితరత్నావళిని దెలిఁగింపు మన్నట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. కలధౌతగిరియును గలధౌతగిరియును విల్లుగాఁ బూడవై నయిల్లుగాఁగఁ
గమలాహితుండును గమలాహితుండును శరముగాలలిత శేఖరముగాఁగఁ
బద్మోద్భవుండును బద్మోద్భవుండును సాదిగా మెయిఁదాల్చిబూది
గాఁగఁ.

భవనప్రియుండును భవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగఁ
గ్రాలుపెనువేల్పు ముమ్మునవాలుదాల్పు
జగములకుఁజేఁదు ధనదునిసంగడీఁడు
హరుఁడు పెద్దాడ సోమశంకరుఁడు హృదయ
సరసిజంబున నాకు సాక్షాత్కరించె.

రామవిలాసములోని యవతారికనుండి యన్నిపద్యముల నుదాహరించిన తరువాతఁ గవిత్వము నిర్దుష్టముగాను మృదుమధురవాగ్గుంభనలు కలదిగాను ఉండునని వేఱుగఁ జెప్పనక్కరలేదు. పూర్వోక్తము

లయిన గ్రంథద్వయమునుండియుఁ గొన్నిపద్యములనుదాహరించి కవి చరిత్రము నింతటిత్రోవ ముగించుచున్నాను —

సుభాషిత రత్నావళి.

చ. నతులగుచు న్మహోన్నతిఁ దనర్చుచు నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచుఁ బరజనప్రియకార్యసమర్థతఁ సమం
చితనిజకార్యసంగ్రహము చేయుచు నిష్ఠురవాదులఁ క్షమా
ధృతి నిరసించుచున్ బరఁగుధీరులు పూజ్యులుగారె వేరికిన్.

నీతిశతకము.

చ. అతివలఁజూచి వీ రబలలంచు వచించుమహాకవీంద్రు లు
ద్ధతవిపరీతవాదు లిది దబ్బఱగాదు విలాసినీసమం
చితతరశాక్షీపాతములచే గెలువంబడి రింద్రముఖ్యులుఁ
ధృతి నటువంటివా రబల లేగతి నైరి తలంచిచూడఁగన్.

శృంగారశతకము.

చ. కడువెఱపించుచు న్మదిమి గద్దఱిబెబ్బులిమాడ్కి నున్న దె
క్కడుపగదాయలంబలెఁ దెగుళ్లుశరీరము నొందుచున్న వె
ప్పుడొ చను భిన్నకుంభజలముంబలె నాయువు నిట్టులయ్యెఁ దా
రుడుగకి మానవు ల్దురితమోలి నొనర్చుచు నున్నవా రహో.

వైరాగ్యశతకము.

రామవిలాసము.

ఉ. వాసవనీలనీలము లవారితవిభ్రమశీలముల్ మరం
దాసవలోలముల్ యువభయానకసూనకదంబపుంజ్రకాం
డాసనము క్తలోహగుళికాళికరాళము లంజనప్రభా
భాసురభృంగజాలములు బంధురవృత్తిఁ జరించెఁ గాసలన్. ఆ-౧

శా. రామా రాజలలామ యోగిహృదయారామా మహాభోజసు
త్రామా నాకొక ముద్దుపెట్టుదువు రారాయంచుఁ గౌసల్య సు

ప్రేమం బిల్చిన మువ్వ లందియలు గంభీరంబుగా మ్రోయఁగా
శ్రీమంతుం డట రావిరేక మెఱయం జేరంగవచ్చుం గృపన్. ఆ-౭

చ. కటుభట ఘోషగర్జితము ఖాడ్గికపాణినటత్కృపాణరు
క్తటిదుదయంబు చిత్రఘటితధ్వజపంక్తిసురేంద్రచాప ము
ద్భటదివిషత్ప్రితాపరవిబాధక మగ్రనిశాటవాహినీ
పటుఘనబృంద మయ్యెడ నభంబునఁ బర్వె నసృక్ప్రివర్షమై. ఆ-౩

ఉ. చంపకపుష్పవాసనలసార మెఱింగినషట్పదంబు లీ
సొంపగుకన్నెపెన్నెరులు చూచితిరే చెలులార యంచు భా
షింపుచుఁ గింకిణీవలయశింజిత మొప్పఁ దలంచె వేమకృ
సంపఁగినూనెచేత నొకశారదచంద్రనిభాస్య సీతకున్. ఆ-౪

ఉ. ఇందుమెలంగుభృంగములు నిచ్చటికీరమయూరిశారికా
బృందము లింపుగట్టు సురభిప్రసవంబులు సాధనంబులై
ముందులభించినఁ హారునిఁ బూనిజయింపఁడె మారుఁ డంచు నె
న్నందగి రాము కేళిభవనప్రమదావనవాటి వాటిలున్. ఆ-౫

---

21. నెల్లూరి వీరరాఘవకవి

ఇతఁడు యాదవరాఘవపాండవీయమును నాలుగాశ్వాసముల త్ర్యర్థికావ్యమును రచియించెను. ఇంకు శ్రీకృష్ణునియొక్కయు శ్రీరా మునియొక్కయు పాండవులయొక్కయు కథలు ప్రతిపద్యమునకును మూడర్థములు వచ్చునట్లుగాఁ జెప్పఁబడినవి. వర్ణనాంశముల యందు మాత్రము కొన్ని యేకార్థపద్యము లుండును. ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. ఈతని పూర్వుల యింటిపేరు మొదట దేశరాజు వారయినను నెల్లూరియందు వాసము చేయుచుండుటచే నెల్లూరివారని మాఱినది. ఈతఁడు కాశ్యపగోత్రుఁ; ఆపస్తంబసూత్రుఁడు; వేంకటపతి

పుత్రుఁడు. ఈతఁడు తనతాతతాతయైన కొండనమంత్రిని దనగ్రంథమునం
దిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఎవ్వనితండ్రిపే రిల దేశరాజువారన నింటిపేరు మున్నమరఁ దెచ్చె
నెవ్వనిసద్విద్య హెచ్చుగా వీణవా రన నింటిపేరు ము న్నమరఁగూర్చె
నెవ్వనికొమరుఁ డీయిలఁబెద్దవేంకటపతిరాయలకు దళవాయియయ్యె
నెవ్వఁడు గీతసాహిత్యవిద్యలనేర్చి దిగ్విజయంబునఁ దేజరిల్లె
నెవ్వఁడు ధవిణమలహరియు ధవళశంఖ
మాదిగా బిరుదులనెల్ల నంది మించెఁ
బ్రౌఢరాజులచే నిమ్మపండనంగ
నతఁడు నుతికెక్కెఁ గొండలాహ్వాయుఁడుజగతి.

తిరుమలదేవరాయనిపుత్రుఁ డయిన యాపెదవేంకటపతిరాయలు ౧౬౧౧ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కవియొక్క ప్రపితా మహుఁ డాతనికాలములో నున్నందున, నాలుగుతరముల తరువాతివాఁ డయినకవి ౧౭౧౧ వ సంవత్సరప్రాంతములయందుండి యుండవలెను. కవి తనశక్తి సామర్థ్యములనుగూర్చి యాదవరాఘవపాండవీకూవతారిక యం దిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. సకలమంత్రరహస్యశాస్త్రసర్వంకషప్రజ్ఞాధికస్ఫూర్తిఁ బరిఢవిల్లి
నిఖిలయోగరహస్యనిరుపమత్రివిధోరురాజయోగాభ్యాస రక్తిమీఱి
యాగమాంతరహస్యభాగోపనిషదర్థసర్వస్వనిజ్ఞానసార మెఱిఁగి
నాటకాలంకారనానావిధవిశేషరసభావభేదము ల్పొసఁగఁ దెలిసి
శబ్దముఖ్యశాస్త్రసదసద్వివేకత । స్మృతిపురాణవాస్తురతిరహస్య
గణితతురగరత్నగజపరిజ్ఞానత । నమరు వీరరాఘవాఖ్యకవిని.

క. నానావిధావధానము । లానృపనీతియును భరతమాహాత్మ్యాదుల్
మానుగనిచ్చాలిపియ్య।మానితముగఁ గల్గుఁ గోపంబునుమఱియున్.

క. ప్రాకృతముఖషడ్భాష।వ్యాకరణంబులును దెలుఁగువ్యాకరణంబుల్
ప్రాకటసాముద్రికమును । వీఁక జ్యోతిషముఁ జూపవిద్యావిధమున్.

క. సాంగముగఁ దెలిసి మును యో । గాంగీకారమతినిశ్చలానుభవాప్తిన్
బొంగియు నియోగవృత్తిఁ బొ।సంగి చెలంగితిని సారసాహిత్యనిధిన్.

సీ. శతలేఖనీపద్యసంధానచాతురి ఘటికాశతగ్రంథకరణపటిమ
ఆశుప్రబంధబాధాదిక్రియారూఢి సంకరోష్ట్యనిరోష్ట్యచాటుకలన
విస్తరణమాధుర్యవివిధచిత్రస్ఫూర్తి పాదమాత్రప్రతిపాదఘటన
వ్యస్తాక్షరవిమిశ్రబహుపద్యగుంభన మచలజిహ్వాదికప్రచురరచన
బహుజనమనోంతరస్థిరబహువిధార్థ
బహుసమస్యాప్రపూర్తియు బహువిభేద
సకలవిషమసమస్యాదిసంవిధాన
మమరఁగూర్తును నెఱిరాఘవాఖ్యకవిని.

క. పంచాశచ్చాటుకథా । చంచత్కృతులను రచించి సత్కవిపూజా
సంచితకీర్తిస దగు సా । ధ్వంచితుఁడను వీరరాఘవాఖ్యనియోగిన్.

చ. అవునన఼ గావ్యపంక్తి పదియర్థములన్ రచియింపనేర్తు స
త్కవులదయన్ శిరీషకవితామృదుతామహితార్యవైఖరిన్
భువి నటులైన సత్కథల మూటినొనర్తును బాలబోధకై
తివిరి బహుత్వమందు నలత్రిత్వము పర్యవసాన మూటచేన్.

కవి తాను జెప్పుకొన్నట్లు స్వసామర్థ్యము నంతను జూపి పది యర్థముల గ్రంథమును రచియింపక మూడర్థములదానినే రచియించినను, ఇట్టి గ్రంథములయందు నిఘంటువులు వెదకి పదములనేర్చి కూర్చినశిల్ప ప్రౌఢిమయేకాని యర్థచమత్కారము కాని భావగౌరవముకాని రస పుష్టికాని పుట్టదు. యాదవరాఘవపాండవీయములోని కొన్నిపద్యము లిందు క్రిందఁ జూపఁబడుచున్నవి—

శా. వారిం దెచ్చిన వంశహానియును దుర్వ్యాపారబాధాగతుల్
చేరన్ రా విటుసేయుమూవిధి యిదే. సేవింతు వీక్షింపు మా

తా న్మారూఢవ్యథఁ బాపు నాహృదయశల్యం బొయ్యనం బాపవే
స్వారాజ్యస్థితి నిల్వఁజేయఁగల భవ్యస్వీకృతింబోయెదన్. ఆ-౧

మ. అసురారాతిభవాతిభీతికలకంసారంభతన్ బాలకా
ర్యసుహృద్వృత్తి మెలంగఁ దెల్వఁగను పిశ్వామిత్రవాసీశుమా
నస ముప్పొంగ నఘూదులేగ యజనానందక్రియల్ పెంప మా
నిసమాజంబులు నిండ్లలో నిలువఁ బూనెం గామచారోన్నతుల్. ఆ-౨

ఉ. కౌతుకమాత్మ నేర్పడఁ దగన్ జనకేశమహాబలా ప్తివి
ఖ్యాతచరిత్రు సింహబలుఁ గన్గొని యీవిధ మెల్లఁ దెల్పి సం
ప్రీతిగ రాము నీకడకు వేగమె తెత్తునటంచుఁ దత్సమా
హూతి సుదృక్చిరోమణిఁ దదుక్తిని గైకొనిపోయి యచ్చటన్. ఆ-3

చ. హరివిభుఁ డంతకీ ర్తి మతసాంబసమాఖ్యుఁడు వైరికర్ణభీ
కరనిజనాముఁ డాబలముఁ గావఁగఁబూని తదగ్రయాయియై
మరిదమి వేగ నచ్చటి కమందధృతిన్ జని యాగలంకలో
జొరఁబడికాల్వ సైన్యములఁ జూర్ణముచేసెను దాఁ దదున్నతిన్ ఆ-౪

---

22. నంజరాజు

ఈకవి హాలాస్యమాహాత్మ్య మను డెబ్బదిరెండధ్యాయముల వచనకావ్యమును రచియించెను. ఈగ్రంథమున నధ్యాయాద్యంతముల యందుఁ బద్యములుగలవు. కవి వంశవర్ణనమును బద్యములతోనే చేయఁబడినది. ఈకవి మహిశూరరాజగు దొడ్డమహీపాలుని పౌత్రుఁడు; వీరరాజభూపాలుని పుత్రుఁడు. ఈదొడ్డభూపాలుఁడు ౧౬౭౦ వ సంవత్సరప్రాంతములయందుండినవాఁడు. కవి తానును దనయన్నయు మహిశూర రాజ్య సేనాధిపతులయినట్లు చెప్పుకొనియున్నాఁడు. కవి యన్నయగు దేవభూవిభుఁ డిట్లు వర్ణింపఁబడెను.—

శా. ధీనక్త్రాణపరాయణుం డగుచు నెంతేవిశ్రుతుం డైనయా
సేనాధీశ్వర దేవభూవిభుఁడు కాశీంఖానమాద్యన్మలా
ఖానాద్యుద్భటయావనాధిపుల సంగ్రామంబునం గూల్చి ఢి
ల్లీనాథాదుల కెల్ల నచ్చెరువు.గొల్పెం ధారుణీమండలిన్.

౧౭౩౧ వ సంవత్సరమునందు మైసూరురాజగు చామరాజును సింహాసనవిహీనునిజేసి చెఱసాలయందుఁ బెట్టించినవాఁడు దళవాయి యైన యీదేవభూవిభుఁడే. కవి ౧౭౩౦ వ సంవత్సర ప్రాంతములయం దుండినవాఁడు. ఇతఁడు క్షత్రియవంశజుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఋక్శాఖవాఁడు. ఈహాలాస్యమాహాత్మ్యము దక్షిణమధురాపురీమాహా త్మ్యమును దెలిపెడి శైవగ్రంథము. ఇందలికథ స్కాందపురాణమునుండి గైకొనఁబడినది. పదునెనిమిదవ శతాబ్దారంభమున మధురలోను, మైసూరులోను దెనుఁగునఁ గొన్నివచనకావ్యములు చేయఁబడినవి. ఈ హాలాస్యమహాత్మ్యముయొక్క రచన సలక్షణమయి నాతికఠినముగా నున్నది. ఆకాలపు వచనరచనయొక్కరీతిని జూపుటకయి హాలాస్య మాహాత్మ్యములోని కొన్నిపంక్తుల నిందుఁ బ్రదర్శించుచున్నాను.

"వ. రూపలావణ్యభాగ్యమువల్లనో యనువైనగోత్రంబు గలవాఁడనియో విద్యంజూచియో సుందరేశ్వరుం డనుబుద్ధిచేతనో లేక భ్రాంతి చేతనో నేనునేను బిడ్డనిచ్చుట యనుచుం బలికి యాబ్రహ్మచారిం గులగోత్రంబు లడుగ నతండు తనగోత్రంబును సూత్రంబును నక్షత్రం బును నూర్ధ్వపుండ్రంబును గ్రమంబుగా విస్మృతుండై యెటింగించు టయు నబ్బాంధవులు కులగోత్రవ్యత్యాసంబులు లేకుండుటకు సంత సించి యూర్ధ్వపుండ్రధారణంబున కొక్కింతఖేదంబుఁ జెంది యనే కిమ్మ్నలగు గుణమ్మ్నలయం దొకదోషంబు గలిగియుండినంగాని యడంగునని నిశ్చయించినవారై వివాహంబు లొనరింప నవ్విధా పాటుండై శ్వర్యయుక్తుం డగుటంజేసి పుత్రిక కధికంబుగా ద్రవ్యం

బొసంగ నయ్యుర్వీసురనందనుండు సంతుష్టుండై యూధనం బంత యుం గైకొని పత్నీసమేతంబుగాఁ బెక్కండ్రు బంధువులతోడఁ గూడుకొనియున్న తల్లిదండ్రుల సన్నిధానంబునకుం జనుదేర దేశాంతరంబున కరిగి వివాహంబు చేసికొని భార్యతోడం జనుదెంచిన కుమారుం గాంచి తండ్రియుం దదీయబాంధవులు నత్యంతసంతోషం బెనసిరి ఈc."

ఈ అధ్యాయము.

---

23. కోటి వెంకనార్యుడు

ఇతఁడు "ఆంధ్రభాషార్ణవము" అను పేరు గల మంచి యచ్చ తెలుఁగు నిఘంటువును పద్యములుగాఁ జేసెను. దీనిత్రో సమానమైన యచ్చ తెనుఁగు నిఘంటువు మఱియొకటిలేదు. ఈకవి ఈపుస్తకమును శ్రీవిజయరఘునాథునిపుత్రుఁడైన రఘునాథరాజు ప్రేరణముచేతఁ జేసి యాతని కంకితముచేసెను. ఈరఘునాథరాజు రామనాథసేతుపతి యయిన విజయరఘునాథరాజు కుమారుఁడని త్రోచుచున్నది. అట్లయిన పక్షమున రఘునాథరాజు ౧౭౩౮ వ సంవత్సరము మొదలు ౧౭౮౭ వ సంవత్సరమువఱకును రాజ్యము చేసినందునఁ గవియు నాకాలమునం దుండియుండవలెను. కవి గద్యమునందుఁ దనబిరుదావళి నీప్రకారముగా వ్రాసికొనియున్నాడు—

"ఇది శ్రీమత్పరమేశ్వరకరుణాకటాక్షసంప్రాప్త సర్వజ్ఞత్వాది కతిపయగుణస్వసామ్యతదితరసకలగుణనిరూప మ్యాసేతు హిమాచలఖ్యాత మహోద్దండకవిబిరుదప్రశస్త సీతారామార్యవర్య తనూజాత శౌర్యధైర్యస్థైర్యాది సకలగుణచిరత్నరత్నాకర కోటి సమాఖ్యవంశసుధాపయోధిరాకాశశాంక ఘంటికాతురంగ నీలాత

పత్ర హనుమద్ధ్వజ మకర కేతన దివాదీప నవవిధభేరికాది నిఖిల
బిరుదాంక బృహదంబికా కటాక్షసంజాతసామ్రాజ్యధురంధర
విమలయశోబంధుర కర్ణాటపాండ్యచోళమహీపాలాదిసంస్తూయ
మాన శ్రీరాయరఘునాథమహీనాథసభాంకణ బిరుదాయమా
నార్యనుతచర్య వెంకనార్యప్రణీతం బైన ఈc."

కవితాధోరణిని జూపుటకయి నిఘంటువునుండి పద్యముల నుదా
హరించుట యుచితము కాదుకావున గృతిపతిని వర్ణించిన పద్యము
నొకదాని నిం దుదాహరించుచున్నాను.—

ఉ. శ్రీరఘునాథరాయ నృపశేఖర నీదుకరాసి భీముకా
ళోరగతుల్య మూటను రణోర్విని దుర్మదమత్తచిత్తులౌ
వీరులప్రాణవాయువుల బీల్చుట యుక్త మి దెంతవింత యు
య్యారె సముద్రమయ్య నిసుమంతయు భంగము గాంచదెప్పుడున్.

---

24. అడిదము సూరకవి

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; అడిదము బాలభాస్కరుని పుత్రుఁడు. ఈయడిదము బాలభాస్కరుఁడు శుద్ధాంధ్రరామాయణమును రచించినట్లు కవిజనరంజనములో సూరకవి వేసికొన్న—

"శుద్ధాంధ్రరామాయణ ఘటనవై దుషీధురంధ రాడిదము
బాలభాస్కరతనూభవ"

అను గద్యమువలనను, కవి సంశయవిచ్ఛేదములో బాలభాస్కరుని శుద్ధాంధ్రరామాయణములోని దని యుదాహరించిన

"నిగి డిరువై పుల న్వాడల నేటయినీటగునీటికోట"

అను చంపకమాలికాపాదమువలనను దెలియవచ్చుచున్నదిగాని యీశుద్ధాంధ్రరామాయణ మిప్పు డొచ్చటను గానరాదు. ఈసూరకవి

తాను జేసినగ్రంథముల నన్నిటిని రామచంద్రపుర రామలింగేశ్వరుని కంకి
తము చేసెను. ఇతఁడు చేసినగ్రంథములలో నెల్లఁ జంద్రమతీపరిణయ
మునునామాఁంతరముగల కవిజనరంజనము మిక్కిలి మనోహరమైనది.
ఇది మూడాశ్వాసములు గల చిన్నప్రబంధమైనను, దీనియందలి గుణ
సంపదనుబట్టి పండితులు దీనిని పిల్ల వసుచరిత్ర మని వాడుచున్నారు.
ఇతఁడు చేసిన యితరగ్రంథములు రామలింగేశ్వరశతకము, కవి సంశయ
విచ్ఛేదము, ఆంధ్రచంద్రాలోకము, ఆంధ్రనామశేషము, అనునవి. కవి
సంశయవిచ్ఛేద మనునది మూడాశ్వాసముల చిన్నలక్షణ గ్రంథము.
ఆంధ్రనామశేషము పైడిపాటి లక్ష్మణకవికృతమైన యాంధ్రనామసం
గ్రహములోలేని యచ్చతెలుఁగుపదముల నేర్చి కూర్చినపద్యకూప మగు
చిన్న నిఘుంటువు. కవి తనగ్రంథముల నన్నిటిని దేవాంకితము చేయుట
చేత వానినిబట్టి కవికాలమును నిర్ణయించుట శక్యముకాదు. ఇతనిచే
రచియింపఁబడిన గ్రంథములనుబట్టి కవి గోదావరి మండలములోనివాఁ
డయినట్లు కనఁబడుచున్నాఁడుగాని యితఁడు విజయనగరసంస్థానములో
శ్రీ పూసపాటి విజయరామరాజుగారి కాలములో నుండినట్లు తద్రచితము
లయిన చాటుపద్యములు మొదలయినవానివలనఁ దెలియవచ్చుచున్నది.
విజయనగరసంస్థానప్రభువులలో విజయరామరాజు లిద్దఱున్నందున నిత
డేవిజయరామరాజు కాలములో నుండినవాఁడో నిశ్చయింప శక్యము
కాకున్నది. పెద్దాపురములో నత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు
రాజ్యముచేయుచున్నకాలములోఁ నీకవి తనప్రభువువెంట పెద్దాపురసంస్థా
నకు వచ్చి రాజు లందఱును సభచేసి కూరుచుండియుండగా—

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూనపాడ్విజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీనులయియున్న రాజులవంక జూచుచు లేచి చదివెననియు, అందుమీఁద నిందలి కడపటివాక్యము తమ్మొద్దోంచి పలికినట్లు భావించి రాజులందఱును కవిని గోపదృష్టితోఁ జూచుచు లేవఁబోఁగా సతఁడు జంకక పదార్థమును జెప్పి "యీరాజు లనఁగాఁ" బై చరణములయందుఁ జెప్పఁబడినరాజు మొదలయినవారని స్పష్టపరచి రోషముడిపి వారిని శాంతచిత్తులను జేసెననియు చెప్పుచున్నారు. ఏనుఁగు లక్ష్మణకవిగారి నాదరించిన యీవత్సవాయతిమ్మజగపతిమహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసిరి. ఈయనకాలములోనుండినవారు రెండవ విజయరామరాజుగారే. ఈయన విజయనగరరాజ్యమునకు వచ్చినది తిమ్మజగపతి మహారాజుగారు పెద్దాపురరాజ్యమునకు వచ్చిన సంవత్సరములోనే. ఈవిజయరామరాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౫ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిరి. ఈ రాజులిద్దఱును సింహాసన మెక్కినప్పటికి యుక్తవయస్సురాని బాలురు. వీరిలో తిమ్మజగపతి మహారాజులుగా రప్పటి కేడుసంవత్సరముల ప్రాయమువారు; విజయరామరాజుగారు పండ్రెండు సంవత్సరముల ప్రాయమువారు. నిజాము ౧౭౬౦ వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు వీరిద్దఱిని గొనిపోయి దర్శనముచేయింపఁగా నతఁడు వీరిద్దఱిని వారివారి సంస్థానములకు రాజులనుగా నంగీకరించెను. మొదటి విజయరామరాజుగారు బొబ్బిలియుద్ధమున ౧౭౫౨ వ సంవత్సరమునఁనే మృతులయినందున, తిమ్మజగపతి మహారాజుగారి కాలములో నుండినయతఁడతఁడయి యుండఁడు. సింహాసనమునకు వచ్చునప్పటికి వీరిద్దఱును బాలురయినందున వీరు తమ యాస్థానకవులతోఁ గలిసి పెద్దాపురమున సమావేశమగుట తరువాత నిరువది సంవత్సరముల కనఁగా ౧౭౭౭ వ సంవత్సర ప్రాంతమందయియుండును. అందుచేత

సూరకవి ౧౭౮౦ వ సంవత్సరమువఱకైనను జీవించియుండవచ్చును. ఇతఁ డెప్పవిజయరామరాజుగారి కాలములోఁగూడ బాల్యావస్థలో నుండి యుండును. కవి కాశ్రయుఁడైన విజయరామరాజుగారిని గూర్చియు వారి సంస్థానమునుగూర్చియు నిందుఁ గొంత వివరించుట యనుచితము కానేరదు.

ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్లుగానే యీ పూసపాటివారును తాము సూర్యవంశజుఁడైన మాధవవర్మ సంతతి వారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరు గలిగినది. ఓరుగంటిసంస్థానము ప్రతాపరుద్రునితోఁ నశించినవెనుక వత్సవాయవారు పూసపాటివారు మొదలయినవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మాఱుపేరుగల పూసపాటి తిమ్మరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు పౌజుదారుగానుండిన షేర్‌మహమ్మదుఖాన్ వలన ౧౬౫౭ వ సంవత్సరమున కూలిమి భోగాపురపుతాలూకాలను గుత్తకు పుచ్చుకొని పాలనముచేయ నారంభించెను. ఈయనపుత్రుఁడయిన సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలనుకూడ కవులునకు పుచ్చుకొని, పర్లాకిమిడి సంస్థానాధిపతియైన గజపతిదేవుతో మైత్రిసంపాదించి, ౧౭౫౫ సుల్తాపు కాతులతోను రణం కాల్బలముతోను పోటూరారు జయించి కలింగరాజని పేరువడసి యీయూరు నివాస మేర్పఱుచుకొని ప్రబలుఁడయియుండెను. ఈయన యనంతరమున నానందరాజుగారు పరిపాలనమునకు వచ్చిరి. ఈయన పుత్రులు విజయరామరాజుగారు బహు ప్రసిద్ధపురుషులు. ఈయన మన్నె దొరలను గెలిచి వారి దేశము లాక్రమించుకొని మన్నెసుల్తానను బిరుదంది, పోటూరునుండి తనపేరట విజయనగరమను పేరఁబరఁగిన యీరికి రాజధానిని మార్చుకొని, ౧౭౧౭ వ సంవత్సరమునకు సరియైన

విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు కోటకట్టుటకు శంకు స్థాపనము చేసెను. ౧౭౫౩ వ సంవత్సరమున నిజాము కొండపల్లి యేలూరు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులను ఫ్రెంచి వారికిచ్చెను. అప్పుడు విజయరామరాజుగారు శ్రీకాకుళమునకు నాయి బయిన జాఫర్‌ల్లీతోఁ జేరి దేశము ఫ్రెంచివారికి స్వాధీనము కాకుండు నట్లు చేయుటకయి ప్రయత్నించెను గాని, వారు రాజమహేంద్రవరము శ్రీకాకుళపు సర్కారులను తక్కువశిస్తుకు కవ్వులున కిచ్చెదమన్నందున జాఫర్‌ల్లీని విడిచి ఫ్రెంచివారితోఁ జేరెను. తరువాత సర్కారులలోని రాజులందఱును ఫ్రెంచివారికి లోఁబడక తిరుగఁబడినప్పుడు సహిత మాయన వారియెడల విశ్వాసముగలవాఁడయి యుండి ౧౭౫౫ వ సంవ త్సరమున ఫ్రెంచి సేనానాయకుఁడయిన బుస్సీకి కావలసిన ధనమును రహస్యముగాఁ బంపెను. తరువాత బుస్సీ సేనలతో దేశమును స్వాధీ నము చేసికొనుటకు కళింగదేశమునకు వచ్చినప్పుడీయన బొబ్బిలివారి తోటి తన పూర్వవైరమును సాధించుకొనుటకయి బుస్సీని పురికొల్పి యుద్ధము చేయునట్లుచేసి తానుగూడ సేనలతోఁబోయి ౧౭౫౭ వ వత్స రము జనేవరు నెల ౨౨ వ తేదిని తాంబ్రపాపయ్యచే పొడువఁబడి పరమపదము నొందెను. తరువాత విజయరామరాజుగారి పితృవ్యపుత్రుఁ డయిన యానంద గజపతిరాజుగారు సింహాసనమునకు వచ్చి, బుస్సీ విజయరామరాజుగారి యెడలఁ జూపిన యాదరమును తనయెడలఁ జూపక పోవుటచేత మనసులో ద్వేషము పెట్టుకొని బుస్సీ విశాఖపట్టణము మొదలయిన స్థానముల నన్నిటిని స్వాధీనముచేసికొని పై యధికారుల యుత్తరవు ననుసరించి యీ దేశమును విడిచి కర్ణాటకమునకు వెడలి పోఁగానే సేనలను గూర్చుకొనిపోయి విశాఖపట్టణమును పట్టుకొని దాని నింగ్లీషువారికి వశపఱిచెదనని యుత్తరములువ్రాసి ౧౭౫౮ వ సంవత్స రమున వారితో స్నేహము చేసికొనెను. తరువాత నతఁడు ఫ్రెంచివారి

నుత్తరపుసర్కారులనుండి తటిమివేయు ప్రయత్నములో నింగ్లీషువారితో జేరి, దొరికినకొల్లలో దనకు భాగమిచ్చునట్లును జయించిన దేశములో నదీ సముద్రతీరపట్టణములును వాని చుట్టుపట్లగల దేశమును దక్క మిగిలిన భాగమును దన పాలనములో నుంచునట్లును యుద్ధవ్యయముల క్రింద తాను నెల కేబదివేలరూపాయల చొప్పున నిచ్చునట్లును ఏర్ప ఱుచుకొని, కర్నల్ ఫోర్డుగారిచే నడుపబడుచుండిన యింగ్లీషుసేనతో దనసేనను జేర్చి దండయాత్ర వెడలెను. అవఱకే ఫ్రెంచిసేనానాయకుడయిన కన్ఫ్లాన్సుగా రానందగజపతిరాజుగారిని శిక్షించుటకయి దండయాత్రవెడలి యింగ్లీషుసేన యూయసతో జేరినదని విని రాజమహేంద్ర వరమున నిలిచిపోయెను. కర్నల్ ఫోర్డుగా రానందరాజుగారు వెంట రాగా రాజమహేంద్రవరమునకు వచ్చి ఫ్రెంచిసేనాధిపతియైన కన్ఫ్లాన్సు గారి నక్కడనుండి పాఱద్రోలి, మచిలీబందరునకు బోయి దానిని స్వాధీనపఱుచుకొనెను. దండువెడలియున్న యింగ్లీషువారిని జయించు టకై నిజాము సలాబత్ జంగు మచిలీబందరుకు ౧౫ మైళ్ళ దూరము వఱకును వచ్చి వారిని జయించుట సాధ్యముకాదని తెలిసికొని ౧౭౬౯ వ సంవత్సరము మెయినెల ౧౮ వ తేదిని సంధిచేసికొని మచిలీ బందరు సర్కారును కొండవీడు నైజాముపట్టణము సర్కారులును ఇగ్లీషువారి కిచ్చివేసి, ఆనందగజపతిరాజుగారు ఫ్రెంచివారి కియ్యఁబడిన దేశమునుండి గ్రహించిన సొమ్ము విషయమయి తగవుపెట్టక విడిచిపెట్టి వారితండ్రి తాతలనుండి వారనుభవించుచుండిన దేశమును వారనుభ వించుట కంగీకరించెను. ఈ యొడంబడిక యయినతరువాత స్వదేశము నకు వచ్చుచు త్రోవలో రాజమహేంద్రవరమున నానందగజపతిరాజు గారు స్ఫోటకముచేత కాలధర్మమునొందిరి. అప్పుడాయన భార్య లిద్ద ఱును సహగమనము చేసిరఁట! తర్వాత బొబ్బిలిలో మృతులయిన విజయరామరాజుగారిభార్య చంద్రమ్మగారు సన్నిహితజ్ఞాతియైన పూస

పాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్య పుత్రుఁడయిన పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల వేంకటపతిరాజును చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవాని పేరు విజయరామరాజుగా మార్చి యాయనను పట్టాభిషిక్తుని జేసెను. ఈవిజయరామరాజు బాలుఁడయినందున రాజ్యాధికారము నంతను సవతియన్నగారగు సీతారామరాజుగారు వహించి, తమ్మునకు యుక్తవయస్సు వచ్చినతరువాతసహిత మధికార మునంతను తానే చెల్లించుచువచ్చెను. ఈవిజయరామరాజుగారి కాలములోనే మనకవి యుండినది. ఆకాలమునందు విజయనగరమువారు నిజాముకు కట్టుపన్ను రెండులక్షల తొంబదివేల యేఁబదితొమ్మిదిరూపాయలు. అయినను దేశమస్వస్థస్థితిలో నున్నందున నిజాము తనకు రావలసిన కప్పమును తిన్నఁగాఁ గైకొన శక్తుఁడుగాక పెక్కేం డ్లూరకుండుచు వచ్చెను. ఈహేతువుచేతను, సీతారామరాజుగారు బలవంతులయి తమసేనలతో చిల్లరసంస్థానాధిపతుల నదిమి కప్పములు గొనుచుండుటచేతను, విజయనగరరాజ్య మాకాలమున దించుమించుగా స్వతంత్రరాష్ట్రమువలెనే యుండెను. ఈసీతారామరాజుగారు బొబ్బిలి రాజయిన చిన్నరంగారావుగారిని పట్టుకొని విజయనగరములో చెరసాలయం దుంచెను; పర్లాకిమిడి రాజగు నారాయణదేవు జగన్నాథ యాత్ర పోవుట సందుచేసికొని యతని రాజ్యముమీఁద దండెత్తి యాత్రనుండి తిరిగి వచ్చిన యాతని నరసన్నపేటవద్ద నోడించి యిప్పటి గంజాముమండలములో విశేషభాగమును విజయనగరరాజ్యములోఁ జేర్చెను. తన తమ్ముని వెంటఁగొని దండయాత్రవెడలి సీతారామరాజు గారు మొగలితుట్లు వఱకును వచ్చి స్థానికపాలకుఁడైన నబాబు బడ్డిఅబ్జ మాఖానును జయించి కొంతకాలము రాజమహేంద్రవరము సర్కారును సహిత మాక్రమించినట్లు చెప్పుదురు. ఇట్లింకను పెక్కు విజయములను బొంది మహోన్నతవశేయం దుండిన యాకాలములోనే యింగ్లీషువారు

నిజామువలనఁ బొందిన సనదుప్రకారముగా నుత్తరపుసర్కారుల లోదమ
యధికారమును జెల్లించుట కారంభించిరి. ఇంగ్లీషుకంపెనీవారితో జేసి
కొన్న యొడంబడికనుబట్టి సంవత్సరమునకు మూడులక్షల రూపాయలు
పేష్కష్ చెల్లించుటకును పల్లాకివిడి రాజయిన నారాయణదేవునలనఁ
గైకొన్న రాజ్యమును విడిచిపెట్టుటకును విజయనగరము వారొప్పు
కొనిరి. ఇట్లు కొంతకాలము జరిగిన తరువాత విజయనగర సంస్థానము
నకు లోఁబడియున్న కొండ జమీందారు లందఱును విజయనగరము
వారిమీఁద తిరుగఁబడి స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించిరి. కాని సీతా
రామరాజుగా రన్నిటికిని దగినవాఁ డయినందున నింగ్లీషుసేనలను
సహాయపఱుచుకొని యాకొండ సంస్థానాధిపతులనొక్కొక్కరినే
జయించి కొందరిదేశములను తమరాజ్యములోఁ గలుపుకొనియు కొంద
ఱిని విజయనగరమునఁ జెఱసాలలోఁ బెట్టియు నుండఁజేసి సాధించెను.
ఈకలహములో ఆంధ్ర, పాలకొండ జమీన్ దారులు మాత్రము చేరలేదు.
సీతారామరాజుగారిట్లు పరరాజులను జయించుటయేకాక తురకదొరలు
మసీదుల కిచ్చిన భూములను పూర్వరాజులు బ్రాహ్మణుల కిచ్చిన
మాన్యములనుగూడ లాగుకొని ప్రజలను సహితము క్షోభపెట్ట నారం
భించెను. ఈయనపెట్టుబాధలే సూరకవిని రామలింగేశశతకము చెప్ప
నట్లు చేసినవి. ఆకాలపు ప్రభువులయందు కవి కెట్టియభిప్రాయముండి
నదో కొంతవఱకీక్రిందిరీతి పద్యములు వెల్లడిచేయవచ్చును—

సీ. పదుగురు కోఁతివెంబడి సంచరింపరే వాహకుల్ లేరె శవంబులకును
గంగురెద్దుకు లేవె ఘనసూర్యరావముల్ కల్గ్గల్గదె వారకామినులకుఁ
బులిగోవుఁజంపినక్కలనుబోషింపదేస్థూలకాయము లేదెమున్నలకును
బుప్పిపంటికి లేదె పుట్టంబుఁ జుట్టుట వేణుధరుఁ డెద్దువెంట. రాఁడె
న్యాయపద్ధతినమువనియవనిపతికి
నెన్నచిన్నెలు గలిగిన నెందుకొఱకు

నంత్యమున జూడవలయునాయయ్యసుఖము
రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. కడువింత యగుస్థూలకాయంబు గల్గుట
చిత్రభూషాంబరస్థితిని గనుట
తూర్యరావంబులతో జనుదెంచుట
వాలవీజనసమావాప్తి గనుట
శృంగవేత్రోద్ధతిఁ జేరరాకుండుట
చూషణు పదుగురు చుట్టుకొనుట
స్వనియంతవాక్యంబు విని తలయూఁచుట
మౌనముద్ర వహించి మతము గనుట
గంగిరెద్దుకు మూర్ఖభూకాంతునకును
భేదమించుకయును గనిపించ దట్టి
ప్రభువు వేఁడిన నత్యవిపటిమ చెడదె
రామలింగేశ రామచంద్రపురవాస.

సీ. మాన్యంబు లియ్య సమర్థుఁడొక్కఁడులేఁడు
మాన్యములెచ్చెఱుప సామంతులంద
ఱెండినయూళ్ళగో డెఱిఁగింపఁ డెవ్వఁడుఁ
బండినయూళ్ళెన్న బ్రభువులంద
ఱీతఁడు వేద యిట్టించు నెఱిఁగింపఁడెవ్వఁడుఁ
గలవారిసిరి యెన్నగలరు దొరలు
తనయాలిచీఁకటిత పెన్న డెవ్వఁడు
పరకాంతఱంకెన్నఁ బెద్ద లంద
ఱిట్టిదుష్టుల కధికార మిచ్చినట్టి
రాజు ననవలెఁగాక దుర్జయుల ననఁగ
నేమిపనియున్న దీక సత్యవీంద్రులకును
రామలింగేశ రామచంద్రపురనివాస.

ఇట్లుండఁగా సంస్థానమునం దుండినరాచవారందఱు నొకటిగాఁజేరి ౧౭౭౫ వ సంవత్సరమునందు మంత్రిత్వమునుమాని రాజకార్యసంబంధము వదలుకొనునట్లు సీతారామరాజుగారిని నిర్బంధపఱిచిరి. తనపుత్రుఁడయిన నరసింహగజపతిరాజును స్వీకారముచేసికొని విజయరామరాజుగారు మరణానంతరమున సింహాసన మాతని కిచ్చునట్లు తమ్ముని నొడఁబఱిచి యాయన తాను మంత్రిత్వమును విడుచుట కంగీకరించెను.

విజయనగరవసువారు చెల్లింపవలసిన మొత్తమును నిర్ణయించుటకయి కంపెనీవారి చెన్నపురిపరిపాలకుఁడు విజయరామరాజుగారిని చెన్నపురి రమ్మనికోరెను. కోరినప్రకారముగా విజయరామగాజుగారు చెన్నపురికిఁబోక ప్రయాణవ్యయములకు తనచేత సొమ్ములేదనియు, తన యన్నయైన సీతారామరాజుగారు తన్ను నాశనముచేయుటకయి తంత్రములు పన్నుచుండిన యాకాలములోఁ దాను రాజధానివిడిచి దూరముగాఁ బోవుట యుచితము కాదనియు, విశాఖపట్టణములోని యధికారుల సమక్షమునఁ దాను వారు విధించెడు న్యాయమైనకప్పమున కంగీకరించెదననియు, చెప్పి తప్పించుకొనెను. అంతట చెన్నపురిపరిపాలకుఁడు సీతారామరాజుగారిని చెన్నపురికి రమ్మనికోరఁగానే యతఁడు తక్షణమేపోయి యక్కడివారిని వశపఱచుకొని రాజకార్యములు చక్కఁబఱుచుకొని, విజయనగరసంస్థానమునకు తన్ను దివానుగా నేర్పాటుచేయించుకొని తన పుత్రుని స్వీకారమును స్థిరపఱిపించుకొని, మరలవచ్చెను. ఈయేర్పాటుల వలన విజయరామరాజుగారు పేరునకురాజుగానుండినను నిజమయిన యధికారమంతయు సీతారామరాజుగారి చేతిలోనే చిక్కెను. ఈవిషయమయి విజయరామరాజుగారు కంపెనీవారికి మొరబెట్టుకోఁగా పెట్టుకోఁగా తుదకు వారాయనను దివానుపనినుండి తొలఁగించి విజయనగరము విడుచునట్లుతెరువు చేసిరి. అందుపైని సీతారామరాజుగారు విజయనగరము విడిచి సింహాచలము నివాసముగా నేర్పఱుచుకొని యక్కడ కొంత

కాలముండి, తరువాత మరల తమ్ముని మంచిమాటలాడి ౧౭౯౦ వ సంవ త్సరమునం దొకసారియు ౧౭౯౨ వ సంవత్సరమందొకసారియు మరల సంస్థానములో దివానుగాఁ బ్రవేశించి, కడపటిసారి కంపెనీవారిచే చెన్న పురికిఁ బోవునట్లుత్తరువుచేయఁబడి నెలకయిమువేలరూపాయల యుపకార వేతనముమీఁద ౧౭౯౩ వ సంవత్సరమునందక్కడపోయి చేరెను. సీతా రామరాజుగారి దుష్పరిపాలనము మొదలైన కారణములచేత విజయరా మరాజుగారు ఋణములపాలగుటయేకాక కంపెనీవారికి కట్టవలసిన కప్ప మును సరిగా కట్టలేక యారులక్షల యిరువదిమైనువేల రూపాయలవరకు బాకీపడిరి. అందుచేత కంపెనీవారు సంస్థానమును తమపాలనమునకుఁ దీసి కొని, విజయరామరాజుగారిని స్వరాజ్యమువిడిచి మచిలీబందరులో వాసము చేయునట్లుత్తరువుచేసి, ఆయనకు ముప్పదివేలరూపాయ లొక్క సారిగా రొక్కమిచ్చెదమనియు నెలకు రు ౧౭౦౦ లు వ్యయముల కిచ్చెద మనియుఁ జెప్పిరి. ఆయన స్వదేశమును విడుచుట కిష్టములేనివారయి బందరుపురమునకుఁ బోవుమార్గమున బైలుదేరి యయిదారుక్రోసుల దూరముపోయి యక్కడనుండి పనివారలతో వెనుకఁదిరిగి పద్మనాభము నకుఁ బోయి యక్కడనుండి తాను ప్రయాణము చేయలేకపోవుటకు సాకులు వ్రాయనారంభించెను. విజయరామరాజుగా రక్కడనున్నకాల ములో రాచవారును నాలుగువేల సైనికులునుబోయి యాయననుజేరిరి. కంపెనీవారి కీసంగతి తెలియఁగానే యిరువదినాలుగుగంటలకాలము గడు విచ్చి యాలోపల నతఁడు బందరుమార్గమున బైలుదేరనిపక్షమున, బలా త్కారముగాఁ బంపవలసిందని విశాఖపట్టణములోనున్న నాయకుల కుత్తరువుచేసిరి. పయివారి యుత్తరువును దెలియఁబఱిచి యింగిషు సేనా ధిపతియైన బ్రెండర్గాస్టుగారు కొంతసేన (౭౫౦భటులు)తో పద్మనాభమున కుఁ బోయిరి. ౧౭౯౪ వ సంవత్సరము జూలయినెల ౧౦ వ తేదీ. యుద్ధ యమున నింగ్లీషుసేనాధిపతి పద్మనాభమును జేరునప్పటికి, విజయ

V.R.R. MEMORIAL LIBRARY NARLA P. R. T. Acc. No.

రామరాజుగారును బంధువులయిన రాచవారును ఖడ్గపాణులయి లోఁబడక యుద్ధముచేసి వీరమరణమునొందుటకు నిశ్చయించుకొని యందరును పద్మనాభస్వామి ప్రసాదమునుస్వీకరించి యుద్ధోన్ముఖులయి నిలిచియుండిరి. నాఁడు సూర్యోదయకాలమున నింగ్లీషుసేనలకును రాజుగారి సేనలకును ముప్పావుగంటసేపు ఘోరయుద్ధము జరగినది. అంతట రాజుగారి సేనలన్నియు చెల్లాచెదరయి పారిపోయినవి. రణరంగమునకుఁబోయి చూడఁగా రణనిహతులయి వీరశయనము నొందినవారిశరీరము లక్కడ మున్నూటతొమ్మిది కనఁబడినవి. రణభూమినలంకరించిన మున్నూటతొమ్మిదింటిలో నిన్నూటయెనుబది రాచవారిదేహములు. రణరంగమధ్యమునఁ బడియుండిన విజయరామరాజుగారి శవముచుట్టును కోటకట్టినట్లుగా సంస్థానములో నున్నతస్థితిలో నుండిన యుత్తమక్షత్రియుల శవములు నలువది గుండుదెబ్బలతోఁ బడియుండెను. ఇట్లు మరణమునొందినవారుగాక పారిపోయినవారిలో నెందరికిగాయములుతగిలినవో తెలియలేదు. ఇంగ్లీషుసైనికులలో మృతులయినవారు పదుముగ్గురు; గాయపడినవారరువదియొక్కరు. ముప్పదియేడేండ్లక్రిందట బొబ్బిలికోటముందు పెద్ద విజయరామరాజుగారు హతులయినట్లే మనకవీంద్రునికాలములోనుండిన యీ చిన్నవిజయరామరాజుగారు పద్మనాభపుకొండముందు నిహతులయిరి. మనకవికాలముతో సంబంధించినచరిత్రమింతే. తండ్రిమరణమును విని యప్పటి కైనిమిదిసంవత్సరముల ప్రాయమువాఁడయిన నారాయణ బాబుగారు తల్లితోడఁగూడ కొండదేశమునకుపారిపోయిరి. కాని, కంపెనీవారాయనను పిలిపించి దొరతనమిచ్చిరి. ఆయన పండ్రెండులక్షలవరకును ఋణముచేసి ౧౮౦౭ వ సంవత్సరమునందు తనకు సంవత్సరమున కెనుబది వేలరూపాయలిచ్చు పద్ధతిమీఁద రాజ్యపాలనము నింగ్లీషువారి కప్పగింపఁగా వారు ౧౮౩౩ వ సంవత్సరమునాఁటి కప్పులన్నియుఁ దీర్చి రాజ్యము నాయనకు మరలనిచ్చిరి. నారాయణబాబుగారు మరల నేడు

లక్షలరూపాయలప్పుచేసి తనకు సంవత్సరమునకు లక్షరూపాయలిచ్చు పద్ధతిమీద ౧౮౩౭ వ సంవత్సరములో రాజ్యమును మరల నింగ్లీషు వారియధీనముచేసి కాశీయాత్రపోయి యక్కడనే వాసముచేసి ౧౮౪౫ వ సంవత్సరమున దేహము చాలించిరి. మరణకాలమున కాయన యప్పు ౧౧ లక్షలకుఁ బెరిగినది. పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల నారాయణబాబుగారి కుమారుఁడగు విజయరామ గజపతిరాజుగారికి రాజ్యమిచ్చి ఆయన కాశీనగరమును విడిచివచ్చుట కిష్టము లేనివారుగా నుండినను ౧౮౪౬ వ సంవత్సరమునం దాయనను విజయనగరమునకు రప్పించిరి. ఋణముల నన్నిటిని దీర్చి, ౧౮౫౩ వ సంవత్సరములో రు ౨౧౨౩౮౪ ల కొక్కముత్తో నింగ్లీషువారాయనకు రాజ్యమొప్పగించిరి. ఈ విజయరామగజపతిరాజుగా రాంగ్లేయోపాధ్యాయుల శిక్షచేఁ బ్రవీణులయి సత్పరిపాలన చేయుచు బాలికాపాఠశాలలు మొదలయిన జనోపయుక్తములగు ధర్మకార్యములకొఱకు ధనమును సద్వినియోగపఱచుచు వచ్చిరి. విశాఖపట్టణములోని వైద్యశాలకు ముప్పదివేల రూపాయల నిచ్చినందున, దొరతనమువారాయనకు ౧౮౬౫ వ సంవత్సరములో "మహారాజా" యన్న బిరుదిచ్చిరి. ఈయన ౧౮౭౮ వ సంవత్సరమున స్వర్గస్థులుకాఁగా ౧౮౫౦ వ సంవత్సరమునందు జనించిన యీయనపుత్రు లానందగజపతిరాజుగా రప్పటినుండి విజయనగరపరిపాలకులుగా నున్నారు. దొరతనమువారీయనకును ౧౮౭౬ వ సంవత్సరమున "మహారాజా" యన్న బిరుదము నిచ్చిరి.

సూరకవికి రేవయను గ్రామమున చెరువుగట్టుక్రింద నొకమాన్యముండెననియు, ఆగ్రామమును గుత్తచేసిన దంతులూరి యన్నమరాజు కవిమాన్యమునకు చెరువునీరు పెట్టుకోనీకపోఁగా, అతఁడు ప్రభువునకు మొఱ్ఱపెట్టుకొనియు కార్యముగానక తుదకు చెఱువులో నిలుచుండి

యీక్రింది నాలుగు సీసపద్యములును జెప్పఁగానే చెఱువు నాలుగు వైపులను గండితెగి నీరాతని పొలముమీఁద పాఱెననియుఁ జెప్పెదరు-

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షినిగల్గు పద్మనాభునిపదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగునంబుధీశునిచరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీరమణువామాంకభాగమునఁజేరి
యఖిలలోకాధ్యక్షుఁడై మించివిహరించుశివుజటాజూలూగ్రసీమనిలిచి
తనరు నీవంటిధన్య కుత్తమముగాదు
పూసపాటి మహాస్థానభూమియందుఁ
గాలుద్రొక్కంగ నోడుఁ జండాలుఁడైన
గదలు మిటమాని దివిజగంగాభవాని.

సీ. ఆదిభిక్షుం డీతఁడనిరోసి విడియాకుగొనివచ్చి యిటనిల్వఁగోరితొక్కొ
జగడాలచీలివై సవతితోఁ బోరాడి వీఁగివచ్చి యిచట డాఁగితొక్కొ
నిర్జరాంగనలెల్ల నీఱంకువెలిపుచ్చ దూబవై యిచ్చోటదూఱితొక్కొ
బీదబాపలఁగష్టపెట్టుటకై మిన్నుదొలఁగి యిచ్చోటను నిలిచితొక్కొ
వలదు ద్విజభూమిఁ గాల్మిల్ప వరుసగాదు
రవ్వ నీకేల తగ దంబురాశికరుగు
నాతియతఁడెకాఁడటె పిన్ననాఁటి మగఁడు
కదలుమిటమాని దివిజగంగాభవాని.

సీ. భావింప నిలు వెల్ల భంగంబులేకాని
భంగము ల్లోలఁగు టెప్పటికి లేదు
తిరుగుచో వంకరతిరుగు డింతియకాని
తిన్న గాఁదిరుగుట యెన్న డేఱుఁగ
మునసి రేయిపగల్లు మొరయుచుండుటెకాని
మొరయకూరకయుంట యెఱుఁగమెపుడు
పాలకల్మినిరోసి పల్చనగుటేకాని
పలుచనిగతి మాని మెలఁగు టెఱుఁగ

మనుచు నీలోన నీవై నయవగుణంబు
లరసి లజ్జించి దివి నుండ కరుగుడెంచి
నిలువనీరైన నీవిందు నిలిచి తొక్కో
కదలు మిటమాని దివిజ గంగాభవాని.

సీ. కృతకాద్రు లాయెనా కీలోగ్రఫణిఫణానేకఫూత్కారవల్మీకచయము
విరిదోట లాయెనా కఱకుకంటకకంటకాంకురవిస్ఫురితాగచయము
పువ్వుబాన్పు లాయెనా నవమంజులశ్వేతలవణాలవాలమా చవుటినేల
బొమ్మరిం డ్లాయెనా భూరిభేకాండజాధారమై తన రుకేదారచయము
నీకు విహరింప వసతుల్లై నివ్వటిలెనె
చిన్నపొలములు బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు చేయుముష్కరులు గలరె
కదలుమిటమాని దివిజగంగాభవాని.

ఈసూరకవి విషయమున నిక్క డెలిసినసంగతు లతడు సమ కాలికులగు కవులతో బెట్టుకొన్న వివాదములును, కవు లొండొరులను దిట్టుకొన్న పద్యములును దక్క మఱి యేమియు గానరావు. కాబట్టి యాకథలను విడిచి కవికృతగ్రంథములనుండి కొన్ని పద్యములనుమాత్ర మిం దుదాహరించుచున్నాను.—

కవిజనరంజనము.

మ. అమరద్వీపవతీపయోవిహరణప్రాంచత్సురస్త్రీల వ
క్షమయాభ్రంకషమంటపాగ్రముల నిచ్చల్ క్రీడఁగావించుత
ద్రమణీవారము వేఱ నేరుపఱుపన్ రా దంచుఁగా దివ్యరా
జముఖీపాళికిఁ దమ్మిచూలి యనిమేషత్వంబు గావించుటల్. ఆ-౧

శా. శయ్యాదంభమున న్మురాంతకుఁడు భూపాకై తపస్సూర్తిచే
నయ్యార్యారమణుండు దాల్చిరి భుజంగాధీశులన్ నీయసా
హాయ్యప్రస్ఫుటధాటి కోర్వ కనుచో నబ్జాస్యలా యోర్చుహా
రయ్యా గంధసమీర ప్రోవఁగదవయ్యా యీశురంగేశ్వరా. ఆ-౨

మ. అలమన్ మోఁ బులకాంకురాళి దరహాసాంకూరము లక్ష్మవం
దొలఁకక్ ముత్యపుటొంట్లు గండయుగళిం దూఁగన్ గనత్కంకణం
బులు మ్రోయన్ భుజమధ్యసీమ రతసంపుందాలి తార్మాఱుగాఁ
దలఁబ్రాలోసెలతాంగియూదలపయిన్ ధాత్రీశుఁ డత్యాదృతిన్. ఆ 3
ఆంధ్రచంద్రాలోకము.

గీ. అక్రమాతిశయోక్తి ప్రఖ్యాతికెక్కు—
హేతుకార్యంబులకు సహావృత్తిగలుగ—
జ్యాపరీరంభణైకదక్షత వహించె
నీశరంబులు నీశత్రునృపులతోడ.

క. ఏపారుఁ గృతులఁ బ్రతివ
స్తూపమ వాక్యములు రెంటి కొగి సమత తగన్—
తాపమున నలరు సూరుఁడు
చాపంబున శూరుఁ డొనరు జగతిన నుక్రియన్.

రామలింగేశశతకమునందలి పద్యము లీవఱకే కొన్ని యుదాహరింపఁబడినవి. లక్షణగ్రంథము లగుటచే నాంధ్రనామశేష కవిసంశయవిచ్ఛేదములనుండి కవితాధోరణిని జూపుటకుఁ బద్యముల నుదాహరించుట యుచితము కాకపోయినను, అందుండియు నొక్కొకఁ చిన్న పద్యమును గైకొనుచున్నాను—

క. వెన్ననఁగ బీజమంజరి । వెన్ననఁ జరమాంగమునకు వెలయునుబేరై
కన్ను లనం బర్వంబులు । కన్నులనఁ లోచనములు కంజేకాలా.
ఆంధ్రనామశేష.

గీ. ఎరుకగలవారె యనుచోట నెఱుకగలరె
యిట్టివారెయనెడిచోట నిట్టిరెయగుఁ
జేయఁగలవారెయనుచోట జేయఁగలరె
యనుచు లోకప్రసిద్ధోక్తి యగునుశర్వ. కవిసంశయవిచ్ఛేదము.

25. మంగళగిరి ఆనందకవి

ఈకవి వేదాంతరసాయనమనెడు నాలుగాశ్వాసముల పద్యకావ్య మును రచియించి దానిని నిడిమామిళ్ల దాసయామాత్యుని కంకితము చేసెను. కవి క్రైస్తవమత మవలంబించిన నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు తిమ్మయామాత్యుని పుత్రుఁడు; ఆత్రేయగోత్రుఁడు; కవి కృతి పతి తన్నుఁగూర్చి పలికినవిధము నిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. ఒకవంక నిగమాగమోజ్జ్వలాతిశయార్థవిధివాదకౌశలద్విజనికాయ
మొకచాయన్యాయశాస్త్రోదాత్తవాక్యప్రసంగకృద్విద్వత్ప్రజావితాన
మొకక్రేవ సంస్కృతప్రకటాంధ్రభాషాకవిత్వప్రవీణకవిప్రకాండ
మొకచెంత సప్తస్వరోద్గీతగీతికావై చిత్రవిస్ఫారధ్వనికాహ్ళు
ముల్లసిల వజ్రకాహ్ళేయకోపమాన
వైభవస్ఫూర్తి నొక శుభవాసరమున
మహితగుణపాళి దాసయామాత్యవాళి
ప్రమదముప్పొంగఁ బేరోలగమునసుండి.

ము. నను నర్వేశపదాంబుజద్వయనితాంతధ్యానపారీణు భూ
రినయోపేతచరిత్రు మంగళగిరి శ్రీవంశవారాశిపూ
ర్ణసితాంశాభు సుధీజనాభిహితు నానందాఖ్య సద్గ్రంథక
ల్పను సాహిత్యకళావిశారదుని బిల్వం బంచి పల్కెం గృపన్.

చ. తరుముఖసప్తసంతతు లుదారత నెచ్చట నిల్వ నచ్చటన్
బరఁగు సమస్తదిక్కులకుఁ బ్రాఁక గుభావరసానుకూలవా
గ్గరిమఁ దనర్చు సత్కృతిముఖంబున వానికిఁ దారకేందు
భాస్కరులు గలంతకాల మనిశంబుఁ గరంబుఁ బ్రసిద్ధి చెల్వగున్.

ఇతఁడు లాక్షణికాగ్రగణ్యుఁ డయిన ప్రబంధకవి. పేరునుబట్టి తోఁచున ట్లిది వేదాంతగ్రంథముగాక మతస్థాపకుఁడయిన యేసుక్రీస్తు

యొక్క చరిత్రముగా నున్నది. ఈపుస్తకము నిర్దుష్టమయి మృదుమధుర మైన ప్రబంధపాకమునఁ జేయఁబడియున్నది. ఇందలి వర్ణన లేవిషయము నను బూర్వప్రబంధములలోని వర్ణనలకుఁ దీసిపోవు. బ్రౌన్‌దొరగా రీకావ్యము ౧౭౦౦ వ సంవత్సరప్రాంతమున రచియింపఁబడినట్లు చెప్పిరి. కాని, కవి కృతిపతి యయిన దాసామాత్యునిసోదరుఁడగు రాజప్పను వర్ణించుచో—

మ. మదిరాక్షీమదనుండు రాజపమహామంత్రీంద్రుఁ డుద్యన్మహా
మ్మదలీఖాను కృపానులబ్ధమదవన్మాతంగమాణిక్యహా
రదుకూలాదికసత్కృతిం ద్రిదశవర్యస్ఫారసామ్రాజ్యల
క్ష్మీఁ దనర్చె న్బుధకోటి పేర్కొనఁగఁ బుల్లేర్పట్టణాధ్యాసియై.

అనుపద్యములో నతఁడు కర్ణాటకపు నబాబగు మహామ్మదల్లీ చేత సత్కారమును బొందినట్లు చెప్పియుండుటచేతను, ఈమహామ్మదల్లీ ౧౭౯౯ వ సంవత్సరమునఁగాని సింహాసనమునకు వచ్చి యుండకపోవుట చేతను, వేదాంతరసాయనము ౧౭౫౦ వ సంవత్సరమునకు తరువాతనే రచియింపఁబడినదని నిశ్చయింపవలయును. ఈకవి కూచిమంచి తిమ్మకవి మొదలయినవారి కాలములోనే కృష్ణామండలమున నుండినవాఁడు. కృతి నాయకుఁడు బందరుపురములో నధికారము చేసిన ట్లీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది.

మ. ప్రకటారాతిచమూభయానకఘనప్రాకారఖేయంబులన్
సుకరశ్రీఁ దగుబందరాఖ్యనగరిక్ సొంపొందుదీనార్థిక
ల్పకభూజం బన దాసమంత్రి రుచిశుంభద్రత్నజాంబూనదా
దికవస్తుప్రకరాన్వితాయతనుఁడై ధీరుల్ ప్రశంసింపఁగన్.

వేదాంతరసాయనకృతికర్తయు కృతిభర్తయు నిరువురును క్రైస్తవ మతప్రవిష్టులైన నియోగి బ్రాహ్మణులు. వేదాంతరసాయనముయొక్క

యొక్కొక్కయూహాశ్వాసమునుండి యొక్కొక్కపద్యము నిం దుదాహరించుచున్నాను—

చ. జగదుపకారకారకవిశాలసమస్తపదార్థకల్పకుం
డగునతనిం బరాత్పరు మహామహు సర్వశుభస్వభావు మ్రొ
క్కఁగఁ దగుఁగాక యాతఁడిలఁ గల్గఁగఁ జేసినవానిపూజ స
ల్పఁగ దురితంబు లంటునని పల్కుట యొప్పు నసంశయంబుగన్. ఆ-౧

చ. ఘనతర పాపపుణ్యముఖ కార్యసమాచరణస్వతంత్రతన్
గొనినమనంబు మానవునకుం బొసఁగం దగు లేనిచో జగం
బున సుకృతాఘము ల్నరక మోక్షపదంబులు గల్గవం చనం
జను నుచితజ్ఞ సంతతి నసంశయవాక్యవిజృంభణంబునన్. ఆ-౨

చ. చని సెలయేటి మొత్తములఁ జందనశైలమరుద్విలోల కాం
చనకురువిందచందనరసాలముఖద్రుసవీథిగోస్తనీ
ఘనతర కాయమానములఁ గప్రపుఁదిన్నియలన్ లతానికే
తనముల సంచరింపుచు నతండు పరాత్పర చింతనంబునన్. ఆ-3

ఉ. వార లవార్యకౌతుకనివాసమనోంబుజులై జగజ్జనా
ధారు నయప్రచారు సముదారుని నమ్మరియాకుమారునిన్
భారపుస్నీవక్రమానున విపద్దశలం బొరయించినట్టిని
ష్కారణవైరులన్ సరకుగాఁ గొన కించుక యెల్లదిక్కులన్. ఆ-౪

---

26. కనుపర్తి అబ్బయామాత్యుఁడు

ఈకవి యాఱువేలసియోగిబ్రాహ్మణుఁడు; రాయన మంత్రి పుత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు. ఈతనితల్లి నరసమాంబ; అన్న యోగానందము. ఈకవి యనిరుద్ధచరిత్రము, కవిరాజమనోరంజనము అను రెండు ప్రబంధములను రచియించెను. ఇందు మొదట రచియింపఁబడిన యనిరుద్ధచరిత్రములో—

ఉ. నిండుమనంబు సత్యమును నీతియు శాంతియుఁ గల్గి ధర్మిమం
తుం డయి భోగభాగ్యములతోఁ జెలువొందుచుఁ గొండనీటిభూ
మండలనాయకు ల్మగుల మన్ననచేయఁగఁ బెంపుమీఱఁ స
త్పండితుఁ డబ్బమంత్రి కనుపర్తి పురాన్వయవార్ధి పూర్ణచం
ద్రుం డని లోకు లందఱు నెఱుంగఁగ నున్నతిచేయ నేటికిఁ.

అని కవి తనతాతయైన యబ్బయ్య కొండవీటిరాజుల మన్ననలొందినట్లు వ్రాసికొనెను గాని యాతని కాలమునాటికిఁ గొండవీటి రాజ్యము తురుష్కులయధీన మయినది. ఈహేతువుచేతఁ కాబోలును కవి కవిరాజమనోరంజనములో—

చ. సుగుణకదంబ మెల్ల నొకచోటనె కాపుర మున్నయట్లుగా
నగునని వేయినోళ్లఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁడై
తగు కనుపర్తియబ్బనకుఁ దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకున్
బొగడిక కెక్కి రిద్దఱుసుపుత్రులు రాయన నిమ్మనాహ్వయుల్.

ఉ. వేయనవచ్చుఁగాక సుళువే యనపాయవదాన్యవై భవం
బాయనవద్యబుద్ధి తగు నాయనకే యసఁగీర్తిచంద్రికల్
గాయ నయస్వగీతికలు గాయనశీలురుపాడ నొప్పి మా
రాయనమంత్రి మేలు బళిరాయన సూరిజనాభివంద్యుఁడై.

అను పద్యములయందుఁ దనతండ్రి తాతలు కొండవీటిరాజుల

యొద్ద నున్నట్లు చెప్పక తనతాతకు ముత్తాతయైన బసవమామాత్యుఁడు మాత్రమే కొండవీటిరాజులమంత్రియైన ట్లీక్రింది పద్యమునఁ జెప్పెను-

శా. శ్రీపేర్మిక శశివోలె బ్రహ్మకులవార్ధిం బుట్టి కొండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుండై రామసింహాసనా
ధ్యోపేతస్ఫుట కొండవీటిపురరాజ్యోర్వీశ్వరు ల్మంత్రిగాఁ
జేపట్టన్ బసవప్రధానుఁ డిల మించెన్ భాగ్యసంపన్నుఁడై.

కవియొక్క తండ్రి తాతలు కొండవీటిసీమలోని కనుపఱ్ఱుగ్రామమునకు కరణములని తోఁచుచున్నది. కవికి మంగళగిరిలోనున్న పానకాలరాయుఁ డిష్టదైవతము. మంగళగిరి కృష్ణామండలములో గుంటూరునకు సమీపమున నున్నది. అబ్బయామామాత్యుఁడు పదునెనిమిదవ శతాబ్దిమధ్యమున నుండినవాఁడు. ఇతఁడు ౧౭౮౦ వ సంవత్సరప్రాంతమువఱకును జీవించి యుండవచ్చును. ఇతఁ డాశతాబ్దమునం దుండిన ప్రబంధకవీశ్వరు లందఱిలోను మిక్కిలి ప్రౌఢుఁడు. వసుచరిత్రమునకుఁ దరువాత నీతని కవిరాజమనోరంజనముతో సరిపోఁగఁదగిన ప్రబంధము లొకటి రెంటికంటె నెక్కువగా లేవు. కవిరాజమనోరంజనములోని యీక్రింది పద్యమువలనఁ గవి సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁ డయినట్లు కనఁబడుచున్నాఁడు—

క. శ్రీమంగళగిరి నరసిం । హామే యక్కృపావిజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడఁ గానకళా । ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడఁ గ.

కవిరాజమనోరంజనమునకుఁ బూర్వచరిత్రమని నామాంతరముగలదు. బాల్యమునందు రచియింపఁబడినదగుటచే ననిరుద్ధచరిత్రము పూర్వచరిత్రమంత ప్రౌఢముగా లేదు. ఈరెండు పుస్తకములనుండియు గొన్నిపద్యముల నుదాహరించుటకన్నఁ గవి విషయమున వ్రాయఁదగిన విశేషాంశము లేవియుఁ గానబడవు.

అనిరుద్ధచరిత్రము.

చ. విచికిలగంధియున్ విభుఁడు వేడుకతోఁ దెర రెండువై పులన్
రుచిరకటాక్షపంక్తులమెఱుంగులు నిండఁగ నిల్చి రయ్యెడన్
బ్రచురతరానురాగరసబంధురతం దెరచీర దూరి పా
ఱుచుహృదయాబ్జముల్ మొగమెఱుంగనిచుట్టికిఁబుసేయఁగన్. ఆ-౧

ఉ. కన్నులతెప్ప లాఁగనివికాసపుఁజూపును మానముద్రతో
నున్న మొగంబు నిశ్చలత నొప్పుశరీరముఁగాఁ బటంబుపై
నున్నతలీల వ్రాసినప్రియుం గని సొక్కుసఁ దాను నట్లయై
చిన్నెలు దక్కియుండె సఖి చేసినజంత్రపుబొమ్మకై వడిన్. ఆ-౨

ఉ. మీసముతీరుజూచి, జిగిమేని పటుత్వముఁజూచి మోములో
హాసముఁజూచి చేతులయొయారముఁజూచి మనోజ్ఞ రూపరే
ఖాసమలీలఁజూచి యహహా యనుచుం దలయూఁచి ముందు తా
వ్రాసినభావ మెంచి తల వంచుకొనెం జలజాక్షి సిగ్గునన్. ఆ-౩

చ. అనవుడు మందహాసముఖుఁడై హరి నీభుజశక్తి నీవె నె
మ్మనమున లజ్జలేక పలుమాఱును మెచ్చుకొనంగ నీతియే
యని మొన నిల్చినప్పుడు నిరర్థక మీవెడమాట లేల నాఁ
కొని భుజియింపఁబోవుచును గూరలమే లడుగంగ నేటికిన్. ఆ-౪

ఉ. భూసురవేదనాదములఁ బుణ్యసతీజనమంజులోక్తులన్
భాసురవృత్తగీతరసబంధురరావములం బురీవనీ
వాసశుకానులాపముల వారణబృంహితవాజిహేషలన్
శ్రీసముదంచితం బగుచుఁ జెల్వు వహించెఁ బురంబు నవ్యమై. ఆ-౫

కవిరాజమనోరంజనము.

చ. కొడుకులు గల్గుదాఁక నొక కొన్నిదినంబులు చింత నందనుల్
పొడమిన నాయువు స్బలము బుద్ధియుఁ జాలఁగల్గఁగా
నుడుగనిచింత కల్గి తను నోలభజింపనిచింత తండ్రి కె
ప్పుడుఁ గడుచింతసేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే. ఆ-౧

సీ. ధర నల్పులకుఁ బ్రభుత్వంబు వచ్చిన మనుష్యుల వికారపుఁజూడ్కిఁ
జూచినట్లు
పల్లవు ల్తుది లేమిపడి యింటిచాయరా మొగిలఁజెత్తల్లులు మూల్గినట్లు
పరదేశియతిలోభపరునియింటికిఁ బోవఁ దెగికోఁతివలెను గద్దించినట్లు
వంతువాసికి హీనవై శ్యులు తమలోన నేకంబుగాఁ గలహించినట్లు
త్తెరలి యొండొకఁటిని రూక్షదృష్టిఁ జూచు
గొఱగొఱను మూల్గు గద్దించుఁ దటిమి తటిమి
కవిసి కలహించి భీకృతి కలకలముగ
జాగిలమ్ములు రోషభీషణము లగుచు. ఆ-3

చ. కర మనురక్తిఁ గొమ్మ కరకంజమునం దిడి మీకుఁ బాలుఁ జ
క్కిరలును బెట్టి పెంచి వలికింపుచు మాటలు నేర్పినందుకా
విరసపుఁగూఁతల న్నిగుల వేదన గొల్పెద రింతి కియ్యెడఁ
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారమ కీరవారమా. ఆ. 3.

ఉ. నిప్పులురాలు గ్రీష్మమున నిక్కినగాడ్పులు వార్షికంబునఁ
జప్పుడుసేయకే మరలసాఁగెఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటిపొంగుచేఁ బ్రజలు నాపదఁ బెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నబోయి మరలం జనుచుందురుగాదె నుప్పిభుల్.

చ. మలయజగంధి తాళపరిమాణమనోహరరాగగీతికా
కలనినదంబు జంత్రమున గాత్రమునఁ జెలఁగింపు నింపుచే
శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె చారువుల్
పొలుపుగ నంకురించె మృగముల్మదిఁ జొక్కు వహించె నింతయున్-ఆ.ర

మ. తగునే రాజకుమార మన్మథ మనస్తాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలివిగదా వారాంగనా స్నేహమో
హగుణంబు ల్బహలాయతాయతము లెంతైన స్నతం బేలగ్గ్
నగరే లోకులు నీమనం బిటులు మగ్నంబైన రాగాంబుధిన్—ఆ.గి.

27. కాణాద పెద్దనసోమయాజి

ఈ కవి నిజామురాజ్యములోని గద్వాలసంస్థానాధిపతియైన ముష్టి పల్లి సోమభూపాలుని ప్రేరణముచేత ముకుందవిలాసమును, అధ్యాత్మ రామాయణమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; ఆత్రేయ గోత్రుఁడు; తిమ్మనార్య పుత్రుఁడు. సోమభూపాలుఁడు తన్నుఁగూర్చి పలికినట్లు కవి చెప్పుకొన్న ముకుందవిలాసములోని యీ క్రిందిపద్యములలో "శేషశై లేశలీల" అను నామముతో అపంచవర్ణీయ చిత్రకృతి మొదలయినవానినిగూడఁ దాను రచించినట్లు చెప్పెను గాని యవి యిప్పుడు కానరావు—

సీ. ననునందవరపురాన్వయపయోనిధిచంద్రుఁగాణాదవంశవిఖ్యాతిసాంద్రు
నాశ్వలాయనసూత్రు నాత్రేయమునిగోత్రు సకలవిద్వత్ప్రవిప్రవరమిత్రు
ప్రౌఢలక్ష్మీపతిపండితసోదర్యు బాహాటగ్రంథానుభావధుర్యు
వేదశాస్త్రపురాణవివిధమర్మజ్ఞురీణు వరచతుర్విధకవిత్వప్రవీణు
భోజచంపూప్రబంధార్థబోధనాను
బంధగీర్వాణటీకానిబంధనాది
శేషలవచోరచనచర్యు పెద్దనార్యుఁ
గాంచి దయమించి పలికె సగౌరవముగ.

గీ. కాదివర్ణంబు లిరువదియెదువిడిచి। చేసితి నపంచవర్ణీయచిత్రకృతిని
శేషశై లేశ లీలాఖ్యచే నెసంగ। యాదిమితవర్ణనియతి శక్యంబుజగతి?

ఉ. శ్రీరమణీ యతఁ సురపురీనగరీసగరీ యదేశభూ
భారఘురీణుఁ డాబహిరిపామనృపాలు సభాంతరంబునన్.
మారమణాంకితంబులుగను మత్స్యపురాణ మొనర్పఁ బూనవే
సారసుధాప్రసారవిలసత్కృతి నాంధ్రవచశ్చమత్కృతిఁ.

ఈ కవి సంస్కృతాంధ్రములయందు బహుసమర్థుఁడు. ఈతని గ్రంథములలో నున్నన్ని శబ్దాలంకారములును చిత్రబంధకవిత్వ పద్యములును మఱి యేకవిగ్రంథములోను లేవు. ఈతనికవనము రసవంతమయి కవిజన హృదయరంజకముగా నుండును. తన కవిత్వమును గూర్చి వెన్నెల కంటి వేంకటపతి యీ క్రిందిపద్యమును జెప్పినట్లు కవి తన యధ్యాత్మ రామాయణమునందు వ్రాసికొనియున్నాఁడు—

ఉ. ఇద్దఱుజోడు నన్నకవి యెట్టిన, తిక్కన సోమయాజి దా
నుద్దగు వారికిఁ, ముఱుగు కొక్కఁడె దీటగు నల్లసానిమా
పెద్దన, వారితోడుతను బేరువహించిన శ్రీకణాదముం
బెద్దనసోమయాజి విను పెద్దనఁ బొల్చుఁ గవిత్వసంపదన్.

ఇట్లితరులు పొగడనట్లు చెప్పుటయేకాక కవి తానును తన ముకుందవిలాసము నిట్లు పొగడుకొన్నాఁడు—

గీ. ఇంపు సకలహితము నిచ్చు మున్విష్ణు చి
త్తీయతుల్యమౌ మదీయకవిత
యుదుటఁజేవఁ దొలువనులిఁగోలు నళిమోము
మృదువుగాదె విరులమీఁద వ్రాలి?

క. ముకుందవిలాసముతావి ము
కుందవిలాసము నదాముకుందవిలాసం
బిందువిలాసమును సుధా
బిందువిలాసము హసింపుఁ బేశలఫణితిన్.

ఈకవి కాలముగాని కృతిపతి యనఁదగు పెదసోమన్యపాలుని కాలముగాని నిశ్చయముగాఁ దెలియలేదు. అయినను

ఉ. నన్నయభట్టు భీమన ననంతు నధర్వణుఁ దిక్కనార్యుఁ నె
ఱ్ఱన్నను సోము భాస్కరుని నయ్యలు నై షధకావ్యకర్తఁ బో

తన్నను బిన్నవీరునిఁ జిన్నను సూరప రామభద్రుఁ బె
ద్దన్నను దిమ్మనార్య గరుడాంకుని మూర్తి సుకీర్తి నెంచెదన్.

అని బట్టుమూర్తివఱకును గలకవుల నీకవి పొగడి యుండుటచేత నీతఁడు పదునాఱవ శతాబ్దాంతమునకును పదునేడవ శతాబ్దాదికిని దరువాత నుండినవాఁ డయినట్లు స్పష్టమగుచున్నది. ముప్పిడిపల్లి సోమన్నపాలునితాత మొదలయినవారు మహమ్మదీయులతో యుద్ధముచేసి వారిని జయించుట మొదలయిన సంగతులు చెప్పఁబడి యుండుటచేత నితఁడు పదుఁనేడవ శతాబ్దాంతమునందో పదునెనిమిదవ శతాబ్దారంభమునందో యున్న ట్లూహింపఁ దగియున్నది. గద్వాలసంస్థానమునందున్న మామిత్రులకొకరికిఁ గవికాలవిషయమునుగూర్చి వ్రాయఁగా ౧౭౫౦ సంవత్సరప్రాంతములయం దుండినట్లు తెలిపి యున్నారు. ఇందలి కవిస్తుతిలోఁ బేర్కొనఁబడిన యయ్యలు రెట్టమతమును జేసినతఁడే యయినపక్షమునఁ గవి ౧౭౭౦ వ సంవత్సరమునకుఁ దరువాతఁగూడ నున్నట్లు చెప్పవలసి యుండును. ముకుందవిలాసమునకు భద్రాపరిణయ మని నామాంతరము గలదు. కవికృతములయిన రెండు గ్రంథములనుండియుఁ గొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ముకుందవిలాసము.

ఉ. ఆటలు పాటలుం గలుగునందపుగందపుఁగూటవాటముల్
కోటలు పేటలుం బసిఁడిగోడలు మేడలుఁ గల్వవింధురా
చోటులు నీటులుం గులుకుచుక్కను జుక్కను నిండుఁజెల్వపుం
బోటులమేటులం దగినపొన్నలచెన్నులు గల్గువీటిలోన్. ఆ.౧

ఉ. చేరలఁగొల్వవచ్చు దయచిప్పిలు గొప్పకుగొప్పకన్నుల్క
మూరలఁగొల్వవచ్చుఁ గడుముచ్చట లిచ్చువెడఁదవక్షుమ్ముల్
బారలఁగొల్వవచ్చుఁ గచపాళి బళీ హరికి న్సమీపపున్
మేరలఁగొల్వవచ్చు నిఁక మే లిత ఁడీగతిఁ బ్రీతిఁ జేసినన్. ఆ.౨

ఉ. కొనునకొనభంబుసరి కావిజగావిలసిల్లుమోవికిం
పానఁగఁ బొనకంబు సమ మానన మాననవిల్తు మేనమా
మే ననమేనినం గనకమేనన మిాననఁగన్గవందగున్
వేనలివేనలిన్వీరుల వేయుఁజువే యువతీమతల్లికిన్. ఆ-3

మ. తనరన్ వ్యాకరణజ్ఞుఁ దండ్రియనుచుం దర్కజ్ఞునిఁ భ్రాతయం
చును మిామాంసకునిఁ నపుంసకుఁ డటంచు నీ్వడి దూరంబునం
గని యస్పృశ్యునిఁబోలె ఛాందసుని వేడ్కఁం గావ్యలీలారస
జ్ఞు నిజేచ్ఛం గవితావధూమణి వరించుఁ భావగర్భంబునఁ. ఆ-ర

అధ్యాత్మరామాయణము.

సీ. సంసారదావాగ్ని సంతప్తులకు సుధాస్తోమవర్ష నియుక్తి రామభక్తి
తాపత్రయామయతాపపీడితులకు రమ్యభేషజయుక్తి రామభక్తి
పంచమహాపాపపటలసర్పములకు రచితగారుడశక్తి రామభక్తి
భవవిపదాద్వారాశిపాతభీతులకును బ్రబలతరీయుక్తి రామభక్తి
ప్రేమబోధితగురుసూక్తి రామభక్తి!కామితాత్మజనాసక్తి రామభక్తి
శ్రీమదురుసంప దనురక్తి రామభక్తి!సామరస్యోదితవిముక్తి రామభక్తి.
బాల.

చ. సారిదిఁ గళత్రపుత్రపిత్రసోదరబాంధవముఖ్యసంగమం
బరయ నదీప్రవాహపతితాగతకాష్ఠములట్ల కూడుచున్
బరిపరివీక్షు నై జము ప్రపాగతజంతులఁబోలె మోహముఁ
బొరయకయుండఁగావలయుఁ బోవుచునున్నెడవచ్చుచున్నెడన్. అయోధ్య.

ఉ. అంతట దైత్యకాంతుఁడు సురాదివిరోధి సరోధిదాటి య
త్యంతవిభాకలంకను శుభాంకను లంక నశోకకాననా
భ్యంతరసీమలో నిలిపె నాసురకాంతలు కాచియుండఁగా
సంతతపూత సాధుగుణజాతను నాశ్రితజాత నెంతయున్. ఆరణ్య.

ఉ. అంచలుపాఱఁ గేకులకు నాటలుగేరె ఘనంబు లూఁరేఁ గ్రొ
మ్మించులుకూరె శీతలసమీరమువారె మరుండు చేరి ము
న్మించుగ జాతిబాణతతి మాఱె నటం బధికాళిధైర్యముల్
గ్రించుకజాఱె మాఱె నలగ్రీష్మము మీఱె జలాగమం బిలన్.
కిష్కింధ.

చ. కమలవిరోధి కామజయకారి కిరద్యుతికీర్తనీయుఁడున్
కుముదహితుండు కూటమృగగోప్తకృతాంకుఁడు కల్పసత్కళా
క్రముఁడును కేళవేక్షణము కైరవిణీశుఁడు కోకభేదనా
గమనుఁడు కౌముదీకరుఁడు కంధిభవుం డుదయించెఁ దూర్పునన్.
సుందర.

ఉ. దానవనాశనార్థముగఁ దత్పతిఁ దెచ్చితి వీవును న్మహా
మానము నామిషం బనుతమి విషపిండము గ్రోలిసోలు నె
ట్లానెఱి నామహీసుతసమాహరణం బొనఁగూడె మీఁదటన్
గా నగునట్టికార్య మదికానగుచున్నది దానవాగ్రణీ. యుద్ధకాండ.

మ. శ్రవణానందకరంబు సుందరముగా షడ్జాదిసప్తస్వరా
ర్జవమున్ జాతిగతుల్ త్రికాలకలితస్థానత్రయీపూర్ణమా
ర్గవిధుల్ తోఁపఁగ వల్లకీచతురతన్ రంజిల్ల గాంధర్వసా
రవిదుల్గాన మొనర్చి రాకుశలవుల్ రామాయణం బాసభన్. ఉత్తర.

---

28. కుందుర్తి వేంకటాచలకవి

ఈ కవి మిత్రవిందాపరిణయమనెడి యూరాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు, అపస్తంబసూత్రుఁడు; శాండిల్యగోత్రుఁడు; రామయామాత్యపుత్రుఁడు. ఈతని తాతయైన గోవిందామాత్యుఁడు ౧౬౫౦ వ సంవత్సర ప్రాంతములయందు రాజ్యముచేసిన వీరవేంకటపతిరాయలవద్ద నుండి, భారతీపరిణయమను కావ్యమునుజేసి యాతనిని మెప్పించినట్లు కవి యీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు—

ఉ. పటుతరగోష్ఠ నీమధురపాకసమంచితమై రసోర్మిప
ర్యటమగుభారతీపరిణయం బనుకావ్య మొసంగి వీరవేం
కటపతిరాయలం దనిపి కాంచె మణీకనకాభిషేక ము
త్కటగతి నమ్మహామతి సుఖస్థితిశోభి యశోభిరాముఁడై.

ఈ కవికాలమునాఁటికి విజయనగర సంస్థానప్రభువులు మిక్కిలి హీనదశకు వచ్చినందునఁ గవి ఈ రాజ్యమునువిడిచి పాండ్యమండలమును జేరి మధురలో నుండినట్లు తెలియవచ్చుచున్నది. గ్రంథావతారికలోఁ దాను పాండ్యమండలాధీశ్వరుఁడయిన విజయరంగ చొక్కనాథునిఁ గవిత్వము చెప్పి మెప్పించినట్లు కవియే యీ క్రింది పద్యములలో వ్రాసికొని యున్నాఁడు—

సీ. చదివినా వే మేమి చదువయోగ్యంబులో
యవియెల్ల నిశ్శంశయంబుగాఁగ
కావ్యములుగా రచియించినావు భా
శభాగవతములు రామకథయు
పాకముగ బహు
నమున్నతిఁజెలంగఁ

జాటించినావు దిక్కోటరంబుల బుధ
కోటిమెచ్చ నపారచాటుకృతులు
నర్థగుంభసముజ్జృంభితాశుమధుర
చిత్రవిస్తరకవితా ప్రసిద్ధి నీకు
సహజమేకద పాండ్యభూజానిసభగ
థాశుకవియసగీర్తి జెన్నలరినావు.

చ. కవిజనకల్పకం బఖిలకావ్యరసజ్ఞు డఖండపాండ్యభూ
ధవుడు మహానుభావు డతిధార్మికు డార్యగవజ్రధారి యై
న విజయరంగచొక్కనరనాథుడు నీ కవితాసమగ్రవై
భవములు మెచ్చి నీ కొసగె భర్మ మణిశిబికాదిసంపదల్.

పయిపద్యములనుబట్టి యితడు కొన్ని నాటకములను మాత్రమే కాక భారత బాగవత రామాయణములను వచనకావ్యములుగా గూడ రచియించినట్లు విశదమగుచున్నది. ఇతడు మాత్రమేకాక యితని కాలమునందుండిన యితరకవులనేకులు కూడ దాము వచనకావ్యము లను రచియించినట్లు తమ ప్రబంధములలో వ్రాసికొనియున్నారు. ఈ వచనకావ్యము లన్నియు మాకు దొరకకపోయినను, ఈ కాలములో రచియింపబడిన వచనకావ్య మొకటిమాత్రము మాకు లభించినది. ఆ వచనకావ్యమునుగూర్చియు దత్కర్తనుగూర్చియు నింతకుముందే కొంత వ్రాయబడెను. పయి నుదహరింపబడిన వానిలోని కడపటిపద్య మునుబట్టి కవికాలము సహేతము స్పష్టమగుచున్నది. విజయరంగ చొక్కనాథుడు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సం
త్సరమువఱకును రాజ్యముచేసి విద్వాంసుడై యాంధ్ర
బ్రోత్సాహము చేసినవాడగుటచేతను, అతని

యున్నట్టు తెల్లమగుచున్నది. కొంతకాలమునుండి యీతని పూర్వకవు లాచరించుచు వచ్చిన యీచారమును మానక యీ కవియు రంగ నాథుఁడు తనకు స్వప్నమున సాక్షాత్కరించినట్లే క్రింది పద్యమున వ్రాసి కొనియున్నాఁడు—

ఏ నీలమేఘముడాలు చాలునించుఁగుఁజాలు
మేనువాఁడు జగంబు లీనువాఁడు
వేల్పురాజాతల్పు విప్పుటందమదల్పు
ఓమ్మువాఁడు కళాభరమ్మువాఁడు
వెలలేనిబంగారు వేవన్నెరంగారు
చేలవాఁడు మనోజ్ఞలీలవాఁడు
కడకంట సొంపారుకరుణారసముమీఱు
చూపువాఁడు భవంబుఁబాపువాఁడు
హీరకటకకిరీట కేయూరహార
హారమంజీరచాకచక్యములవాఁడు
కలనొకానొకపురుషుఁ డుత్కలికదొలుకఁ
బ్రేమ నాప్రెమోల వేకువజామువేళ.

గ్రంథమునం దక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకము లుండుటచేత నీతఁడు లాక్షణికకవి కాకపోయినను, మొత్తము మీఁద నీతనికవిత్వము రసవంతముగానే యున్నది. మిత్రవిందాపరిణ యములోని రెండుమూఁడు పద్యముల నిందుదాహరించుచున్నాము—

చ. అని వనితోక్తియుక్తిగతి నవ్వని జవ్వనిగుంపుసొంపు, జే
కొని తనివార సౌరభము గ్రోలుచు సోలుచు మిన్నగన్న క్రొ
న్నన లనవద్యహృద్య కల నన్గని కన్గొని తావిమాని పెం
పొనరినమేర, గీరరుతు లూకొని తూకొనినంత వింతగన్. ఆ-౨

ఉ. సారస మా మొగంబు జితసారస మాగమనంబు నాభికా
సారసమాభ మాకచమసారసమాజము మేఘు మాసుధా
సారసమావృతంబు నుడి సారసమానము తన్నతంబ మా
సారసమానసీయసువిసారసమాయత మాదృగబ్జముల్. ఆ. ర.

చ. కనియె నుదారుఁ జారుతరకౌస్తుభహారు సుమేరుధీరు జీ
వనదశరీరు దుగ్ధమయవార్ధిగభీరు దురాపసారులో
చనసుఖదావతారు ఖలశైలశతారు నఘౌఘదూరు స
ద్వినుతయశోవిహారు వసుదేవకుమారు నతాబ్జసూర్యకున్. ఆ. ఉ.

---

29. ఈదురుపల్లి భవానిశంకరుఁడు

ఈ కవి ధర్మఖండమును దెనిఁగించెను. ఇతఁడు కూచిమంచి తిమ్మ కవిత్వోను వక్కలంక వీరభద్రకవితోను సమాకాలికుఁడయినందున, ఇతఁడును పదునెనిమిదవ శతాబ్దారంభమునుండి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతములవఱకును జీవించియుండును. ఈ కవి తన ధర్మఖండమున వక్కలంక వీరభద్రకవినగూర్చి వ్రాసిన "హరిశౌర్యుండగు" నను పద్య మిం వఱకే యుదాహరింపఁబడియున్నది. దిట్టకవి వేంకటరాయకవి తన విద్యాగురువై నట్లు కవి ధర్మఖండమున నీక్రింది పద్యముచేఁ జెప్పుకొని యున్నాఁడు—

ఉ. శ్రీమయవాగ్విలాసుఁడు నశేషలిపిప్రవణుండు భూరిశో
భామహనీయమూర్తియుఁ బ్రబంధనిబంధనబంధురక్రియా
భామహితోరుసూత్రుఁడు నృపాలకపూజ్యుఁడు నంచుఁ దన్బుధుల్
వేమఱు నెంచ దిట్టకవి వేంకటరాయకవీంద్రుఁ డొప్పగున్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు, శంకరామాత్య పుత్రుఁడు. కవి తాను శృంగారమంజరి యను

కావ్యమునుగూడ రచించినట్లీక్రింది పద్యమునఁ జెప్పుకొనెను గాని మా కా గ్రంథము లభింపలేదు—

సీ. ధాత్రి భారద్వాజగోత్రపవిత్రుఁడై సురుచిరాప స్తంబసూత్రుఁ డగుచు
నిరతాన్న దానాభిరతుఁడౌ నీదురుపలి నరసమాత్యపౌత్రవరుని
సంతతపూజితశంకరుం డగుశంకరామాత్యమౌళికి నాత్మభవునిఁ
బ్రాజ్ఞుని నచ్చమాంబాగర్భశుక్తిముక్తాఁమణి నీశ్వరధ్యాననిరతు
భవ్యశృంగారమంజరీకావ్యరత్న
మంధ్రభాష నొనర్చినయనఘచరితు
శంభునిభుఁడై నయివటూరి శంభుశిష్యు
ను భవానీశనామముఁగన్గొనుచుఁబలికె.

ఈ కవి రచియించిన గ్రంథము సమగ్రముగా దొరకలేదు గాని దొరకినంతవఱకుఁ గవనము రసవంతమయి మధురమయి నిర్దుష్టముగా నున్నది. ధర్మఖండమునుండి రెండుమూడు పద్యముల నిందుదాహరించుచున్నాను—

చ. అనవిని వానిఁజూచి మునులాగయుఁ బుత్రకళత్రరక్షకై
యనయముఁ గ్రూరవృత్తిమెయి నర్థము నీవు గడించె దేని నీ
ఘనతర మైనకిల్బిషనికాయము భాగమువారు కొందురో
కొనరొ యెఱుంగఁదెల్పు మనికుంటితలీల నటించుఁ బల్కినన్.

చ. హరి భజియింపనై తి లలనావయవామితవర్ణనాప్తి న
స్థిరమతి నర్థిలోభరతిఁ జేయుఁగనై తిఁ బరోపకార మి
ద్ధర శతతాదయాకఠినతాగుణము ల్సహజంబు లయ్యె నె
ట్లరయుదు నీయపారకలుషాబ్ధికిఁ దారణయానపాత్రమున్.

చ. ఫలితతరుల్ ద్విజాతులకు భక్తి నొనంగుటయున్ గతోదక
స్థలములఁ బ్రాణిలోకము హితంబునకై సరసీతటాకముల్
నిలుపుటయున్ మహాత్ములకు నెంజిలి దీర్చుటయున్ దలంప నీ
యలఘుసుకర్మపంక్తులు తదవ్యయమార్గసుఖైకహేతువుల్.

30. ధూర్జటి వేంకటరాయకవి

ఇతఁడు రత్నావళీపరిణయ మనెడు నాలుగాశ్వాసములప్రబంధ
మును రచించి చేకూరి రామస్వామిమంత్రి కంకితము చేసెను. ఈకవి
కాళహస్తిమహాత్మ్యమును రచియించి కృష్ణదేవరాయల కాలములో
నుండిన ధూర్జటికవి వంశమువాఁడు. ఇతఁడు తన గ్రంథమునందు ధూర్జటి
నిట్లు స్తుతించి యున్నాఁడు—

మ. పటుగంగాలహరీతరంగసమశుంభత్ప్రోఢిశాంచత్కళా
ఘటనున్ బాదవినమ్రకృష్ణవరరాడ్గంభీరకోటీకవి
స్ఫుటరత్నద్యుతిపాటలీకృతపదాంభోజాతు సర్వజ్ఞు ధూ
ర్జటినిం గొల్చెద నస్మదీయకులక ర్తన్ భక్తి రంజిల్లఁగన్.

ఈధూర్జటిప్రౌఢుఁ డయినవేంకటపతి కృష్ణరాజవిజయమును
జేసెను. ఈవేంకటపతి కుమారుఁడును కవితండ్రియునైన లింగరాజు
కాళహస్తిరాజుల ప్రేరణముచేత మఱియొక పెద్దకాళహస్తి మహాత్మ్య
మును రచియించెను. రత్నావళీపరిణయమునఁ గవి తన తండ్రినిగూర్చి
యిట్లు ప్రాసియున్నాడు—

మ. ఘనగౌరీశకటాక్షలబ్ధకవితాగాంభీర్యసంతుష్టభూ
జనరాడ్దత్తసువర్ణచేలమణిభూషాగ్రామపల్యంకికా
ఘనదంతావళఘోటకాదిబహుసత్కారప్రతిష్ఠాత్ము మ
జ్జనకున్ ధూర్జటి లింగరాజకవిరాజశ్రేష్ఠుఁ గీర్తించెదన్.

ఈకవి పాకనాటి యార్వేలనియోగి బ్రాహ్మణుఁడు; భారద్వాజ
గోత్రుఁడు. ఇతఁడు తన్నుఁగూర్చి చెప్పుకొనుచుఁ దానింతకుమున్ను
నామలింగశాసన మనఁబడెడి యమరమునంతనుబద్యకావ్యముగా రచిం
చిన శ్లోకింది పద్యములలోఁ దెలిపియున్నాఁడు—

చ. స్థిరముగఁ గాళహ స్తిగిరిజేశవరాగతసంస్కృతాంధ్రసుం
దరకవనంబు వ్యాకరణనాటక కావ్యవిచక్షణత్వముఁ
గరిమవహింప భూవరశిఖామణు లెన్నఁ జెలంగి తౌర బం
ధురతనుకాంతిబాలరవి ధూర్జటి వేంకటరాయసత్కవీ.

మ. అమరం బంతయుఁ బద్యకావ్యముగ భవ్యంబై నయయ్యంధ్రభా
ష మహాపండితసత్కవిప్రజము మెచ్చన్ సాహితీకౌశల
క్రమ మొప్పన్ దృఢభక్తితోడుతను శ్రీరామాంకితంబై తగన్
రమణీయంబుగఁ జేసినాఁడవు బళీ ప్రఖ్యాతివాటిల్లఁగన్.

ఈకవి కాలనిర్ణయమునుగూర్చి కొంచెము విచారింపవలసి యున్నది. ఈతనితండ్రియైన లింగకవి తానురచియించిన పండ్రెండాశ్వాస ముల కాళహస్తిమహాత్మ్యమును కాళహస్తి రాజయిన దామెర్ల యక్కప్పనాయని పుత్రుఁడగు వేంకటపతిరాయని కంకితముచేసి యున్నాఁడు. అక్కప్పనాయని పుత్రుఁడయిన వేంకటపతినాయఁడు పదునెనిమిదవ శతాబ్దారంభమున నుండినవాఁడు. దీనినిబట్టి చూడఁగా కవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతమునం దుండినట్లు నిశ్చయింపవలసి యున్నది. అయినను మన మిప్పుడు నిర్ధారణముచేసిన యీకాలమున కొకబాధకము కనఁబడుచున్నవి. కవితండ్రియైన లింగకని తన కాళహస్తి మహాత్మ్యమునందు—

సీ. శ్రీకాళహస్తీశసేవనాన్వితచిత్త చిత్తజాకర లక్ష్మీవిహార
రమణీయశీల భారధ్వాజగోత్రపవిత్ర యాపస్తంబసూత్రమహిత
ధూర్జటివంశపాథోధిచంద్ర కుమారధూర్జటినామ విస్ఫూర్జితాంక
స్తుతమతి వేంకటపతితనూభవ లింగరాజకులేంద్ర ధైర్యాచలేంద్ర.

అను సీసపద్యములోఁ దాను కృష్ణవిజయము నొనర్చిన కుమార ధూర్జటికిఁ బుత్రుఁ డయినట్లు వ్రాసికొనియున్నాఁడు. ఈకుమారధూర్జటి తాను కృష్ణదేవరాయలకాలములోనుండి కాళహస్తిమాహాత్మ్యమును

రచించిన ధూర్జటికవికి మనుమఁ డై నట్లు తనకృష్ణరాజవిజయమున వ్రాసి కొని యున్నాఁడు. ౧౫౫౦ వ సంవత్సరప్రాంతమునందుఁ గృష్ణదేవ రాయలకాలములో నుండిన ధూర్జటికవి మనుమని కొడుకగు లింగకవి ౧౭౩౦ వ సంవత్సరప్రాంతమునం దక్కరాజు వేంకటపతి కాలములో ననఁగా నిన్నూఱుసంవత్సరములకుఁ దరువాత నుండుట పొసఁగనేరదు. కాఁబట్టి కుమారధూర్జటికి ధూర్జటి సరిగా తాతగాక తాతవరుసవాఁ డయియుండవచ్చును. అందుచేతనే కాఁబోలుఁ గుమారధూర్జటియే యొకచోట ధూర్జటిని దనపెదతాతనుగాఁ జెప్పుకొన్నాఁడు. ఈలింగ కవియుఁ దనతండ్రిని ధూర్జటి మనుమనిగాఁ జెప్పక 'ధూర్జటివంశవార్ధి చంద్ర' యని తద్వంశజునిగా మాత్రము చెప్పినాఁడు. కుమారధూర్జటి చినవేంకటాద్రీశ్వరుని యాజ్ఞాప్రకారముగాఁ దాను కృష్ణరాజవిజయము చేసితినని చెప్పుకొన్న చినవేంకటాద్రి నరపతి కృష్ణరాజవిజయకృతిపతి యగు కోదండరామరాజుయొక్క రెండవకుమారుఁడగు చినవేంకటాద్రి యైనచో నీకాలనిర్ణయ మించుమించుగా నరిపోవును. రత్నావళీ పరి ణయకర్తయగు వేంకటపతి కవిత్వము ప్రౌఢ మయి హృద్యముగా నున్నది. కవిత్వరీతిని జూపుటకయి కొన్ని పద్యము లిందు క్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి.

మ. మెఱుఁగుంబోఁడులు వీటసౌధచరలై మిన్నేటిబంగారుతా
మరపువ్వుల్ గ్రహియింపఁబోవ మదశుంభద్బంభరశ్రేణి త
త్తరుణీవక్త్రవితానముం గదియభీతస్వాంతలై కాంతలం
త రయప్రౌఢిఁ గవాటము ల్మొగుతు రుద్యన్మ్మగ్ధభావంబునన్. ఆ-౧

ఉ. ధన్యుఁడ వీవు సుమ్మసి ముదమ్మునఁబల్క సమస్తదేవమూ
ర్ధన్యుఁ డదృశ్యుఁ డై న మది రంజిలఁగా వసుభూతి యంత సా
జన్యసమేత యైననిజజాయయుఁ దాను సమస్తభోగస
న్మాన్యము నై జమందిర మమందగతిం జని చేరెఁ గూరిమిన్. ఆ-౨

చ. ఘనతరలక్షణప్రతిభగాంచిన రాజనటంచుఁ బద్మినీ
జనములఁ గుందఁజేసి యనిశంబు ద్విజప్రతతిం గలంపఁగాఁ
దనరు మహాప్రతాపమహితస్థితిఁ గాంచుచు వచ్చునట్టి న
య్యనకరమండలాగ్రహతి నెంతయు వెల్వాలనై తొలంగవే. ఆ-3

మ. చెలి రత్నేశ్వరు నొక్కనాఁ డిటువలెఁ సేవించి మోదంబుతో
లలన ల్మగ్గురు వెంటనంట నిజలీలామందిరాంచద్దిశా
స్థలిఁబోవఁ గ్రహియించె రక్కసుఁడు దోస్సారంబు మించంగ బె
బ్బులిచేఁ జిక్కకురంగుల ట్లతివ లింపు ల్దక్కి భీతిల్లఁగా. ఆ-4

---

31. అయ్యల రాజు - అయ్యల భాస్కరకవులు

అయ్యలరాజవంశసంభవు లయిన యయ్యలకవియు భాస్కర కవియుఁ జేరి కాలస్వరూపాదులను దెలిపెడి రెట్టమత మనుగ్రంథమును కన్నడభాషనుండి యైదాశ్వాసముల పద్యకావ్యమునుగా దెనిఁగించిరి. ఈకవు లిరువురును క్రీస్తుశకము 1282 వ సంవత్సరమునం దీపుస్తక మును దెలిఁగించినట్లుగా గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. కలియుగప్రథమభాగమునాల్గువేలయెన్మ్మదినూర్ల్మై నిడెబ్బదియునొకటి
శాలివాహనశక సమ లిల వేయునార్నూటఁగొంబదిరెండు రూఢిగాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వదిమూడు నేండ్లయ్యె నెంతయు
నెన్న బుధులు
అట్టికాలంబున నయ్యలభాస్కర కవివర్య లలరాజకమలహితుని
యాజ్ఞఁ బూర్వోక్త రెట్టమతాఖ్యకావ్య
మును నొనర్చిరి యీచంద్రముగను గీర్తి

వక్త్రశ్రోతలకునుగల్గ వసుధమీఁద
నల యహోబలనృహరికి నర్పణముగ.

కవు లీగ్రంథమును కొండ్రాజు పెదతిమ్మరాజునకుఁ బుత్రుడుఁను మంగయ గుర్వరాజునకు దౌహిత్రుఁడును నయినవేంకటరాజున కంకి తముచేసిరి. ఈవేంకటరాజు కర్నూలుమండలములోని యెల్లూపాలెము నకుఁ బాలకుఁడును అహోబలక్షేత్ర ధర్మకర్తయు నయినట్టును, అతఁడు కవులను బిలిపించి రెట్టమతమును దెనిఁగింపఁ బ్రార్థించినట్టును ఈపద్యములలోఁ జెప్పఁబడి యున్నది—

సీ. శ్రీమదహోబిలస్వామి మహారాజ్యరక్షకుం డగుచు నేరాజువెలయు
నభిరామకామందకాఖ్యసత్కావ్యరత్నమునకు నేరాజు నాథుఁడయ్యె
జానకీనాయకచరణసంసేవనప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల
నెరయూరిపురవరాధీశాదిబహుబిరుదాంకుఁడై యేరాజు యశముగాంచె
నతఁడు కొండ్రాజు తిమ్మభూపతివరేణ్య
తనయ పెదతిమ్మరాయవతంసగర్భ
వార్ధిచంద్రుండు సత్కులవర్ధనుండు
సతతవిభవుండు వేంకటక్ష్మావిభుండు.

క. ఒకనాఁడు నిఖిలకోవిద । సుకవిహితామాత్యబంధుసుతవీరభట
ప్రకరముకొలువఁగఁ గొలువుండి కథాప్రస్తావ మాత్మనివ్వటిలంగన్.

గీ. రాయకవియైన యయ్యలరాజవంశ్య
ననఘుఁబిననయక్కవిభుపుత్రునయ్యలాఖ్య
నాగఘనుసూను భాస్కరనామధేయుఁ
గరుణ దళుకొత్త రావించి గారవించి.

వ. తత్కాలోచితప్రసంగంబున నిట్లనియె.

గీ. ఘనతసుజ్ఞాననిధి రెట్టఘనుఁడు మున్ను
చెలఁగఁ గన్నడభాషను జెప్పినట్టి

శాస్త్రమంతయు నేను నీజనులుఁ బొగడఁ
దెనుఁగుభాష నొనర్పంగఁ దివురుఁడీరు.

ఈపుస్తకమునుబట్టి యీకవుల కాలమును నిర్ణయించుటకు మాత్రమే కాక తెనాలి రామకృష్ణుని కాలమును కనుఁగొనుటకు సహాయము కొంతయూధారము కానవచ్చుచున్నది.

రెల్లమతమును దెనుఁగించిన యీకవుల యింటిపే రయ్యలరాజు వారు. వీరిలో నొకఁడు పినయక్కయామాత్యపుత్రుఁడయిన యయ్యల కవి; రెండవయతఁడు నాగయామాత్యపుత్రుఁడయిన భాస్కరకవి. ఈకవుల కిద్దఱికి నెట్టిబంధుత్వమున్నదో తెలియరాదుగాని వీరన్నదమ్ముల బిడ్డలని తోఁచుచున్నది. వీరి పూర్వులలో నొకఁడైన తిప్పనార్యుఁడొంటిమెట్ట రఘువీరశతక నిర్మాణ కర్తయుఁడయి రాయల యాస్థాన కవిగా నుండెను; ఆతని మున్మనుమఁడయిన రామభద్రకవి రామాభ్యుదయమును రచియించెను. ఈకవుల కవిత్వము నిర్దుష్ట మయినది కాదు. ఈపుస్తకముగాక కామందకమునుగూఁడ గృతిపతి గృతినండె నఁట. కవనరీతిని దెలుపుటకయి రెల్లమతమునుండి కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. పూవులు నక్షతంబులును బొంపుగ దోయిటఁదాల్చి వానకై
భావములోన మానవుఁడు ప్రశ్నయొనర్పఁగఁ బట్టి యయ్యెడన్
వావిరి బేసిఁ గాఁ బలుక వారితవృష్టియుఁ గల్గునంభ్రు గో
త్రావలయంబునంఁ గవిరాజి నుతింపఁగ వేంకటాధిపా. ఆ-౧

ఉ. పాఱెడు బండిమ్రోఁతగతి బందులు చెల్వుగరొప్పురీతి వే
సారక గార్దభం బటుచుజాడను ఘంటలనాదమ్ముకై వడిన్
వారక తోముకుండలరవంబుగతిన్ స్తనితంబు పర్వినన్
ధారుణి వాన లేదనియె ధన్యుఁడు రెట్టఁడు ప్రాజ్ఞులెన్నఁగన్. ఆ-౭

చ. అమరగరుండు లగ్నమునయందు వసింపఁగ విత్తుట్ చతు
ర్థమున మెలంగఁ బైరు తటిత్తప్పకయుండుట సప్తమంబునం
దమరఁగ వేగ నాపయిరు లాయతపెట్టుట మంచి దెంతయున్
విమలగుణాఢ్య తిమ్మపృథివీపతి వేంకటరాజశేఖరా. ఆ-3

చ. రవితనయుండు రోహిణికరంబున నుండిన చైత్రకంబునన్
దవనము హెచ్చు మర్త్యులకుఁ దద్దయు ను బ్బెసఁగుం దెవుళ్లు సం
భవిలును గౌతమీనదిని బాటలు రాజిలు నన్యభూములన్
ధ్రువముగ వాన లే దనియెఁ బోడతనంబున రెట్టఁ డిమ్మహిన్. ఆ-ర

మ. బుధుఁ డబ్జాధిపుఁ డైన వానకురియున్ భూమండలిన్ రక్తధా
న్యధరల్ శ్రీలు ఘటిల్లు రాజుల ప్రజ ల్మన్నింతు రెందున్ సమ
స్తధరామర్త్యులకున్ శుభం బొదవుఁ గాంతాశ్రేణిపైఁ గూర్మి య
త్యధికం బాయువకోటికి న్వినుము ధన్యా వేంకటక్ష్మాధిపా. అ-గి

---

32. అజ్జరపు పేరయలింగము

ఒడయనంబివిలాస మనెడి స్థలపురాణగాథను దెనుఁగున నాటా
శ్వాసముల గ్రంథముగా రచియించిన యీకవి శైవుఁడైన యాఱువేల
నియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు పదునెనిమిదవ శతాబ్దమధ్యమునం
దనఁగా నిప్పటికి నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లు కను
పట్టుచున్నాఁడు. ఒడయనంబివిలాసముయొక్క యవతారికయందున్న—

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్దుగాంచి తా
నెమ్మి దలిర్పఁ గేసనకవీశ్వరు లప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్నసుత యెల్లమయందును బేరమూఖ్యుఁడ
న్నమ్మతిఁ గంటి వీరనగసమ్మను గంగనమంత్రి యుగ్మమున్.

అను పద్యమునుజూచి భ్రమించి యొక రీకవీశ్వరుఁడు బమ్మెర పోతరాజుగారి బావమఱఁదియని వ్రాసియున్నారుగాని యీయంశ మంతవిశ్వాసార్హమయినదిగాఁ దోఁచదు. పయిపద్యము నాయొద్దనున్న వ్రాఁతపుస్తకమునం దిట్లున్నను ముద్రితప్రతిలోఁ దప్పుల కుప్పఁగా నచ్చొత్తింపఁబడి యున్నది. ఇందుఁ జెప్పఁబడిన కేసనకవీంద్రుఁడు బమ్మెర పోతనామాత్యుని తండ్రియైన కేసనకాఁడు. తనతండ్రి కవీశ్వరుఁ డయినట్లు పోతన భాగవతమునఁ జెప్పుకొనియుండలేదు; తనకన్న యొకఁ డుండినట్లు చెప్పుకొనెనేకాని తోఁబుట్టినపడుచున్నట్లును జెప్పుకొని యుండలేదు. అంతేకాక, "తనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ" అని పోతన తనతల్లి లక్కమ యైనట్లు చెప్పుకొన్నాఁడు. ఈకేసన్న భార్య లక్కమాంబగాక యప్పమయైనట్లు కవియే వ్రాసియున్నాఁడు. అయి నను గవి మామగారు పోతనామాత్యుని తండ్రియైన కేసన యని సమ ర్థించుటకయి యొకరు పద్యములోని "కేసన కవీశ్వరు లప్పమనామ సాధ్వి" యన్న భాగమును "కేసనకవీంద్రుఁడు లక్కమసాధ్వి"నని దిద్దుట కయి సహితము ప్రయత్నము చేసినారు. ఈకవికి బమ్మెర పోతనామా త్యునివంటి కవిశ్రేష్ఠుఁడే బావయయి యుండినపక్షమున, అతఁ డాబం ధుత్వమును దెలుపుకొన కుండఁడు. కవి యీగ్రంథమును వ్రాయునప్పటి కీతని మనుమఁడుకూడ పెద్దవాఁ డయియున్నందున, ఆకాలమునకుఁ బోతన కవిత్వ మారంభింపని పిన్నవయసువాఁ డగుటచే నాతని బేర్కొన లేదని చెప్పుటకుసహిత మవకాశము లేదు. ఈకవి తనవంశమూల పురుషుఁ డైనకొండన గజపతియైన వీరనృసాలుసిచే గోదావరిమండ లములోని యజ్జరపుగ్రామము నగ్రహారమునుగాఁ బడసిన ట్లీక్రిందిపద్య మునఁ జెప్పియున్నాఁడు—

శా. శ్రీరంజిల్లఁ జెలంగుచున్న గజరాట్సింహాస నాధ్యక్షునన్
ధారాళంబుగ వేదశాస్త్రబహువిద్యాపూర్ణి మెప్పించి యా

వీరాగ్రేసరుఁ డియ్యఁ గొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిసు నజ్జరంబనఁగఁ దాఁ దెచ్చెన్మహాగ్రామమున్.

ఇందుఁ జెప్పఁబడిన వీరాగ్రేసరుఁడు—

మ. ధర కెంధూళులు కృష్ణరాయలచమూధాటీగతి న్వింధ్యగ
హ్వారము ల్దూఱఁగఁ జూచి తా రచటఁ గాపై యుండుటం జాల న
చ్చెరువై యెట్టిసి వింతచీఁకటులు వచ్చెం జూడరేయంచు వే
సారిదిం జూత్రురు వీరరుద్రగజరాట్ఛత్రాంతముగ్గాఁగనల్.

అని మనుచరిత్రమునందుఁ గృష్ణరాయనిచే నోడింపఁబడినట్లు చెప్పఁబడిన వీరరుద్రగజపతియేమో యని - యూహపుట్టుచున్నది. ఆయూహయే నిజమయినచో గవిపంశమునకు మూలపురుషుఁడయిన కొండన పదునాఱవశతాబ్దియం దుండియుండవలెను. కవి కొండన కేశవపురుషుఁ డయినందున నొక్కొక్కపురుషునికి ముప్పదేసి సంవత్సరముల చొప్పునఁ జూచినచో నీపేరయకవి ౧౭౫౦ వ సంవత్సరప్రాంతములయం దుండియుండును. పలివెల మొదలయిన గ్రామములయం దిటీవలఁ జేరినవేశ్యలను వర్ణించి యుండుటచేతను, పదునేడవశతాబ్దమునందలి కవుల గ్రంథములలోని పద్యములను జూచి యటువంటిపద్యములను జేసియుండుటచేతను, మఱికొన్ని కారణములచేతను బేరయకవి పదునెనిమిదవ శతాబ్దమువాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

చ. మొదలను బద్మసూతి నవమోహినులౌ తెఱఁగంటికొమ్మలఁ
ముదమునఁ దా సృజించి సుమనోహరమూర్తుల దక్షువాటికా
సుదతులఁ దానొనర్చి యట సొంపునఁ బల్వెల వారకాంతలన్
గదలక తా సృజించెఁ గరకౌశల మొప్పుచునుండ మానినీ.

అని పతివెల వారకాంతలు వర్ణింపఁబడిరి. పదునేడవ శతాబ్దారంభమున సారంగు తిమ్మన వైజయంతీవిలాసమున—

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కటియింటి కేగుచు, మఱొక్కని నానడుచక్కి నొక్కచోఁ
బొక్కికలంచి చూడ భ్రమఁ బొంది విటుల్తెలియంగలేరుగా
కెక్కడిసత్య మేడవల నెక్కడినేమము వారకాంతకున్ ?

అని వ్రాసిన పద్యము ననుసరించి యీపేరయకవి,

ఉ. ఒక్కని డాయరమ్మని మఱొక్కనిఁ గన్గొని ముచ్చటించి వే
ఱొక్కనిఁ బొంది రొక్కము మఱొక్కనిచేఁ గొని వేడ్కవారికిఁ
ఎక్కడుప్రేమ లుండ వలపించుట ధర్మముగాక యయ్యయో
యొక్కనియండె తా వలచియుండుట న్యాయమె వారకాంతకున్.

అని వ్రాసియున్నాఁడు. ఈయొడయనంబివిలాస మనుస్థలపురా
ణము విప్రనారాయణ చరిత్రమునుజూచి దానిని మించునట్లుగా కల్పింపఁ
బడిన కథయే యయినను, ఇందలికథ వై జయంతీవిలాసములోని కథ
కంచెను నెక్కువ నీతిబాహ్యమైనదిగా నున్నది. కవిత్వమునం దందలి
సారస్యమును నిందుఁ గానరాదు. ఇందుఁ దండ్రియే యొడయనంబికి
వలసినంత ధనమిచ్చి యది వేశ్యపాలుచేసి దానినెప్పుడును విడువవలదని
కొడుకునకు బుద్ధిచెప్పెను—

చ. నగవుదలిర్చుమోమున ఘనం బగువేడుక నివ్వటిల్లఁగా
నగపతిధైర్య మయ్యొడయనంబిని గాంచి బుధేంద్రుఁ డిట్లనున్
బగలును రేయి నిమ్మగువఁ బాయకయుండు మటంచు నీకు నిం
పుగ నిరతవ్యయంబునకుఁ బొందుగ నిచ్చెదనూఅనిపక్కుల్.

ఇందుఁ బాతివ్రత్యముకంటె వేశ్యావృత్తియే మేలయినదని ఈశ్వరుఁడే
బోధచేసెను—

సీ. సర్వస్థలంబుల సరస మాడఁగరాదు వలసినప్పుడు రతిఁ గలియరాదు

* * * *

ధాత్రిపై దంపతుల క్కెల్లఁ దలిరుబోఁడి

* * * *

సీ. మగనిచే బాధలు మామచేఁ బీడలు నత్తచే నాడిక లరయలేవు
మఱఁదులచేఁగొట్లుమఱఁదండ్రిచేఁదిట్లు వదినెల నరిపోట్లు బావపోట్లు
బంధుల కగపడు బాధ లింతయులేవు
* * * *
కావునను వేశ్యతనువొంద * *
నిహాముఁ బరమును దగఁ గల్గు నిందువదన. *

ఇందు వేశ్యావాటికలో అంకని పలికినవారి నందటినిబట్టి యముఁడు దండించునని చెప్పఁబడినది—

ఉ. పంకజపత్రనేత్ర విను పల్వేలలోపల వేశ్యవాటిలో
అంకని యెవ్వఁడేఁబలుకు రంగుగ వానినిబట్టి మ్రోఁద ని
శ్శంకను సారిదూత లురుచండ్రక ఠారకిలోరశూలబా
ణాంకవిశాలతోమరమహా త్తరహేతులఁ గ్రుంతు రెంతయున్.

ఇఁక జగత్తున దుర్నీతి యింతకంటెను బయికిఁబోవ్రట సాధ్యమగునా? ఈపుస్తకమునందు దుర్నీతి పారమును కడముట్టినదనియే చెప్పవచ్చును. భక్తుల మహిమలను జూపెడి యిటువంటిపుస్తకములే లోకమున కనంతమయిన చెఱుపును గలిగించుచున్నవి. ఈస్థలపురాణమునం దీశ్వరుఁడు బోగముదాని చంటిలోనే ప్రత్యక్షమయినట్లు చెప్పఁబడినది.

ఈపేరయకవి భారద్వాజసగోత్రుఁడు; కొండనకును బాపమాంబకును బుత్రుఁడు. అక్కడక్కడ వ్యాకరణదుష్టములైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమ్రోఁద నీతని కవనచాతురి శ్లాఘ్యమైనదిగానే యున్నది. ఒడయనంబివిలాసమునుండి మఱి మూఁడు పద్యములు నిం దుదాహరించుచున్నాను—

ఉ. ఎక్కడ మహేశుఁ డప్పురము నెక్కడవమ్రోఁతినఫాలదృష్టిచే
నొక్కటిగాఁగఁ జూచుచు మహోజ్జ్వలరూపిఁ బసిండికొండఁ దా

నెక్కుగఁబెట్టి దేవత లహీనగుణుండని సన్నుతింపఁగాఁ
దక్కరిదైత్యులం దునుము తత్సమయంబున శంభుకన్నుల్. ఆ-౭

చ. ప్రియతనయామణీ! చవుఁవు ప్రీతిసజెప్పినబాపనయ్యనున్
నయముగ నాటపాటల ఘనంబుగనేర్పినగాయకోత్తమున్
జయముగ సత్కవిత్వమును జక్కఁగనేర్పినసత్కవీంద్రునిన్
నయమునఁ బారితోషికమునం దనియించితి వ్యర్థ మయ్యెఁగా. ఆ-౮

ఉ. కమ్మనిగోఘృతమ్ము తెఱఁగంటికి నర్పితమైన యన్నమున్
దిమ్మనము ప్రసావళులుఁ దేనెతొనల్ బహుశాకపాకముల్
కమ్మనిపిండివంటలును గాంచనవర్ణము గల్గునప్పు మో
దమ్మునగవారలుం గుడిచి తద్దయు సన్నుతిచేసి రందఱున్. ఆ-౯

---

33. మరింగంటి సింగరాచార్యులు

ఈకవి దశరథరాజనందనచరిత్ర యనెడు నిరోష్ఠ్యరామాయణ మును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; మౌద్గల్య గోత్రుఁడు; తిరుమలాచార్యపౌత్రుఁడు; వేంకటాచార్యపుత్రుఁడు. ఈకవి తా నేకై కదినప్రబంధరచన ధురీణుఁడననియు, ఆంధ్రభాషా నిరోష్ఠ్యాది నింశతిప్రబంధసర్మాణుఁడ ననియు, ప్రాసికొనెను గాని యితఁడు రచి యించిన యితరగ్రంథము లేవియు నిప్పుడు గానరావు. ఇతఁడు నూట యేఁబదిసంవత్సరముల క్రిందటనుండిన ట్లీతని వంశమువారు చెప్పు చున్నారు. ఈకవి వాసస్థలము దేవరకొండసీమ. ఈతని కవిత్వము సల క్షణమై హృదయంగమముగా నున్నది. దశరథరాజనందనచరిత్రములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. కరిఘట లేల చిత్రగణికాచ్ఛట లేల హిరణ్యశాటికా
హరిధనధాన్యరత్నఘటితాచ్ఛదలంక్రియ లేల నల్దిశల్
స్థిరగతి నేలఁగాఁ దగినతే జది యేల యనేకచర్యలఁ
సిరిగలయట్టిసంతతిని జెందిన యాయెడ లెస్స లన్నిటఁ. ఆ-౧

చ. అనఘచరిత్ర నిన్గని జయక్రియఁ జెందితిఁగాన దాఁచకే
కనకకిరీటహారకరకంకణచిత్రకరత్నచేలచం
దనచేటికారజతదంతిశతాంగహయాదికాంక్ష లె
ల్ల నడిగినంతనే తనియు లాలన నిచ్చెదఁ గీర్తి హెచ్చుగఁ. ఆ ౨
చ. అని తృణలీలగాఁ దెలియనాడి తదాజ్ఞ ధరించి తాటకా
తనయనిశాచరాగ్రణి సదాగతి ధిక్కరణాచ్ఛశీఘ్రున
ర్తన ఘటియిల్లఁగాఁగదలి దండకకాననధాత్రి చేరఁగాఁ
జని ఖరహంతఁగాంచి దృఢసాహసహర్షరసాతిశాలియై. ఆ-౩

మ. అగజాజాని ననేకకంధరలచే నర్చించి జన్యస్థలీ
దిగధీశాదితినందనచ్ఛటల నర్థిగెల్చి శంకించకే
తెగి కైలాసగిరిం దృణాకృతిగ నెత్తెంగాన నీతం డహా
జగదారాధ్యత హెచ్చనేరఁడె సదాచారక్రియం జెందినఁ. ఆ-౪

మ. గద కేలన్ ధరియించి చండతరనిర్ఘాతాట్టహాసక్రియల్
చదలంటుం జరణాగ్రఘట్టనల నాశ లల్లడిల్లంగఁ దీ
వ్రదశఁ దీర్ఘదృగంచలాగ్నికణసంక్రాంతిం జలించంగ నా
త్రిదశాలిం గని కీశసేన యధికార్తిన్ డాఁగె నాయాయెడఁ. ఆ-౫

---

34. అనంతరాజు జన్నయకవి

ఇతఁడు రామకథాభిరామమను పదియాశ్వాసముల మహాకావ్య మును రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; జన్నపమంత్రి పౌత్రుఁడు; అమ్మయామాత్యపుత్రుఁడు. ఇతఁడేకాలమునందుండిన వాఁడో తెలియరాలేదు గాని నూటియేఁబదియేండ్లక్రిందటివాఁడయి యుండవచ్చును. ఈపుస్తకమునందలికథ శ్రీరామచరిత్రమూట. దీనినామ ముచేతనే తెల్లమగుచున్నది. ఈతనికవిత్వము నాతికఠినమయి మృదు పదగుంభితమయి కర్ణరసాయనముగా నున్నది. రామకథాభిరాముము లోని రెండుమూడు పద్యములు లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. శ్రుతులకు భూషణంబు లగుచుఁ బరమానుభవంబు గల్గు నీ
శ్రుతులకు నెల్లలోకములఁ జూచిన సామ్యము లేదు మాధురీ
గతుల సుధారసంబుచిలుకన్ ఘనమోహనసుస్వరైక సం
గతుల మహాద్భుతంబు గులుకన్ విలసిల్లెఁ బ్రయోగపాఠముల్. ఆ-౧

మ. వికచాంభోరుహచారులోచనకుఁ బర్వేం గాంతిమీఱఁ లలా
టికముక్తాఫలభాసురంబగుచు సూటిం దన్మఖేందూపచా
రకలాపాచరణంబుపొంచె ననుపారం జేరునట్లత్రమా
లికచందంబున నందమై కచతమోలీలాప్తతారాకృతిన్. ఆ-3

చ. దరము హరించి యాశ్రితవితానముఁ గాచున భేద్యవజ్రపం
జరము విపన్నదీనజనసంఘముఁ బ్రోచుసమీప మేరుభూ
ధరము మహార్థలోకపరితాపమడంచుసుధావిధానసా
గరము కరంబు రామవిభుకారుణికత్వమహత్త్వ మెన్నఁడున్. ఆ-౯

---

35. ముద్దుపళని

ముద్దుపళని పద్యకావ్యములు చేసిన స్త్రీలలో నొకతె. మొల్ల రచించిన రామాయణమునుగూర్చి రెండవభాగమునందే తెలుపఁబడినది. మోహనాంగి యను నామె మారీచిపరిణయమును రచియించినట్లు చెప్పుటయేకాని పుస్తకము లభింపలేదు. మొదటఁ బద్యకావ్యములను రచించినవా రిరువురును కులాంగనలు; ఈముద్దుపళని వేశ్యాంగన. ఇది రాధికాస్వాంతనమను నాలుగాశ్వాసముల శృంగారప్రబంధమును రచించెను. దీని తల్లిపేరు ముత్యాలు. అది తంజావూరుసంస్థాన ప్రభువయిన ప్రతాపసింహుని యుంపుకత్తె యయినట్లు "చోళసింహాసనాధ్యక్ష ప్రతాపసింహ మహారాజ బహుమతానేకచామీకరాంబరాభరణ ముత్యాలుగర్భశుక్తి ముక్తాయమాన" యని రాధికాస్వాంతనముయొక్క గద్యములో వ్రాయఁబడిన దానినిబట్టి యూహింపఁదగి యున్నది. ఈరాధికాస్వాంతమునకే యిళాదేవీయమని నామాంతరముగలదు. ప్రతాపసింహుఁడనెడి ఈమహారాష్ట్రప్రభువు ౧౭౬౫ వ సంవత్సరమునందు మృతినొందెను. కాఁబట్టి యీముద్దుపళని ౧౭౬౦ వ సంవత్సరప్రాంతమునందు తంజావూరులో నుండెను. ఇది సంగీతసాహిత్యభరత శాస్త్రములలోఁ బ్రవీణురాలయినట్లు తానే చెప్పుకొన్నది. దీనికవిత్వము నాతికఠినమయి మృదువుగా నుండినందునకు సందేహములేదు; దీనికి మంచి సంస్కృతాంధ్రసాహిత్యమును గలదు. అందందు తప్పులున్నవి కాని యట్టితప్పులు పురుషకవిత్వమునందు సహిత మనేకగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. అయినను గ్రంథములోనిభాగము లనేకములు స్త్రీలు వినఁదగినవియు స్త్రీనోటినుండి రాఁదగినవియుఁగాక దూష్యములయి యున్నవి. ఇది జారత్వమే కులవృత్తిగాఁగల వేశ్యయగుటచేత స్త్రీజన స్వాభావికమయిన సిగ్గును విడిచి శృంగారరస మనుపేర సంభోగాదివర్ణ

నములను పుస్తకమునిండ మిక్కిలి పచ్చిగాఁ జేసినది. అయినను స్త్రీ కవిత్వమని తెలిపెడు,

గీ. తనదుమ స్తొత తా నెంత తానె యింత
చేయఁజూచిన నే నెంత చేయరాదు
వేలువాచిన రోలంతవిరివియైన
రోలువాచిన నది యెంతమేలు గనునొ.

గీ. కుట్టఁ దేలు కుట్టకున్నఁ గుమ్మరబూచి
తోసిరాజటంచుఁ దోఁచెఁ జెలియ
దానివేలుదీసి దానికన్నుపొడిచి
నటులు చేయకున్న నగునె చిలుక.

గీ. తగరు కొండమీఁద దాఁకఁ గోరినదారి
నెదిరిఁ దన్నుఁ దెలియ కింతపలికె
నెంతమీనువచ్చి యెంతమీనును మ్రింగెఁ
గానఁ ద్రుళ్లి నెద్దె గంతమోచు.

గీ. కాని పదరకు మీఁకమీఁద దాని మొగము
కనఁగవలదని శౌరికిఁ గట్టుపెట్టి
బింకములు కూల నటుకాలఁబెట్టి నేల
రాయ కున్నను నాపేరు రాధగాదు.

గీ. లేనిపట్టింపు లెల్లను బూని చాన
నేనె యెదురై నఁగాసి యింతైనఁ జూడ
దల్పునకుఁ గల్మవచ్చిన నర్ధరాత్రి
గొడుగు తెమ్మన్నకతగాను గోమలాంగి.

ఇత్యాది లోకోక్తులును జాతీయములును గలపద్యము లంతందు లేకపోలేదు. రాధికాసాంత్వనమునుండి మఱికొన్ని పద్యముల నిం దుదా హరించుచున్నాను—

మ. యమునాతీరవిహార హారసదృశోద్యత్కీర్తిసంభార భా
రమణీయాకృతిమార మారసికతాప్రావీణ్యసంసార సా
రమరందోక్తివిచార చారణమదప్రఖ్యాతవిస్తార తా
రమహీభృత్సమధీర ధీరమునివారాధార రాధారతా. ఆ ౧.

ఉ. ఈయెడఁ గాయము న్విడిచి యేగెద నంచు విచార మొందలే
దా యదుసార్వభౌమునికి నామురవై రికిఁ గాని కాయమై
పోయినఁ బోవ కున్ననిలఁ బుణ్యము పాపము గుడ్డికన్నుదా
పూయకయున్ననేమి మఱి మూసిననేమి తలంచిచూడఁగన్. ఆ. 3.

చ. మెలఁకువమాటలం గలుగుమేలము లచ్చట గచ్చ లిచ్చటన్
దలఁపులు దానిపై ని బలుతప్పులు నాపయి నేస్తమూడఁబే
రలుక మటీడఁ గూర్మివగ లక్కడ నిక్కడ టక్కు లద్దిరా
తెలియఁగవచ్చె నీనడత తెల్లము వింటిమి ప్రాణనాయకా. ఆ. ౪.

---

36. కంకంటి పాపరాజు

ఈకవి యూఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తనయుత్తర రామాయణమునం దూఱువేలవారి నిట్లు వర్ణించుచున్నాఁడు—

సీ. అఖిలరాజాధిరాజాస్థానజనహృద్యవిద్యావిహారు లార్వేలవారు
కల్పకబలికర్ణకలశార్ణవోదీర్ణవితరణోదారు లార్వేలవారు
సజ్జనస్తవనీయసతతనిర్వ్యాజహరిపరోపకారు లార్వేలవారు
ఘనదుర్ఘటస్వామికార్యనిర్వహణప్రవీణతాధారు లార్వేలవారు
విమతగర్వాపహారు లార్వేలవార
లట్టిమూర్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి
మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

కవి శ్రీవత్సగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; అప్పయామాత్య పుత్రుఁడు. ఈతని తల్లి నరసాంబ; తమ్ముఁడు నరసింహుఁడు. ఈతని వాసస్థానము నెల్లూరు మండలము. అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణ దోషము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మిక్కిలి రసవంత మయినది. ఇతఁడు ఉత్తరరామాయణమును బురాణశైలినిమాని ప్రబంధ పాకమునఁ జెప్పినవాఁడు. పూర్వ ముత్తరరామాయణము తిక్కనసోమ యాజిచేఁ దెలిఁగింపఁబడినను దాను గ్రొత్తగా మరలఁ దెలిఁగించుటకు రామకథ యగుటయే కారణమని కవి యీక్రిందిపద్యమునఁ జెప్పెను—

మ. వరుసం దిక్కనయజ్వనిర్వచనకావ్యంబై తగంజేసె ను
త్తరరామాయణ మందున న్మఱి ప్రబంధం బూని సిర్మించుటే
సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించ బోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెంద ఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలవే?

కవి యుత్తరరామాయణమును రచించుటకుముందు విష్ణుమా యావిలాసమును యక్షగానమును రచించినట్లు తన్నుఁగూర్చి యిష్ట మైవము పలికినరీతిగా నీక్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

గీ. శ్రీవెలయ మున్ను విష్ణుమాయావిలాస
యక్షగానంబు మాకె సమర్పణముగఁ
జేసి తదియాదిగామేము నీసుధాను
సారివాక్కులఁ జొక్కియున్నార మనఘ.

ఉత్తరరామాయణము కంకంటి పాపరాజు చెప్పినట్లున్నను నిజ ముగాఁ బుష్పగిరి తిమ్మన్న రచియించి యీతనిపేరు పెట్టెనని వాడుక గలదు. ఈతని కవిత్వమునకును, బుష్పగిరి తిమ్మనకవిత్వమునకును భేద మున్నందున, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదు. పుష్పగిరి తిమ్మన్న గొప్పకవి యగుటచేతను, పాపరాజునకు మిత్రుఁడును సహా శ్రోతయు నయియుండుటచేతను, కావ్యరచనయందుఁ గొంత తోడ్పడి

యుండుటచేతను ఇట్టిప్రవాదము కలిగి యుండవచ్చును. పుస్తకరచన యందుఁ బుష్పగిరి తిమ్మన్న తనకు తోడ్పడినట్లు కవియే యీక్రింది పద్యములలోఁ జెప్పియున్నాడు—

మ. హనుమద్దివ్యపదారవిందమకరందానందనేందిందిరా
త్మ్ర నసేకాంధ్రకృతిప్రకల్పనసమర్థుం బుష్పగిర్యప్పనా
ర్యనిసత్పుత్రునిఁ దిమ్మనాఖ్యకవిచంద్రు న్మత్సహాస్రోతఁ బ్రో
ద్దుననే పిల్వఁగఁబంచి కన్నకల సంతోషంబునం దెల్పినన్.

మ. అతఁ డానందముఁ జెంది నన్నుఁగని యన్నా జాళువాపైఁడికిన్
గృతవర్ణాంచితరత్న మబ్బినటు లయ్యె న్నీవు వాక్పోషిమం
గృతి సేయంగఁదొడంగు రామకథకుం గృష్ణుండు రా జోటఁ బ్ర
స్తుతి గావింపఁగ నాకు శక్యమె భవత్పుణ్యప్రభావోన్నతుల్.

గీ. అని కిరీటికి శౌరి తోడ్తెనయట్లు
లమ్మహాకవిసాహాయ్య మాచరింపఁ
గృతి నొనర్పఁగఁబూనినయేను మొదట
నెంతు మదశ్వంశవిధమది యెట్లు లనిన.

కంకంటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నవినానుగా లౌక్యాధికారమునం దుండినవాఁడు. ఆకాలమునందే యీయనవద్దఁ బుష్పగిరి తిమ్మన్న కొంతబుణముచేసి యీయఁజాలక యీపుస్తక మును దానిక్రిందఁ జేసి యియ్యఁగా, ౧౭౯౦ వ సంవత్సరప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు తనపేరిత్తోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కవిత్వశైలి తెలియుటకయి యుత్తరరామాయణమునుండి కొన్నిపద్యములు నిందుదాహరించుచున్నాను—

మ. పలుమాఱుం దనువేఁడురామవిభునిం బాటింప కుత్తుంగభం
గలసత్తోయభుజంగ సంఘుషణభంగప్రౌఢరంగ త్తిమిం

గిలవాలప్రహతప్రవాళశకలాకీర్ణారుణార్ణఃప్రభా
కలనం దేజము చూపె వార్ధిజడధుల్ గైకొందురే ధీరులన్. ఆ. ౧.

ఉ. ఓయినిశాచరప్రవర యొప్పుగ నిప్పుడు పల్కునీరణ
న్యాయము లెందుఁబోయె సురనాథులఁదోలెడువేళఁ జాలుఁ జా
ల్నాన్యాయముచేతఁగాదె జయ మందుట మీరు జగం బెఱుంగదే
న్యాయము మేము దప్ప మొకనాఁటి కడెట్లనవిన్మతెల్పెదన్. ఆ-౨

ఉ. తమ్ముఁడ వంచు నీకొకహితం బెఱిఁగింపఁగ దూతఁబంచినన్
వమ్మునరించి నాపలుకు వానినిజంపి ననున్ జయింపరే
ద్రిమ్మరిగుంపుతోడ నరుదెంచితి నిన్ననునేల నీకు డెం
దమ్మున మేలుగాఁదలచునన్నె యనందగుఁగాక దుర్మతీ! ఆ. 3.

మ. పలుతావు ల్వాదచల్లుతెమ్మెరలుపై పైడాయ రేరాజువె
న్నెలగాయ మధుపాళిమ్రోయఁ గలకంఠీపాళికూయ మరు
ల్లలనల్గానముచేయ నొంటి నిశివేళం దోఁటలో నైందవో
పలవేది న్వసియించుపాంథుని స్మరాపస్మారము ల్బాపవే? ఆ. ౪.

చ. కిలకిలనవ్వి యచ్చెలి సఖీమణులంగని యమ్మలార విం
తలు కనుఁగొంటిరే యిదిగొ తానఁట యిక్కడ నున్నవారితోఁ
కలహ మొనర్పవచ్చెనఁట కాదనిపట్టిన నీఁడు చేతిలో
పలికినిలేఁడు నేఁడు బహుభంగులఁ బ్రేలెడు నంచుఁ జూపిన. ఆ-౫

ఉ. మాటలఁ ధాటకాంతకుఁడు మాటికిఁ దేనియ లొల్కఁ వేఁడినన్
బాటలగంధిసిగ్గు ప్రతిభాషితచాతురి నడ్డగింపఁగా
గాటపుఁగాంక్షయన్ తరువుకత్తె మదిం ద్వారసేయ నల్లన
మీటినమ్రోయువీణవలె మించు నెలుంగున భర్తతో ననున్. ఆ.౬.

ఉ. ఈవెడబుద్ధి నీకెజనియించెనొ యేజడుఁడైన నఁ దెల్పెనో
హా విధిద్రోయ నీకు వశమా లవణాసురుబారిఁబడ్డవా

రీవఱ కెవ్వరై న మనిరే యిఁక సూర్వఱబ్రహ్మ లాఁగినఁ
జావకపోదుమోటు కొనసాగునె నీవిలునిద్య లిచ్చటన్. ఆ. 2.

చ. వలసినభోజనాభరణవస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలు నని పల్కెడువారలకాని మాకుఁ గా
వలయు నొసంగుమం చనెడువారల మించున కైనఁ గాన మా
స్థలమున జానకీవిభునిజన్నము వైభవ మెన్న శక్యమే. ఆ. ౯.

---

37. పుష్పగిరి తిమ్మన్న

ఈకవి సమీరకుమారవిజయ మనెడి యేడాశ్వాసముల కావ్య మును రచియించి, భర్తృహరి నీతిశతకమును తెనిఁగించెను. ఇతఁ డుత్తరరామాయణమును రచియించిన కంకంటి పాపరాజుకో సమకాలి కుఁడు. ఇతఁడు రచియించిన సమీరకుమారవిజయ ముత్తరరామాయణ మంత మధురముగాలేదు. భర్తృహరినీతిశతకము సహిత మేనుఁగు లక్ష్మణకవి తెనిఁగించినదానికి చాలదు. కవి సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము కలవాఁడే యయినను, కవనమం దక్కడక్కడ లక్షణవిరుద్ధములయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈకవి నివాస స్థలము నెల్లూరిమండలములోని మోడేగుంట యయినట్లు నెల్లూరిమం డలచరిత్ర సంగ్రహమునందు వ్రాయఁబడియున్నది. ఇతఁ డాశ్వలాయన సూత్రుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; అప్పనార్యునిపుత్రుఁడు. ఇతఁడు సమీరకుమారవిజయమునందు తన్నుఁగూర్చి యిట్లు చెప్పకొన్నాఁడు—

సీ. శ్రీహనూమత్పాదసేవాగతాధ్యాత్మ తత్త్వకవిత్వమహత్త్వవిదుఁడ
నాశ్వలాయనసూత్రహారివిశ్వామిత్రగోత్రాబ్ధిచంద్రుఁడఁ గుశలమతిని
అలపుష్పగిరియప్పనార్యున కౌబళాంబకును సుపుత్రుండ బ్రహ్మవేత్త
యైన వేంకటకృష్ణయాగ్రణికిని వేంకటాఖ్యకవీంద్రున కవరజుండ

సరసగుణయుత్తుండ వరకవిఁ దిమ్మనా
హ్వాయుఁడ నేను జననమంది మనుట
కెల్ల ఫలముగల్గఁ గృతి యొక్కటిరచింప
నూహ సేయుచున్న నొక్కనాఁడు.

కవి పదునెనిమిదవ శతాబ్దమధ్యము మొదలుకొని ౧౭౯౦ వ సంవత్సరమువఱకును కవిత్వరచన చేసియుండవచ్చును. ఉత్తరరామాయణముయొక్క కర్తృత్వము నారోపించి నట్లే దశకుమారచరిత్రముయొక్క కర్తృత్వమునుగూడఁ గొంద ఱీకవి కారోపింతురు గాని యా యారోపణము కేవల నిరాధారముగా గనఁబడుచున్నది. ఈతని పుస్తకములనుండి కొన్నపద్యము లుదాహరింపఁబడుచున్నవి—

భర్తృహరి నీతిశతకము.

చ. మతిఁగలజాడ్యము లెచ్చుచు, మాటల సత్యము గూర్చు మాన మున్నతి నెనయించుఁ బాపములు నాశమొనర్చు, మనంబునం బ్రసన్నత గదియించు, దిక్కులఘునంబుగఁ గీర్తులు సంచు, సాధుసంగతి యిఁక నేవిశేషములు గల్గఁగఁజేయదు మర్త్యకోటికిన్.

ఉ. నీతు లెఱుంగువారు తమ నింద ఘటించిన నెంచినన్, మహాభూతులు పాయకున్న నవిపోయినఁ, జావఁడైనఁ గల్పసంఘాతవిరామకాలములఁ గల్గిన గల్గుఁగా కొకప్పుడున్
నీతిపథంబునం జెఱర నేరరు ధైర్యగరిష్ఠురంధరుల్.

సమీరకుమారవిజయము.

ఉ. ఆరజనీచరాగ్రణిలకూవసరాసితనీరదాకృతిన్
దారుణ రాఁగనుంగొని యధాయధలై సుకలద్రిరాడ్గుహల్
దూఱెడువారు నిచ్చ విధి దూఱెడువారుఁ గపీంద్రువెన్కకున్
జేరెడువారుఁ గావుమని చీరెడువారునునై తలంకఁగన్. ఆ-౧

ఉ. ఎమ్మెయు జవ్వనంబుఁ గలయింతి పతిం బెఱఁబాసి యొంటిగాఁ
ద్రిమ్మరుచోట గర్భము ధరించినదన్నను గన్నవిన్నవా
రెమ్మెయిఁ గల్ల లేమిగణియింతురో యెంతురో బంధుకోటిలో
నమ్మకచెల్ల నానియమ మాగడ మాయె నికేమిచేయుదున్. ఆ.పి.

చ. రమణుఁ డొనంగె నుంగరము రామ కనుంగొను మన్నమాత్ర మే
ను మఱచి సొక్కి యొక్కటఁ గనుంగొనుచుండితిఁగాని తత్పరి మో
దమునకు నాదికారణ మితం డని నిర్ణన నైతి నెచ్చటన్
భ్రమద లెఱుంగ నేర్తురె కృపాళు రొనర్చిన మేలు మారుతీ. ఆ. 3.

ఉ. ఇంతవిచార మయ్యెఁగద యేనును నీ వనుభేదయుక్తి నీ
స్వాంతమునందు వర్తిలుట నన్యఁడు నేనను చింత యెంతప
ర్యంతము జంతుసంతతిహృదంతమునందు వసించు నంతప
ర్యంతము జన్మమృత్యువుల కంతము లేదు సమీరనందనా. ఆ. ర.

ఉ. రావణుగీవణుఁ సమరరంగమునం గుదియించినట్లు నా
లావున కోహటింపక నిలం గలవే రఘురామ వేత్తవై
యీవెసక్రోఁతి నెక్కుకొని యేటికివచ్చితి వింతదూర మ
మ్మోవిజయంబుచెందఁగలఁడోటుశతాస్యుఁగడంగి రుద్రుఁడున్. ఆ-౫

ఉ. హీనాధిక్యము లెంచి పంచితివో నన్నేమాడ్కిఁ బొమ్మంటి వా
హీనాత్మం గపిమాత్రుఁ బిల్చుటకుఁ బోనీ యొక్కవేగంబునం
దెనన్ నాకు సమానుఁడే పలుకులేలా నీవె యిట్టూడఁగా
నేనా కాదనువాఁడ నం చడలుపట్టీంద్రు న్నిరీక్షించుచున్. ఆ. ౬.

శా. అన్నా నే ముదివాఁడ లేవ వడిలే దందెందొ నీవేగఁగా
సన్నాహంబున వచ్చినాఁడవుగదా జాగేల నీకేల నీ
సన్నంబైన మదీయపుచ్ఛ మొకపార్శ్వంబందుఁ బొందించి పొ
మ్మన్నన్ దన్మహిమం బెఱుంగ కుదితాహంకారపంకాత్ముఁడై .ఆ-౭

38. ధరణీదేవుల రామమంత్రి

ఈకవీంద్రుఁడు నూఱుసంవత్సరములక్రిందట దశావతారచరిత్ర మను పదియాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు బ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్యుని పౌత్రుఁడు; ధరణిదేవుల నాగయామాత్యునకును పణియమ్మకును పుత్రుఁడు. అందందుఁ గొన్నివ్యాకరణదోషములున్నను, ఈతని కవిత్వము రసవంతమయి హృదయరంజకముగానుండును. కవియే తన్ను సంస్కృతాంధ్రభాషా ప్రవీణునిగాను దినైక ప్రబంధవిరచనదక్షునిగాను,

క. నను సంస్కృతాంధ్రభాషా
వినుతు దినైకప్రబంధవిరచనదక్షున్
గనుఁగొని యిట్లనిపలికెన్
వినయంబు నయంబు హెచ్చ విబుధులు మెచ్చన్.

అను పద్యములోఁ జెప్పుకొని, తన్నష్టభాషాకవిత్వ తత్త్వసంవేదినిగా కృతిపతి పొగడిన ట్లొకింది పద్యములోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీరామకరుణారసాపూర్ణ సంస్కృతప్రాకృతాద్యష్ట భాషాకవిత్వ
తత్త్వసంవేదివి ధరణిదేవుల తిమ్మయామాత్యపౌత్రుండ వన్నదాన
ముఖ్యనానాదానముదితభూసురచంద్ర నాగప్రధానేంద్ర నందనుఁడవు
పణియమాంబాగర్భపాథోధిచంద్రుడ వాత్మవిద్రఘునాయకాద్యనుజుడ
వాప్తుఁడవుగాన వేఁడెద నందముగను
కృష్ణునిదశావతారముల్ కృతి యొనర్చి
యంకితమునేయు నాకుఁ బ్రఖ్యాతి నీకు
మహితగుణసాంద్ర రామయామాత్యచంద్ర.

కవి తన దశావతారచరిత్రము నాఱువేలనియోగి యగు మగదల కృష్ణమంత్రీంద్రున కంకితముచేసి యాతఁడు విద్వాన్నిధి యైనట్లు,

ఉ. నారదమౌని! యేమి? సురనాథ! విశేషము లేమి? వింటికో
సారసగర్భచెంగటను శారద లేదఁట! యొక్క సిల్చెనో?
యూరసిచూడుఁ డామగదలాన్వయదుగ్ధపయోధిచంద్రమం
దారము కృష్ణమంత్రి రసనాస్థలినిల్చెను, యుక్తమే కదా!

ఇత్యాది పద్యములలో నభివర్ణించి యున్నాఁడు. కృతిపతియైన కృష్ణమంత్రి గతశతాబ్దాంతమునంతు నెల్లూరిమండలములోని ప్రళయ కావేరిపట్టణమునం దొలాందావారి ద్విభాషిగా నుండెను. కంకంటివారి యుత్తరరామాయణమువలెనే యీదశావతారచరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపఁబడినదని కొందఱు చెప్పుచున్నారు గాని కవు లిద్దఱు నేకకాలమునం దొక్కదేశములో నుండుటదక్క వారిమాట కాధారలేశమును గానరాదు. దశావతారచరిత్రకవిత్వము పుష్పగిరి తిమ్మన్నదైన సమీరకుమారవిజయకవిత్వమునకంటె మృదుతరముగాను మధురతరముగాను కనఁబడుచుండుటచే దశావతారచరిత్రరచనలోఁ బుష్పగిరి తిమ్మన్న కేమియు సంబంధములేదని నిశ్చయముగాఁ జెప్ప వచ్చును. దశావతారచరిత్రములోని పద్యములఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

శా. ఆవార్త న్వినిపింప దైత్యపతి రోషావేశ ముప్పొంగ నా
హా వేదంబుల యాగభాగము లమర్త్యశ్రేణికేకాని మా
కేవంకం బనిలేక యుండునటుగా నేర్పాటు గావించెఁ గా
నీ వేగంబ హరించి తచ్ఛ్రితుల భగ్నీభూతము ల్చేసెదన్. ఆ. ౧.

ఉ. కన్నులు బ్రహ్మరెం డొసఁగఁ గానఁగలేవని గౌతముండు తాఁ
గన్నులు వే యొసంగె నధికంబుగ నప్డు మదాంధకార సం
ఛన్నము లౌటచేఁ దెలియఁజాలవు తన్మదకారణంబు నిం
క న్నినుఁగూతనీయ కుపకారము చేసెదఁ జూడు వాసవా. ఆ-౭

ఉ. వీరుఁడ వంచు నిన్నుఁ బదివేలవిధంబులఁ బ్రస్తుతించుచుఁ
వారిధిభ ర్త తెల్పనిని వచ్చితి మెచ్చెద నేఁడుచూపు నీ
వీరతఁ గాందిశీకపదసీరతవృ త్తిని మోరతోపునఁ
జాఁతెదనన్నుఁ బో విడుఁము స్వ్నగ్ణవిలోచనుఁడంచు నుగ్గుఁడై. ఆ. 3.

చ. గెలిచితి సర్వదేవతలఁ గేశవుఁ డొక్కఁడె తక్కి నాతనిన్
గెలిచినఁగాని యీగెలుపు గెల్చుటకా దది యెట్టు లంటిరేఁ
దొలుత వరాహమై యనుజుఁ ద్రుంచు టెఱుంగదె సూడుదీర్ఘఁగాఁ
గలుగనిగె ల్పదేల బరగౌరవ మేటికి శౌర్య మేటికిఁ. ఆ.ర

ఉ. ముక్కున గప్ప కుట్టినిను ముందుగ నీడిచి తెమ్మటంచు మా
రక్కసిజేఁడు పంచె వినురా దివిజర్షభ యింక నట్టిటున్
దిక్కులుచూచిన స్వీడువ దేవర వై నను నీకువెరఁ కే
మైక్కెదఁగాని రమ్మనుచు ముందలఁ బట్టఁగడంగ నుద్ధతిఁ. ఆ-గి

శా. ఓరా నిప్రుఁడనంచు నఁ జులకసేయ న్వచ్చితే మంచిదే
రారమ్మా ధను పూని నీదయిసౌత్రం బేను వీక్షించెదఁ
శూరత్వంబులు మీకెయంచు నజుఁ డెచ్చో ముద్ర గావించెనే
లేరా బ్రాహ్మణశూరు లిం కిటను గల్పింతు న్ననుం జూడుమా. ఆ-ఁ

శా. ఓనా నే వెలయాలనా యిటులు నీ వాడన్ బళా చాలుఁ బో
పో నవ్వే రెనరైన విన్న నిట నేర్పు ల్మానఁగా వచ్చితో
నానాథుం డిదివిన్నయంతఁ దనకు న్నాకు న్మహాహాని రా
చా నావంటికులాంగనామణికి న్యాయం బౌనె యీమార్గముల్. ఆ-ఁ

మ. ఎలనాగా ! తలయెత్తి చూడఁగడె వీ రెవ్వారు వీ రేమికా
వలెనే యంచసి యమ్మలక్క లట ప్రోవఁ వేఁడ నీపైఁడిచా
యలచే మించునతండు నామఱఁదియా నం చంటఁ సిగ్గుచే
దలవంచు న్మహికన్య వార లడె యాతం డెవ్వరంచు న్నగఁ. ఆ.ర

ఉ. ఓయిగురాకుబోఁడి ! కనవో వినవో యిదియేమిచెల్ల నీ
ప్రాయపుఁదోయజాక్షులెడబాయ రొకప్పుడు ప్రాణనాథులం
బ్రాయము రిత్తఁబుత్తురఁట పల్కవె నీమది నున్న యట్టియా
నాయకుఁ డెల్పవే త్రిదశనాయకుఁ గోరినఁ దెచ్చికూర్చెదన్. ఆ-౯

శా. రంభాభోగముఁగోరి యాగముల కర్థం బెల్ల వెచ్చించు టా
యంభోదమ్ములఁజూచి చెర్వుజల మాద్యంతంబు చల్లించుటల్
సంభోగేచ్ఛ జనించెనేని మఱి వేశ్యారత్నము ల్లేరొకో
సంభోగింపఁగరాదె కానరు జనుల్ జ్ఞానంబు సామాన్యమే. ఆ-౧౦

---

39. దిట్టకవి నారాయణకవి

ఇతఁడాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; పాప రాజకవిపుత్రుఁడు. ఇతఁడు రంగరాయచరిత్రమును ప్రబంధమునుజేసి దానిని కృష్ణామండలములోని నర్సారావుపేట జమీందారగు మల్రాజు రామారాయనింగారి కంకితముచేసెను. ఈగ్రంథము ౧౮౯౦ వ సంవత్సర ప్రాంతములయందు రచియింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ పుస్తకము ౧౭౫౭ వ సంవత్సరమున బొబ్బిలికోటవద్ద శ్రీరావు రంగారాయఁడుగారికిని ప్రెంచిసేనానాయకుఁడగు బుస్సీగారితో నచ్చటికేగిన పూసపాటి విజయరామరాజుగారికిని జరిగినయుద్ధము భారతయుద్ధమువలె వర్ణింపఁబడినది. బొబ్బిలికోటవద్ద జరిగిన యుద్ధక్రమములు బొబ్బిలి సంస్థాన చరిత్రమును కథా సందర్భమున నిందు కొంత వివరించుచున్నాను.

బొబ్బిలిసంస్థాన స్థాపకుఁడయిన పెద్దారాయనింగారును విజయనగర రాజ్యసంస్థాపకుఁడయిన పూసపాటి తమ్మరాజుగారివరినే ౧౬౨౭ వ సంవత్సరమునందు శ్రీకాకుళపు సర్కారు పోఁజుదారగు షేర్ మహమ్మదుఖాఁయొక్క ప్రాపుచేత నక్కడకు వచ్చెను. పెద్దారాయనింగారు

మహాశూరుఁడయి రంగవాఁక యనుచోట జరిగినయుద్ధములో శత్రువుల సంహరించి షెర్ మహమ్మదుఖాఁ యొక్క పుత్రుని ప్రాణములు రక్షించినందున, షెర్ మహమ్మదాయనకు రాజాముహుండా కవులున కిచ్చి రంగరావని బిరుదునిచ్చెను. రంగరావను బిరుదనామము నొందిన యీ పెద్దారాయనింగారు పద్మనాయకవంశజులయిన వెలమదొరలలోని వాఁడు. ఈయనయు వేంకటగిరి సంస్థానప్రభువులును పిఠాపుర సంస్థాన ప్రభువులును ఏకవంశములోనివాలే. రాజాముకు కాలునకుఁ బుచ్చి కొన్నతరువాత పెద్దారాయనింగారు క్రొత్తగా నొకపేటను కోటను గట్టి దానికి తన యుపకర్తపేరిట బెబ్బులియని నామకరణము చేసెను. షెర్ మహమ్మదులోని "షెర్" అను పదమునకు బెబ్బులియని యర్థము. బెబ్బులి యనునదే కొంతకాలమునకు బొబ్బిలిగా మాఱినదఁట! అప్పటి నుండియు క్షత్రియులయిన విజయనగరము వారికిని వెలమవారయిన బొబ్బిలివారికిని వైర మారంభమయ్యెనని చెప్పుదురు.

మన ప్రస్తుతచరిత్రారంభకాలమున ౧౭౫౬ వ సంవత్సరమునం దుత్తరసర్కారులు ఫ్రెంచివారి కియ్యఁబడఁగానే ఫ్రెంచిసేనాధ్యక్షుఁడగు బుస్సీదొరగారు రాజమహేంద్ర శ్రీకాకుళ సర్కారులను విజయనగర సంస్థానాధిపతులగు విజయరామరాజుగారికి కాలునకిచ్చుట కంగీకరించెను; అట్లు జరిగెడుపక్షమునఁ దనస్థితికి భంగము కలుగునని దూరాలోచన చేతఁ దెలిసికొన్నవాఁడయి యప్పటి బొబ్బిలి ప్రభువుగారగు రంగారావు గారు రాజ్యము ఫ్రెంచివారియధీనము కాకుండఁజేయుటకయి యితర సంస్థానాధిపతులత్రోఁ జేరి కృషిచేసెను. ఈ కృషికి శ్రీకాకుళపు నవాబగు జాఫరల్లీఖాఁ యొక్క ప్రోత్సాహముసహితము విశేషముగా నుండెను. తిరుగఁబడిన జమీందారుల నదిమి కప్పములు గొనుటకయి బుస్సీగారు ౧౭౫౬ వ సంవత్సరము నవంబరు నెల ౧౬ తేదిని ౫౦౦ యూరపియను లతోను ౪౦౦౦ సిపాయలతోను హైదరాబాదునుండి బైలుదేఱి

డిశంబరు ౧౯ వ తేదికి రాజమహేంద్రవరము వచ్చి చేరెను. విజయ రామరాజుగారు పదివేల స్వసేనతోను, ఇతరరాజులతోను వచ్చి యచట బుస్సీని చేరెను. తమదేశములోనుండి విజయనగర రాజ్యములోనికిఁ బాతెదు కొండకాలువలను మళ్ళించి బొబ్బిలి రంగారావుగారి కాపులు తమ భూములకుఁ బెట్టుకొన్నందునను, దేశస్వభావమునుబట్టి బొబ్బిలి వారిని సాధించుట సుసాధ్యము కాకపోయినందునను, విజయరామరాజు గారు మనస్సులో బొబ్బిలిరంగారావుగారిపై ద్వేషము వహించి యాయనను శిక్షించుటకయి బుస్సీని తన యావచ్ఛక్తిని వినియోగించి బహువిధముల ప్రోత్సాహపఱచి పురికొల్పెను. అందుమీఁద బుస్సీగారు బొబ్బిలిరాజ్యమును విడువవలసినదనియు, దానికి బదులుగా నధికవైశాల్యమును మూల్యమునుగల దేశ మియ్యఁబడునసియు రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పితృపితామహాగత మయిన బొబ్బిలిరాజ్యమును విడుచుట కంగీకరింపక పోవుటయేకాక తక్కిన సంస్థానాధిపతుల తోడిపాటుగా రాజమహేంద్రవరమునకు వచ్చి యాతనిని సందర్శింపక పోయెను. రాజమహేంద్రవరమున బుస్సీని దర్శించుటకయి విజయరామ రాజుగారు మొదలగు సమస్త రాజులును వచ్చినప్పుడు రంగరావుగారు రాకుండుట లోనుగాఁగల కథను గవి యిట్లు చెప్పినాఁడు.

ఉ. రాజమహేంద్రపట్టణవిరాజదదూరతలంబున న్నము
తేజితమైన గౌతమనదీతటసీమను గోటిలింగవి
భ్రాజితమైన యొక్కనవపాదపమంజులనిష్కుటస్థలిన్
రాజితలీలఁజేరి శిబిరంబు వడి న్విడియించె వేడుకన్.

* * * *

ఉ. కారుణికత్వ మేర్పడ సికాకుల పున్నరకారులో జమీ
దారుల రామరాజవసుధావల యేశ్వరముఖ్యుల న్ముదం

బారఁగఁ బిల్వఁబంపుమని హైదరుజంగున కానతీయుఁ ద
చ్చారువచఃక్రమంబునను సత్వరుఁడై సిలిపించె వారలన్.

ఉ. పాయనివేడ్క విద్విషదపాయకరాయతబాహుశౌర్య లా
పాయకరాయఁడుం గినుకిపట్టణపుంబృథివీశ్వరుండు నా
రాయణదేవుఁడున్ నరసరాజు మఱిం గొలుగొండ మన్నెపున్
రాయఁడు నాదిగాఁగలధరావరు లందఱు వచ్చి రత్తఱిన్.

గీ. ఉద్ధతులముల్క సందర్శనోత్సుకత్వ
మాత్మఁ జిట్లాడ నాడాడ నలరుమన్నె
దొరలువచ్చిరమానుషద్రోహిప్రసంగ
కలితుఁడగురంగరాయఁడొక్కరుఁడుదక్క.

సీ. నిజభుజాదండ నిర్ణిక్తకోదండంబు గాండీవకార్ముకక్రమముఁ జూపఁ
జరమభాగస్ఫుటచ్చటులతూణీరముల్ కవదొనసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖికధ్వనుల్ దేవదత్తరవోద్వృత్తిఁ దెలుప
సూరెలఁ బరతెంచుజులుమతీ తేజీలు ధవళాశ్వములమస్తు ద్రస్తరింపఁ
గలియుగార్జునుఁడౌర యీ ఘనుఁడటంచుఁ
దను జగజ్జన మెన్న నుద్ధతులముల్క
వీక్షణాపేక్ష నేతెంచె విజయరామ
రాజరాజన్యలోకమార్తాండమూర్తి.

* * * *

చ. నలువదివేలకాల్బలము నాలుగువేలతురంగమంబులున్
నలువదియేఁబదేనుఁగు లనంతములై నశతఘ్ని కాచయం
బులు నొకవేయిలొట్టియ లపూర్వవిభావిభవంబు దెల్పుచున్
గొలువ పరాసుతేనిఁ గనుఁగోఁ జనుదెంచెను రా జతిత్వరన్.

ఇట్టి కావ్యమునందు విజయరామరాజుగారు నల్వదివేల కాల్బల
ముతో వచ్చినట్లు చెప్పఁబడినను, ఆయనవెంట నిజముగా వచ్చినసేన

పదివేలని చరిత్రకారుఁడైన యూర్మ్మదొరగారు వ్రాసియున్నారు. ఇట్లుండఁగా రంగారావుగారి యనుమతిమీఁదనే బుస్సిదొరగారు కొందఱు సిపాయిలను బొబ్బిలిరాజ్యముమీఁదుగా మఱియొకచోటికిఁ బోవుటకుఁ బంపిరి. విజయరామరాజుగారి తంత్రమువలననో రంగారావు గారి బుద్ధిపూర్వకమయిన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలి భటులచే నెదిరింపఁడి ముప్పదిప్రాణములను గోలు పోయి మరలి రావలసినవారైరి. ఈయవమానము విజయరామరాజు గారి ప్రోత్సాహమునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్ఫాంటయేఁబండ్రు గుఱ్ఱపు రౌతులును నాలుగు ఫిరంగులును గల ౭౫౦ యూరపియనులతోను, విజయరామరాజుగారి భటులును సిపాయీలును గలిసిన ౧౧౦౦ స్వదేశీయపదాతిబలము తోను బుస్సీగారు బొబ్బిలికోటమీఁదికి దండువెడలిరి. బొబ్బిలికోట యిన్ఫాంటగజముల వైశాల్యముగలిగి నలుచదరముగా నుండెను. నాలుగు మూలలను నాలుగు గుండ్రని బురుజులుండెను. వెలుపలిగోడల ఎత్తు ఇరువదిరెండడుగు లయినను, లోపలిబురుజులయెత్తు పండ్రెండడుగులే యుండెను. పయిని గోడల వెడల్పును పండ్రెండడుగులుండెను. ఇట్టి మట్టికోటయొద్దకుఁబోయి బుస్సీగారు తన సేనలను నాలుగుభాగములు చేసి యొక్కొక్కభాగమున కొక్కొక్క ఫిరంగినిచ్చి నాలుగుభాగము లను నాలుగు బురుజులను సాధింప నియమించెను. ౧౭౫౭ వ సంవత్స రము జనేవరు నెల ౨౮ వ తేదీని ప్రాతఃకాలమునసే యుద్ధ మారంభ మయినది. శత్రువులు కోట బురుజులమీఁద ఫిరంగులు కాల్పనారంభింపఁ గానే, కోట లోపలివా రగ్నిభయముచేత బురుజులమీఁది కప్పుతీసి వేసిరి. ఉదయమున జాము ప్రొద్దెక్కనటకు బురుజుల గోడలలో విశేష భాగము కంతలుపడినవి. అప్పుడు శత్రువులయొక్క నాలుగుభాగములు

నొక్కసారిగా నిచ్చెనలు గైకొని లగ్గలు పట్టుటకయి కోటగోడను సమీపించి గంటవఱకును బ్రయత్నించిరికాని కోటను రక్షించుచున్న భటులయొక్క శౌర్యమువలన నొక్కరయినను కోటగోడమీఁది కెక్కలేకపోయిరి. కోటలోపలివారు స్త్రీలతోఁగూడ వేయింటికి లోపుగానే యుండిరఁట. కోటగోడల కెగఁబ్రాఁక ప్రయత్నించినవా రనేకులు గాయములతో క్రిందఁబడిరి. ఈయంశమును కవి యిట్లు వర్ణించుచున్నాఁడు—

ఉ. తగ్గపరాసుమండల ముదగ్రతమై బిరుదు ల్వచించుచున్
లగ్గల కెక్కి రా బురుజులం దగుమన్నెకుమారసైన్యముల్
వెగ్గలమైన కోపమున వెనొక్కనుచు న్నురుమాడువీఁకచే
నగ్గలికం దుపాకులఁ గిలార్చుచు నేయుచు రోయుచు న్వడిన్.

సీ. పొంగులురాఁగాఁగిపొరలునూనియముంచిగరగలవంచియక్క ఱగఁబల్లి
జిగురుటంబలివేఁడి దిగుపాఱజాఱఁగా గుండలకొలఁదిగాఁ గ్రుమ్మరించి
వసియూర్చుదారుయంత్రసముత్కరంబులు మేనులుచ్చిచనంగమీటివైచి
యొండొంటిఁదోడుగాగుండియలౌదలల్గుటిచేసిత్రుంపఁగాగుండ్లదొలపి
బిరుసుల దెరల్చిక్రొంబొగల్గురియనినుప
గొట్టములదాల్చి మొద్దిటెగములఁగ్రుచ్చి
చిచ్చుబుడ్లనగల్చి నిస్త్రింశతతులఁ
బొడిచి పడఁద్రోచిరానేనఁ గడిమితోఱఁగ.

లగ్గలెక్కి కోటపట్టుటకు శక్యముకాకపోఁగా నంతట నాప్రయత్న మునుమాని శత్రువులు వెనుకకు మరలి మఱల కోటమీఁద ఫిరంగులను గాల్వనారంభించిరి. అట్లు ప్రయోగింపఁబడిన ఫిరంగిగుండ్ల నొకచోటఁ గవి యీవిధముగా వర్ణించెను—

సీ. తట్టికోటయగల్చిదారుణోపలములగ్రమ్మ వంతదారుడాసి వ్రాలుననియు
నినుపతల్పుల ఘణిల్లునఁదాఁకి పిఱిఁదికి రవళిమైవచ్చిబిట్టవియునవియు

ద్వారబంధపుఁగమ్మిదూతి యవ్వలికంట డుస్సిపాఱఁగ నోడి
డొల్లునవియు
గుటీతప్పిపఱతెంచికోటముంగలిహస్తినఖపుదుమ్ములేఁచినక్రునవియు
నగుచునొండెడ నెడయాక యంటిత్రూగి
బంతులాడినపగిది గుభ్గుభ్గాలు
నినదభయదార్భటులశతఘ్నిప్రయుక్త
తాళఫలసన్నిభాయస గోళతతులు.

ఈఫిరంగివేట్లచేత కోటగోడ మతీంత పడిపోయి శత్రువుల కెక్కువ యానుకూల్యమును కలిగించినది. అయినను కోటగోడలు పగులుటచేత కోట కావలివారి ధైర్యకంచుకము పగులక వారినిమతీంత తెంపరులనుగాఁ జేసినది. కోటకావలిభటులు తమప్రాణముల కాశపడక తమగుహలను కాపాడుకొను బెబ్బులులవలెఁ బోరాడిరి. ఫిరంగిగుండ్లు చిత్తజల్లులుగాఁ గురియుచున్నను వెనుతీయక వీరభటులు శత్రువులు కోటగోడల కెగఁ బ్రాఁకఁగానే యాసెలక్రోఁ గ్రుమ్మి క్రిందఁబడఁ ద్రోయవలెనన్న నిశ్చయముత్రో నిశ్చలులై కాలుగదల్పగ బురుజుల మీఁద నిలువఁబడిరి. ఆగ్నేయాస్త్రముల నపహసించెడు శతఘ్నికా ప్రయోగములముందఱ కేవల భుజవీర్య మేమి పనికివచ్చును? క్రింద నున్న సైనికులు గుటీచూచి తుపాకులు కాల్చి బురుజులమీఁద నున్న వారి ననేకులను రూపుమాపిరి. స్వదేశ సైనికులయం దీవఱ కెన్నఁడు నేయుద్ధములోను గనియుండని యిటువంటి యసమాన ధైర్యసాహస ముల కదుభుతపడి శత్రువులు సహితము పలుమాఱు వారి కభయప్రదా నము చేసిరిగాని యావీరభటులు శత్రువుల వాక్యములను తిరస్కార పూర్వకముగా నిరాకరించి తమదేహములలోఁ బ్రాణము లుండఁగాఁ దమతావు విడువమని యక్కడనే సుస్థిరులై పర్వతమువలె నిలువఁ బడిరి. అప్పటికి మధ్యాహ్నము రెండుగంట లయినను శత్రువులలో

నొక్కరును కోటగోడ నెక్కలేకపోయిరి. అందుచేత శత్రువులు కొంత సేపు యుద్ధము నిలుపవలసినవారైరి. అప్పుడు రంగారావుగారు శత్రువులత్రోఁ బోరాడి గెలువగలనన్నయాశ వదలుకొని తనవారిని బిలిచి యాలోచించి యంతఃపురస్త్రీలు శత్రువులచేతులోఁబడి మానముగోలుపోకుండ కాపాడవలెనని నిశ్చయించి శిశుసహితముగా వారినందఱిని సంహరించుటకయి కొందఱిని నియమించెను. వారప్పుడే చేతులలో బాకులతోను బల్లెములతోను గదలిపోయి యంతఃపురము వాకిట గడ్డినించి గృహముల కగ్నితగిలించి యాసంఘాత మరణమునుండి తప్పించుకొని ప్రాణములఁ దక్కించుకొనఁ బాఱుతెంచిన శిశువులను సహితము పుత్రులనక దయాపాత్రులనక క్రూరులై పొడిచి చంపిరి. ఈదారుణ కృత్యమును గని యిట్లు చెప్పియున్నాఁడు—

క. చెలికాని వంశసంభవు । నలఘుతరస్థైర్యు ననిచె నవరోధవధూ
కులకంఠనాళక్యంతన । కలనాదారుణవిధానకథనత నెఱిపన్.

తే. అతఁడు నభిమానరక్షణార్థప్రచార
దారుణాకార సాహసౌదార్యమమర
నంతిపురి కేగ మొరసె దిగంతరములు
ధరణి వడవడవడఁకె భూతలము బెగడె.

తే. రాయమణిరాణి తనకుమారాగ్రయాయి
నపుడ కొండొకదాదికి నప్పగించే
గోటవెడలించి బ్రతికించుకొమ్మటంచు
నట్లు కావించెనాదాయియడలువొడమ.

* * * *

క. ఘుననిశితఖడ్గధారన్ । మొనకొని చెలికానివంశమూర్ధన్యుడు పెం
పున వడివడి నంతఃపుర । వనితాజనతాతిచిత్రవధవిధి నడిపెన్.

తే. తక్కగల యట్టియభిమానధనులువెలమ
లొక్కనూటింట్లవా రనలోగ్రశస్త్ర
నిహతులై రంగనాశిశుసహితు లగుచు
దద్విదారణమెంతని తలఁప వచ్చు.

మరభిమానజనితమైన వధూశిశుసంహారక్రూరకార్యము ముగియఁ గానే ప్రాణములకు తెగించి వారందఱును మరల యుద్ధోత్సాహముత్రో వచ్చి తమస్థానముల నిలిచిరి. నాలుగు భాగములలో నొకభాగమునకు నాయకుఁడైన లాదొరగారు దూరమునుండి యగ్నిదాహమునుజూచి లోపలి కావలిసేనలు పలుచనగుట కనిపెట్టి యాలోపల లగ్గలు పట్టుట కయి మరలవచ్చెను. నిచ్చెనలతో పయికెక్కఁ బ్రయత్నించినవా రనేకులు నిహతులయి క్రిందఁగూలుచు వచ్చినను గొందఱు శూరు లొక్క బురుజుపై నెక్కి నిలువగలిగిరి. వారి వెంబడినె మఱి కొందఱును కోట గోడల కెగఁబ్రాకి బురుజు చేరిరి. రంగారావుగారు శత్రువులను బాఁద్రోలి యాబురుజు రక్షింపవలెనన్న యాశతో హతశేషులైన భటులతో వచ్చుచు నొకగుండుదెబ్బతో నేలఁగూలి వీరశయనము నొందెను. ఆయనపాటువలనఁ గలిగిన సక్రోధశోకోద్రేకముతో లోపలనున్న వీరభటబంధువర్గమంతయు పగదీర్చుకోవలెనన్న దృఢనిశ్చయముతో తక్కిన బురుజులను విడిచి యక్కడకు వచ్చిచేరెను. అంతట తక్కిన శత్రుసేనాభాగములు మూడును వరుసగ నాయాబురుజులనుజేరి యరక్షితము లయియున్న యామూడు బురుజుల ననాయాసముగా సాధించి లోపలఁ బ్రవేశించెను. ఇట్లు లెక్కకు మిక్కిలిగా శత్రుసేనలు నానా ముఖముల వచ్చి చుట్టు ముట్టినను లోపలనుండి కోటను సంరక్షించుచున్న వీరభటులలో నొక్కఁడైనను బాటిపోవుటకుఁగాని శత్రువులకు లోఁబడి శరణు చొచ్చుటకుఁ గాని ప్రయత్నింపలేదు. ప్రతిభటుఁడును వీరరసము మూర్తిభవించినట్లాయుధపాణియై శత్రున కభిముఖముగా

నడిచి శత్రువును పొడిచి తాను పడిపోవుచు వచ్చెను; గాయపడి భూమి మీఁద నొరిగినతరువాత సహితము ప్రాణములు బొందిలోనుండి వెడలు వఱకును దనచేతిలోని ఖడ్గముతో దాపునకు వచ్చిన శత్రువును నఱకవలెనన్న ప్రయత్నమును మానలేదు. ఇది కావ్యమునందుఁ గవి చేసిన వర్ణనముగాక యింగ్లీషు చరిత్రకారుఁడు వ్రాసిన సత్యాంశమగుట చేత బొబ్బిలికోటలోని రణశూరులు చూపిన విచిత్రపౌరుష మత్యంత శ్లాఘాపాత్ర మయిన దనుటకు సందేహములేదు. ఇట్టి వీరవధ కొంత సేపటి కెల్లను సంపూర్ణ మయిపోయెను. కోటలో జరిగిన ప్రాణనాశన మునకుఁ గలినహృదయులయిన శత్రువులు సహితము జాలిపడుచు విచారించుచున్న యీసమయమునందు గుఁపులోనుండి వృద్ధుఁ డొకఁ డొక బాలునిఁ జంకఁ బెట్టుకొని తిన్నగా లాదొర యున్నచోటికి వచ్చి "ఈశిశువు రంగారావు కుమారుఁడు. తండ్రి యభీష్టమునకు విరుద్ధముగా నేనీబాలకుని ప్రాణములను గాపాడితిని" అని పలుకుచు, ఆసేనానాయకునకు బాలు నొప్పగించెను. లాదొర యప్పుడే యాబాలకుని బుస్సీదొర యొద్దకుఁ బంపఁగా, అతఁ డాశిశువును వృద్ధుని తనసేవాని వేశమునం దుంచి యాదరించి యాశిశువుయొక్క సంరక్షణభారమును తాను వహించి శత్రుభయమువలన శిశువును గాపాడుటకయి తగిన కావలివారిని నియమించి యప్పుడే యాశిశువును బొబ్బిలిరాజ్యమున కభిషిక్తునిఁ జేయుచు లేఖ్యములు వ్రాయించెను.

నాఁటి రాత్రియు మరుసటిదినములు రెండును గాయములు తగిలిన భటులయొక్క చికిత్సలు మొదలయిన పనులతోఁ గడచెను. మూడవనాఁ డర్ధరాత్రమునందు విజయరామరాజుగారుండిన పటమందిరములో గొప్ప సంక్షోభ మొకటి పుట్టెను. రంగారావుగారు నిహతులయిన దినమునం దాయన నమ్మిన వీరభటులు నలుగురు కోటలో నేమూలనో దాఁగియుండి చీకటి పడినతరువాత కోటదాటిపోయి

విజయరామరాజుగారి శిబిరముల వెనుకనున్న యడవిఁ జొచ్చి చేరువ పొదలలో దాఁగియుండిరి. సమయము నిరీక్షించుచు వా రక్కడ రెండు దినము లుండి మూడవనాఁటి రాత్రి స్కంధావారము సద్దడఁగిన తరు వాత నిశీథసమయమునందు వారిలో నిద్దఱు పొదలలోనుండి వెడలివచ్చి కావలివాండ్రను మోసపుచ్చి గూఢముగా విజయరామరాజుగారు నిద్రించుచుండిన పటకుటీరములో వెనుకవై పునుండి ప్రవేశించి యిద్దఱు నొక్కసారిగా తమబాకులతో పొడిచి విజయరామరాజుగారి వక్షస్థలమును గంతలు చేసిరి. మొదటి పోటుతో మేలుకొని విజయరామరాజు గారు మూల్గఁగానే వెలుపలినుండి కావలిభటుఁడు వచ్చి తుపాకితో కాల్చెనుగాని గుఱితప్పిపోయెను. ఇంతలో నితరభటులును వచ్చి వెంటనే యూహాంతకులను జంపి ముక్కముక్కలుగా నటికివేసిరిగాని యీలోప లనే వారు విజయరామరాజుగారిని ముప్పదిరెండుచోట్లఁ బొడిచిరి. ఇట్లు విజయరామరాజుగారిని జంపినతఁడు తాండ్రపాపయ్య యని కవి యిట్లు చెప్పియున్నాఁడు—

గీ. కదిసి పైఁబడి యొకకేల నదిమిపట్టి
వాఁడివాలున వక్షఃకవాటపాట
నంబుఁ గావించె నతనియూనాభికుహర
విదళితాంత్రవ్రజంబులు వెలికినుఱక.

* * * *

మ. అవు డాతాండ్రకులాభిమానినిధి యూహా రాజదేవేంద్ర నీ
విపులప్రాభవశక్తి నీనిఖిలపృథ్వీభారధౌరేయతా
నిపుణత్వంబును భాగ్యముఁ వృథ చనఁ నీచేయుదుశ్చేష్ట సి
ట్లుపభోగింపఁగనయ్యె నిట్టివెతయం చుద్వృత్తి వర్ణిల్లఁగన్.

గీ. తాండ్రపాపయ్యసలుపు ధైర్యంబువలన
క్షత్రవర్యుండుపులివాతికండయయ్యె

ననెడు రొదఘట్టె నంత నయ్యవనినాథు
బలము లా ర్తరవంబునఁగలయ బర్వి.

సీ. తనచావు సర్వసిద్ధంబుగా మదిఁగోరి
సాహసకృతికిన్నె చన్నవానిఁ
దనియేలికవికోధిదర్పంబుమాపుట
పరమార్థమని యేఁగుపఱుచువానిఁ
దనపడినట్టిబన్నముల కిక్కార్యంబు
ఫలరూపమని యాత్మఁదలఁచువానిఁ
దనకులస్వాములందఱు మెచ్చుకొన నోర్చి
పగదీర్చుకొన్న సంభ్రమమువానిఁ
దాండ్రకులజుని బొదివిరి దారుణముగ
ఘోరయుద్ధంబుసలిపి యవ్వీరవర్యుఁ
జిదిమివై చిరి కఠినని స్త్రీశతతుల
నతనిసహచరయుగళసంగతముగాఁగ.

ఇట్లు మొదటవచ్చిన యిద్దఱు దమ పూనిక్యాని సాధింపలేక పోయిన పట్టుమున, పొదలలో దాఁగియుండిన తక్కిన యిద్దఱునువచ్చి విజయరామరాజుగారి ప్రాణములుగొని తమ స్వామిఋణము తీర్చుకొను టకు శపథము చేసికొనిరఁట! విజయరామరాజుగారు భృత్యులకై దండ గొనక నడువలేనంత స్థూలకాయులని చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. యుద్ధములోఁ ప్రాణము దక్కించుకొన్న రంగారావుగారి తమ్ముఁడు వెంగళ్రావుగారు భద్రాచలమునకు పాఱిపోయి, ఆనందరాజుగారు బందరు వెళ్ళి యున్నప్పుడు ౧౭౫౬ వ సంవత్సరమున మరలివచ్చి తనకుటుం బము నెడల విశ్వాసముగల రొంటిసేనను గూర్చుకొని రాజాముకోటను స్వాధీనము చేసికొనెను. వెంగళ్రావుగారు మూడుసంవత్సరములు ప్రభు త్వముచేసి మృతినొందఁగ, ఇంతకుముందొక వృద్ధునిచే ప్రాణరక్షణము

చేయఁబడినట్లు చెప్పఁబడిన గోపాలవేంకటరావుగారను చిన్న రంగారావు గారు రాజ్యమునకువచ్చి నాల్గుసంవత్సరములు పాలనము చేసిన తరువాత ౧౭౬౬ వ సంవత్సరమున సీతారామరాజుగారాయనను చెఱసాలలోఁ బెట్టించిరి. ఆయన ౧౭౯౦ వ సంవత్సరమునందందుండి తప్పించుకొని నిజాము రాజ్యమునకు పాఱిపోఁగా, ౧౭౯౫ వ సంవత్సరమునం దింగ్లీషువారాయనను బిలిపించి పూర్వుల బొబ్బిలిరాజ్యమంతయు మరల నిచ్చిరి.

ఈ నారాయణకవియొక్క కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యందందుఁ గానఁబడుచున్నను కవనము రసవంతమయినది. ఈ ప్రబంధమునందు వీరరస మించుమించుగా భారతమునఁ దిక్కన సోమయాజిచే వర్ణింపఁబడినట్లు వర్ణింపఁబడినది.

---

40. అతలూరి పాపకవి

ఈ కవి చెన్నబసవపురాణమను నయిదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి మా పూర్వులలో నొకరయిన కందుకూరి యమృతలింగముగారి కంకితము చేసెను. మా పూర్వులు మహమ్మదీయ ప్రభుత్వములో "దేశపాండ్యా" లయి ఘనతను బొందిపెక్కు కావ్యములను కృతులనంది కవుల నాదరించియున్నారు. పూర్వము కృతిపతులయిన వారిని గూర్చిన కొన్ని పద్యముల నీపుస్తకమునుండి యిందుదాహరించుచున్నాను.

ఉ. ఆతతకీర్తికె కువలయాశ్వచరిత్రకృతిఁ గ్రహించిప్ర
స్ఫీతము లైన కొత్తపలి యేలెటిపా డనుసగ్రహారముల్
ఖ్యాతిగఁజేసి బంధులకు గ్రాససమృద్ధి లొసంగి శాంభవ
వ్రాతము గోరుకొ లిచ్చి విభవంబున మల్లనమంత్రి వర్ధిలెన్.

కందుకూరి మల్లికార్జునమంత్రి కువలయాశ్వచరిత్రము కృతినందిన తరువాత.

సీ. మహితపంచాక్షరీమాహాత్మ్యమును గృతి
యంది త్రైలోక్యవిఖ్యాతిఁ గాంచె
నతిభక్తి శ్రీశైలమంచు మానులు మెచ్చ
సంవత్సరము నివాసంబు చేసె
నిష్ఠాగరిష్ఠుడై నేఁడునాఁడనక యు
సంఖ్యమా హేశ్వరార్చన మొనర్చె
హితుల రక్షించి యహితుల శిక్షించి భూ
పతుల వశ్యులఁజేసి చతురుఁడయ్యె
నితని కెనయైనమంత్రులీక్షితితలమునఁ
గలరెయని సర్వజననులుఁ బలుక నెగడె
గందుకూర్ మల్లి కార్జునసందనుండు
సంగరగుహుండు వీరేశలింగవిభుఁడు.

వీరేశలింగమంత్రి పంచాక్షరీమహాత్మ్యము కృతినందెను. అటు తరువాత

సీ. నారదప్రభ మించి నారదప్రభ నెంచి యుమరినకీర్తిదానములవాఁడు
చిత్రభానునిమీఱి చిత్రభానునిగేరి పరఁగుశుచిప్రతాపములఁవాఁడు
భీముపేర్మినిగెల్చి భీముపేర్మినగల్చి వఱలినభూతిసత్వములవాఁడు
ధర్మగర్మముఁద్రోచిధర్మగర్వముఁబాచి తగుశివభక్తి సత్యములవాఁడు
జగతిఁ జెలువొందె నుదయాచలేతు
శీతనగమధ్యరాట్సభాసీనవిబుధ
వినుతసుగుణుఁడుమల్లి కార్జునసుతుండు
మహితధృతిశాలిబసవరాణ్మంత్రివర్యుఁ.

క. ఘనముగ నైతముపూడియు
మినుమించిలిపాడు సిరులు మించంగ నొసఁ

గెను గురుచరవరులకు బస

వనిత్రో నెనయైనమంత్రి వసుధఁగలఁడే.

క. తనమేనయల్లుఁ డావృతి । వినయుం డగుబుద్ధిరాజు వీరనచేత

గొనె సత్యవతీపరిణయ । మనుకృతి శ్రీబసవమంత్రి యతిసంప్రీతిన్.

కంచుకూరి బసవరాజుగారు సత్యవతీపరిణయమును గృతినందిరి. అటుపిమ్మటఁ గంచుకూరి యమృతలింగముగారీ చెన్న బసవపురాణమును గృతినందిరి. కృతిపతియొక్క పెదతండ్రియైన సాళువపతి

గీ. సుగుణు లగుమల్లి కార్జునసుతులలోన

నాలుగవసందనుండగుసాళువపతి

సంతతాత్మీయహృదయపద్మాంతరాళ

సంచరత్సాళువపతి ప్రశస్తిగాంచె.

శా. ఢిల్లీనాయకుచేత దంతిహయశాటీముఖ్యవస్త్రవ్రజం

బెల్లం గైకొని కాశికాప్రముఖగౌరీశావనుల్లాంచి ని

త్యోల్లాసంబున శంకరార్చనలు దివ్యు ల్మెచ్చఁ గావించి సం

ఫుల్లాంభోరుహలోచనామదనుఁడై పూషప్రభ న్వర్ధిలెన్.

అని ఢిల్లీనాయకునిచేత బహుమానము లందినట్లు చెప్పఁబడి యుండుటచేతను, ఢిల్లీరాజ్యము నశించి నూఱుసంవత్సరములకంటె నధికకాలమగుటచేతను, కృతిపతియు కృతికర్తయు నుండినకాలము నూఱుసంవత్సరములకుఁ బూర్వమని చెప్పవచ్చును. ఈ గ్రంథమునకుఁ గథానాయకుఁడయిన చెన్నబసవన్న వీరశైవమతమును స్థాపించి కళ్యాణ నగరమునందు బిజ్జలరాజునకు మంత్రియైయుండి యాతనివధించిన బసవేశ్వరునకు మేనల్లుఁడు. బసవేశ్వరుఁడు తన యధికారబలముచేత శైవమతమును వ్యాపింపఁ జేసినను చెన్నబసవన్నయే యధికమతాభినివేశము కలవాఁడయి మతవ్యాపనమునకు ముఖ్యకారకుఁడయి యుండినవాఁడు. బసవేశ్వరుఁడు శ్రీశైలమునకు సమీపమునన్న యొక గ్రామములో

బ్రాహ్మణదంపతులకుఁ బుట్టి యుపనయన సంస్కారము చేసికొనక శివ భక్తుడయి లింగమును కట్టుకొనెడి యాచారమును మొదట నేర్పఱిచెను. ఈ చెన్నబసవపురాణములో నక్కడక్కడ లక్షణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నను, కవి మిక్కిలి ప్రౌఢుఁడయి హృద్యముగా పద్యరచనను జేసియున్నాఁడు. కవితాత యక్కరాజు; తండ్రి శ్రీగిరిమంత్రి. ఈతనిది కౌశికగోత్రము. చెన్నబసవపురాణలోని కొన్ని పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. కనుఁగవఁ గెంపునింప నలుకన్ బసవేశునిఁజూచి బిజ్జలుం
డనియెఁ బ్రధానశేఖరుఁడవై నుతిగాంచుట వన్నె కెక్కి యి
ట్లనుచితవృత్తికిం దగిలి యగ్రజ చీఁకటితప్పు సైపఁ గూ
డునె కులశీలమానములు డొంకిచనన్ ధరణీతలంబునన్. ఆ-ఁ

ఉ. ఎక్కడనుండివచ్చెనొకొ యీ ముదిజంగము వానిపూయలోఁ
జిక్కి తరాలనుండి యొకచీమకుఁ బోవఁగనీక దాఁచు నా
చక్కనిపిండి నన్నదిమి సర్వముఁ బెట్టఁగఁబంచె నింక నే
నెక్కడ రణిన్వసింతు మరు లెత్తి వ్యయం బొనరించు వీనితోన్. ఆ-ఁ

మ. ఇతఁడా శ్రీగిరిమల్లికార్జునుఁడు సామీ లెస్సబాగాయె నీ
మతిలో నేమితలంచి దైవ మని సంభావించి కాన్పింపఁ జూ
చితి నే వెట్టినిగాను వేలు పని దర్శింపంగ నాతోడనా
చతురత్వంబులు చాలు దేవు నిఁక దాఁచంబోక కాన్పింపవే. ఆ-ఁ

చ. అతులనదీప్రవాహమున నాడది యీడది రెండుకాష్ఠముల్
జతపడి కొంతదవ్వరిగి లంక తటాలున నడ్డమైన నా
జత విడి యొక్కఁ జేగు నటుసాగక యొక్కటి నిల్చుఁ గావునన్
వెత కుడువంగ నేల నను వీడె నతండని నెమ్మనంబునన్. ఆ-ర

ఉ. నిద్దురలేచి యీశ్వరుఁడు నీలగళున్ స్మరియించు వేళ నా
పెద్దయ సంచరించుసడిపీనుల సోఁకిన నావుదూడయో

యెద్దో యటంచుఁ దాసియని యేడ్తెఱ ముమ్మ్రుఱుబల్క నాతఁడీ
ప్రొద్దటి కబ్బె నాకు గురుబోధితమంత్ర మటంచు నాత్మలోఁ. ఆ-x

---

41. కస్తూరి-రంగకవి

ఈకవి లక్షణచూడామణియను నామాంతరముగల రంగరాట్ఛం దస్సును రచియించుటయేకాక సాంబనిఘంటును, కృష్ణార్జునసంవాదమునెడి యైదాశ్వాసముల కావ్యమునుగూడ రచియించెను. ఇతఁ డాచ్యేల నియోగిబ్రాహ్మణుఁడు; ఈతనితండ్రి వేంకటకృష్ణయామాత్యుఁడు; తల్లి కామాక్షమ్మ. ఇతఁడు ౧౭౯౦ వ సంవత్సరప్రాంతములయందు తంజావూరి సంస్థానమం దుండినవాఁడు. శంకరవిజయమును రచియించిన యాంధ్ర కాళిదాసు తా నీకవికి శిష్యుఁడయినట్లు తన గ్రంథమునందు వ్రాసికొనియున్నాఁడు. కస్తూరిరంగకవి విరచితమైన రంగరాట్ఛందములో ననేకాపూర్వగ్రంథములనుండి పెక్కు పద్యములు లక్ష్యములుగాఁజూపఁ బడియున్నవి. ఆ యాకవులకు కర్తృత్వమారోపింపఁబడిన యాగ్రంథ ములు కొన్ని యెంతవఱకు సత్యమైనవో యింకను విచారింపవలసి యున్నది. ఇతఁడు మంచికవి. ఈతని కవిత్వనైపుణి దెలుపుటకయి కృష్ణార్జున సంవాదములో నొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొక్క పద్యము నిందుదాహరించుచున్నాను.

ఉ. తమ్మలవ్రాలి పుష్పరసధారలుగ్రోలి సుగంధగంధవా
హమ్ములఁ గ్రాలి తేనియలయందపువాఁకలఁడేలి పువ్వుజొం
పమ్ములసోలి కింశుకసుమమ్ములవ్రేలి ప్రియాళినేలి ఝం
ఝమ్మని క్రమ్మి తుమ్మెదలు చొప్పడుచున్నవి కాననంబునఁ. ఆ-౧

ఉ. హా విధి యెంతచేసె నహహా యిపు డెంతటినూట వింటి నా
హా విపరీతదుర్దశల నందితి హా యిఁకమీఁదఁ నన్ను సం

భావనచేసి ప్రోవఁగలవా రెవరం చని యూగయుండు నెం
తే వెత఼ జెంది కన్నుఁగవ నీ రొలుకం బలవించి వెండియున్. ఆ-అ

మ. అతివ లొక్కొందలు వద్దఁజేరి యిదియేమమ్మా మహారాజుగా
సుతుఁ డం దుండఁగ సారెసారెకు నిటుల్ శోకించుట ల్మీకు సం
గతి కాదమ్మ సహించవమ్మ గయునిం గొంతేయు లెల్ల స్మయో
న్నతి రక్షించిరి నమ్మవమ్మ యని నానారీతులం బెల్చుచున్. ఆ-3

శా. యుష్మత్తాన్ద్రచమూసమూహభుజగరోద్గ్రాంధ కారంబునన్
గ్రీష్మోద్యత్సమయప్రచండకరసంకీర్ణార్క-సంకాశమ
ద్భీష్మాస్త్రంబుల నేసి మాన్చి తుది నీబీరంబు వారించెదన్
భీష్మాచార్య యొకింత నిల్వుమని గంభీరాట్టహాసోగ్రుఁడై. ఆ-ర

చ. తరణి సుధాకరుల్ గతులు తప్పఁ గులాచలము ల్వడంక ది
క్కరులు చలింప సర్వసురకాండము లంబరవీథి భీతిచే
నొరగఁ బయోధు లింకఁగ మహోద్ధతి మంటలు ప్రక్కుకొంచుఁదీ
వరముగఁ గ్రీడిపైని ఘనవైష్ణవసాయక మేగుదెంచినన్. ఆ-౫

---

42. ఆలూరి కుప్పనకవి

ఈకవి యానందగిరికృతమైన శంకరవిజయము నాంధ్రాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; వేంక టగిరిపౌత్రుఁడు; వేంకటేశ్వరార్యనకును నరసమాంబకును పుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు.

క. ఘనుఁ డగుతుళజేంద్రుఁడు దయ। తనరఁగ నీ కాంధ్రకాళిదాసాభిధ మ
న్ననగా నొసంగెనఁట నీ। యనుపమసాహిత్యమున కహా యెన గలదే?

అని కవి తనకు తంజావూరుమహారాజగు తుళజేంద్రుఁ డాంధ్రకాళి దాసను బిరుదిచ్చినట్లు చెప్పుకొనియున్నాఁడు. ఈతుళజేంద్రమహారాజు

ప్రతాపసింహమహారాజు పుత్రుఁడు. క్రీస్తుశకము ౧౭౯౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౬౫ వ సంవత్సరము వరకును తండ్రి రాజ్యమునుచేసి మృతినొందఁగా, తుళజేంద్రు డీకడపటి సంవత్సరమున సింహాసనమెక్కి ౧౭౮౮ వ సంవత్సరమునందు మృతినొందెను. ఈమహారాష్ట్ర ప్రభువు చేత నాంధ్రకాళిదాస బిరుదాభిదాన మందిన మనకవి నూరు నూట యిరువది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁడు చెన్నపట్టణ ములో నుండిన నియోగుల ప్రార్థనమీఁద దానీశంకరవిజయమును డెనిఁగించినట్లుకవి యిట్లువ్రాయుచున్నాడు.

సీ. శ్రీపార్వతీశలక్ష్మీశసేనాసము పార్జితమహనీయ భాగ్యయుతులు
ఘటనాఘటనసముత్కటమనీషాతి చమత్క్రియాధోరణీమంజుమతులు
నతులిత సామదానాద్యుపాయైకవిచక్షణాక్షీణశాశ్వత చరితులు
హితపురోహితనిజాశ్రితబాంధవావనామానసనిస్తులితాన్న దానరతులు
కలితయజనాదిమహితషట్కర్మనిరతు
లగణితజగన్నుతాద్భుతసుగుణతతులు
సారలౌకిక వైదికాచారభృతులు
చతురచెన్నపురీచరత్సచివతతులు.

* * * *

క. ననుశ్రీనృసింహపాదా | ర్చనజనితసత్కవిత్వచాతుర్యగుణా
ఢ్యుని నాంధ్రకాళిదాసా | ఖ్యునిఁబిల్వఁగఁబంచిపల్కిరున్నతకరుణన్.

సీ. లీలఁ బంచనదీస్థలీపురాణము తెలిఁగించితి వాహూఢకీర్తిమెఱయఁ
బరఁగు రామాయణభాగవతంబులు యక్షగానమునుచేసి తద్భుతముగఁ
గరమొప్ప పరమభాగవతచరిత్రయుక్త కృతియొనరించితున్నతివలిర్పఁ
దెలివొందు నిందుమతీపరిణయ నామకృతి రచియించితి వతులగరిమ
గురుతరోజ్జ్వలసరణితో సురకథాసు
ధారసాభిధకావ్యముదారఫణితి

గా రచించితి వెనలేని గద్యపద్య
తతుల లెక్కింపఁదరమె త్వత్కృతులుజగతి.

* * * *

వ. కావున జగద్గురుండై విశేషించి మనకు గురుడైన యాచార్యునివిజ
యంబు.....నొనరించి మాకంవతికి నత్యానందం బొనఁగూర్చు
మని యాశీర్వచన రూపంబుగా నిర్దేశించి పలికి యనేకరీతుల సత్క
రించిన.....

సీ. కార్యఖడ్గకవిత్వకరణికచాతురి యిలఁ బరికింప మీ యిండ్లబిరుదు
సలలితయజనాదిషట్కర్మనిరతులు ఖ్యాతిరంజిల్లు మీ జాతిబిరుదు
ధైర్యదాత్యోచితజ్ఞతాదిగుణైకసరణి మీసాంగత్యసహజబిరుద
మనుగతంబగుపాలనానూనచాతుర్యమమరుమీభవ్యగోత్రములబిరుద
మట్టివీరలు నాపట్ల నతులకృపను
గురువిజయమిట్లు తెలిఁగింపఁగోరుకొనుటఁ
గలిగె నిలమీఁద యోగంబునిలువరముగ
సారెకునియోగ మెంతని సన్నుతింతు ?

పయిపద్యములలోఁ జెప్పఁబడినదానినిబట్టి కవి యాశంకరవిజయ
మునుగాక యాంధ్రకృతులను మఱియుఁ బెక్కింటిని రచించినట్లు కను
పట్టుచున్నది. రంగరాట్ఛందస్సును రచించిన కస్తూరి రంగకవి తనకు
విద్యాగురు వయినట్లు చెప్పి కవి గ్రంథాదియందాతని నిట్లు స్తుతించి
యున్నాఁడు—

సీ. భారతి కేనిప్రవర్యునిజిహ్వ నిత్యముగ వసించునాస్థానవాటి
వాణీవధూటి కెవ్వానినున్నలుకులు ధరియించినట్టిసుత్యములచాలు
శారద కేసుధీస్వామిచేతోవీథి యమరినరత్నసింహాసనంబు
పలుకులవెలఁది కేభాజునిగృహంబు నెట్టుగా వసియించు పుట్టినిల్లు

నలువచెలువకు నెవ్వఁ డెన్నఁదగుపుత్రుఁ
డట్టికస్తూరిరంగార్యు నచలధైర్యు
నార్యనుతచర్యు మద్గురువర్యు నెంచి
ప్రణుతిగావింతుఁబలుమాఱుఁబస్తుతింతు.

మొత్తముమీఁద నీ యాంధ్రకాళిదాసునికవనము సరసమైనదని చెప్పవచ్చును. శంకర విజయములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

శా. ప్రాచుర్యం బగుతావకీనకధితప్రఖ్యాతసంశుద్ధ వే
దాచారంబులు మాని తప్తతనులై యీయీకుచిహ్నంబుల
వైచిత్ర్యంబుగఁ దాల్చి విప్రముఖులౌ వారెల్ల నత్యంతమి
థ్యాచారంబున సంచరించెదరు దర్పాయూథులై యీశ్వరా. ఆ-౧

చ. అనయము నైజధర్మములయందుఁ జలింపక మిత్రశత్రుభా
వనల స్వపక్షు మంచుఁ బరబక్షు మటంచుఁ దలంప కెంతయున్
ఘనసమబుద్ధిమీఱుఁ గలఁకంగొన కెవ్వరి నొవ్వనేయకే
పనుపడి స్వస్థచిత్తుఁ డగువాఁడుసుమీ హరిభక్తుడెంతయున్. ఆ-3

మ. సను నీభక్తుఁ డటంచు నెంచ కిల విన్నాణంబుగా నిట్లొన
ర్చినయజ్ఞానుల నేమిపల్క నిఁక నీచిత్తంబు నా భాగ్య మో
యనుకంపానిధి నిన్ను నమ్మితిని నెయ్యంబొప్ప నీవేళ నీ
యనలార్తిం దొలఁగించి ప్రోవుము నృసింహా దీనకల్పద్రుమా. ఆ-౬

---

43. పింగళి ఎల్లనార్యుఁడు

ఈ కవి సర్వేశ్వరమాహాత్మ్యమను నామాంతరముగల తోభ్య చరిత్రమును రచియించెను. తోభ్యచరిత్రము నాలుగాశ్వాసములుగల క్రైస్తవగ్రంథము. "ఇది శ్రీమదివ్వటూరి శరభనారాధ్య సద్గురుప్రసాదలబ్ధాష్టవిధకవిత్వప్రవీణ" అని గద్యమునందు వ్రాసికొనుటచేతను,

సీ. భక్తియై రేణుకప్రమథోత్తము నుతించి
మాయదేవాహ్వాయుమహిమ పొగడి
చెలఁగి యథావాక్యముల నన్నమయగారి
భజియించి మ్రొక్కెడి పాలకురికి
సోమన్నగారిఁ బ్రస్తుతిచేసి ప్రియమంది
శివదేవముఖనవకవుల నెంచి
గణపతిదేవుని ఘనతసన్నుతిచేసి
వేమనఁ గీర్తించి విమలమతిని
వ్యాసవాల్మీకికాళిదాసాదిఘనుల
నన్నపార్యునిఁ దిక్కనయజ్ఞ నెఱ్ఱి
ప్రెగడ ధూర్జటిఁ బోతన భీమకవిని
జెలఁగి శ్రీనాథముఖకవిశ్రేణిఁ దలఁచి.

అని శివభక్తులను ముఖ్యముగా నుతించి యుండుటచేతను, ఈ కవి శైవుఁడయిన నియోగి బ్రాహ్మణుఁడని యూహింపఁదగి యున్నాఁడు. ఇతఁడు క్రైస్తవుఁడుగాక శైవబ్రాహ్మణుఁడే యైనపట్టున, క్రైస్తవమతగ్రంథ మేల చేసెనో తెలియకున్నది. ఇతఁడు క్రైస్తవమతావలంబనముచేతఁగాని, ధనాపేక్షచేతఁగాని యీ గ్రంథమును రచించి యుండును. కవి భారద్వాజగోత్రుఁడు; పింగళి నాగయామాత్యపుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండలములోని కొండవీటిసీమయందుండిన నియోగి

బ్రాహ్మణుఁడు. ఈ కవి తుమ్మరాయపరెడ్డి ప్రేరణముచేత నీ గ్రంథమును రచియించెను. ఈ సందర్భమునఁ గవికృత్యాదిని వ్రాసిన పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

చ. తసర విదర్భసీమ కవతంస మనందగుకొండవీటి కిం
బ్రునిదెస రాజ్యలక్ష్మికి నిరూఢనివాస మనంగ భక్తవా
డనుపుర మొప్పు నుర్వరకు హారమణిస్థితిఁ బొల్చి సజ్జనుల్
ధనకనకాంబరామలసదావిభవోన్నతిఁ జెంది వర్ధిలన్.

వ. ఆ పట్టణంబున కధీశ్వరుండు.

సీ. తనకీర్తికామినుల్ దశదిశాభాగరంగస్థలంబుల నాట్యగతులు నెఱపఁ
దనశౌర్యవహ్ని దుర్దమభయంకరశత్రుధరణీశ్వరాటవుల్ దరికొనంగఁ
దనదానధారానితంబినీరత్నము లబ్ధినాయకులత్తో ననఁగి పెనఁగఁ
దనకరుణారసఘనతరౌషధ మఖిలార్థిదారిద్ర్యామయంబు లడఁప
ఘనతఁ జెన్నొందుజగనొబ్బగండబిరుద
భూషణుఁడుతుమ్మవంశాబ్ధిపూర్ణచంద్రుఁ
డలఘుచరితుఁ డనంతాధిపాత్మజుండు
రమ్యరుచిహేళి రాయపరెడ్డిమూళి.

వ. ఒక్కనాఁ డమాత్యపురోహిత విద్వత్కవీంద్రతార్కిక మీమాంసిక
వందిమాగధ సుహృద్బంధు సేనాధీశ్వరసహితంబుగా నాస్థానమంట
పంబున గీతవాద్యనృత్య వినోదలీలాకౌతూహలమానసుండై యుచి
తాసనంబున సుఖాసీనుండై

గీ. అనుఁగుఁదమ్ముఁడు పాపన్న వినయగరిమ
నాత్మధర్మప్రవర్తన ననుకరింపఁ
బరఁగ ధరమంత్రిపుత్తురిపాపనార్యుఁ
డెలమివిద్యాప్రసంగముల్సలుపుచుండ.

మ. ననుఁ శ్రీనుద్దురుచిత్కా ళేఖణమహాసంధానుసంధానపా
వనకారుణ్యకటాక్షులబ్ధవరగీర్వాణాంధ్రభాషాకవి
త్వనిరోష్ఠక్రమచిత్రలక్షణచమత్కారప్రబంధాశుక
ల్పనునిన్ బింగళి యెల్ల నార్యమణిఁ బిల్వంబంచి పలెక్కాం గృపన్.

చ. ప్రణుతయశోవిశాలుఁడవు భాసురశబ్దనిగుంభ నాదిల
క్షణములఁ జిత్రవైఖరుల సర్వనృపాలసభాంతరంబులన్
గణుతికి నెక్కినీకవితఁ గర్ణరసాయన మూచు నిఫ్పురీ
గఁకవితానమందు నతిగౌరవ మందితి వెంచిచూడఁగన్.

* * * *

శా. కొండారెడ్డిసునుండు శౌర్యఘటిమన్ గొల్చి న్మరాటీల ను
ద్దండుం డన్న యతండు మాకు సుకవీంద్రశ్రేణిఁ బ్రోచున్ సిరుల్
నిండన్ దామెర వేంకటాధిపుఁడు మన్నించంగఁ బామూరిలో
నుండు న్నిన్ను బహూకరింపఁగలఁ డేయుద్యత్కృతిశ్రేష్ఠతన్.

వ. .....మున్ను మజ్జనకాగ్రజుండును గొండారెడ్డికి జనకుండును నగు
నోబళరెడ్డి భూకాంతునకుం దదీయాచార్యుండగు సంజీవనాథస్వామి
పరాపరవిజ్ఞానమార్గోపదేశ ప్రసంగవశంబున నిత్యం బైనసత్యాధ్య
యనవిధానప్రవర్తకుం డైనతోభ్యుండను నొక్కమహాపురుషునిదివ్య
చరిత్రంబు గలసర్వేశ్వరమాహాత్మ్యంబు చిత్రంబుగా ముఖవచనం
బులం దేటపడిచి సంక్షేపరూపంబైనవాక్యగ్రంథంబొసంగె. దీనిం బరి
శీలించి సర్వేశ్వరుని కంకితంబుగాఁ దెనుంగున మృదువచన రచనా
గౌరవం బేర్పడఁ బ్రబంధంబుగా పరిణమింపవలయు.....

పయిదానినిబట్టి యీకవి యంతకుమున్ను వచనకావ్యముగా రచి
యింపఁబడినదానినిబట్టి యీపద్యకావ్యమును రచించినట్లు తెలియ
వచ్చుటయేకాక యితఁడు దామెర వేంకటాధిపునికాలములో నుండినట్లు
కూడ స్పష్టమగుచున్నది. బహుళాశ్వచరిత్రమును రచియించిన దామెర

వేంకటాధిపుఁడు పదునేడవశతాబ్దారంభమునం దుండినవాఁడు. ఇతఁ డతఁడుగాక యాతనిమనుమఁడయినను, కవి పదునేడవశతాబ్దమధ్యమునం దున్నట్లేర్పడుచున్నది. దీనినిబట్టి చూడఁగా నీతోభ్యచరిత్రము వేదాంత రసాయనమునకంటెఁ బూర్వమున రచియింపఁబడినట్లు కానఁబడుచున్నది. ఈకవి కవిత్వము మృదుమధురపాకము గలదయి హృద్యముగా నున్నది. కవనపటిమ తెలియుట కయి తోభ్యచరిత్రమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. ఇల కంపించినఁ దారకల్ చెదరినఁ హేమాచలం బెంతయున్
దలక్రిందైనను భానుఁ డస్తగిరిమీఁదం దోఁచినన్ దిగ్గజా
వలి యల్లాడిన వార్ధి లింకిన మనోవాక్కాయకర్మంబులఁ
బలుకంబూనఁ డసత్య మెన్నటికి మానం డాత్మధర్మస్థితిఁ. ఆ. ౧.

మ. అకటా చేరెడుకూలిబియ్యమునకై యత్యంతనిర్భాగ్యుడా
నకళావై భవలక్ష్మికిన్ నిలయమా నాతల్లిహస్తాబ్జ మిం
తకృశీభావము నొంది క్రింపుపడఁగా నాగుండె యెంతే వికా
వికలై ప్రీలక నిల్చియుండెఁ గతినోర్వీభృద్విపక్షాసిపై. ఆ. ౨.

ఉ. బాలుఁడు వీని నింతకును బాములనోరఁగనీక పెంచితిఁ
దాళఁగఁజాలఁ డాఁకలికి దప్పికి వేళ యతిక్రమించినన్
మేలొనరింపఁ గైకొనిన మిమ్మొక నేమనివేఁడుకొందు నా
జాలి దొఱంగు టెట్లు మునిసత్తమ సత్కృప నానతీయవే. ఆ. 3.

ఉ. సంతసమంది యప్పుడ వెసఁ మగుడంజని ప్రాణనాథ యీ
వంతయుఁ జింతలేదు భవనాత్మజ మున్నుగలేచి పాదుకల్
కాంతునిమ్రోల నిడ్డ నెసకంబుగఁ దల్పము డిగ్గు నారతీ
కాంతునిబోలు నాఘనుని గన్నులపండువుగాఁగ జూచితిన్. ఆ. ౪.

---

44. చింతకుంట కోదండరామకవి

ఈకవి సునందాపరిణయమును నామాంతరముగల ప్రదీపచరిత్రము నైదాశ్వాసములప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు, అక్కనమంత్రిపుత్రుఁడు. కవి తన వంశజులలో సుప్ర సిద్ధుఁడయి యుండిన రాయనభాస్కరు నిట్లు వర్ణించియున్నాఁడు—

సీ. ఘనతరౌదార్యదీక్షాకల్పితానల్పకరనిబద్ధసువర్ణకంకణుండు
ఆసేతుశీతనగాంతరరాట్సభామధ్యవిశ్రుతకీర్తిమండలుండు
కొండపల్లీ వినకొండ దుర్గద్వయీదేశప్రజావనధీయుతుండు
సకలావనీపక సంతానయాచితవస్తుప్రదానప్రవర్తనుండు
అన్నవేమమహీశదత్తాగ్రహార ।
మదకలాందోళికాశ్వసన్మణివిశేష ।
భూషణాద్యష్టభూతివిభూషితుండు ।
భానుతేజుండు రాయనభాస్కరుండు.

ఈకవి ౧౭౯౦ వ సంవత్సర ప్రాంతమునం దుండినవాఁడు. ఈతని కవిత్వము ముత్తముమీఁద రసవంతమయి హృద్యముగానే యున్నది. సునందాపరిణయములోని కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడు చున్నవి—

శా. సేవార్థాగతకామినీసికరకాంచీకింకిణీకంకణా
రావంబు ల్వివిధోరువాద్యపటలీరమ్యధ్వనుల్ భవ్యభూ
దేవాగ్రేసరగానసంయుతములై దిక్కుల్తగ న్నిండఁగా
దేవాగారము లొప్పు నప్పురమునన్ దేదీప్యమానంబులై. ఆ. ౧.

ఉ. ఇమ్మెయిఁ బెట్టుచాయ లవియెన్నఁగ నేటికి నైజకాంతిచే
నిమ్మదిరాఁటిమోముసరి యిచ్చట నెచ్చట లేదు చూడ నీ
నెమ్మది సంశయం బయిన నిక్కము చేసెద నిప్పు డాన నా
తమ్ములమీఁదఁ బెట్టుకొనెదన్ ద్విజరాజుకుఁ జేయిసాఁచెదన్. ఆ. ౩.

ఉ. కుంజరయూన కాంచె నవకోరకసూనపరీతమంజరీ
మంజులపుంజరంజితసమంజసభవ్యనికుంజసంభ్రమ
ద్గుంజదమందషట్పరణకోటిరవాంచితసద్దిగంతమున్
గంజముఖీవిలాససఖికాంతసిఖాంతము నవ్యనాంతమున్. ఆ. 3.

ఉ. అన్నువులార నావలపు నంగడిఁ బెట్టకు రమ్మ చాలు మీ
మన్నన లింక నన్నుఁ బలుపూటును వేఁడకు రమ్మ ప్రాణముల్
క్రొన్ననవింటిదేవతకుఁ గొంకక యిచ్చెద నమ్మవాసి నే
మున్ను రవంత పోవిడుట మోసమువచ్చెఁగదమ్మ బుద్ధికిన్. ఆ. ర.

ఉ. సంతమసంబుపోక నవసారసలక్ష్మికివీఁక యామినీ
కాంతకుఁగాఁక కోకకళకంబులజోక యులూకపం క్తికిక్
జింతలమూఁక పద్మాలకుఁ జెన్నగుఢాక ప్రభాతకాలపున్
వింతకురాక శోణరుచి వి స్నెగఁబ్రాఁకి చెలంగె దిక్కులన్. ఆ. ఇ.

---

45. కైప మాయనకవి

ఇతఁడుపాకళ్యాణ మనఁబడెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు వైదికబ్రాహ్మణుఁడు; మహాదేవశాస్త్రికిని కామాక్షికిని బుత్రుఁడు. ఈకవి యుషాకళ్యాణమునందుఁ దనజనకుని నిట్లు స్తుతించెను—

క. కామాహంకృతిహారణుఁడు
కామాక్షీథవుఁడు విబుధగణవినుతగుణ
స్తోముడు సర్వజ్ఞుఁడు ని
స్సీమయశోధనుఁడు వృషవిశేషప్రియుఁడున్.

గీ. చిద్విలాసకళానిధిశేఖరుండు
శ్రీమహాదేవుఁ డాశ్రితశ్రీకరుండు

కైపకులవార్ధి చంద్రలింగనకవీంద్ర
పుత్రుడై యొప్పె నాకవిపుణ్య మేమొ.

గీ. ఆమహాదేవు నప్రమేయప్రభావు
ధర్మవర్ధను ననుఁగన్నతండ్రి నాత్మఁ
దలఁచి తద్దివ్యపదపద్మములనుగొలుత్రు
నక్షులనతులను బృధులవినుతతులను.

ఈకవి నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁడగుటకు సందేహ ముండదు. ఇతఁడు తనపుస్తకమునిండను శబ్దాలంకారములను విశేష ముగా సమకూర్చెనుగాని పుస్తకమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈశృంగార ప్రబంధము కొంతవఱకు రసపుష్టికలదిగానే యున్నది. ఉపాకళ్యాణమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. త్రిజగన్మోహనదీపనో బలరుజయశ్రీపూర్ణనిక్షేపమో
యజనై పుణ్యకలాపమో తపనచంద్రాగ్నిత్రయీరూపమో
ద్విజముఖ్యస్తుతలగ్నమం దొకమహాతేజంబు తద్భీష్మకా
త్మజగర్భంబున నుద్భవించెను సమస్తానందసంధాయియై. అ. ౧.

ఉ. భంబులు గోళ్ళు పల్లవనిభంబులు కాళ్ళు మనోజకాహళా
భంబులు జంఘ లౌర కరభంబులు సక్థులు శాతకుంభకుం
భంబు లురోజముల్ దరనభంబులు కంఠవలగ్నముల్ ద్విరే
భంబులు కుంతలంబులు శుభంబు లుపాసతిలక్షణంబులున్. అ. ౨.

చ. అతఁడును మారుదారుణశరావళిహావళి కోర్వలేమి నో
సుతనుమణీ మనీష నిటు సోలుచు వ్రాలుచుఁ దూలనేల నీ
వితరపుఁజింతఁ దక్కి నుతి కెక్కిన హేలల నోలలాడుమా
దృతముగఁ జేతుఁగామితముఁ దెల్పుము సల్పుముబల్కుముచ్చటల్ అ. 3

ఉ. ఇయ్యెడఁ దియ్యనూవిచిగు రెంతయు వింతగఁ దేనె లొల్కుచున్
సయ్యనఁజాలుమేలుజిగిచాలునఁ గ్రాలు ననూనవై ఖరిఁ
దొయ్యలి తావకాధరముతో సరికా దవునంచు సందియం
బయ్యెడిఁ దారతమ్య మరయంజను నీ నునుమోవి నియ్యవే. ఆ.ర.

ఉ. నాకులఁ బూర్వనాకుల వినంబడ నట్టివిధంబు లొప్పఁ దఁ
దాఁకుచు మిన్ను ప్రాఁకుచును దద్దయు యుద్ధముసల్పుతన్మదో
ద్రేకులఁ దమ్మిజేకులవలెఁ హాలకోటి కలంకరించి పె
ల్లాఁకలిగొన్నరోకలికి నాహుతిఁ జేసెను సీరి పోరిలోఁ. ఆ. శి.

---

46. వెలిదండ్ల వేంకటపతి

ఇతఁడు రాధామాధవసంవాద మను మూడాశ్వాసముల ప్రబంధమును రచియించి ప్రళయకావేరి నివాసుఁడగు మగదలరామదాసున కంకితమొనర్చెను. ఈకవి తిరువేంగళాచార్యపుత్రుఁడు. కృతిపతియగు మగదల రామదాసామాత్యుఁడు గతశతాబ్దమధ్యమునకుఁ దరువాత నుండినవాఁడయినందునఁ గవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వము మనోహరముగానేయుండును. రాధామాధవసంవాదములోని మూడుపద్యముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. పదుచులత్రోడ నాడఁ బసిబాలుఁడవా వలదన్న మానవా.
గడములు కొన్ని నేర్చితివి కల్లరి వైతివి కొల్లకాఁడవై
దుడుకులు చేయఁజాగితివి దొంగిలఁజొచ్చితి వేమిచెప్పిన
వడిగఁ బరాకుచేసికొని వాకిటి కేగెదు పిల్వఁ బిల్వఁగఁ. ఆ. ఁ.

ఉ. పేవగవారుచేసిన సహించి తనంతటివారిఁ జేయుచున్
దైవము దాత తల్లియును దండ్రియుఁ దానయి ప్రోవఁగా జగ
త్భావనమూర్తియౌ తనకుఁ బావనమే తనుఁగన్న దేవకీ
దేవిని దన్నుఁగన్నవసుదేవుని నాపదఁ బాచి ప్రోచుటల్. ఆ. 2.

ఉ. ఒక్కతె భ్రాంతిచేఁ బొరల నొక్కఁడు మానుపఁబూఁటకాఁపె నే
నొక్కడిదాన నీవు మును పెక్కఁడివాఁడవు నాకు నీకు నే
మక్కఅ వెన్కనైన నొక రాడెడుపల్కులు నేనె పల్కెదన్
గ్రుక్కఁగ నాయెఁబోయె నవి కొన్నిదినాలుబ్రుణానుబంధముల్. ఆ-3

---

47. పట్టమెట్ట సరస్వతి సోమయాజి

ఇతఁడు పృథుచరిత్ర మను ప్రబంధమును రచియించి దాఁకా రామ భీమేశ్వరున కంకితముచేసెను. ఈకవి యాఁపవేలనియోగిబ్రాహ్మణుఁడు; హారితసగోత్రుఁడు; పోతనామాత్యపౌత్రుఁడు; పెద్దనార్యపుత్రుఁడు; శివలంక గౌరనార్యునిశిష్యుఁడు. ఈశ్వరుఁడు స్వప్నమున సాఁకా తఱించి తన్నుఁగూర్చి యిట్లు పలికెనని కవి గ్రంథాదిని చెప్పుకొనియున్నాఁడు—

సీ. నవఘుంటసురతాణినామధేయమువాఁడు తాత్మవెల్వలపల్లి పోతరాజు
కవిశేఖరుం డఁన గపిధూర్జటి యనంగఁ బెనుపొందుటనకుండుపెద్దిరాజు
సవనదీక్షామహేశ్వరుఁడు శ్రీరఘునాథ సోమయాజి నిజాగ్రజుండు
గురుఁడు

తల్లి పాతివ్రత్యధర్మబుద్ధికదంబ కారుణ్యజగదంబ పేరమాంబ
నీకు మద్వారలబ్ధవాణీప్రసాద
మంగకవచంబు సకలవిద్యాస్థలములఁ

బట్ట మెట్టాంక వెల్వలషలివృషాంక
సోమయాజి సరస్వతిసోమయాజి.

ఉ. శైవులలోషలం బరమశైవుఁడు వేదపురాణవాణిచే
దైవగురుండు నీగురుఁడు ధన్యుఁడు శ్రీశివలంకవారిలో
దేవనిభుఁడు భక్తి శివదేవుఁడు గౌరయగారు తత్కృపా
భావనకీర్తిఁ గాంచితివి బాలసరస్వతి దీక్షితాగ్రణీ.

ఈకవి కవిత్వము శబ్దార్థాలంకార భూయిష్ఠమయిమృదుమధుర పదఘటితంబయిసలక్షణమయి హృదయకర్ణ రంజకముగా నున్నది. ఈతని పృథుచరిత్రమునందలి శబ్దాలంకారరీతిని జూపుటకయి యొకపద్యము నిందుఁ బొందుపఱుచుచున్నాను—

సీ. హస్తకంకణములు హస్తకంకణములు పదసంపదధికసంపద లొసంగ
మఖజాతవేదంబు ముఖజాతవేదంబు స్వర్గాపవర్గరాజ్యము లొసంగఁ
గళ్యాణతత్వంబు కళ్యాణతత్వంబు సగుణనిర్గుణవృత్తిచయ మొసంగ
సత్యానుకూల్యంబు సత్యానుకూల్యంబు సాధ్వీశ్వరత్వంబుసంఘటింపఁ
బరఁగుదై వతకులశిరః ప్రకటకుసుమ
మంజుమకరందధారాసమంజసాంఘ్రి
పద్మసన్నిధిసన్నిధిప్రభవవిభవ
శాశ్వతశ్రీకరుండు సర్వేశ్వరుండు.

ఈకవి గోదావరీ మండలములోనివాఁడనుట వేఱుగఁ జెప్పనక్కఱ లేకయే కృతిదాతౌరామభీమేశ్వరుని కంకితము చేయఁబడుటచేతనే తెలిసికొనవచ్చును. ఇతఁడు నూఱుసంవత్సరములకుఁ బూర్వమునందుం డినవాఁడు. ఇతని పృథుచరిత్రములోనికొన్నిపద్యముల నిందుదాహరించు చున్నాను—

చ. మలయుఁ బురంబునన్ నిరుపమానవిమానసమానధామకో
మలలలనామనోరమసమాగమభోగమదాంతశాంతతా

జలకలికానికారముఖసారనగంధసుగంధసారముల్
మలయమరుత్కిశోరములు మారవిహారకరప్రచారముల్. ఆ. ౧.

శా. చూపుంజూపును వియ్యమయ్యె సతికిన్ క్ష్మోణీతలస్వామికిన్
దూపుందూపును వియ్యమయ్యె రతికిన్ దోడ్తోరతిస్వామికిన్
జాపాభ్యాసము చూడుఁడీ సభ మహాచాతుర్య మన్నట్లు త
ద్రూపారిష్లవచేష్ట లొప్పెఁ దమిచూపుల్ వ్రీడనుళ్ళింపఁగన్. ఆ. ౨.

చ. కదలిరి పాఠకోత్తములు గాముకులుం గవులు న్మహాకవుల్
మెదలిరి సత్ప్రియాణమతి మిశ్రితమిశ్రితత్రుల్ నిజాశ్రితుల్
పొదలిరి వాంఛితార్థపరిపూర్ణసువర్ణసువర్ణసంతత్రుల్
తదనుమతిం బుధంబులకుఁ దత్పరదత్పరతత్పరాగతిన్. ఆ. 3.

చ. అలసితి రమ్మలార కుసుమోపచయం బొనరించి దండ మీ
యలయిక లేనఁటంచు నని యంబురుహాకరలక్ష్మిసంపునె
చ్చెలు లనఁ జెల్వలం దరలిచెన్ జలజోత్పలపత్రవాసనా
లలితమదాళినీకలకలంబుల శీతలవాతపోతముల్. ఆ. ౪.

---

48. అవుడూరి కిచ్చయ్య

ఈకవి కాళిదాసప్రణీత మయిరఘువంశమహాకావ్యమును పది యాశ్వాసముల గ్రంథముగా రచియించెను. కిచ్చయ్య నియోగిబ్రాహ్మణుఁడు; గురువసుమామాత్యసి పుత్రుఁడు; హారితసగోత్రుఁడు; చెన్న కృష్ణశాస్త్రిశిష్యుఁడు. ఇతఁడు నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రింద టనుండినట్లు తెలియవచ్చుచున్నది. ఆంధ్రరఘువంశకావ్యము సంస్కృత కావ్యమంత మనోహరముగా లేకపోయినను మొత్తముమీఁదరసవంతముగానే యున్నది. కవిత్వశైలి తెలియుట కయి రఘువంశమునుండి రెండు మూడుపద్యముల నిందు బొందుపరుచుచున్నాను—

ఉ. ఉన్నతమ ర్త్యలభ్యపద మొందెదనన్మతి నూర్ధ్వబాహుఁడై
యున్న సగర్వఖర్వమనుజోత్తముకైవడి మందబుద్ధి గై
కొన్ననరుండు సాధుకవికుంజరకీర్తి వహించ నెంచినన్
సన్నుతిచేయఁబోవుదురొకో సత్కవులైనసమస్తభూజనుల్. ఆ. ౧.

చ. పొలఁతికొ! విన్మ ముత్తియపుఁబూసలఁబోలెడుబాష్పవారిబిం
దులఁ బరిపంథిధాత్రిపవధూస్తనపాళిని బ్రస్తరించునీ
కలితమహౌజుఁ డై నమహికాంతునిచేత సమర్పితంబులై
యలరె గృహీతసూత్రకములై తగుమాక్తికతారహారముల్. ఆ. ౨.

మ. తనపై విశ్వసనంబు పంక్తిముఖధూర్తత్వంబునన్మన్ననుచెం
దనియీభూజను లియ్యెడన్ నిజచరిత్రంబంగు విశ్వాస మొం
దినమీయూజ్ఞఁ బరిగ్రహింతుఁ దనయాప్తింగాంచి శోభిల్లు స
జ్జనకథ్యావిభుకూర్మపుత్రునని కౌసల్యాతనూజుం డనన్. ఆ. ౩.

ఈకవి రఘువంశముగాక మాధవాభ్యుదయ మను మఱియొక ప్రబంధమునుగూడ రచియించెను. ఈక్రిది రెండుపద్యములును మాధవాభ్యుదయములోనివి—

ఉ. అంతట నొక్కనాఁడు చతురాస్యుఁడు వేదచయంబుఁగానమిన్
వంతదురంతచింత బలవంతము పంతముసంతసిల్ల శ్రీ
కాంతనితాంతకాంతపతకంజయుగంబు మదిన్ ఘటించి య
శ్శాంతభయైకభక్తిఁ గరసారసముల్మకుళించి యిట్లనున్.

శా. త్రుంతుక్ సోమకు నుద్ధరింతు నిగమస్తోమంబు లంచుక్ రమా
కాంతుం డొండె సువర్ణసంఘటితజాగ్రత్పుష్పవర్షీకృతా
తాంతోత్తాలకరాళవాలహతి గూతత్రాహిదీశాపృష
త్సంతానాహతినిష్పతత్సురతరూద్యద్భూనభోమానాకృతిన్. ఆ. ౧.

49. తక్కెళ్లపాటి లింగన్న

ఆధునికుడైన యీకవియొక్క కాల మెప్పుడో నిశ్చయముగా దెలియలేదుగాని యితడించుమించుగా నూఱు నూటయేబదిసంవత్స రములక్రిందట నుండినట్లూహించుదగియున్నది. నూఱుసంవత్సరములక్రిం దట రచియింపబడిన లక్షణ గ్రంథములలోసహిత మీతనిగ్రంథములలో నుండి లక్ష్యములుగాఁ గైకొనఁబడిన పద్యములు కానరావు. అట్లు కైకొనఁబడకపోవుట కీతనికవనము లక్షణవిరుద్ధముగా నుండుటయే కార ణమయి యుండవచ్చును. కవి తాను రచియించిన గ్రంథములపేళ్ళ నుత్తరహరిశ్చంద్రకథలోని యీక్రింది పద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. తగ రచించితిని మదనమోహినీవిలా
సంబు మెప్పుగ యీవనంబునందు
భక్తిసూర్యతనయోపరిణయ మనెడు ప్ర
బంధంబుఁ జెప్పితిఁ బ్రౌఢిమమున
నావెనుక విద్యుత్ప్రభావిలాసము వేడ్క
ఘటియించితిని యట్లుగానరీతి
నలువది యేండ్లప్రాయమున నుత్తరహరి
శ్చంద్రాఖ్యకథ యిది సారమతిని
వేంకటేశ్వర శ్రీరామనిభుల కెలమి
నంకితంబుగ మునుచెప్పినట్టికృతుల
రీతి నిది కృష్ణునకు సమర్పించి యిప్పు
డిలను ధన్యుండనైతి నార్యులు మతింప.

వీనిలో మదనమోహినీవిలాసమును, సూర్యతనయోపరిణయ మును, ఉత్తర హరిశ్చంద్రకథయు, పద్యకావ్యములనియు, విద్యుత్ప్రభా విలాసము యట్లుగానమనియు, పైపద్యమువలననే తెలియవచ్చుచున్నవి.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; చిట్టయ్య పౌత్రుఁడు; వేంకటపతిపుత్రుఁడు. ఈతని తల్లిపేరు సూరమ్మ. ఇతఁడి రసవంతమైన ప్రౌఢకవిత్వముకాదు; యౌవనకాలమున రచియించిన గ్రంథములలోనేకాక యటువదియేండ్లు వచ్చినతరువాత రచియించిన యుత్తర హరిశ్చంద్రకథలో సహితము లక్షణవిరుద్ధము లయినప్రయోగము లనేకములు గానఁబడుచున్నవి. ఈతనిగ్రంథములలోని రెండేసిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

మదనమోహినీ విలాసము.

ఉ. అక్కట మానివర్యుఁ డమరాధిపుతోఁ బలుకంగ నూరకే
గ్రుక్కున నుండలేక ప్రతికూలుఁడనై పరుషంబువల్కనే
నిక్కడి కేలవచ్చితి సహింపఁగరాని వియోగవహ్నిచేఁ
బొక్కఁగనేల దేవవిటపుంగవు లింతకు నవ్వకుందురే.

ఉ. కమ్మనివింటిబోయ యొడికంబుగ సంజమొగింగుటగ్గి చే
బముక కోకదంపతులపై వడిఁ బుప్పొడిమందు కాల్వఁగాఁ
వమ్మితుపాకినాళమున దారున వెల్వమునుక్కగుండ్లనా
దొమ్మగఁ జిమ్మరేఁగె నలతుమ్మెద లెల్లసరోవరంబులన్.

సూర్యతనయా పరిణయము.

ఉ. ఒచ్చెము లేనిరూపమహిమోన్నతి యీసతికే తగుంగదా
యచ్చున నొత్తినట్లు వెలయున్ లిఖియింపఁగ నీకెచెల్లుఁగా
కిచ్చెలువన్ వరింపఁగలఁడే యొకఁ డెందును నన్నుఁగన్న యీ
పచ్చనిశాటివాఁడె తగుఁ బంకజలోచనఁ బెండ్లియాడఁగన్. ఆ.ఆ.

చ. హరి యలధర్మసూతిపురి నప్పటి కుండెను వింటిచే రమా
వరుఁ డిటువచ్చునో యనుచు వారక చూచితి మిన్ననాళ్ళు నే
డరుదుగ నొక్కమాట వినవయ్యె ముకుందుఁడు వేఁటవచ్చె ని
ర్ధరవరసూరుతోడనని సత్యము లే కదియున్ మృషోక్తియో. ఆ.శ్ర.

ఉత్తరహరిశ్చంద్ర కథ.

చ. జలరుహబాంధవాన్వయనిశాధవ! యోనరనాధ! నేఁడుగా
ఫలితము లయ్యె మాక్రతుజవ్రత మాహామతపఃప్రభావముల్
కలఁగి మహాపద ల్దడచి కాంతయు మీరును బుత్రరత్నము
వలనుగ సర్వరాజ్యవిభవంబు వహింపఁగఁ జూడఁగాంచుటన్.

మ. సకియా! యేను ద్రిశంకసూనుఁడ హరిశ్చంద్రుండు నాపేరు పా
యక సైన్యావళితోడ ఘోరమృగయావ్యాసక్తచిత్తుండనై
ప్రకటారణ్యగిరీంద్రసానువులు చేరన్వచ్చి వర్తించుచో
నొకక్రోడం బలయించి చిక్కఁ కరుదే నొక్కండఁ దీవ్రంబుగన్.

---

50. గుడిపాటి కోదండపతి

ఈకవి శృంగారరసమంజరి యనుపేర భానుమిశ్ర విరచిత మైన రసమంజరిని మూడు గుచ్ఛములనుగాఁ జెనిఁగించెను. ఈగ్రంథము శృంగారనాయికానాయకలక్షణములను దెలుపునది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు. పూర్వకాలమునందు నందుఁడను చంద్రవంశపు రాజొకఁడు కర్ణాటకదేశమును పాలించుచుండెనఁట. అతఁడు స్వీయ మహిమచేత "యోగవాగ"ముల నెక్కి రహస్యముగా బోయి ప్రతిదిన మును కాశీకాపురములో గంగాస్నానమును జేసి వచ్చుచుండెనఁట! ఈరహస్యము నతని భార్య కనిపెట్టి యొకనాఁడు తన్నుగూడ వెంటఁ గొనిపోమ్మని భర్తను నిర్బంధ పెట్టెనఁట. అతఁ డామె నిర్బంధమును మానుపుకోలేక భార్యను వెంటఁ గొనిపోగా, కాశీపురమును జేరిన తరు వాత నామె బహిష్ఠ యయ్యెనఁట. అందుచేత యోగవాగములు మయిలసోఁకి నడవకపోయినందున నతఁడు స్వపురమును జేరుట కుపా

యము తోఁపక పరితపించి గంగాతీరమునందున్న బ్రాహ్మణులను ప్రార్థింపఁగా వారు తమకుఁ గర్ణాటక రాజ్యమునందు వృత్తుల నొసఁగు నట్లు చముడేశ్వరీసన్నిధానమునం దాతనిచేతఁ బ్రమాణము చేయించు కొని స్నానము చేయించి యాతని భార్య నప్పుడే తమమంత్రప్రభావము చేత శుద్ధురాలినిజేసి యోగవాగములను నడిపించి యీరాజదంపతులను స్వరాజధానికిఁ బంపివేసిరఁట. అటు తరువాతఁ గొన్ని సంవత్సరములకు కాశీదేశమున హౌమము సంభవింపఁగా నాశ్వలాయనసూత్రు లయిన యీబ్రాహ్మణు లేనూఱు కుటుంబములవారు బైలుదేఱి పదుమూడు గోత్రములవారు నందుని రాజధానికి వచ్చిరఁట! అప్పుడు రాజు తాను జీవనములు కల్పించెదనన్న బ్రాహ్మణులు వీరేయని చూపుటకై సాక్షు లను దేవలయునని కోరఁగా వారు కాశీకాపురమునుండి చముడేశ్వరీ మహాదేవినే గొనివచ్చి యీమెచే సాక్ష్యమిప్పించిరఁట! అంతట రాజు వారిమహిమ కద్భుతపడి తనపేరిట నందవరమును గ్రామము గట్టించి వారి కగ్రహారముగా నిచ్చెనఁట. నందవరమునందుండిన బ్రాహ్మణులగు టచే వీరు నందవరీకు లనఁబడుదురు. వీరినే కరణకమ్మలనియు జెప్పు దురు. ఈ యోగవాగములకథ యెట్టి దయినను, వీరు కాటకము సంభ వించినప్పు డార్యావర్తమునుండి దక్షిణహిందూస్థానమునకు వచ్చి తెలుఁగుదేశములో వృత్తులను సంపాదించుకొన్న విషయములో సందేహ ముండదు. ఈతెగ బ్రాహ్మణు లిప్పుడు కృష్ణా కర్నూలు బళ్లారి మండ లములలో నధికముగా వ్యాపించి యున్నారు. వీరిలో నల్లసాని పెద్దన, రాయని భాస్కరుఁడు మొదలయినవారు మహాప్రసిద్ధులు. కవి మూడవ గుచ్ఛమునొక్క కడపటఁ దన్నుగూర్చి యిట్లు వ్రాసికొని యున్నాడు—

సీ. శ్రీకరనందవరీకాగ్రగణ్యుండు వహిమీఱు గుడిపాటివంశభవుఁడు
బిరుదుగా నవఖండసురతానిపేరంది మహితుఁడౌ వేంగళమంత్రిపౌత్రుఁ

డతులితుఁడౌరంగయామాత్యతనయుండువీరమాంబానందవృద్ధికరుడు
సింగన్న వెంగళ శ్రీనిధు లనుజులై భాసిల్లు కోదండపతిధునుండు
సరసకవితాచమత్కారసార్వభౌముఁ
డవని శ్రీరంగధామదయాశ్రయుండు
నెలమి రసమంజరిని రచియించె నందు
సరవిగాఁగ దృతీయగుచ్ఛంబు తనరు.

ఈపద్యమునుబట్టి కవి వేంగళమంత్రి పౌత్రుఁడనియు, రంగయామాత్యునకును వీరమాంబకును బుత్రుఁడనియుఁ దెలియనచ్చుచున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియదు. ఇన్నూఱుసంవత్సరముల క్రిందటనుండి యుండునేమో! ఈతని కవిత్వమునందుఁ గొన్నిదోషము లున్నను గవిత్వము రసవంతమయినదే. రసమంజరిలోని యొక్కొక్క గుచ్ఛమునుండి యొక్కొక్క పద్యము నిం దుదాహరించుచున్నాను—

చ. జలదము నాధులా గురియఁజాలెనె నీళ్ల న చిన్నఁ, బచ్చికల్
కలయఁగ నించెఁగా గిసలు కాంతుల నీనెనె, యెల్ల వృక్షముల్
ఫలము లొసంగుఁ గాని పతిపక్షుల నిచ్చెనె, నిర్దయాత్మ హా
కులటకుఁగాఁగ నేమి యొనఁగూర్చెఁగ నేర్చితి వబుజాసనా. గు. ౧.

చ. పదరుచు నీవిటూరికిని బైనము సోయెన నన్నమాత్రలో
నదటున మేను చిక్కఁ బలయంబులు జాతెను నీది యుంగరం
బదిర యొసంగినం గరమునంతు ధరించెదఁ గంకణంబుగాఁ
జెదరక యిమ్మటంచు వెలచేడియ దోఁచు నెటున్వోటుం బట్టుఁ. గు.౨.

చ. ప్రతిఫలితామృతాంశువును భామముఖంబని యొంచి నాయకుం
డతులితలీలమీఱఁ బరిహాసముచేసిన నింతయేనియుఁ
బ్రతివచనంబు లేమిఁగని పెదలి మానముఁ జెందె నంచుఁ దా
నతిపులకాంకితంబయిన హస్తముచేఁ దడవుం బ్రియుంబునఁ. గు. 3.

51. మల్లవరపు వాలేశ్వరుఁడు.

ఇతఁడు భళ్ళాణచరిత్ర మను నైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. సింధుకటక రాజయిన భళ్ళాణుఁడు జంగము లడిగినదెల్ల నిచ్చుచు భక్తి చూపుచుండెనఁట! అతని భక్తిని పరీక్షింపవలె నని శివుఁ డొకనాఁడు జంగమువేషముతో తనకుఁ బతివ్రత యగు యువతి కావలె నని యడుగఁగా, రాజు తన పట్టణమునం దట్టి స్త్రీ దొరకనందున దన భార్య యగు చెల్లమ్మనే యీ జంగమున కర్పించెనఁట! శయనగృహ మున కేగినప్పుడా జంగ మామెనంట సందేహపడుచుండఁగా, చెల్లమ్మయే ముందుకుఁ బోయి యీ యతిథిని గౌఁగిలించుకొనునప్పటి కతఁడు మూఁడు నేత్రముల శిశు వయ్యెనఁట! అంతట నా దంపతు లతఁడు శివుఁడని తెలిసి కొని యారాధింపఁగా, ఈశ్వరుఁడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి వారికి ముక్తి నిచ్చెనఁట!

వాలేశ్వరుఁడు పాక నాఁటి నియోగి యగు శైవబ్రాహ్మణుఁడు; గౌతమస గోత్రుఁడు; పోలమామాత్య పుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథ మును మల్లవరపు నాగేశ్వరస్వామి కంకితము చేసెను. కవి తన్నుఁగూర్చి భళ్ళాణచరిత్రమునం దిట్లు చెప్పుకొని యున్నాఁడు—

సీ. అనఁ బొడఁ జదువఁ జెప్పనునేర్చుసర్వజ్ఞ భోజుండుమాతాత పోతరాజు
బహుపురాణజ్ఞుండు బాంధవాశ్రితకల్పభూజంబుమాతండ్రి పోలమంత్రి
పరమశాంతుఁడు కృపాపాథోధి మా పినతండ్రి విరూపాక్షదండనాథుఁ
డఖిలవిద్యానిధి యర్థార్థితతిఁబ్రోచుదాత మత్సుతుఁడు సదాశివుండు
నే వితర్కింప పరకవితావిశేష
వదనుఁడను బ్రాఁకనాఁ డింటివాఁడ శుద్ధ
శైవుఁడను గౌతమసగోత్రసంభవుండ
నెంచఁదగు మల్లవరపు వాలేశ్వరుండ.

* * * *

మత్తకోకిల. సన్నుతం బగునట్టివేల్పు ప్రసన్నుడై మముఁ బ్రోవగా
విన్నకోటవిలాతిలోఁ గడువేడ్క మల్లవరంబునన్
బన్నగేశ్వరసుప్రతిష్ఠను భక్తరక్షణ చేయుచున్.
వన్నెమీఱఁగ నాగలింగ మనన్ వసించు మహోదయన్.

ఈకవి నివాసస్థలము కృష్ణామండలమునందలి విన్నకోటసీమలోని మల్లవర మయినట్టు పయిపద్యమువలననే విస్పష్ట మగుచున్నది. కవి యెప్పటివాఁడో నిశ్చయముగా తెలియరాదుగాని యిన్నూఱుసంవత్స రములక్రిందటివాఁడయినట్టు కనుపట్టుచున్నాఁడు. భళ్ళాణచరిత్రములోనివి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. భువి రుద్రాక్షను నెవ్వ రేని మది శంభుం డంచు భావించుచున్
జెవులన్ వక్షమునన్ శిరస్థలమునన్ జేబోయిఁ గంఠంబునన్
వివరింపంగ ధరింతు రాజనులకున్ వీక్షింపఁగా సాటిలే
రు విరించ్యంబుజనాభకిన్నరమరుద్యక్షేంద్రలోకంబులన్. ఆ. ౨.

ఉ. కప్పురవీడెముల్ నొసటఁ గస్తురిబొట్టును జెంద్రకావియున్
దుప్పటివల్లెవాటు కలదో మఱి లేదో యనంగఁ జాల మై
జిప్పిలు భూతిలేపనము, జేతను సన్నపుగారిబెత్త మా
యెప్పులకుప్పరూపును మహోన్నతియు న్వీలసిల్లఁ జెల్వుగన్. ఆ-౮

---

52. చింతలపల్లి వీరరాఘవుఁడు

ఈకవి మధురవాణీవిలాస మనెడి యైదాశ్వాసముల ప్రబంధ మును రచియించి శ్రీవేంకటేశ్వరస్వామి కంకితముచేసెను. కవి నియోగి బ్రాహ్మణుఁడు; ఆశ్వలాయన సూత్రుడు; వీరరాఘవ పౌత్రుఁడు; వేంకటార్య పుత్రుఁడు. కవి తన్నుఁగూర్చి మిత్రు లన్నట్లుగాఁ దనగ్రంథమునం దీక్రిందిపద్యములను జెప్పికొనెను—

శా. సాహిత్యంబుఁ గవిత్వమున్ వివిధశాస్త్రప్రజ్ఞ సత్కర్మతా
సాహిత్యంబును దత్వబోధమును ద్రిసంధాత్మక జ్యోతిషం
బూహాచాతురి దేవభక్తియును నీకొప్పున్ స్వభావంబులై
యూహా చింతలపల్లి రాఘవకవీ యూధ్వ్యంష వీ వన్నటన్.

మ. అవధానంబు లనేకములెన్నఁబి రాజాస్థానముల్ చేరి వా
దవిధిన్ ధీరుఁడవై చతుర్విధకవిత్వప్రౌఢిమ లూఁచిపి భూ
ధవదత్తద్విపఘోటకాదిబహుసత్కారంబు గైకొన్నమి
న్నవు నీ కబ్రమె వేంకటేశ్వరుఁడు స్వప్నంబుం బ్రసాదించుటల్.

* * * *

సీ. జాములో శతకంబు సంధించి కంకణాభులఁ గొంటి వలరాయ
దుర్గమునను
బహుళావధానముల్ పఱపి నాలుగునగల్ తేజి నందితి మల్లధీరువల్ల
వాగ్గాటిసంప్రీతి దిగ్ధరాధిపదత్తవస్తువాహనములవార్ఁ గంటి
కూపవాపీతటాకోపవనుల్చేసి స్థిరకీర్తి చెందితి పురుతరముగ
సకలభూపాలసంస్థానశంసనీయ। నిజచతుర్విధకవితాభినేయపాండి
తీసమూఢాక నాపూర్ణదిక్పిడేశ। వీరరాఘవ నీసరి విబుధు లేరి?

పయిపద్యములయందుఁ బేర్కొనఁబడినవన్నియు నిజములయిన పట్టున, కవి యసమానపాండిత్యమును గవిత్వకౌశలమును గలవాఁ

డయినంచుకు సందియముండదు. కడపటిపద్యమునందుఁ జెప్పఁబడిన మల్ల ధీరు, డెవఁడో యింకను విచారింపవలసియున్నది. కవి తుంగభద్రా ప్రాంతప్రదేశములయం దుండినవాఁడు. ఈతనికాలమేదో స్పష్టముగాఁ దెలియరాదుగాని యీతఁడు పదునెన్మిదవశతాబ్దమధ్యమునంచుండిన ట్లూహింపఁదగియున్నది. కవిపూర్వులలోసహితము కొందఱు విద్వత్క వులుండినట్లు మధురవాణీవిలాసములోని యీక్రిందిపద్యములు తెలుపు చున్నవి—

సీ. ఏధన్యహారితత్వబోధాప్తి కలపుష్పగిరిదుర్గ తోడ్తై నవరము సాక్షి
యేవాగ్మిసుకుమారతావృత్తికిని బినాకినిచెంత సేవింపుచునికి సాక్షి
యేమాన్యనైశ్వర్యసామాన్యతకు రాజ్యకృతిశిరోభూషణ
కృతియె సాక్షి
యేగ్రంథకారివంశాగ్రీయతకు ఘనప్రభుమానితం బైనబ్రతుకు సాక్షి
యట్టిఘనుఁ డేకులంబునఁ బుట్టి వారి
కలిమికపితయెకా వర మడిగికొనియె
నట్టిచింతలఁల్లివంశాగ్రయాయి
పల్లకిపదస్థుఁడై మించు నెల్లనుకవి.

మ. చతురుండై యవధానము ల్నలిపి దేశాయిూలు మెచ్చ్ మహో
న్నతుఁడై యప్పకవీశ్వరుండు గిరియానారీవతంసంబునం
దతివిద్యానిధి సాహితీనిపుణు రాజాస్థానసంపూజ్యు నం
చితవాగ్ధాటిఁ బ్రబంధక ర్తఁ గవిసంజీవాఖ్యుఁ బుత్రుం గనెన్.

ఈకవి సంజీవాఖ్యుఁడు చంద్రాంగదోపాఖ్యానమును ప్రబంధ మును రచియించెను. వీరరాఘవకవియొక్క కవిత్వము ప్రౌఢమైనది. ఈ తని మధురవాణీవిలాసమునుండి రెండుపద్యము లిందుక్రింద నుదాహరిం పఁబడుచున్నవి—

శా. కాసారస్థితిఁ బూని నీచులకు యోగ్యంబై విషప్రాయమై
గాసి న్నేకొనుకంటకబుల నిజాంగం బెల్ల సచ్ఛిద్రమై
యేసూత్రంబున బల్మినేని బిస మా హేలావతీ బాహుశా
ఖాసామ్యం బెటువొందు నౌ నిజ మథఃపాతిక్ సిరు ల్చెంపునే. ఆ-౫

చ. వలనగుపుష్పమంజరులు బంగరుతీఁగెలు ముత్యపున్నరుల్
వెలయు ఫునుంగుతావు లిడ వెన్నెలకుప్పలువోలె రాజభో
గులు నగునవ్విలాసినులు కోట్నమునం దటు వట్టిధాన్యముల్
సొలసి సువాలు పాడుచును సుంకులు నించిరి మించి రమ్యతక్. ఆ-౫

---

53. రేచర్ల మాధవరాయకవి

ఈకవి చంద్రికాపరిణయ మనెడి యాశ్వాసములప్రబంధమును రచియించెను. ఇతఁడు పద్మనాయకకులజుఁడు; సురభి మల్లభూపాల పుత్రుఁడు. ఈచంద్రికా పరిణయముఁ గోనికథ బాలసరస్వతికృతమైన చంద్రికాపరిణయములోనిదానికంటె వేఱయినది. ఇందు కథానాయకు రాలగు చంద్రిక పాంచాలరాజుకూఁతురు. ఈకవి నూటయేఁబదిసంవత్స రములక్రిందట నుండియుండవచ్చును. ఈకవి కవిత్వము తెలియుటకయి చంద్రికాపరిణయములోని రెండుపద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. వింటే మన్మథ మత్ప్రభుత్వమున కుర్విం బుట్టువిఘ్నావళిన్
గెంటం దార్చుచు మామకాత్మహితభంగి న్మించు నీ వుండుటల్
కంటంగానక బ్రహ్మభావముకడుం గాంక్షించి యొక్కండు పెఁ
గొంటుందాపసుఁ డెచ్చినాఁ డిలఁ దపఃకుల్యాధ్వసంచారియై. ఆ-౫

చ. పలుచనివారికిం బొడమి భాసురపుణ్యజనాహితాత్మనిం
గలసి చెలంగ నొప్ప దని కల్మివెలంది తలంచి ధాత్రి ని
య్యలఘునకున్ జనించె సముదంచిత పుణ్యజనాప్తు నొక్కరా
జు లలి వరింపఁగోరియని పొంపుగ నెంచిరి కొంద రాత్మలన్. ఆ ౪

54. అనియాది గణపతిదేవుఁడు

ఇతఁడు శివయోగసార మనుగ్రంథమును రచియించెను. ఈవే దాంతగ్రంథము పూర్వోత్తరభాగములు గలదయి, భాగమొకటికి నాలు గేసి యాశ్వాసములుగలదిగా నున్నది. ఈకవినియోగిబ్రాహ్మణుఁడు; మూలనామాత్యుని పుత్రుఁడు. ఈతనికవిత్వము ప్రౌఢమయి హృద్య ముగానున్నది. ఈతఁడేకాలపువాఁడో సరిగా తెలియదుగాని యిన్నూ ఱుసంవత్సరములకుముందే యుండినవాఁడయిన ట్లూహింపఁదగియు న్నాఁడు. శివయోగసారమునుండి కొన్నిపద్యముల నిం దుదాహరించు చున్నాము—

పూ ర్వ భా గ ము.

చ. ప్రమదముతో నొకింతయినఁ బాత్రున కీగి మహాఫలం బగున్
బ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చినఁ గీడు పొందు ఘూ
సము నొసఁగంగ దుగ్ధములఁ జాలఁగ ధేనువు లిచ్చు నట్టిదు
గ్ధములొసఁగన్విసంబొలుకుఁగా దెభుజంగమయూథమిమ్మహిన్. ఆ ౧

ఉ. ఈక్రియ గర్భ మేర్పడిన నెంతయు భీతి జనింపుచుండఁ జిం
తాకులచిత్తయై కటకటా యిదియేమిసమిత్తమోకదా
నాకని కన్నుఁదమ్ములఘనమ్ముగ బాష్పము లేగుదేరఁగా
శోకభరాబ్ధిలో మునిఁగి సుందరి కోకిలవాణి యేడ్వఁగన్. ఆ. ౨.

మ. యెనయఁగ జీవనచింతఁ బొట్టుపొరలై యేప్రొద్దువర్తించు నీ
చునియందుం గలశీలసూనృతగుణస్తోమంబు లిట్లన్నియున్
దనరం బక్వముకానికుంభమున యత్నంబార సిండంగఁ బో
సినవార్వారముభంగి నాశ మగుఁ జర్చింపంగ దేహంబుత్రోన్. ఆ-3

ఉ త్త ర భా గ ము.

శా. శాంతాకారుని నాత్మసంస్థితు శివున్ సత్కాంతిసంపన్ను న
శ్రాంతంబుం దమయాత్మలో సుజను లారాధింతు రాయీశు న

య్యంతర్వ్యాగవిహీను లల్పమతు లుద్యద్బాహ్యకవ్యాకవి
భ్రాంతుల్బాహ్యమునందుఁగొల్తురధికప్రాయాసముంబొందుచున్. ఆ-౧

శా. దేహం బస్థిరమాటఁ గన్గొని మదోద్రేకంబునం బొంద కా
దేహంబు న్మనమున్ ధనంబు నతిభక్తిన్ సద్గురుస్వామికిన్
నీహారాద్రిసుతామనోహరునకున్ నిత్యంబు సద్భక్తియు
క్తాహీనాత్ములకున్ వివేకులకు వా ర్పింతు రెల్లప్పుడున్. ఆ.౨.

మ. గుహలోన న్వసియించునొండెఁ దిరుగుఁ క్ష్మోణీతలంబందు ని
స్పృహవృత్తిఁ వివిధక్రియాకుశలుఁడై పెంపొందుఁ గాదేసి ప్ర
త్యహము న్నిష్క్రియుఁడైనవాఁ నిజసమాధ్యాసక్తచిత్తుండు స
ర్వహితైకస్థితిఁ బెక్కుచేష్టలమరఁ వర్తిచు స్వేచ్ఛాగతిన్. ఆ. ౮.

ఉ. బోరన భేదవాదములు పుణ్యము పాపము సంశయంబు శా
రీరమునన్ ప్రవృత్తులఁ బరిభ్రమఁ దృష్ణను బాసి యెవ్వఁడే
ధారుణి నిర్గుణం బయినతత్వముఁ గ్రోవఁ జరిచుచుండు నా
ధీరున కేలగల్గును మదిం దలఁప న్విధియు న్నిషేధమున్. ఆ. ౮.

---

55. వేంకటాచార్యుఁడు

ఈకవి ముక్తిచింతామణి యనుపేర జగన్నాథమాహాత్మ్యమును నాలుగాశ్వాసములగ్రంథమునుగా రచియించెను. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; యతిరాజతుల పెరుమాళ్ళాచార్యుల కుమారుడు.

"ఇట్లు గురుపరంపరానుసంధానపూర్వకంబుగా శ్రీజగన్నాయకుని కంకితంబుగా ముక్తిచింతామణిప్రబంధం తెనుంగు చేయుమని రాజమహేంద్రవరాధ్యక్షపద్మనాయకాగ్రేసర కోన తిమ్మరాయక కృత కనకాంబరాభరణానులేపనపూర్వకసమర్చన ప్రేరితుండనై"

అనికని వ్రాసికొనియుండుటనుబట్టి రాజమహేంద్రపుర ప్రభు
వైన గోన తిమ్మరాజు ప్రేరణముచేత నీగ్రంథము చేయఁబడినట్లు తెలియ
వచ్చుచున్నది. ఈగ్రంథ మిన్నూఱు సంవత్సరములకు ముందే చేయఁ
బడినదేమో! జతన్నాథమాహాత్మ్యకవిత్వము రసవంతముగానే యున్నది.
ఱించుండి కొన్ని పద్యములఁ జూపుచున్నాను—

శా. ధర్మాధర్మవిచారము ల్విహితసంధ్యాపూర్వయజ్ఞాది స
త్కర్మంబుల్ నిరతాన్నదాన నియతుల్ కాలానుగుణ్యక్రియల్
మర్మం బీపురుషోత్తమస్థలములో మర్త్యాళి కెల్ల భవ
న్నిర్మాల్యగ్రహణం బటంటి రిఁక నీనిత్యక్రియల్ వ్యర్థమే. ఆ. ౧.

ఉ. నిద్దురరాఁ బరుండుటయె నిక్కపుఁబ్రమోకగు నిద్రయోగమాఁ
దద్దయు వ్యర్థహింస క్రతుధర్మ మిగుఱ్ఱ నిరాన్నగుష్టవా
చద్ది మహాప్రసాద మగు సన్నుతియూను నిరర్థకోక్తియే
ప్రొద్దును నిత్యవాసు లగుపుణ్యులకుం బురుషోత్తమంబుగా. ఆ-౨

ఉ. హీనుఁడు ముట్టినాఁ డనుచు నెంచి మదీయమహాప్రసాదముఁ
దా నుపభుక్తియోగ్య మని తత్పరబుద్ధిఁ బరిగ్రహింపకే
మానిన సద్విజుండు హ్యాతమంగళుఁడై భవరోగభారియై
న్యూనతఁ జెంది పంచమనియోగమునందు వసించు నెప్పుడున్. ఆ-3

మ. జలజాతుండు రథంబుపైఁ గదలఁ దచ్ఛాయాసమాక్రాంతుఁడై
ఖలుఁడైనఁ ఘనపాపము ల్దలఁగు సాకాంక్షఁ దదుద్యజ్జవా
కలనోద్భూతరజోభరాంకితుఁడు వాక్కాయాంతరాఘంబులఁ
గెలుచుం దత్సరసింధుమజ్జనఫలోన్నిద్రప్రభావుం డగున్. ఆ. ౪.

200

56. లింగకవి, గంగకవి

ఈయిరువురుకవులునుజేరి సీతావిజయ మనునామాంతరము గల శతముఖరామాయణమును రచించిరి. ఈయిరువురుకవులు వేదాద్రిపుర నివాసులు. వీరిలో నీలకంఠోపాసకుఁడయిన లింగకవి తాను రచియించిన మొదటి మూడాశ్వాసములును చిన్నారెడ్డిపుత్రుఁడగు పోచన్నపాలున కంకితము చేసెను; నృసింహోపాసకుఁడగు గంగకవి తాను రచియించిన నాలవయాశ్వాసమును భోగన్నపాలుని కంకితముచేసెను. ఈయిరువురకవిత్వమును మొత్తముమీఁద రసవంతమయి నిర్దుష్టమయి హృదయంగమముగా నున్నది. ఈకవు లిన్నూఱుసంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. వీరి కవనధోరణి తెలియుటకయి శతముఖరామాయణములోని పద్యములొక్కొక్క యాశ్వాసమునుండి యొక్కొకటి యిం దుదాహరింపఁబడుచున్నది—

చ. శతముఖనామధేయుఁడొకచండనిశాచరలోకనాథుఁ డు
గ్రత నలపం క్తికంఠఘటకర్ణపురందరజిత్ప్రహస్తు లీ
క్షితిఁ బడు టంతయుఁ హితులచే విని రాముమీఁద నాదట
ఘతయుతపావకుండుబలెఁ గీలలు క్రక్కుచుమండెఁగ్రక్కునన్. ఆ-ం

ఉ. రాముని బంక్తికంధరవిరాముని నీలపయోదకోమల
శ్యాముని మానిహృత్కుముదసంచయసోముని సత్యభాషణ
స్తోముని సాధ్వభాముని విశుద్ధసుకీ ర్తిగుణాభిరాముని
ధీమణి యైనభానుజుఁడు దిగ్గనఁ గాంచి ముదంబు చేకొనెన్. ఆ. ఏ.

శా. ఏరా యోరివనేచరాధమ భయంబింతైననున్ లేక ప్రా
కారంబు ల్వెసదాఁటి తెట్లు మఱి వీఁకందాఁటి దుర్భీషణా
కారం బొప్పఁగవచ్చి పెట్లు తగవల్క న్వచ్చి నాముందటన్
ధీరత్వంబున నిల్చి పెట్టు లిది చింతింప న్మహాశ్చర్యమా. ఆ. 3.

ఉ. రాయనుఁ బోకుమంటిఁగదరాయను నిన్నిఁకబాసి యోర్వలే
రాయను ఈ శతద్వయఁకరాయను మమ్మిఁక బాధపెట్టవే
రాయను నీతనూజుఁ గనరాయఁను నెక్కడిఁగందురా కుమా
రాయను నల్ల నేల వినురాయను ఈ శతకంధరాయనున్. ఆ. ర.

---

57. అంగర నృసింహకవి

ఇతఁడు రాజరాజాభిషేక మనునై చాశ్వాసముల ప్రబంధమును రచియించి, కొప్పుల వల్లభూవరున కంకితము చేసెను. ఈకవి రామకృష్ణ భట్టారకుని కుమారుఁడు. ఈకవి యేకాలపువాఁడో నిశ్చయముగాఁ దెలి యరాలేదు. ఇతఁడల్లసాని పెద్దనాదులను బేర్కొనక శ్రీనాథునివఱ కును గలకవులనుమాత్రమే కవిస్తుతిలోఁ జెప్పియుండుటచేతను మధ్యకవు లుమాత్రమే పేర్కొన్న చిమ్మపూడి యమరేశ్వరుని సంస్తుతించి యుండు టచేతను నృసింహకవి మధ్యకవులలోనివాఁడేమోయని సందేహాముకలు గుచున్నది. ఇతఁడు చేసినకవి స్తుతిపద్యముల నిం దుదాహరించు చున్నాను—

క. భారతఘట్టోల్లఘున । పారీణకళాధురీణబంధురధారా
ధీరప్రబంధగంధ । ర్వాహుని భట్టనన్న పార్థ్యునిఁ దలఁతున్.

ఉ. అంజలిచేతుఁ బద్మజనిశాంతకరాంతనిరంతరోల్బణ
న్మ్రంజులవల్లకీమధురమంద్రనినాదసముల్లసధ్వని
వ్యంజకవాణ్ణిగుంభనసమంచితనూతనసృష్టిచాతురీ
రంజితసత్కవీంద్రబుధరాజికిఁ దిక్కనసోమయాజికిన్.

ఉ. ఋద్ధగుణుం బ్రబంధపరమేశ్వరు నెఱ్ఱనఱ్ఱెగ్గడన్ మనంగ
పద్ధతి నిల్పి సూక్తిరుచిభాస్కరుఁడై నహుళికిఁ భాస్కరున్

బుద్ధి ఘటించి సంతతము పూనిభజింతు వచఃప్రసాదనం
సిద్ధుఁడు జిమ్మపూడి కులశేఖరు నయ్యమరేశసత్కవిన్.

క. పాథోధిపయోభర ని। ర్మాథచలద్ధుమఘుమాయపూనలహారికా
పాథేయదాయినూక్తి స। నాథున్ శ్రీనాథునెమ్మనంబునఁగొలుతున్

ఈగ్రంథ మొకవేళ మధ్యకవులకాలములోనిదేయైనను దీనియందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములు కొన్ని కానఁబడుచుండుటచేత నప్పకవీయాదులు తమలక్షణగ్రంథములలో నిందలిపద్యముల నుదాహరింపక పోయియుండవచ్చును. కృతిపతినిబట్టి సహితము కవియొక్క కాల నిర్ణయమును జేయుట కిప్పు డాధారములు దొరకలేదు. కృతినాయకునకు కొత్తాపురము రాజధానియైన ట్లీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

సీ. ఱుదు రయ్యె నేవీటికోటలోఫల వైశ్యసుప్రతిష్ఠితుఁ డైనశూలపాణి
పాయలేఁ డేవీటిపర్యంతవనవాటి మిండరాయుఁడు లక్ష్మీధవుండు
నిండారు నేవీట నెండకాలమునందు జలజాకరం బైనసాగరంబు
చదు రొందు నేవీట సార్వకాలిక ఫలస్ఫురితంబు వేడంగి పాఁకతోఁట
సురపురంబునకైన నబ్బురము లగుచువిఱ్ఱవీఁగుచునుండు నేవీటిసిరులు
వసుమతీపాదపద్మసంవళితరత్న । నూపురంబగునట్టి కొత్తాపురంబు

ఈకొత్తాపురము విశాఖపట్టణమండలములోని కొట్టాము గ్రామమేమో! ఈపురాధిపతియయిన కృతిపతి శూద్రకులసంజాతుఁడు.

సీ. మూర్ధాభిషిక్తులముకుటంబు లేరాజుపాదపీఠికకు సోపానపంక్తి
చతురబ్ధివలయితక్షితితలం బేరాజు బాహుదండమునకు బాహుదండ
భువనంబు లేలుకప్పురగంధి యేరాజులీలాకటాక్షపాళికకు నీడ
రజనికాంతజయంతరతికాంతు లేరాజురూపరేఖకు, బ్రతిరూపకంబు
లతఁడు పట్టుతలూటకేళాదిరాయ। రాజదేవేంద్రరాజాధిరాజచంద్ర
గాయిగోవాళజగనొబ్బగండబిరుద। శాలి కొప్పుల వల్లభూపాలమౌళి.

మ. భరియించెం జతురర్ణవీవృతమహాభారంబు దోఃపీఠికన్
విరియించెన్ విమతాంధకారము సముద్వేలప్రతాపోన్నతిన్
గురియించెన్ ధనధాన్యరాశి కవిరాట్కోటీనివాసంబులన్
వరియించెన్ వరకీర్తికాంత దనరన్ వల్లభ్మీతీశుం డిలన్.

ఇత్యాదిపద్యములలో బిరుదాంకములత్తో వర్ణింపఁబడి యుండుట చేతఁ గృతిపతి కవిచెప్పిన ట్లఖండభూమండలాధిపతి కాకపోయినను చిన్న సంస్థానాధిపతియైనట్లు కనుపట్టుచున్నాఁడు. స్పష్టముగాఁ దెలియువఱకును గవికాలము నిప్పుడు పరునాటివందలయేఁబడికి దరువాతికాల మనుకొందము. ఈకవిత్వమునందు లక్షణదోషము లనేకములు గలవు. ఇతఁడు ప్రబంధములోని యీ మొదటిపద్యములోనే వ్రాయుటయని యుండవలసినదానికి వ్రాసుట యని ప్రయోగించినాఁడు—

ఉ. శ్రీసతి చన్నుఁగ్రేవలను జెక్కుల నొక్కుటఁ బత్రభంగముల్
వ్రాసుటకున్ విరించి నిటలంబుల నొక్కుట బాగ్యవర్ణముల్
వ్రాసుటకున్ జతుర్భుజవిలాసము పూనినవేల్పు సత్కృపో
ల్లాస మెలర్ప బ్రోచు శుభలక్షణుఁ గొప్పుల వల్లభావరున్.

ఇట్లు కొన్నిదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁదఁ గవిత్వము రసవంతముగానేయున్నది. రాజరాజాభిషేకములోని కొన్ని పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. పనివడి చెప్ప నేల శిశుపాలునివిక్రమచేష్టితంబు లా
తనిపనిపూని దానవపదాతులు వచ్చిరి వీరె వారె యం
చనిశము తెప్పవెట్టక సురావళి దిక్కులు చూచుచుండఁగా
నసిమిషనామ మొక్కటియు నర్థము దప్పకయుండె నిప్పుడున్. ఆ.ం.

ఉ. ఆగయ విన్నమాత్రమున నైనను జూచినమాత్ర నైన నె
వ్వారిమనంబులం బ్రణయవాసితమై యనురాగకందళం

బీరిక లెత్తు గారణ మొకించుక లేకయుఁ బూర్వజన్మ సం
స్కారవిశేషమం ద్రుది వికస్వరమై కొనసాగు నుర్వరన్. ఆ. 3.

చ. అమృతసరోవరంబుగ హిమాంశునిమూర్తి కరంగి లోనిచి
హ్నాము వికచోత్పలప్రకరమై చెలువొందిన నందులోన సం
భ్రమమున నీదు లాడి జడిమంబున నంగము లూను నేని యూ
హిమమున నించు కేసి శమియించునొకో మదనాస్త్రవేదనల్. ఆ-3

శా. శుద్ధాంతఃకరణైకయోగ్య మగుచుఁ శోభిల్లునస్మద్వచో
రాద్ధాంతం బిది యిచ్చగింపక వృథా ప్రజ్ఞాపరిజ్ఞానస
న్నద్ధు లొకొందఱు కేవలంబుగ వితండావాదులై తా రసం
బద్ధోక్తుల్వచియించి రేని మదమాన్వా న్వారి ఖండించెదన్. ఆ. ర.

మ. మహిలో నీ కిటమున్న నేము వియతమ్మన్యత్వము ల్వానుటల్
సహియింపం దగునంచు నిప్పుడును విజ్ఞాపింప మాకేటికిన్
గుహనానాటకసూత్రధార భువి నీక్రొవ్వాడిమాయావిధుల్
బహురూపంబులుపన్నఁగాఁదిరుగ రేబ్రహ్మాప్రచంద్రార్కులున్ ఆ-గి

---

58. సిరిప్రెగడ ధర్మనామాత్యుఁడు

ఈకవి నలచరిత్రము నాఱాశ్వాసములపద్యకావ్యమునుగా రచి
యించి, శ్రీవేంకటేశ్వరుల కంకితము చేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మ
ణుఁడు; హరితసగోత్రుఁడు; తిప్పయామాత్యపుత్రుఁడు. ఇతఁడు నలచరి
త్రములోఁ దనతండ్రి నిట్లు వర్ణించియున్నాఁడు—

ఉ. సూరినుతుండు తిప్పనయసోమజలజాక్షీకిఁ గ్రీడ సల్పఁగా
మేరుధనుర్ధరాచలము మేడ సుధాజలరాశి కేళికా
సారము పువ్వుఁదోఁట దివిషద్ధరణీరుహసంచయంబు నీ
హారమహీధరంబు కృతకాద్రియు నై విలసిల్లు నెప్పుడున్.

తనతండ్రి యిందు ర్తిసీమలోనివాఁడనియు, ఈ క్రిందిపద్యములలోఁ దనమేనమామ పేరూరి నివాసుఁడనియు, కవి చెప్పుకొనుటచేత నీతఁడు గోదావరీ కృష్ణామండలములలోనివాఁడని తోఁచుచున్నది—

సీ. తన కేఘనుఁడు ప్రపితామహాం డగు లోహి
తసగోత్రుఁ డల పుల్లదండనాథుఁ
డెసఁగు నేఘనుతాత యసదృశోన్నతి పుట్ట
మాంబాధవుఁడుతిమ్మనాహ్వాయుండు
పెనిచె నేఘనుతండ్రి తనకీ ర్తిలత లాశ
లంటఁ బెంపగు తిమ్మయప్రభుండు
వెలయు నేఘనుతల్లి విమలపతివ్రత
వివిధసద్గుణశీల వెంగళాంబ
యతఁడు తుమురుగోటివరవంశాబ్ధివిభుఁడు
సతతపేరూరి కేశవస్వామ్యధీన
మానసస్థిత్రిఁబరఁగు నామేనమామ
మతినిగురుసన్నిభుఁడు ధర్మమంత్రివిభుఁడు.

చ. విను మనఘాత్మ ధర్మసుకవీ భవదీయవచోవిలాసముల్
ఘనకవిహృద్వికాసములుగావె చమత్కృతిమీఱి నీవు నే
ర్చినగతి నిప్పు డానలచరిత్రము వేంకటశైలరాణ్నివా
సునకు సమర్పణంబుగను శోభనలీల రచింపు పెంపుగన్.

ఈకవికాల మేదో నిర్ణయించుటకుఁ బుస్తకమునం దాధారము లేవియుఁ గానరాలేదు. ఇతఁడు శ్రీనాథుని వర్ణించియుండుటచేతఁ బూర్వకవి కాఁడనుట నిశ్చయము. ఇతఁడాథునికుఁడయి యిన్నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మొత్తముమీఁద నిర్దుష్టమయి యింపుగా నున్నది. నలచరిత్రములోనిపద్యములఁగొన్నిటి నిందు క్రిందఁ బొందుపఱచుచున్నాను.

ఉ. ధారుణి వీరసేనవసుధావరువా లటువాల వీరు లా
సారసమిత్రుఁ దూటి తనసన్నిధిఁ జేరినవారి కెల్ల జం
భారి యిడఁ గురద్రుకుసుమావళియే యుడివోయె నన్నచో
నార గణింపఁగాఁ దరమె యాఘనుఁ డోర్చినశత్రుసంఘముల్. ఆ-౧

శా. లీల న్నిలఫుటాలమేడకడ లాలిం గేలిన్నె నుంచి జో
జోలఱ్ఱిశకటాక్షవీక్షణయుతా జోజోశుభాకార జో
జోలావణ్యరమాకరమాక యనుచుం జోకొట్టుచుం బాడి ర
న్నాళీకేక్షణ లానృపాలసుతు వీణాకోకిలాలాపలై. ఆ. ౨.

ఉ. వెన్నెల చందమామకును వెన్నెలకుం దగఁ జందమామయున్
సన్నుతలీల నంద మగుచందమునన్ ధరణీతలేశ యా
కన్నియ నీకు వేడ్క నలకన్నియ కీవును జోడుగూడ నేఁ
గన్నులఁ జూతు నేమెయని కాంక్ష యొనర్చెద నెమ్మనంబునన్ ఆ-3

ఉ. అర్థి ఫలప్రదాయక గుణాకర నైషధసార్వభౌమ కా
ర్యార్థుల మైన మమ్ములఁ గృతార్థులఁ జేయఁగదయ్య సర్వశా
స్త్రార్థము లెందు నీ వెఱుఁగనట్టివి లేవకదా పరోపకారా
ర్థమిదంశరీర మను టాత్మఁ దలంచఁగదయ్య ధీనిధీ. ఆ. ౪.

శా. నీతిం జూడు నచేంద్ర మీనతతుల న్నీనంబులే మ్రింగుటల్
ఘాతక్రీడఁ గుఠారకాష్ఠ మిల వృక్షవ్రాతముం ద్రుంచుటల్
జ్ఞాతిత్వంబునఁ గాదె జ్ఞాతు లెచటన్ సామాన్యులే చెల్లఁబో
జ్ఞాతిశ్చేదన లేనకిమ్మనెడుశాస్త్రంబుం బరీక్షింపవే. ఆ. ౫.

మ. లలనా ప్రాణసమాన వైనసిను నేలాపాయ దే నన్న నీ
పలుకే నమ్మి భవత్పదాంబుజసమీపక్ష్మోణి నిద్రింపఁగాఁ
గలితవ్యాళమృగాదిజంతుభయదోగ్రం బైనయీకాననలో
పల న న్విడఁగనాడి పో నధిప నీపాదంబు లెట్లాడెనో. ఆ. ౬.

---

59. గణపవరపు వేంకటకవి

ఇతఁడు శ్రీప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసమనెడి యేకా
శ్వాసప్రబంధమును రచియించెను. ఇది యేకాశ్వాసగ్రంథమేయయినను,
ఇందలి పద్యముల సంఖ్యమాత్రము నాలుగాశ్వాసముల గ్రంథములో
సామాన్యముగానుండుదానికంటె దక్కువగాలేదు. ఈకవి నందవరీక
నియోగిబ్రాహ్మణుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; వసిష్ఠగోత్రుఁడు; అప్ప
యామాత్యపుత్రుడు. ఇతఁడు కృష్ణామండలములోని కామెపల్లెసీమయం
దలి గణపవరగ్రామవాసుఁడు. ఇతఁడు పల్నాటిలీమవాఁడగుటచేతనే
స్వానుభవముచేతను గాఁబోలును 'పలనాటి గొల్లలపాటజాతి' యని
యచ్చటిగొల్లల పాటను నిరసించియున్నాఁడు. ఇతఁడు మిక్కిలి యాధు
నికుఁడే యయినను, ఇతని కాల మిదియనిమాత్రము సరిగాఁ దెలియదు.
ఇతఁడును దనకు వేంకటేశ్వరుఁడు స్వప్నమున సాక్షాత్కరించి తన్నుఁ
గూర్చి పలికినట్లు చెప్పుకొన్నపద్యములలోని యీక్రిందిపద్యమువలన
నితఁడు పదునాఱవశతాబ్దాంతమునకు లోపలివాఁడుకాఁడని స్పష్టమగు
చున్నది—

సీ. అల విన్నకోట పెద్దనలక్షణజ్ఞత శబ్దశాసనకవి శబ్దశుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమం బుభయకవిమిత్రునిపదలలితత
శ్రీనాథువార్తాప్రసిద్ధి నాచనసోముభూరికాతిన్యంబు పోతరాజు
యమకవిధము మల్లయమనీషిచిత్రంబు పింగళి నూరకవివరుశ్లేష

నాంధ్రకవితాపితామహునల్లికబిగి
ముక్కుతిమ్మనతేటయు భూషణునియ
లంకృతియు నీకె కలదౌ తలంపలక్ష
ణకవి యప్పయ వేంకటసుకవిచంద్ర.

ఈపద్యమునుబట్టిమాత్రమేకాక యితఁడవతారికయందుఁ దన్నుఁ గూర్చి చెప్పుకొన్న యితరభాగములనుబట్టికూడ విచారింపఁగా స్వాతిశయమును జెప్పుకొన్న యాంధ్రకవులలోనెల్ల నితఁడగ్రగణ్యుఁడయినట్లు కనఁబడుచున్నాఁడు. పయిపద్యమునందుఁ బ్రస్తావిత శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యునిని (రాఘరాజ) భూషణుని బేర్కొనుట చేత నీతఁడు పదునేఁడవశతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు సందేహములేదు. మఱియొకచోట నితఁడు తన గ్రంథమునందు "లక్షణసారసంగ్రహ సరస్వతీవిలాస సాహిత్య చింతామణి సత్కవిజనసంజీవని" యని లక్షణసారసంగ్రహమును కవిసంజీవనిని బేర్కొని యున్నాఁడు. ఇందలి లక్షణసారసంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదై నపట్టమునఁ గవి పదునేడవ శతాబ్దారంభమునకుఁ బదునెనిమిదవశతాబ్ద మధ్యమునకుఁ దరువాతివాఁడును అగును. ఈగణపవరపు వేంకటకవి తనకుఁబూర్వులయిన కవుల కావ్యములలోనుండి గ్రంథచౌర్యమును విశేషముగాఁ జేసినవాఁడయినందున, ఆలక్షణసారసంగ్రహము కూచిమంచి తిమ్మకవిదే యైన పట్టమునఁ దిమ్మకవి గ్రంథములనుండియు చౌర్యము చేసినాఁడని చూపుటకుఁ దగిననిదర్శనములు లేకపోలేదు. ఇరువుర కవులగ్రంథములలోని యీపద్యములను జూడుఁడు—

సీ. బింబోష్ఠియని నీవు పెరఁగరాకు శుకంబ
సాంకవగంధి యీపంకజాక్షి
పంకజాక్షి యటంచుఁ బదరకు త్రోటి చం
పకజాలనాస యీపల్లవాంఘ్రి
పల్లవాంఘ్రి యటంచు బొధింపకు పికంబ
రామాంగి యీబిసప్రచయబాహ

బిసబాహ యని రాకు వెసనంచ జలద శి
రోరుహ యీ మహిరోమరాజి
యహిపరోమాళి యంచు డాయకుము నెమ్మి
కార్ముకభ్రూలతిక యీ చొకారపు జెలి
యనుచు శుకభృంగ పరభృత హంస నీల
కంర నికురుంబములఁ దద్ద కనలి పలికె.

అని తిమ్మకవి తన రసికజనమనోభిరామములోని చతుర్థాశ్వా
సమునఁ జెప్పియుండఁగా గణపవరపు వేంకటకవి
సీ. చక్రస్తని యటంచు జగడించకు శశాంక
గురుతమోవేణి యీకుందరదన
మధురాధర యటంచు మట్టుమీఱకు తేఁటి
చంపకనాస యీజలజవదన
బిసబాహ యని మాఱు మసలకు రాయంచ
జలధరచికుర యీకలువకంటి
పల్లవకర యని త్రుళ్ళకు కోయిల
శ్రీరామమూర్తి యీకీరవాణి
వదన కుంతల యీడ సుస్వర సఖిత్వ
మెనసియుండుటకతన మీ కితవొనర్చు
ననుచు నళి చంద్ర పరభృత హంసములకు
భయము నయమునఁ దెలియఁగఁబలికి మఱియు.

అని చెప్పియున్నాఁడు. ఈయుభయులలో నెవ్వఁడు పూర్వుఁడో యీతని పద్యమును జూచి రెండవవాడు తనపద్యమునై నను వ్రాసికొని యుండవలెను, లేదా యిరువునుగూడఁ బూర్వమున్న యిటువంటి పద్య మును మఱియొకదానినిజూచియైనను వ్రాసికొనియుండవలెను. వేంకట కవి గ్రంథచౌర్యము చేయువాఁడగుట తెలియుటకయి నరసభూపాలీయ

మునుండియు వేంకటేశ్వరవిలాసమునుండియునొక్కొక్క చిన్నపద్యము నిం దుదాహరించుచున్నాము—

క. ఔరా యోబన్నపాలకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా నృసింహ కూడితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని యీపద్యము కావ్యాలంకారసంగ్రహములో పాదయమకమునకు లక్ష్యముగా నీయఁబడియుండఁగా, వేంకటకవి.

క. ఔరా మాధవయజ్వకు
మారా మను మదనసమరమాధుర్యుఁడవై
ధీరా విటార్య యేలితి
మారామను మదనసమరమాధుర్యుఁడవై.

అని పైపద్యమునే పేరులుమాత్రముమార్చి పంచదశవర్ణయుక్త పాదయమకమని తన పుస్తకములో వేసికొనియున్నాఁడు. ఈకవి వేంకటేశ్వరుఁడు తన్నుద్దేశించి పలికినట్లు కొన్నిటిని, తానే చెప్పుకొన్నట్లు కొన్నిటిని, ఇతరులు తన్ను మెచ్చి పొగడినట్లు కొన్నిటిని, స్వరచితములైన గ్రంథముల నామములను జెప్పుకొనియున్నాఁడు. ఇట్లు చెప్పుకొనఁబడిన తారావళులు, యమకశతకము, శృంగారరసమంజరి, కృష్ణమల్లకథ, బాలరామాయణ ద్విపదము, చాటుపద్యములు, లింగనిర్ణయము, ఆంధ్రప్రతాపరుద్రీయము, ఆంధ్రరసమంజరి, ఆంధ్రనిఘంటువు, ఆంధ్రకౌముది, గణయతి ప్రాసలక్షణ సీసమాలిక, ఆంధ్రప్రయోగరత్నాకరము, రేఫ అకారనిర్ణయము, షట్పంక్త్యయ ప్రస్తారసరణి, ఇరువదాఱు ఛందముల వచనము, అలంకారసారము, పరమభాగవతచరిత్ర, ఆంధ్రద్వీరూపకోశము, కల్పితకల్పలత, ఆంధ్రవసంత తిలకభాణము, కఠిన ప్రాసశతకము, ఆంధ్రప్రక్రియాకౌముది, జాంబవతీవిలాసము, చండవిద్యావతీ

దండకము, చక్రవాళతారావళి, పురాణసారము, ప్రబంధరాజ వేంకటే
శ్వరవిజయ విలాసము, అను గ్రంథములలో రెండుమూడుతక్కు శేషిం
చినవన్నియు నామమాత్రా వశిష్టములయినవి. అట్లగుటకుఁ గారణము
లేకపోలేదు. ఈకవి తానుజేసినపు స్తకములు లోకమునకుపయోగపడవలె
నన్న యుద్దేశముతోఁగాక తనసర్వతోముఖ పాండిత్య ప్రకర్షమును లోక
మునకుఁ బ్రకటింపవలెనన్న యుద్దేశముతో విశేషభాగము చేసినందున
నీతనిపు స్తకముల కిట్టిగతి పట్టియుండును.

సంస్కృతములోనున్న జ్ఞానధనమును జనులకువెదచల్లవలెనన్న
పరమార్థచింతతో మొట్టమొదట నన్నయభట్టారకాదులగు మహాకవులు
పదునొకండవశతాబ్దారంభమునుండి సులభశయ్యను సంస్కృతగ్రంథ
ములఁ దెనిఁగింపఁదొడఁగిరి. ఈభాషాంతరీకరణకార్యము పదునేనవశతా
బ్దాంతమువఱకును. నవిచ్ఛిన్నముగా జరగుచువచ్చెనుగాని యిట్లు
భాషాంతరీకరణమునకు, బూనుకొన్నవారిలోఁ గడపటివా రగు శ్రీనా
థాదులు తమపూర్వులకన్నఁ దాము ఘనులనిపించుకోవలెనన్న చింత
చేతనో మఱి యే హేతువుచేతనో సంస్కృతపదభూయిష్ఠము లైనదీర్ఘస
మాసములతో నింపి రసమును జెఱుపక పోయినను తమగ్రంథములు
బహుజనులకు దుర్గ్రాహ్య మైనకతనశైలిని జేసిరి. ఇట్లాకాలములోఁ
భారత భాగవతరామాయణాదిముఖ్యగ్రంథము లన్నియుఁ దెలిఁగింపఁ
బడఁగా, అటుతరువాతఁ బదునాఱవశతాబ్దారంభమునం దల్లసాని పెద్ద
నాదు లొక క్రొత్తత్రోవఁద్రొక్కి కేవలభాషాంతరములు కాకుండఁ
బురాణములలోని కథలను గైకొని స్వకపోలకల్పితము లైన వర్ణనలను
జేర్చి పెంచి శ్రీనాథాదులశయ్యనవలంబించి సరవంతముగా ప్రబంధము
లను జేయ నారంభించిరి. ఈపని నూఱు నూటయేఁబదిసంవత్సరముల
వఱకును జరగుచురాఁగా, ౧౬౫౦వ సంవత్సరములోపల బహుమార్గ
ముల నూతనప్రబంధము లనేకములు తెలుఁగునఁ జేయఁబడినవి. అంత

టితో నూతనసృష్టి బహుతరముగా నంతరింపఁగా, ఈవలివారు వసుచరిత్రమును మాతృకనుగాఁ గొని దానికి పాఠాంతరముల్లో యనునట్లు పూర్వవర్ణనములనే తలలుమార్చి ప్రయోగించుచు వెనుకటిప్రబంధముల ననుకరించి తమప్రబంధములు నల్లఁజొచ్చిరి. చేసినదానినే పేరులుమార్చి మరలఁ జేయుచుండుటచేత నూతనార్థకల్పనలనుజేయుట దుష్కరమయి నందున నిటీవలివారిలోఁ గొందఱు మహాపురుషులాయర్థలోపమును పదాటోపముత్రోఁ బూరింపఁబ్రయత్నించిరి. పూర్వపువా రక్కడక్కడ సముచితముగా శబ్దాలంకారములను జేర్చుచు వచ్చినను భాషావధూటికిఁ బ్రాణమైనయర్థసారస్యమును జెడఁగొట్టకుండిరి. ఇటీవలివారర్థసారస్యమునంతగాఁ బాటింపక నిఘంటువులవెదకి పదములేరికూర్చి బంధించి తమ సరస్వతిని హృదయాకర్షకముగాఁ గాకపోయినను కర్ణరంజకముగా నైనను జేయఁబాటుపడిరి. ఇట్టివారిలో నెన్నికగన్న కొందఱు బంధానుల నతిమాత్రముగాఁజేర్చి యర్థసారస్యమును బూర్ణముగాఁ జెఱచి యవయవములు విఱిచి తమభాషావధూటిని వికృపినిజేసి శవప్రాయను జేసిరి. మన యీవేంకటేశ్వరవిలాసకృతికర్తయు బలరామచరిత్ర కృతికర్తయైన గుడారు వేంకటదాసకవియుఁ గొంతవఱకీకడపటి తెగలోఁ జేరినవారు. ఒకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాస మని పేరు పెట్టుకొనఁగా నింకొకఁడు తనపుస్తకమునకుఁ బ్రబంధరాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్రమని పేరుపెట్టుకొనెను. వేంకటదాసకవి

"నిరోష్ఠ్యమత్తేభవిక్రీడిత శార్దూలోత్పలమాలా తోటక మత్త కోకిల లయగ్రాహిమణిగణనికర పంచచామరస్రగ్విణీప్రమితాక్షర మణి భూషణ దృతవిలంబిత కవికంఠభూషణ వినయస్వాగతాదృష్టహర్షణి రథోద్ధతాంబురుహ కవిరాజవిరాజిత గణసమకదండకార్యాగీత సీస ద్విపదకంద శ్లోకచూర్ణికా వచనకైవార గద్య కలికోత్కలికామంజ

రీద్విపద ధవళసువ్వాలశోభనారాత్రిక నానారగడభేదసప్తతాళైలా
మహర్ణవమిలాలిశారదద్వాత్రింశద్రాగ నానావిధవిచిత్ర నాగబంధ
పుష్పమాలికా బంధసంయుక్తకల్పిత కల్పవల్లీ చంపకమాలికా
వృత్తము."

అని పేరుపెట్టి యొక పద్యములో ననేకబంధ గర్భవృత్తముల నిమిడింపఁగా, మన యీవేంకటకవి దీనిని మించునట్లుగా,

"బహువిధచిత్రకంకణ బంధద్విగుణితసీసచరణచతుష్టయగర్భిత ద్విపదకందద్వయ సమవృత్తచౌపదయుగళాటవెలఁది తేటగీతి మదనవిల సిత తురంగవృత్త బహువిధతాళవృత్తాష్టక ధవళశోభనగానారాత్రికగాన జంపెత్రిపుటార్ధచంద్రిక సువ్వాలలాలిపద్మైలామంజరి సమతాడిండిమతాళ వృత్తమణిగణనికర తురగవల్గన రగడోదాహరణసంబుద్ధి కళికోత్కళి కార్థాహిరీ రాగదళ ముఖారిరా గాటకతాళదళ కాంభోదిరాగ రూపక తాళదళకాంభోదిరాగ సమపద కన్నడరాగ సాంగత్య కొరవంజిదళ రేవ గుప్తిరాగ సమపద సావేరిరాగైకతాళదళ బిలహరిరాగాటతాళ సమపద పుష్పమాలికాబంధ గోమూత్రికాబంధ శార్ఙ్గబంధ షోడశదళపద్మబంధ పాదుకాబంధ నవరంగబంధ ఖడ్గబంధ గుచ్ఛబంధ ఛత్రబంధ చామర బంధ గదాబంధ చక్రబంధ నాగబంధ రథబంధ శంఖబంధ మృదంగ బంధ పాదభ్రమకబంధ పాదార్ధ భ్రమకవింశతిబంధ భేదకందానుష్టుప్ శ్లోకాంతర్గత చతుర్భద్ర నవరంగ సర్వతోభద్రాందోళికాబంధ యుక్తాను లోమవిలోమ కందభాషాశేషకందకందాటవెలఁది గర్భితాంత్య తేటగీతి యుక్తచౌషష్టిభేదచిత్రసీసము"

అని పేరు పెట్టి యొకపద్యములోనే బహుబంధ గర్భవృత్తముల నిమిడ్చెను. కవి మిక్కిలి కష్టపడి పయిని జెప్పఁబడినరీతి గర్భబంధకవిత్వ మును, ఏకాక్షర నిఘంటులను వెదకి—

క. కైకోకీకాకకుకై । కోకాకాకింకకూకి కూకకుక్కోకీ
కాకుకకు కేకకేకిక । కూకో కొకూకక కింక కోకై కొకా.

అనురీతి నేకాక్షరములతోడి చిత్రకవిత్వమును, ఒక్కచానిలో నేయితరపుస్తకములోను లేనంత యమితముగాఁ జెప్పి తనశిల్పివ్యాపార కౌశలము నెంత చూపినను, కాళ్లతో నడచి గమ్యస్థానమును చేరు సామాన్యమార్గము విడిచి యడ్డముగా భూమివిూఁదఁబడి కడుపుతో దొర్లి ప్రయాసపడి గమ్యస్థానమునుజేరి యసాధారణపౌఢిమను జూపిన బుద్ధిమంతుని శక్తిని మెచ్చుకొనునట్లే యిట్టి కవితాచమత్కృతులు మెచ్చ కొనఁ దగియుండునుగాని యంతకంటె నెక్కువ శ్లాఘూపాత్రములుగావు. నవరసరసికు లెప్పుడును హృదయాహ్లాదకరముగా నర్థకల్పనము చేసియు కర్ణరసాయనముగా మృదుమధురవాగ్గుంభనలత్రో భావములఁగూర్చియు మా సోద్దీపకముగా నీతి పోషణమొనర్చియు వర్ణనలు చేయఁగలిగిన కవినిమాత్రమే మెచ్చుకొందురుగాని కావ్యదోషములకు లక్ష్యము లగు నట్లుగా నర్థగౌరవముఁ జెడిచి పదముల విడిచి పద్యములలోఁ బద్యము లను దూర్చినవానిని మెచ్చుకోరు. ఈవేంకటకవివర్యుని కవనమునందు వ్యాకరణదుష్టములయిన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నవి. ఈకవికాల మేదో సరిగాఁ దెలియ రాకపోయినను, ఈతని గ్రంథము లోని సలాము సాహెబు ఫిరంగి తుపాకి మొదలగు పదప్రయోగము లీతఁ డాధునికుఁడని ఘోషించుచున్నవి. బంధగర్భచిత్రకవిత్వముల కొఱకై శ్రమపడి కూర్చినభాగములను విడిచినపక్షమున, ఈతని కవి త్వము మొత్తమువిూఁద రసవంతమయి పడలాలిత్యము కలదయి మనో హారముగానే యున్నది. ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాసములోని కొన్ని పద్యముల నిందుఁ బ్రదర్శించుచున్నాము—

చ. తగునె నృపాలకన్యలకు దవ్వులనవ్వుల పువ్వులాట లీ
వగలఁ జరింప నిందుఁ దగవా మగువా మగవార లుండఁగా

మగుడి పురంబుఁజేరఁ జనుమా వినుమా యనుమాన మేల నీ
సొగసు విలాస మంచమును సొంపును నింపును బెంపుమీఱఁగ.

ఉ. వ్రేలిమి వ్రేల్వఁ డొప్పుమను వ్రేల్చు మొగంబు వగ్గులలామకై
చాలుగ సంధ్యవార్చుఁడు త్రిసంధ్యలవార్చును వంటవార్పు లా
బాలికయింటఁ దండ్రి సలుపం గననొల్లఁడు దేవపూజ యే
వేళల లంజెతల్లి యిలువేలుపుమాత కిడుం బ్రణామముల్.

చ. అడిగినఁ దెచ్చువాఁడొ కడునంచమునం గనునైనవాఁడొ మే
ల్నడవడికాఁడొ వీటఁ దగునాయకమై చరియించువాఁడొ చే
విడిముడికల్గువాఁడొ తలవెండ్రుక లందఱు రాకుమారకల్
ముడుపులు వానగాఁగురియ ముట్టవు కారణమేమి కూఁతురా.

శా. ఏమీ పల్కఁపు నేను బిల్వ దయ లేదే నీకు నాయయ్య ని
న్నేమంటిన్ సుకుమార నాయెడను దప్పేదీ కుమారాగ్రణీ
నామీఁదన్ జల మేలరా తనయ నన్మన్నించరా పెన్నిధీ
నీముద్దు ల్గననోచినానుగద తండ్రీ నీతిపారంగతా.

---

60. వేముగంటి దత్తోజీపండితుఁడు

ఈకవి ప్రస్థానత్రయములో నొకటియైన భగవద్గీతా యోగశాస్త్రమును బద్యకావ్యముగాఁ దెనిఁగించెను. ఇతఁడు హారితసగోత్రుఁడు; నాగమాంబకును నాగోజీపండితునకును బుత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; మాధ్వమతస్థుఁడని తోఁచుచున్నది. ఈయనకాలము మొదలయిన వానినిగూర్చి యేమియు నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు కాఁడు. కృష్ణార్జునసంవాదమను నామాంతరము గల యీయోగశాస్త్రములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. కోకలు జీర్ణమై చనఁగ గొబ్బున వానిఁ బరిత్యజించి తా
శ్రీకరనూత్నవస్త్రములఁ జెల్వుగఁ దాల్చినభంగి దేహి సు
శ్లోకుఁడు జీర్ణదేహములశోభకు రోసిన జీవమూర్తి యీ
లోకపుగోమలాంగముల లోలతఁ దాల్చును భద్రమూర్తియై. అ-౫

ఉ. సల్లలితంపుఁగర్మములు సాంద్రయశోనిధి సద్వ్రతక్తిచే
నొల్లక సన్యసించి పటుయోగసుఖంబునఁ జెందుచుండుఁ దా
నెల్లెడ జీవుఁ బోలి కడుహేయపుఁదొమ్మిదితూంట్లమేనిలోఁ
ద్రుళ్లుచుఁ జేయనొల్లఁడుప్రతోషముతోనియమింపఁడన్యుల. అ-౬

ఉ. వేదములన్ మఖంబులను విశ్రుతదానతపంబులన్ సము
త్పాదిత మైనపుణ్యము నధఃకరణం బొనరించుయోగి యు
ద్యాదిమపూరుషోత్తమునిజార్థము నెమ్మది సంగ్రహించి ని
ర్వేదన లేక యార్య మగు విష్ణుపదంబును జెందు నర్జునా. అ. ౯.

ఉ. ఇంద్రియసౌఖ్యసంపదల నేమియుఁ గోరక వీతరాగుఁడై
సాంద్రయశుం డహఃక్రియలచక్కటిఁ బోవక దూరవర్తియై
యింద్రజ మేనికిన్ జరయు మృత్యువు జన్మము వ్యాధులున్ విని
స్తంద్రత దుఃఖదోషములు, జాలఁగఁగల్గుచెఱుంగఁగాఁదగున్. అ-౧౩

ఉ. కామము రాగముం బలముఁ గల్గి యహంకృతి దంభయుక్తుఁడై
యేమనుజుండు శాస్త్రవిధి నెంతయుఁ దుచ్ఛముగాఁ దలంపుచున్
భూమికి భీకరం బయినభూరితపం బొనరింపుచుండు నా
పామరు నాసురక్రియలఁ బర్వినవానిఁగ నిశ్చయింపుమా. అ. ౧౭.

---

61. గుడారు వేంకటదాసకవి

ఈకవి బలరామచరిత్రమని సామాన్యముగా వాడఁబడు ప్రబంధ రాజశిరోభూషణ ప్రకృష్ట బలరామచరిత్ర యను నాఱాశ్వాసములప్రబంధమును రచియించెను. ఇతఁడు బలిజవంశజుఁడు; పైడిపాలగోత్రుఁడు; ఈతని తండ్రి గురవేంద్రుఁడు; తల్లి రంగమాంబ. ఇతఁ డాధునిక కవియే యయినను, కాలనిర్ణయము చేయుట కాధారములేవియుఁ గానరాలేదు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండెనేమో! ఈతని కవిత్వము ప్రౌఢమైనది. బలరామచరిత్రమునుండి రెండుపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

శా. నీరేజాక్షికి హారమౌక్తికతతుల్ నీలంబులై తైలముల్
జాఱంగాఁ బగడంబులై పిదప వజ్రాకారము ల్వ్యాని వి
స్తారస్వేదకణంబులం దడిసి సున్నం బయ్యె నాదుర్దమ
స్మారస్ఫారశరాగ్ని హైమపట మచ్చాచ్ఛాయమై తోఁచినన్. ఆ-3

ఉ. వారిధిధీరమానసుఁ డవారితతేజుఁడు నై జరాజకం
ఠీరవభావభీతహరిణీభవదున్మదవైరివీరుఁ డు
ద్దారుణమార్గణప్రకరదై న్యవీదారణదానదక్షుఁ డీ
భూరమణాగ్రణిం గనుము పుష్కరనేత్ర విదూరకాహ్వయున్. ఆ.శి.

62. కామనూరి కృష్ణయ్య

ఇతఁ డిందుమతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచించెను. రఘువంశములోని యజమహారాజుచరిత్ర నీప్రబంధరూప మునఁ జేసినట్లు కవియే యీపద్యమునఁ జెప్పియున్నాఁడు—

గీ. కాళిదాసకవిశ్రేష్ఠకల్పితంబు
భవ్యచరితంబు రఘువంశకావ్య మందు
నజునికథయాంధ్రభాషచేనలఘుమతిని
గృతిరచింపఁబూనితినలంకృతులుచెలఁగ.

ఈకవి నందవరీక బ్రాహ్మణుఁడు; గోవిందయామాత్య నందనుఁడు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములనాఁటివాఁడయి యుండునేమో. ఈతనికవిత్వము మనోహరమైనదే. ఇందుమతీపరిణయములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అందు దిలీపభూపతనుజాగ్రణిదేశము మేలుబంతి మ
ధ్యందినపంకజాప్తనిభుఁ డాధరణీశుఁడె మేటి తత్సుతుం
డిందు వసంత చిత్తజ సురేశ్వరసూనులకన్న మిన్న వా
నందముఁ జెప్పఁ జూప వశమా యసమానపరాక్రమక్రమా. అ. ౧.

ఉ. అన్నకు బ్రొయ్యికిఁ తత్కరుణ నాయితపెట్టినదంతపుంబని
జెన్నలరారుపల్లకి వసించి చొకాటపుఁదేటకెంపురా
కన్నెమెఱుంగుఁగేలఁ బొసఁగంగ ధరించె మధూకదామ మ
త్యున్నతమంగళప్రకటతూర్యరవంబులు మిన్నుముట్టఁగన్. అ. ౪.

---

63. వేంకటాచార్యుడు

ఈకవి భద్రరాజపుత్రచరిత్రమను నైదాశ్వాసములప్రబంధమును రచియించెను. కళాపూర్ణోదయమునందువలెనే యిందలికథలును కవిచే నూతనముగాఁ గల్పింపఁబడినవి; కాని కవిత్వ మంతప్రౌఢమయినది కాదు. ఇందలికథలను బోలిన కథ లనేకములు కొన్నివైష్ణవగ్రంథములలోఁ గానఁబడుచున్నవి. ఈకవి వైష్ణవబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; ఆత్రేయసగోత్రుఁడు; శ్రీనివాసాచార్య పుత్రుఁడు. ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవా డయినట్లు చెప్పుచున్నారు. భద్రరాజ పుత్రచరిత్రమునుండి రెండు పద్యముల నిందుఁ జూపుచున్నాను—

శా. ఏనుం జెప్పినభంగిఁ జేసితివె కాశీశుండు ప్రత్యక్షమై
తా నిన్నిచ్చితిఁ గోర్కె వేఁడుమనినే ధన్యుండనై తిం గృపా
నానాసౌఖ్యశుభాకరంబుఁ బుగము న్నాకిమ్మి యంచే శివుం
డానందించి యొసంగెనే వరము నీ వబ్బంగిఁ జేకొంటివే. ఆ. ౧.

ఉ. ఎవ్వరు నావిధంబు జలజేక్షణకుం దెలిపించి మేలు లో
నివ్వటిలం గరంగ సని నేర్పుదలిర్పఁగఁ దెచ్చి కూర్చి యీ
నెవ్వగఁ బాపువారె తమి నిల్వఁగఁగూడదు మేనఁ బ్రాణముల్
రవ్వడిఁ బోవుచున్నయవి రాము భరింపఁగ నేమిచేయుదున్. ఆ. ౫.

---

64. మల్లంపల్లి నాగభూషణకవి.

ఇతఁడు బసవవిజయమను మూడాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఇతఁడు వీరశైవమతస్థాపకుఁడైన బసవేశ్వరుని చరిత్రమును మాత్రమేకాక బసవచరిత్రాదులను రచియించిన పాలకురికి సోమనాథాదులనుగూర్చియు నిత్యాదిపద్యములలో వ్రాసియున్నాఁడు—

క. వీరప్రతాపరుద్రుఁడు । ధారుణిలోఁ గలుగుప్రజల ధర్మాత్ముండై
యారూఢి వెలయ నేలుచు । గారవమున నున్న యట్టికాలమునందున్.

సీ. ఘాలాఖ్యభక్తుండు భవపరిత్యాగి సమంచితభూతిరుద్రాక్షధారి
పంచాక్షరీమంత్ర పఠనపారీణుఁడు విమలఘనవ్రతవీరయశుఁడు
కావ్యకళాశాస్త్రకామితప్రవణుండు శాఖాగ్నిఫలపత్రజలము లైన
భవిచేతఁ జేకొనం డవి విననోపఁడు భాతివిూఆంగను బాలకురికి
సోమనాథుఁ డనఁగ సురలు ప్రస్తుతిచేయ
సకల శాస్త్రములను జదివిచూచి
ప్రకటితముగ శివుని భక్తి యధికమని
బసవదేవుమహిమ ప్రబలఁజేసె.

ఈ కవి శైవబ్రాహ్మణుఁడు, హరితసగోత్రుఁడు; త్రిపురాంతకాధ్యపుత్రుఁడు; ఇతఁడు నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వమంత మంచిదికాక, వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములతోఁ గూడియున్నది. ఈతని బసవ విజయములోనివి రెండు పద్యము లిందుఁ బ్రదర్శింపఁబడుచున్నవి—

చ. బసవపురాణకావ్యమును బ్రౌఢవ మెప్పుఁగఁ బద్యగద్యలఁ
బొసఁగఁగ నాంధ్రకావ్యములు బుద్ధిని దా రచియించి చెప్పుఁగాఁ
బసిగొని భూసురుల్ వినియుఁ బాయక గుంపులు కూడి రాజుతో
మసలకపోయి పాల్కురికిమాన్యుఁడు సోమన చేయుశాస్త్రములన్.ఆ.గ

చ. అధములు మీరు బ్రాహ్మణులె యందఱుఁ జూడఁగ నొక్కచాకి యీ
పథమున వేదవాక్యములు పాడి పదంబుల మిమ్ము నందఱిన్
బధిరులఁ జేసెఁగాని సరిపాల్పడి మీ రొకరైన వారితో
నెదుటను నిల్చి సంహితల నేర్పడఁ జెప్పుఁగఁజాల రందఱున్. ఆ.గ.

---

65. చిత్రకవి సింగరార్యుఁడు

ఈ కవి బిల్వాణీయమను మూడాశ్వాసముల ప్రబంధమును రచి యించి శ్రీరామాంకిత చేసెను. ఈకవి యూఱువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఈతని యనంతరమున నీతని పుత్రుఁడగు నారసింహకవి తనతండ్రి రచి యించిన గ్రంథమును దెచ్చి పండితపెద్ది కృష్ణస్వామి కిచ్చి యాతనివలన ధనస్వీకారము చేసినట్లును, వా రిద్దఱును గలిసి కృత్యాదియందలి కొన్ని పద్యములను గద్యములనుమార్చి గ్రంథమును గృష్ణస్వామి రచియించి నట్లు దిద్దినట్లును జెప్పుచున్నారు. ఆ కొన్ని పద్యములను మార్చుటలోఁ గూడఁ గృష్ణస్వామికి నారసింహకవి సాహాయ్యమున్నదని తెలుపుటకుఁ గాఁబోలును బిల్వాణీయమున నీ క్రిందిపద్యము వేయఁబడి యున్నది—

క. ము న్నింద్రతనూభవునకు। వెన్నుఁడు సహాయ మైనవిధమున సేనా
సన్నుతసద్గుణగణసం। పన్నుం డగుకవివరాధిపసహాయమునన్.

గ్రంథమునందుఁ బండి పెద్ది కృష్ణస్వామియే గ్రంథరచన చేసినట్లు చెప్పఁబడియున్నను నిజముగాఁ గృతికర్త సింగరయ్యయే యగుటకు నిదర్శనము ప్రథమాశ్వాసాంతమునందుండిన యీక్రింది చక్రబంధము నందుఁ గానఁబడుచున్నది—

శా. ధన్యా సింహభచంద్రకీర్తి వరవిద్యాపండితార్యక్రమా
గణ్యా గర్వితధనంజయా శివదముక్తాకృత్పికంకప్రభా
జన్యారాజితభూరిశాత్రవసుభృజ్జ్ఞావిద్రమావిక్రమా
మాన్యారాధన త్యాగభోగజయధామా నవ్యభాగోత్తమా.

ఈకావ్యము నూటయేఁబదిసంవత్సరములకుఁ బూర్వము రచి యింపఁబడినట్లు తెలియవచ్చుచున్నది. ఇందలికథ మనోహరముగాను కవనము రసవంతముగాను గొంతవఱకున్నను దారాశశాంకమువలెనే యివియు నీతిబాహ్యమైనందునఁ జదువఁ దగినదికాదు. మదనాభిరాముఁ

డనురాజు రూపయకావనవతియగు యామినీపూర్ణతిలకకు సంగీతసాహిత్య ములు చెప్పింపఁదలఁచి, సమస్తవిద్యలయందును సమర్థుడయిన బిల్హాణుఁ డను సంస్కృతకవీంద్రుని రావించి, అతఁడును రూపయకావనసంపన్నుఁ డయినందునఁ దనకూఁతు నాతనికడ నొంటిగానుంచి చదివించుట కిష్టము లేనివాఁ డయి మంత్రితో నాలోచింపఁగా నతఁడు

మ. ఒకచిత్రవ్రత మున్న దిర్వురకు రాజో త్తంస సిద్ధంబుగా
నకలంకాకృతి యైనసీతనయు జాత్యంధు స్వీలోకింప దా
సుకవీంద్రుండును గుష్ఠగాత్రి నెపుడుం జూడ న్మదిం గోరఁ డిం
దుకు నేమో వచియించు టే నెఱిఁగియుంటన్మున్నతకార్యమున్.

మ. కవిరాజాగ్రణి పుట్టుగు డ్డనుచు నీకంజాక్షికిం జెప్పి యా
కవికిఁ బ్రాసుత కుష్ఠగాత్రియని వేఁడ్కం దెల్పి యవ్వారికిఁ
భువి ననోన్యవిలోకనక్రియలు నేర్పుల్మీఱఁ గాకుండున
ట్లు విచారించెద నొక్కయు క్తి వినుఁ డిట్లుఁ రాజదేవర్షభా.

అని రాజపుత్రి తాను జాత్యంధునిముఖము, జూడనని నియమముపట్టియున్నందున నామెతో నావిద్వాంసుఁడు పుట్టుగుడ్డివాఁడని చెప్పియు బిల్హాణుఁడు కుష్ఠగాత్రిని జూడనని నియమముచేసికొనియున్నం దున నాతనితో రాజపుత్రి కుష్ఠగాత్రియనిచెప్పియు నిరువురకు ననోన్య ముఖావలోకనము లేకుండ నడుమ తెర వేసి చదివింప వచ్చునని యుపా యము చెప్పెను. రాజాయుపాయమునకు సంతోషించి తనకొమారిత తోను విద్వాంసునితోను నమ్మఁబలికి వారి నొడఁబఱిచి యిరువురిమ ధ్యను తెర వేయించి కూఁతునాతనివద్ద జదివింప నారంభించెను. కుశా గ్రమతియైన యామినీపూర్ణతిలక యాతనివలన సంగీతసాహిత్యాదివిద్యల నభ్యసించి యల్పకాలములోనే కవిత్వముచెప్పనేర్చుకొనెను. ఇట్లు కొంత కాలము జరగఁగా నొకనాఁటిరాత్రి క్రొత్తగా నుదయించిన పూర్ణచం దునిజూచి కవి.

చ. జలనిధిపుఁక మంచు మతి చాయయుఁ జిహ్నాము లేడిపిల్ల కం
దళితసుశేంద్రనీలమణిధామ మటంచు వచింతు రంద టీ
కలువలతేనియందుఁ గలకందును నే ననుకొందు రాత్రియం
దలవడ్రమింగినట్టితమ మంతరసంస్థ మటంచు నెంతయున్.

ఇత్యాదివాక్యములత్రోఁ జంద్రవర్ణనము చేయఁజొచ్చెను. ఆవ
ర్ణన నాలకించి యామినీ పూర్ణతిలక

శా. అంధుం డెక్కడ చంద్రుఁ డెక్కడ తదీయంబైన యావర్ణనా
బంధం బెక్కడ యిట్టివింత గలదే భావింప నెచ్చోటనై
నం ధాత్రీంద్రుఁడు మాకు నిర్వురకు నందంబొప్ప ననోన్యహా
ర్దాంధానం బగు నంచుఁ జేసె సిటులం జర్చింప వేఱున్నదే.

పుట్టుగుడ్డివాఁడెక్కడ? చంద్రవర్ణనముచేయు టెక్కడ? రాజు మాకిరువురకు ననోన్యసంధానము కలుగకుండ నీమిష కల్పించెఁగాబో లుననితలఁచి, వ్రతభంగమయినను గానిమ్మని సాహసముచేసి తెరదీసి చూచెను.

ఉ. ఆకడ బిల్హణాఖ్యకవి యత్తటిఁ దామరసారిఁగూర్చి యెం
తో కళ యుప్పతిల్ల వినుతు ల్పచరింపుచునుండి యంతలోఁ
బ్రాకటబద్ధకాండపటిపై రమణీమణిమోముఁ జూచి యు
ద్యోకమహోదయాద్రిపయిఁ దోచిన చంద్రునిఁ బోల్చి యిట్లనున్.

ఆయీవనపురుషుడు పండువెన్నెలఁ గాయుచుండఁగా సంపూర్ణ పూర్ణిమాచంద్రబింబమును మీఱిన నిండుజవ్వనియొక్క ముఖచంద్రబిం బము నొంటిగాఁ జూచిన తరువాత జరగినపని చెప్పనక్కరలేదు. ఇట్లుకొంతకాలము రాజపుత్రియుఁ గవీశ్వరుఁడును యథేష్టావిహారముల నానందించుచుండఁగాఁ దెలిసి కావలివారు రాజునకు విన్నవింపగా నతఁడు కూఁతుం జేరఁబిలిచి.

ఉ. కోరిన రాకుమారకునకుం బ్రియమారఁగ నిన్ను నిచ్చి యెం
తో రహిమీఱ సౌఖ్యమున నుండెదనంచుఁ దలంచియున్న నా
కోరిక లెల్లఁ బోఁగలఁచి కొంకుఁ గలంకము లేని మత్కులం
బారఁగ దుర్యశంబు మహిఁ నందఁగఁజేసితివమ్మ బాలికా.

అని కోపముతో బిల్హణుని శిరశ్ఛేదముచేయ నియమించెను. రాజ భటుల లాతనిని వధ్యస్థలమున కీడ్చుకొనిపోవుచున్నారని విని రాజపుత్రి యిట్లు విలపింపఁ జొచ్చెనట—

మ. అరవిందంబులరీతిఁ జెన్నలరుసీహాస్తంబు లెట్లొర్చె ము
ప్పురిగాఁ బెల్చిన కాలపాశమునకున్ ముగ్ధాంగనాగానభ
వ్యరసోత్కర్షము లైనసీశ్రుతియుగం బత్యుద్ధతోర్వీపకిం
కరనాదార్భటి కెట్లుతాళె మదనాకారా మనోనాయకా!

కవియును దన ప్రాణాపాయమును బాటింపక త్రోవపొడుగునను దన ప్రియురాలిని దలఁచుకొని యీ మెపయి నీరీతిని బద్యములుఁ జెప్ప నారంభించెను—

ఉ. హా కమలాయతాక్షి చెలి హా సరసీరుహకుట్మల స్తనీ
హా కమనీయగాత్రి సతి హా నవమోహిని హా వధూమణీ
హా కనకాంగి నేను విడనాడితి నంచుఁ దలంచె దీవు నీ
లోకమునందు జీవునకు లోలతగాక స్వతంత్ర మున్నదే?

కవి తలవరులు తన శిరమును ఖండింపఁబోవునప్పుడొక పద్య మును వ్రాసి రాజునకంపఁగా నతఁ డది చదువుకొని కవిని క్షమించి, బిల్హణునికిని తన పుత్రికకును గల యన్యోన్యానురాగమును విచారించి, తన కూఁతు నాతనికిచ్చి వివాహముచేసెను.

మ. పొలుపొందఁ ద్విజరాజశేఖరునకుఁ భూభృద్వ్రతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చుపగిదిఁ హ్రీశ్మనాకముఖ్యంబుగాఁ
బొలుపొందఁ ద్విజరాజశేఖరునకుఁ భూభృద్వ్రతంసంబు ని
శ్చలభావోన్నతిఁ గన్య నిచ్చె సుమనస్సంతానము ల్మెచ్చఁగన్.

66. రేవుణూరి వేంకటార్యుఁడు

ఇతఁడు శకుంతలాపరిణయమును మూడాశ్వాసములప్రబంధమును రచియించెను. ఇతఁడు నందవరీక వైదిక బ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; తిరుమల కొండయార్యపుత్రుఁడు. ఈతఁడు తన శకుంతలా పరిణయము నొకానొక రాజున కంకితముచేయు నుద్దేశించియుండఁగా నొక కరణము విఘ్నమాచరించినట్టును, అందుచేతఁ దసకృతిని వేంకటేశ్వరుని కంకిత మొనర్చినట్టును, గవి యీ క్రింది వాక్యములలో వ్రాసికొని యున్నాఁడు—

వ. అపూర్వపూర్వకవిసుపర్వపానుగ్రహంబునఁ బుణ్యగుణకథాశ్రవణకు
తూహలిక బుధసదానుబంధంబగు నొక్కప్రబంధంబు సరససుమనో
నుబంధంబుగా నిర్మింపం బూనియున్న సమయంబున నతిప్రభావసంప
న్నుం డగు కశ్చిత్పురుషుండు—

శా. శ్రీవత్సాన్వయు రేవుణూరికులజున్ శ్రీపాదసేవాప్రభా
సావర్ణ్యస్ఫుటకావ్యకల్పకకవిన్ సంకీర్తనాచార్యపు
త్రీవంశోత్తము నందవైదికబుధాదిప్రోక్తవృత్తిస్వయం
భావున్ దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

క. పిలువంబంచి యెదుర్కొని । మిలమిల నలఘుప్రభానమిద్ధాస్థాన
స్థలిఁ జాఁగిలిమ్రొక్కి వటీ । కలితసుఖాసీనుఁజేసి కలకల నగుచున్.

చ. కనుఁగొని చండికాభిసుముఖప్రసదందవరాహారపా
వన ఘన పెద్దిభట్టకులవార్ధిసుధాకర నీవు శ్రీసువా
సుని యలమేలుమంగకృప జొక్కిన దిక్కరి వాంధ్రభూమిరా
డ్వినుతసభాస్థలీవననవీనపికంబవు కాకలీకృతిన్.

శా. సల్లాలిత్యభవత్కవిత్వఘటిమాసందర్భవైదర్భికా
సల్లాపంబులు మామకీనసుకులస్వామీంద్ర కీలాద్రి రా

ణ్మల్లేశుండును మెచ్చ నొక్కకృతి నిర్మాణంబు గావింపుమా
నుల్లీఫుల్లసుమోల్ల సన్మధురిమాధుర్యకౌదార్యత.

మ. అని హేమాంబరరత్నభూషణసుగంధాలంకృతుం జేసి స
ద్ధనసారస్ఫుటవీటికాదు లొసఁగన్ గైకొంచు వాణీవధూ
వనజాతాంఘ్రిఘులద్ఘులన్నటనజిహ్వస్థానవాగ్దే స్తనీ
జనితానందమరందకందళనదీజంఘూల వేలాస్యుఁడై.

వ. అమ్మహాకవివరుండును దదీయవంశావతారసర్ణయవర్ణ నానుపూర్వం
బుగాఁ దత్ప్రబంధబంధురానల్పకల్పనంబొనరించి తత్సముచితకృతిక
ర్యాకరణంబునకు నవకరణంబుగా నుపకరణంబగు నొక్కకరణంబు
కృతఘ్నుండై విఘుంబుచేసిన.....శ్రీ వేంకటరమణునకు.....
దండప్రణామ పుష్పాంజలి ప్రపూర్ణ భర సమర్పణంబుగా సమర్పించెద.

ఇంత చెప్పినవాఁడు కశ్చిత్ప్రభుండనక యాప్రభుఁ డెవ్వఁడో
పేక్షాసనియుండిన పక్షమునఁ గవికాలనిర్ణయమున కనుకూలపడియుండు
నేమో! అయినను కవి తన శకుంతలాపరిణయమునందుఁ జేసిన యీకవి
వర్ణనమునుబట్టి యితఁ డాధునికుఁడగుట స్పష్టమగుచున్నది—

మ. పరఁగన్ భారతకల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశపోతఘను లాలంకారము ల్దూర్పఁ జూ
పరులై నట్టి పితామహాద్యులు నుతు ల్వాటింప నర్థించు నీ
సరసాంధ్రోక్తివధూటి కేను సుమనస్సంపూర్తి గావించెదన్.

ఈ కవి నూఱు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండ
వచ్చును. ఇతఁడు శబ్దాలంకారములనిమిత్త మమితముగాఁ బాటుపడి
గ్రంథమునందు వ్యాకరణదుష్టములైన ప్రయోగముల ననేకములను జేసి
యున్నాఁడు. వసుచరిత్రములోని కల్పనలనుబోలిన కల్పనల ననేకములఁ
జేసినను మొత్తముమీఁద నీతని కవిత్వము శబ్దాలంకార భూయిష్ఠమయి
హృద్యముగా నున్నది. ఇతఁడు తాను రామచంద్రోపాఖ్యానమును మఱి

యొకగ్రంథమును జేసినట్లు చెప్పుకొనెనుగాని యీగ్రంథము దొరకలేదు. ఈతని కవితారీతిని జూపుటకయి శకుంతలాపరిణయములోని కొన్నిపద్యములు నిందుదాహరించుచున్నాను—

ఉ. సింగము లెన్న వీరలకు సిద్ధముగా మొలబంటి మత్తమా
తంగశిరస్తటంబులు పదంపడి మ్రొమ్మ్రులబంటి యంచు సా
రంగచయంబు లెల్లను సరాసరిగా నెదిరింపలేక మా
వంగడపున్వ్రేగూమణుల వాలికచూపులకున్ భయంపడున్. ఆ. ౧.

ఉ. శ్రేణులుగట్టి మానిజనశీర్ష జటాచ్ఛట లుద్గమింప న
క్షీణవిరాగయోగములు చెందును బల్లవరాజకోటికిన్
స్థాణులకున్ సరాగగుణసారతరాంకురలబ్ధి గల్గు పూ
బోణులమేని వాసనలు పొర్లినమాత్రఁ దదాశ్రమంబునన్. ఆ. ౨.

ఉ. వారనిరేమ నేగి కెటు వా రనినన్ విని మారునిద్దపున్
వారుప మైనయక్కలికి వారు వసంబునకున్ ఫలంబు ల
వ్వారిగఁ దేరఁగాఁ జనిరి వారిఁ గనుంగొను గారవంబునన్
మీరరుదేరఁగాఁ దెలిసి మీఱురు వారిటవత్తు రింతకున్. ఆ. ౩.

---

67. పోచిరాజు వీరన్న

ఈకవి తానుక్ష్ణార్జున సంవాదము, పంచకావ్యములు, విభూతి మహాత్మ్యము, మార్కండేయ చరితము, మనువంశపురాణము, ముక్తి దేవుకథ, ఆనందలహరి, సౌందర్యలహరి, సుభాషితము, అను గ్రంథములను రచియించినట్లు భక్తాణచరిత్రమున నీక్రింది పద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పదునాలు గగునేట మొదట, గృష్ణార్జున
సంవాదము ప్రబంధసరణియయ్యెఁ
బదునెన్మిదగునేటఁ బంచకావ్యము లాంధ్ర
పద్యకావ్యములుగాఁ బరిఢవిల్లె
నిరువది రెండగునేట విభూతిమా
హాత్మ్యంబు ద్విపదకావ్యముగ నొప్పె
నిరువదియాఱగునేట మార్కండేయ
చరితంబు రచితమై సంఘటిల్లె
ముప్పదగునేట మనువంశ ముఖ్యనృపు
రాణము ప్రకల్పితంబయి ప్రకటమయ్యె
ముప్పదాఱగునేట శ్రీముక్తదేవు
కథ కథితమయ్యె నాచేతఁ గౌశలమున.

గీ. సంస్కృతంబై శంకరాచార్య విరచి
తంబు లానందలహరి సౌందర్యలహరి
భర్తృహరికృతమైన సుభాషితమును
శతకములుగాఁగ మాప్పికల్పితములయ్యె.

ఇందుఁ బేర్కొనఁబడినవానిలో నీపుస్తకముగాక మాకు మను వంశపురాణ మొక్కటిమాత్రము లభించినది. భల్లాణచరిత్రమును గవి బందరుపురములో నుండిన చిత్రకార (ముచ్చి) కులస్థుఁడయిన దాము మొగ్గన్న కంకితముచేసెను. బందరుపురమును చిత్రకారకులమును వర్ణించిన పద్యముల రెంటి నిందుఁ బొందుపఱిచెదను.

సీ. శ్రీకంఠవైకుంఠసేవావికుంఠ వందారుమందిరము బందారుపురము
నిరతోత్సవైశ్వర్యనికరాభిభూత బృందారకపురము బందారుపురము
సంతతాయాత యాచకజనవ్రాత మందారభాసురము బందారుపురము
సకలవర్ణాశ్రమాచార సంపత్యమందారతిభరము బందారుపురము

శిల్పినర్తక వర్తక చిత్రకార । సూత్రకారాదివివిధవిచిత్రకృత్య
దానధర్మపరప్రజోత్కరచకోర। కారవిందారికరము బృంచారపురము.

ఉ. ఆపురి నుండ్రు దాముకులజాధ్యులు మాకికసంప్రదాయు లు
ద్దీపితకీర్తింగోలు రతిధిప్రియశీలురు శూలిపాదపూ
జాపరతంత్రమంత్రగుణశాలు లఘూటవికీలు లర్వా ధ
ర్మోపకృతిస్వభావమతియుక్తులు చిత్రవిధానశక్తులున్.

మనువంశపురాణము బెజవాడ మల్లేశ్వరస్వామి కంకితము చేయఁ బడినది. దీనికి ఖండకపాలాఖ్యానమని నామాంతరము. కవి నియోగి బ్రాహ్మణుఁడు; తండ్రి వీరభద్రుఁడు; తల్లి మూర్తిమాంబ; నివాసస్థలము కృష్ణామండలములోని కొలకలూరు. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఇతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఈతనికవనధో రణి యీ క్రింది పద్యములవలనఁ దెలిసికోనచ్చును—

భక్తాణ చరిత్రము.

చ. కలువలసొంపు దాఁప భుజగంబులు పుట్టల దూఁకఁ దారకా
వళి రుచి జాఁకఁ జక్రవలవంతలు దీఁకఁ జకోరకవ్రజం
బులసుఖ మాఁప దమ్ములకు మోదము లూరె నిశాకరద్యుతుల్
వెలవెలఁబాఁకఁ దూర్పుదెస వెల్లడిగాఁ దెలవాఁప నయ్యెడన్. ఆ-౧

ఉ. ఇంటికిఁ దోడితెచ్చి యవనీశ్వరుఁ డవ్వీటకూపుఁ డైనము
క్కంటిని భీతసంగతునిగా నొనరించి సపర్యసల్పి నే
జంటకు మాటుఁగా దలఁచి జాజులు నించినసెజ్జఁ జేర్చి వా
ల్గంటినిజూచి పల్కెఁ గుతుకంబు మనంబునఁ దొంగలింపఁగన్. ఆ-౩

మనువంశపురాణము.

మ. ఖల! దుష్టాత్మ! మనుప్రభూత! బుధధిక్కారంబుఁ గావించి తీ
వి లనీయన్యాయ మింతనుండి వసుధాధీశత్వనిర్మూలమై

తిలఘాతన్యవహారలక్షణముక్తో దీనత్వముం బూని ని
ష్కళమై యుండెడుఁగాత సర్వజనము ల్గర్వింపహైన్యాబున్న. ఆ-౩
శా. భూనాథోత్తమ! మేదినీసురధనంబు ల్గోరఁగాఁగూడ దీ
ధేనూత్తంసము యజ్ఞకార్యమున కాదిద్రవ్యమాఁ గావున్న
దీనిం బట్టఁగరాదు మీ రఖిలధాత్రీపాలకుల్ ధర్మని
ష్ఠానై పుణ్యులు మీ రెఱుంగనికథాసంఘం బిలం గల్గునే. ఆ-౪

---

68. అయ్యలరాజు నారాయణకవి

ఈకవి హంసవింశతికథల నయిదాశ్వాసముల పద్యకావ్యము నుగా రచియించెను. హంసవింశతియందు రెట్టమతమును రచియించిన కవు లీపద్యమునఁ బేర్కొనఁబడియున్నారు—

ఉ. అయ్యలరాజుఁ దిప్పసచివాగ్రణిఁ బర్వతరాజు రామభ
ద్రయ్యను భాస్కరాగ్రణిఁ బ్రధానవరుం డగుకొండధీరునిన్
జయ్యనఁ దిమ్మయప్రభుని సత్కవితారచనాఢ్యు లైనమా
యయ్యలరాజువంశజుల నాదికవీంద్రుల సన్నుతించెదల్.

ఇచ్చట సంవత్సరమునందుండిన కవులను బేర్కొనియుండుటచేత నితఁడాకాలమునకుఁ దరువాత నుండినవాఁ డనుటస్పష్టము. ఇతఁ డిప్పటికి నూఱుసంవ్సరముల క్రిందట నుండెనని సంవత్సరప్రాంతములయం దుండియుండును. పై పద్యమునఁ బేర్కొనఁబడిన యయ్యలరాజవంశజుల యినకవులలోఁ బర్వతరాజును గొండయ్యయుఁ దిమ్మయ్యయుఁ జేసిన గ్రంథము లేవియో తెలియరావు. ఈకవితండ్రి సూరనార్యుఁడు; తల్లి కొండమాంబ; గోత్రము కౌండిన్యసగోత్రము. ఈతనికవిత్వములో లక్షణ విరుద్ధము లయిన ప్రయోగము లనేకములు గలవుగానిమొత్తముమీఁదఁ

గవిత్వము ప్రౌఢమయి రసవంత మయినదిగా నున్నది. ఈపుస్తకమునం దన్యదేశ్యము లనేకములు వాడఁబడియున్నవి. ఈతఁ డాయూజాతులవా రిని వర్ణించవలసివచ్చినప్పుడు మిక్కిలి కష్టపడి వారివారికుచితము లయిన యుపకరణాదులనామముల నన్నిటిని సంగ్రహించి వివరించియున్నాఁడు. ఈకథయొక్క ముఖ్యోద్దేశము

ఉ. మున్నలరావణాదుల సమృద్ధి సాధ్వులఁగోరి యేమిసా
ధ్యోన్నతిఁ జెంది రట్లగుట నుర్వ జనావళు లన్యకాంతలఁ
బన్నుగఁ గోరరాదు కడుఁబాతక మంచుఁ దలంచి యింతిపై
నున్నమనంబు ద్రిక్కొని యధోచితపద్ధతి నుండె భూవరా.

అన్న శ్లోకపురుషునిమనస్సు నన్యకాంతనుండి విముఖముచేయు టయే యయినను, పుస్తకమునింత అంకుసోయి బొంకాడి తప్పించుకొన్న యుపాయములే వరిఁపఁబడియుండుటచేత నిది దుర్నీతిబోధకమయి నీతిపరులకుఁ బఠనయోగ్యము కానదయియున్నది. ఈపుస్తకమునుండి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

శా. పన్నీట న్నయనంబు లొత్తెఁ దనువుం బాటీరపంకంబుతోఁ
జెన్నారం బద నిచ్చి గీతి సిగ వేసెం దాయెతు ల్నున్నెట్టె జీక
సొన్నాపట్టెరుమాలు గట్టె జలతార్చుట్టంచుడాల్మించుమేల్
మిన్నాసన్నపుదుప్పటంబు వగహాళిం గప్పెసోంపారఁగన్. ఆ-ం

చ. కమటము కట్టసంచి యొరగల్లును గత్తెర సుత్తె చీరముల్
ధమనియు శ్రోవణంబు మొలత్రాసును బట్టెడ నీరుకారు శా
ణము పటకారు మూస బలునాణెపరీక్షలమచ్చు నాదిగా
• నమరఁగ భద్రకారకసమాహ్వయుఁ డొక్కరుఁడుండునప్పురిన్. ఆ-౫

శా. పున్నాగంబును గెల్వఁజాలు రుచిరాంభోజాస్యవేణీరుచుల్
పున్నాగంబును నవ్వనోపు నెఱయన్ లోలాక్షియూనంబులుం

బున్నాగంబును గేరివిూటి మెఱయుం బూఁబోఁడినూగారుడాల్
పున్నాగంబును మించు నాభిచెలువంబున్ సారెవర్ణింపఁగన్. ఆ-3

మ. చతురోపాయనమర్థుఁ డప్రతికళాచాతుర్యధుర్యుండు వి
శ్రుతకార్యజ్ఞుఁడు రాజనీతిపదవేదుం డింగితజ్ఞానుఁ డ
ద్భుతశక్తిత్రయపారగుండు గుణసంపూర్ణప్రభావుండు సం
తతభూపాదరణీయుఁడొక్కరుఁడమాత్యశ్రేష్ఠుఁ డుండుం బురిన్. ఆ-4

---

69. వెణుతుర్ల వడ్డికవి

ఇతఁడు శృంగారరసాలవాల మనుపేరుగల మూడాశ్వాసముల యలంకారశాస్త్రమును రచియించెను. ఇతఁడు ప్రథమశాఖ బ్రాహ్మణుఁ డయినట్టును రామభక్తుఁడయినట్లును శృంగారరసాలవాలములోని యీ క్రింది పద్యమువలనఁ దెలియువచ్చుచున్నది—

ఉ. శ్రీరఘువీరభక్తిరససింధువిహారుఁడ శుక్లయాజుషా
చారుఁడ దేశికాంఘ్రిపరిచారుఁడ నే వెణుతుర్లవంశ వి
స్తారుఁడ వడ్డినామ కవిసత్తముఁడన్ రఘువర్యపేర శృం
గారరసాలవాల మను కావ్య మొనర్తు జగద్ధితంబుగన్.

ఈకవి కౌండిన్యసగోత్రుఁడు; వేంగనార్యపౌత్రుఁడు; మంగళగిరి పుత్రుఁడు. ఈతనికాలమేమో తెలియరాలేదుగాని కవిత్వము రసవంత మయినదిగాఁ గనుపట్టుచున్నది. శృంగారరసాలవాలములోని పద్యముల రెంటి నిందుఁ జూపుచున్నాను—

ఉ. కుందనముక్ హసింపఁగలకోమలి కోమలదేహవల్లిపైఁ
గందళితంబు లయ్యె సితకాంతులు సంతత మమ్మృకుందు నిం
పొంద మనంబులోన నిడియున్న మనోభవుఁడుంచు నాతనిన్
గ్రందుగనేయు పుష్పశరగాఢరుచుల్వయిఁ దోఁచెనో యనన్. ఆ-౧

ఉ. ఆఁకలు బాన లిచ్చి కపటాత్మసఖు ల్వొదరిల్లు చేరఁగాఁ
దీసిన నందు నిందుముఖి త్రెల్లమిగా హరి లేమిఁజూచి వి
శ్వాసముతోడుత స్మరలివచ్చునెడన్ మరలింప దచ్చటన్
భాసిలు చంచరీకములబారు గనుంగొను దృష్టిపెంపునన్. ఆ. 3.

---

70. కొత్తలంక మృత్యుంజయుఁడు

ఈకవి బృహన్నారదీయము, ధరాత్మజాపరిణయము, నిరోష్ఠ్యనల చరిత్ర, అనుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడు శివబ్రాహ్మణుఁడు. శివాలయములలో నర్చకులుగానుండెడి యీ తెగబ్రాహ్మణుల నీప్రాంత ములయందు శివలవాండ్రని వాడుదురు. ఈతని నివాసస్థలము గోదావరీ మండలములోఁ గౌశికీతీరమందున్న కొమరగిరిగ్రామము. ఈకవి బోధా యనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; విశ్వనాథపుత్రుఁడు. ఈతఁడించు మించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతని మునిమ నుమ లిప్పటికిని గోడి యను గ్రామములో జీవించియున్నట్లు వినుచు న్నాము. ఈతని కవిత్వము హృద్యమయి సలక్షణముగా నుండును. ఇతఁడు రచియించిన పుస్తకములలో బృహన్నారదీయపురాణ మాఁటా శ్వాసముల గ్రంథము; ధరాత్మజాపరిణయము నాలుగాశ్వాసములద్వ్యర్థి కావ్యము; నిరోష్ఠ్య నలచరిత్ర మైబాశ్వాసముల చిత్రకావ్యము. ఈ కావ్యములలో ధరాత్మజాపరిణయమును కవి తన కాశ్రయుఁడైన యల్లూరి యప్పలరా జనుఁత్రియుఁడు రచియించిన ట్లవతారికలోఁ

ఉ. ఎల్లజగంబులం గరుణ నేలెడువేలుపు నిందిరామనో
వల్లభు నాశ్రయించి యనవద్యతదీయకృపావిభూతి భూ
వల్లభసత్సభావిబుధవర్ణ్యకవిత్వసరూఢిఁగన్న శ్రీ
యల్లురి వంశసంభవుఁడ నప్పన్నపాలక నామధేయుఁడన్.

ఇత్యాదిపద్యములచేఁ జెప్పినను, ఆశ్వాసాంత గద్యమునఁదనపేరే వేసికొనియున్నాఁడు. ఈప్రాంతములయందలి ప్రతియులు సామాన్యముగాఁ దాము మాధవవర్మసంతతివారమని చెప్పుకొనునట్లే యూయల్లూరివారును మాధవవర్మసంతతివారే యయినట్లు ధరాత్మజాపరిణయమునందు వంశకర్తగా మాధవవర్మ యిట్లు నిర్ణయింపఁబడెను—

ఉ. మాధవవర్మ నాఁగ నొకమానవభర్త జనించి విస్ఫుర
ద్బోధసమగ్రుఁడై కనకదుర్గమ శ్రీజయవాటికాపురీ
సౌధవిహారిణిం గొలిచి చక్కఁగ దత్కరుణారసంబుచే
నీధర హేమవృష్టిఁ గురియించె నతిస్థిరకీర్తి మీఱఁగన్

కవినిరూపించి వ్రాయఁదగిన విశేషము లంతగాఁ దెలియనందున, పూర్వోక్తగ్రంథములనుండి కొన్నిపద్యముల నుదాహరించి విరమించుచున్నాము—

బృహన్నారదీయము.

చ. హృదయమున నివ్వివేక మొకయించుక లేనిదురాత్మునింటిసం
పదలు శరన్నదీజలముభంగి నశించు ననూయ యాత్మలోఁ
బొదలినవానిసంపదలు పోఁడిమి దక్కును మారుతంబుతోఁ
గదియుతుషానలంబుక్రియఁ గంజభవాత్మజ యాలకింపవే. అ. 3.

ఉ. ధ్యానవిహీనుఁ డయ్యు ననయంబు జితేంద్రియవర్గుఁ డయ్యెనా
యానరుఁ డెన్నఁడుం జెడనియట్టిపదంబున నుండు నిశ్చల
ధ్యానసమేతుఁ డింద్రియజయం బొకయించుక లేకయున్నఁ ద
ద్ధ్యానము నిష్ఫలం బగు నతండును మూఢుఁ డనం బ్రవర్తిలున్. అ. 6

ధరాత్మజాపరిణయము.

ఉ. అనఘ వసిష్ఠహాసముఖ లవ్విబుధౌఘముఁ గూడి యమ్మహా
వనివిభుఁ బూర్ణభూతిభవు వర్ణితతేజునిఁ జూచువేడుకం

జని విలసిల్లుతద్విపులసంజసితప్రమదాన్వితాధికా
ననసుషుమం గనుంగొని మనంబున నుబ్బుచుఁ బల్క రీగతిన్. ఆ. 2

ఉ. ఆగ్రహబుద్ధిచేత విషయంబు లశేషముగా జయించి లో
కాగ్రియబాహుశౌర్యగతి యాగవిహింసకుఁడై తనర్చు న
య్యగ్రసునివ్రాఁత శాతశర మొక్కటి వేయఁగ సమ్మతింపుమా
నిగ్రహభూతవై రిగణ నీదగు పట్టినకార్యసిద్ధికిన్. ఆ. 3.

ఉ. అచ్చట నచ్చట న్వెలయునచ్చపుఁబచ్చలతోరణంబులన్
రచ్చల హెచ్చుచై ననెలరాలయరంగులరంగుల న్నదా
లచ్చికి వాటపట్టయినలచ్చనము ల్పరికించి చూచుచో
నొచ్చెము లేనియచ్చెరువు నొందఁగఁజేసెఁ బురంబువారికిన్. ఆ-ర

నిరోష్ఠ్య నలచరిత్ర.

ఉ. అల్లలితాంగి చంచలకటాక్షనిశాతశరాళి నేయఁగా
గల్లరి యైనచిత్తజునిగాసిఁ దలంకిహిఁ ద్రాసరీతి సం
ధిల్లఁగఁ గీరసంతతికి దీనత గాంచితి రాకరాకకే
జల్లని తల్లడిల్లితిని జల్లనిగాలికి సంచలించితిన్. ఆ. 2.

ఉ. చంచలరీత్రిగా నధికచంచలతం గనిపట్టియిందిరా
చంచలనేత్ర నెల్లెడ నచంచలఁగా నెఱఁదం దలంచి యా
చించినయర్థిరాజి నిరసించినిర్ణతకీర్తి కెంత చిం
తించిన నక్కటా తగిననిష్కృతి కల్లఁగనేరదేగదా. ఆ. 3.

చ. అలిగినయత్తఁ గలఁక నందక సారదయానిరీక్షచే
నలరఁగఁ జేసినత్తటి నహంకృతిఁ జెందక ధాత్రిరీతి ని
శ్చలత నిజేశసన్నిధిని సంతతహర్షనిశాంతచిత్తమై
చెలఁగెడికన్య ధన్యగతిచే నలరాడెడి సారసాననా. ఆ. 4.

అంతర్వేది నృసింహస్వామి కంకితము చేయఁబడిన యీనిరోష్ఠ్య నలచరిత్రము కొన్ని వ్రాత ప్రతులలో—

"ఇది శ్రీమదభవానీశ్వర శాశ్వత కృపాపాత్ర క్రొత్తలంక విశ్వనాథ పండితపుత్ర సకలసుకవి జనానుగ్రహసహాయ మృత్యుంజయనామ ధేయప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యమునకు మాఱుగా

"ఇది శ్రీమ దంతర్వేది లక్ష్మీనృసింహస్వామి చరణారవిందైక రుద్ర రాజాన్వయాభరణ ధనంజయగోత్రపవిత్ర కూచనృపాలపుత్ర నిరర్గళ కవితావిలాస సంతోషితాశేష విద్వత్కవిరాజ తిరుమలరాజ ప్రణీతంబైన నలరాజచరిత్రము"

అను గద్యము కానఁబడుచున్నది. మృత్యుంజయకవి యీగ్రంథ ముయొక్క కర్తృత్వమును ధనస్వీకారముచేత రుద్రరాజు తిరుమల రాజునం దారోపించి యుండును.

---

71. తిరుమలబుక్కపట్టణపు వేంకటాచార్యుఁడు

ధరాత్మజాపరిణయ మనుపేర మృత్యుంజయకవి రచించిన ప్రబం ధమువంటి దానినే యీకవి "యచలాత్మజాపరిణయము" అను నామము గల మూడాశ్వాసముల ద్వ్యర్థిప్రబంధము నొకదానిని రచియించి యున్నాఁడు. ధరాత్మజాపరిణయముకంటె నచలాత్మజాపరిణయము ప్రౌఢతరముగా నున్నది. ఈగ్రంథకర్త మిక్కిలి సమర్థుఁడు. ఇతఁడాశ్వా సాంత గద్యమునందుఁ దన్నుఁగూర్చి యిట్లు ప్రాసికొనియున్నాఁడు—

"ఇది సర్వతంత్ర స్వతంత్ర సకలభాషావిశేష కవితాధురంధర ప్రతినవప్రబంధపరమేశ్వర శ్లేషయమక చక్రవర్తిబిరుదాంక తిరు మల బుక్కపట్టణ శ్రీనివాస తాతాచార్యతనయ శ్రీమదణ్ణయా చార్య దీక్షితసుత పితృవ్య శ్రీనివాసాచార్య కృపాకటాక్షలబ్ధ

సకలపాండిత్య తర్కాలంకార వాగీశ్వర బిరుదాంక వేంకటా
చార్య ప్రణీతంబైన యచలాత్మజాపరిణయము."

ఈ వైష్ణవకవిగ్రామణి యేకాలపువాఁడో తెలియరాలేదుగాని మిక్కిలి యాధునికుఁడుకాఁడని తోఁచుచున్నది. అచలాత్మజా పరిణయములోని రెండు పద్యము లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

ఉ. చల్లనివాఁడు పాదములచాయలఁ జేరిన నెల్లవారికిన్
గొల్లలుగాఁగ నూర్మికలుఁ గొబ్బున హంసకకంకణంబులున్
జల్లెడువాఁడు వాహినులసంఘటనం బ్రతికూలవర్తన
చ్ఛుల్లకభూమిభృత్కులముఁ గ్రుంగఁగఁజేయునటండు మేదినిన్. ఆ-౧

ఉ. రాజకుమారశేఖరుఁడు రమ్యత నందిపయి న్వినోదముల్
రాజిల నార్యసంగతి యనంతసుఖాశ్రయ మంచు నెంచుచున్
దాఁ జనుదెంచెఁ దాపసహితస్థితి నవ్వల నివ్వల న్వసీ
రాజుల నుల్లసిల్లుమృగరాజులు తన్గని విస్మయంపడన్. ఆ-3.

---

72. కటికనేని రామయకవి

కువలయానందమని సాధారణముగా వాడఁబడెడి యలంకార శాస్త్రమును కువలయానందప్రకాశ మనుపేరితోఁ దెనిఁగించిన యీకవి చెఱుకునూళ్ళగోత్రుఁడు; సూరనకును బుచ్చమకును బుత్రుఁడు. కవి తనది పద్మనాయకకులమగుట యీక్రిందిపద్యముచే నిట్లుచెప్పియున్నాఁడు.

పీ. సకలజగజ్జనస్వర్గసోపానోర్మిగంగ యెచ్చట సీఘ్రగతి జనించె
పతిశాపజాశ్మతాపతితసతీశుద్ధభావకృద్రజ మెందుఁ బరిఢవిల్లె
సనకాదినిఖిలసన్మునిమనఃప్రకరముల్మధుకరంబులమాడ్కి మలయునెచట
బలిబంధనోత్సేపకలితాబ్జజాండరోచులు కేసరాభ నెచ్చోటఁ గనియె
నట్టి నారాయణాంఘ్రిపద్మాంతరమునఁ
బుట్టినట్టి కులంబులఁ బనార్ణమహిమ

నాయకత్వము గనుటచే నవ్యగరిమ
బ్రకటమయ్యెను పద్మనాయకకులంబు.

ఈ కవి గాలమేదో యెక్కడనుండినవాడో తెలియరాలేదు. ఆతడు నూఱు నూటయేబదియేండ్లక్రిందట నుండియుండవచ్చును—

గీ. సరసుడకలంకవంశాబ్ధిచంద్రుడనఘు
డైన రంగార్యవర్య సాహాయ్యమునను
గువలయానంద మిలను దెన్గున రచింప
గడంగితిని దుష్కరంబైన కార్యమునకు.

అను పద్యమునందు గవి తా నీగ్రంథమును రంగార్యుని తోడ్పాటుచేత రచించినట్లు చెప్పుకొనియున్నాడు. కవిత్వనైపుణి తెలియుటకయి కువలయానందప్రకాశముయొక్క మూడుఘట్టముల నుండియు మూడు పద్యము లిందుక్రింద నుదాహరింపబడుచున్నవి—

చ. అబలలయందుఁ గాంచనమునందు భ్రమ న్విధి కల్గఁజేసె నా
యబలలయందుఁ గాంచనమునందును భ్రాంతి దొఱంగి నిష్ఠచేఁ
బ్రబలినవాఁడు చూడఁగ నరాకృతిఁ దాల్చి చెలంగుచున్నయ
న్నిబిడపరాక్రమక్రమవినిద్రుఁడు కేవలరుద్రుఁడే ధరన్. ఘ ౧.

చ. ధనికులమోము గన్గొనవు దబ్బఱ లాడవు వారి గర్వము
ర్వినయవచస్తతు ల్వినవు వేమఱు వారల డాయఁబోవు క్ర
న్ననఁదిసెదిచ్చ నూతనతృణంబుల నిద్దురరాఁగ నిద్దురం
గొనియెద వెందు నేమి వ్రతగోష్ఠిని జల్పితొ తెల్పు మేణమా. ఘ-౨

చ. ధృతిని మధువ్రతంబులు నిజేష్టమధుప్రదమైన పద్మసం
తతి ముకుళింపఁజేసె వెసఁదా నితఁడంచుఁ దలంచి పంకజా
హింతతబింబముఁ బలిమి నేర్చి వడిం గడు నాక్రమించి యం
చితముగ మేన నంకమునుచేసె నిజం బిది యెన్నభంగులఁ. ఘు-3.

73. కొండమడుగు పురుషోత్తమకవి

ఈ కవి సానందగణేశ్వర మను మూడాశ్వాసముల గ్రంథమును రచించెను. పుస్తకము దీబగుంట వీరేశ్వరస్వామి కంకితము చేయఁబడినను, కవి తన గ్రంథమును కుంజేటి బుచ్చయ్య యను కోమటివొక్క ప్రార్థన మీఁద రచియించి యందుఁ గోమటి నీవిధముగా వర్ణించెను—

శా. సాలంకాయనమౌని పూర్వమున భాస్వద్దివ్యతేజోధనుం
డాలీలానిధివంశసంభవులలో నత్యుజ్జ్వలోదారవా
గ్జాలు ర్నత్యధనుల్ కుబేరసదృశుల్ సౌభాగ్యభాగ్యోదయుల్
మే లింపొందిన వైశ్యవర్ధనులు గాంభీర్యమితౌదార్యులున్.

కవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; గిరియప్ప నందనుఁడు. కవి తన కయ్యలూరు మొదలయిన యగ్రహారము లుండి నట్లు వ్రాసికొనియున్నాఁడు. ఈతని కాలము సరిగా తెలియదు. నూఱు సంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. సానందగణేశ్వరములోని రెండుపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

ఉ. ఇంటికి నేగుదెంచి తనయింతిని గాంచి ప్రపంచవృత్తి గై
కొంటకుఁ బొంచి రత్నరుచికుండలమండితగండ యైనవా
ల్గంటికి శంభుఁ డిచ్చినవరంబు కరం బనురక్తిఁ జెల్విక
న్గొంటి భయంబుఁ దక్కఁ మిఁక గోమలికామునిలీలనేలెదన్. అ-ం

ఉ. మీనము లెట్టిలం గడిమి మ్రింగుచు గాలములందు డిందు నెం
దేని పరాంగనారతికి దీకొనియే మిటు లైతి మింతె కా
దా నలినాయతేక్షణలయబ్రపుగుబ్బల గోరు లుంచఁగా
సోనగ నల్లవా రినుపసూదుల గ్రుచ్చిరి మచ్చరంబునన్. అ. 3.

---

74. నాగులూరి శేషనారాధ్యుఁడు.

ఈకవి శ్రీపర్వతపురాణమనెడి యాఱాశ్వాసములగ్రంథమును రచియించెను. ఈపుస్తకమునకు శ్రీశైలమాహాత్మ్యమని నామాంతరము గలదు. ఇతఁడు గ్రంథాదిని తెలుఁగు నిట్లు పొగడియున్నాఁడు—

చ. జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘనలలితార్థగౌరవవికాసి తెనుం గభిరమ్య మంతకున్
గనుఁగొనఁ జూతబీజమునకంకెను గోమల పత్రపుష్పశో
భనమృదుపల్లవాభినవబాలరసాలము సొంపు నింపదే.

ఆధునికుఁడే యయినను గవి యేకాలమునం దుండినవాఁడో సరిగా తెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈతనికవిత్వము సరసమయినది. శైలిని జూపుటకయి శ్రీపర్వతపురాణమునుండి రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. శ్రీనగకంధరంబున వసించి చరించుపుళిందబృందముల్
భూనుతభోగమోక్షములఁ బొందఁగఁజూచి నిలింపసంఘముల్
శ్రీసలయూభిరామ మగుశ్రీగిరిమీఁదఁ జరింతు రిట్లు యు
మ్మాసతనాకసౌఖ్యమహిమంబుల నెల్లఁ దృణీకరింపుచున్. ఆ. 3.

శా. పాటింపందగు ముజ్జగంబులఁ బుగప్రత్యర్థిజూటాటవీ
కోటీకోటర పావనామరధునీఘూర్ణోత్తరంగావళీ
వ్యాటీకాయతవేణికానికరసవ్యాప్త్యాభోయచ్ఛటా
చాటుత్వంబు వహించుశ్రీనగముపైఁ జంచజ్జలశ్రేణికల్. ఆ ౯.

---

75. వీణెము లక్ష్మీపతి

ఇతఁడభిమన్యు పరిణయము నెడి యొదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజాతుఁడు. వీణెము కృష్ణరాజునకును రంగమాంబకును జనియించినవాఁడు. ఇతఁ డభిమన్యుపరిణయములోఁ దన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనుచున్నాఁడు.

ఉ. మాగధవంశసంభవుఁడ మానితవీణెకులావతంసుఁడన్
భోగబిడౌజుఁ డార్యజనపూజిత వేంకటకృష్ణరాజుకున్
బాగుగ రంగమాంబకును నౌరసపుత్రుఁడ లక్ష్మణాఖ్యుఁడన్
శ్రీగలుగఁ రచించెదను నే నభిమన్యుచరిత్ర వేడుకన్.

ఇతఁ డెప్పు డెక్కడనున్నవాఁడో తెలియరాలేదు. దాదాపుగా నితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండును. ఈతనికవిత్వ మంత మంచిదికాదు. అందు ఛందోవ్యాకరణదోషము లనేకములు కానఁబడుచున్నవి. అభిమన్యుపరిణయములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. పన్నినవీరయోధులను బాహుబలంబున నుగ్గుసేయు సం
పన్నుఁడ వార్యసత్వుఁడవు పాండవపౌత్రుఁడ వై ననిన్ననున్
జిన్నెల పువ్వులు న్నరులుఁ జెన్నుగఁ గూర్పను నేరనట్టియీ
కన్నియ లెట్లు నీమనసు కాంక్ష కరంగఁగఁ జేయువారలో. ఆ. ౧.

ఉ. నారదమౌనిమాట మది నమ్మితి నేఁడది కానిచందమై
దూరము నాట కానఁబడెఁ దూర్యరవాపులఁ జుట్టపక్కముల్
వారును వీ రెదుర్కొనుచు వచ్చుటకియ్యది వేళ పోవుచు
న్నారిక విఘ్నము ల్గలవె నన్నిట దైవము మోసపుచ్చునే. ఆ. ౨.

76. వేమనారాధ్యుల సంగమేశ్వరారాధ్యుఁడు

శైవుఁడయిన యీకవి యహల్యాసంక్రందనవిలాసము నెడి యైదా శ్వాసముల ప్రబంధమును రచియించెను. ఒక యెత్తుగీతములో

గీ. అట్టిసాహసవిక్రమార్కాంకుఁడైన
వాసిరెడ్డివేంకటాద్రినాయని సోదరపుత్రుఁడు. ఈకవి కవిత్వము ప్రౌఢ
మయినదికాని యిందు వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు
కానఁబడుచున్నవి. ఈగ్రంథము నూఱుసంవత్సరములక్రిందట రచియింపఁ
బడినది. అహల్యాసంక్రందనవిలాసమునుండి రెండుపద్యముల నిం చుదా
హరించుచున్నాను—

మ. పరకాంతారతిదోష మంచు మది సంభావింపఁడో యన్యు లె
వ్వరు గన్నం దను నిందసేతు రనుభావం బెంతయుం బూనఁడో
నరుఁ డొక్కింత యెఱింగినేని సిలుగు ల్వాటిల్లునం చెన్నఁడో
పరమామోదమెకాని యింద్రునకుఁ బాపభ్రాంతి లే దేమియున్ ఆ.3

చ. సరిసరి! నిన్నువంటి నెఱజాణలు పుట్టరె? వార లెల్ల నీ
కరణిఁ దలంతురే? చిఱుతకార్యము లిచ్చటఁ జెల్లునే? యయో
పరమపతివ్రతైనముని భామినితో నెకసక్కె మేమి? నీ
గరిమఁను గానవచ్చె నిది కాదనరో వినరో బుధాగ్రణుల్. ఆ. ౫.

---

77. ములపాక బుచ్చన్నశాస్త్రి

ఈకవి వేంకటేశ్వరమాహాత్మ్యమును పద్యకావ్యమును రచియిం యించెను. ఇతఁడు కోనసీమ ద్రావిడబ్రాహ్మణుఁడు. ఈబ్రాహ్మణులనే యూరాద్రావిడు లనియు, పేరూరి యఱవ లనియు, వాడుదురు. వీరు మొట్టమొదట నఱవవారే యయినను జిరకాలము క్రిందటనే యీయాంధ్రదేశమునకు వచ్చి తోఁట దొడ్లను సంపాదించి యిచ్చటనే నిలిచిపో యినవారగుటచే నఱవభాషను మఱచిపోయి యించుమించుగాఁ దెనుఁగు భాషనే స్వభాషనుగాఁ జేసికొనియున్నారు. వీరు తెనుఁగున గ్రంథరచన చేయుటయే యీవిషయమును దెలుపుచున్నది. ఈకవి కోదండరాముని పుత్రుఁడు; భార్గవ గోత్రుఁడు; గుఁడ్లూరియం దుండినవాఁడు. ఇతఁడు తనపూర్వులను గూర్చియు, తన్నుఁగూర్చియు, వేంకటేశ్వరమాహాత్మ్య మునం దిట్లు చెప్పియున్నాఁడు—

సీ. అనుపమకోనసీమాభిదాన ద్రావిడాన్వయంబునను విఖ్యాతిమీఱి
ములపాకవా రనుముఖ్యాన్వవాయులు కాశ్యప భార్గవ కౌశి కాత్రి
గోత్రజు ల్గల రందు గురుతర భార్గవగోత్ర సంజాతుఁడై కొమరుమీఱె
వేంకటపతి వాని కుంకువమీఱి వెంగాంబికయందు సుబ్బాభిధాన
విబుధవరుఁ డుద్భవించె నవ్వివిమలమతికి
బుచ్చమాంబికయందు సంపూర్ణచంద్ర
మండలమురీతి సత్కళామండనుండు
రహి జనించెను గోదండరామవిభుఁడు.

* * * *

ట్టవంశోద్భవక్ష్మాపాలపాలిత గుండ్లూరిపురి నుండు గురుయశుండ
ద్రగీర్వాణభాషాష్టభాషాకవిత్వాభి నిర్మాణమహత్వవిదుఁడ,

గాశికావిశ్వేశకరుణాకటాక్షాభి భాషితబహుళప్రబంధచయుఁడ
హితనాటకాంతసాహిత్యనిత్యాభ్య స్తసకలపురాణార్థసారవిదుఁడ
సాంద్రములపాక విద్వత్క-వీంద్రవంశే
వార్ధిచంద్రుండ సర్వసర్వంసహాభి
విశ్రుత కుకవికులగోత్రవిపులపక్ష
శాతపవియైన బుచ్చనశాస్త్రికవిని.

ఇతనికాలము తెలియదు. ఇతఁడు నూఱునంవత్సరముల పయి వాఁడయియుండును. వేంకటేశ్వరమాహాత్మ్యమునుండి మఱి రెండుపద్యములు నిం దుదాహరించుచున్నాను—

ఉ. సంగతివిూఱి విూచరణసారస మందు జనించినట్టి యీ
గంగకు దక్షిణంబున నగాధతరం బగుదక్షిణాబ్ధికిఁ
రంగగు నుత్తరంపుదెస రాజిలుపూర్వసముద్రపశ్చిమా
శం గన నొక్క తా వమరు సారతరోన్నతదండకాటవిన్. ఆ. ౧.

చ. గిరిజయు నీవు నెల్లపుడుఁ గిన్నర పన్నగ సిద్ధ సాధ్య భూ
సుర నరసంఘము ల్గొలువ సొంపు దలిర్పఁగ జేరి యీసరో
వరతటసీమనుండుఁ డభివర్ణన కెక్క భవత్సమాఖ్య ని
ర్ఝరియు సరోవరంబు ననఁ గేవలమోదముతో హరుం డనుక ఆ.౧

78. పాలవేకరి కదిరీపతి

ఈకవి శుకసప్తతియను కావ్యమును రచియించెను. ఈతని కవిత్వము హృద్యముగానే యున్నది కాని పుస్తకమంతయు దొరకలేదు. దొరకిన రెండాశ్వాసములనుబట్టి చూడఁగా నితఁడు ప్రౌఢకవి యగుటకు సందేహ మగపడదు. "ఇది శ్రీమత్కదిరీ నృసింహ కరుణాకటాక్ష వీక్షణ సమాగత కవితాధార పాలవేకరికుల కలశాంభోనిధి సుధాకర తాడి గోళ్ళ కరియమాణిక్య నృపహార్యక్షపౌత్ర పవిత్రచరిత్ర కదిరిధరా మండ లాఖండ పుత్ర విద్వత్కవిరక్షానుసంధాయక కదిరీపతినాయక ప్రణీతం బైన" ఇత్యాది గద్యమునుబట్టి చూడఁగా కవి నాయకకుంజుఁడయి నట్టును, కరియమాణిక్యనృపపౌత్రుఁ డయినట్టును కదిరిరాజపుత్రుఁ డయి నట్టును దెలియవచ్చుచున్నది. కవి నెల్లూరిమండలములోనివాఁడు. ఇతఁడు తనగ్రంథమును శ్రీరామాంకితము చేసెను. ఈతనికాల మేదో తెలియరాలేదు గాని యితఁ డాధునికుఁ డగుటకు సందేహములేదు. శుకసప్తతినుండి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలజయకేతనుండు రుచిరాంగతిరస్కృతమీనకేతనుం
డెలమి మదిం దలిర్ప దయ నేలికయుం దలిదండ్రు లయ్యెడ్ల
దలఁచినకార్యభాగ ముచితజ్ఞులచే విని నీతికార్యవ
ర్తు లగునియోగపుంగవులతోడ రహస్య మొనర్చి యిట్లనున్. ఆ-ఁ

మ. అక్కట దోసతోఁట యిదియైనఁ దదీయఫలంబు లమ్మి యా
డొక్కయు సాకఁ గోరితిఁ గడు న్నడుచేయిని వచ్చి యెవ్వరో
మక్కువలేక నాకడుపుమంటయుఁ బుచ్చుకొనంగఁ బూని యీ
చక్కెరవగటిపండ్లు తినసాగిరటంచుఁ గృశించు నెంతయున్.

సీ. మ
నాం

79. మాధవమంత్రి

ఇతఁడు భగవద్గీతలను నాలుగాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గోదావరీమండలములోని నియోగిబ్రాహ్మణుఁడు. గిరిమనమంత్రి పుత్రుఁడు; కిడాంబి వేంకటాచార్యుల శిష్యుఁడు. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగము లనేకములు గానఁబడు చున్నవి. అయిన నితఁడు తనగ్రంథమునందు దత్తోజీ పండితవిరచిత మయిన భగవద్గీతలలోకంటె వృత్తముల నధికముగా వేసియున్నాఁడు. ఇతఁడు తనకృతిని భద్రాద్రిరాముని కంకితము చేసెను. ఈతని పుస్తకము నుండి రెండుమూడు పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

మ. ధరఁ బాలియ్యక లోభకాంక్షయుతుఁడై ధాత్రీశుల న్మిత్రులన్
గురురా జీక్షితఁ జంపఁగాఁ దలఁచి తాఁ గ్రూరాత్ముఁడై యున్నచోఁ
బొరిగొన్నన్ దురితంబు చెంతు విను మీపొత్తుల్ల నాకేల య
స్థిర మీకాయము దీనికై కులజులం ద్రెళ్ళింపఁగాఁ బాడియే? ఆ. ౧

శా. విద్వన్మ్మఖ్యుఁడు కర్మపుంజములు తా విధ్యుక్త మార్గంబుచే
మదాక్యంబులరీతి సల్పుచును నాత్మం గాంచి యవ్వేళలన్
హృదాసంబున మోహ ముప్పతిల వర్తించు న్మమత్వాది రా
గద్వేషంబులు లేక యోగి సమతన్ గంభీరుఁడై ఫల్గునా. ఆ. ౨.

చ. పరులు నుతింపఁ జాలు ననిపల్మఱుఁ జిత్తములం దలంచి సు
స్థిర మగుబుద్ధి లేక ఫలసిద్ధిని గాంతు యొనర్చి దంభులై
యిరవగునట్టిజ్ఞానమున కెంతొవిరోధము చేయునట్టి యా
నరు లొనరించు యజ్ఞము ఘనంబుగ రాజసయజ్ఞ మర్జునా. ఆ. ౩.

---

80. గోపాలుని సింగయ్య

ఈకవి భారవికృతమైన కిరాతార్జునీయ మను సంస్కృతకావ్య మును నయిదాశ్వాసముల గ్రంథముగాఁ దెనిఁగించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; మౌద్గల్యగోత్రుఁడు; భాస్కరామాత్యపౌత్రుఁడు; నీర నమంత్రి పుత్రుఁడు. ఈకవి కర్నూలు మండలములోనివాఁడు. ఇతడు తనగ్రంథమును శ్రీమదహోబల లక్ష్మీనృసింహస్వామి కంకితము చేసెను. ఈకవిపుత్రుఁ డెనుబదిసంవత్సరములక్రిందట జీవించియుండెను. కాఁబట్టి కవి నూఱుసంవత్సరములక్రిందటివాఁడు. ఈతని కవిత్వము రసవంతమయి సలక్షణ మయినదిగా నున్నది. కిరాతార్జునీయకావ్యములోని కొన్నిపద్య ముల నిందుఁ బొందుపఱుచుచున్నాను—

చ. కొలిచినభృత్యకోటి ననుకూలత నొప్పెడు మిత్రులట్లు మి
త్రుల మఱి బంధువర్గములతో సరిగాఁ గను బంధుజాలమున్
వెలయఁ గృతాధిపత్యమున విశ్రుతమాతనుఁబోలె నాదరం
బలరఁగఁ దన్మయుం డగుచు నారయులెన్నగసంతతంబునున్. ఆ.౧.

ఉ. భానుకరప్రసారపరభాగతలస్ఫురదింద్రనీలసం
తానవిరాజమానరజతస్ఫటికాంచితకుడ్యదీధితుల్
మానుగ నెంచిచూడ దినమధ్యమునందును గామదీభ్రమన్
భూనుత మాటిమాటికిని బుట్టఁగఁజేసెడుఁ జూడు మిగ్గిరిన్. ఆ. ౨.

ఉ. కొప్పులు వీడఁగా నడిచి గొజ్జఁగిచండలు జాఱఁగొట్టియున్
గప్పురగంధము ల్చెదరఁగా వెసఁ దాఁకియుఁ బెక్కునేరముల్
తప్పక యిగ్గతి న్నలిపి తత్సతు లందలిభీతిచేబలెఁ
దెప్పర మైనకంపమునఁ దేలుచునుండెను వీచు లత్తఱిన్. ఆ. 3.

మ. అటులై న న్మతియేమియన్న వినుమీ యారాజు నీప్రాణసం
కట మావేళను వచ్చిసూకరముఁ దా ఖండించి రక్షించె ని

న్నటుగానం బరమాప్తుఁ డంచు మదిలో హర్షించి వైరింప కొ
క్కటియైయుండు కృతజ్ఞతానిలయు లౌఁగా ధర న్సజ్జనుల్. ఆ. ర
మ. జయవాంఛ ల్విడనాడుచుం బఱచునాసై న్యంబులం జూచినన్
దయపుట్టై న్మదిలోన నర్జునునకుం దర్కింప నట్లేకదా
భయులై చిక్కనినీచశత్రుల దయం బాటించి రక్షించినన్
నయముం గీర్తి మహత్మ్యలౌనరుల కెన్నంగావె యుద్ధంబుల్. ఆ-౪

---

81. గూళికల్లు వేంకటరమణకవి

ఇతఁడు కనకరంజితశిఖామణిపరిణయమను విక్రమార్కునిగూర్చిన యాఖ్యానశ్వాసములపద్యకావ్యమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; వేంకటమాత్యునకును రంగమాంబకును కుమారుఁడు. ఇతఁడు హరివంశమునుగూడఁ దెనిఁగించినట్లు కవినిగూర్చి వేంకటేశ్వరుఁడనినట్లున్న కనకరంజితశిఖామణీపరిణయములోని యీ క్రిందిపద్యము వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. నీయిష్టదైవంబ నినుఁబ్రోచుచుండెడు శ్రీవేంకటేశుండ నీ వెఱుంగు
మోవత్స యిపుడు నీభావంబు తెలిసివచ్చితి గూళికల్వంశశేఖరుండవు
వేంకటామాత్యుఁడై వెలయుమంత్రికిజిక్క లేటివంశజయూావధూటిరంగ
మాంబకుజనియించిమాపేరుగొన్న వేంకటరమణుఁడవుస్తవివి మాకు
మునుపు హరివంశ మంతయుఁ దెనుఁగు చేసి
యంకిత మొనర్చితివి విక్రమార్కచరిత
మిఁక బ్రబంధ మొనర్చి మాకిమ్ము సిరులు
శుభము లొసఁగెదనని పల్క సుముఖుఁ డగుచు.

ఈ వేంకటరమణకవి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు ఈతని కవిత్వము రసవంత మయినదే. కనకరంజితశిఖామణీపరిణయము లోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. అంత నితాంతమామకతపోగ్ని దహింపఁ బురంబుత్రో మహీ
కాంతుఁడు మిత్రబాంధవసకాయముత్రోఁ బరిదగ్ధఁ డైన ని
క్లాంతయు ఘోరకాననము వృద్ధి వహించె మదీయజీవముల్
చింతిలి మస్తకాంతరముఁ జెందుట నేదరి గానకుండెదన్. ఆ-౧.

చ. తెలిపినవారు రంజిలుచు దేవర దేవరకు న్వరంబు ని
ర్మలమతి నిచ్చోఁ గావునఁ గుమారుని మారునివంటివాని న
ర్మిలి గలవాని సర్వజనమిత్రుని మిత్రునిమాఱి సత్పథా
పలసితుఁ గాంచి యొప్పము శుభంబుల భంబులఁ జేనిచాఁపునన్. ఆ-౫

---

82. కృష్ణకవి

ఇతఁడు శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మును రచించెను. ఈకవి మైత్రేయసగోత్రుఁడు; నారసింహార్యునిపుత్రుఁడు కవి తన యింటిపే రేదో తా నేతెగ బ్రాహ్మణుఁడో చెప్పుకోలేదుగాని శకుంతలాపరిణయ ప్రథమాశ్వాసములోని యీ క్రింది పద్యములనుబట్టి చూడఁగ నితఁడు వైష్ణవుఁ డైనట్లూహింపఁదగి యున్నది—

మ. నను రామానుజపాదపద్మయుగళీనన్యావ్యయధ్యానపా
వనహృద్భాగవతావతంసపదసేవాసక్తచిత్తున్ మరు
త్తనయారాధనచారులబ్ధ కవితాధారున్ సదారూఢభా
వన నాస్థానకవిన్ నిజాశ్రితునిఁ బిల్వంబంచి పల్కెం గృష్ణ.

క. పాత్రుఁడవై మైత్రేయస | గోత్రుఁడవై నారసింహగురువర్యునకున్
బుత్రుఁడవై వెలయుదు వీ | ధాత్రిన్ మాపనుపు సేయుదగుఁ గృష్ణకవీ.

ఈ గ్రంథము చిఱుమామిళ్ళ పాపయ్య యను కమ్మనాయని ప్రేరణమువలన రచియింపఁబడినది. కవి నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈ గ్రంథము పిల్లవసుచరిత్ర మని దాక్షిణాత్యులు కొంద అనుచున్నారుగాని యీ ప్రాంతములయందు దీని కట్టిప్రసిద్ధి లేదు. అబ్బనామాత్య విరచితమైన కవిరాజమనోరంజమును, సూరకవి ప్రణీతమైన కవిజనరంజనమును, పిల్లవసుచరిత్రమని యిచ్చటివారు చెప్పుదురు. ఈ గ్రంథకవిత్వము శ్లాఘ్యమైనదే యైనను, పిల్లవసుచరిత్రమని చెప్పఁదగినంత శ్రేష్ఠముగా లేదు. ఈకవి యనేక పద్యములను వసుచరిత్రాది ప్రబంధములనుజూచి వానిలోని పద్యములవలె రచియించి యున్నాఁడు. ఇందుకు నిదర్శనముగా వసుచరిత్రములోని పద్యము నొకదానిని శకుంతలాపరిణయములోని పద్యము నొకదానిని చూపుచున్నాను—

ఉ. కొండఁట విల్లు వేదలలకుండలిరాజఁట నారి యమ్మనం
తుండటఁ బై టిషల్లియలఁ దున్మినవాఁడఁట యొండురెండు భ
ర్గుం డిది నింపుపౌరుషమొకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంటవిలు దాలిచి యంటినఁ గంపుతూపులన్. వసుచ

ఉ. తుంటఁట కార్ముకంబు కరదొట్టిన తేంట్లఁట వింటినారి చే
నంటినవాడుతూపు లఁట యవ్వలపాలఁట కేతనంబు వా
గంటిపులుంగు గుజ్జుమఁట కాయము లేదఁట నీకు నోకముల్
కొంచెతనంబున న్నెలిచికో లిది యచ్చెరియంబు మన్మథా. శకుంత.

ఇందప్రశస్తంబులగుప్రయోగంబులును గొన్నికానఁబడుచున్నవి.

క. ఆక్షేటమునకు ధాత్రీ। లేఖ్నభుఁ డనుమతింప లేలెం డనుచున్
శ్లాఘించుచుఁ బడవాళుల। లాఘవమునఁ బనిచి రగ్గలంబుగ వారల్.

ఇందు శ్లాఘించు 'లాఘవము' అను పదము లపప్రయోగములైనను గావలెను, ఖషుల కొండొంటికిఁ గూర్చిన యప్రశస్తప్రాసము లైనను గావలెను. ఈ పుస్తకములోని మంచిభాగము లనేకములు కాళిదాసుని

యభిజ్ఞానశాకుంతల నాటకమునుండి తెనిఁగింపఁబడినవి. అభిజ్ఞాన శాకుంతలములోని మనోహరములైన నాలుగు శ్లోకములలో రెంటిని గవి యీ క్రిదిరీతిని దెనిఁగించియున్నాఁడు—

చ. కనుఁగవ బాష్పపూరములు గ్రమ్మెడు గద్గదఖిన్నమై యెలుం
గనువున రామసూ హృదయ మాకులమయ్యెడు మేను ప్రమ్మెడుం
దెనిచినవాని కింతవగఁ బిమ్మటిఁ గ్రమ్మెడుఁ గన్నవారలుం
దనయను బంపలేక పరితాపభరంబున నెట్లు సైతురో.

మ. గురు శుశ్రూషలుసేయుమీ సవతులన్గూర్మి న్విలోకింపుమీ
పరివారమ్ములఁ బ్రోవుమీ సిరుల గర్వస్ఫూర్తిఁ గైకోకుమీ
పురుషుం డూఅకుమీ సతుల్ నశచు నేర్పు ల్నీకు సూచించితిన్
దరుణీ లోకమత్తల్లి చేకొనవె మాతల్లీ మదీయోక్తులన్.

ఇట్లున్నను మొత్తముమీఁదఁ గవిత్వము ప్రౌఢమనియే చెప్పవచ్చును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శకుంతలా పరిణయములోని రెండుపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. మోద మొనర్చెఁ బుప్పొడుల ప్రుగ్గులపై నొఱపైన ముగ్గులన్
దీదఁగి పూలతెక్కెములఁ గెందలిరాకుల తోరణంబులన్
బ్రోది వహించు పక్వఫలపుంజములన్ శుకకోకిలాళి స
న్నాదములన్ నికుంజభవనంబుల నీలనృపాలసూతికిన్. ఆ-౧.

శా. పారుష్యంబులు పల్క నేల నృపతీ పన్నీరకర్పూర
పూరస్ఫారపటీరసారభపయఃపూరంబె జంద్రాతపం
బారామానిలసేవనంబు మును మీ రశ్రాంతముం గాంతుకా
హేరాళంబుగఁ బుత్రగాత్రమిళనం బెట్లుండునో చూడుఁడీ. ఆ. 3.

———

83. వల్లూరి నరసింహకవి

ఇతఁడు నాగ్నచిత్తీపరిణయమనుమూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాపస్తంబసూత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు; హనుమత్కవిపుత్రుఁడు; ఆఱువేల నియోగికులపవిత్రుఁడు; నూఱుసంవత్సరములక్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వము రసికజన హృదయాహ్లాదకరముగా నున్నది. కవితాపటిమ తెలియుటకై నాగ్నచిత్తీపరిణయములోని మూడుపద్యములనెత్తి చూపుచున్నాను—

చ. తనయునిముద్దుపల్కఁ జెవిఁ దారొక్కన సంతసమందుచున్నత
జ్జనకునిరీతి మామకవచఃప్రకరంబు వినంగఁగోరి మీ
రెనసినవేడ్కఁ నిట్లు సెల విచ్చుట నాయెడఁగూర్మిఁగాదె మీ
పనుపున విన్నవించెదను బద్మదళాక్షశుభప్రసంగముల్. ఆ. ౧.

ఉ. వందుర నేల యిట్లు మగువా తగనా నగువాన జూడ కీ
యందఱిలోనఁ జెప్పవుగదా పగదాయగదా యటంచు నీ
గందు రటంచు నిట్ల యడుగఁ నుడుగం దొడఁగందలంచి నీ
కంపున లింక మారు కొఱగాదఱిగా లెఱిగాను నిచ్చలీ. ఆ. ౨.

ఉ. కోసలుఁ డాత్మ నే నృపులకున్ వృషభంబులఁ బట్టరాఁకికిఁ
గాసిలి వీనిఁ బట్టుకొని కట్టినవానికిఁ గన్య నిత్తు నే
బాస యొనర్చినాఁడ ననిపల్కితి నింకిటఁ దప్పి తేని నీ
దోసము వచ్చు నీకొమరెతో జతగూర్పఁగ నెవ్వఁ డబ్బునో. ఆ.3.

---

84. గొంతేటి సూరన్న

ఇతఁడు కృష్ణాభ్యుదయ మనెడి మైదాశ్వాసములపద్యకావ్యమును రచించెను. ఈకవి తన్ను గూర్చి కృతిపతి యైనబొల్లాప్రెగడ కామమంత్రి పలికినట్లుగా గ్రంథాదియం దీపద్యమును వ్రాసికొనియున్నాఁడు—

మ. ననుఁ గొంతేటిలసత్కులజు జెలిమియానన్ దాను వీక్షించిసూ
రన నీ వక్కజ మైనసత్కవివి యార్యశ్రేణి లగ్గింప భ
క్తిని గృష్ణాభ్యుదయప్రబంధము జగద్ధేయప్రమేయంబుగా
నొనరం జెప్పుము మెప్పులుప్పతిల సద్యోగానురాగంబునన్.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; కామయా మాత్యపౌత్రుఁడు; కాశిరాజపుత్రుఁడు. ఈతనికవిత్వ మంతశ్రేష్ఠ మయి నదని చెప్పఁదగినదికాదు. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందట నుండిన వాఁడు. కృష్ణాభ్యుదయములోని రెండుపద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి—

ఉ. దేవకిగర్భగోళమున దేవశరణ్యుఁ డగణ్యపుణ్యసం
భావితభద్రమూర్తి యగుపంకజనాభుఁడు భవ్యలాభుఁడై
శ్రీవెలయం బ్రవిష్టత వసించె జగజ్జనకక్షణక్షమా
భావభవాబ్జభూప్రభవభావుకుఁ డయ్యును ధీవికాసతన్. ఆ. ౩.

చ. పదముల వ్రాలి బాలకునిపై దయసేయుము తప్పు చేసితిన్
సదమలచిత్స్వరూప యదుసత్తమ యుత్తమమైననీకథా
భ్యుదయము గోరి నీదు పదపుష్కరము ల్గనవచ్చినాఁడ నా
కొదవలు దీర్ప దేవతలకున్ సిరిగూర్పఁ దనర్పనీవెకా. ఆ. ౪.

---

85. బేతవూడి కృష్ణయ్య

ఈకవి జానకీరాఘవ మను నయిదాశ్వాసములప్రబంధమును రచి
యించి దానిని కమ్మప్రభు వయిన యడపానారప్ప కంకితము చేసెను.
ఈపు స్తకమునుగాక కవి యలమేలుమంగావివాహము, పండితమనోభిరా
మము, అనుగ్రంథములను రచించిన ట్లవతారికలోని యీక్రిందిపద్యము
వలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. మతి శ్రీమదలమేలుమంగావివాహంబు
శ్రీజగన్నాయకార్పితము చేసె
రహిఁ బండితమనోభిరామశృంగారకా
వ్యము ధవళాద్రిరాయనికి నోసఁగెఁ
బహుకల్పనానల్పబంధురోక్తులతోడ
రచియించె జానకీరాఘవంబుఁ
బ్రాకటప్రాసాదపంచాక్షరీమంత్ర
జపపరాధీనరసజ్ఞుఁ డితఁడు
హరికథలెకావ్యములుచేసెనాంధ్రభాష
యందుమద్భక్తుఁడితనిచెనొనందుకావ్య
రత్న మైనట్టిజానకీరాఘవంబు
శ్రీకరం బగు నారధాత్రీతలేంద్ర

ఈకవి శ్రీవత్సగోత్రుఁ డైన యి ఱువేలనియోగి. ఈతనికవి
త్వము సరసముగానే యున్నది. ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁ
డయియుండును. జానకీరాఘవమునుండి రెండుపద్యము లిం దుదాహృ
తము లగుచున్నవి—

చ. పృథులకుచప్రకారములు బింబఫలాధరసద్రుచుల్ సుధా
మధురపికానులాపములు మత్తమయూరవిహారముల్ శుభ
గ్రథనవినీలవద్భ్రమరకంబులు కప్రపుఁజెక్కులున్ వనీ
మథుకరవేణికల్దనరు మాధవుఁ డందనురాగమూనఁగన్. ఆ. ర.

శా. ఆకోదండము రామభద్రుడు సముద్యల్లీల నీక్షించి తాఁ
గైకోఁ జూచి ప్రదక్షిణంబుగ భుజాగర్వంబుతో వచ్చి పూ
జాకల్పంబుగ దానిఁ బుచ్చుకొని నిస్సారంబుగా నంతఁ దా
నాకర్ణాంతముగాఁగఁ దీసి విటిచెన్ హారిప్రభావంబునన్. ఆ. ౪.

---

86. బనవరాజు నాగేంద్రకవి

ఇతఁ డానందసుందరీచాతుర్యవిలాస మను మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈకవి యాఱువేలనియోగి; పాపనామాత్యుని కుమారుఁడు. ఇతఁడు సుమారు నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఆనందసుందరీచాతుర్యవిలాసమునుండి రెండుమూడు పద్యములను గవి కవిత్వకౌశలమును జూపుటకయి యిందుఁ బొందుపఱు చుచున్నాను:—

ఉ. క్ష్మోణిప యాతఁ డక్కు—ధరకూటశిఖాంతరమందుఁ గాంచె న
క్షీణజలోచ్చలన్మదజశీకరబంధురసింధురార్భక
శ్రేణిని హంసకోకబకచిత్రితరమ్యవిశాలసై కత
శ్రేణిని దీర్ఘవేణిని బశుప్రభురాణిని గృష్ణవేణినిన్. ఆ. ౨.

ఉ. భూనుతయాతఁ డక్క—మలపూరములోఁ బలఁ గాంచె నుల్లస
ద్భానుసహస్రరమ్యమణిభాసితభోగపభూషు నాననో
న్మానితకైటభారిగుణమంజురసౌఖసిర స్తదోషు నం
భోనిధికాననాకలితభూధరబాహువిశేషు శేషునిన్. ఆ. ౨.

ఉ. దైన్యముటక్కు— చాపశరదారుణఖడ్గము లూనపట్టి య
న్యోన్యవధాశచేఁ బెనఁగునప్పుడు చూడు మురారిశక్తిన
త్యున్నతిఁ దద్బలంబు నధికోజ్జ్వలయోధులు పిచ్చలింపఁగా
జన్యమునందుఁ గూల్చెదను జక్రిని శుక్రుఁడు తల్లడిల్లఁగన్. ఆ 3.

---

87. మాచవరపు పాపనామాత్యుఁడు

ఇతఁడు నందవరీకచరిత్రమును రెండాశ్వాసముల గ్రంథమును రచియించెను. ఈ నందవరీకులచరిత్ర మీపటి కే యింను వ్రాయఁబడినది. కవి నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేంకటాచల మంత్రిపుత్రుఁడు. ఇతఁడు తన వాసస్థలాదులనుగూర్చి యిట్టు చెప్పుకొనియున్నాఁడు—

సీ. శ్రీమించు వినుకొండసీమలో నల్ల య
నంతవరం బనునగర మొకటి
కొమకొప్పు బెల్లముకొండ దేశంబున
మానితంబై యొప్పు మాచవరము
గ్రామద్వయంబునఁ గాణాచి యేక భో
గముమీఱ వెలసిన ఘనయశుండు
పెద్దనామాత్యుండు ప్రియురాలు జ్ఞానాంబ
వారికి జనియించె వరసుతుండు
పాపనాహ్వాయుఁ డనఁ బ్రఖ్యాతుఁడై యొప్ప
నాతనిభార్య శ్రీయచ్చమాంబ
వారికి ముగురుపుట్టిరి వరుస సుతులు
ముదముతోడుత వసుధఁ ద్రిమూర్తు లనఁగ
నగ్రజుఁడు వేంకటాచలం బనెడుపేరఁ
బ్రణుతి కెక్కెను విభవసౌభాగ్యగరిమ.

క. ఆతనిదేవి పతివ్రత । సీత నరుంధతినిబోలి సృష్టిని వెలసెన్
జేతోమోదంబున సం । ప్రీతిని శ్రీకొండమాంబ ప్రియము జనింపన్.

ఉ. శ్రీపరమేశుసత్కరుణ శ్రీవిలసిల్లఁగ వారికిన్ సము
ద్దీపతచారుమూర్తు లతిధీయుతు లిద్దఱుపుత్రు లందులోఁ

బాహన నగ్రజుండ నయి భాసిలి సత్యము డేనభ క్తియున్
బ్రాపుగనమ్మి సద్గురుపపాదములే గతియంచు నున్నెడన్.

నందవరము లిప్పు డనేకములు కానఁబడుచున్నవి. పూర్వకాల
మునందు నందుఁ డేలినట్టియు నందవరీకుల కియ్యఁబడినట్టియు నందవరము
కర్నాలుమండలములోనిదయినట్లు కవి యీ క్రింది పద్యమున వర్ణించి
యున్నాఁడు—

సీ. అందమై విలసిల్లుఁ గందనో ల్నీమలో నందవరం బనునగర మొకటి
తత్పట్టణంబు సౌందర్యంబుఁ గొనిమూడఁ జిత్ర మెవ్వారికి విచిత్రమరయ
సుందరంబగుచు సంక్రందనపురిఁబోలి యిందిరాదేవికి మందిరముగఁ
గడురమ్యమై చాలఁ గర మొప్పుచుండును గూఘతటాకములోఁ—

మరుమిగులఁ
బంకజాకరవిలసిత పద్మసికర । మధుర మకరందరసపానమత్తమధుప
నరసఝుంకృతసంగీత సంకులంబునగుచురంజిల్లు మిక్కిలియవనియందు

పయిపద్యములోని యనావశ్యకములయిన పదములప్రయోగము
నుబట్టియే యీ కవిత్వ మంత మంచిదికాదని చదువరు లెఱుఁగవచ్చు.
ఇతఁడు నూఱు నూటయేఁబది సంవత్సరముల క్రిందటివాఁడేమో! నంద
వరీకచరిత్రము రెండాశ్వాసములనుండియు రెండేసిపద్యము లిం దుదాహ
రింపఁబడుచున్నవి—

మ. దివసం బెల్లను రాజ్యభారముఁ దగం దీర్చుక్ మరిక్ రాత్రులం
దవలీలం జని జాహ్నవీసలిలమం దాహూఢిగా స్నానముక్
సవిశేషంబుగఁ జేయుచుక్ నిరత మీచందంబునక్ రాజపుం
గవుఁ డంహోరహితప్రభావతనుఁడై గాంభీర్య మింపొందఁగన్. ఆ-౧

ఉ. ఒక్క మహానుభావుఁ డిటువచ్చి దయారస ముప్పతిల్ల నల్
దిక్కుల దివ్యతేజములు దీటుకొనం గడు సత్ప్రభావుఁడై

మక్కువ యోగవాగ మనుమంత్రము నా కుపదేశ మిచ్చి తాఁ
జక్కఁగ నిచ్చి పాదుకల సంభ్రమ మొప్పఁగ నేగె నంతటన్. ఆ-౧

ఉ. నందవరంబు మాకును ఘనంబుగ నచ్చట ధారపోసె ద
త్సుందరిఁ దాను గూడుకొని శుభ్రతరం బగుజాహ్నవీజలం
బందుఁల గాన వచ్చితిమి యాతనితోడుతఁ దెల్పి వేగ మా
కుం దగఁ జెప్పుమన్న ననుకూలత నచ్చెరియంబు తోఁపఁగన్. ఆ-౨.

ఉ. భూసురకోటి వచ్చుటకు భూపతి యాత్మఁ గలంగి దానముం
జేసితి మున్ను వీరల కజేయులు గావునఁ దప్పినన్ విప
ర్యాసముఁ బ్రత్యవాయమును రాఁగల దిచ్చిన విత్తహీనమా
మోసము వచ్చెనెట్లనుచు మో మొకయించుక వంచెనంతతోన్. ఆ-౩.

---

88. కృష్ణదాసకవి

ఇతఁడు రాధాకృష్ణవిలాస మనుపేర జయదేవ విరచితమైన గీత గోవిందమును మూడాశ్వాసముల కావ్యమునుగా రచియించెను. ఈతని తండ్రి వేంకటదాసుఁడు. ఈతఁడు శూద్రకులజుఁడని తోఁచుచున్నది. అయిసను కవిత్వము హృద్యముగానే యున్నది. రాధాకృష్ణవిలాసము లోని మూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అలఘుభుజాబలంబులు నొయారము లయ్యసమానసాహసం
బులు నెర వైనసాదనలు పోటరిపంతము లేకవీరతల్
చలమరితెంపులున్ జవవిలంఘనముల్ విలసన్నియుద్ధతుల్
కలిగినకాల్బలంబు కటకంబున డంబున నొప్పు నెప్పుడున్. ఆ-౧.

ఉ. కూరిమిచేయు దిక్పతులకోరిక లీరికి లెత్త రావణో
ధారశిరంబులం దునిమి దద్దిశలన్ బలిపెట్టి సర్వభూ

భార మడంచి మానిజనభావనల న్విహరించినట్టి దు
ర్వారబలాభిరామ ధృతరాఘవరూప నినున్ భుజించెదన్. ఆ-౨.

ఉ. ధ్యానముచేతఁ జూచెద సుధానిధితోఁ బ్రతివచ్చునట్టిరా
ధానన మిద్దు కోపజనితారుణమై కడు వంకలై బొమల్
పైనమరంగ శోణకమలంబునఁ ద్రిమ్మరు చంచరీక సం
తానరవద్విలాసములు తార్కొనియుండక మానసేర్చునే. ఆ-3.

---

89. చెన్నారి శోభనాద్రి

ఇతఁడు బిల్వాణునికథను శృంగారసుధాసముద్రపూర్ణచంద్రోదయ మనుపేరను నాలుగాశ్వాసముల ప్రబంధమునుగా రచించి గుమ్మడపు పాపన్నపతి కంకితముచేసెను. కృతిపతిగాని కృతికర్తగాని యెప్పు డుండిన వాఁ డెలిసినదికాదు. కృతిపతి పద్మనాయకకులసంభవుఁడయి గుళ్ళ పాటి పురాధీశ్వరుఁ డయిన జగ్గనప్రభుని కుమారుఁడు; కృతికర్త యాతఁ డేల నియోగిబ్రాహ్మణుఁడైన చెన్నారి రామచంద్రుని కుమారుఁడు. కవిత్వము ప్రౌఢముగా నున్నది. శృంగారసుధాసముద్ర పూర్ణచంద్రోదయ మనెడి యీమినీపూర్ణతిలకకథనుండి రెండుమూఁడుపద్యములు నిందుదాహరించు చున్నాను—

చ. చక్కనివాఁడు మాటలకు జాణ కళాగమసాహితీచణుం
డక్కట బిల్వణుం డితనియందము చూచిన మందయాన ల
మ్మక్కయటంచు భర్తలను మాని పయింబయివచ్చి నిచ్చలుం
జొక్కకయుందురే రతులఁ జొప్పగునే మన కీతఁ డుండినన్. ఆ. ౨.

ఉ. అంధుఁడు బిల్వణుండు తనయా తెరచాటున నుండి నీవు స
ద్గ్రంథము లన్నియుం జదువఁగావలె నీతఁడు బుద్ధిమాతవా
తంధయసార్వభౌముఁ డని తండ్రి విధించిన నమ్మ్మయుంటి జా
త్యంధుఁడయేని యీతఁడుసుధాంశునిఁ గాంచనుశక్తుఁడెట్టులో? ఆ-3

మ. తనయా రాజకుమారుల న్వీడిచి విద్వాంసున్ గ్రహింపంగ నీ
మన సెట్లొప్పెను రాజకన్యవుగదా మర్యాదయౌనా ధర్మ
వినవే పెద్దలు చెప్పుచుందురుగదా విద్వత్సువారిద్యతా
యని తద్వాక్యము వ్యర్థమయ్యెనుగదా హా యేమిచేయందగున్.

---

90. కోటీశ్వరుఁడు

ఈకవి భోజకన్యాపరిణయమనెడి యైదాశ్వాసములప్రబంధమును రచియించెను. ఈతనిది రసవంతమైన కవిత్వమేకాని యందందు వ్యాకరణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. భోజకన్యాపరిణయమునందు రుక్మిణికిఁ గృష్ణునితోడి వివాహకథ చెప్పఁబడియున్నది. కవి నియోగిబ్రాహ్మణుఁడు; చక్రప్పకును మంగమ్మకును నందనుఁడు. ఈతనికాలము మొదలయినవానినిగూర్చి యేమియుఁ దెలియదు. ఇతఁడు నూటయేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. ఈతని ప్రబంధములోని యొక్కొక్కయాశ్వాసమునుండి యొక్కొక్కపద్యము నిందుఁ బ్రదర్శించుచున్నాను—

ఉ. కోమలియోర్తు చందనము కుంకుమ్రోడనుగూర్చి యంత న
త్తామరసాక్షుమై నలఁదఁ దద్దయు నొప్పె మనోహరాకృతిన్
సోముఁడు నీరజాప్తుఁడును జూడ్కులయందు వసించియుండుట
గ్గాముదిఁగూడి యాతపము క్రమ్మివెలింగెనునంద మొందుచున్. ఆ-౧

మ. జనభీతిప్రదఘోషపంకజననస్కారాయశఃప్రాప్తిలో
వనరాశిం దప మొంది శంఖముకలస్వానామృతౌఘంబు శో
భనరేఖాత్రయభాసురంబు నయి తద్భామాగళత్వంబు నొం
దిన ముక్తావళి తద్భవత్వమునఁ జెందెన్ హారవామాకృతిన్. ఆ-౭

మ. అన నబ్జాస్య యనున్ వయస్యలకు నీయబ్జాక్షీ గై సేయుమం
చని నే సొమ్ములపెట్టె తెచ్చి మణిభూషానేకము ల్వానఁబో
యిన నొండేనియుఁ బాటిగామిఁ జెలి యేమే చెల్ల నాసొమ్ము లే
వని ఖండించునుగాని నేర డెలుఁగన్ స్వప్రాప్తకారోన్ముఖిన్. ఆ 3

శా. భద్రేభంబులఁగూల్చుసింహముగతిన్ బ్రహ్మర్షిభూపాలుర
కౌద్రోల్లాసవిలాసము ల్మెఱయఁ బోరన్ గెల్చి నానాదిగ
ద్రుద్రశ్రీలకు నాటపట్టగుచుఁ బొల్చు న్వాసవుండోయనన్
మద్రాధీశుఁ డితండు చూచితివె శ్రీమద్రాజబింబాననా. ఆ. ర.

చ. సురవరదత్తమండనవిశోభితుఁడై హరి యిట్లు రుక్మిణీ
పరిణయకాంక్షు నుండుటయు భానుఁడు కన్గొని తాను నట్ల యా
హరికి ననర్ఘరత్నముల నర్పణ చేయఁదలంచియోయనన్
బరువడిఁ బశ్చిమాంబునిధిపారమున న్నిలిచెన్ ద్వారాద్రితిన్. ఆ 4

---

91. చల్లపిళ్ళ నరసకవి

ఇతఁడు యామినీపూర్ణతిలకావిలాసమనుపేరితో బిల్హణచరిత్రము నాటకాశ్వాసముల శృంగారకావ్యమునుగా రచియించినకవి. ఈతని కావ్యము పూర్వోక్తమయిన బిల్హణీయమునకంటె మిక్కిలి రమణీయముగా నుండును. ఈ కవి వైదిక బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజసగోత్రుఁడు; కామకవి పుత్రుఁడు. ఈ కవి తాను గొంతకాలము క్రిందట మృతుఁడయిన పిఠాపురపు రాజుగారి పితామహుఁడగు శ్రీరావు నీలాద్రిరాయనింగారి కాలములోఁ దదాస్థానములోని కడియమును గ్రామమునం దుండినట్లు యామినీపూర్ణతిలకావిలాసములో నీ క్రింది పద్యమునఁ జెప్పికొనియున్నాఁడు—

సీ. త్రిభువనపూతకృత్కీయగల్గు గౌతమీతీరవితీర్ణధాత్రీప్రసిద్ధ
తరమైన కంకణపురవరసంస్థానభూతిఁ జెందినవాఁడ భూసురుండ
శ్రీరామనామమంత్రారాధనపరుండ సకలవిద్వన్మహాజనహితుండఁ
బూజ్యతరప్రాజ్యరాజ్యసత్పీఠికాపురవరసామ్రాజ్యపరివృఢుండు
విమల రేచర్ల గోత్రపవిత్రమూర్తి। రావు వేంకటనీలాద్రిరాయనృపతి
చేత సత్కృతినొంది ప్రసిద్ధినొందినట్టి నరసయనామవిఖ్యాతయశుఁడ.

కడియ మనెడి యీ గ్రామము రాజమహేంద్రవరమునకు మూడు క్రోసుల దూరమున కాకినాడకాలువయొడ్డున నున్నది. శ్రీ రావు వేంకట నీలాద్రిరాయనింగారు నూఱుసంవత్సరములక్రిందట నుండినవారై నందున నాతని కాలములో నుండిన కవియు దాదాపుగా నూఱుసంవత్సరముల క్రిందటివాఁడు. ఈయన కవిత్వము రసవంతమయి ప్రౌఢముగా నున్నది. ఈయన కవనరీతిని దెలుపుటకయి యీ మినీపూర్ణతిలకావిలాసములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

చ. నిరుపమసాహసాతిశయనిర్భరదుర్భరవైరివీరసం
హారణరణోత్సవోచితవిహారమహారథికప్రదత్తస
త్పరిణయకార్యధుర్యతరధాణధణంధణనాదఘంటికా
నురమితనిర్జరీజనమనోరథముల్ రథము ల్పురంబునన్. ఆ-౧.

చ. ఘనకబరీస్తనాకృతులు కంధరమై ధరమై రమైక్యమై
చను నొగిఁ గంఠవక్త్రములు సాదరమా దరమా రవమాకమా
దినుసుగ వాగ్ముఖాంగములు తేనెలతో నెలతో లత్తో కిత్తో
నెనయగు నాభిజంఘగతి హేమకరిన్ మకరిన్ గరి న్నగున్. ఆ-౨.

ఉ. అమ్మకచెల్ల ! చెల్ల నగు నల్లికజెల్లికపూటలాడి చి
త్రమ్ములు పన్ని నన్నిటులు దారిచి మీ రిపు డంద లొక్కటై
గమ్మని గేలిసేయ నొడిగట్టితి రమ్మ పనేమి మాటలన్
నమ్మఁగరాదు మిమ్మనుచు నర్మిలి వేఱొకతీరు మీఱిన. ఆ-3.

చ. కలువ లెసంగఁ దామరలు కంది ముడుంగ దెస ల్వెలుంగ వె
న్నెలలు చెలంగ జక్కవలు నెక్కొని సేగి మునుంగఁ జీఁకటుల్
బలిమి నడంగ వేకొమరుఁ బ్రాయపువారల డెంద మొదమై
పొలు పలరంగ వారినిధిఁ బొంగఁగఁజేయుచు రాజు రాజిలెఁ. ఆ-శ.

శా. స్వామీ నేరము లేదు నావలన నీసర్వంబు నీకృత్రిమ
స్తోమంబు న్నను భ్రాంతి ముంప సమయాస్ఫూర్తిన్ మదీయానన
మ్మే మాలోకనబద్ధకాండపటరాజిం గూర్చి తౌఁగాదె మ
త్ప్రేమానందకరాశయగ్రహణకారి ప్రాప్తిగా మున్నగిన్. ఆ-శ.

ఉ. రామశరప్రయోగము సురప్రభువజ్రము చక్రిచక్రమున్
ధామనిధిప్రియాత్మజునిసంగడము కామరిపుత్రిశూలముల్
భూమి నొకప్డు రిత్త యయిపోయునఁ బోవుటగాక యీకవి
స్వాములవాక్ప్రయోగమును బ్రహ్మకు నైనఁ దరంబె త్రిప్పఁగన్.

---

92. అయ్యగారి వీరభద్రకవి

ఈకవి రాఘవ యాదవ పాండవీయ మను మూడాశ్వాసముల త్ర్యర్థి కావ్యమును రచియించెను. ఈతఁ డాఱువేలనియోగి యైనశైవుఁడు; కౌండిన్య గోత్రుఁడు; సోమనారాధ్య పుత్రుఁడు. ఈతఁ డేకాలమునం దుండినవాఁడో నిశ్చయముగాఁ దెలియరాదు. ఇతఁడు నూఱు నూట యేఁబదిసంవత్సరములక్రిందట నుండియుండవచ్చును. మూఁడర్థములు గల పద్యమునుబట్టి కవనన్నె పుణి యిట్టిదని చెప్పుటకు వలనుపడదు. ఇట్టికవిత్వ రచనయే కష్టము. అయినను గవి యవతారికలోఁ జెప్పిన—

ఉ. హారి కిరీంద్రవిగ్రహవిహారికి నాశ్రితబృందదుఃఖసం
హారికి భూతదేవవివహారికిఁ గౌస్తుభసజ్జ్వలన్మణీ

హరికి నా స్తపద్మగమహరికి సాగరబాలికామనో
హరికి వాహనస్వణవహరికి శౌరికిఁ గేలు మోడ్చెదఁ.

సీ. నిండుచందురుడాలు నీటు నేలఁగఁజాలు
మొగముపైఁ జిఱునవ్వు మొలకలొదవఁ
దెలిముత్తెములమించు వ్రేటనూటాడించు
నెలకూనయఁను దలఁ దళుకు లీనఁ
గొదమతుమ్మెదబారు నదలించితనరారు
కడచూపు లక్కటికంబు నించ
జోడులేదని తెల్పు సొగసుకుత్తుకనల్పు
మేవన్నెలకు వింతమిసిమి నొసఁగ
నలువ మొదలై నవారు తన్గొలిచిరాఁగ
గిబ్బ బాబాపయింబొల్చియబ్బురముగ
నెలమి చెన్నారఁగానాఁగలనుగానఁ
బడియెముక్కంటికన్నులపండువుగను.

ఇత్యాదిపద్యములనుబట్టి చూడఁగా సితఁ డాంధ్రగీర్వాణపద బహుళముగా మంచికవిత్వము చెప్పఁగలవాఁడనియే తోఁచుచున్నది. ఈతనిగ్రంథములోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి.

శా. నానారత్నవిభూషితాఖిలజనానందదానుసంధాయిశృం
గానూనంబులు చారుగంధసుమనఃప్రాచన్మహాపాదపా
లీనవ్యంబులు సద్వ్యపాభిరతముల్ లీలార్థగోత్రాళు లెం
తో నేత్రోత్సవదంబు లౌదుఁ జెలువొందుందత్పురంబందునన్. ఆ-ఁ

ఉ. ప్రాంచితరీతి రాముఁడు పరాశరజాతుఁడు కృష్ణమూర్తి దా
మించినవేడ్క నంప జడిమీఱఁగ, బెంచి విరాధరాజితో
దంచదనూనలీలల నుదాత్తముగా యవనాభ్రము న్నతు
ల్లాంచుచు నిద్రకీలధరలాలితదీప్తి నటండు భాసిలన్. ఆ. ఁ.

ఉ. రామని ధర్మరాజు రణరంగవిరాజితు నచ్యుతప్రభున్
నీమది మర్త్యగాఁ దలఁచి నీతివిహీనతఁ బోరఁబోకుమీ
సామము మేలు తద్విభుఁడు శస్త్రబలంబున మేటి భూమిలోఁ
గామిని రత్నయుక్తముగఁ గ్రక్కున నిచ్చి కులంబుఁబ్రోవుమా. ఆ-3

---

93. ఘట్టు ప్రభువు

ఇతఁడు సురాభాండేశ్వరము, కుచేలోపాఖ్యానము, యాజ్ఞవల్క్యచరిత్రము, అను మూఁడుపద్యకావ్యములను రచియించెను. ఇతఁడెల్లామాత్యనిపుత్రుఁడు. ఈకవి యాజ్ఞవల్క్యనియోగిబ్రాహ్మణుఁడయినట్లు కనఁబడుచున్నాఁడు. ఇతఁడు కుచేలోపాఖ్యానములోఁ దన్నుఁగూర్చి యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

సీ. భ్రమరాంబికావరప్రభవదివ్యకవిత్వ
విద్యాప్రవీణత వెలసినాఁడ
ఘటికాశతగ్రంథఘటనాసమంచిత
చాతుర్యమహిమకుఁ జాలినాఁడఁ
బ్రౌఢిమ నేకైకపటిమాసమగ్రప్ర
బంధ కల్పనశక్తిఁ బ్రబలినాఁడ
మతియు నాశువు చిత్రమాధుర్యవాక్య ప్ర
గల్భనంబున నుతు ల్గాంచినాఁడ
శ్రీకుధరమల్లికార్జున శ్రీపదాబ్జ
మత్తభృంగాయమానసన్మానసుండ
సత్కవీశ్వర కరుణాప్రసాదవశుఁడ
ఘట్టుప్రభునామధేయ విఖ్యాతయశుఁడ.

ఈకవి నెల్లూరిమండలము గోసవాఁడయినట్టును, అప్పటి కెనుబది సంవత్సరములక్రిందట నుండినట్టును, నెల్లూరిమండల చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. కాఁబట్టి కవి యిప్పటికి నూఱుసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈతనికవిత్వ మంతగా నిర్దుష్టమయినదికాదు ప్రౌఢమయినదియుఁ గాకపోయినను, మంచి లోకోక్తులతోను న్యాయముల తోను నిండియుండి ద్రాక్షాపాకమునఁ జదువువారి కింపుగానుండును. ఈతఁడు రచియించిన యాజ్ఞవల్క్యచరిత్రము ప్రస్తుతమున నావద్ద లేదు. దక్కిన గ్రంథములనుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

కుచేలోపాఖ్యానము.

శా. చిత్రం బెన్నఁగ జిన్ననాఁడె తనయుల్ శిక్షానుగుణ్యుల్ తుదన్
బాత్రుల్గా రతిదండకార్యములకున్ బ్రాయంపువారైన ని
ద్ధాత్రిం జుట్టములట్లు చూచెవలదా తండ్రు ల్పరాజాతులున్
బుత్రం మిత్రవదాచరేత్తను నేప్రొద్దున్ శ్రుతు ల్చాటఁగన్. ఆ-౧.

ఉ. కామితవస్తుజాతములు గల్గి దయాపరులైన పుణ్యులన్
బ్రేమత నిచ్చి పుచ్చుకొనుభావమునం దలపోయఁ డెంతయున్
గ్రామము క్రొత్తదైనఁ దన కర్మము క్రొత్తయె పెక్కుమాట లిం
కేమి యదృష్టహీనునకు నెచ్చటి కేగినఁ గల్గునే సిరుల్. ఆ-౨.

ఉ. అన్నము లేకయుండిన లయంబగు దేహము రక్తమాంసముల్
సున్నగు నింద్రియస్ఫురణ స్రుక్కు మదాతిశయంబున దూరమా
నన్నులమోఁదిప్రేమ చెడు నచ్యుత నీపయి నిల్చుమానసం
బెన్నటికైన జ్ఞానులకు హెచ్చు దరిద్రతసాటి యే సిరుల్. ఆ-3.

సురాభాండేశ్వరము.

చ. తవిలినమోహపాశమున దైన్యముఁ బూని మనోవ్యథం గడుం
దివురుచు విన్నవై యవనిదేవుఁడు ప్రార్థనచేసి ప్రొక్కఁగా

నువిదయుఁ జేరికిఁ గొనక యూరక యేగెను నిర్దయాత్మయై
శివశివ మిక్కిలిం గఠినచిత్తలుగారె లతాంగు లిమ్మహిన్.
చ. పరమవివేకశీలుఁడవు బాపఁడ వుత్తమవంశజుండ వీ
వెఱుఁగవె యొండ్లఁ భామినుల నీగతిఁ గోరుట ధర్మమే మహా
దురితము లైనపట్లఁ గడుదూరముగా నెడలించి మోహముల్
మఱచుట ధర్మ మండ్రు మతిమంతులు వేదపురాణసమ్మతిన్.

---

94. ముప్పిరాల సుబ్బరాయకవి

ఇతఁడు కృష్ణాభ్యుదయమనెడి యైదాశ్వాసములప్రబంధమును రచియించి, చక్కిలాల వేషయామాత్యున కంకితముచేసెను. ఆగ్రంథమునఁ గవి తన్నుఁగూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

మ. ననుఁ శ్రీనాథకథాసుధారసపరిన్నాథాగ్రయోపాంబుగా
హానదూరీకృతసర్వకల్మషు హరిన్యానుగ్రహ ప్రాప్తసా
రనిరాఘాటసితాంతశోభికవితా రాజ్యస్వతుఁ సత్సుధీ
జనసంతానవిధేయుఁ జూచి పలికెఁ సంతోష ముప్పొంగఁగన్.
సీ. అతిశయోక్తిశ్లేషమాద్యలంకారముల్
దొలఁకంగ ముద్దులు గులుకుఘణితిఁ
బద్యకావ్యముగాఁగఁ బ్రబ్యమ్మచరితంబు
రసికు లాననఁగను రచనచేసి
తలరుచు ద్వీపదగా వెలయ సావిత్రిచ
రిత్ర మొనర్చితి చిత్రలీల
భద్రాద్రిఁ దగు రామభద్రునిపై నొక్క
శతకంబుఁ జేసితి చతురఘణితి
నేయెడ నరస్తుతులు నీవునేయ వైన
భ్రాతృవాత్సల్యమెనఁగఁ బ్రబంధమొకటి

చెప్పినా కంకితంబుగఁ జేయుమిపుడు
సుకవినుతగుణసముదాయ సుబ్బరాయ

పయిపద్యములనుబట్టి యీకవి ప్రద్యుమ్నచరిత్రమును సావిత్రీ చరిత్రమును భద్రాద్రి రామశతకమునుగూడ రచియించినట్లు తెలియ వచ్చుచున్నది. ఈకవి యెప్పటివాఁడో తెలియరాలేదుగాని నూఱుసం వత్సరములకంకెఁ బూర్వపువాఁడు. ఈతని కవనము మృదువయి మధు రముగా నున్నది. కృష్ణాభ్యుదయములోని కొన్నిపద్యముల నిందుదా హరించుచున్నాను—

ఉ. సంకుమదాదిగంధయుతసారసమీరము మీఁదివీవఁగాఁ
గంకణరుంకృతు ల్వెలయఁగా సురసుందరు లొయ్య నొయ్యనఁ
బొంకమునీఁ అ నూఁపఁగను భోగికులాధిపడోలికన్ రమా
పంకజగంధిఁ గూడుకొని బంధురహర్ష తరంగితాత్ముఁడై. ఆ. ఎ.

చ. విను చెలి జోడుకోడెలగువేఁడివెలుంగును రేవెలుంగునున్
వనజదళాయతాక్షునకు వారిరుహాసనుఁ డింపొనర్పఁగాఁ
గనుఁగవఁజేయ నాసయనుకాంచనపుష్పము నాశ్రయించి వా
రనిశము పుష్పవంతు లనునాఖ్య వహించిరి ముజ్జగంబులన్. ఆ. 3.

ఉ. మారుశరాళికిన్ మలయమారుతపాళికి మంజులాళికిన్
మీఱుమరాళికిన్ జిగురుమెక్కెడునీలిగయాళికిన్ శశాం
కోరుకరాగ్రకీలికి మయూరకదంబము కేళికిన్ సితాం
భోరుహనేత్ర కుంది తలపోయఁదొడంగె మనంబులోపలన్. ఆ. ౮.

చ. కొనియెద రుక్మిణీసతిని గోపవధూవిటుఁ డడ్డమైన మా
ర్కొనియెద మద్భుజాబల మకుంఠితమైతగ నిల్మిమీఁదె శ
క్రొనియెద రంచు బంధుజనకోటికిఁ దెల్పుచుఁ జైద్యుఁ డంతటన్
గని యెదురై నవారు నగఁ గ్రక్కునవచ్చె నృపాలువీటికిన్. ఆ. ౫.

— —

95. ప్రయాగ కామేశ్వరకవి

ఇతఁడు గోపాలలీలాసుధాలహరి యను మూడాశ్వాసముల ప్రబంధమును రచియించి రామతీర్థస్వామి కంకితము చేసెను. ఈకవి విశాఖపట్టణమండలపువాఁడు; వైదికబ్రాహ్మణుఁడు; కౌశికగోత్రుఁడు; నారసింహపౌత్రుఁడు; సర్వేశ్వరపుత్రుఁడు. ఇతఁడు నూఱు సంవత్సరములక్రిందట నుండినవాఁడు. కవిత్వము మంచిదేయైనను శృంగారవర్ణనము నితఁడు మిక్కిలి పచ్చిగాఁ జేసినందున బుస్తక మిప్పటివారు చదువుట కంతగా యోగ్యమయినదికాదు. ఈప్రబంధమునుండి రెండుపద్యముల సిం దుదాహరించుచున్నాను—

ఉ. దుండగ మేలచేసెదవు తోయజసాయక దండనిల్చి కో
దండము డించి మాచెలికిదండము పెట్టును రెండుకన్నులన్
నిండిననీరు దోయిటను నించి శపించుఁ దదభ్రువారి నిఁ
దండనచేయుఫాలశిఖితండ్రిసుమీ కడుశిక్ష చేయఁగన్. ఆ. 3.

ఉ. యమునాతోయము దోయిటంగొని సముద్యల్లీల వేఱొక్కభా
మముఖాబ్జంబునఁ జల్ల నానెలఁతయు న్మారోమ్మ గావించుచో
దుమికెం దుమ్మెదచాలుఫుల్లనవపాథోజంబుపై నాఁగ శ
క్రమణీరోచులనీనుకొప్పు విడి వేగం గమ్మఁ దద్వక్త్రిమున్. ఆ.3.

---

96. అనంతనార్యుఁడు

ఈకవి గాథేయోపాఖ్యానమును నేకాశ్వాసశృంగారప్రబంధమును రచియించి కామాంబకును జిన్నప్రభునకును బుత్రుఁడగు కృష్ణభూపాలుని కంకితము చేసెను. ఇతఁడు తాళవలింపకవికుమారుఁడు. ఈకవినిగూర్చియు నీతని కాలమునుగూర్చియు మఱేమియుఁ దెలియరాలేదు. ఇతఁడు నూఱేండ్లకు లోపలివాఁడుకాఁడు. ఈతని కవిత్వము హృద్యమయి యన

వద్యమయియున్నది. కవితామాధుర్యమునుజూపుటకై గాథేయోపాఖ్యానములోని పద్యముల రెంటి నిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

ఉ. మానక యింతవంత దరమా సురమాన్యపదంబుగన్న మ
నీనిని కిదేల వట్టివగ నీక్కృపచే వగ నేవగ న్నగ
న్నానిత తత్తపోమహిమ మానుప నాదువిలాసమోపు నీ
పూనికమోపు నాపయినిమోపు వెత న్విడుమోపురందరా.

చ. చిలుకలకు న్వచోగురుతఁ జెంచుచు సప్తవిధస్వరంబుల
బలుమఱుఁ దేనియ ల్గులుకఁ బాడెడు నీలలితాంగిఁజూచి లో
కులు మఱి కోకవాణియును గోకిలవాణియనంగఁ దోన చి
ల్కలు మఱి రామరామయనుఁ గన్నులఁ గెంపు పహించుఁ గోవిలల్.

---

97. భైరవకవి

ఇతఁడు రత్నశాస్త్రమును దెనుఁగునఁ బద్యకావ్యమునుగా రచియించెను. ఇతఁడు గౌరనసుతుఁడు. ఇతఁడు భ్రమరాంబికా వరప్రసాదముచేతఁ దనకుఁ గవిత్వము వచ్చినట్లీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొనియుండుటచేత కర్నూలుమండలమువాఁడయినట్లు తోఁచుచున్నది—

క. తన్నుఁ బ్రియమార వేఁడిన|మున్ను మునీంద్రులకగ స్త్యుని చెప్పినయా
సన్నుతమణిలక్షణములు|చెన్నుగఁ గ్రోడీకరించి చెప్పెదఁ దెలియన్.

క. భ్రమరాంబికామహావర|సముచితనిరవద్యహృద్యసాహిత్యకళా
శ్రమవిమలప్రతిభాసం|క్రమణుఁడ మతిశాలియైనగౌరనసుతుఁడన్.

"భైరవుఁడ నుభయభాషాపరీణుఁడ" నని కవియే తన సంస్కృతాంధ్రభాషావ్యయపాండిత్యము కలదని చెప్పుకొనెను. ఈతని కవిత్వము మొత్తముమీఁద చక్కగానే యున్నది. రత్నశాస్త్రములోని రెండు పద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

ఉ. నీరదము లిగంతములనిండి తటిద్ఘనగర్జితంబు లిం
పార యహోగ్రవృష్టికురియం బ్రభవించు నింతాతకాంత్యో
నారయఁ గుక్కుటాండసమమై పడుమృత్యువు లంతరిక్షసం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్.

ఉ. చేత ధరింప మానవులచెంతను జేరవు భూతకోటు తే
రీతిని దుష్టనిద్య లొనరించిన నెక్కువు క్రూరజీవముల్
ఘాతలు సేయలేవు సతిగర్భముమోప సుఖప్రసూతియా
నాతత భాతితోఁ బ్రతిదినంబును బ్రీతి యొనర్చుఁ గేతువున్.

---

98. అనమగుర్తి రంగయ్య

ఇతఁడు యాదవగిరిమాహాత్మ్య మనెడి యైదాశ్వాసముల పద్య కావ్యమును రచియించెను. ఇతఁడు నందవరీక నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మయామాత్య తనూభవుఁడు. ఈకవి తనగ్రంథమును రావ్యూరివేంగా మాత్యున కంకితముచేసెను. కవియెప్పటివాఁడో సరిగా తెలియనుగాని నూఱుసంవత్సరములకుఁ బూర్వపువాఁ డనుటకు సందేహములేదు. ఈ తనికవిత్వము శ్రావ్యముగానే యున్నది. యాదవగిరి మాహాత్మ్యములోని రెండుమూడుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. పిడుగులఁబోలు నెండసెగఁ బెట్టినపైరులు వాడిపోయినన్
మడిమడిఁ దప్ప కేతములు నాటుచు బావులు త్రవ్వి కారుపై
రిడి యొకకొన్ని బాన లటు లెత్తుచు గాడ్పులదూలి సారె నీ
రెడలినఁ జూచి యొక్కతడి యిత్తురు హాలికు లశ్రుధారలన్. ఆ-3

చ. బెళఁకులు నేర్చెఁ జూపు తిరిపెల్లు లవారిగఁజల్లె మేనిడాల్
కెలఁకులఁ జూడఁజూడఁ బెరిఁగెం జనుఁబూపలు నిగ్గుదేరఁ జె

క్కిలికవ సన్ననూలువడికె న్నడు మెక్కడనుండివచ్చెనో
చెలు లొకనాఁడు నేరుపనిసిగ్గు వధూటికి నాఁడునాటికిఁ. ఆ. ౪.

ఉ. వాలికచాగుబ్రేఁగుజడ వారిపయింబడి తేలియాడుచుఁ
బ్రాలఁగ, నీలహంస మది వారిరుహంబని డాయ, నొక్క ప్రో
యాలి మెఱుంగుమోమమరె నవ్వల నివ్వల రాహు కేతువుల్
బాళిని డాయ వారియెడఁబర్వినపగ్వసుధాంశుఁడో యనఁ. ఆ. ౫.

---

99. తామరపల్లి తిమ్మయ్య

ఇతఁడు శేషధర్మమనెడి మైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి శ్రీరామాంకితముచేసెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; శరణమూమాత్యునిపుత్రుఁడు. ఇతఁడుండినకాలమేదో తెలియదు. నూఱు సంవత్సరములక్రిందట నుండియుండును. ఇతనికావ్యమునం దపప్రయోగములు కొన్నిగలవుగాని కవిత్వము మొత్తముమీఁద చక్కనిధారకలదయి శ్రావ్యముగా నుండును. ఈతనిశేషధర్మములలోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. తోడికులాంగన ల్మణులతోఁ గనకంబులతోడ వెండితో
వాడలవాడలన్ సిరికి వన్నెలు వెట్టుచు నాధపుత్రులం
గూడి సుఖింపఁగా మనము కూటికిఁ గూరకుఁ జిక్కి బిడ్డల
ల్లాడఁగ నెల్లకాలము మహాత్మకనుంగొనుచుండ శక్యమే. ఆ. ౧.

మ. మును పోషించినపుత్రమిత్రవనితాముఖ్యుల్ స్వకర్మంబులం
జసి యెందేఁ జన వారికై జపతపస్స్వాధ్యాయము ల్మాసి దు
ర్జనులం గూడి పరాపకారనియతిం బ్రాఢత్వము ల్మాపఁ నా
పెనుపాపంబున గర్భవేదనలు పై పెట్టంయ్య నెట్లేగుదుఁ. ఆ. 3.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

ఉ. అక్కడనున్న యాపశుమృగాదులు శ్రావకపాదపద్మముల్
దిక్కని ముక్తికామినికి దీవన లిచ్చు సుపర్వ లీలతయున్
సిక్కము యిగ్గిరీంద్రమున నిల్వఁగవచ్చును బుణ్యశాలికిన్
గక్కసమా మహోదురితకర్మ్మలకుఁ వసియింప నిచ్చటఁ. ఆ. ౫.

---

100. నారన సూరన

ఇతఁడు వనమాలివిలాసమును కావ్యమునుజేసి, కొండూరి యక్క దండనాథుని కంకితముచేసెను. నానద్దనున్న యీ గ్రంథముయొక్క ప్రతి యసమగ్రమయినది; అవతారిక లేదు. కృతిపతిమంత్రియు దండనాథుఁడు నయి యజ్ఞముచేసిన నియోగిబ్రాహ్మణుఁడు. కవి నారనామాత్యుని కుమారుఁడైన నియోగివిప్రుఁడు. ఇతఁడాథునికుఁ డని చెప్పుటదక్కఁ గవికాల నిర్ధారణముచేయుటకుఁ బుస్తకమునం దాధారమేదియుఁ జిక్క లేదు. ఈతని కవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది. వనమాలి విలాసములోని కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. గొజ్జఁగినీరుపోసి సమకూర్చినచందనవారిఁదోఁచి లా
మజ్జకతాళవృంతముల మాటికిఁ ద్రిప్పఁగ రాలుశీక రం
బజ్జలజాతచెక్కిళుల యందుఁ దనర్చె ముఖేందుసుజ్వరం
బుజ్జనచేయఁ గూడఁబడియున్న యుడుప్రకరంబుచాడ్పునన్. ఆ-౧.

చ. మెఱయు కపోలపాళికలమీఁదఁ జలన్మణికుండలద్యుతుల్
గిఱికొన ఫాలభాగమునఁ గించి ముదంచితనర్తనంబులై
నెఱికురు లింపుచేయఁ గమనీయవిలోచన లూఁచి రౌదలల్
కొఱలి భవద్యశోమహిమ కోమలి మాటికిఁ జెప్పుచుండఁగన్. ఆ-౨

చ. కలమధురంబులై న కలకంఠివచోరచనానిగుంభనం
బులు విని సిగ్గునం బలుకుఫూనికలెల్లను బోవడించి మూఁ

గలవలె నోళ్లు మూసికొని కాననసీమలఁ జేరియున్న కో
కిలముల బుజ్జగించి పలికించు మధూదయ మాత్మసంగతిన్. ఆ-3.
ఉ. తొల్లియు మోసపోయితివె భోయరుహీనన పెక్కుమాటులో
చెల్ల మదీయధైర్యములచేతనె యిప్పుడు నమ్మికొనె నీ
యుల్లము సారె నెత్తు లిడుచున్నది యీక్రియ నాఁడుమంచు నా
కల్లతనంబు లింతటివిగాఁ దలపోయ నరాళకుంతలా. ఆ-౪.

---

101. పోడూరి పెదరావమాత్యుఁడు

ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శివరామమంత్రికిని సీతమాంబకును బుత్రుఁడు. ఇతఁడు శివరామాభ్యుదయ మను ద్వ్యర్థికావ్యమును రచించెను. ఇతఁ డీగ్రంథమును గురజాల వేరయార్యుని ప్రేరణమునఁ జేసెను. కవి కృతి వేరకుని తన గ్రంథమునందు—

సీ. ఏమంత్రికులపూర్వుఁ డిలఁ జనుత్కారభారత మండె శ్రీరంగరాజునాముఁ
డేమంత్రిముత్తాత యామల్లయజ్వ దాక్షాయణీపరిణయగ్రంథమండె
నేమంత్రితాత యజ్ఞాసూత్యుఁడొనరించెఁ బ్తసంతానముల్ సరవితోడ
నేమంత్రిపిత పార్వతీశ్వరుఁ డాదిమదాతయై పద్యగద్యంబు లండె
నట్టి గురుజాలకులకలశాబ్ధివిధుఁడు
రసికుఁ డివటూరి మల్లనారాధ్యశిష్యుఁ
డభవపూజాధురంధరుఁడైన వేర
ఘనుఁడు సాంఖ్యాయనసగోత్రుఁడైనయు సిరుల.

ఇట్లు వర్ణించి, అతఁడు తన్నుఁగూర్చి పలికినట్లుగా నీక్రింది పద్యములనుజెప్పికొనియున్నాఁడు—

సీ. అనఘభారద్వాజమునిగోత్రజాతు నాపస్తంబసూత్రుఁ బ్రశస్తచరితు
ఘనుని-బోడూరి వేంకటమంత్రివరున ప్తమహితధీబాపయమంత్రిపౌత్రు

శివరామమంత్రికి సీతమాంబకు సూనులై మించు భాపార్యరామరామ
ఘనులమువ్వురిలోన గణన కెక్కినపెదరామకవీంద్రు శ్లేషమయచరితుఁ
జిత్రయమకాంధ్రసంస్కృతశ్లేషకవిత
రచనసేయుంగ నేర్చి భారతికరుణను
రాజవిద్వత్సభలయందుఁ బూజితుఁ డగు
ననున్నఁబిలిపించి పలికెఁబ్రసన్నఫణితి.

సీ. నీవంశపూర్వధీనిధి కొండకవి చెప్పె భార్గవాభ్యుదయప్రబంధ మెలమి
నీయన్న భోపమంత్రి రచించెనొగిసుపాకన్యకాపరిణయకావ్యమెసఁగ
నీతమ్ముఁ డసమునందె నిరోష్ఠ్యజానకీకళ్యాణకృతి రామకవివరుండు
నీవు ప్రౌఢోక్తిని నిర్మించినావు కౌసల్యావరిణయాది సరసకృతుల
మఱి యుదాహరణాది చమత్కృతులను
సంస్కృతాంధ్రకవితఁ జెప్పఁజాలినట్టి
ప్రౌఢసత్కవి వీవె ధరాతలమున
గలితగుణగణ్య పెదరామకవివరేణ్య.

ఈపెదరామకవి సంస్కృతాంధ్రకవులను స్తుతించినపిమ్మట శ్లేష కావ్యములకు మార్గదర్శియైన పింగళి సూరనామాత్యునిటు పొగడి యున్నాఁడు.

ఉ. శిష్టకవిత్వవై ఖరివిచిత్రత రాఘవపాండవీయ ము
త్కృష్టముగా రచించి జగదేకనుతు ల్గని ధాత్రిలో నవ
ప్రస్ఫట యనంగఁ బద్మభవసన్నిభుఁ డైన మహాకవీశ్వరా
భీష్టతమప్రభావుఁ డగుపింగళిసూరకవీంద్రుఁ గొల్చెదన్.

కావ్యప్రేరకుఁడైన గురుజాల వేరయార్యుని యభీష్టప్రకారముగా నీగ్రంథమును గోదావరిమండలములోని యాచంటగ్రామమునందలి రామలింగేశ్వరస్వామి కంకితము చేయుటచేతనే కవి గోదావరిమండలములోని వాఁడగుట స్పష్టమగుచున్నది. ఈతనికాలము నిశ్చయముగాఁ దెలియ

రాదుగాని యితఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడని తోఁచుచున్నది. ఈతనికవిత్వధార యనర్గళమయి మృదువుగానున్నది. కవితాధోరణి తేటపడుటకయి శివరామాభ్యుదయములోని రెండుపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి—

చ. తరమె నుతింపఁగా నగణితస్ఫురితాంకతఁ దద్ధరాధినే
తరసికుఁడౌ ననంత వసుధారథుఁ డుగ్రపురారి భీముఁడు
ర్వర నుతి కెక్కిమించె వృషవాహసమాఖ్యుఁ డహీనసద్గుణో
త్కరవరుఁ డాజిభీకరనితాంతపరాక్రమశాలి యీ నృపుఁ. ఆ. ౧.

మ. అలరన్ దత్సుకుమారభాసురసహాయంబొప్పఁగా దారకో
జ్జ్వలనామాహితదానకాంక్షు విబుధాంచద్భర్తృదాన నా
కులసత్సంతతిఁ జూడవచ్చె నమితాటుం డింపువీఁబంగ మం
జులతారామమహోధ్వరాజితవరాఁశు ల్లల్లునవ్వీటికిన్. ఆ. ౨.

---

102. రామావర్ఘుల కొండుభట్టు

ఈకవి కపిలగోసంవాద మనుపేర నధ్యాత్మవిద్యాప్రతిపాదకమగు నాఱాశ్వాసముల పద్యకావ్యమునురచియించి యహోబిలనృసింహస్వామి కంకితముచేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; హరితసగోత్రుఁడు; నరసావధానికిని అక్కమకును పుత్రుఁడు. ఇతఁడించుమించుగా నూఱుసంవత్సరములక్రిందటి వాఁడని తోఁచుచున్నది. ఈతని కవిత్వము మృదువయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. కపిలగోసంవాదములోని యొక్కొక్క యాశ్వాసమునందలి పద్యము నొక్కొక్కదాని నిందుదాహరించుచున్నాను—

ఉ. దైవ్రతముచే ననిత్యసుతదారధనాద్యఖిలై హికోత్సవ
వ్రాతములందు దైవతనివానసుఖంబులయందు లోలుఁడై

పాతరలాడువారల కపారత నిత్యసుఖాబ్ధిదేల నే
భాతి లభించు సద్గురుకృపామహిమం బొడగూడ దేనియున్. ఆ-ం

శా. ఓనా మీమదులం దసూయ యనసూయాదేవిపై, బూన మే
మానాత్రిం జెనకంగఁ జాలుదుమె మీయాలాపము ల్మార్వరా
దై నం బోయెద మందు నేమగునొ యం చాదేవదేవో త్తముల్
గానంబోయిరి యమ్మునీంద్రునిసతిం గాపట్యవేషంబులన్. ఆ. ఎ

శా. వేదాంతార్థసముజ్జ్వలాగ్ని భవసద్విజ్ఞానదీపంబుఁ దా
నాదిం మానసముం గరంగఁగ సముద్యల్లీలమైఁ బూని స
మ్మోహం బొప్పఁగ హృద్గృహాంతరవసన్మోహాంధకారంబు వి
చ్ఛేదంబై చనఁజొచ్చియందుఁగలయన్ శేషాహిభూషున్ బరున్ ఆ-3

ఉ. ఆపరమేశ్వరుండు సకలాంతరబాహ్యములందు నెల్లఁ దా
వ్యాపకుఁ డాట లింగతనువందును బింబితుఁ డయ్యె నందుచే
రూపరి జీవుఁడై మిగులరూఢిని గర్తను భోక్తనంచు సం
తాపము నొందుచుండుఁ దనుఁ దాఁ గనలేమిని నెల్లభంగులన్. ఆ-ర.

మ. ప్రతిబింబంబు లనంగ దుర్విషయసుప్రజ్ఞాదిదుర్వాసనల్
సతతంబున్ మదిలోనఁ బాదుకొన నిశ్చాంచల్యముం బొంద నీ
కితరభ్రాంతులఁ ద్రిప్పచున్ శ్రవణవాగిత్యాదిసంసర్గసం
గతులం బర్వికొనంగలేనియవియాఁ గాటిల్యమాలిన్యముల్. ఆ-ఱ.

చ. చక్కెర పుచ్చకాయవలె సంతనగా నొనరించియుంచ నం
దెక్కడనైన నఁ జేదు గలదే విను యాత్మయఖండరూపమై
పిక్కటిలంగ వే ఱొకటి భేదము తోఁచున యెట్లుచూడఁ దా
నొక్కటియొక్కచేవిజను నొక్కటి యన్నదియున్వి చిత్రమే. ఆ-ఆ.

——

103. మారయకవి

ఇతఁడు మైరావణచరిత్రమును పద్యకావ్యముగా రచియించెను. ఈ కవి నియోగిబ్రాహ్మణుఁడు; సర్వజ్ఞామాత్యనికుమారుఁడు. అక్కడక్కడ వ్యాకరణదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి మనోహరముగా నున్నది. కవనఘోరణి తేటపడుటకయి మైరావణచరిత్రములోని రెండుమూఁడు పద్యముల నిం దుదాహరించుచున్నాను.—

ఉ. చెప్పఁగరానిమాయల విచిత్రపుఁజూపులు దాల్చి యింక వాఁ
డెప్పుడువచ్చునో యిటకు నేమటియుండినఁ గార్యమంతయుం
దప్పనుగాన రాఘవులు తద్దయుఁ గాంచునిధంబు గొబ్బునన్
జొప్పడఁ జెప్పఁడీ తెలియ సూనృతవర్తనులార నావుడున్. ఆ-౧.

ఉ. మారుని మోహనాంబకముమాడ్కిని బ్రాణము లైదు నున్నబం
గారపుబొమ్మరీతిఁ దొలుకారుమెఱుంగులప్రోకభంగి శృం
గారరసంబునం దొలఁకఁగట్టిన పువ్వులయెత్తురీతి న
న్నీ రజగంధివచ్చి తగ నిల్చెను బ్రీతిని భర్తముందటన్. ఆ-౧.

చ. దనుజ దురాత్మ నీకు నిఁక దస్కరవృత్తినిజొచ్చి మాయలన్
దినకరవంశ్యులం దొడరి తెచ్చినపద్ధతిఁ బోవరాదు నా
ఘనతరవాలరోమమునఁ గట్టి జగంబులు మెచ్చ నిన్ను న
య్యనిమిషులెల్ల భీతి నిట కడ్డమువచ్చినఁ గావఁ జంపెదన్. ఆ-౨.

---

104. పరశురామపంతుల లింగమూర్తి

ఈకవి సీతారామాంజనేయమనెడు మూడాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; రామమంత్రికిని తిమ్మాంబకును బుత్రుఁడు; మహాదేవయోగి శిష్యుఁడు. ఈగ్రంథము

ప్రథమాశ్వాసము తారకయోగమును గూర్చియు, ద్వితీయాశ్వాసము సాంఖ్యయోగమునుగూర్చియు, తృతీయాశ్వాసము రాజయోగ మనఁబడి యమనస్కయోగమునుగూర్చియు, తెలుపును. ఈ సీతారామాంజనేయ సంవాదము బహుజనులచేఁ జదువఁబడెడు జనప్రియమైన పుస్తకముగా నున్నది. కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగా నున్నది. ఈకవి తన పాండిత్య ప్రకటనమునకయి యిట్టి వేదాంతగ్రంథమునందు సహిత మేకాక్షరద్వ్యక్షర పద్యములను జొప్పించియున్నాఁడు. ఇతఁడు నూఱు సంవత్సరములకుఁ బూర్వమునం దుండినట్లు తెలియవచ్చుచున్నది. సీతారామాంజనేయ సంవాదమునుండి కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ప్రాపుగ రామనామము నిరంతరమున్ భజియించువారికిం
బాపము లేదటంచుఁ బెనుపామును బట్టుఁగవచ్చు నగ్నిసం
దీపితలోహఖండము నతిత్వరితంబుగ మ్రింగవచ్చు బ
లోపము పెంచుపెద్దపులికోఱలు దీయఁగవచ్చునిద్ధరన్. ఆ-౧.

ఉ. నమ్మ మనమ్మలో ననుదినమ్మ వెలుంగుచిదాత్మసత్త్వభా
వమ్మ నిజమ్మ నేను నిధనమ్మును సంజననమ్మ రూపవ
ర్ణమ్మలుఁ గర్తృకార్యకిరణమ్మలు వర్ణగుణాశ్రమాభిమా
నమ్మలు నాకు లే వనుఘనమ్మగు నావచనమ్మ నెమ్మదిన్. ఆ-౨.

శా. గానంబు న్నటనంబుఁ దాళగతులం గావించున్ జారు వి
ద్యానై పుణ్యముఁ జూపుచున్ శిరముమీఁదం గల్గు పెందొంతర
బూనం గైకొను నాట్యశీలునిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
న్నానార్థానుభవజ్ఞుఁడయ్యు బుధుఁడానందాత్మఁ గాంచున్మదిన్. ఆ-3.

105. పరశురామపంతుల రామమూర్తి

ఈ కవి శుకచరిత్రమనెడి యైదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; సీతారామాంజనేయ సంవాదమును రచియించిన లింగమూర్తిపుత్రుఁడును శిష్యుఁడును; ఈతని తల్లి లింగాంబ. కవి తనతండ్రినిగూర్చియు దన్నుఁగూర్చియు నిట్లు చెప్పు కొనియున్నాఁడు—

సీ. ఆత్మభూతుఁడుగాని యాత్మభూతుఁడుగాఁడు
నిగమాగమాంతార్థనియతిదోఁప
బురుషోత్తముఁడుగాని పురుషోత్తముఁడుకాఁడు
సజ్జనానుగ్రహాసరణి మెఱయ
మృత్యుంజయుఁడుగాని మృత్యుంజయుఁడుకాఁడు
సర్వప్రపంచోపశమన మమర
నమృతసిద్ధుఁడుగాని యమృతసిద్ధుఁడుగాఁడు
ఘనరసనిధిసమంధనము దనర
ననుచుఁ దా వ్యతిరేకాన్వయప్రసిద్ధి
నలరి ప్రత్యక్షముగ నజుఁ డచ్యుతుండు
నభవుఁడమరేంద్రుఁడై యెప్పెనవనినతఁడై
లింగమూర్తియునాగురులింగమూర్తి.

గీ. అమ్మహాలింగమూర్తి లింగాంబికాకు
మారుఁడఁ దదీయసేవానుమతుఁడఁ బరశు
రామపంతులకులకంజరాజికర్య
మాకృతినిబొల్చు రామసామకుఁడ నేను.

ఇతఁడు నూఱుసంవత్సరములక్రిందటివాఁడయినట్లు తోఁచుచున్నది. ఇతఁడు రచియించినది వేదాంతగ్రంథమయినను కవిత్వము

మృదువయి హృదయరంజకముగా నున్నది. శుకచరిత్రములోని కొన్ని పద్యములను గవితాధోరణిని జూపుటకయి యిం దుదాహరించు చున్నాను—

ఉ. కాయవనంబునన్ ధనువుగా భృకుటిం గటిచేసి నారిగా
వాయువు గూర్చి చూపులనువాడిశరంబులఁ బూని షణ్ముఖున్
బాయనిదృష్టి మాటుగొని మానసముఖ్యమృగంబులన్ సుఖో
పాయముగా వధించుమృగయారతు లుండుదు రప్పురంబునన్ ఆ-౧.

మ. లలనా యీవనభూమి కెల్లపుడు వాలాయంబుగా నప్పురో
లలనారత్నము లేగి యీఋషులపాలం గల్గునేమంతిశా
లల నాతీరరసాలజాలముల నేలాడోలలం గేళిలీ
లల నాటల్గొని యాడుచుండుదు బాలా కంటివే యిచ్చటన్. ఆ.౨.

ఉ. ఏనెటినైనఁ ద్రిప్పిన హృదింద్రియబుద్ధు లహర్నిశంబు పూ
ర్వానుభవాభిలాషవిషయంబులకే చను వాని మల్పి నా
నానిగమాంత శాస్త్రవచనశ్రవణాదుల నిల్పు తత్సమా
ధానమె మన్మనఃపరనిధానముగాఁగొని యభ్యసించెదన్. ఆ. 3.

ఉ. యోగిజనాశ్రితానిలనియోగము సాధకలక్ష్యలక్షణో
ద్యోగము దేవదత్తనినియోగము నంతతముక్తి కామినీ
భోగము నిత్యసత్త్వగుణపూగము దృష్టపరాత్మజీవసం
యోగమునొందజేయుభవయోగవియోగమురాజయోగమున్. ఆ-౪

మ. జనకుం గాంచితి భేదవాదమతముల్ చెండాడితిక్ శక్తివా
దిని భంగించితి నాగమాంతమతముక్తి న్నిల్పి మెప్పింప న
గ్గని మోదించినముక్తికాంతను మహాకల్యాణయుక్తంబుగా
నెనయంగూర్చె నతండు దానిఁగొని యే నేతెంచితి న్వేడుకన్. ఆ.౫.

---

106. వేగినాటి కొండనార్యుఁడు

ఈకవి వివేకసింధువనెడి యైదాశ్వాసముల వేదాంతగ్రంథమును రచించెను. ఇతఁడు వేగినాటి నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు. మొట్టమొదట నీవివేక సింధువును నాంధ్రవచనకావ్యమునుగా రచియించిన ముకుందయోగిని కవి యీక్రింది పద్యమున స్తుతించియున్నాఁడు—

మ. వినుతింపన్ భవరోగవైద్య మగునీవేదాంత శాస్త్రంబు పా
వనమైయుండఁ బ్రబీణతన్ వచనకావ్యం బొప్పఁగాఁ జేసి స
జ్జనులం బ్రోచినపుణ్యమూర్తి విమలస్వాంతుండు విజ్ఞానశా
సనుఁడైనట్టిముకుందమౌనికి నమస్కారంబు గావించెదన్.

ఈకవియు నూఱేండ్ల క్రిందట నుండియుండవచ్చును. శుకచరిత్రమునందు వలెనే యీవివేకసింధువునందును వ్యాకరణ విరుద్ధములైన ప్రయోగములు కొన్ని కనఁబడుచున్నను మొత్తముమీఁద కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవనరీతి తేటపడుటకయి వివేకసింధువు నుండి కొన్నిపద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి—

చ. కడువడిఁ గర్మమూర్గ మనుకాఅడవిం బడి విభ్రమించుచున్
జడమతి నింద్రియార్థఫలసంచితతిక్తకషాయసారముల్
దడఁబడఁగ్రోలి దుర్వ్యసనదాహమునన్ వెగ డొంది సుక్రి మీ
యడుగులు గాంచితిన్ ననుఁ గృపామృతమానఁగనిచ్చిప్రోవవే. ఆ ౧

మ. వడిగాఁదీసి ధనుర్ధరుండు విడువం బాణంబు నెందాఁక న
వ్వడిగల్గున్ శర మంతదాఁక నడుచున్ వచ్చిన యచ్చోటనే
పడుఁ బ్రారబ్ధపుఁగర్మవేగమున నాపర్యంతమున్ దేహముల్
పడ వావేగము తూలినం బడును జూ భగ్నంబులై మేదినిన్. ఆ-౭

మ. సమతన్ మేఘుఁడు వారిధారలు మహిన్ సంప్రీతి వర్షింపఁ బ
ల్లములై యుండినచోట్ల నీరు నిలుచున్ రక్షింపఁగాబండపై

దుముకున్నీగము నిల్వ దల్లగుట నెందుం బాత్ర మూహించి యు
త్తమునందుం దగబ్రహ్మవిద్య నిలుపఁ ధర్మంబు చింతింపఁగన్. ఆ-3.

మ. తనువుల్ స్వప్నమనోరథంబులక్రియన్ దండోపతండంబులై
యనయంబుం బొడచూపుఁ బోవు నిని కర్మాధీనసంప్రాప్తముల్
ఎనయ న్నాకును వీనితోఁ దగులు లే దెల్లప్పుడుఁ నే ఘనుం
డను నిత్యుండ నిరామయుండ వినులుండఁ సాక్షిచైతన్యుఁడన్. ఆ-4

ఉ. అప్పుడు పుట్టినట్టిశిశువందును జవ్వనియై మిటారియై
యొప్పులకుప్పయైన వికచోత్పలలోచనయందు వాగ్ధికం
బుప్పతిలంగ నున్నముదియుగ్మలియందును నిర్వికారుఁడై
చెప్పెడి దేమి యెందు సమచిత్తుఁడు పండుఁడ యెంచిచూడఁగన్. ఆ-5

---

107. వా సు దే వ యో గి

ఈ కవి జీవప్రబోధమనెడు నాలుగాశ్వాసముల వేదాంతగ్రంథ
మును రచియించెను. యోగశాస్త్రములనుపేర రచియింపఁబడిన వేదాంత
గ్రంథములలో ననేకములకంటె నిందలి కవిత్వము సలక్షణమయి హృద
యంగమముగా నున్నది. కవి యేకాలపువాఁడో తెలియదుగాని నూఱు
సంవత్సరముల పయివాఁడని తోఁచుచున్నది. జీవప్రబోధములోని రెండు
పద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. అనవిని జీవుఁ డిట్లనుఁ బ్రయత్నముఁ బ్రాప్యపదంబు లేక తా
ననయము ఖండమై జగములందును గారణకార్యరూపతం
బెనఁగొనియున్న యాత్మ కొకపిండపదంబుఁ బ్రయత్నసాధన
బును ననఁ గల్గునే యనుచు బుద్ధికిఁ దోఁచెడి వీనిఁ జెప్పవే. ఆ-3.

ఉ. అంధతమఃప్రకృత్యనుగతాత్మల శుద్ధశరీరశుద్ధిచే
బంధవిముక్తి గోరి కరిభంగిసి నీట మునుంగ దేహదు
ర్గంధము వాయుఁగాక భవకర్మనిబంధవిముక్తి కల్గునే
బంధురరాగదోషములఁ బాసిన శుద్ధతఁ గాక జీవుఁడా. ఆ-4.

108. కొనాల నరసింహకవి

ఈ కవి హరివంశములోని యాశ్చర్యపర్వమునందలి శేషధర్మముల నెనిమిదాశ్వాసముల పద్యకావ్యమునుగా రచియించెను. ఈతఁడు నంద వరీక నియోగిబ్రాహ్మణుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; వేంకటేశయామాత్య పుత్రుఁడు; ఈతని వాసస్థలము తటిగొండగ్రామము; ఇతఁడు తన శేష ధర్మగ్రంథమును తత్తికొండ నృసింహస్వామి కంకితము చేసెను. ఈతనికాల మేదియో తెలియరాలేదు. ఇతఁడు తన గ్రంథమునందు—

"గీ. ఆంధ్రవిద్వజ్జనాచార్యు నన్నపార్యు
సుజనగుణమానసోత్పలసోము సోము
సురుచిరాలంకృతిభ్రాజి సోమయాజి
సత్కవిసనాథు శ్రీనాథు సన్నుతింతు."

అని యాంధ్రకవులకు వర్ణించుచోఁ దమనందవరీకులలో సుప్ర సిద్ధులైన పెద్దనాదికవులనుసహితము వర్ణించియుండలేదు. ఇంతమాత్ర ముచేత నితఁడు పెద్దనాదికవులకంటెఁ బూర్వుఁడనికాని వారితోడి సమ కాలికుఁడనికాని చెప్పవలనుపడదు. ఇతఁడించుమించుగా నూఱు నూట యేఁబది సంవత్సరములక్రిందట నుండి యుండవచ్చును. అక్కడక్కడఁ గొన్ని విలక్షణములైన ప్రయోగము లున్నను కవిత్వము మొత్తము మీఁద మృదువయి నిరర్గళధార కలదిగా నున్నది. ఈతని శేషధర్మముల లోనుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.

చ. పటుతరమేఘమండలవిభాసితసౌధచయోపరిస్థితో
త్కటవరహేమకుంభసముదాయథగద్ధగితోరుకాంతివి
స్ఫుటచపలాకృతి న్మెఱయుఁజూడఁగ వచ్చినవారలెల్ల ని
చ్చటఁ గలచంచలల్ కడునచంచల లంచుభ్రమింతురెంతయున్. ఆ-గ

చ. ఘనవిషజంతుపూరిత మగాధము కూపము దీనిఁజూడు నీ
వొనరఁగఁ గూఁతు నియ్యవు తినోదక మియ్యవు గాన దాన మూ

తనువులు జీర్ణతం బొరసె దారుణరూప సమేతకూపమం
దును బడియున్నవార మతిదుఃఖసమాకులతన్ మహాత్మకా. ఆ-౨

శా. దారాపత్యయుతుం డకించనుఁడు విద్వాంసుండు వేదాంతమా
ర్గారూఢుండును వృత్తిహీనుఁడును నిత్యానందుఁడున్ శ్రోత్రియుం
డై రాజిల్లిన బ్రాహ్మణోత్తమున కత్యానందులై జీవనం
బీరే దాతలు పొందరే సుగతు లుర్వీశా ధరామండలిన్. ఆ-3

ఉ. నీసము లెందఱో శమనునిం గనఁబోయిరి నీకుఁజావురా
దాసకుఁ బుట్టినిల్లయి మహాకలుషంబు లొనర్చి సభ్యులన్
మోసముచేసి నేఁ డిటులుమాల్గినఁ బోవునె తత్ఫలంబు నిన్
బాసినఁ గల్గు మా కఖిలభాగ్యము లేగుము కాలుప్రోలికిన్. ఆ-౨

మ. అనుచున్ దూతి మహీవరా సుతకళత్రార్థంబుగాఁ బాపచిం
తన లర్థార్జనఁజేసి వారి నిరవందం బ్రోతు రంతంబునన్
దనవెంటం జనుదెంతురే కడపటన్ దా నొక్కఁడే పోవుటల్
గనియున్ మోహలతానిబద్ధు లగుచున్ గానంగలే రింతయున్ ఆ-౪

మ. సతియుం దానును బుత్రపౌత్రయుతుఁడై సంప్రాప్తసర్వేష్టుఁడై
యతిసంతోషముమీఱఁగా మెలఁగి దేహాంతంబునన్ లోకపా
లతతుల్ పూజ లొనర్ప సర్వసుఖసంప్రాప్తుండునై క్రమ్మఱన్
క్షితిపైఁ బుట్టును జక్రవర్తి యగుచున్ జ్యేష్ఠోముదంబొప్పఁగన్. ఆ-౬

చ. పొలుపగు కాంచనంబుఁ దిలపుష్పము నచ్చెలి నాసికోపమం
బలరఁగవచ్చి దానిసమ మాటకుఁజాలక యూర్ధ్వదృష్టిఁ గొ
మ్మలఁ దలక్రింపుగాఁ దపము మానుగఁజేసి ఫలించువేళ మే
నులు విడిచెన్ నలంగఁడె ఘనుండయినన్ బలవద్విరోధియై. ఆ-౭

ఉ. నీవును దీపదానములు నెమ్మిగఁ జేయుము దాన మోక్షమున్
శ్రీవరుఁ డిచ్చుజ్ఞానమును జేకురు జ్ఞానముచేత మోక్షమున్
భూవర నీకుఁ గల్గు హరిపూజ లొనర్పుము కార్తికంబునం
దీవిలఁ తిహాసము మహిన్ వినువారికిఁ గల్గుసౌఖ్యముల్. ఆ ౮

109. రామనామాత్యుఁడు

ఈకవి గయోపాఖ్యాన మనెడి రెండాశ్వాసముల ప్రబంధమును మును రచియించెను. ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; తిమ్మనమంత్రి పుత్రుఁడు. గయోపాఖ్యానమునకు కృష్ణార్జున సంవాదమని నామాంతరము గలదు. ఈతఁడు నూఱుసంవత్సరముల క్రిందటివాఁడయి యుండవచ్చును. ఇతఁడు తనగ్రంథమును శ్రీమదహోబిల నృసింహస్వామి కంకితము చేసెను. ఈతని గ్రంథమునందు లక్షణవిరుద్ధములైన ప్రయోగములనేకము లున్నను, మొత్తముమీఁద కవిత్వము సరసముగానేయున్నది. గయోపాఖ్యానములోని పద్యములు రెండిందు క్రిందఁ జేర్పబడుచున్నవి.

ఉ. వారిజనాభ నీవనుప నాసవనందనుఁ డున్న చోటికిఁ
జేరి హిమాద్రిధైర్యనకుఁ జెప్పితి బుద్ధులు పెక్కురీతులన్
భూరిదయాబ్ధి యీఘనునిబుద్ధికి నేమని యెంచిచూప నీ
ధారుణిఁ బాండవేయులకు దాపునుదండయు నీవెకా హరీ. ఆ. ౧.

ఉ. ఏమని చెప్పవచ్చు బలి యీబలపార్థుల బాహువీర్యముల్?
రామునిసాటి పత్తురు శరాసనవిద్యకు వీరిధైర్యముల్
హేమమహీధరంబునకు నెక్కువ వీరలతోడ మాకొకానన్
సోమధరుండు వాసవుఁడు సూర్యకులోద్భవుఁడైన నోర్తురే. ఆ. ౨.

---

110. హోచన

ఈకవి చంద్రాభ్యుదయ మను ప్రబంధమును. రచియించెను. ఇతఁడు వైదిక బ్రాహ్మణుఁడు. ఈతనితండ్రి నృసింహసోమయాజి. ఈ చంద్రాభ్యుదయము అమ్మనమంత్రి కుమారుఁడగు చిన్నయామాత్యున కంకితము చేయఁబడినది. ఈకవికాల మేదో తెలియరాలేదు. ఇతఁడు నూఱుసంవత్సరములకంటెఁ బూర్వమునందుండినట్లు తోఁచుచున్నది. ఈప్రబంధము శబ్దాలంకారములతోనిండి శ్రావ్యముగా నున్నది. చంద్రా

భ్యుదయములోని పద్యములు రెం డిందుక్రిందఁ బొందుపఱుపఁబడు చున్నవి—

చ. తిమిరపుజవ్వనంబున నతీతసతీతనువృత్త మైనచి
త్తమునను పౌరవారవనితా జనతాజనితానురాగయో
గమున మునింగి దర్పకవికారము తోరముగా ఘటింప న
క్కొమరుమిటారిబారిపడి కుంతితవృత్తిఁ గ్రమక్రమంబునన్. ఆ. ౧.

చ. అన విని గుండె జల్లుమన నవ్వనితామణి యమ్మచెల్ల యీ
యన మదనాతురత్వమని యాత్మఁదలంచి తలంచి సాధ్వసం
బును వెఱఁగుం దడంబడఁగఁ బొంపిరి నిట్లను భర్త తోడ ని
య్యనువునమిమ్మఁబ్రోవఁగమహాత్మయెరుల్ మన కెవ్వరియ్యెడన్ ఆ.-౩

---

111. పెనుపల్లె బాపనామాత్యుడు

ఈకవి సీతావిజయమను నేకాశ్వాసప్రబంధమును రచించెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; కోనయామాత్యపుత్రుఁడు. ఈతని కవిత్వమునందు లక్షణవిరుద్ధములై నప్రయోగము లక్కడక్కడఁ గానఁ బడుచున్నవి. కవనరీతి తెలియుటకయి సీతావిజయమునుండి రెండు పద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

ఉ. పోల శతాసనుండు శివపూజ యొనర్చుచు నుండి యంతలో
నాలమువార్త కర్ణములయంచు వినంబడ నుల్కయుగ్రుఁడై
చాలును దేవపూజయని చారులఁ గన్గొని యేమి మత్పురిం
జాలఁగ నందడు ల్గలుగుచందము తోఁచెను జెప్పుఁ డంతయున్.

ఉ. భూరిరయంబునం దొడరి భూసుత కన్నుల నెట్టచేసి యో
రోరిశతాస్య త్రుంగి తని యొక్కటి బాణసహస్రకోటి తా
నారజనీచరేంద్రు తనువందును గ్రుచ్చిన నెత్తు రొల్కఁగాఁ
బోరుచు వాఁడు నొప్పెసఁగెఁ బూచిన మోదుగుచెట్టుకై వడిన్.

---

112. చదువుల సోమలింగయ్య

ఈ కవి మదనసాయక విలాసమనెడి యైదాశ్వాసముల శృంగార ప్రబంధమును రచియించి శ్రీశైలమల్లి కార్జునున కంకితముచేసెను. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు; గారుత్మతద్యుతిగోత్రుఁడు. వేంకటాచలమయూరాథ్వ్యనకును అన్నపూర్ణమకును పుత్రుఁడు. ఇతఁడేకాలపువాఁడో సరిగాఁ దెలియరాదు. ఇతఁ డించుమించుగా నూఱుసంవత్సరములక్రిందట నుండియుండును. ఈతని కవిత్వము మృదుమధుర పాకమున వెలయుచున్నను నిర్దుష్టమెనదికాదు. ఒకొకకయాశ్వాసమునుండియొకొకటిచొప్పున నిందుక్రింద నుదాహరింపఁబడిన పద్యములనుబట్టి కవియొక్క కవిత్వరీతి కొంతవఱకు తేటపడవచ్చును—

చ. చని శశికాంత సంఘటితచారుసువర్ణవికారసౌధమం
దును నెనలేని గద్దెపయి దోరముగాఁ గొలువుండి సాధుస
జ్జనపరివారయుక్తుఁడయి సత్యముఁ దప్పక మూఁడులోకముల్
తనదుయశంబు గప్పుగను దద్దయు రాజ్యము చేయుచుండఁగన్. ఆ-౧

చ. అని దరిఁజేరి బాలకుని నక్కునఁజేరిచి చెక్కుదోయి ము
ద్దొనరిచి చుంచు దువ్వుచు మృదూక్తులు పల్కి కడిందిప్రేమ నె
మ్మనమున నల్లి బిల్లికల మాటికి నల్లుకొనంగ నక్కుమా
రునిముఖచంద్రదర్శనవిలోచనకైరవుఁ డొచు నయ్యెడన్. ఆ. ౨.

చ. తెలివారుమంజిమున్తెములు తీరుగనిల్పిన క్రేవఁ జక్కనౌ
బలువగు కెంపుగుంపుల శుభస్థితకాంతులు చల్లుమేలుక
మ్మలకు నివాళులిచ్చి కనుమచ్చికలున్ జెలువొందఁ దాని పు
వ్వులసర మొక్కకేల నిడి యొప్పుగ నప్పురి కేగుచుండఁగన్. ఆ-3.

ఉ. ఉల్లము చల్లగాఁ గనినయొప్పులకుప్పపయిన్ సుమాస్త్రముల్
పెల్లుగ నేసినట్టికడు పెద్దపు నీ కొకలక్ష్యమా నవో

తుల్లసరోజలోచనలపొంక మమంచుట మన్మథా థరక్
తల్లికి ముక్కకోసె పినతల్లికిఁ గమ్మ లొసంగనేర్తురే. ఆ-ర.

ఉ. మారుఁగేరు వీసి సుకుమారశరీరము నవ్యచంద్రికా
సారముతీరు హాసము సుసారససారము లౌర కన్ను లిం
పారెడు గండుతుమ్మెదలబారులనే ల్కురు లౌర వీసిసిం
గారము నీరజాసనునికైన మదిం దలఁపంగ శక్యమే. ఆ-గి.

---

113. శ్రీధరమల్లె వేంకటస్వామి

ఇతఁడు బ్రహ్మోత్తరఖండము నయిదాశ్వాసముల పద్యకావ్య మునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు బడగలనాటి కన్నడవంశజుఁడు; ఆశ్వలాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; అయ్యనార్యతనూజుఁడు. కవి యీ గ్రంథమును జ్యోతిరామనాదుల ప్రేరణముచే రచియించి, సిద్ధవటమునకు సమీపమునన్న యంబాపురమందలి పార్థివేశ్వరస్వామి కంకితము చేసెను. ప్రేరకులయిన రామనయు లక్ష్మీనారాయణుఁడును జెంగల్వరాయఁడును దన్నుఁగూర్చి పలికినట్లుగాఁ గని యీ క్రిందిపద్యములలోఁ జెప్పుకొన్నాఁడు—

శా. శ్రీమద్వేంకటరామనామునిఁ గవిశ్రేష్ఠున్ రమావల్లభ
ప్రేమాపాంగవిశేషలబ్ధకవితాభివ్యక్తసూక్ష్మస్థితుం
గామారిస్తవభక్తియుక్తు విలసద్గాంభీర్యధైర్యాఢ్యు న
న్నామోదంబునఁ జూచి పల్కిరి సముద్యత్కౌతుకం బొప్పఁగన్.

* * * * *

క. ఖండేందుధరప్రియ మా । ఖండలభాగ్యప్రదంబు కల్మషలతికా
ఖండన మగుబ్రహ్మోత్తర।ఖండముఁ రచియింపుపద్యకావ్యముగాఁగన్.

ఈ కవి యీ బ్రహ్మోత్తరఖండమును రచియించి యెనుబదిసంవత్సరము లయినట్టు గ్రంథాంతమునందలి యీక్రింది పద్యమునుబట్టి తెలియవచ్చుచున్నది.—

సీ. శరవర్ష గణనంబు శైలరామమునీందుపరిమితంబై ధాత్రిబరగుచుండు
యువనామసంవత్సరోపేత కార్తికమాసరాజిత పౌర్ణమాసియందు
ధన్యులు విష్ణువర్ధనసగోత్రులు జ్యోతిసుబ్బన్న పుత్రులు సుగుణమణులు
రామన్నలక్ష్మినారాయణచెంగల్వరాయుఁడు ననముప్పు రమలయశులు
చిత్తమున భక్తి వెలయ బ్రహ్మోత్తరాఖ్య
ఖండ మాంధ్రప్రబంధంబుగా ఘటించి
యెలమి సంబాపురపు బార్థి వేశ్వరునకు
భాసురముగ సమర్పణ జేసి రపుడు.

పయిపద్యమునుబట్టి శాలివాహనశకము ౧౭౩౭వ సంవత్సరము నందన్నగా క్రీస్తుశకము ౧౮౧౫వ సంవత్సరమునం దీగ్రంథము రచియింపఁబడినట్టు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈగ్రంథమునం దక్కడక్కడఁ గొన్నివ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁదఁ బుస్తకము హృదయరంజకముగానేయున్నది. బ్రహ్మోత్తర ఖండములోని పద్యములు కొన్ని యిందుదాహరింపఁబడుచున్నవి—

ఉ. ఓమునిసార్వభౌమ మహిమోజ్వల మీ రిట కేగుదెంచుటఁ
నామది సంతసం బొదవె నాదుగృహంబు పవిత్ర మయ్యె మ
త్కామితము ల్ఫలించెఁ గడుధన్యుఁడ మాన్యుఁడ నైతి నంచు నా
భూమివిభుండు పల్కఁ జను బూజలొనర్చె మహాముదంబునన్ ఆ.౧

శా. ఆరాజేంద్రుఁడు కంఠసూత్రరహితాన్ దవ్యక్తాంజనాపాంగి శృం
గారప్రాభవహీనగాత్రి గళితగ్రైవేయహారాదికన్
దూరీభూతశుభాంగరాగతిలకన్ దుర్వారశోకార్దితన్
సారాచారపరాయణం గనియె నాసాధ్వి న్విచిత్రంబుగన్. ఆ. 3.

మ. రణదుద్యన్మణిదీప్యమానకనకగ్రైవేయకోటీరకం
కణహారాంగదనూపురాదుల నలంకారంబు గావించినక్
క్షణమాత్రంబున బాయఁద్రోచి కడువేడ్కల్మీఱ రుద్రాక్షభూ
షణము ల్దాల్చుర వారలిర్వురు మహాసోత్సాహంబుదీపింపఁగన్. ఆ-౪

---

114. ఓరుగంటి సోమశేఖరకవి

ఈకవి రామకృష్ణార్జున రూపనారాయణీయమను నాలుగాశ్వాస ములత్ర్యర్థి కావ్యమును రచియించి శ్రీపూసపాటి నారాయణరాజుగారి కంకితము చేసెను. పుస్తకముయొక్క పేరుచేతనే యిందు రాఘవయా దవపాండవార్థము లీమిడియున్నవని తెల్లమగుచున్నది. ఈకవి వైదిక బ్రాహ్మణుఁడు; కౌండిన్యసగోత్ర సంభూతుఁడు. ఇతఁడు సంస్కృతాం ధ్రములయందు చక్కని వైదుష్యము కలవాఁడయి కవితారచనయం దత్యంత సామర్థ్యము గలవాఁడుగా నుండెను. ఇతఁడు నూఱుసంవత్సర ముల లోపలివాఁడు. ఈతని త్ర్యర్థికావ్యములోనివి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

శా. సంభూతాతివిభూతి దర్శనకళాసంపన్ను డారాజు స
ద్గాంభీర్యాంబుధి యేలె సర్వధరణిన్ గాంగేయచాపోరుసం
రంభప్రాథిసహాయుఁడై విదురసారన్యాయమార్గంబుతో
శుంభత్కీర్తి మహోత్సవప్రియకులస్ఫూర్తుల్ విజృంభింపఁగన్. ఆ-౧

ఉ. సంతస మొప్పఁ దోఁచెను వసంతము మంజులకోకిలస్వనా
క్రాంతము కోరక ప్రకర కాంతము బంభరగానశోభితా
శాంతము సర్వమంగళనశాంతము మోచితమానమానినీ
స్వాంతము ధూతసత్పథికశాంతము ఫుల్లలతాంతతాంతమై. ఆ. ౨.

చ. సుజనకృత స్తవా జనకసూ క్తి యలంఘ్య మదెన్ని చూడఁదా
నిజము సమక్షమందుఁ దగనిన్ను సమర్థసిగాఁ దలంచి త
ద్ద్వ్రజము నుతింపఁ బంచుపని వారకచేయ సుధర్మసంస్థిక్
గుజనులు స్రుక్క- శ్రీహరిని గొల్చినవాఁడనయంబు నెమ్మదిన్. ఆ.3.

శా. కళ్యాణీభవదర్పితో గ్రవరసత్కారుణ్యతక్ సద్వ్యపత్
కళ్యాణీధరవిష్ణువన్యవసతీకాండప్రభూల్లంఘనా
కళ్యాణాతిశయంబు నాకు నిచటన్ గల్గె న్ని రాఘాటమై
కళ్యాణాంబరకాంతుఁజేయుముక్యపన్ గాంభీర్యధీ్రమొక్కెదన్. ఆ. ర.

---

115. ముడుంబి వేంకటాచార్యుఁడు

ఈకవి రసప్రదీపికయనెడు మూడాశ్వాసముల వైద్యగ్రంథమును జేసెను. ఇతఁడు శ్రీవైష్ణవుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వేదాంతాచార్యపుత్రుఁడు. ఇతఁడు గోదావరీమండలములో నూఱుసంవత్సరములకు లోపలనుండినవాఁడు. కవిత్వమునందుఁ గొన్ని స్ఖాలిత్యములు గలవు. రసప్రదీపికలోని రెండుమూడుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. పారదగంధకంబు లొకభాగము నాలుగుభాగముల్ నవా
సారము కుప్పెఁబెట్టి పదిజాములు వండినఁ గెంపుసొంపుతో
ధారుణిఁ బుట్టు సిందుర ముదారత నడ్డిగయెత్తు నిచ్చినన్
బోరన రోగపుంజములఁ బోవహరించు నమోఘవీర్యమై. ఆ ౧.

చ. ఘృతమునఁ గొండపిప్పలి మిరెంబులతోడుత నభ్రకంపు సం
తతమును జిన్నమెత్తు గొన దారుణమా కఫవాతపిత్తసం
యుతగ్రహణీక్షయంబుల వియుక్తప్రమేహగుదాంకురంబులన్
గతముగఁజేసి దీపనము గల్గఁగఁజేయు నమోఘవీర్యమై. ఆ.౨.

ఉ. మంచి సువర్ణభస్మము క్రమంబునఁ గొన్నను రాజయక్ష్మముల్
సంచితకర్మజంబులగు సర్వరుజంబుల భూతవేధలన్
ద్రుంచి యమోఘవీర్యమయి దోర్బలముల్ ఘనకాంతి తేజమ
త్యంచితబుద్ధిమార్గము చిరాయువొసంగును మౌనిచంద్రమా. ఆ-3.

---

116. అక్కినపల్లి నృసింహకవి

ఈ కవి యాదిలక్ష్మీవిలాసము, పల్లభాంబాపరిణయము, శ్రీఘవతీ పరిణయము, అను మూడు ప్రబంధములను రచియించెను. వీనిలో నోఘవతీపరిణయము శ్రీగొడే జగ్గారాయనింగారి పుత్రులగు శ్రీసూర్యప్రకాశరాయనింగారి కంకితముచేయఁబడి తమ్మోనిరపుత్రులగు శ్రీమహారాజా గొడే నారాయణగజపతిరాయనింగారిచే ముద్రింపింపఁబడినది. ఈగ్రంథము శాలివాహనశకము ౧౭౩౯ వ సంవత్సరమునందు రచింపఁబడినట్లు గ్రంథాంతమందలి యీ సీసపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

సీ. శాలివాహనశకసంవత్సరంబు లజాగ్నిభూధరతుషారాంశులైన
యీశ్వరాబ్దంబున నెసఁగు వైశాఖమాసంబున శుక్లపక్షమున మూర్తి
శశిసంఖ్య భౌమవాసరమున శుభవేళ నక్కినేపలి నృసింహకవి యోఘు
వతిపెండ్లికథ సమున్నతివిమానమెడి గొడెజగ్గారాయసూర్యప్రకాశరాయ
మణికిరాజ్యాయురారోగ్యమహితపుత్ర
పౌత్రనికరాభివృద్ధిగా భవ్యబుద్ధిఁ
గృతి యొసంగెను దద్యశం బతిశయిల్లి
జగతి నాచంద్రతారార్కముగఁ జెలంగ.

ఇతఁడు కృష్ణామండలములోని యెల్లమండ నివాసుఁడయినను తన యాదిలక్ష్మీవిలాసమును గోదావరీమండలములోని యంతర్వేది

నృసింహస్వామి కంకితము చేసెను. ఆదిలక్ష్మీవిలాసము నాలుగాశ్వాస ములుగల ప్రౌఢకావ్యము. వల్లభాంబాపరిణయ మను విఘ్నేశ్వరుని పెండ్లికథ మూడాశ్వాసముల ప్రబంధము. ఇది పులిపాక సీతయామాత్య పుత్రుఁడయిన రామమంత్రి కంకితము చేయఁబడినది. ఈకవి నియోగి బ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; జోగయామాత్య పుత్రుఁడు. ఈకవి నూఱుసంవత్సరములకు లోపలివాఁడు. ఈతని కవిత్వము రసవంతముగా నున్నది. ఈతని పుస్తకములోని యీ క్రింది పద్యములవలన నీతని కవితా ధోరణిని గొంత తెలిసికొనవచ్చును—

ఆదిలక్ష్మీవిలాసము.

ఉ. మాయలు నింద్రజాలములు మా కవి క్రొత్తలుగావు మామనో
నాయక యిప్పు డీవు రతినాయకసాయకభిన్నకాయనై
పాయసి మోహమందుననుఁ బన్నుగఁ గౌఁగిటఁగూర్చి యొయ్యనఁ
శ్రీయుతసౌఖ్యవై ఖరులుచేరఁ నలంపులుదీఱఁ గూడుమా. ఆ-౧.

ఉ. ఎక్కడిగొల్లవాఁడ విది యెక్కడిజాణతనంబు దొంగవో
యెక్కడిపౌరుషంబు మది నింత తలంపక ప్రాలుమాలినన్
దక్కునె నీకుఁ గోక లవి తక్కకయిమ్మోకఁ గామవల్లివే
యక్కలతోడ నీసరసి నాడఁగఁ జీరలు దొంగిలింతువే. ఆ-౨.

ఉ. వారిజనేత్ర మీచరణవారిజముల్ హృదయాంబుజంబునఁ
గూరిమినిల్పి యెల్లపుడుఁ గొల్చుచరమాసతియంచు రుక్మిణుం
దారయలేక చైద్యునకు నంగన నిచ్చెదనన్నమాట బ
ల్మారసమట్ల కర్ణమున నాఁట ననుం గృపఁ గాంచి యిట్లనెన్. ఆ-౨.

వల్లభాంబాపరిణయము.

చ. అరయఁగ సిద్ధసాధ్యగరుడామరకిన్నరనాగయక్షకిం
పురుషులయిండ్లలో నెలమిఁ బుట్టెదఁ జేసెదపొట్ట మీగణే

శ్వరునకు, బెద్ద దేల యనిశంబును బొట్టిగ బ్రహ్మచారివై
పర, గెడిమేటికిక్ గతినభావులతో నిల వియ్య మేటికిక్. ఆ-౨.

చ. ముద మొదవించు ముచ్చటల ముంచును గంథము, బెంచుసౌఖ్యము
ల్గుమర, గ నించు నించువిలుగొంచు, జరించువజీరుశాస్త్రసం
పద గడియించు సత్కురసపద్ధతుల న్నిరసించు మించు ని
ష్పదిరయటంచునెంచుచును మానుగగ్రొవ్విరిమించుబోండ్లొగిన్. ఆ-౩

ఓ ఘ వ తీ ప రి ణ య ము.

ఉ. మేలగుమేలు గూర్చుటకు మీ రరుదెంచితి రంటివౌబళీ
చాలు భవన్మనోరథముచక్కలభించుఫలం బటంచు నా
లోలవిశాలనేత్ర యెదలో, గలతియ్యనివిల్తు నొయ్యనన్
మేలుకొనంగ, జేసి యెలమిం జన సంయమిరాజు సయ్యనన్. ఆ. ౧.

ఉ. అంతట నేర్చె విద్య లిసుమంత కొఅంత యలంతలేక భూ
కాంతునిముద్దుపట్టి యజుకాంతయె యంచుసమస్తసజ్జనుల్
వింతగ సంతసించి తను వేయివిధంబుల సన్నుతింప న
త్యంతకళావినోదమహిమాతిశయంబు శయంబు, జేర, గాన్. ఆ. ౨.

---

117. పైడిపాటి వేంకటనృసింహకవి

ఈకవి నృసింహవిలాస మను మూడాశ్వాసములగ్రంథమును రచియించెను. ఈతడు డాఱువేలనియోగిబ్రాహ్మణుడు; ఆపస్తంబసూత్రుడు; శరమర్షణగోత్రుడు; లక్ష్మీసహితకిని వేంకమాంబకును బుత్రుడు. ఈతడు నెల్లూరిమండలములోని పైడిపాటి గ్రామనివాసుడయిగ్రామచతుష్టయమునందు స్థావరజీవనము కలవాడయినట్లు నృసింహవిలాసములోని యీక్రిందివచనమువలన, దెలియవచ్చుచున్నది—

సీ. క్షితితలంబున నొప్పు కృష్ణాపినాకినీదివ్యనదీమధ్యదేశభూమిఁ
గడుఁబూర్వవార్థికిఁ బడమట యోజనదూరమై తగుఁ గంచుకూరు
మఱియు
నదియె సీమానామమైయొప్పు నాకంచుకూరికిఁదనరు వాయువ్యదిశను
బాలేటి దానికిఁ బాల స్త్యదిశఁ బ్రెఁడిపా డొప్పుదానికిఁ బశ్చిమమున
నెగడుఁ జతుకుపాడు నీబ్యూతి వేంపాడుఁ
జెలఁగు గాడ్పుమూల నిలవరయన
నమరుపురచతుష్టయం బిన తృణకాష్ఠ
జలసమృద్ధి సీరుల నలరుచుండు.

గీ. గ్రహణవేళ గోపరాజు రామన గోల
కొండప్రభువుచేతఁ గొనినదాస
మహిమ దుష్టమతుల మడియించి స్థావర
జీవనములు ద్విజులఁజేర్చె మున్ను

వ. తదీయానుగ్రహలబ్ధం బైనయేతద్గ్రామచతుష్టయ స్థావరజీవనజీవితు
లయిన మదీయవంశజులు ఈఁ.

ఈకవియొక్క కాలమేదియో కానరాచుగాని యితఁ డాధునికుఁ
డయినట్లు తెలియవచ్చుచున్నది. నృసింహవిలాసములోని రెండుపద్యము
లిందుక్రిందఁ బొందుపఱుపఁబడుచున్నవి—

మ. శశి పక్షక్షయ మొన్ని యక్షయకళాసంప్రాప్తికిన్ ధాత్రహ్మా
ద్యశుఁడై దీని సృజించుకాలమున వక్త్రం బయ్యెనో తా మహా
ర్ణిశ మూర్ధ్వస్థితి నుంట రోసి తొలఁగెన్ రేఁబే డటంచుం దదం
ఘ్రిశయూత్రాంతసఖాకృతిం బొలిచెనో క్రిందై క్వచిత్తాకరల్. ఆ-౩

శా. పోరా వేఁటకు వేఁటకాండ్రు గహనంబు ల్గ్రిమ్మరఁ? గ్రమ్మఱఁ
రారా రాత్రిరి కైన? వా రలసులై రాకున్న నారాత్రికై
యీరీతిం దపియించుబోంట్లు కలరే యెంచైనఁ? జంద్రాస్యలా
ఘోరారణ్యముఁ జొచ్చి చూడఁగలరే గోవిందు రేజాములన్. ఆ-3

118. కొటికెలపూడి వేంకటకృష్ణకవి

ఇతఁడు శ్వేతాచలమాహాత్మ్యమను మూడాశ్వాసములగ్రంథ
మును రచియించి, బొబ్బిలిపురాధీశ్వరుఁడగు రాయణప్ప రంగరాజున
కంకితము జేసెను. ఈకవి వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు;
హారితసగోత్రుఁడు; శివరామపౌత్రుఁడు; వేంకటరామపుత్రుఁడు. కృతిపతి
తన్నుఁగూర్చి పలికినట్లు కవి తనగ్రంథములో నిట్లు వ్రాసికొని
యున్నాఁడు—

మ. ననుఁ శ్రీమజ్జనకాత్మజాధిపపదన్యాసప్రఫుల్లాంతరం
గుని వాణీకరుణాకటాక్షకలనాంకూర్భత్సుధామాధురీ
వినుతాంచత్కవితాప్రతోషితమహావిద్వత్కవిగ్రామణిన్
ఘనకార్తాంతికతాండిలేయుఁ గడువేడ్కం బిల్చి తా నిట్లనెన్.

చ. హితులు మదన్వాయజుల కెల్ల బురోహితు లార్యలోకసా
లితకవితాప్రకల్పితదిలీపచరిత్రముఖోజ్జ్వలత్ప్రబం
ధతతులు హారికాగ్రణు లుదారగుణాన్వితచిత్తుల స్మదా
శ్రితులు సమస్తసూరినుతశేషులు లెన్నఁదరంజె మిమ్ములన్.

సీ. ధీరతమేఘసందేశంబు తెనిఁగించి ప్రీతి దిలీపచరిత్ర మనెడు
గొప్పప్రబంధంబుఁ జెప్పి శ్రీరాముల కర్పించితివి మున్ను నేర్పుమీఱఁ
గార్తాంతికులు మెచ్చఁగా శ్రీపతిగ్రంథగతినిమామకజాతకము లిఖించి
మా కొసంగితి విప్పు డేకాగ్రచిత్తత నంచితంబుగఁ దెనిఁగించుచున్న
కూర్మమాహాత్మ్య మొసఁగుము కూర్మమాకు
రమ్యచారిత్ర వేంకటరామపుత్ర
కీర్తిదౌదార్య వేంకటకృష్ణమార్య
యనుచు బహుమతిచేయ నాహ్లాదమునను

కృతిపతిపూర్వులు సర్వజ్ఞసింగమనాయని సంతతివారయిన రావు కులజులయినట్లును, వారిలో లింగపరంగనాయఁడు బొబ్బిలిసంస్థానమును స్థాపించినట్లును, గవి యీ క్రింది పద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హరిపాదంబునఁ బద్మనాయకులు గంగాస్వీతులై యుద్భవిం
చిరి తత్పాదజులం దతిప్రబలులై శ్రీరావువంశ్యు ల్చెలం
గిరి తద్రావు కులీనులం దలరె గాంగేయస్తులౌ దార్యశౌ
ర్యరణోపేతుఁడు రాజశేఖరుఁడు సర్వజ్ఞుండు సర్వజ్ఞుఁడై.

క. ఆలలితాన్వయసంభవు
ఁడలరె నిజభుజాభీలాసిదళితరిపున్నృప
ఫాలాస్థూలస్ఫురత్కపాలుం డగుచున్.

క. బెబ్బులి రిపున్నృపు లసియెడు । గిబ్బల కితఁ డంచు జనులుకీర్తింపఁగఁ దా
బొబ్బిలిపట్టణ మేలెడు । నిబ్బరుఁడగు లింగపావనీవరుఁ డిలలోన్.

బొబ్బిలి చినరంగారాయనికి దత్తపుత్రుఁడును గృతిపతియునైన రాయణప్ప రంగారాయనింగారు ౧౮౧౧ వ సంవత్సరము మొదలు ౧౮౩౦ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసినందునఁ దదాస్థాన కవియైన యీ వేంకటకృష్ణకవి యిప్పటికి డెబ్బదిసంవత్సరములకుముందే యీగ్రంథమును రచియించినట్లు చెప్పవచ్చును. ఈయన కవిత్వమునందు లక్షణదోషములు కొన్ని యున్నను కవనము మృదువయి మధురముగా నున్నది. శ్వేతాచలమహాత్మ్యములోని కొన్నిపద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి—

శా. ఆమాటల్వినిభూవిభుండు నిజభార్యకు సద్భక్తితాస్తోకకిం
శ్రీమన్మాధవభక్తికిన్ బొగడి ధాత్రిం మూఢచిత్తుండనై
భామారత్నముపాటిబుద్ధి గణుతింపం బూనఁగాలేక యీ
సోమార్కం బపకీర్తిపా లయితినంచున్ లోన జింతిల్లుచున్. ఆ-౧.

ఉ. వేరొకభూవరాత్తకుఁడు విద్రుమగుచ్ఛము రత్నకంకణో
దారకరారవిందమునఁ దాల్చె లతాంగి నను న్వరించినన్

భూరిశుభక్రమాకలన బోటిపదాంబుజ మీతెఱంగునం
గూరిమిత్రోడఁ బట్టుకొనఁ గోరెదనంచును దెల్పువాఁడిన్. ఆ-౨.
శా. జంబాలుం డనువాని కొన్నిదినముల్ జాయాన్వితుండై తదు
ర్వీం బుణ్యస్థితినుండి గర్భవతినారిం బాసి స్వర్గంబు చే
రంబోవంగ శమీసమీపమున గర్భస్థార్భకుం బెట్టి నె
య్యం బొప్పారఁగఁ జేసెఁ దత్తరుణి దా నగ్నిప్రవేశంబొగిన్. ఆ-3.

---

119. కాకరపర్తి కృష్ణకవి

ఈ కవి శశిరేఖాపరిణయము, ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము అను కావ్యములను జేసెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; తిరుపతి పాత్రకవికిని సీతమాంబకును తనూజుఁడు. ఈపాత్రకవి సత్యభామాకృష్ణ సంవాదాది గ్రంథములను రచియించి శ్రీమహారాజా గొడే నారాయణ గజపతిరాయనింగారి పూర్వుఁడైన జగ్గారాయనింగారివలన అగ్రహారాదు లను బడసెనఁట. ఈకృష్ణకవి విశాఖపట్టణ మండలముఁగోసివాఁడు: ప్రపౌత్రుఁ డిప్పుడు జీనించియుండుటచే నితఁడు నూఱుసంవత్సరముల లోపలివాఁడు. ఈయనకవిత్వము దోషరహితమయి హృదయంగమముగా నున్నది. కవికృతపుస్తకద్వయము నుండియు రెండేసిపద్యముల నుదాహరించుచున్నాను—

ముఖలింగక్షేత్ర మాహాత్మ్యము.

చ. అరుదుగ సర్వలోకనిచయం బతివేలఘనాంధకారభీ
కరవిపదబ్ధిలోఁ బడ నకారణవైరమునన్ వసూజ్జ్వల
త్తరణిముఖప్రచారములు తప్పఁగఁజేయుచు నన్నిదిక్కులన్
బెరిఁగెను వింధ్యభూధరము పీతమహాంబునిధీ తపోనిధీ. ఆ-౧.

ఉ. ఈనగవైభవాతిశయ మెన్నఁగ శక్యమె ధాతకైన జాం
బూనదకాహ్యరత్న ముఖభూరిమనోహరవస్తువిస్ఫుర
త్తానుచరస్మరుద్దనుజచారణకిన్నరసిద్ధసాధ్యసం
తానసమృద్ధి నొప్పు వితతంబగు మేరునగంబుకైవడిన్. ఆ-3.

శశిరేఖాపరిణయము.

ఉ. మానుల నెట్లుపోచితివొ మానసవీథిఁ దలంపఁ బాపముల్
మానకధార్తరాష్ట్రుఁ డవమానమునుం దగఁజేయుచుండెఁ గృ
ష్ణానను గావవే యనెడునాపలు కిప్పుడొకించుకైన నీ
వీనుల సోఁకకుండు టిదివింత జనార్దన కంసమర్దనా. ఆ ౧.

చ. అనవిని వానితోడ విజయాత్మజుఁ డిట్లనియెన్ దురాత్మ యీ
వనమును గుత్తగొంటివిర వచ్చినవారి నెఱుంగ కీవు పొ
మ్మనుటకు నీవె యీజగతియందును విక్రమశాలివా మదం
బున నిటుపల్కఁగాఁ దగదు పొమ్మిపుడూరక వైర మేటికిన్. ఆ-౨.

ఈయిపుస్తకముగాక కోసపల్లి నివాసుఁడగు వేంకటరంగకవి రచితమైన దొకటియు, అప్పప్పయను భట్టరాజ రచితమైన దొకటియు, శశిరేఖాపరిణయ మనుపేర రెండాధునికప్రబంధములు ముద్రింపఁబడియున్నవి. వానినుండియు రెండేసి పద్యముల నిం దుదాహరించెదను—

వేంకటరంగకృత శశిరేఖాపరిణయము.

శా. శుద్ధాంతంబున భైరవార్చనకళాశుద్ధిన్ జరాసంధుఁ డు
ద్యద్ధైర్యంబున నిత్య మొకొఁకనృపుఁ గ్రోధావేశసంభూతస
ద్బుద్ధిం బట్టి కరుక్కరుక్కనఁగఁ దోడ్తో శీర్షముం ద్రుంచి శ
శ్వద్ధాత్రిం బలి యిచ్చుచుండె విలసద్బాహాబలోద్రగుఁడై. ఆ. ౧.

ఉ. అందఱికంటె ముందుగనె హాయిగ మజ్జనభోజనంబు లం
దందు నొనర్చి సాత్యకిసహాయముగా వసుదేవదేవకీ

నందను లవ్విధంబు దళనాయకకోటి కెఱుంగఁ జేసి బల్
దుందుభికాహళాదిపటుతూర్యరవంబులు బోరుకల్గఁగన్. ఆ. 3.

అప్పప్పకృత శశిరేఖాపరిణయము.

ఉ. అన్నలు మాటలాడుసమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్నయశాలి యైనముసలాయుధుఁ గన్గొని నీమఱందియున్
నన్నిటఁ బంపుచుండి పరిణామము వేఁడె భవత్కుమారియా
కన్నియ మత్సునాగ్రణికిఁ గారుణికోత్తమ పెండ్లి చేయవే. ఆ. ౧.

ఉ. పోరున ధార్తరాష్ట్రులను భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరిని మిక్కిలిన్ భయముఁ జెందఁగఁజేసిననీపరాక్రమం
బౌర నుతింప వ్యాళపతి కైనను శక్యము గాదటంచు నా
మారుతిపుత్రునిం బొగడి మక్కువతోడఁ గిరీటి యంతటన్. ఆ-౪

---

120. కృష్ణయ్య

ఈకవి పార్వతీపరమేశ్వరపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఈతఁడు స్మార్తబ్రాహ్మణుఁడు; భారద్వాజ గోత్రుఁడు; చంచయార్యపుత్రుఁడు. ఈతని వాసస్థలము పినాకినీతీరము నందలి కామలాపురము. ఈతఁడుండినకాల మేదియో తెలియరాదుగాని యితఁడేబది యఱువదియేండ్లక్రిందటనుండిన ట్లూహింపఁదగియున్నది. ఈతని కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణ దోషములు గలవుగాని మొత్తముమీఁదఁ గవిత్వము శ్రావ్యమయి కొంతవఱకు శ్లాఘ్యముగానే యున్నది. పార్వతీపరమేశ్వరపరిణయములోని పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను—

ఉ. ఆపురిఁ గాంచి నిగ్గరు లహర్నిశమున్ మదిలోన నెన్నుచున్
గాపుర మున్న నాకమునకంచెను మేలని చూచువేడుకన్

దాపునఁ జేరిరో యనఁగఁ దత్పురసౌధసమీపవర్తులై
గోపవిభుండులోనుగను గొల్చినరీతిగ నుండు రాస్థలిక. ఆ. ౧.
ఉ. ఈవిధి వచ్చువిప్రుఁగని యీశ్వరుఁ డర్ఘ్య మొసంగి యిట్లనున్
భూవినుతార్య మీధరను భూమిసురుల్ సుఖులై చరింతురా
మీవనమందుఁ బుష్పములు మేలగుకాయలు పండ్లు పత్రముల్
కావలెనన్నఁ గల్గుఁగద కారణ మేమిట రా విధాత్రిజా. ఆ. ౨.
. పంచశరుండు నిల్లనుచుఁ బల్కఁ విరించికి సమ్మదంబుగా
మించులమించుశంకరునిమేనిరుచు ల్గన నాకు శక్యమే
మంచిది యేమియైన నిఁక మద్భళముల్ గొలువంగ నేగెదన్
వంచనలేక న న్నిలను వర్తిలఁజూడుఁడు పోయివచ్చెదన్. ఆ. 3.

---

121. తరిగొండ వెంకమ్మ

ఈమె మంచి విద్వాంసురాలు. ఈమె చేసినపుస్తకములు తతి గొండ నృసింహస్వామి కంకితము చేయఁబడినవి. తరిగొండ కడపమండల ములో వాయిల్పాడునకు నాలుగుమైళ్ళదూరములో నున్నది. ఈమెరచి యించిన గ్రంథములలో రాజయోగసార మను ద్విపదకావ్యమును వేంక టాచలమాహాత్మ్యమను పద్యకావ్యమును ముద్రింపఁబడియున్నవి. ఈమె తాను భాగవతము ద్వాదశస్కంధములను ద్విపదకావ్యముగా రచియిం చినట్లు వేంకటాచలమాహాత్మ్యములోని యీ క్రిందిపద్యములోఁ జెప్పు కొన్నది.

సీ. దారునిర్మితవీణ నారూఢిఁ బల్కించు గాయక పురుషునికరణి గాను
బురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నాజిహ్వయందుఁ దావసియించి
యరుదుగాను
బలికించుఁ గావున భాగవతపురాణ మనుత నే ద్విపదకావ్యంబుగాను
ద్వాదశస్కంధము లగఁజెప్పి హరికిసమర్పించి శ్రీవేంకటాద్రిమహిమ

మతనిపై రమ్యపద్యకావ్యంబు చేసి
శ్రీనివాసునకే సమర్పింపనుంటి
నీగ తోయధిఁ దాటఁబోయినవిధమున
నాస్వతంత్రత కిల బుధు ల్నవ్విపోరె.

ఈ పుస్తకములోని—

క. అల కాశినుండి వెలువడి । వలనుగ మాకొఱకు వందవరపురమందే
నెలకొనికులదై వతమై।యలరుచుమమ్మేలుచౌడమాంబనుగొలుతున్.

అను పద్యమునుబట్టిచూడఁగా నీమె సందవరీక బ్రాహ్మణస్త్రీ యైనట్లు తెలియవచ్చుచున్నది. ఈమె తనభర్తయొక్క నామగోత్రము లను జెప్పుకోక "వసిష్ఠగోత్రపవిత్ర కృష్ణ మూమూత్య తనూభవ" యని తాను కృష్ణమూమూత్యుని కూఁతురయినట్టుమాత్రము చెప్పుకొనుటచేత నీమె బాలవితంతువయి తన కాలమును వేదాంతగ్రంథపఠనాదులయందుఁ [illegible]పిన ట్లూహింపఁ దగియున్నది. ఈమె గారం వ సంవత్సరమునందు [illegible]యుండినట్లు బ్రౌఁదొరగారు తమ నిఘంటువునందు వ్రాసి [illegible]రు. కాఁబట్టి యీమె యేఁబదిసంవత్సరములక్రిందట నుండినట్లు [illegible]చ్చుచున్నది. ఈమెకుఁ బూర్వమునం దుండినబ్రాహ్మణస్త్రీలు [illegible] పద్యకావ్యము లేపియు నిష్ణాతు కానరాన్రు. ఈమెకవిత్వ మునందిఁ [illegible]షము లక్కడక్కడఁ గానవచ్చుచున్నను మొత్తముమీఁద కవన మతికఠినముగాక మృదుమధురరచనను గలదయియున్నది. వారాం గన యయిన ముద్దుపళనివలె శృంగారవర్ణనమని యవాచ్యములు పలుకక కులాంగన కుచితమయినరీతిగానే వర్ణించుచు వచ్చుటయేకాక శృంగార వాక్యములు వచించుటసహితము తన కనిష్టమని సూచించుటకయి శృంగారరసాధిదైవతమయిన కృష్ణుని నిట్లు నుతించియున్నది—

శా. శృంగారాకృతితోడ వచ్చి పదముల్ శృంగారసారంబుతో
డం గూఢంబుగఁ జెప్పి నీవనఁగ నట్లేఁ జెప్పలే నన్న నన్

ముంగోపంబునఁ జూచి లేచి యటు నేమ్రొక్కంగ మన్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కొను నాశ్రీకృష్ణు సేవించెదన్.

ఈ పద్యమునుబట్టిచూడఁగా నీమె తాను బుస్తకమునం దక్క డక్కడ సందర్భోచితముగా రచించిన శృంగారపద్యములుకూడఁ దనవి గాక కృతిపతి విరచితములే యని లోకమునకుఁ జూప నుద్దేశించినట్లు కనఁబడుచున్నది. ఈమె కవిత్వరీతిని దెలుపుటకయి కొన్నిపద్యము లిం దుదాహరింపఁబడుచున్నవి—

వేంకటాచలమాహాత్మ్యము.

ఉ. రామనృపాల ఘోరతరరావణశౌర్యవిశాల భవ్యసు
త్రామసురార్యయోగిజనతాపసపాల కృపాలవాల శ్రీ
భూమిసుతాత్మలోల పరిపూర్ణసుకీర్తివిశాల వానర
స్తోమముతోడ వచ్చు మిముఁజూచి కృతార్థుల మైతి మిద్ధరన్. ఆ-౯

ఉ. ఇంతట యోగపూరుషుఁడు హెచ్చుఁడు తగ్గుఁడు సంతతంబునే
కాంతమున న్వసించుఁ దనయందుఁ బరాత్మను జూచుచుండు వి
భ్రాంతులు తన్నుఁ దిట్టినను గ్రమ్మఱ వారిని దాను దిట్టఁ డీ
శాంతుఁడు రాజయోగి ఘనసద్గురుఁ డంచు వచింపఁగాఁ దగున్. ఆ 3.

చ. అడవికి వేఁటఁబోయి విపులాద్భుతఘోరమృగాళి నచ్చటఁ
బొడగని భీతి నొందితివొ భూతము సోఁకెనొ లేక తాళ్ళపై
వడి చెడజాతి మ్రొగ్గితివొ వాగులలోఁబడి లేచివచ్చితో
కొడుక నిజంబుఁ జెప్పు మిఁక గొబ్బున నొక్కచికిత్స చేసెదన్. ఆ-౮.

ఉ. ఆకురవంజి యిట్లనియె నాఁడకు రమ్మని పిల్వవచ్చినా
రాఁకొనినాఁడు బిడ్డఁ డిపు డమ్మల నక్కల నేడనైన నే
జోకఁగఁజేరి వారలకు సోఁదె నిజంబుగఁ జెప్పకుండినన్
నాకడుపెట్లు నిండునని నవ్వుచుఁ బల్కుచు మూల్గి యిట్లనెన్. ఆ-౫.

రాజయోగసారము.

ద్విపద. కాయ మస్థిరమని కానంగలేక
పాయక సంసారబద్ధులై మమత
వదలక కామార్థవాంఛితు లగుచు
మదమత్తు లగుచు దుర్మార్గత నొంది
మదిలోన నబ్బి కామక్రోధలోభ
మదమోహామత్సరా ల్మాటికిఁ బెంచి
సంపదగలిగిన సామర్థ్య మనుచు
సొంపుమీఱిన తుచ్ఛసుఖ మిచ్చగించి
కామాంధులై తమగతి గానలేక
భ్రామలవలలోనఁ బడి లేవలేక
తఱిగిని యీషణత్రయవార్ధిలోను
మఱిమఱి మునుఁగుచు మమత రెట్టింప
నాలుబిడ్డలకని యర్థంబుఁ గూర్చి
కాలంబు నూరకే గడపుచునుండి
యంతకాలము వచ్చినప్పుడు యమునిఁ
జింతఁజేయుచు హింసచేఁ గందికుంది
కూపంబులోఁ బడి కొన్ని నాళ్లుండి
పాపాత్ములగుచుఁ బ్రపంచంబునందుఁ
బుట్టుచుఁ గిట్టుచుఁ బొగలుచుండెదరు.

ఈతఱిగొండ వెంకమ్మకుఁ దరువాతఁ దెలుఁగులోఁ బద్యకావ్యములను రచియించిన స్త్రీ లెవ్వరును గానఁబడరుగాని శతకములు రచించినవారు కొంద ఱందందుఁ గనఁబడుచున్నారు. ఇట్లు శతకములు రచియించిన స్త్రీలలో శ్రీరాజా గొడేనారాయణ గజపతిరాయనింగారి

మేనత్తయగు మదిన సుభద్రయ్యమ్మగా రత్నగణ్యరాలుగాఁ గానవచ్చు చున్నది. ఆమె ౧౭౮౧ వ సంవత్సరమునందు జననమొంది యించుమించుగా తరిగొండ వేంకమాంబతో సమకాలికురాలుగా నుండినది. ఈమె రచియించిన శ్రీరామదండకము, రఘునాయకశతకము, కేశవశతకము, కృష్ణశతకము, రాఘవరామశతకము మొదలయినశతకము లొకఁ-సంపుటముగా నీనడుమను బ్రకటింపఁబడినవి. ఈమె కవనకౌశలమును జూపుటకయి రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. శ్రీరమణీకళత్ర సరసీరుహనేత్ర జగత్పవిత్ర స
త్కారనబృందమిత్ర సురసన్నుతిపాత్ర నరేంద్రపుత్ర శ్యా
గారసమగ్రగాత్ర జనకర్మవిదారణకృచ్చరిత్ర శ్రీ
నారదమౌనిగీతచరణా రఘునాయక దీనపోషకా.

ఉ. మన్నన దప్పియున్నయెడ మక్కఁ-వగల్గినవారి నేనియున్
దిన్నఁగ మందలించినను దెల్లముగా మది నొవ్వకుండునే
యన్నకు ధార్తరాష్ట్రునకు నాదర మొప్ప హితోపదేశ మి
చ్చెన్నఁగఁజేసి యావిదురుఁ డేమిఫలంబును జెందెఁ గేశవా.

ఇప్పుడు తెలుఁగుదేశమునం దంతటను బాలికాపాఠశాలలు స్థాపింపఁబడి స్త్రీవిద్య ప్రబలుచున్నందున మంచిగ్రంథములను రచింపఁగల కులకాంతలు శీఘ్రకాలములోనే బైలుదేఱుదురుగాక!

---

122. పిండిప్రోలి లక్ష్మణకవి

ఇతఁడు లంకావిజయమనఁబడెడు రెండాశ్వాసముల ద్వ్యర్థి కావ్యమునుజేసెను. ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; గోపాలామాత్యపుత్రుఁడు. ఈకవి గోదావరిమండలములోని రామచంద్రపురమునకు సమీపమునఁనున్న కుయ్యేరను గ్రామమునకు కరణము. ఈగ్రామమును గుత్తచేసిన రావు ధర్మారాయఁడను పద్మనాయకకులజుఁ డీకవియొక్క లంకనేల మూడు పందుము లపహరింపఁగాఁ గోపావేశముచేత యీవనమునం దితఁడు ధర్మారావును రావణాసురునితోఁ బోల్చుచుఁ దనక్షేత్రాపహరణకథను రామాయణపరముగా శ్లేషార్థము వచ్చునట్లు రచియించెను. ఇతఁడు తిట్లు కవిత్వమునకుఁ బేరుపడినవాఁడు. ఈవిషయమును గూర్చి లంకావిజయ మునఁ గవియే యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

క. తెలియవిను రామకవ్యా । దులు సూరకవిప్రముఖపృథుప్రతిభావం
తులు భీమ శ్రీనాథు । ల్వ్రేలయఁగ నాకరణిఁ దిట్టలే రూఢముతిన్.

ఇతఁ డిట్లు యీవనదశయందుమాత్రమే కాక వార్ధకమువచ్చి యవసానదశ సమీపించువఱకునుగూడ నల్పములై న యైహికలాభముల నిమిత్తము పరులను దూషించుచు భూషించుచుఁ బద్యములను జెప్పి కాలము గడపుచుండెను. ఈలంకావిజయమునకు రావణడమ్మాయమని నామాంతరము. కవి సమర్థుఁడేయైనను రాఘవపాండవీయాదులవలె రావణదమ్మాయ మంత్రప్రౌఢముగా లేదు. కవి గ్రంథమునందు రామా యణకథ కనుకూలముగాఁ దనకథను మార్చుకొనుచు నల్పసంఖ్యగల రెండర్థముల పదములతోనే గ్రంథమునంతను బూరించినాఁడు. ఈగ్రం థములోని—

క. లేదమ్మా కష్టము నీ। కేదమ్మా సేగి భీతి ఘృణ నీ వొండ
రాదమ్మా యిఁక మిన్నక। పోదమ్మాయు క్తినిజముపొలుపుగదమ్మా.

గీ. ఏడుపందు ముల్లోకంబు లెఱుఁగ లంక
నేలకొల పరఁజేత్రాఁ ప్తి మేలుగాదు
వేర్మినాభూమిజాతసంప్రీతితోడ
వీడు మదియె సౌఖ్యము లిచ్చు వేయునేల.

ఉ. ప్రాజ్ఞత నెవ్విధంబునను రామునకుం దగుసాటి రావు స
ర్వజ్ఞ నృసింహుఁ డాయనసువంశమునన్ జనియించి చెడ్డదు
ష్ప్రజ్ఞుఁడ వీవు కానకు విచారము లన్నియుమాని ధర్మగో
ష్ఠిజులు మెచ్చుచొప్పు కని సీతను వే విడుమంత మే లగున్.

గీ. జ్యేష్ఠుఁడా లక్ష్మణాగ్రజక్షేత్ర మీవు
వదలకుండిన మోసంబు వచ్చునింకఁ
జండనిర్భీకవనచారిపిండిస్రోలి
కవికులవరతోరిపుత ముఖ్యముగ వలదు.

ఇత్యాదిపద్యముల ననేకులు మెచ్చుకొనుచున్నారు. లక్ష్మణకవి లంకావిజయమును క్రీస్తుశకము ౧౭౯౭ వ సంవత్సరమునందుఁ జేయ నారంభించెను. అప్పటి కితని కిరువదియైదుసంవత్సరములప్రాయ ముండిన పట్టమునఁ గవి ౧౭౭౦ వ సంవత్సరప్రాంతములయందు జనన మొంది యుండవలెను. ఈతఁడు ౧౮౨౦ వ సంవత్సరప్రాంతమువఱకును సజీవుఁ డయి యున్నందున నించుమించుగా డెబ్బదియేండ్లు బ్రతికియుండెననుటకు సందేహములేదు. ఇదియొక్కటితప్ప నితఁడు రచియించిన గ్రంథము వేఱేదియు లేదు.

ము. అరయ స్వర్ణ నఁజేతుఁ దారకపదవ్యక్రాంతవర్తి గురు
స్మరదుత్తుంగబలాతిశేకకలుషీభూతారిజీవ్రు ఘునాం

గిరి సాఖ్యాతు బుధౌఘపూజితపదుం డ్నేమంకరాంచత్తపో
భరసంతోషితసర్వమూనిధిషణున్ వాచస్పతి న్నార్యునిన్.

ఈపద్యములో వాచస్పతినార్యుని ననియుండవలసినదానికి వచ
స్పతినార్యునసియు,

చ. అని తలపోయుచో నల ప్రజాపతి చేసినమేర డప్పకం
బనివడి నద్రిచారు లసమానమహారుణధామయుక్తితో
డన పరవాహినీశనికటంబున కేగ నరివ్రజంబుచే
యు నతను సంగరంబునకు నోపక పాఱెను జొళ్ళుపీడఁగన్.

ఈపద్యములోఁ దప్పక యని యుండవలసినదానికిఁ దప్పక
నసియు, నందందుఁ గొన్ని వ్యాకరణదుష్టములయిన ప్రయోగములున్నను
మొత్తముమీఁదఁ గవిత్వము సలక్షణమయి మృదుమధురపదఘటిత
మయియున్నది. ఈతని రచనాకౌశలమును జూపుటకయి లంకావిజయ
ములోని మఱికొండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తమ్ములు నీదుపల్కులు హితమ్ములుగాఁ గొనిచేయ నార్యజా
తమ్ములు నీదుసద్గుణశతమ్ములు సంస్తుతిచేయఁ బఱీసా
తమ్ములు లేక న్యాయకలితమ్ములుగాఁ గ్రియలొప్ప సర్వభూ
తమ్ములు విశ్వసింప సుకృతమ్ములు వర్ధిలునట్లు చేయుమీ. ఆ. ౧.

ఉ. తమ్ములు సద్గృహమ్ములు సుతప్రకరమ్ములు సొమ్ము లిష్టవ
ర్గమ్ములు వైభవమ్ములు జగమ్ములఁ గ్రమ్మఁగ నెమ్మి నుండి సా
ప మ్మనిశ మ్మునర్చటనెపమ్ముగఁ గీడగు నాదుపల్కు వే
దమ్మని కూఁకినమ్మ విహితమ్ముఁ గులమ్ముబలమ్మునిమ్మగున్. ఆ-౨

ఈకవికాలములో సంస్కృతాంధ్రభాషాపాండిత్యమునందును సంగీత
సాహిత్యముల యందును సుప్రసిద్ధుఁడయిన శిష్టు కృష్ణమూర్తినామక
విద్వత్కవి యొకఁ డుండెను. అతనికిఁ దన కున్నంతపాండిత్యము తెలుఁ
గునందేకాని సంస్కృతమునందు లేదని లక్ష్మణకవియెడల ననాదరభావము

కలిగియుండెను. ఆయనకుఁగల గర్వమును తనయెడల, గలతిరస్కార భావమును గనిపెట్టి యీలక్ష్మణకవి యెట్లయిన నాతని గర్వభంగము చేయవలెనని సమయము వేచియుండెను. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తికవి తాను రచించిన సర్వకామదాపరిణయమును ప్రబంధమును రామచంద్ర పుర సంస్థానాధిపతియైన కాకర్లపూడి రామచంద్రరాజుగారి తమ్ముఁడైన జగన్నాధరాజున కంకితముచేయుటకయి కాజలూరు గ్రామమునకుఁ బోవుట తటస్థించెను. ఆపుస్తకమును జదివించి విద్వత్సవిసమ్మఖమున వినుటకు నిర్ణయింపఁబడిన దినమునందు లక్ష్మణకవి యనాహూతుఁడయ్యును సభకుఁబోయి కృష్ణమూర్తికవిని బదుగురిలోఁ బరాభవింపవలె ననుదృఢ నిశ్చయముతోఁ గూరుచుండియుండెను. సర్వకామదాపరిణయములోని—

చ. తరణి శశాంకు లాభరణదంభమున న్వదనాబ్జకైతవాం
బురుడసిత్రోత్పలాగ్రమున ముద్దియ కుంతలదేశ మాక్రమిం
చి రొకఫలంబు గాన నగుఁ జివ్వనుచుం బరహూపయుక్తి సి
బ్బరముగ నంతసాంతముగ బ్రహ్మ యొనర్చినసీమపొల్పగున్.

అనుపద్యమును జదివినప్పుడు లక్ష్మణకవి విని తలయూఁచి నవ్వి యిందలి నాయిక యే కాక్షీయయిన యవలక్షణరాశియనియు, కన్నులు నల్లగలువలనిచెప్పి వానిపైని సూర్యచంద్రులున్నట్లు చెప్పుటచేత నొక కన్ను సూర్యకాంతిచే ముకుళించు కలువయై గ్రుడ్డిది కావలెననియు, ఆభరణదంభమునవచ్చి సూర్యచంద్రులు కుంతలదేశ మాక్రమింపఁగా నిరువురకును దగవురాకుండ బ్రహ్మ సరిహద్దేర్పాటుచేసినట్లుగా పాపట యున్నదని వర్ణించుటచే సూర్యచంద్రుల నలంకరించినపిమ్మటఁ బాపటఁ దీయుచురో ముందుగా పాపటదీసి తరువాతనే సూర్యచంద్రుల నలంకరింతురో యీకవి తెలియనివాఁడనియు, ఇటువంటియూహాపోహలు లనేకములుచేసెను. ఇవి సరళములైన సదాక్షేపములు కాకపోయినను సభకు

పచ్చినవా రనేకు లాయాక్షేపములకు హర్షించి చప్పటలు కొట్టినందు
నను, జగన్నాథరాజుగా రాకృతినంచుట కిష్టపడనందునను, కృష్ణమూర్తి
కవిగా రవమానితులయి సభనుండి లేచిపోవలసినవారయిరి.

లక్ష్మణకవి యితరులమీఁదఁ బద్యములను జెప్పుచు వివాహాదు
లకుఁబోయి కవీశ్వర సంభావములను గొనుచు ధనార్జనము చేయుచుం
డెను. ఇతఁడు తన మేనల్లుఁడగు చింతలూరి మంగన్నకు విరోధముగా
వ్యాజ్యము తీర్పు చెప్పినంచునకయి యప్పటి పండిత సదరమీనగు శంకర
మంచి యనంతశాస్త్రిని శ్లేషార్థముతోఁ దిట్టినపద్యములలో నొకదానిని,
ఆవ్యాజ్యము నుపర్యభియోగము తెచ్చినప్పు డాకాలమునందు రాజమ
హేంద్రవరమున మండలన్యాయాధిపతిగా నుండి తెలుఁగుసీఘుంటువులను
జేసిన బ్రౌనుదొరగారిమీఁదఁ జేసినపద్యములలో నొకదానినిమాత్ర
ముదాహరించి యీతనినిగూర్చి యింతట్రిక్కో వికమించెదను.—

మ. అవురా శంకర మంచివాఁడవె యనంతాభ్యుండవై తీర్పొయుం
గవు మంగన్నరఁజేసి నీవు బుధమార్గభ్రష్టతన్ జోగిరా
గవరా లంది పినాకినిం బశుపతీకల్లోలునిం బట్టి స
త్యవధూసత్వము దానియం దిడితి వాశాయత్తు లిక్లేకదా.

ఉ. పస్పసచేసె నాబ్రతుకు పండితుఁ డిం కెటునిల్తు నంచు నే
నిస్పృహవృత్తి నుండఁగను నిన్నటిరేఁ గలలోనఁ గోర్టువా
రిస్పిసియూలుపట్టి రిఁక నేర్పడ న్యాయముతీర్తుమంచు ధై
ర్యాస్పదసూక్తిఁ బల్కినటులైన మిముం బొడగానవచ్చితిన.

---

123. అల్లమరాజు రామకృష్ణకవి

ఈ కవి కవిచకోరచంద్రోదయ మనెడు నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁ డారామ ద్రావిడబ్రాహ్మణుఁడు; రంగానాధార్యపుత్రుఁడు; హరితసగోత్రుఁడు. తన గ్రంథమును దాక్షారామ భీమేశ్వరుని కంకితముచేయుటచేతనే కవి గోదావరీమండలములోనివాఁడగుట స్పష్టమగుచున్నది. తన్నుఁగూర్చి భీమేశ్వరుఁ డిట్లున్నట్లు కవి తన కవిచకోరచంద్రోదయమునందుఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. అమరఁగ వైనతేయవిజయంబునుసత్యభామావిలాసంబు భాసురముగ
గౌతమీమాహాత్మ్యకథయునుద్రౌపదీపరిణయ మలసుశోభావివాహ
మసమానహానునుదాఖ్యానంబునుసుకవిజనమనోరంజనంబ నెడుకావ్య
మవనిలో రచియించినట్టి ప్రౌఢవు నీవుగావున నీవాక్యకలితలలిత
మాధురిమఁ గ్రోలుచుండె నామానసంబు
తనివిదీఱదు నా భక్తుఁడనుచు నిన్ను
నెన్నఁటలుగాదు కాని నీకన్న ధరణిఁ
గలరె కవితాసుధాధార లొలుకఁబలుక.

ఈ పద్యమునుబట్టి కవి వైనతేయనిజయము, సత్యభామావిలాసము, గౌతమీ మాహాత్మ్యము, ద్రౌపదీ పరిణయము, సుశోభావివాహము, హానుమదాఖ్యానము, సుకవిజనమనోరంజనము అనుకావ్యములనుగూడ రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఈతని కవిత్వము నిర్దుష్టము కాకపోయినను ప్రౌఢమయి హృదయాహ్లాదకరముగా నున్నది. ఇతఁ డఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవి యీకవిచకోర చంద్రోదయమును శాలివాహనశకము ౧౭౫౭ వ సంవత్సరమునకు సరియైన మన్మథాబ్దమునం దనఁగా క్రీస్తుశకము ౧౮౩౫వ సంవత్సరమునందు రచియించినట్లు గ్రంథాంతమున వ్రాసికొనియున్నాఁడు. ఈ కావ్యమునంద లివి కొన్నిపద్యము లించుదాహరింపఁ బడుచున్నవి.

ఉ. భారమ నొప్పు పుష్పఫలభారవినమ్రమహీజరాజశో
భారమణీయసానుచరభవ్యనభశ్చరభామినీవిపం
చీరవమాధురీకలితజృంభిత గానఘుమంఘుమార్భటీ
పూరితనూత్న రత్నయుతభూరిదరిం గనియెన్ మహాగిరిన్ ఆ-ం.

ఉ. మారుని మీఱు వీనిసుకుమారము మారమణీసహోదరున్
గూరిమి నోమునోము తలుకు ల్వలుకల్ నెఱిజాణవై ఖరిన్
గేరు నయూరె నిర్జరులుఁ గిన్నరులు న్నరు లెన్న వీనియొ
య్యారమె చూడ నింపగు జయంతు జయింతు నటన్నరీతులన్. ఆ-౫

కవిచకోరచంద్రోదయమునకుఁ దరువాతఁ గవి రచియించిన గ్రంథములు కొన్ని నా కిటీవల లభించినవి. ఇతఁడు రచియించిన యితర గ్రంథములు—మదాలసా పరిణయము, శంతనువిలాసము, ఆధ్యాత్మ రామాయణము, అచ్చ తెలుఁగు భాగవతము, రామకృష్ణీయము. ఇందలి కడపటి పుస్తకము ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానము. ఈరామకృష్ణీయములోని యీ క్రింది పద్యమువలన నీతని నివాసస్థానము పిఠాపురమునకు సమీపమునన్న చేఁబ్రోలుగ్రామ మయినట్టు తెలియవచ్చుచున్నది.

సీ. సిరిమించు శ్రీపీఠపురసమీపంబునఁ బరఁగు చేఁబ్రోల్పురవాసి నగుచు
నల్లమరాజాన్వయాగ్రణి యగు రంగధామార్యవర్యుని తనయుఁడనయి
యెల్లపార్యాగ్రణి కెనయఁబాత్రుండనై రామకృష్ణకవియన్ నామమెలమి
బూని శ్రీదక్షవాటీనికేతనుఁడైన భీమేశు కరుణచేఁ బెంపు నొంది
సకలజనులకుఁ దెలిసెడి సరణిగాఁగ
నన్నపార్యుఁ డొనర్చినయట్టి సూత్ర
ములను దెలిఁగింతు సూక్ష్మభంగులను బాల
బోధమగునట్లు సుకవు లుప్పొంగుచుండ.

ఈకవి కాలముచేసి యేఁబదిసంవత్సరములు దాఁటినవి. ఈతఁడు శంతనువిలాసమును శాలివాహనశకము ౧౭౬౩ వ సంవత్సరమునకు సరి

యైన క్రీస్తుశకము ౧౮౨౧వ సంవత్సరమునందు ముగించినట్లా పు స్తకాంత మందలి యీ పద్యముఁలనఁ దెలియవచ్చుచున్నది.

సీ. అవనిలో శాలివాహనశకాబ్దము లగ్ని శౌస్త్ర్యైలశశాంకసంఖ్యనెన్నఁ
బ్లవనామవత్సర ప్రథితకార్తికశుద్ధసప్తమీ భౌమవాసరమువఱకు
సిరివించు శ్రీపీఠపురసమీపంబునఁ బొలుపొందుచేఁ బ్రోలుపురనివాసుఁ
డలరున్లమరాజకులరత్నమునురంగధామార్యసుతుఁడునౌ రామకృష్ణ
కవివరుఁడు దత్తవాటికాగారవాసుఁడైన భీమేశు సత్కృపానూనగరిమ
శంతనువిలాసముఁరచించె సరసఫణితినఖిలసత్కవిబృందంబులొనంగ.

ఈ కవికృతములైన గ్రంథములలోని పద్యములు కొన్ని యిందుదాహరింపఁబడుచున్నవి—

మదాలసా పరిణయము.

ఉ. న్యాయముగా దయో లలన నన్వడనాడిచనంగఁ గోయిలల్
కోయనికూయఁ జందురుఁడు గొంకక వెన్నెలఁగాయ మారుఁడున్
సాయక జాలమేయఁ గడుపట్పదముల్ రొదసేయ నేనినుం
బాయఁగఁజాలఁజాలనను బాలకవుంగిటఁ జేర్చిప్రోవవే.

అచ్చతెలుఁగు భాగవతము.

సీ. కూఁకటిమూలడాల్గొన బెల్లనదలించి జమిలిముక్కాలిరాసంతు నొంచి
క్రొగ్గలుమెకపుమూఁకలన్నల్ల సగిమించి కారుమబ్బుల నెఱసొరుకుంచి
చిచ్చుకన్దొరయత్తి హెచ్చువన్నెఁగలంచి విప్పగన్ దొరరాల
చొప్పుమ్రుంచి
చీఁకటిమ్రూఁకులగెలువ మెల్లను డించి కాటుకమలవన్నెఁగీ టడంచి
పొగల తెగల జగాజిగి మిగులవంచి
దండితెక్కలికాండ్లకు మింకగీండ్లఁ
కింపుగా మబ్బు మసిచల్లునింపు దోఁప
నెల్లకడలందు నంతంత నిరులు గవిసె.

శంతను విలాసము.

చ. పగలును రేయి పద్మకులబాంధవసోములు తత్వరంబునన్
దగుమణివప్రముం గడిసి తారటువోవఁగలేక యోరగా
నొగినిరువంకలం జనుచు నొప్పగ నుత్తరదక్షిణాయనా
ఖ్యగతిఁ జెలంగి రెంతయు నఖండవిలాసము తోఁచుచుండఁగన్. ఆ-౧

ఉ. హారము (?) సైచదాయె మణిహారములుం బొడియయ్యె నేఁడు నీ
హారముఁబోలి నాదు వ్యవహారము లెంతయు డిండె మేనిక
ల్వారము లెండె బల్జయవిహారమునన్ మరుఁ డేఁచసాఁగె నా
హారమణీలలామ యిఁకనైన ననున్ దయ నేలుకోఁగదే. ఆ-౫.

---

124. కాకరపర్తి బుచ్చిపాత్రకవి

ఈ కవి సత్యవతీపరిణయ మనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రోద్భవుఁడు; ముఖలింగక్షేత్ర మహాత్మ్యాది కావ్యములను రచియించిన కృష్ణకవి పుత్రుఁడు. ఈ కవియొక్క మనుమఁడును సోదరపుత్రుఁడును జీవించి యుండుటచే, గవి యేఁబది యఱువదిసంవత్సరములక్రిందట నుండినవాఁడనుట స్పష్టము. కవి కథాంశమును రచియించి గ్రంథమును శ్రీరాజా (మహారాజా) గోడే నారాయణ గజపతిరాయనింగారి జనకున కంకితము చేయఁ దలంచెనుగాని యతఁడు కృత్యాదిపద్యములను, ఆశ్వాసాద్యంత పద్యములను రచియింపకయే మృతినొందెను. అటుతరువాత శ్రీమహా రాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కోరికపయిని కవికి సారం పర్యమున సోదరపుత్రులగు వేంకటశాస్త్రిగారును పౌత్రులగు సీతారామ శాస్త్రిగారును గ్రంథోపోద్ఘాతమును, ఆశ్వాసాద్యంత పద్యములను పూరించి కృతిని ౧౮౮౭ వ సంవత్సరమునందు శ్రీరాజా గోడే నారాయణ గజపతిరాయనింగారి కంకితము చేసిరి. వీరిచేఁ గృత్యాదియందు రాజాగారి

వంశాభివర్ణనము విశేషముగాఁ జేయఁబడినది. సత్యవతీచరిత్రమునందలి కవిత్వము నిర్దుష్టమయి హృద్యముగానున్నది. కవనమార్గమును జూపుట కయి సత్యవతీపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించు చున్నాను—

చ. ఇలఁ గలకోటలక్ గెల్చి యెన్నిక కెక్కఁబురీలలామకో
జ్జ్వలమణివప్రమం చరసి వారిజసూతి తదంఘ్రిసీమఁ బ
చ్చలచెలువంపుటందియల సద్బిరుదాంకము సంఘటించెనా
నలరు నమేయశై వలయుతాంబుకదంబముఖేయ మప్పురిన్. ఆ ౧.

చ. పరమతపోధనప్రవరు భవ్యగుణప్రకరుం డుపఃకృశాం
గరుచిరు భస్మభాసురు నఖర్వతటిత్పటలోజ్జ్వలజ్జటా
భరు మృగకృత్తికాదరు సుపాణిధృతాక్షసరుం గమండలు
స్ఫురితకరుం గనుంగొనియె శోభితదండధరుం బరాశరున్. ఆ-౨.

చ. సనుధికరాజ్యలక్ష్మి యనుచందనవల్లిక జూహ్నావేయదు
ర్దమఫణిరాజు చేరనివిధం బొనరింపఁగఁ జాలినట్టి మం
త్రముల తెఱంగుఁ జూపఁగను బ్రౌఢి వహించెనవేని రాజకా
ర్యము ఫలియించు మంత్రివర రాజహిత ప్రతిపాదనాదరా. ఆ-౩.

ఉ. ఎల్లెడలందుఁ జీకటుల హెచ్చులు చెల్లఁ బయోధివృద్ధి పా
టిల్లఁ జకోరభూక్తులు ఘటిల్లఁ వియోగిహృదంతరంబు భే
దిల్లఁ రథాంగదంపతుల తేజము డ్రొల్లఁ గతీశునాజ్ఞ వ
ర్ధిల్లెడు సంధ్రిక్రాప్రతతి, దిక్తరుకోట్లులవల్లె నయ్యెడన్. ఆ-౪.

మ. అవనీనాయకు లందఱు న్వినుఁడు గుర్వర్థానుసంధానగౌ
రవ మెప్పన్ సమయస్థితిక్రమవిధిక్రీబవ్యక్తకృష్ణాన్వ్లు స
త్యవతీదేవికి నుద్భవించినసుతుం డర్వాండుఁ బ్రసాధ్యకో
రవరాజ్యంబు భరింపఁగా సకలగోత్రావల్లభుల్గొల్వఁగన్. ఆ. ౫.

125. శిష్టు కృష్ణమూర్తికవి

ఇతఁడు సర్వకామదాపరిణయము మొదలయిన యాంధ్రకావ్యము లను రచియించినకవి. ఇతఁడు వైదికబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వాసిష్ఠగోత్రుఁడు; సర్వశాస్త్రిపుత్రుఁడు. సంవత్సరము సరిగా తెలియదుగాని యితఁడు గోదావరిమండలమునందలి రామచంద్రపురము తాలూకాలోని గొల్లపాలె మనుగ్రామమున ౧౭౯౦వ సంవత్సరము నకును ౧౮౦౦వ సంవత్సరమునకు మధ్యకాలములో జనన మొందెను. ఈతనికి రెండుసంవత్సరములప్రాయము వచ్చినప్పుడు స్వగ్రామమువిడిచి తండ్రి కుటుంబసహితముగా రామచంద్రపురమునకు లేచివచ్చి యక్కడ నిల్లు కట్టుకొని స్థిరముగా కాపుర మేర్పఱుచుకొనెను. ఈబాలుఁడు కొంతకాలము రామచంద్రపురముంలోఁ జదువుకొని తరువాత అయినవల్లి గ్రామమునకుఁ బోయి బులుసు అచ్చయ్యగారివద్దఁ గావ్యనాటకాదు లభ్యసించితరువాత నింకొకరివద్ద వ్యాకరణాలంకార శాస్త్రముల నభ్య ంచి మరల రామచంద్రపురము వచ్చునప్పటికీతనికి సంస్కృతాంధ్ర ులయం దసదృశపాండిత్యమును కవనశైపుణియుఁ గలుగుటయేకాక సంగీతమునందును నిరుపమాన సామర్థ్యము గుదిరెను. ఆశుకవిత్వమును జెప్పుటలోను గర్ణరసాయనముగాఁ బురాణమును జదువుటలోను కృష్ణ మూర్తిగారిని మించినవా రాకాలములో మఱి యెవ్వరును లేరు. ఇతఁడు పురాణము చెప్పునప్పుడు పుస్తకమునుమూసి చదువునున్నను పయిక థలు దడవుకొనక తన కవిత్వముంలో రసవంతముగాఁ జదువ సామర్థ్యము గలవాఁడఁట! ఈయనశక్తిసంపదను జూచి రామచంద్రపురపు జమీందా రగు కాకర్లపూడి రామచంద్రరాజుగారును తదనుజుఁడగు జగన్నాథ రాజుగారును కృష్ణమూర్తిగారి నాదరించి తమసంస్థానములో నుంచుకొ నిరి. ఆయిరువురిలో జగన్నాథరాజుగారికిఁ గవియుం దధికానురాగము.

వీరిరువురికంచెను కాకర్లపూడి వేంకటకృష్ణరాజుగారికి కృష్ణమూర్తిగారి యం దెక్కువవయ యగుటచేత నాతఁడివిద్వత్కవి కయిసవల్లిగ్రామ ములో పదిపుట్లభూమి దానము చేసెను. అయినను నీటిమూధారము లేకపోవుటచేత భూమి లాకాలమునం దిప్పటివలెఁ బండకుండెను. ఇట్లు కృష్ణమూర్తిగారు తనకు నలువదియైదు సంవత్సరములయీడువచ్చువఱ కును రామచంద్రపురములో నుండెను. ఈకాలములో రామచంద్రపుర ము తాలూకాలోని కుయ్యేరు గ్రామములో పిండిప్రోలి లక్ష్మణకవి యను సుప్రసిద్ధాంధ్రకవియుండెను. పండితులో కవులో యిద్ద ఱొక్కచోట నుండినప్పుడు పరస్పరస్పర్ధ లేకుండుట మనలో నరుదు. లక్ష్మణకవి యావఱకేరావణదమ్మీయమును రచియించివయస్సునంఁ గృష్ణ మూర్తిగారికంటె నిరువదియేండ్లు పెద్దవాఁడయి యాంధ్రకవిత్వమునం దాతితేటినప్రౌఢుఁడు. తన కున్నంతసంస్కృతపాండిత్యము లేదని యాతని నధిక్షేపించి కృష్ణమూర్తికవి పిల్లవీఁగుచుండెను; తనవలె నాంధ్రకవి త్వము చెప్పనేరఁడని యాతని నాక్షేపించి లక్ష్మణకవి తృణీకరించుచుం డెను. కృష్ణమూర్తికవి పాండిత్య మెంత యెక్కువకలవాఁడైనను లౌకిక జ్ఞాన మధికముగాలేని శుద్ధశ్రోత్రియశిఖామణి; లక్ష్మణకవి యల్పపాండి త్యము కలవాఁడేయైనను లోకానుభవమును యుక్తిచమత్కారమును నధికముగాఁ గల లౌకికశిరోరత్నము. అట్లగుటచే నిరువురుఁ దారసించి నప్పు డెల్ల లక్ష్మణకవియే మేలుచేయి యగుచుండెను. ఈవైరకారణ మునుబట్టియే కాజలూరిలో సర్వకామదాపరిణయ ప్రథనకాలమునందుఁ గృష్ణమూర్తిగారికిఁ బరాభవము సంభవించెను. అట్లు శృంగభంగము నొంది యాయవమానమును సహింపలేక తరువాత నల్పకాలములోనె కృష్ణమూర్తిగారు రామచంద్రపురమును విడిచి వెడలిపోయిరి. జ్యేష్ఠుఁడగు రామచంద్రరాజుగారుండఁగా స్వరాజధానిలో ననుజుఁడగుజగన్నాధరాజు కృతినందుట యనుచితమని యీసభ కాజలూరిలో జరపఁబడెను.

కృష్ణమూర్తికవి సేతుయాత్రకుఁ బోయి వచ్చుచుండఁగా నాతని ప్రఖ్యాతిని విని కాళహస్తిప్రభు వగు దామెర వేంకటపతిరాయనింగా రాయనను తమసంస్థానమునం దుండవలసినదని వేఁడుకొన్నందున కృష్ణమూర్తిగా రక్కడఁ బదునాఱుసంవత్సరములుండిరి. కవి నాదరించిన యీ వేంకటపతిరాయనింగారు గోదావరీమండలమునందే జనన మొందిన వారయి కాళహస్తి రాజపత్ని చేత స్వీకరింపఁబడిన దత్తపుత్రుఁడై ౧౮౩౭వ సంవత్సరము మొదలుకొని ౧౮౪౧వ సంవత్సరమువఱకును రాజ్యముచేసెను. కాళహస్తి సంస్థానములో నీయనకు నెల కఱువదిరూపా యలు జీత మేర్పఱుపఁబడెను. కాళహస్తికి వెళ్ళకపూర్వమో వెళ్ళి వచ్చినతరువాతనో కాకినాడలో నైదుసంవత్సరములు గోదావరీమండల కరగ్రాహివద్ద సిరస్తాదారుగానుండిన తుళసింగ సెట్టిగారియింటఁ బురా ణము చెప్పుచుండి యీయనప్రోత్సాహముచేత స్త్రీనీతిశాస్త్రము నెడి యేకాశ్వాసగ్రంథమును రచియించెను. ఆగ్రంథమునందుఁ గవి తుళసింగ సెట్టి నిట్లు వర్ణించెను—

సీ. శౌర్జభృచ్చరణాంబుజనిసేవ యొనరించు సజ్జనసంతతి సత్కరించు
నాశ్రితకోటి సమ్యగ్గతి నలరించు నాత్మ బంధుజనాళి నాదరించు
నరళనీతిపథానుషంగాప్తి విహరించుఁ బరిజనాసత్కృతిఁ బరిహరించు
నగణితానుపమానసుగుణలీలఁ జరించు నార్యగుయుక్తుల ననుసరించు
ననుయశంబున ననిశంబు ఘనతఁ బ్రబలు
నట్టి తుళసింగసెట్టి నన్నఖిలబుధుల
మ్రొ్రలనుతియించి యోకృష్ణమూర్తికవి
సంఘటింపుము స్త్రీనీతిశాస్త్రమునుచు.

ఈయన కవిత్వరీతిని దెలుపుటకయి మఱి రెండుపద్యము లీస్త్రీ నీతిశాస్త్రములోనివి యిం దుదాహరించుచున్నాను—

ఉ. మన్ననచేయ నుబ్బ నవమానముచేయఁగ స్రుక్కకే పతిం
జెన్నలరంగఁ గొల్చుచు విశిష్టతమాత్మకులప్రతిష్ఠ సం
పన్నము చేయుచుం దనను బంధులచేతఁ భోగ డ్తగన్న యు
య్యన్నలమిన్నచే జగము లన్నియు నిల్చు నటంచు నెంచెదన్.

ఉ. ఎచ్చటనో ప్రయాసపడి యేమయినం బతి తెచ్చి వేశ్యతో
సిచ్చినఁ గొంచె మేనియు మహీయముగా మది నెంచి బాంధవు
ల్మెచ్చఁగ నొచ్చె మించుకయు లేనిసమగ్రగుణంబు పెంపునన్
హెచ్చఁగఁజేయు భర్తృయశ మిట్టిసతి న్వినుతింతు రందఱున్.

ఈ పుస్తకముగాక యేతత్కవికృతమైన వేంకటాచల మాహాత్మ్య మొకటికూడ ముద్రింపఁబడి యున్నదిగాని దానిరచన కవియొక్క ప్రఖ్యాతికిఁ దగినంత శ్రేష్ఠముగాఁ గనఁబడలేదు. కాళహస్తిలోఁ బ్రవేశించిన కొంతకాలమునకే కవిచే రచియింపఁబడిన వీఱారణ్యమాహాత్మ్యముకూడ శ్రీకుళసింగన్నెట్టికే యంకిత మొనర్పఁబడినందునఁ కాళహస్తి పోకముందే యాతనివద్ద నుండెనేమో యని సందేహముకలుగుచున్నది. కాళహస్తిలో నున్నకాలమున నీకవిపుత్రుఁడయిన సర్వశాస్త్రి యమరుకమును సంస్కృతమునుండి తెనిఁగించి కాళహస్తిసంస్థానాధీశ్వరుని కంకితము చేసెను. ఈయమరుకములోని రెండుమూడు పద్యముల నిందుదాహరించుట కేవలాప్రస్తుతప్రశంస కాకపోవచ్చునని యట్లుచేయ సాహసించుచున్నాను.

శా. శ్రీమాఱుం దగు కాళహస్తినగరీసీమంబు ధామంబుగా
సేమం బాశ్రితకోటి కీవగు ప్రశస్తింబొల్చు నాసామియా
సామిరాకృత భూమి భృద్వరతనూజాకామి సేమంబుతో
శ్రీమద్దామెర వేంకటేంద్రులకు వాసింగూర్చు నిష్టార్థముల్.

చ. అవునవుఁ దెల్లమయ్యె వృథయాహలుమాకు లిఁకేమి సామి నీ
వలనఁ జనంగవచ్చు నిటు లయ్యెను మావిధి దోస మెద్ది నీ

కివుకని నీదుప్రేమరస మిట్లగునేని స్వభావచంచలం
బవు హతజీవితంబు చనునంతన మా కొకబాధ కల్గునే.

చ. మును మన కించుకంతయును మూర్తివిభేదము గానలేదు నె
మ్మనమున మీఁదఁ బ్రియమమత్వము గల్గె బరస్పరంబు న
య్యె నిపుడు నీకు భర్తృపద మేనును భార్యయనంగ నైతి జీ
వనగతవజ్రికర్కశతఁ బాటిలె నిట్టిఫలంబు నేఁటికిన్.

ఈకృష్ణమూర్తికవి కాళహస్తిలో నున్నప్పుడు చేయఁబడిన ప్రధాన గ్రంథ మింకొకటి గలదు. ఆ కాలములో నీయునకును చెన్నపురి శాస్త్ర పాఠశాలలో నాంధ్రపండితుఁడైన పరవస్తు చిన్నయసూరిగారికిని సిద్ధాంత కౌముదిలోని సూత్రవిచారము కొంత నడచెను. మన పండితులు సాధారణముగా మత్సరగ్రస్తులగుట సుప్రసిద్ధమేగదా? అట్టివా రీర్ష్యచేతఁ దమకు లాభము లేకపోయినను బరులకు నష్టము కలుగుటయే తమ యభీష్ట సిద్ధిగా భావించి కొన్నిసమయములయందుఁ బరుల కీర్తికి భంగము కలిగింపఁజూతురు. అంతకుఁబూర్వము కొంతకాలముక్రిందటఁ జిన్నయసూరి బాలవ్యాకరణమును రచియించెను. దానితో సరిపోల్పఁదగిన యాంధ్ర వ్యాకరణ మావఱకు వేఱొకటిలేదు. ఇట్లుండఁగాఁ గృష్ణమూర్తిగారిచేఁ జేయఁబడిన వ్యాఖ్యానముతోఁ గూడిన హరికారిక లనఁబడెడి యాంధ్ర వ్యాకరణ సూత్రగ్రంథ మొకటి యటుతరువాత నల్పకాలమునకు వెలువడెను. అదియే హరిభట్టకృతమై యథర్వణాదులచేఁ బేర్కొనఁబడిన కారికావళి యైనపక్షమునఁ జిన్నయసూరి తన వ్యాకరణములోని సూత్రములనన్నిటిని హరికృతగ్రంథమునుండి దొంగిలించి తనపేరిటఁ బ్రకటించినట్లు స్పష్టమగును. అయినను మూలగ్రంథములోఁ జూపఁబడిన లక్ష్యములు కొన్ని యథర్వణాచార్యుల కీవలి మూఁడునిక గ్రంథములలోని వగుటచేత వ్యాఖ్యానమునుమాత్రమే కాక మూలగ్రంథమునుసహితము కృష్ణమూర్తిగారే రచియించిరేమోయనిపలువురు సందేహపడుచున్నారు.

అట్టి గ్రంథమును రచియింపఁగల సామర్థ్య మావిద్వత్కవికిఁ గలదనుటకు సందేహము లేదు. ఈయన యిటువంటి గ్రంథకల్పనముచేయ సంశయపడువారుకారన చూపుటకయి చరమదశయందు మాడుగల్లులో నున్నపు డొక్కరాత్రిలోఁ జేసిన ట్టీయన కారోపింపఁబడిన యశ్వాశ్వ్రకథ కొంత తోడుపడుచున్నది.

కృష్ణమూర్తివిగారు కాళహస్తినుండి స్వదేశమునకువచ్చి శ్రీరాజా గంగాధర రామారావుగారిచేద్ద పిఠాపుర సంస్థానములోఁ బ్రవేశించుట కయి నాలుగయిదు మాసము లచటనుండి కృషిచేసిరిగాని ప్రయత్నము సఫలమయినదికాదు. శ్రీరాజాగారే నూఱురూపాయలును జోడుశాలువలు నిచ్చి యీయనకు సెలవిచ్చిరి. తరువాత నాతఁడు తనకుమారుని యత్తవారియూరయిన జగ్గమపేట గ్రామమునకుఁ బోయి యక్కడఁ గొంతకాలమండి తత్సంస్థానాధిపతి ననుసరించెను. పీఠికాపుర సంస్థానాధిపతియయిన శ్రీరాజా రావు నీలాద్రిమాధవరాయనింగారి భోగభార్యాపుత్రుఁడును జగ్గమపేట సంస్థానాధిపతియునగు శ్రీరాజారావు వేంకటరాయఁడుగా రాయనకు సంవత్సరమున కినూఱురూపాయలు వచ్చు మాన్యమును రెండుశాలువలు నిచ్చి సత్కరించిరికాని నెలజీత మేర్పఱచి తమ యాస్థానపండితునిగాఁ జేకొనలేదు. తరువాత నీకవి యైనవల్లిగ్రామములోఁ గొంతకాలము వసించి యక్కడనుండి శ్రీజగన్నాథయాత్రకుఁ బోయి పురుషోత్తమక్షేత్రమును సేవించి మరల వచ్చునప్పుడు త్రోవలో మాడుగల్లుసంస్థానమునకుఁ బోయి తత్సంస్థానాధిపతియగు శ్రీకృష్ణభూపతి గారిని సందర్శించెను. ఆయన విద్వత్కవుల నాదరించు రసికాగ్రగణ్యుఁడగుటచేత వేయిరూపాయలువచ్చు భూము లిచ్చి కృష్ణమూర్తిగారిని తమ సంస్థానములో నుంచుకొనెను. ఈకవి మాడుగల్లు ప్రవేశించిన తరువాతఁ డానుజేసినజగన్నాథయాత్రనుగూర్చి నీలశైలనాథీయ మనుపేర సంస్కృతములో నొకగ్రంథమును రచించెను. రెండుసంవత్సరము లాసం

స్థానములోనుండి కృష్ణమూర్తిగారు ౧౮౭౦ వ సంవత్సరమునకుఁ దరు
వాత నెనుబదియేండ్ల ప్రాయమున నక్కడనే కాలధర్మము నొందెను.
ఈయన సంస్కృతమున యక్షోల్లాస మనుకావ్యమును, వల్లవీ పల్లవో
ల్లాసము, మదనాభ్యుదయము ననుభాణములను, రామాయణకథను
జెప్పు కంకణబంధమును, హరికారికలను, నీలశైలనాధీయమును, ఆంధ్ర
మున సర్వకామదాపరిణయమును, వేంకటాచలమాహాత్మ్యమును, వీక్షా
రణ్యమాహాత్మ్యమును, పంచతంత్రమును, వసుచరిత్ర వ్యాఖ్యానమును,
రచియించెను.

---

126. మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి

ఈకవి మాడుగొల్లు సంస్థానమున కృష్ణభూపతిగారి యాస్థానకవి
గానుండి, కృష్ణార్జున చరిత్రమును రెండాశ్వాసముల ద్వ్యర్థికావ్యమును
సీతారామచరిత్ర మనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును భీమలింగ
శతకమును రచియించెను. ఈయన యాఱువేల సియోగిబ్రాహ్మణుఁడు;
ఆపస్తంబసూత్రుఁడు; శరభరాజామాత్యపుత్రుఁడు. ఈయన నలువదిసం
వత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఈయన కవిత్వము మృదుమ
ధుర పదగుంభితమయి మనోరంజకముగా నుండును. కవితారచనను
జూపుటకయి యీకవి గ్రంథములలోనిని కొన్ని పద్యము లిందుదాహ
రింపఁబడుచున్నవి—

కృష్ణార్జున చరిత్రము.

మ. రమణీ నీగుణరూపసంపదకు లో రంజిల్లి గోపాలకుం
డమితారాతివిదారితామరసపత్రాక్షుండు కాంత్యుజ్జ్వల
త్కమనీయాకృతి రాజరాజ్ఞసమాఖ్యశాలి ధీరుండు దా
సుమనోరత్నము నీయధీన మగుచున్ శోభిల్ల జేసెంజుమీ. ఆ. ౧.

చ. కుతలమునందు భాగ్యమునకుం దగుకార్యము చేయునంత వి
శ్రుతయశయా సుభద్ర కరిసూదనవిక్రముఁ డైనగోపరా
ట్సుతునకు సమ్మతంబుగ విశుద్ధగుణాకర భూరిపుణ్యక
వ్రత మొగిఁజేయఁగాఁదగువివాహమహోత్సవమూహనంబ్రజల్ ఆ-తి

సీతారామచరిత్రము

శా. ధాత్రాదిక్రతుభుగ్వరుల్ ఘనతపోధారేయమా నీదుచా
రిత్రం బెన్న నశక్తులే జడుఁడ వర్ణింప స్సమర్థుండనే
పుత్రీభూతసరస్వతీధవసితాంభోజాక్షరుద్రుండ వో
యత్రీ యత్రివిగాక నీకు సరియే యన్యాగ్రజన్మాగ్రణుల్. ఆ. 3.

చ. కనకకురంగ మేల వనిఁ గన్నడఁ గ్రక్కునఁ దానిఁదేరఁ బో
మ్మని పతి నేలపల్కితి నహమ్మతి నారఘుభర్త దానివెం
టను జన నేల యగ్రజుని డాయఁగ లక్ష్మణు నేలపంచితిక్
జనవరుఁ బాసి యే నిచటఁ జావఁగ నిన్నిపొసంగె దైవమా. ఆ-ర

చ. ననుశర ణొందినన్ దనుజనాయకు రావణునైన నఁ బ్రోతు నీ
తనిఁ గరుణించుచెంత శపథం బిదిగావున మీర లేగి చ
య్యనఁ గొనిరండు వీని కభయంబు నొసంగితినన్న భానుసం
దనుఁడు కృపాంబురాశియగుదాశరథిం గని పల్కె నమ్ముఁడై. ఆ ౬

భీమలింగశతకము.

క. తత్పురుషబహువ్రీహుల । సత్పురుషులు రామదాసశబ్దార్థ మిలన్
ద్వత్పరముగఁ జెప్పుదురు జ । గత్పావన భీమలింగ కలుషవిభంగా.

క. ఏసురవరులండై నన్ । నీసామర్థ్యంబు గలడె నిఖలాధీశా
దాసీకృత జననీకృత । కౌసల్యా భీమలింగ కలుషవిభంగా.

127. ఫక్కి వేంకట నరసయ్య

ఈ కవి శకుంతలాపరిణయ మనెడి మూడాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు సృష్టికరణవంశజుఁడు; భరద్వాజగోత్రుడు; నారాయణమంత్రి పుత్రుఁడు. ఇతఁడు విశాఖపట్టణములోని క్రైస్తవోన్నత పాఠశాలయం దాంధ్రోపాధ్యాయుఁడై యుండెను. ఈ కవి యీ శకుంతలా పరిణయము నలువది సంవత్సరముల క్రిందట ననఁగా ౧౮౩౬ వ సంవత్సరమునందు ముగించెను. ఇతఁడు అమరపదకల్పద్రుమము, నారాయణ స్తవము, మదనసాయకాపరిణయము, కవిదర్పణచ్ఛందము, నారాయణశతకము, కుమారీశతకము అను గ్రంథములనుగూడ రచియించెను. ఈతని కవిత్వము సలక్షణమయి మనోహరముగానున్నది. శకుంతలాపరిణయములోని కొన్ని పద్యముల నిం దుదాహరించుచున్నాను—

మ. తనరన్ బున్నమరేలఁ దత్పురవరోద్యత్సౌధసంచారికల్
వనజారిఁ ఘనసారఖండమని కేలంబట్టి దీపాగ్రసీ
మను ధూపక్రియఁ జూపఁ గంది చెలులం బ్రార్థింపఁగా వీడినఁ
జనియెన్ వానికినాఁటనుండి కలిగెం జంద్రాఖ్యయుం జిహ్నమున్. ఆ-౧

చ. తొలకరికాదు మిం చనఁగఁ దోయజబాంధవుఁ డస్తమింపలే
దలజలజారిరేఖయన నంతటనంతట నాడుచుండె మే
ల్తళుకుకడానిబొమ్మయనఁ దావులపూవులదీవెయో యన న్
గిలకిల చిల్కపల్కలనొగిం బదపద్యము లుగ్గడించునే? ఆ-౨.

చ. సరిసరి పొమ్ము బాల యొక చక్కని బాలునిఁజూపి వీఁడు నీ
వరసుతుఁ డేనురాణి నని నావిరిఁజెప్పఁ దొడంగుచుంటి వీ
దొరలును మంత్రులున్ ఘనబుధుల్ ననుఁ బాయకయుందు వెప్డు వీ
రెఱుఁగనిరీతిగా నడవి నెన్నఁడు నిన్నుఁ బరిగ్రహించితిన్? ఆ-౩.

---

128. వేలవ్వారి వేంకటేశ్వరకవి

ఇతఁడు గోవ్యాఘ్రచరిత్రమును, విచిత్రరామాయణమును పద్య కావ్యములుగా రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; మౌద్గల్య గోత్రుఁడు; బ్రహ్మనామాత్య పుత్రుఁడు. ఈతని నివాసస్థలము విశాఖ పట్టణ మండలములోని విజయనగర సంస్థానమునందలి రావివల్సయను గ్రామము. కవి ౧౮౫౧ వ సంవత్సరమున స్వర్గస్థుఁడయినందున, దాదాపుగా నిప్పటి కేఁబదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. అక్కడక్కడ వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నను, ముత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి శ్రోవ్యముగానున్నది. కవికృతములైన రెండు కృతులనుండియుఁ గొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను.

గోవ్యాఘ్రచరిత్రము.

చ. మధుకరపంక్తిఝంకృతులు మత్తమయూరనినాతషడ్జముల్
పృథుతరకోకిలధ్వనులుఁ బెంపలరారు శుకప్రసంగముల్
శిథిలముగాని శారికలచిందఅవందఅచే వనాళిఁ బెం
పొదవఁగ నొప్పెఁ బుష్పమధురోజ్జ్వలసత్ఫలసంకులంబులై.

ఉ. సంతతిలేక డెందమునఁ జాలఁగ డస్సి వ్రతోపవాసముల్
సంతత మేనొనర్చి కడుసంతస మొప్పఁగ వేల్పుజేండ్లమ
ధ్యాంతమునందు నిల్పి హిమశైలసుతేశ్వరు సిందుమౌళి న
త్యంతసుభక్తిఁ గొల్చి సుతు నంచితవాంఛ ఫలించఁగాంచితిఁ.

విచిత్రరామాయణము.

ఉ. మామ యిదేటిమాట వినుమా మనమాఁడఁజెంది నింక నా
సామిపదంబులాన కొనసాగదు తొల్లిటిభంగి దానవ
గ్రామణియింట నున్నజనక ప్రభుకూఁతురి నేలుకొంట కా
రామున కొప్పె నొప్పదనరాదు ప్రభుత్వముగల్గువారలన్. ఆ-గ.

ఉ. పుట్టి జగంబులోనఁగల భూసురుల న్మ్మనులక్ నృపాలుర్క
బట్టి వధించి వజ్రధరుపాలికి నేగి సుపర్వకోటులం
గొట్టి సమస్తలోకములకున్ ములుసూపె నతండు నారదుం
డట్టితఱి న్వికుంఠపురమంకు మురారిని జేరి యిట్లనెక్. ఆ-౨.

చ. కళుకులు దేరుబల్మిసిఱికాంచనరత్నమయూఖముల్ దిశా
వలయముఁ బర్వ నచ్చరలు వైభవలీల నటింపఁ గిన్నరుల్
బలసి రథంబు చుట్టుము సభక్తిని గొల్వ సిరోజబాంధవుం
డిల కరుదెంచెనో యన ధనేశుఁడు రాఁగ వియన్నిరీక్షుఁడై. ఆ-3.

ఉ. ఇచ్చి నృపాలుఁ డిట్లనె మునీశ్వర నీ కెమురాడి నిల్వనా
చిచ్చరకంటిసామికిని జెల్లదు నేనన నెంత యాసుతుల్
సచ్చరితుల్ సురారు లతిసాహసు లాహవకోవిదుల్ కడుం
గుచ్చితు లస్త్రశస్త్రముల గోష్య మెఱింగినటింతు రెప్పుడున్. ఆ-౪

మ. ఎదిరిం దన్ను నెఱుంగలేక మదిలో నెవ్వాఁడు నిన్నిట్లు బె
ట్టిదుఁడై నాసయు వీనులుం దునిమె కాఠిన్యంబున న్మ్మన్ను నేఁ
జెదరంజీతినదేవదైత్యవరులం జింతింపఁ జూడు మా
కదనశ్లాఘ్యులఁ గూల్తు వానిఁ జెలియంగాఁ బల్కవేనోదరీ. ఆ. ౫.

ను. శరసంధాన మొనర్చు ప్రౌఢిమము లక్ష్యం బూహగావించు నే
ర్పురు బాహాబలవిక్రమంబు సమరోద్యోగంబు సవ్యాపస
వ్యరిపుక్షీణమహాస్త్రపాతములు రౌద్రాకారముం గన్న నా
పొరువుం బో వెఱపొందు నీశుఁ డయినంబ్రతానిజంబింతయున్ ఆ-౬

ఈవిచిత్రరామాయణము గోపీనాథరచితాంధ్రవచనకావ్యము ననుసరించి యీకవిచేఁ బద్యరూపమునఁ జేయఁబడినది. ఈవచనకావ్యము ననుసరించియే యిటీవల గోదావరీమండలస్థ వెలగతుఱ్ఱుగ్రామనివాసియు నాపస్తంబసూత్రుఁడును శ్రీవత్సగోత్రుఁడును నుమామహేశ్వర సూ
పుత్రుఁడును నగు నరసింహదేవర వేంకటశాస్త్రియను వైదిక కవియు

నొకపద్యకావ్యమును రచియించియున్నాఁడు. ఈవర్తమానకవిచే రచియింపఁబడిన విచిత్తరామాయణమునందును వ్యాకరణదుష్టము లైన ప్రయోగములనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనిగ్రంథము మొదటిగ్రంథమునకంటె నధిక రసవంతముగానున్నది. ఇందలిపద్యములనుగూడఁ గొన్నిటి నిం దుదాహరించుచున్నాను—

ఉ. రామ విరాజమానరిపురాజకిరీటమణిప్రభాసుమ
స్తోమ సుపూజితాంఘ్రి యఘసూదనతారకనామ నీరద
శ్యామ సురేంద్రవందితవిశాలపరాక్రమ కీర్తికామినీ
కామ కఠోరరాత్రిచరకాండవిఖండనభండనప్రియా. బాల.

ఉ. తెల్లనిమేనివానిఁ గడుతియ్యనిమాటలవానిఁ గప్పుడాల్
చల్లెడుగొంతువాని బులిచాఱులతోలు బుజాలపైని రా
జిల్లఁగజేయువాని దెసచీరెలనూనినవాని నెత్తిపైఁ
జల్లనివెల్లుఁ దాలిచినసామిని జూచియహీంద్రుఁడెంతయున్. అయో

ఉ. ఓసి యభాగ్యురాల పడియుండక యింట నిటేలవచ్చినా
వే సకలంబుఁబోయె నినుఁ బెండిలియాడినపూఁటనుండి యే
బ్రౌసివి నీవు వేళ్మమునఁ బొదము పెట్టితి వంతకంతకుం
గా సొక శైన బట్టకొనఁ గట్టఁగిలే దిఁక లేచిపోఁగదే—అరణ్య.

శా. ఆకంఠీరవనాదము న్వీని మహాహంకారసంయుక్తుఁడై
నాకేశాత్మజుఁ డాహవంబునకు సన్నాహంబుతో నేగి నే
నాకయ్యంబున నింద్రపుత్రకసహాయార్థంబు శాఖామృగా
నీకంబు ల్గొలుపంగ వెంటజనితిన్ స్నేహంబుపెం పొందఁగన్. కిష్కింధ

ఉ. ఎవ్వఁడవోరి యేమిపని కిచ్చటవచ్చితి నిల్వునిల్వు నీ
క్రొవ్వడఁగించి ప్రొద్దుకొమరుండువసించిన యింకి కంపెదన్
మవ్వపుదెబ్బఁ జూడు మని మారుతివక్షమునందు మోఁదెనీ
వెవ్వతెవంచు గ్రుద్ది పడనీడ్చె సమీరసుతుండు రక్కసిన్—సుందర.

శా. ఏమీ దానవవీరులార యమవహ్నీంద్రాదులన్ గెల్చు సం
గ్రామోత్సాహము లెందుఁబోయెఁ బటుదర్పం బేటికిఁ
మీమీయిమ్ములఁ గేగియుంటి రిదియేమీ వైరిత్రేజంబు మీ
సామర్థంబును విక్రమక్రమరణోత్సాహంబులం దెల్పుఁగన్— యుద్ధ.

---

129. తిరుమలబుక్కపట్టణపు చినతాతాచార్యుఁడు

ఈకవి వడ్లమన్నాటి వెంకప్ప సోమయాజులగారి ప్రేరణముచేత విశ్వగుణాదర్శమును పద్యకావ్యమునుగాఁ దెనిఁగించెను. ఇతఁడు శ్రీనివాసాచార్యునిపౌత్రుఁడు; వేంకటాచార్యునిపుత్రుఁడు. ఇతఁడు నలువది యేఁబదియేండ్లక్రిందట కృష్ణామండలములో నుండినవాఁడు. కృతిప్రేరకుఁడైన వడ్లమన్నాటి వెంకప్పసోమయాజులగారి యజ్ఞమూలమునఁ గృష్ణామండలములోని వైదికనియోగిబృందములో రెండుకట్లు లేర్పడినవి. ఈ కవియొక్క కవిత్వమునందుఁ గొన్ని వ్యాకరణదుష్టములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద కవనరచన సరసముగానున్నదనియే చెప్పవచ్చును. ఆంధ్రవిశ్వగుణాదర్శములోని రెండుపద్యములిం దుదాహరింపఁబడుచున్నవి—

చ. ఘనవన భూముల న్మెలఁగి కన్నముదేసి గృహాళివిత్తముం
గొని చనువారి దొంగ లనఁగూడునె పోషకు లైనవారిలె
క్కను గడుబొంకుపుచ్చి తదఖర్వధనంబులు దొంగిలింతు రీ
గణకులె దొంగ లీగణకకర్మ్మలనే భజియింతు రీజనుల్.

చ. సురభితమాలముం గుసుమశోభితసాలము వీక్షణార్హబం
ధురతిలకాతిసాలము విధూతమహాదురితౌఘమూలమున్
సరసరసాలమున్ బనసజాలము మాధవకేళిలోలమున్
బరమగుణాలవాలమును బాయక చూడుము శేషశైలమున్.

130. మాడభూషి నృసింహాచార్యుఁడు

ఈకవి ఫల్గువీఫల్గువోల్లాస మను మూడాశ్వాసములప్రబంధమును నూజవీడు సంస్థానాధిపతి యగు శ్రీశోభనాద్రి అప్పారావుగారిప్రేరణము వలన రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు; నైధ్రువకాశ్య పగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; వేదాంతాచార్యులపుత్రుఁడు. ఈకవి యిరువది ముప్పదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఈయనకవిత్వము సలక్షణమయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. ఫల్గువీఫల్గువోల్లాస ములోని రెండుపద్యముల నిం దుదాహరించుచున్నాను—

చ. తనయులు పెక్కుగల్గినను దన్వికిఁ బుత్రిక పుట్టకున్న ని
త్తనువు నిరర్థకం బని యెదం దలపోయుదు రితు లంచుఁ దా
మనమునఁ గొంతసేపు నృపమానిని చింత యొనర్చి యేమిసా
ధనమునఁ గన్యకావదనదర్శనజన్యముదంబు గల్గునో. ఆ. ౧.

ఉ. పాండుతనూభవుండు తనబాంధవు లత్తఱి సంతసిల్లఁగా
గాండివ మేఁక్రొందిగిచి కల్పకృశానుసమానుఁడై లస
త్కాండములన్నిగిడ్చి నృపకాండములం దెగటార్చి వేర్చి త
త్కాండమునన్ ముదం బెసఁగఁదద్దయునొత్తెనుదేవదత్తమున్. ఆ 3

---

131. కోటమరాజు నాగయ

ఈకవి యధ్యాత్మరామాయణమును పద్యకావ్యమునుగా రచి యించెను. ఇతఁ డాఁబోతువేలనియోగిబ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; భాస్కరమంత్రికిని శ్యామాంబకును బుత్రుఁడు. ఇతఁడు కృష్ణామండల ములో ముప్పది నలువదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. కాణా దము పెద్దనకవికృతమైన యధ్యాత్మరామాయణమువలె కవిత్వమంత

ప్రౌఢముగా నుండకపోయినను మొత్తముమీఁద హృద్య మయి నిర్దుష్ట మయియున్నది. అధ్యాత్మరామాయణములోని కొన్నిపద్యము లిందుఁ జూపఁబడుచున్నవి—

ఉ. ధరణీదేవ భవత్తపోమహిమ చోద్యం బయ్యె నిన్నిచ్చితిఁ
వర మే నిచ్చెద హైహయుం దునిమి గర్వగ్రస్తులౌ రాజులన్
ధరణిం బే రడఁగించి కశ్యపున కీధాత్రీతలం బిచ్చి శాం
తరుచిందాల్చుమదంశనొందిపితృహృత్తాపంబువారింపఁగన్ - బాలకాం

ఉ. రామ త్రిలోకవిశ్రుతు విరాభు నెఱుంగవె మద్భయంబునన్
వేమఱు మాను లీవనము వీడి పలాయితు లైరి నీవు మా
సేమము గోరెదేని యిట సీతను డించి నిరాయుధుండవై
భూమినదృశ్యవై ఖరినిబొమ్మిరయమ్మునఁదమ్ముతోడుతన్ - అరణ్యకాం

ఉ. ఏనెఱిఁగించి నంతటనె యిమ్మకరాలయ మెంత దాటి లం
కానగరంబుఁ దుత్తుమురుగా నొనరింపఁగఁ జాలుఁ గార్మిక
జ్యానినదప్రముక్తశరజాలములన్ రఘుసత్తముండు నీ
పైని మనంబుపెట్టి యొకపంతును దెమ్మనఁడారగింపఁగన్ - సుందరకాం

మ. మునివర్యుల్ విజయోస్తుతే యనఁగ సమ్మోదంబుతోఁ నేగి య
న్న నియోగించినభంగి నాలవణునిం జక్కాడి నిర్భీతిమై
జను లెల్లన్ వసియించుపట్టణము లిచ్ఛంజేసి తద్రాజ్యపా
లన నైపుణ్యముతోడ నిం పెసఁగెఁ గళ్యాణీ భవానీసతీ. ఉత్తరకాం

---

132 కరాలపాటి రంగయకవి

ఈకవి భూతపురీమాహాత్మ్యము, కవిజనమనోహారము అను రెండు పద్యకావ్యములను రచియించెను. ఇతఁడు వైష్ణవ వైశ్యకుల సంజాతుఁడు. ఇతఁడు ౧౮౧౭ వ సంవత్సరమున జనమొంది ౧౮౬౫వ సంవత్సరమునందుఁ బరమపదము నొందెను. ఇతఁడు చెన్నపురిలోఁ గొంతకాలము పచ్చప్పగారి పాఠశాలయందును గొంతకాలము రాజధానీ శాస్త్రపాఠశాలయందును నాంధ్రపండితుఁడుగానుండెను. మొట్ట మొదట నాంధ్రభారత భాగవత రామాయణములను లేఖకప్రమాద జనితదోష రహితములుగాఁ బరిష్కరించి ముద్రింపించిన దితఁడే. ఇతఁడు తనతండ్రిని రామకవియని పేర్కొనుటయేకాక తనతాతయైన నారాయణ సూరికూడ కావ్యరచన మొనర్చి కర్ణాటరాజులను మెప్పించినట్లు భూత పురీమాహాత్మ్యమునం దీక్రిందిపద్యముతోఁ జెప్పియున్నాఁడు—

ఉ. పాయక యేమహామహనిభవ్యవచోగరిమం బశేషభూ
నాయకగోష్ఠిసత్కవిజనంబులచే ననిశంబు వర్ణితం
బై యరవద్యతం బరఁగు నాగుణశాలి కరాలపాటి నా
రాయణసూరిమౌళి దనరారె సుధీజనపద్మహేళియై.

మ. సకలార్యస్తవనీయభవ్యకవితాసంప్రీతకర్ణాటభూ
పకులాధీశ్వరదత్తమత్తగజశశ్వద్దానధారాసము
త్తునకరోలంబకదంబఝంకరణవచ్ఛుంభద్గృహాగ్రాంగణుం
డకలంకాశయుఁ డమ్మహాకవికులాధ్యక్షుండు సామాన్యుఁడే.

ఈకవి భూతపురీమహాత్మ్యములో మూడాశ్వాసములు రచియించి నప్పటికే యవసానకాలము సంప్రాప్తమయినందున గ్రంథము ముగియ లేదు. ఈతని కవిత్వము నిర్దుష్టమయి మృదుమధురపదభూయిష్ఠమై రస వంతముగానున్నది. అయినను వ్యతిరేకక్వార్థకమాత్రము గ్రంథమునం

దక్కడక్కడ ద్రుతప్రకృతికముగా, బ్రయోగింపఁబడి యున్నది. శైలి తేటపడుటకయి యీతని గ్రంథములనుండి కొన్నిపద్యము లిందుదాహరింపఁబడుచున్నవి.

కవిజనమనోహరము.

ఉ. పోయెఁగదే ననుం గడచి పోటరియై యడె వాఁడు రారె రా
రేయని వారుఁ దానును సమిద్ధరయంబున వెంటనంటి యు
గ్గాయకపుంగవుం గదిసి గట్టిగఁ బట్టుకొనుండు నెమ్మెయిం
ద్రోయఁగ లేక చిక్కువడె దుష్టనిశాటుల నోర్వ శక్యమే.

ఉ. అక్కటికంబులేని దనుజాన్వయజాతుఁడ వయ్య నాకటన్
స్రుక్కుచు ధార్మికత్వము విశుద్ధమనోగతిఁ బాయలేక న
న్నెక్కుడు ప్రీతితోననిచి తీయుపకారము సీసుశీలముం
దక్కొరులందుఁ గల్గునె బుధప్రియవర్తన నీకుఁదక్కఁగన్.

భూతపురీమాహాత్మ్యము.

ఉ. జారులు లేరు పేరుకొనఁ జారులకాని యనారతం బనా
చారులు లేరు తత్త్వసువిచారులకాని సరోషభీషణా
కారులు లేరు నిచ్చలుపకారుల కాని విమర్శచేయఁగాఁ
బారులలోన నమ్మనుజపాలధరా పరిపాలనంబునన్. ఆ-౧.

ఉ. ఈశ గిరీశ నేరమి సహింపుము డింపుము రోష మప్రతీ
కాశము నీమహత్త్వ మెఱుఁగం దగువారము కాము సత్కృపా
పేశలదృష్టిఁ గన్గొను మపేతకళంకులఁ జేయుమయ్య లో
కేశ శరణ్యదీనులము హీనుల మెంతటివార మల్లకున్. ఆ-౨.

ఉ. అమ్మనివర్యభార్య వినయమ్మ భయమ్మఁ బ్రియమ్మ నెప్పుడున్
నెమ్మది సందడింప మగనిం బరిచర్యలఁ దృప్తుఁ జేయుచున్
సమ్మద మారఁగా నతిథిసంఘముఁ దన్పుచు దేవతాపితా
నమ్మల భక్తిఁగొల్చుచు గుణమ్ములు సాధుగణమ్ములెన్నఁగన్. ఆ-3.

133. దావురాజు లక్ష్మీనారాయణ

ఇతఁడు బృందావనవిహార మునెడి మూడాశ్వాసముల పద్యకావ్య మును రచియించెను. ఇతఁ డాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; శివరామామాత్యపుత్రుఁడు. ఇతఁడు తన బృందావనవిహార మును మల్కాపురములోని సీతారామస్వామి కంకితమొనర్చెను. ఇతఁడు తరువాత గోదావరిమండలములోని యేలూరునకు వచ్చి యచ్చట నివాస మేర్పఱుచుకొన్నట్లు తెలియవచ్చుచున్నది. ఈతనిసంతనివారు మూడు తరములనుండి యేలూరునం దున్నారు. ఇతఁ డఱువదిసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈతని కవిత్వమునందు వ్యాకరణదోషము లనేక ములు గానవచ్చుచున్నను, మొత్తముమీఁదఁ గవిత్వము మృదువుగాను మనోహరముగానునున్నది. బృందావనవిహారములోని రెండుమూడు పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ఉ. ధారుణిలోనఁ జూచి విశదంబుగ నెంచిన స్త్రీల కందముల్
చారుగుణప్రధానములు చక్కఁదనంబున కేమి లెక్క యా
నారసగంధికిన్ మిగులఁ జక్కదనంబుకు భూషణంబుగా
మీఱె లసద్గుణావళియు మించుగ సొంపుగ నెన్నిభంగులన్. ఆ-౧.

మ. కులగోత్రంబుల లేక నిర్మలముగా గూఢీకృచాధిక్యని
స్తులమాధుర్యనికూపదీపకలితస్తూలైక తాసర్గణో
జ్జ్వలులై జన్మములంచుఁ బూనుకొని కృష్ణస్వామి రాముండు గో
ల్లలకుం జేతురు చేయరానిపనులన్ లజ్జించెదం జెప్పఁగన్. ఆ-౨.

చ. మొఱ లిడువారి మొఱ్ఱ లవి ముందుగ వించును వెంటనుండు నా
కఱమఱ లేను వారియెడ న్యాయముగా విహరింతు నెంతుఁ ద
త్తఱమున వారియాపదలు దాటఁగఁజేయుదుఁ దత్క్షణంబునన్
మఱివక నన్నుఁ గొల్చుటకు మాటుగనుండెద నింతె చూడఁగన్. ఆ-౩.

---

134. త్యాగరాజమొదలి

ఇతఁడు శుద్ధద్రావిడియైనను దెనుఁగుభాషయం దత్యంతాభిమా
నము గలవాఁడయి యాంధ్రభాషయందుఁ జక్కనిపాండిత్యము సంపా
దించి పెక్కుగ్రంథములను జేసినవాఁడు. ఇతఁడు చేసినగ్రంథములలో
విద్వత్కర్ణామృతమను నామాంతరముగల సుబ్రహ్మణ్యవిజయమనెడి
యైదాశ్వాసముల ప్రబంధము ప్రధానమయినది. ఈకవిచే రచియింపఁ
బడిన పుస్తకములలో ఛందోగత్యానుకరమనుచిన్న ఛందస్సునకూఁడముద్రింప
బడియున్నది. ఇతఁడు ౧౮౩౦ వ సంవత్సరప్రాంతమునందు జనన మొంది
యిరువదియైదు సంవత్సరములక్రిందటఁ గాలధర్మమునొందెను. ఇతఁడు
నారాయణమొదలారి కుమారుఁడు. ఈగ్రంథరచనకాలమునందితఁడు
ఇంజనీరింగు డిపార్టుమెంటులో అసిస్టాంటు ఓవరుసీయరుగానుండెను.
ఇతఁడు తాను మొట్టమొదట నాంధ్రభాషాభ్యాసముం జేయుటనుగూర్చి
యిట్లు వ్రాసికొనియున్నాఁడు—

"బాల్యంబునప్రథమంబాంధ్రభాష నభ్యసించుటమనోదర్పణాపారదం
బుగదా? నాలుగేఁడులు నిండినతోడనే లసదుచ్చారణ సస్యవృద్ధిగోరు
మానవహలికులు జిహ్వావలజంబునకు హలంబుగానొచ్చు నాంధ్రభాష
నాకు ప్రథమమం దభ్యాసమయ్యె. సమధికోచ్చారణలేని ద్రావిడదేశ
స్థులలో నొకండ నయ్యు నాకలవారికిఁ గల లేమి లేమియయ్యె.
సంస్కృత ద్రావిడ హూణప్రముఖభాషలనాయాసలభ్యంబులయ్యె."

ఇతఁడు తన చిన్నపొత్తములకు సహితము పెద్దపేరులుపెట్టి
యాత్మస్తుతిని గొంతయధికముగాఁ జేసికొన్నను, మొత్తముమీఁద నీతని
కవిత్వము సలక్షణమయి హృద్యముగా నున్నది. కవితారచననుజూపు
టకయి సుబ్రహ్మణ్యవిజయములోని కొన్ని పద్యములిం దుదాహరింపఁ
బడుచున్నవి—

మ. భువనంబు లడఁగుమయ్యె భంగతతులం బొందెం బురవ్రాత మెం
దవనత్వంబులు లేక చిక్కెఁ మునిముఖ్యావాసముల్ జంతుసం
ఘవిభ ల్వారిత మయ్యె లోకరమువీఁక న్వంక రయ్యె న్నవై ం
దవభూషా యిఁకనై నఁ గర్భరకులోద్భూతిమూయించవే. ఆ. ౧.

ఉ. నెమ్మది యల్కఁ గాంత భయనీతిని వల్దనిపల్క మేనిపైఁ
గ్రమ్మెడిపుల్క లొల్క భయరాగముచిల్క మరుండు దైవకా
ర్యము దలంచి మోహనశరంబు కరంబునఁ బూని యిట్లుచా
పమ్మున నుంచివైవఁ దెగువం దివియంగ హరుండు వేముక ఆ.౨.

చ. తన కపరాధసంచయశతం బొనరించిన నోర్చుఁగాని తాఁ
దననతపాళి నేర్చినమదస్మయయుక్తుని నాప్తుఁడై నఁ దు
న్మ నతఁడు గాన దేవతలు పొందినవా రతనిం దదీయులన్
సనయతఁగూడి తద్వినతిసల్పి సుఖంపుము దానవేశ్వరా. ఆ. 3.

ఉ. తారల నెన్నవచ్చు సలదై త్యబలేశుల నెన్నరాదు కాం
తారతృణాళి నెన్ననగుఁ దచ్చతురంగబలంబు నెన్నరా
దారపయోధియం దిసుక నారసి యెన్నఁగవచ్చుఁ దద్బలో
దారమహాయుధాంబకకదంబము నెన్నఁగరాదు బ్రహ్మకున్. ఆ. ర.

మ. ఘనమాయావులు నిత్యచంచలులు నిపాములు స్వకార్యానుకూ
లనవోపాయవిధిజ్ఞు లస్థిరమృపాలాపుల్ కృపాశూన్యు లెం
దునుఁ బుంపర్యులు దేవదేవు లెపుడుఁ సుర్వారసంపత్సమూ
ర్తినితాంతాంఘులు పల్క నేల మగవారి న్నమ్మఁగా వచ్చునే.ఆ.౫.

---

135. ఓగిరాల జగన్నాథకవి

ఈకవి సుమనోమనోభిరంజన మనుపేర నై దుల్లాసములప్రబంధ మును రచియించెను. ఈతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; గోదావరీ మండలములోని నీలపల్లిగ్రామ నివాసుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; వేంకటేశ్వరామాత్యపుత్రుఁడు. ఇతఁడు తనచర మవశేయందు కాకినాడపురమునసుండి సుధీరంజనియను మాసపత్రిక కధి పతియయి నుమారు పదునేనుసంవత్సరములక్రిందట లోకాంతర గతుఁ డయ్యెను. ఈయనయు నీయన పెదతండ్రికుమారుఁ డై నరంగనాథకవియు మఱికొందఱును సుప్రసిద్ధులైన శ్రీమంత్రిప్రెగడ వేంకటరామపంతులవారి యొద్ద లక్షణ గ్రంథములను జదివి నుంచికవీశ్వరులైరి. శ్రీమదోగిరాల రంగనాథకవినిగూర్చి యీజగన్నాథకవి తన సుమనోమనోభిరంజనమునం దిట్లు వ్రాసియున్నాఁడు—

గీ. వారిలో రంగనాథుండు పండితోప
లాల్యమానసవీనకల్యాణకల్ప
వల్లికాముఖ్యరసవత్ప్రబంధరాజ
కల్పనాదక్షుఁ డై ఘనఖ్యాతి మెఱసె.

ఈరంగనాథకవి జగన్నాథకవికంటెను సమర్థతరుఁడనియు నధిక లక్షణవేత్తయనియుఁ బేరువడసినను, ఇతఁడు చేసినగ్రంథము లేవియు ముద్రింపఁ బడకుండుట శోచనీయముగా నున్నది. ఏతత్కవికృతమయిన ద్విరేభదర్పణ మిప్పు డముద్రితగ్రంథచింతామణి యందు ప్రకటింపఁ బడుచున్నది.

జగన్నాథకవి తన ప్రబంధమును ౧౮౯౮ వ సంవత్సరమునందు ముద్రింపించినను, ఆవఱకతఁడు ముప్పదియైదుసంవత్సరముల క్రిందటనే దానిని ముగించియుండెను. ౧౮౬౮ వ సంవత్సరమున నేను పాఠశాలలోఁ

జనువుకొనుచుండినకాలమున సుమనోమనోభిరంజనమునలోని మొదటి మూడాశ్వాసములను వ్రాసికొనియున్నాను. అయినను కవి యీసుప్పది సంవత్సరములలోను గ్రంథమునకు మెఱుగునెట్టి సంస్కరించి యెక్కువ వన్నె తెచ్చెను. ఈ గ్రంథమును సర్వకలాశాలాధ్యక్షులు పట్టపరీక్షకుఁ బఠనీయ గ్రంథమునుగా ననేకపర్యాయములు నిర్ణయించి యుండుటచేతనే దాని ప్రాశస్త్యము వెల్లడి యగుచున్నది. కవిత్వము రసవంతమయి నిర్దుష్టమయి యనర్గళధార కలదిగా నున్నది. కవనరీతి తెలియుటకయి సుమనోమనోభిరంజనములోని పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను.

మ. నిరతాన్యోన్యమనస్సముద్భవసహస్నైరమూలాపనో
దరతిన్ గొబ్బునఁ బత్రభానుసుఁ డపత్యాహీరకాంచ్చాయికిన్
సరవిన్ స్వస్థితుల న్వచించుకొన నిచ్చంబోవు మార్తాండజాం
బరశైవాలినులో యనందగుఁ బురద్వార్నీలహీరప్రభల్. ఉ ౧.

చ. చందురునందుఁ గల్గురుచి సంపెగతావియుఁ బారిజాత మా
రందమునందుఁ గూరిచి హిరణ్యపరాగచయంబు చల్లుచున్
బొందుగ మేళవించి మెఱపుందళుకల్ పయిఁబూసి యాశతా
నందుఁడు నేర్పుమీఱ జతనంబుగఁ జేయుఁగఁబోలు నాసతిన్. ఉ-౨.

చ. చిలుకహరుమావజీ రనుకృషీవలుఁ డంగనచి త్తవప్రమున్
జలజకలంబలాంగలములన్ దళనం బొనరించి కృష్ణ ను
జ్జ్వలగుణబీజ మంటి యతిబంధురరాగరసంబునింపఁ గో
మలసుమనోరథాంకుర మమందముగా జనియించి మిండెమున్. ఉ-3.

చ. అరిదరపాణి యూసనముసం దవదాతమృదూర్ధ్వపుండ్రకాం
తరవరపర్ణనీమృదులనవ్యపరాగవిధీయమానసుం
దరతరచిత్రికన్యతి గనంగ మసారమణీధరాధరో
పంశరదభ్రమధ్యతలభాసితటిల్లతరీతి నొప్పెడున్. ఉల్లా-౨.

చ. కలువలరాచరాదొసలు గారొనువెన్నెలచేఁ గరంగఁగాఁ
దొలఁకు జలప్రవాహములు తోరపుఁ గ్రొవ్విరి తేనెసోనలం
గలయుచు సర్వతోముఖముగా నిలఁ బర్వెను గానఁ గానఁ బీ
తలగుణసౌరభంబులకుఁ దావలమై తనరారు మాధవా. ఉ-౫.

---

136. నడకుదుటి రామనకవి

ఇతఁడు ప్రభులింగలీలను, హరివిలాసకృతమును, ఆత్మానాత్మవివేక చూడామణి అను సంస్కృతగ్రంథములను దెనుఁగుసఁ బద్యకావ్యము లనుగా రచియించెను. ఇతఁ డాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; లక్ష్మీనృసింహుఁడను నామాంతరముగల బుచ్చనామాత్యునిపుత్రుఁడు. ఈకవి ౧౮౨౧ వ సంవత్సరమునందు జనన మొంది ౧౮౪౭ వ సంవత్సరమున లోకాంతరగతుఁడయ్యెను. ఇతఁడు మొట్టమొదట గోదావరీమండలమునందలి కాముచంద్రపురము తాలూకా లోని శంఖపుర గ్రామమునకు కరణముగానుండి, పెద్దాపురమునకుఁ జేరువ నున్న తిరుపతిగ్రామముయొక్క కరణికమును వాద్ధానమునందలి భూము లును దన యత్తవారినిగాఁగా శంఖపుర కరణికమును దన జ్ఞాతులకు వదలివేసి ౧౮౭౩ వ సంవత్సరమున సకుటుంబముగాఁ దిరుపతిగ్రామమునఁ బ్రవేశించెను. ఇతఁడు రచియించిన గ్రంథములలోఁ బ్రభులింగలీల పాల్కు రికి సోమనాథుని ద్విపదకావ్యానుసారముగా నైదాశ్వాసముల పద్య కావ్యముగా రచియింపఁబడినది. తక్కినవి రెండును శంకరాచార్యుల వారి సంస్కృతగ్రంథములనుండి యాంధ్రీకరింపఁబడినవి. ఇందు వివేక చూడామణియైదాశ్వాసములగ్రంథము. ప్రభులింగలీల ౧౮౫౫ వ సంవ త్సరప్రాంతమునందును, హరివిలాసకృతము ౧౮౬౫ వ సంవత్సరమునం దును రచియింపఁబడినట్లు కవివంశమువారు చెప్పుచున్నారు. వివేకచూ

డామణి శాలివాహనశకము ౧౭౯౪వ సంవత్సరమునం దనఁగా హూణ శకము ౧౮౭౧ వ సంవత్సరమున రచియింపఁబడినట్లు కవియే గ్రంథమునం దీపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు—

గీ. శాలివాహనశకమధ్యసాగరగ్ర
హర్షి శశిసంఖ్యవత్సరాభ్యర్హితంబు
నగు ప్రజోత్పత్తివత్సరంబందు మాఘ
పూర్ణిమకు గ్రంథకల్పనపూర్తి యయ్యె.

ఈతని కవిత్వమునం దక్కడక్కడఁ గొన్ని వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగము లున్నను మొత్తముమీఁద శైలి రసవంత మయియున్నది. ఇతనికవిత్వరీతి తెలియుట కయి యొక్కొక్కగ్రంథమునుండి రెండేసి పద్యముల నిం దుదాహరించుచున్నాను—

ప్రభులింగలీల.

ఉ. నే నొకమాట పల్కెదను నీ వటుచేసి మదిష్ట మిచ్చి నీ
దానఁగఁ జేసికొ మ్మవితథప్రథవాక్యుఁడవై చెలంగు కా
దేని భవత్ప్రతిజ్ఞ జగదీశ్వర పొల్లగు దానఁ బాతకం
బేనినుఁ జెందుఁగాని వినుమీ ననుఁ బొందఁగ లేవు నావుడున్. ఆ-తి.

శా. ఆవిజ్ఞాపన మాలకించి దయత్రో నాయయ్యవా రింటికిన్
దా విచ్చేయ నమాత్యవర్యులు మహాధర్మానుషక్తుల్ శమ
ప్రావీణ్యుల్ బసవన్న చెన్నబసవప్రఖ్యాతనామల్ దగన్
సేవ ల్చేయుచు వెంబడిం జనిరి తుష్టిం జెందు భావంబులన్. ఆ-3.

హరిమిశ్రస్తవము.

శా. దేహాదివ్యతరిక్తుఁ డాత్మయని వేత్తృత్వంబు గైకొన్న నా
త్మేహార్థాత్మకబ్రహ్మముక్ తెలివియుక్ దీపించుచున్నక్ ధరన్
దేహు లొక్కొందఱు ముక్తిలేక చెడి రింతేకాక యాత్మత్వధీ
దేహాద్యాకృతినుండి వెండియును సందేహంబు లేకుండఁగన్.

శా. ఏవిజ్ఞా శిఖాస్వరూపు రవివహ్నీందూపలబ్ధిస్థలిన్
భావిన్యస్నిభహృద్విభాంతు నుతిసత్పాత్రున్ సమస్తాథ్య సం
సేవ లబ్ధిన్నొనర్చి యాత్మగతు నీజీవత్వసుం దేమహా
భావు ల్నొచ్చెత్తురో వాని సంస్కృతిమోభానుఁ హరిం గొల్చెదన్.

ఆత్మానాత్మవివేకచూడామణి.

చ. నియమయమాదియోగపరినిష్ఠితహృత్పరిభావితంబు ధీం
ద్రియవిగతానుభావితము దివ్యము నింద్యషడూర్మిహీన మ
వ్యయ మనవద్యభూతివిషయాగమ మెయ్యది యట్టిబ్రహ్మమీ
వయితివి డెందమం దరయుమంచు వచించె రఘూద్వహోత్తమా. ఆ-3

మ. పుటపాకంబునఁ గాంచనం బతులమై పూర్వవ్యతిం జెందునె
ట్లటులే ధ్యానముచే గుణత్రయమలత్యాగంబుగాఁగం బరి
స్ఫుటసచ్చిత్సుఖనిత్యదివ్యనిజసంపూర్ణ ప్రభ బొందు ను
త్కటుఁడై కోవిదుఁ డంచుఁజెప్పె మతిసీతాదృక్చకోరాత్రిజా. ఆ-ర.

---

137. మాడభూషి వేంకటాచార్యకవి

ఈవిద్వత్కవి భరతాభ్యుదయ మనెడి నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవబ్రాహ్మణుఁడు; నైధ్రువ కాశ్యపాన్వయుఁడు; నృసింహాచార్య నందనుఁడు. ఇతఁడు సంస్కృతాంధ్రములయం దత్యంతపాండిత్యము గలవాఁడయి, శతలేఖనీపద్యసంధాన సామర్థ్యమును అష్టావధాన నైపుణియు వ్యస్తాక్షరీకౌశలమును గలవాఁడయి యుండెను. ఈకవి గోదావరీమండలములోని పెంటపాడు గ్రామవాసియై కృష్ణామండలములోని నూజవీడు సంస్థానమునందు చిరకాలముండి విద్వానభినవ పండితరాయాది బిరుదాంకముల నందినవాఁడు.

చిన్నతనమునం దీయన ధారణాశ కి యత్యద్భుతమైనదిగా నుండెను. అప్పు డితఁడు ద్విసంధాగ్రాహియగుటయేకాక రెండుమూఁటులు చదివినపద్య మును తలక్రిందుగా నొప్పగించుటకును నెనిమిదిభాషలలో వ్యస్తాక్షరి చెప్పుటకును సమర్థుఁడయి యుండెను. ఈయన రెండుసంవత్సరముల క్రిందట వైకుంఠపదస్థుఁడయ్యెను. ఈయన కవిత్వము విరుపుగలయి మధురమై శ్రావ్యముగానున్నది. కవిత్వరీతి భరతాభ్యుదయములోని యీ క్రిందిపద్యములవలనఁ గొంతవఱకు తేటపడవచ్చును.

చ. పిలిచిన నుత్తరం బిడము పిల్వనిదే యిదేవత్తునంచుఁ దా
బలుకును బల్కరించు చెలిపై నలుగుఁ గ నలుదిక్కు లార్తితోఁ
బలుమఱుఁ జూచు మస్తకము వంచు వెసం దలయూఁచు నాశకుం
తల ధరణీపురందరగతస్వకమానససర్వవృత్తియై. ఆ-౧.

చ. చానలు గాంచి రొక్కెడ ససారమసారమునిప్రణీతసా
పానపరంపరాసితవిభాపటలంబు తదంతరుల్ల స
త్తూనలతాప్రదత్తనవదోహదధూమవిలీలఁ దోఁప సు
శ్రీనఁరారు చారుసరసీరుహధామశిరోలలామమున్. ఆ-౨.

ఉ. కాంచితె సూత యీమృగము గంథముఁ ద్రిప్పి రథంబు సారెకుం
గాంచుచుఁ బోవుమ న్విశిఖఘాతభయంబునఁ బూర్వకాయముఁ
వంచి సగంబుమేసినతృణంబు శ్రమంబునఁ నేలవ్రాలఁగా
నించుక యుర్విఁ జాల దివి నేగెడు నందక గంతువేయుచున్. ఆ-౩.

చ. వనితలు పుట్టినంట బహువర్షము లుండఁగరాదు భర్తతో
నునికియె యుత్తముం బది యటుండఁగనిమ్మి సమస్తరాజకో
భనమకుటార్చితాంఘ్రి యగు పార్థివశేఖరు ధర్మసత్కృప
య్యు నిటులు బీదరాలివలె నుండఁగ నేల సతీశిరోమణీ. ఆ-౪.

---

138. పెనుమెచ్చ బుచ్చిరాజు

ఈకవి పరతత్త్వప్రకాశిక యనెడి యెనిమిదాశ్వాసముల వేదాంత గ్రంథమును రచియించెను. ఇతఁడు శ్రీత్రియుఁడు; ధనంజయగోత్రుఁడు; వేంకటపతిరాజకుమారుఁడు. ఈకవి తాను కర్ణపాలెము గ్రామనివాసుఁడయినట్టును, సూర్యవంశపు రాజయినట్టును వ్రాసికొనియున్నాఁడు. భాగవతములోని కపిలదేవహూతి సంవాద మాధారముగా నీగ్రంథము పెంచి వ్రాయఁబడినది. ఇతఁడు తొంబదిసంవత్సరములు జీవించి కొన్ని యేండ్లక్రిందటనే కాలధర్మమునొందినట్లు తెలియవచ్చుచున్నది. అక్కడక్కడ లక్షణవిరుద్ధములైన ప్రయోగములు పెక్కులున్నను, కవిత్వము చక్కఁగానే యున్నదని చెప్పవచ్చును. పరతత్త్వప్రకాశికలోని రెండు పద్యము లింక్రిందఁ బొందుపఱుపఁ బడుచున్నవి—

ఉ. కోరి భుజింపఁగాఁ దగినకోవిదు నాత్మవివేకశీలసం
చారు వికారదూరు శ్రుతిశాస్త్రపరీవృతనిశ్చయార్థస
త్సారమరందబిందువిలసన్మధుపాననికాసభాసురు
ద్ధారుణి సర్వసంశయవిదారుని ధీరుని సద్గురూత్తమున్. ఆ-3.

చ. మనసు సుషుప్తి నొక్కవడి మానుగ ప్రాగ్గినఁ జేయుకార్యముల్
కనఁబడ వేమియున్ మనసు క్రమ్మఱ మేల్కని యాతఁ డాతఁడుఁ
మన మనుచుండఁగాఁ గల సమస్తము దోఁచు మనోవినాశమె
ల్లనరినఁ జిత్తమింద్రియసదాగతులున్ లయ మౌను దానిత్తోన్. ఆ-2.

---

139. మండపాక పార్వతీశ్వరకవి

ఈ విద్వత్కవి శతకములు మొదలైనవి యెనుబదిగ్రంథములవఱ కును రచియించినను, ఈయనచే రచియింపఁబడి ముద్రింపఁబడియున్న గ్రంథములలో శ్రీరాధాకృష్ణ సంవాదమను నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధానమైనదిగానున్నది. ఈయన వైదికబ్రాహ్మణుఁడు; పారాశర గోత్రుఁడు; కామేశ్వరపండితపుత్రుఁడు. ఈకవియొక్క తండ్రితాతలుకూడ కవీశ్వరు లయినట్లు రాధాకృష్ణసంవాదమునందు కవి యీక్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు.

సీ. శ్రీమాఱు నుభయభాషామిశ్రసత్కృతుల్
తద్జ్ఞు లెన్న మదంకితములు చేసి
యశము గాంచినవేర యమనీషిమణికిఁ బౌ
త్రత్వంబుఁ గార్తికవ్రత మహత్త్వ
శివమహత్త్వాద్యనేక విధప్రబంధంబు
లొనరించి సత్కవివినుతిఁ గనిన
పారాశరసగోత్రపావనుం డగుమండ
పాక కామేశ్వరపండితునకు
మహితపుత్రత్వమును గాంచి బహుళవిచిత్ర
చిత్రశతిముఖ్యసత్కృతుల్ చెప్పి మెప్పు
వడసితివి గద కులకీ రి వరిలంగ
సరసగుణసాంద్ర పార్వతీశ్వరకవీంద్ర.

ఈ కవి విశాఖపట్టణమండలములోని బొబ్బిలిసంస్థానమం దాస్థాన కవీశ్వరులలో నొకఁడుగా నుండినవాఁడు. ఈ పార్వతీశ్వర శాస్త్రిగారు ౧౮౩౩ వ సంవత్సరమునందు జననమొందిరి ౧౯ౠ వ సంవత్సర మధ్యమున పరమపదమునొందిరి. ఈ కవి సంస్కృతాంధ్రములయందు మంచి పాండిత్యము గలవాఁడయి మృదుమధుర నిరర్గళధారతోఁ జతుర్విధ కవి

త్వమును జెప్పుచు వచ్చుటయేకాక వినయ సౌశీల్యాది గుణసంపత్తిగల వాడయి యుండెను. పూర్వోక్తమయిన రాధాకృష్ణసంవాదము రావు వారను నామాంతరముగల వెలుగోటివార నెడి గృహనామమునే వెలయు శ్రీ వేంకటగిరి సంస్థానాధిపతుల వంశానుక్రమమును వర్ణించెను గ్రంథము. శతకములును, దండకములును గాక యీకవి రచియించిన గ్రంథములలో కాంచీపురమహత్త్వము, అమరుకకావ్యము, ప్రబంధసంబంధనిబంధన గ్రంథము, శ్రీకృష్ణాభ్యుదయము, కొంతపెద్దని. ఇప్పుడీయున గ్రంథములలో నొకదానిలో రాధాకృష్ణసంవాదమునుండి మాత్రము కొన్నిపద్యములనిందుదాహరించుచున్నాను.—

శా. సాంగోపాంగముగా నతం డఖిలవిద్యల్ నేర్చినాఁ డోర్చినాఁ
డంకారము నింతపట్టు మృగచర్యం బేర్చినాఁ డేర్చినాఁ
డంగారప్రతిమాస్వరూపమునకున్ నరిసైన్యారణ్య మిట్లయ్యు నే
సాంగత్యంబుననో వృథాకపటభాషందీర్చినాఁ డత్తఱిన్. ఆ-ఁ.

ఉ. వ్రాయుఁడు లెక్క లొక్కటిగ రంగుఱరంగ మెఱుంగుపూఁతలన్
బూయుఁడు భిత్తిభాగముల ముఖ్యనిధానములందు మందతం
బాయుఁడు బాంధవాములగువారికిఁ జేయుఁగలట్టి సత్కృతుల్
చేయుఁడు వేఱె మీ కిపుడు చెప్పఁగనేటికి మీ రెఱుంగరే. ఆ-ఎ.

మ. తనభూలోకధురంధరత్వ మిపు డీతద్రాజగోపాలకృ
ష్ణనరేంద్రుండు వహించె నాకభరమైనం బూనుదుంగాక యం
చు నృపానుజ్ఞను గౌరవచ్చిన ఫణీశుండో తదేకేచ్ఛ వ
చ్చినవ్రాఁకచ్చపమో యనం దనరెఁ దచ్ఛ్వేతాతపత్రంబటన్. ఆ-3

ఉ. తత్పురభర్త పుట్టికతమ్మునఁ బ్రాభవ మిందివోలె నం
దుత్పవ మయ్యె నింక సుర లుండఁగ నేటికిఁ బొం డటంచు నం
చత్పమధన్వనిం గసరుజాడ గనంబడఁ దామ్రచూడముల్
తత్పమయంబునన్ మురసెఁ దామరసప్రతిమానలోచనా. ఆ. ర.

---

140. సత్యవోలు భగవత్కవి

ఈకవి మాఱువే, సయోగిబ్రాహ్మణుఁడు జనార్దనామాత్య పుత్రుడు; భారద్వాజగోత్రుఁడు. ఈతఁడు గోదావరీమండలములో నించు మించుగా నూటయేఁబది సంవత్సరములక్రిందట నుండినవాఁడు. ఇతఁడేనుఁగు లక్ష్మణకవి మొదలగువారిలో సమకాలీనుఁడని చెప్పుదురు. ఈకవి రచియించినగ్రంథములలో రుక్మిణీపరిణయమనెడు నాలుగాశ్వాసములప్రబంధము ప్రధాన మయినది. తాను నూఱుశతకములను జేసినట్లు కవియే తనగ్రంథమునం దిట్లు చెప్పుకొనియున్నాఁడు—

క. ధీరత శతశతకంబులుఁ | దారావళులుఁ దశావతారావళులుఁ
జారూదాహరణంబులు | శ్రీరాజితదండకములుఁ జెప్పినవాఁడన్.

ఇతఁడు చెప్పిన రుక్మిణీపరిణయములోని దశావతారపద్యములు తెలుఁగుదేశములోఁ బలువురచేఁ జదువఁబడుచున్నవి. కవిత్వమునం దల్పదోషములు కొన్ని యున్నను మొత్తముమీఁద నీతనికవనము మృదుమధురపదగుంభిత మయి రసవంత మయి శ్రావ్యముగా నున్నది. రుక్మిణీపరిణయములోని యీక్రిందిపద్యములు కవియొక్క సామర్థ్యమును దేటపఱుచును—

ఉ. ఏసతి నాత్మలోఁ దలఁప నెల్లజగంబుల జంతుకోటి కా
యాసము లేక కల్గు సరసాన్నము లాసతి యవ్విదగ్ధసిం
హాసనవాసియింట శిశు వౌట నొసంగిరి పాయసాన్నము
ల్లాసముమీఱ నాఱువనెలన్ నెలఁతల్ ద్విజబంధుకోటికిన్. ఆ.౧.

ఉ. శ్రీకరమూర్తి వై ననినుఁ జేరి భజింపఁ దలంపుచుండుటన్
నీకృపఁ గోరుచుండు టది నేరము గాదు సమస్తదేవతా
నీకము చూడ మున్ను సిరి నీదగుపేరెదఁ జేరఁగోరదే
నాకడనే జనించెను ఘనాఘనధామసమూహమోహముల్. ఆ. ౨.

చ. అరయుచు రుక్మిముఖ్యనిఖలాధిపు లాధిపురోగరోగని
ర్భరుల తెఱంగునఁ బ్రాగ్భవ ప్రమ్మఱ మున్మర మైనధైర్యవి
స్ఫురణ మెలర్ప దర్పయుతశూరత ఘోరతరాస్త్రశస్త్రభీ
కరకరులై సముజ్జ్వలితనిర్జిత రిక్షభూతజాతులై. ఆ. 3.

సీ. జమదగ్నిగర్భవాసమునఁ బుట్టి వివిధనిద్యాతపోధనుర్విద్యల కధి
పతివై ప్రబలి యిచంబ్రాహ్మ్య మిదంక్షత్ర మని ముసిరాజచిహ్న
ముల శాప
చాపనై పుణిఁ జూసి పాపభూపతుల శతారికిఠోరకుఠారధార
నస్రధారాప్రవాహములుగా శతధా సహస్రధాఖండించియూనదులను
దర్పణము భూమిభూదేవశాగ్పణమును
జేసినపరశురామువేషి వని నిను భ
జింతువై కుంఠనాథలక్ష్మీసనాథ
రక్షణపరాయణుండ నారాయణుండ. ఆ. ర.

141. గురురాజకవి

ఈకవి శేషధర్మములను తొమ్మిదాశ్వాసములగ్రంథమును రచి యించి బళ్ళారిమండలములోని జొహరాపురాధిపతి యైన సంజీవి రెడ్డి గారి కంకితము చేసెను. ఇతఁ డిరువది ముప్పదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు కవిత్వము నిర్దుష్ట మని చెప్పుటకువలను పడకపోయినను మొత్తముమీఁదఁ బుస్తకము రసవంతముగా నున్నదని చెప్పవచ్చును. కవికృతము లయినకావ్యములనుగూర్చి కృతిపతి పలికినట్లుగా గ్రంథము నందీక్రిందిపద్యములు చెప్పఁబడినవి—

శ్రీ. అలఘుతరభద్ర పడకండ్లకులసముద్ర
గకుముదమిత్ర శుభభరద్వాజగోత్ర

విపులదాక్షిణ్య సౌజన్యవినయధన్య
కావ్యనై పుణ్య గురురాజకవివవర్య.

సీ. ప్రతిపద్యయమకచిత్రశ్లేష పద్మావతీపరిణయనామదివ్యనాట
కంబు నెంతయుఁ దాదృశం బగురుక్మిణీహరిణయాభిధగద్యపద్యకృతిని
గుణయుతాలంకారమణిమాలికను రాఘవేంద్రాష్టకంబుఁ బ్రాసైకితగను
జాటుధారాసహస్రంబులఁ గాసించి యనిరుద్ధచరితాహ్వయాంధ్రనాట
కంబు నొనరించి తెనుఁగించి కలితభర్మ
హరిశతకముల మృదులకర్ణాటకృతుల
సలిపి భారుణీపాలాదిసభలలోన
గరము బహుమతు లందితి ఘనుఁడ వీవు.

కవియొక్క కవనరీతి తెలియుటకై శేషధర్మములనుండి రెండు పద్యముల నుదాహరించుచున్నాను—

శా. సత్యంబే పిత మాత భ్రాత మిగుల సత్యంబె సంభోక్తయుఁ
సత్యంబే తగుపాపహంతయు నొగిన్ సత్యంబె శ్రీధారియున్
సత్యంబే జగతిఁ సుహృత్తు సుఖముఁ సత్యంబె బాంధవ్యముఁ
సత్యంబే యని చెప్పుచుందు రెపుడుఁ సంఖ్యావదగ్రేసరుల్. ఆ-3.

ఉ. నాసవవంద్య నీ కిదియె వందన మంబుజలోచనా చతు
ర్వాసములండు నే రతిని మానసచాపలముం ద్యజించి బ
ల్వాసిగ సద్వ్రితంబు నిఁక వారక మాటి యహర్నిశం బొగిన్
జేసెద నీకృపన్ విహగశేఖరకేతన శ్రీనికేతనా. ఆ-ఓ.

---

142. అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి

ఈ కవి యల్లమరాజు రామకృష్ణకవి తమ్ముఁడు. ఈతఁడు చేసిన గ్రంథములలో శ్రీ బచ్చు రామేశనామక వైద్యశిఖామణి కంకితముచేయఁబడిన శ్రీకృష్ణకళ్యాణ మనెడి మూడాశ్వాసముల ప్రబంధ మొకటి యచ్చుపడి యున్నది. ఈ గ్రంథముంగాఁ గృతిసతి కవిచేఁ జేయఁబడిన పుస్తకములను బేరొక్కన్న ట్లీక్రింది పద్యమునఁ జెప్పఁబడినది—

సీ. ప్రత్యక్షరశ్లేషపద్యాళి మార్గుల కృష్ణభూపతిసభఁ గీర్తిఁ గంటి
రహిఁ మణిధ్వజచరిత మొసర్చి యెన్మలరామనదొరచేతభూమిఁ గొంటి
రసవదలంకారవసతియై చతురిమ ప్రబలఁ గూర్చితిని భద్రాపరిణయ
మమరంగఁ జెఱఁగించితాత్మబోధమున సారమగుప్రశ్నోత్తరరత్నమాల
శేషధర్మేతిహాసవిశేష మంధ్రభాషగనొనర్చి యుడుతల పాపయసచి
వప్రతిష్ఠితలింగమపరి రామవిభున కర్పించితిని పుణ్యనిభవ మొసఁగ.

ఈ కవి వాసస్థలము గోదావరీమండలములోఁ బిఠాపురమునకు సమీపమున నున్న చేఁబోలను గ్రామము. ఈతఁడు ద్రావిడ బ్రాహ్మణుడు; హరితసగోత్రుఁడు; రంగనాధార్యపుత్రుఁడు. ఈకవి వృద్ధదశలోఁ గొన్ని సంవత్సరములక్రిందట లోకాంతరగతుఁ డయ్యెను. ఈతనికవిత్వము నిర్దుష్టమయి మనోహరముగా నుండును. కవిత్వప్రౌఢిమ తెలియుటకయి శ్రీకృష్ణకళ్యాణములోని కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను.

చ. చెలిమినిగాదె క్రొత్తలు వచించెదవోయసువంశనాథ నీ
యలఘుభుజాబలక్షితులమా మసుబోటుల మీవు లేనిచోఁ
జెలువుఁడు లేనియింతులటు చింతిలుచుందుము నీవు చెంగటన్
వెలసిన నింద్రుతోడఁ దగువేల్పులరీతి సుఖింతు మెంతయున్. ఆ-ఁ.

మ. చనునే కృష్ణ భయప్రకంపితులమై శస్త్రాదుల న్వీడి యా
తనితో సంధికి నేగుటల్ మనకు శుద్ధక్షత్రవంశంబునన్

జననం బందియు నాత్మబాహుబలమున్ శౌర్యంబు గోల్పుచ్చి భీ
తి నొరుం గూడుట రాజధర్మ మగునే ధీరు ల్వీన న్మెత్తురే. ఆ-౩.

ఉ. ముద్దుల మూటఁగట్టు నగుమోముహొంగు తరంగపాళికిన్
హద్దులుదిద్దు ముత్తఱులయందము కుందమిళిందబృందమున్
బద్దతఁగించిమించు రదనంబుల చక్కఁదనంబు వేనిడా
లద్దిర యుద్ది దీని కిదియా నిధియా గుణరత్నరాజికిన్. ఆ-౩.

---

143. గోపీనాథము వేంకటకవి

ఈ కవి వైదికబ్రాహ్మణుఁడు; నెల్లూరిమండలములోని కావలీ తాలూకాలోని లక్ష్మీపుర గ్రామవాసి. ఇతఁడు శ్రీ వేంకటగిరి సంస్థాన మునం దాస్థానకవీశ్వరుఁడుగా నుండి ప్రసిద్ధి కెక్కినవాఁడు. ఈకాలపుఁ గవులలో నితఁడు బహుమహాగ్రంథములను రచియించినవాఁడు. భాస్కర రామాయణాదులు వాల్మీకివిరచిత మూలగ్రంథానుసారముగా నుండలే దని మూలగ్రంథములో నున్నగానికంటె నెక్కువకాని తక్కువకాని లేకుండునట్లు సరిగా వాల్మీకిరామాయణ మంతయు నితఁడు పద్యకావ్య ముగాఁ జేసెను. మఱియు నితఁడు బ్రహ్మకైవర్త పురాణములోని కృష్ణజన్మఖండము నెనిమిదాశ్వాసముల పద్యకావ్యముగాను, మాఘకవి కృత మయిన శిశుపాలవధ నాలుగాశ్వాసముల పద్యకావ్యముగాను, శ్రీ భగవద్గీతాశాస్త్రమును, దెనుఁగున రచియించి మెప్పించి వేంకటగిరి సంస్థానాధీశ్వరులచే నొక యగ్రహారమును బడసెను. ఇతఁడు మిక్కిలి వృద్ధుఁడయి కొన్నియేండ్లక్రిందటఁ బరమపదము నొందెను. ఈతని కవి త్వము మొత్తముమీఁద సలక్షణ మయి నాతికఠినమయి హృద్యముగా నున్నది. ఈయన గ్రంథములలోని కొన్నిపద్యము లిందుదాహరింపఁ బడుచున్నవి.

V.R. MEMORIAL LIBRARY
V. R. NARLA & CO.
ESTD. No.

గోపీనాథము వేంకటకవి

రా మా య ణ ము.

చ. ఘనగుణశాలి ప్రాణమునకంటెఁ బ్రియుం డగుతాపచంద్రునిక్
జననుతు నొంటిఁ బంపి నిమిషం బయినఁ మనఁజాల వంశ శ
ధ్ధనుఁ డగునట్టి యీతలిరుఁ బ్రాయపుముద్దులకుట్టి రాము నీ
యనుమతి నేన వచ్చెద సురారులఁ జంపి మఖంబు గావఁగా వాల్మీ.

ఉ. చండురువంటి నెమ్మొగము చాఁగెడుకన్నులు వ్యత్తదంష్ట్రముల్
సుందరపల్లవాధరము సోగకురు ల్మణికుండలప్రభా
బంధురకర్ణయుగ్మమును బొడవైనచేతులుఁ గల్గురాము నిం
పొందఁగఁ జూడకున్న నిలుపోపఁ దరంబెసుమంత్రయిత్తెఱ. అయో

చ. యినకిరణాళికిం జొరవ యీక సదాగతిరాక కైనఁ బ
ల్చనపడ కర్థి సైకతము జల్లిన రాలఁగనీక దట్టమై
దనుజవిసృక్కకాండములఁ దట్టుచు దిక్కుల రామకాండముల్
సునిసితభంగి సిండుటయుఁ జూచి సురల్వెఱఁగందిరయ్యెఱన్. అరణ్య.

ఉ. భూవరవర్య యెవ్వని సముద్ధతిఁ జాపులకై కడంగి సు
గ్రీవుఁతోడ నెయ్య మొనరించి తదీప్సితసిద్ధిఁ గోరి న
న్నీవిధిఁ జంపి తట్టిడనుజేంద్రుని రావణుఁ గీటడంచి నీ
దేవిని నెందుడాఁచిననుదెచ్చియొసంగనెయొక్కవేల్మిడిఱ. కిష్కిం

ఉ. ఓరిదురాత్మ యిందు బుసు లుండఁగొ యుండిన నీవు వారలం
జేరవొ సాధువాక్యములు చేఱాన కొల్లవొ శిక్షలేమి నా
చారవిహీనమై సకలసజ్జనగర్హిత మయ్యె నీమతం
బారయ నీకతంబున నిశాటకులంబు చెడు న్నిజంబుగన్. సుం

మ. మరియుఱ రావణి సాయకంబులు ధనుర్మౌర్వీం దగంగూర్చి బ
ల్గురులాడం దెగనిండఁదీసి వెస వక్షం బుచ్చిపో నేసినన్
గురుబాణక్షతజాతర క్తకలితాంగుండై సుమిత్రాసుతుం
డరయం బొల్చె విధూమపవహ్నిగతిఁ బుష్పాభ్యక్రుమప్రక్రియన్.

యుద్ధకాం.

కృష్ణ జన్మ ఖండము.

చ. సలలితశుద్ధతోయములు చారుమణీదళపద్మకైరవో
త్పలములు గంధలుబ్ధకసుతానమధువ్రతగీతనాదముల్
కలరవచక్రకుక్కుటమరాళమనోహారసుంజుశబ్దముల్
గలిగి మనోజ్ఞసంపదలఁ గ్రాలు విశాలసరోవరం బొగిన్. ఆ. 3.

మ. పరికింపం గడు దుర్లభం బవనిలోఁ బ్రాణేశ కాంతామణీ
పురుషప్రేమగుణాతిరిక్త మనిశంబుం బూతచారిత్రయున్
స్మరనారజ్ఞయు సాధ్వియున్ రసికయున్ జాతుర్యసంయుక్తయా
తరుణీరత్న మెఱుంగు సత్పురుషుఁడున్ దథ్యంబుచింతింపఁగన్. ఆ-ర

శిశుపాలవధము.

శా. సామగ్నంబున మూఁకలేనిబల మన్యం బన్విధి స్నిగ్ధివి
ద్యామర్యాద నెఱింగి పోవుబల మన్యం బిట్టు లీరెంటికిన్
నేమం బేర్పడ భూరితేజమునఁ జొక్కట్లకుంబోలె బ
ల్సామానాధికరణ్య మెట్లు గలుగున్ జర్చింప లోకంబునన్. ఆ. ౧.

చ. అలఘుధనుష్పభావ మొ గుణాభిమహత్వ మొ ముష్టిశక్తి యో
యిలయు దిగంతముల్ గగన మీనుచు నున్నవొ యేమిచిత్రమో
తెలియఁగరాదు శౌరిసముదీర్ణశరంబులు చిత్తజల్లుల
ట్లలవడ నొక్కరీతిఁ గురియం దొడఁగెన్ ధ్వనిపూర్వకంబుగన్. ఆ. ౪.

భగవద్గీత

ఉ. మొదుగ వృష్టిధారలమున మిన్నక నాఁటనదీప్రవాహముల్
నిండి చలింపకున్న యలనీరధిఁ జేరినమాడ్కి నెవ్వఁడం
దండిగ సర్వకామములు తప్పకచేరు నతండు శాంతుఁడై
యుండు సకాముఁడై సనరుఁ డొందఁడు శాంతిని బొందునందనా.

చ. అలయక యోగలీతినిఁ బ్రయత్నము సేయుచు నాత్మయందు ని
శ్చలముగ నున్నవానిఁగ నిజంబు నెఱుంగుదు రజ్ఞు లైనని
శ్చలమతిహీను లొక్కమోగిఁ జాలఁ బ్రయత్నము చేసియున్ సము
జ్జ్వలుఁ డగునీశ్వరుం దెలియఁ జాలరు భారత నిక్క మింతయున్.

BCA

AQUACOSB163

BC

BOXPRESS

పేరు వ్రాసినది	Kethura
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు లెక్కపెట్టినది	
ఫైండింగు చేసినది	
స్కానింగు చేసినది	
పరిస్థితి	good

643
NO
CI BCI
NO
YES
YES